ప్రథమ ముద్రణ

శ్రీమద్రామాయణము

(తెనుగు అనువాదము)

డిసెంబరు 2015

నేదునూరు

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

NSS

గ్రంధ అనువాదకర్త



బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి గారు

బ్రహ్మశ్రీ నేమాని గోపాలకృష్ణ మూర్తిశాస్త్రి ,

శ్రీమతి సుభద్రమ్మ గార్లకు 1945 లో జన్మించారు.

ఈయన భార్య శ్రీమతి నేమాని మాణిక్యాంబ గారు.

ఈయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్ నందు తూర్పుగోదావరి జిల్లాలో అమలాపురం తాలూకా అయినవిల్లి మండలంలో నేదునూరు అనే గ్రామం. ఈయన తెలుగు పండిట్ గా పనిచేసి రెటైరయ్యారు. చాలామంది విద్యార్థుల హృదయాలలో "తెలుగుమాష్టారంటే ఇలాగ ఉండాలి" అనిచెరగని ముద్ర వేసుకున్నారు. ఈయనకు నాటకరంగంలో అశోకచక్రవర్తి, ప్రవరాఖ్యుడు వంటి ఏకపాత్రాభినయములకు అనేక రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రధమ బహుమతి వచ్చింది. ఒక కళాకారునిగా ఆయన "రవికాంత్" అను నామాంతరంతో ప్రసిద్ధిచెందారు. 1977 లో మద్రాసులో "తెలుగునాటకకళా పరిషత్" ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి పోటీలలో ప్రవరాఖ్యుని ఏకపాత్రాభినయానికి ప్రధమ బహుమతిని ప్రముఖ సినీనిర్మాత డి.వి.యస్.రాజు గారి చేతులమీదుగా అందుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సినీనిర్మాత భీమవరపు బుచ్చిరెడ్డి గారు స్వయంగా ఆయన స్వగ్రామమైన నేదునూరు వచ్చి "సప్తపది" సినిమాలో నటించటానికి ఒప్పించి తీసికొనివెళ్ళారు. ఈరకంగా ఆయన సినీరంగప్రవేశం చేసారు.మొదట 1980లో కె. విశ్వనాథ్ గారి దర్శకత్వంలో "సప్తపది" సినిమాలో గౌరీనాధునిగా ప్రముఖ పాత్రను పోషించి అశేష ఆంధ్రుల అభిమానాన్ని చూరగొన్నారు. ఈ సినిమాలో ఆయన నటించిన "అయిగిరి నందిని" పాట ఇప్పటికీ దేవీనవరాత్రులలో దేవాలయాలలో వినిపిస్తూ ఉంటుంది. రెండవ చిత్రం కె. విశ్వనాథ్ గారి దర్శకత్వంలో 1982లో వచ్చిన "జననీజన్మభూమి". దీనిలో బాలకృష్ణ గారితో పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గా నటించారు. మూడవచిత్రం టి.కృష్ణ గారి దర్శకత్వంలో 1985 లో వచ్చిన "దేవాలయం". ఈ సినిమాలో శోభన్ బాబు గారి సోదరుని పాత్రలో అందరినీ మెప్పించారు. ఈ సినిమాలో మొదటి సగభాగం ప్రముఖ పాత్రను పోషించారు. సినీరంగంలో ఆయన మంచి పేరుప్రఖ్యాతులను సంపాదించారు. ప్రస్తుతం ఆయన స్వగ్రామమైన నేదునూరులో విశ్రాంత జీవితాన్ని గడుపుతూ కాలక్షేపం చేస్తున్నారు.

విషయ సూచిక

కాండ		పుట సంఖ్య
1. బాలకాండ	→	10
(శ్రీ సీతారామ కల్యాణము)	→	40
2. అయోధ్యకాండ	→	48
3. అరణ్యకాండ	→	138
4. కిష్కింధకాండ	→	197
5. సుందరకాండ	→	241
6. యుద్ధకాండ	→	296

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

శ్రీమద్రామాయణము

(తెనుగు అనువాదము)

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

శ్రీమద్రామాయణము

ముందు మాట

శ్రీరామాయణ చరిత్రను ఎందరు ఎన్ని రకముల వర్ణించినను, శ్రీసీతారాముల కథ ఎన్నిమార్లు విన్నను, చదివినను, శ్రీరామ నామామృతము వీనులవిందుగనుండుటయేగాక, చదివినవారికి, వినినవారికి, వ్రాసినవారికి సకల శుభములును చేకూరును. సకల పాపములునశించి సర్వులకు సుఖశాంతులు లభించునని పెద్దలు చెప్పుదురు.

సర్వేజనాః సుఖినోభవంతు సమస్త సన్మంగళానిసంతు........

శ్రీవాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణమును అనుసరించి శ్రీచక్రవర్తి రాజగోపాలాచారి(మద్రాసు ముఖ్యమంత్రి, ప్రధమ భారతీయ గవర్నర్ జనరల్ మున్నగు విధముల ప్రసిద్ధినందిన) శ్రీరాజాజీ ఆంగ్లభాషయందు రచించిన " శ్రీరామాయణ " గ్రంథమును చదివిన అనంతరము నాలోరేకెత్తిన అభిలాష, ఈగ్రంథమును ఆధారముగ చేసికొని నాకుగల స్వల్పవిజ్ఞానముతో తెనుగుభాషయందు ఈ గ్రంథమును అనువాదము చేయవలెనని సంకల్పము కలిగి, సకలపరివార సమేతుడగు, సకలదేవతాస్వరూపుడునగు ఆశ్రీరామచంద్రపరబ్రహ్మ యొక్క అనుగ్రహముచే నాకుతోచిన తెనుగు మాటలతో ఈ అనువాద గ్రంథమును వ్రాయగల్గినందులకు ఆనందించుచు, ఈగ్రంథమును ఆశ్రీరామ చంద్రునకే అంకితమొనర్చుచున్నాను.

అంతియే కాక దీనిని నామాతాపితలు "బ్రహ్మశ్రీ నేమాని గోపాలకృష్ణమూర్తిశాస్త్రి గారికి, శ్రీమతి సుభద్రమ్మగార్లకు" మరియు మా పితృదేవతలు, మా మాతామహ, పితామహాదులు సర్వులకు అంకితమొనర్చుచున్నాను.



ఇట్లు

గ్రంథ అనువాదకర్త

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

(రిటైర్డ్ తెలుగుపండిట్)

నేదునూరు, తూ॥గో॥జిల్లా

Land line : 08856-227272

కంప్యూటర్ టైపింగ్

నేమాని.వి.వి.ఎస్.ఎన్.మూర్తి(లెక్చరర్)

(గ్రంథ అనువాదకర్త యొక్క రెండవ కుమారుడు)

Cell No. 9440249930

శ్రీమద్రామాయణము

ఓం శ్రీమహాగణాధిపతయెనమః

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

ఓం శ్రీమహాగణాధిపతయె నమోనమః

ఓం శ్రీలక్ష్మీగణాధిపతయె నమోనమః

ఓంయశ్శివోనామరూపాభ్యాం యాదేవీసర్వమంగళా
తయోస్సంస్మరణాత్పుంసాం సర్వతోజయమంగళం
లాభస్తేషాం జయస్తేషాం కుతస్తేషాం పరాభవః
యేషాం ఇందీవరశ్యామో హృదయస్థో జనార్దనః
ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదాం
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం
సర్వమంగళ మాంగళ్యే శివేసర్వార్ధసాధికే
శరణ్యే త్ర్యంబికే దేవీ నారాయణినమోస్తుతే.
శ్రీలక్ష్మీనారాయణాభ్యాం నమః శ్రీవాణీహిరణ్యగర్భాభ్యాం నమః
శ్రీఉమామహేశ్వరాభ్యాం నమః శ్రీశచీపురందరాభ్యాం నమః
శ్రీఅరుంధతీవశిష్ఠాభ్యాం నమః శ్రీసీతారామాభ్యాం నమః
సర్వేభ్యో మహాజనేభ్యో నమః

<u>గణపతి ప్రార్ధన</u> (శ్రీ సుసర్ల సూర్యనారాయణ శాస్త్రి)

శ్లో|| సుజాతదంతకుంతకాంతి శోభితావనీతలం
విజృంభమాణదానగండపేల్లితాళిమండలం

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

శ్రీమద్రామాయణము

ప్రజార్పితోరుమోదకం ప్రజార్పితోరుమోదకం

రజస్తమోనివారణం పురాణవారణం భజే.

శ్రీగాయత్రీదేవ్యైనమః శ్రీమహాకాళీమహాసరస్వత్యైనమః

<u>సరస్వతీ ప్రార్థన</u> (శ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి)

శ్లో॥ యామభ్యర్చ్య పరాశరాత్మజముఖాః సంప్రాప్యవిద్వద్ధనం

ప్రామాణ్యప్రధితానిగ్రంధనిచయాన్యారభ్య సంసేవిరే

తామార్యాంసురపూజితాంహృదిసదాధ్యాయేహమంబాంవరాం

వీణాపుస్తకధారిణీం విధిసతీం విద్యాప్రదాత్రీంభజే.

<u>శ్రీరామచంద్ర ప్రార్థన</u>

శ్లో॥ శ్రీరాఘవం దశరధాత్మజమప్రమేయం

సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం

ఆజానుబాహుమరవింద దళాయతాక్షం

రామం నిశాచర వినాశకరం నమామి.

శ్రీసకలపరివారసమేత సమస్తదేవతాస్వరూప

శ్రీరామచంద్రపరబ్రహ్మణేనమః

శ్రీ పార్వతీపరమేశ్వర ఉవాచ...

శ్రీరామరామరామేతి రమేరామేమనోరమే

సహస్రనామ తత్తుల్యం రామనామవరాననే.

ఓం మృత్యుంజయాయ రుద్రాయ నీలకంఠాయ శంభవే

అమృతేశాయ శర్వాయ శ్రీమహాదేవాయతే నమః

ఓం రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే

శ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

శ్రీమద్రామాయణము

రఘునాధాయ నాధాయ సీతాయాః పతయేనమః

కూజంతం రామరామేతి మధురంమధురాక్షరం

ఆరుహ్య కవితాశాఖాం వందేవాల్మీకికోకిలం.

శ్రీ ఆంజనేయ ప్రార్ధన

మనోజవం మారుత తుల్యవేగం

జితేంద్రియం బుద్ధిమతాంవరిష్ఠం

వాతాత్మజం వానరయూధముఖ్యం

శ్రీరామదూతం శిరసానమామి.

గణపతి ప్రార్ధన (శ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి)

శ్రీకర నీపదాంబుజములన్ మదినమ్మితి మమ్ముకావగా

నీకరుణార్ద్రమానసమునందుసమంచితభావమూని

మాభీకరమైన పాపములపారగద్రోలుచుబ్రోవుమందునో

శాంకరిమానసాబ్జమునబుట్టిన దైవమ, హేగణాధిపా!

ఈశ్వర ప్రార్ధన

ఈశ్వరుండొక్కడె గతియెల్లజనులకు

నిత్యమాతనినమ్మి కొలువవలయు

నదియె యెల్లరకును కార్యమెవ్విధమున

నిహపరంబులసౌఖ్యమందతెరువు.

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

శ్రీమద్రామాయణము

బాలకాండ

పావన గంగోత్తర తీరమునందు సరయూనదీజలములచే సారవంతమైన కోసల రాజ్యము కలదు. ఆ రాజ్యమునకు రాజధాని అయోధ్యా నగరము. ముఖ్యపట్టణమగు అయోధ్యయందు నివసించుచు దశరథ మహారాజు ప్రజారంజకముగ పరిపాలన చేయు చుండెను. అతడు దేవదానవ సంగ్రామములయందు దేవతలకు సహాయముగ వారి తరపున దానవులతో యుద్ధముచేసెను. అతని కీర్తి ముల్లోకములందును వ్యాపించెను. అతడు దేవేంద్ర కుబేరులతో సమానుడు. అతనిరాజ్యమైన కోసలదేశమునందలి ప్రజలు ఆనందముగ నివసించుచుండిరి. శక్తివంతమైన సైన్యపరిరక్షణ కల ఆరాజ్యమును శత్రువులెవ్వరును సమీపించలేరు. పటిష్ఠమైన కోటలతో బలముగనున్న అయోధ్య శత్రు దుర్భేద్యమై సార్థకనామధేయము కలిగియున్నది.

దశరథమహారాజునకు సలహాల నిచ్చుటకును, అతని ఆజ్ఞలను శిరసావహించుటకును సమర్థులైన ఎనమండుగురు మంత్రిపుంగవులు కలరు. అతనికి ధర్మోపదేశములు చేసి రాజోచిత క్రతువులు చేయించుటకు వశిష్ఠవామదేవాది మహాఋషిపుంగవులును బ్రాహ్మణోత్తములును కలరు. ఆరాజ్యమునందు ప్రజలనుండి స్వల్పములగు పన్నులను స్వీకరించుచు, నేరస్థులకు వారివారి నేరములకు తగిన స్వల్పమైన శిక్షలు విధింప బడెడివి. ఉదయించుచున్న సూర్యుడివలె దశరథమహారాజుయొక్క తేజస్సు ప్రకాశించుచుండెను. అనేక సంవత్సరములు దశరథుని

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

రాజ్యపాలన ప్రశాంతముగ సాగినది. ఇన్ని విధముల సంపత్సమృద్ధమైన దశరధునకు పుత్రసంతానము లేనిలోటు అతనికిగల ఏకైక విచారము.

ఒక శుభదినమున దశరధమహారాజు సంతానముకొరకు అశ్వమేధయాగము చేయవలెనని సంకల్పించెను. అతడు తనపెద్దలను సంప్రదించి వారిసలహామేరకు పుత్రకామే ష్ఠి యాగము చేయు నిమిత్తము ఋష్యశృంగ మహర్షిని రప్పించెను. ఆయాగము బ్రహ్మాండమైన ఏర్పాట్లతోకూడినది. ఆనాటిరాజ్యాధిపతులందరును ఆయాగమునకు సగౌరవముగ ఆహ్వానింపబడిరి. యజ్ఞములను నిర్వర్తించుట సులభమైన కార్యముకాదు. విధివిహితమైన నియమానుసారము యాగశాలా నిర్మాణము, అగ్నిగుండముల ఏర్పాటులును చేయదగియున్నవి. యాగమునిమిత్తము సమస్తసంభారములును చేకూర్చుటకు ఆయా విభాగములందు నిపుణులు కలరు. వేలకొలది ఆహూతులకు తత్తదుచిత సౌకర్యములతో రాజులకు, ఋషీశ్వరులకును నివాసయోగ్యములగు ఆవాసములు కల్పింపవలసియున్నది. ఆదినములలో యాగములనగా నేటిప్రపంచవ్యాప్త సమావేశములను, ప్రదర్శనలను పోలియుండెడివి. సకలసంభారములను సమకూర్చుట పూర్తిఅయిన పిమ్మట శాస్త్రాను సారముగ సమగ్రముగ కార్యక్రమములు సాగినవి.

అయోధ్యానగరమునందు యాగము నిర్వహింపబడుచున్న సమయమునందే స్వర్గలోకమునందు దేవతలందరును ఒక సమావేశము నేర్పరచుకొనిరి. బ్రహ్మవర ప్రసాదుడగు రావణబ్రహ్మయను రాక్షసరాజు

తమకు అనిర్వచనీయమైన విచారమును కల్గించుచున్నాడనియు దేవతానీకము బ్రహ్మలోకమునకేగి బ్రహ్మకు మొరపెట్టుకొనిరి.

"రావణుని జయించుటయు, సంహరించుటయు మాశక్తికి మించినకార్యము. నీవిచ్చిన వరప్రభావముతో రావణుడు అహంకార పూరితుడై క్రూరముగ విజృంభించి దేవతలను, ఋషీశ్వరులను, యజ్ఞయాగాదిక్రతువులాచరించువారిని, స్త్రీలను, సర్వులను హింసించుచు అగౌరవపరచుచుండెను. ఇంద్రుని పదభ్రష్టుని చేయుట అతనిఆకాంక్ష. దుష్టుడగు రావణుని సంహారమునకు మార్గమునుపదేశించి రక్షింప గలవాడవు నీవు మాత్రమే." అని దేవతలు బ్రహ్మదేవుని శరణువేడిరి.

రావణుని తపోదీక్షకుమెచ్చి వరముగ దేవాసుర గంధర్వాదులకు అజేయునిగ, అభేద్యునిగ వరములొసంగిన విషయము బ్రహ్మకుతెలుసు. రావణుడు తన దురహంకారముతో మానవమాత్రులను నిర్లక్ష్యముచేసి, " నరులతోయుద్ధమునందు రక్షణకల్పింపుమని " బ్రహ్మను కోరలేదు. బ్రహ్మదేవునినుండి ఈ మినహాయింపు విషయము తెలిసికొనిన వెంటనే దేవతలందరును విష్ణువును సందర్శింప క్షీరసాగర నిలయమునకేగిరి. దేవతలందరును లక్ష్మీసమేతుడై క్షీరసాగరమున శేషతల్పమున ఉపవిష్టుడైయున్న శ్రీమహావిష్ణువును దర్శించి ఆతని స్తుతించి ఆమహానుభావుని శరణుజొచ్చిరి. రావణుని అంతము చేయుటకును, తమబాధలు నివారించుటకును మానవ రూపమున జన్మింపుమని శ్రీహరిని వేడుకొనిరి. శ్రీహరి వారి మొరనాలకించి,

పుత్రకామేష్ఠి చేయుచున్న దశరధునకు నలుగురు కుమారులరూపమున అవతరింతునని వాగ్దానముచేసెను.

అయోధ్యానగరమున పుత్రకామేష్ఠి యాగము నందు యజ్ఞ గుండమునందు నేయి హోమముచేయబడగానే ఆహోమాగ్ని జ్వాలలనుండి మధ్యాహ్న సూర్యునిపోలిన తేజోరూపము, ఒక బంగారు కలశము చేతధరించి ప్రత్యక్ష మయ్యెను. ఆయాకారము దశరధుని అతనిపేరుతో పిలుచుచు " ఓ దశరధ మహారాజా! నీఆరాధనతో దేవతలు సంతసించిరి. ఈపాయసము దేవతలచే పంపబడినది. నీభార్యలు ఈపాయసమును భుజించినచో నీవు పుత్రులతోఅనుగ్రహింపబడుదువు" అని పాయస భాండమును దశరధునకు సమర్పించి అదృశ్యుడయ్యెను. దశరధుడా పాయససహిత సువర్ణపాత్రను అమితానందముతో స్వీకరించి అందలి పాయసమును తనభార్యలగు కౌసల్యాసుమిత్రాకైకేయిలకు పంచి యిచ్చెను. దశరధుడు కౌసల్యకిచ్చినపాయసమునందు సగభాగము తానుత్రాగి మిగిలినభాగమును సుమిత్రకిమ్మనెను. అట్లే మరియొక అర్ధ భాగమును కైకకు సమర్పించి, కైకను కూడ అట్లే సగభాగమును తానుభుజించి మిగిలిన అర్ధభాగమును సుమిత్రకిమ్మని కోరెను. ఈ విధముగ కౌసల్యకొకభాగమును, సుమిత్రకు రెండుభాగములును, కైకకుమరియొకభాగమును పాయసము లభించినది. దశరధుడాదేశిం చిన మేరకు ఆయనభార్యలు ఆ పాయసాన్న భాగములను భుజించి, సంతసించి, కాలక్రమమున గర్భవతులయిరి.

శ్రీమద్రామాయణము

నవమాసములు నిండిన అనంతరము దశరధునకు "కౌసల్యయందు శ్రీరామచంద్రుడును, కైకేయియందు భరతుడును, సుమిత్రయందు లక్ష్మణ,శత్రుఘ్నులును " అనుకుమారులు జన్మించిరి. దశరధుని కుమారులు నలుగురును రాజ కుమారులకు వలసిన సకలవిద్యలయందును శిక్షణపొందిరి. రామలక్ష్మణులును, భరత శత్రుఘ్నులును పరస్పరము ప్రత్యేక బద్ధానురాగులైయుండిరి. ఈ సాన్నిహిత్యము దశరధునిచే పంచబడిన పాయసభాగప్రభావముగ గుర్తింపనగును. దశరధుడు ధైర్యసాహసములతో బలసంపన్నులై అభివృద్ధిచెందిన తన నలుగురు పుత్రులను చూచి ఆనందించెను.

దశరధుడు ఒకరోజు తనకుమారుల వివాహ విషయముల గురించి ఆలోచించుచుండగ ద్వారపాలకులు వచ్చి రాజదర్శనార్ధము విశ్వామిత్రమహర్షి వచ్చియుండెనని ప్రకటించిరి. అయోధ్యకు విశ్వామిత్ర మహర్షిరాక ఊహింపనిది. దశరధుడు తన సింహాసనమునుండి క్రిందకు దిగి గౌరవ పురస్సరముగ మునీశ్వరునాహ్వానించుటకు ముందునకు ఏగెను. విశ్వామిత్రుడు తన అద్భుత తపశ్శక్తులతో ఋషిత్వమును పొందిన రాజవంశోద్భవుడు. చాలాకాలము క్రిందట అతడు తనఆధ్యాత్మిక శక్తులతో మరియొక బ్రహ్మను, మరియొక విశ్వమును సృజించుటకు సంసిద్ధుడై భయపడినదేవతలచే వారింపబడెను. విశ్వామిత్రుడు రాజుగా నున్నపుడు ఒకమారు ససైన్యముగ వశిష్ఠమహర్షి ఆశ్రమమును దర్శింపనేగెను. వశిష్ఠమహర్షి సపరివారుడైన విశ్వామిత్రునకు సర్వసదుపాయములతో సంతృప్తికరమైన ఆతిధ్యమునిచ్చెను.

ఆశ్చర్యచకితుడైన విశ్వామిత్రుడు కోరగా, తనహోమధేనువగు " శబల " కారణముగా తానిట్టిఆతిధ్యమునీయగల్గితినని విశ్వామిత్రునకు తెలిపెను. విశ్వామిత్రుడు వశిష్ఠమహర్షికి కృతజ్ఞతలు తెలుపుకొని అట్టిలోకాతీతమైన శక్తిసంపదలు ప్రభువునకే చెందవలెననియు ఆధేనువు వశిష్ఠునికడ నుండుట కంటె ప్రభువగు తనకు ఎక్కువ ఉపయుక్తమగుననియు తెలిపి ఆధేనువును తనకిమ్మని కోరెను.

వశిష్ఠుడు తన దైవసంబంధమైన ధేనువును విడిచియుండుట కంగీకరింపక దానిని కోరదగదని విశ్వామిత్రునకు చెప్పెను. వశిష్ఠుడు తనధేనువును సమర్పించుటకు ఎంతగా ఇష్టపడలేదో అంతగా దానిని పొందుటకు విశ్వామిత్రుడు ఉత్సాహపడెను. ఆ ధేనువును పొందుటకు తానుచేసిన ప్రయత్నములు వ్యర్థముకాగా విశ్వామిత్రుడు ఆగ్రహముతో ఆధేనువును బలాత్కారముగా నిర్బంధించుటకు తన పరివారమును ఆజ్ఞాపించెను. శబల వశిష్ఠుని, అతని ఆశ్రమమును విడిచివెళ్ళుటకు ఇష్టపడుటలేదు. వశిష్ఠుని మౌనమునకు కారణము తెలియని ధేనువు కంటతడి పెట్టుకొనుచు వశిష్ఠుని అనుమతితో విశ్వామిత్రుని పరివారము నెదిరించుటకు యోధులను సృజించెను. శబల సృజించిన యోధులచే విశ్వామిత్రుని పరివారము జయింపబడెను. విశ్వామిత్రుడు ఆగ్రహముతో రధారూఢుడై ధనుర్బాణములగొని శరవర్షము కురిపించియు ధేనువుచే సృజింపబడిన యోధుల ముందు పరాజితుడయ్యెను.

పరాజితుడైన విశ్వామిత్రుడు తన తనయులలో ఒకనికి రాజ్యభారము నప్పగించి హిమాలయములకేగి వశిష్ఠుని అణచు శక్తికొరకు

శివునిగురించి తపముచేసెను. విశ్వామిత్రుని తపస్సునకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై తపస్సు చేసిన కారణమేమని అడిగెను. " ఓ ఉమాపతీ నీవు నాతపస్సుతో తృప్తిచెందినయెడల నాకు దివ్యశక్తులుగల ఆయుధముల ప్రసాదింపుమని " శివుని విశ్వామిత్రుడు కోరెను. శివుడు విశ్వామిత్రునకు దేవగంధర్వాదులకు లభ్యమగు సమస్త ఆయుధములను సమర్పించెను. గర్వముతో వశిష్ఠుని నాశనము చేయదలచి విశ్వామిత్రుడు వశిష్ఠుని ఆశ్రమమును చేరెను. విశ్వామిత్రుడు ప్రయోగించిన దివ్య ఆయుధము లన్నియు వశిష్ఠుని మంత్ర దండముచే నిరుపయోగమయ్యెను. చివరిసారిగా విశ్వామిత్రుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రము కూడ వశిష్ఠుని దండముముందు నిష్ప్రయోజనమయ్యెను. విశ్వామిత్రుడు తన పరాజయమునకు ఖిన్నుడై వశిష్ఠునివలె బ్రహ్మర్షిగ మారుటకు మరల తపోదీక్షలో నిమగ్నమయ్యెను. అనేక సంవత్సరములు తపస్సు చేసి తత్ఫలితముగ బ్రహ్మ అనుగ్రహముతో విశ్వామిత్రుడు రాజర్షిగ అంగీకరింపబడెను. కాని విశ్వామిత్రుడు అంతటితో తృప్తి చెందక వశిష్ఠునితో సమానమగు బ్రహ్మర్షిత్వమును కోరెను.

అదేసమయమున సూర్య వంశోద్భవుడైన త్రిశంకుడను రాజు తన భౌతిక శరీరమునందలి వ్యామోహముతో సశరీరుడై స్వర్గమునకు వెళ్ళుటకు కోరెను. కులగురువగు వశిష్ఠుడాతని కోరికను తీర్చుటకు అంగీకరింపక అసాధ్యమగు కోరికను విడువుమని సలహాఇచ్చెను. అసంతృప్తుడగు త్రిశంకుడు వశిష్ఠుని కుమారులనాశ్రయించెను. వారును అందుకంగీకరింపలేదు. వశిష్ఠుని కుమారులు తమ తండ్రి అసాధ్యమని

తెలిపిన కోరికను తీర్చుమని తమను కోరుటకు ఆగ్రహించి అతనిని ఎగతాళి చేసిరి. త్రిశంకుడు తన కోరికను విడువలేక మీరు, మీతండ్రి నావాంఛను నెరవేర్చ అసమర్ధులగుటచే మరియొక సమర్ధుని వాంఛింతుననెను. వశిష్ఠుని కుమారులు తాలిమినశించి త్రిశంకుని చండాలునిగ కమ్మని శపించిరి. వశిష్ఠుని పుత్రులచే శపింపబడిన త్రిశంకుడు చండాలరూపమునంది రాజ్యభ్రష్టుడై విశ్వామిత్రుని ఆశ్రమమును చేరెను. త్రిశంకుమహారాజు రూపమును చూచి విశ్వామిత్రుడు చలించి వశిష్ఠుని పుత్రులచే శపింపబడిన అతనిపై జాలిచెంది తీయని పలుకులతో రాజును సంతసపరచెను.

" ఓ రాజా నీవుభయపడకుము. నీవు కోరినట్లే ఈ మానవరూపముతోడనే నీవు స్వర్గమున ప్రవేశించునట్లు నేను చేయుదును " అని హామీ యిచ్చెను. దాని కొఱకు పెద్ద యాగము చేయ సంకల్పించి తనశిష్యులను మునీశ్వరులనందరను ఆహ్వానింప పంపెను. విశ్వామిత్రుని శాపములకు భయపడి ఋషీశ్వరులందరు వచ్చుట కంగీకరించిరి. కాని వశిష్ఠుని పుత్రులు అంగీకరింపలేదు. విశ్వామిత్రుడు కోపించి వశిష్ఠునిపుత్రులను మరణించునట్లును తర్వాత ఏడుజన్మములు శునకమాంస భక్షకులుగ జన్మించునట్లును శపించెను. విశ్వామిత్రుడు యాగమునాచరించెను. దేవతలు హవిర్భాగములు స్వీకరించుటకు దిగిరాలేదు. విశ్వామిత్రుని యాగము నిరర్ధకమగుటచే మునీశ్వరులు తమలోతామునవ్వుకొనిరి. విశ్వామిత్రుడు " ఓ త్రిశంకుమహారాజా! నాసర్వతపశ్శక్తులను ప్రయోగించి నీవు సశరీరుడవై స్వర్గమునకు

పోవుటకు నీకు శక్తినిచ్చుచున్నాను. కావున స్వర్గము నధిరోహింపుమని" పలికెను. మహాచిత్రముగ త్రిశంకుడు తన శరీరముతోడనే స్వర్గమార్గమున విశ్వామిత్రుని తపశ్శక్తితో ప్రయాణము చేసెను. త్రిశంకుడు స్వర్గమును సమీపించెను. కాని ఇంద్రుడు చండాల రూపములో స్వర్గప్రవేశమునకు అర్హతలేదని పలుకుచు త్రిశంకుని క్రిందకు త్రోసివేసెను. త్రిశంకుడు స్వర్గమునుండి తలక్రిందులుగ పడిపోవుచు "ఓ విశ్వామిత్రా! రక్షింపుము" అని అరచుచు క్రిందకు భ్రష్టుడయ్యెను. అంతట విశ్వామిత్రుడు తన తపశ్శక్తితో త్రిశంకుని పతనమును నిరోధించి, మరియొక స్వర్గమును సృష్టింప సిద్ధపడెను. బ్రహ్మ సృష్టికి ప్రతిసృష్టి చేయబూనిన విశ్వామిత్రుని కడకు దేవతలు దిగివచ్చి "ఓ విశ్వామిత్రా! ప్రస్తుతము త్రిశంకుడున్న చోటనే అతడుండుగాక! నీవు సృజించిన స్వర్గమట్లే ఉండుగాక! నీకోపమును అదుపుచేసికొని మాతోస్నేహముగనుండుమని" కోరిరి. విశ్వామిత్రుడు అంతటితో తన ప్రతిసృష్టిని ఆపుచేసి, వ్యర్థమైన తన తపశ్శక్తిని పునరుద్ధరించుటకు తపస్సుచేయనారంభించెను.

అనేక సంవత్సరములు తపస్సు చేసిన తర్వాత బ్రహ్మాదిదేవతలు ప్రత్యక్షమై " ఓ కౌశికా! నీ తపస్సు ఫలించినది. నీవు ఇకపై రాజర్షివి కాక నిజమైన ఋషివైతివి " అని ఆశీర్వదించెను. విశ్వామిత్రుడు అంతటితో తృప్తి చెందక, బ్రహ్మర్షికావలెనని తన తపస్సును మరింత కఠినతరమొనర్చెను. దేవతలకు అతని తపోదీక్షనచ్చక తపోభంగ మొనర్చుటకు మేనకయను అప్సరసను పంపిరి. ఆమె సౌందర్యమునకు లోబడి విశ్వామిత్రుడు తపోదీక్షను విరమించి పదిసంవత్సరములామెతో

సౌఖ్యములనుభవించెను. తన పతనమును గుర్తించిన విశ్వామిత్రుడు భయపడుచున్న మేనకను క్షమించి మరల తపోదీక్షకు పూనుకొనెను. తిరిగి ఘోరతపము చేయుచున్న విశ్వామిత్రుని తపోదీక్షను భంగపరచుటకు దేవతలు రంభను మన్మధ వసంతుల సహాయముతో పంపిరి. విశ్వామిత్రుడు కోపించి రంభను పదివేల సంవత్సరములు పాషాణము కమ్మని శపించెను. అనంతరము విశ్వామిత్రుడు శ్వాసను కూడ బంధించి ఘోరతరమైన తపస్సు చేయగా బ్రహ్మప్రత్యక్షమై అతనిని బ్రహ్మర్షిగ గుర్తించితినని తెలిపెను. వశిష్ఠునినోట తనను బ్రహ్మర్షిగ గుర్తించినగాని తనకు సంతోషములేదని విశ్వామిత్రుడు పలికెను. వశిష్ఠుడు చిరునవ్వుతో "సోదరా! నీ తపోశక్తితో బ్రహ్మర్షిగ ఫలితము నందితివి" అని పలుకగ విశ్వామిత్రుడానందించెను. ఇది దశరధుని కడకు వచ్చిన విశ్వామిత్రుని వృత్తాంతము.

దేవేంద్రుడు బ్రహ్మను స్వాగతముపలికి ఆహ్వానించినట్లు దశరధుడు విశ్వామిత్రుని పాదములంటి స్వాగతము పలికి "ఓ విశ్వామిత్రా! నీరాకనాకెంతో సంతోష దాయకము. నీకు నావలన కాదగిన కార్యమేదైనను ఉన్నచో నన్ను ఆజ్ఞాపింపుము. నేను శిరసావహింతును" అనెను. దశరధుని మాటలకు విశ్వామిత్రుడు సంతసించి " ఓ రాజా! ఇక్ష్వాకు వంశోద్భవుడవైన నీవు వశిష్ఠుని శిష్యునిగ పలుకవలసిన రీతిగ పలికి నాకు సంతోషము కల్గించితివి. నేనొక యాగము చేయదలచితిని. ఆ యాగమునకు విఘ్నము కల్గింప మారీచ సుబాహులను రాక్షసులు ప్రయత్నించుచున్నారు.వారిని శపించి నాశముచేయుటకు మాతపోశక్తిని

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

వ్యర్థము చేయదలచలేదు. నీపెద్ద కుమారుని రాముని నాతో పంపినచో మాబాధలు నివృత్తియగును. నాసంరక్షణలో నీకుమారుడు అభివృద్ధినంది రాక్షసుల జయించి కీర్తినిపొందగలడు. నాపరిరక్షణలో నుండుటకు రాముని నియోగింపుము. నాకోరికను తిరస్కరింపకుము. నీవాగ్దానము నిలుపుకొనుము. రాముని రక్షణకొఱకు నీకు ఆతృత పడనవసరములేదు. ముల్లోకములందును నీవు ఘనకీర్తినందగలవు. వశిష్ఠుడును, నీమంత్రులును నేనుచెప్పినదానికి అంగీకరింతురు" అని పలికెను. దశరధుడు మిక్కిలి భయపడి రాముని రాక్షసుల బారికి విడుచుటకును, విశ్వామిత్రుని శాపమునకును భయముతో నిర్ణయింపలేకపోయెను. కొన్ని క్షణములు దశరధుడు నిరుత్తరుడై తేరుకొని "రామునకు పదునారేండ్లైనను పూర్తికాలేదు. అతడు రాక్షసులతో ఎట్లు యుద్ధము చేయగలడు? నేను, నాసైన్యము నీయాగపరిరక్షణకు వచ్చుటకు సిద్ధముగనున్నాము " అని పలికెను.

విశ్వామిత్రుడు మారీచసుబాహులను, వారిఅధిపతి రావణుని గురించి వివరించి రాముని తనతోపంపుమని మరలకోరెను. దశరధుడు " రాముని విడిచిపెట్టుటకు నాకు మృత్యుతుల్యము. నీవు అంగీకరించిన నేను ససైన్యముగ నీవెంట వచ్చుటకు సిద్ధము " అనెను. ఆజ్యముతో ప్రజ్వలించిన అగ్నివలె విశ్వామిత్రుని క్రోధము అతిశయించి "ఓ రాజా! ఈ ప్రవర్తన మీవంశమునకు తగనిది. ఇదియే నీచివరి మాటయైనచో నేను వచ్చినట్లే తిరిగిపోవుదును. సత్యవర్తనకు దూరుడవై నీవును నీప్రేమపాత్రులును చిరకాలము జీవింపుడు" అనెను. భూమి

బ్రద్దలయ్యెను. దేవతలు భయపడిరి. వశిష్ఠుడు దశరధునితో సౌమ్యముగనిట్లనెను. "ఓరాజా! వాగ్దానమును కాదనుట నీకు పాపము కల్గించును. ఇక్ష్వాకువంశోద్భవునిగ నీకిదితగదు. వాగ్దానమును నిర్వర్తింపకపోవుటచే నీవు చేసిన దానఫలితములన్నియు నశించును. విశ్వామిత్రునితో రామునితోపాటు లక్ష్మణునికూడ పంపుము. విశ్వామిత్రుని రక్షణయందుగల వారిని ఏ రాక్షసులును గాయపరుపలేరు. అగ్నివలయముచే రక్షింపబడిన అమృతమువలె రాముడు విశ్వామిత్రునిచే రక్షింపబడును. విశ్వామిత్రునిగురించి అతనిశక్తిని గురించి నీవెరుగవు. అతడు మానవరూపమును ధరించిన తపస్సు. ధైర్యవంతులందరికంటె ధీరుడు, ధీమంతుడు. ఆయుధములన్నింటికి అధిపతి. ముల్లోకములందును అతనికి సాటి ఏదియులేదు. అంతటివాడు నీకడకేలవచ్చెనని సంశయింపకుము. తన యాగమును తానేరక్షించుకొన గలడు. కాని నీపుత్రుల శ్రేయస్సును కోరియే నీకడకు వచ్చెను. సందేహింపక నీకుమారులను అతనితోపంపుము ".

వశిష్ఠుని వాక్యములు విని దశరధుడు తన కుమారులను విశ్వామిత్రునితో పంపుటకు సిద్ధపడెను. రామలక్ష్మణులు విశ్వామిత్రుని సమక్షమునకు కొనిరాబడిరి. రాజు, రాణులు, వశిష్ఠుడు రామలక్ష్మణులను ఆశీర్వదించి విశ్వామిత్రునితోపంపిరి. అనుకూల వాయువులు వీచి శుభశకునములాయెను. ధనుర్బాణములు ధరించిన రామలక్ష్మణు లిరువురును విశ్వామిత్రుని ఇరువైపుల నడచిరి. విశ్వామిత్రుడు , రామలక్ష్మణులును సరయూనదీతీరమున రాత్రిగడిపిరి. విశ్వామిత్రుడు

విశ్రాంతి తీసికొనుటకు ముందు రామలక్ష్మణులకు బడలిక, ప్రమాదములనుండి రక్షింపగల బల, అతిబల అను రెండు మంత్రముల నుపదేశించెను. పచ్చని సరయూనదీ తీరమున వారు ఆరాత్రి నిదురించిరి. ఉషఃకాలమునందు మేలుకొని తమప్రయాణమును సాగించిరి. అంగదేశమునందలి కామాశ్రమమును వారు చేరుకొనిరి. అచ్చటగల ఋషీశ్వరులకు రామలక్ష్మణులను పరిచయము చేసిన తరువాత ఆయాశ్రమ చరిత్రను వర్ణించెను.

మహాదేవుడు శివుడు చాలాకాలము తపము చేసిన ప్రదేశమిది. అవివేకియగు మన్మథుడు శివునిపై తన బాణములను ప్రయోగించి యిచటనే శివునిచే భస్మీభూతుడయ్యెను. అందుచే ఈ ప్రదేశము కామాశ్రమమని పిలువబడెను. ఆరాత్రి వారు ఆ ఋషీశ్వరుల ఆతిథ్యమును స్వీకరించి మరుచటి ఉదయము నిత్యకృత్యముల నాచరించిన తరువాత విశ్వామిత్రుడును రామలక్ష్మణులును తమ ప్రయాణమును సాగించి గంగానదిని చేరిరి. ఋషీశ్వరులచే సిద్ధముచేయబడిన ఒక తెప్పపై ఆనదిని తరించిరి.

ప్రవాహమధ్యమున రామలక్ష్మణులు ఒక ధ్వనిని విని, అదియేమని విశ్వామిత్రుని ప్రశ్నించిరి. సరయూనదీ ప్రవాహము గంగలోనికి ప్రవహించు ధ్వనియని విశ్వామిత్రుడు వివరించెను. ఆరాజకుమారులు ఆపవిత్రనదీప్రవాహములకు మౌనముగ తమ వందనములను సమర్పించిరి. గంగను దాటిన తరువాత విశ్వామిత్రుడు,

రామలక్ష్మణులును భయంకరమైన క్రూరజంతువుల అరపులతోకూడిన దట్టమైన అరణ్యమార్గమున పయనించిరి.

"ఇదే ఒకానొకప్పుడు జనసమ్మర్ధముగల ప్రస్తుతము భయంకరముగనున్న దండకారణ్యము. ఒకానొకప్పుడు దేవేంద్రుడు వృత్రాసురుని సంహరించి పాపముచే అపవిత్రుడయ్యెను. అందుచే దేవలోకమునుండి తనంతతానుగ బహిష్కృతుడయ్యెను. దేవతలు దేవేంద్రుని పవిత్రుని చేయుటకు పవిత్ర నదీతోయముల తెచ్చి సమంత్రకముగ ఇంద్రుని స్నానము చేయించిరి. ఇంద్రుని పవిత్రము చేసిన జలములు భూమిలోనికి ప్రవహించి ఆభూమిని మిక్కిలి సారవంతమొనరించినవి. ఆభూమియందు మరణించిన కళేబరములు, వ్యర్ధపదార్ధములును సుందరమైన ఫలపుష్పభరితమైన వృక్షములుగ మారినవి. సుందుడను యక్షుని భార్యయగు తాటక, ఆమెకుమారుడు మారీచుడు భయంకరముగ ధ్వంసము చేయువరకు ఇచ్చట చాలమంది జనులుసుఖముగ నివసించిరి. ఆతాటకమారీచులు ఇప్పుడును ఈఅరణ్యమందే కలరు. తాటక వలన భయముతో ఎవ్వరును ఈఅరణ్యమునందు ప్రవేశించుటకు ధైర్యముచేయరు. ఆమె ఇరువది ఏనుగుల బలముతోసమానమగు బలము కల్గియున్నది. ఈశత్రువు నుండి ఈఅడవిని తప్పించుటకై నేను మిమ్ము ఇచటకు తీసికొని వచ్చితిని. ఋషీశ్వరులకు బాధాకరమైన రాక్షసి నిస్సందేహముగ నీచేత నాశము చేయబడును " అని విశ్వామిత్రుడు పలికెను.

శ్రీమద్రామాయణము

శ్రీరాముడు విశ్వామిత్రుని పలుకులు విని " ఓ మహర్షీ! తాటక యక్షజాతియందుద్భవించినదని తెలిపినారు. కాని యక్షులు ఇంత ప్రత్యేక శక్తివంతులని వినియుండలేదు. ఒక స్త్రీ అంతబలమును పొందియుండుటకు గలకారణమేమి? " అని అడిగెను.

" శ్రీరామా! నీవుచాల ఉపయుక్తమైన ప్రశ్న అడిగినావు. బ్రహ్మ వర ప్రసాదముచే ఆమెకు ఈబలము వచ్చినది. పూర్వము సుకేతుడను యక్షుడు సంతానములేని కారణముగ బ్రహ్మను గురించి తపస్సు చేసెను. "నీవు బలసంపన్నమైన అందమైన కుమార్తెను పొందగలవు. పుత్రసంతానమును పొందలేవు" అనుచు బ్రహ్మ వరమునిచ్చెను. బలసంపన్న సౌందర్యవతియగు తాటకను సుకేతుడు సుందుడను యక్షునకు పెండ్లి చేసెను. వారిసంతానమే మారీచుడు. సుందుడు ఒకప్పుడు అగస్త్య ఋషీశ్వరుని శాపమును పొంది మరణించెను. ఈ సంఘటనతో తాటక, మారీచులు అగస్త్యునిపై దండెత్తిరి. అగస్త్యుడు వారిని నరమాంస భక్షకులైన రాక్షసులుగ జీవింపుడని శపించెను. కావున తాటక ఇపుడు అసహ్యకరమగు రాక్షస రూపముననున్నది. అప్పటినుండి తాటక మారీచులు అగస్త్యాశ్రమ సమీపప్రదేశమందు నివసించువారిని పీడించు చున్నారు. స్త్రీని సంహరించుట క్షత్రియధర్మము కాదని తాటకను నాశము చేయుటకు సందేహింపకుము. ఆమె దుర్మార్గములు సహింపరానివి. పురుషులైనను, స్త్రీలైనను దుర్మార్గులను శిక్షించుట క్షత్రియధర్మము. మానవ రక్షణార్థము క్రూరజంతువును సంహరించినట్లు తాటకను సంహరించుట సబబే. ఇది పరిపాలకుల బాధ్యత. చాలామంది స్త్రీలు

వారినేరముల కారణముగ మరణదండనతో శిక్షింపబడిరి. కావున నీవు సందేహింపకుము " అని విశ్వామిత్రుడు పలికెను.

శ్రీరాముడు విశ్వామిత్రునితోనిట్లనెను. "నాతండ్రి నీ ఆజ్ఞను శిరసావహింపుమని నన్నాజ్ఞాపించెను. నీఆజ్ఞకు బద్ధుడనై అందఱ క్షేమము కొఱకు నేను తాటకను సంహరింతును". శ్రీరాముడు ఇట్లు పలుకుచు తన ధనువును ఎక్కుపెట్టి అడవి ప్రతిధ్వనించునట్లును , అడవిజంతువులు భయముతో చెల్లాచెదురగునట్లును వింటినారిని ఠంకారము గావించెను. ఈధ్వనితాటక విని తనరాజ్యమునందు నిర్భీతిగ ఎవరు ప్రవేశింప సాహసించెనని ఆశ్చర్యపడెను. క్రోధముతో ప్రచండ వేగముతో తాటక ధ్వనివచ్చిన దిశగా వచ్చి శ్రీరామునిపై దుమికెను. యుద్ధము ప్రారంభమయ్యెను. శ్రీరాముడు తాటక ప్రాణములను మినహాయించి ఆమె శరీరావయవములను నరుకవలెనని తలచెను. కాని తాటక భయంకరముగ ఆకాశమునకు ఎగిరి రామలక్ష్మణులపై శిలావర్షము కురిపించెను. రాజకుమారులిరువురును ఆదాడినుండి తమనుతాము రక్షించుకొనిరి. యుద్ధము సాగుచుండగా విశ్వామిత్రుడు తాటకను చంపుటకు ఆలసింపవలదని రాముని హెచ్చరించెను. "తాటక సానుభూతికి అర్హురాలుకాదు. సూర్యాస్తమయమగుచున్నది. రాక్షసులు రాత్రిబలవత్తరమగుదురు. తాటకను సంహరించుటకు ఆలస్యము చేయకుము." విశ్వామిత్రునిచే సలహానందిన శ్రీరాముడు తాటకను సంహరించుటకు నిశ్చయించి ఆమెవక్షస్థలమున ఒక భయంకరమైన బాణముతో కొట్టెను. తాటక నిర్జీవముగ నేలపైపడెను. దేవతలు

సంతోషించిరి. విశ్వామిత్రుడు సంతోషముతో శ్రీరాముని కౌగలించుకొని దీవించెను. తాటక వధతో ఆఅరణ్యము శాపమునుండి విడుదలయై చూచుటకు సుందరముగనుండెను. రాజకుమారులు ఆరాత్రి అచట గడిపి, మరుచటి ఉదయము విశ్వామిత్రుని ఆశ్రమమును గూర్చి ప్రయాణించిరి.

మరుచటి రోజు ఉషః కాలమున శ్రీరాముని విశ్వామిత్రుడు తన ప్రక్కకు పిలిచి ఆశీర్వదించుచు " నేను చాల సంతోషముగనుంటిని. నీవు చేసినదానికి అంతటికిని ప్రతిఫలముగ నేను నీకేమిచేయగలను? సర్వ అస్త్రములయొక్క ఉపయోగమును నీకు నేను బోధింతును" ఇట్లు పలుకుచు విశ్వామిత్రుడు తాను తపశ్శక్తితో ఆర్జించిన దివ్యాస్త్రముల నన్నింటిని శ్రీరామచంద్రునకిచ్చెను. విశ్వామిత్రుడు రామునకు దివ్యాస్త్రముల ప్రయోగము, ఉపసంహారములు వివరించెను. శ్రీరాముడు ఈ విజ్ఞానమును లక్ష్మణునకందించెను. వారు తమ ప్రయాణమును కొనసాగించుచుండగా అందమైన అరణ్యములతో కూడిన పెద్ద పర్వతమును చూపుచు రాముడిట్లడిగెను. "మనము చేరవలసిన గమ్యమిదియేనా? మీయాగవిఘ్నకారకులైన దుష్టశక్తులెవరు? వారిని నాశము చేయుటకు నేనేమిచేయవలెను?"

శ్రీరామచంద్రుడు యుద్ధము చేసి, ఋషీశ్వరుని ఆశీస్సులను పొందు కుతూహలముతోనున్నాడు. అపుడు విశ్వామిత్రుడు "మనము వెళ్ళబోవు ప్రదేశ మదియే. భగవంతుడగు నారాయణు డిచ్చటనే తపస్సు చేసినాడు. అచ్చటనే అతడు వామనునిగ జన్మించెను. దీనిని సిద్ధాశ్రమమని పేరుతోపిలుతురు. రాక్షసులయందుత్తముడగు

ప్రహ్లాదుని మనుమడు, విరోచనుని కుమారుడు మహాబలియను రాజునకు దేవతలు కూడ భయపడెడివారు. మహాబలి తన చర్యలతో తనంతతాను ఇంద్రశక్తిని సంపాదించెను. కశ్యప ప్రజాపతి , తనభార్య అదితితో విష్ణువు నారాధించి, విష్ణువును తమ కుమారునిగ జన్మించి దేవతలను, దేవేంద్రుని మహాబలినుండి రక్షింపుమని కోరిరి. దానికి సమాధానముగ విష్ణువు అదితికి వామనునిగ జన్మించెను. మహాబలి యజ్ఞము చేయుచున్న ప్రదేశమునకు వామనుడు చిన్న వటుని రూపమున వెళ్ళెను. యజ్ఞశాలకు అందరకు ప్రవేశార్హతయు కోరిన వస్తువులను పొందుటకు అర్హతయుండెడిది. ఎప్పుడైతే వామనుడు కార్యార్థిగ ప్రకటించుకొనెనో రాక్షసగురువగు శుక్రాచార్యుడు మహాబలియొక్క గురువు ఆబ్రాహ్మణ బాలుని కోరికను మన్నింపవలదనియు విష్ణువే స్వయముగ వటువు రూపమున వచ్చినాడనియు అతనికి వాగ్దానము చేయవలదనియు మహాబలిని నివారించెను. మహాబలి గురూపదేశమును లక్ష్యపెట్టలేదు. అతడు భగవంతుని భక్తుడగుటచే ఆ విష్ణువే తననుండి ఒక బహుమతిని స్వీకరించుటకంగీకరించుట తనకు నిజముగ భగవంతుని ఆశీస్సుగ తలచెను. మహాబలి చిరునవ్వుతో " సంకోచము లేకుండా తనకేమికావలెనో కోరుకొనుమని వామనుని ప్రోత్సహించెను. నాధనము, భూమి, రత్నములు సర్వము నీకొఱకే సిద్ధముగ నున్నవి " అని పలికెను. వామనుడు సంపదవలన ప్రయోజనము లేదు. నాపాదముతో మూడు పాదముల భూమి కావలెనని కోరెను. మహాబలి చక్రవర్తి చిరునవ్వు నవ్వుచు బ్రహ్మచారియొక్క కుఱచ పాదముల చూచి

అటులనే తీసికొనుమనెను. చిన్న బ్రహ్మచారి హఠాత్తుగా త్రివిక్రమ రూపమునకు పెరిగి ఒక పాదముతో భూమిని, రెండవపాదముతో స్వర్గలోకములను కొలిచెను. తనకు సమర్పింపబడిన మూడవ పాదము మోపుటకు స్థలము లేకపోవుటచే మహాబలియొక్క శిరస్సుపైపాదమును మోపెను. భగవంతుని దృష్టియందు భక్తుని తల భూమ్యాకాశములకంటె విశాలమైనది. నారాయణుని పాదముచే తొక్కబడిన మహాబలి శిరస్సు శాశ్వతమైనది."

మహాబలి చరిత్రను వర్ణించిన విశ్వామిత్రుడు ఇంకను ఇట్లు పలికెను. "ఈప్రదేశమే నారాయణుడు, కశ్యపుడు తపస్సు చేసి భగవంతుడు వామనావతారమెత్తుటకు కారణభూతమైన ప్రదేశము. ఈ పవిత్ర ప్రదేశమున నేను నివసించుచున్నాను. ఇక్కడే రాక్షసులు వచ్చి మన పూజలను, తపస్సులను నిరోధించుచున్నారు. ఈచెడును పరిసమాప్తినందించుటకే మీరిటకు వచ్చిన కారణము". "అటులనే కానిండు " అని రాముడనెను. విశ్వామిత్రుని , ఇరువురు రాజ కుమారుల రాకతో ఆశ్రమము సంతోషమునకు గుర్తుగకనబడెను. ఋషీశ్వరులు వారికి వారి ఆచారము ప్రకారము పండ్లు, పానీయములు సమర్పించిరి. శ్రీరాముడు యాగమునకు కావలసిన సంభారములు సమకూర్చుకొనుడని విశ్వామిత్రుని కోరెను. ఆ రాత్రే విశ్వామిత్రుడు యజ్ఞతపోదీక్షను స్వీకరించెను. మరుచటి ఉదయము రాజకుమారులు పెందలకడనేలేచి రాక్షసులు ఎపుడు రాగలరని ఊహించుచున్నదియు తెలుపుడనియు, వారినెదిరించుటకు తాముసిద్ధముగ నుందుమనియు విశ్వామిత్రుని

కోరిరి. విశ్వామిత్రుడు మౌనవ్రతములోనుండుటచే అతడు వారికి సమాధానమీయలేదు. కాని ఇతర ఋషులు ఆరు రాత్రులు పగళ్ళు రామలక్ష్మణులు యాగరక్షణార్ధము జాగరూకతతోనుండవలయుననిరి.

ఆరాజకుమారులు ఆయుధపాణులై ఆరురోజులు రాత్రులు పగళ్ళు జాగరూకతతోనుండిరి. ఆరవ రోజు ఉదయము శ్రీరాముడు లక్ష్మణునితోనిట్లు పలికెను." సోదరా! శత్రువులు వచ్చుటకు ఇదేతగిన సమయము. మనము యుద్ధముచేయుటకు సిద్ధముగ నుండవలెను." ఇట్లు మాట్లాడుచుండగనే పవిత్రమైన అగ్నిగుండమునుండి అగ్నిజ్వాలలు ప్రకాశించెను. ఆకాశమునుండి పెద్దధ్వనులు వినిపించెను. శ్రీరాముడు పైకిచూచి మారీచసుబాహులు తమ అనుచరులతో పవిత్ర అగ్నిహోత్రము లందు అపరిశుభ్రమైన పదార్ధములు చిమ్ముటకు సిద్ధపడుచున్నట్లు గ్రహించెను. పెద్ద నల్లని మబ్బువలె రాక్షస సైన్యము ఆకాశము నాక్రమించెను. "చూడు లక్ష్మణా! మారీచునిపై మానవాస్త్రమును ప్రయోగింపుము" అను రామాజ్ఞానుసారము లక్ష్మణుడు బాణ ప్రయోగము చేసెను. అనుకొనిన విధముగనే ఆఅస్త్రము మారీచుని సంహరింపలేదు. కాని అతనిని చుట్టచుట్టి నూరుయోజనముల దూరమున సముద్రము కడకు విసిరెను. శ్రీరాముడు ఆగ్నేయాస్త్రముతో సుబాహుని సంహరించెను. అనంతరము రాజకుమారులిరువురును రాక్షస సైన్యమునంతటిని నాశము చేసిరి. మరల ఆకాశము నిర్మలమయ్యెను. విశ్వామిత్రుడు తన యాగము పరిసమాప్తినందుటచే మిక్కిలి సంతోషించెను. "నేను దశరథ మహారాజునకు కృతజ్ఞుడను. మీరు మీ

వాగ్దానమును నిర్వర్తించిరి. మీధైర్యమును నేను మెచ్చుకొందును. ఈఆశ్రమము మీద్వారా మరల సిద్ధాశ్రమముగ విజయమునకు చిహ్నముగ అయినది" అని పలికెను.

మరునాడు రామలక్ష్మణులు ఉదయసంధ్యావందనము లయిన తర్వాత విశ్వామిత్రుని చేరి ఆయన తదుపరి ఆజ్ఞలకై ప్రార్ధించిరి. విశ్వామిత్రునకు రాముని జన్మకారణము తెలియనిదికాదు. శ్రీరామునకు తానిచ్చిన ఆయుధముల శక్తిని అతడెరుగును. అనుకొనిన దానికంటె ఎక్కువగ అనుభవమునకు వచ్చినది. విశ్వామిత్రుడు అనిర్వచనీయమైన ఆనందముతోనున్నాడు. శ్రీరామునకు సీతతో వివాహము చేయవలెనని తలచెను. అక్కడనున్న ఋషీశ్వరులు సమావేశమై "విదేహ రాజ్యమునకు ముఖ్యపట్టణమగు మిథిలానగరమును పాలించుచున్న జనకమహారాజు చేయుచున్న యాగమునకు మేము పోవుచున్నాము. మీసోదరునితో మావెంట వచ్చుట మంచియగును. జనకుని సభయందు గల గొప్ప ధనువును అయోధ్యరాకుమారుడు చూడ వీలగును" అని రామునితో అనిరి. శ్రీరామలక్ష్మణులు విశ్వామిత్రునితో జనకుని పట్టణమునకు వెళ్ళుటకు నిశ్చయింపబడినది.

మిథిలానగర ప్రభువగు జనకుడు ఆదర్శప్రాయుడగు రాజు. అతడు దశరథ మహారాజునకు మంచిస్నేహితుడు. జనకుడు ధైర్యవంతుడైన రాజేకాక ఋషీశ్వరులవలె వేదశాస్త్రములు బాగుగ తెలిసినవాడు. భగవద్గీతయందు శ్రీకృష్ణుడు జనకుని కర్మయోగిగ ఉదహరించెను. మానవరూపముననున్న విష్ణువునకు భార్యకాదగిన

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

సీతకు తండ్రిగ యోగ్యుడైనవాడు జనకుడు. ఒక యాగము సంకల్పించిన జనకుడు యాగశాలకొఱకు నిర్ణయింపబడిన స్థలమును స్వహస్తములతో దున్నుచుండెను. ఆ సమయమున కనుగొనబడిన దివ్యసుందరబాలికను బిడ్డలులేని జనకుడు తనకు భూదేవి ప్రసాదించిన బహుమతిగ స్వీకరించెను. ఆబిడ్డను తన చేతులతో తన భార్యకడకు తీసికొని వెళ్ళి "మనకు ఇచట ఒక నిధి లభించినది. యాగప్రదేశమునందు నాకీబిడ్డ లభించినది. దీనిని మన స్వంత బిడ్డగ చేసికొందము"అనెను. రాణి సంతోషముతోనంగీకరించెను.

సీత లోకాతీత సౌందర్యము కలిగి లక్ష్మీదేవివలె వెలుగొందెను. సీత యుక్తవయస్కురాలుకాగా జనకుడు తాను ఆమెనుండి వేరుగనుండవలసి యుండునని విచారించెను. ఎంతకాలము ప్రయత్నించినను సీతకు తగిన వరుని ఎన్నుకొనలేకపోయెను. ఎందరోరాజులు మిధిలకు వచ్చిరి కాని జనకుని దృష్టిలో వారెవరును సీతకు తగిన వారుగ తోచలేదు. ప్రభువు ఈవిషయమై ఆలోచించి ఒక నిర్ణయమునకు వచ్చెను. చాలకాలము క్రిందట జనకునిచేచేయబడిన యాగమునకు సంతోషించి వరుణుడు అతనికి శివుని ధనువును, రెండు అమ్ములపొదులను ఇచ్చెను. అది పురాతనమైన దివ్యధనువు. సామాన్యమానవులెవ్వరును దానిని కదపనైననులేరు.

" నాకుమార్తె సీతను శివధనువును ఎక్కుపెట్టిన యోధునకే సమర్పింతునని" జనకుడు ప్రకటించెను. అనేకమంది రాజకుమారులు సీతసౌందర్యమును గురించి విని మిధిలకేగి శివధనువునెత్తలేక నిరాశతో

తిరిగిపోయిరి.ఋషీశ్వరులతో మిధిలకు ప్రయాణము చేయుచున్న విశ్వామిత్రుడు సాయంత్రమగుసరికి శోణ నదీతీరమును చేరెను. ఉదయము ప్రయాణము సాగించి మద్యాహ్నమునకు గంగను చేరిరి. గంగలోవారు స్నాన మాచరించిరి. ఋషీశ్వరులు తమ పితృదేవతలకు నివాళులర్పించిరి. వారచట ఒక ఆశ్రమము నేర్పరచుకొని పూజలుచేసి ఆహారమును వండుకొనిరి. భోజనానంతరము రాజకుమారుల ప్రార్ధన మేరకు గంగ వృత్తాంతమును వివరించు విశ్వామిత్రుని చుట్టును కూర్చుండిరి.

హిమవంతుడు పర్వతముల రాజు. తనభార్యయగు మనోరమయందు పొందిన ఇరువురు కుమార్తెలయందు గంగ పెద్దది. దేవతల ప్రార్ధన మేరకు హిమవంతుడు గంగను దేవలోకమునకు వారితో నివసించుటకు పంపెను. రెండవకుమార్తె ఉమాదేవి శివుని అభిమానమును చూరగొని అతని భార్య అయ్యెను. పూర్వము అయోధ్యకు ప్రభువగు సగరుడు చిరకాలము పుత్రసంతానము లేక కేశిని, సుమతి అను తన ఇరువురు భార్యలతో హిమాలయమునకు వెళ్ళి తపస్సుచేసెను. భృగుమహర్షి సంతోషించి సగరుని దీవించి సగరునకు అనేక మంది సంతానము లభించి గొప్ప కీర్తి కలుగుననియు , అతని భార్యలయందు ఒకామె వంశోద్ధారకుడైన ఒక్క కుమారుని పొందుననియు రెండవ భార్య బలవంతులైన అరువదివేల కుమారులను పొందుననియు పలికెను. సగరుని భార్యల ప్రశ్నకు సమాధానముగ వారికోరికమేరకు సంతానము కల్గునని భృగువు చెప్పెను. కేశిని వంశోద్ధారకుడైన

ఒక్కపుత్రునితోడనే తృప్తినందెను. సుమతి అరువదివేలమంది పుత్రులను కోరుకొనెను. ఋషి సరేననెను. తృప్తిచెందిన సగరుడు తనభార్యలతో ఋషికడ శలవుగొని అయోధ్యకు తిరిగి వెళ్ళిరి.

కాలక్రమమున కేశినికి అసమంజసుడు జన్మించెను. సుమతి అరువదివేల భాగములుగ విభజింపదగిన మాంసపుముద్దను కన్నది. అందు అరువదివేల బిడ్డలు జన్మింపగ వారి దాదులు జాగ్రత్తగ పెంచిరి. సంవత్సరములు గడచుకొలది అరువదివేలమంది రాకుమారులు బలసంపన్నులుకాగా అసమంజసుడు క్రూరమైన అమాయకుడయ్యెను. అతడు పసిబిడ్డలను నదిలోనికి విసరి, అందుమునిగి చనిపోవువారిని చూచినవ్వుకొను వినోదమునకు లోబడెను. సహజముగ జనులతని స్వభావమును అసహ్యించుకొని దేశమునుండి బహిష్కరించిరి. అసమంజసుని కుమారుడు అంశుమంతుడు తండ్రికి విరుద్ధముగ బలసంపన్నుడగు సన్మార్గుడయ్యెను. సగరుడు ఒక గొప్ప యాగము తలపెట్టి అశ్వరక్షణకు అంశుమంతుని నియమించెను. కాని ఇంద్రుడు ఆ యాగాశ్వమును అపహరించెను. సగరుడు అపహరింపబడిన యాగాశ్వమును తిరిగి పొందుటకు భూమండలమంతట వెదకుడని సుమతి కుమారులనరువది వేల మందిని నియమించెను. " అశ్వాప హరణము యాగమునకు విఘ్నమును కలిగించుటయేకాక యాగకర్తలకు మహాపాపకరమనియు , ఎక్కడ దాచబడినను అశ్వమును వెదకి తేవలయునని కుమారులను ఆదేశించెను". సగర కుమారులు ఆతృతతో భూమండలమంతయు వెదకినను కనుగొనలేకపోయిరి. ఆప్రయత్నములో

వారు భూమిని త్రవ్వుట ప్రారంభించిరి. అయినను అశ్వము కనుగొనబడలేదు. సగరుడు అధోలోకమును కూడ మూలమూలల వెదకుడని కుమారులనాజ్ఞాపింపగ, పాతాళ లోకమున విష్ణుస్వరూపుడగు కపిలమహర్షి ఆశ్రమసమీపమున సగర కుమారులు అశ్వమును కనుగొనిరి. రాజకుమారులు అశ్వమునేకాదు, యోగిగ నటించుచున్న అశ్వచోరుని కూడ కనుగొంటిమని తలచి కపిలునిపై దాడి జరిపిరి. తన ధ్యానమునకు భంగము కలుగగ కనులు తెరచిన కపిలమహర్షి కోపాగ్నికి అరువది వేల సగరకుమారులు భస్మీభూతులై బూడిదరాసులుగ మారిరి. నిజమైన దొంగ ఇంద్రుడు తెలివిగ తప్పించుకొనెను. యాగాశ్వమును వెదుకుటకేగిన తనకుమారుల రాకకు నిరీక్షించిన సగరుని నిరీక్షణ వ్యర్థమయ్యెను.

కొంతకాలమైన తరువాత సగరుడు తన మనుమని అంశుమంతుని పిలిచి "అశ్వమును వెదుకుటకు పాతాళమునకేగిన రాజకుమారులకేమైనదో తెలిసికొని విజయముతోమరలిరమ్మని" పలికెను. అంశుమంతుడు రాజకుమారులు వెళ్ళిన మార్గమును అనుసరించి అధోలోకమును చేరి నాలుగు దిగ్గజములకు వందనములు తెలిపెను. ఆదిగ్గజములు అతనికి విజయములు కలుగునని ప్రోత్సహించినవి. అంశుమంతుడు పాతాళమును చేరి అంతటా వెదకి యాగాశ్వమును కనుగొని సంతోషించి, బూడిదరాసులను చూచి మిక్కిలి దుఃఖించెను. "ఆబూడిదరాసులే తన పినతండ్రులా" యని చింతించెను. సగరుని రెండవ భార్య సుమతియొక్క సోదరుడు ఖగపతి గరుడుడు కపిలమహర్షి

కోపాగ్నికి భస్మమైన సగరకుమారుల భస్మరాసులవియని అంశుమంతునకు తెలిపెను. "వత్సా! యాగాశ్వమును కొనిపోయి యాగమును పూర్తిచేయుము. ఈ రాజకుమారుల ఆత్మలు ఉత్తమలోకములకేగవలెననిన దేవలోకముననున్న గంగాప్రవాహములతో ఈ భస్మరాసులను తడుపవలెను" అని పలికెను. అంశుమంతుడు అశ్వమును వెంటనిడికొని గృహమునకేగి తనకు తెలిసిన వృత్తాంతమంతయు సగరునికి తెలిపెను. సగరుడు తన కుమారులకు కలిగిన దుస్థితికి చాల విచారించి, అశ్వము లభించుటచే యాగమును పూర్తిచేసి, గంగను పాతాళమునకు తీసికొనిరాలేక చింతించుచు మరణించెను.

సగరుని అనంతరము అంశుమంతుడు, అనంతరము దిలీపుడు, తర్వాత భగీరధుడు అయోధ్యకు ప్రభువులయిరి. అంశుమంతుడు, దిలీపుడు ఇతరవిషయములందు సంతోషముగ నున్నను వారి పూర్వులకు ఉత్తమగతులందింప పాతాళమునకు గంగను తేలేక విచారముతో మరణించిరి. భగీరధుడు పరాక్రమ వంతుడు. సంతాన రహితుడైన భగీరధుడు సంతానార్ధియై, గంగను దివినుండి క్రిందకు తెచ్చుటకును రాజ్యమును మంత్రులకప్పగించి తపస్సు చేయుటకై గోకర్ణమునకు వెళ్ళెను. పంచాగ్ని మధ్యమున కూర్చుండి నెలకొకమారు మాత్రమే భుజించుచు ఘోరమైన తపస్సు చేసెను. అతని తపస్సునకు సంతసించిన బ్రహ్మ ప్రత్యక్షమై " నీకేవరము కావలెనని" యడిగెను. "తన వంశమును నిలుపుటకు సంతానము కావలెననియు కపిలుని కోపాగ్నికి భస్మమైన పూర్వులకు ఉత్తమ గతులు కల్గించుటకు

గంగను పాతాళమునకు రప్పింపుమనియు" భగీరధుడు బ్రహ్మను కోరెను. "దేవతలు నీతపస్సునకు మెచ్చి నీ వరములనిచ్చుటకు అంగీకరించిరి. కాని గంగభూమికి దిగునపుడు ఆ వేగమును భూమి భరింపలేదు. దీనికి శివుడు మాత్రమే సమర్ధుడు. కావున నీవు శివుని గురించి తపస్సు చేయుము" అని బ్రహ్మ సలహానిచ్చెను. భగీరధుడు ఆకలిదప్పులను సైతము విడచి శివుని గూర్చి తపస్సు చేసి శివానుగ్రహమును సంపాదించెను. "నేను నీకోరికను నెరవేర్తును. గంగను నాశిరసున ధరింతును. గంగ అనుగ్రహమును పొందుము" అని శివుడు భగీరధునకు ప్రత్యక్షమై పలికెను.

భగీరధునకు మహాదేవుడు వాగ్దానము చేసిన వెంటనే బ్రహ్మ ఆజ్ఞప్రకారము గంగ క్రిందకు దిగుచు గర్వముతో తనప్రవాహ వేగముతో శివుని శిరసుపై దిగుచు అతనిని పాతాళమునకు త్రోసివేయవలెనని తలచెను. త్రినేత్రుడు గంగకు గుణపాఠము చెప్పదలచి గంగాప్రవాహమును తన జటాజూటమునందు బంధించెను. గంగ ఎంత ప్రయత్నించినను శివుని జటాజూటమునుండి ఒక్కచుక్కయైనను బయట పడలేకపోయెను. గంగకు శివుని చర్య గుణపాఠమైనను, భగీరధునకు నిరాశను కల్గించినది. శంకరుని ప్రసన్నుని చేసికొనుటకు భగీరధుడు మరల తపముచేసి శివుని మెప్పించెను. శివుడు దయతలచి తన శిరస్సునుండి గంగను క్రిందకు ప్రవహింపనీయగా బిందుసరోవరములోనికి దిగిన గంగ అటనుండి ఏడు ప్రవాహములుగ ప్రవహించెను. అందు మూడు ప్రవాహములు పడమరకు, మరిమూడు ప్రవాహములు తూర్పునకు ప్రవహించి ఏడవప్రవాహము తన

పూర్వులకు ఉత్తమ గతులు కల్గింపసంతోషించుచున్న భగీరధుని వెంట బయలుదేరెను. భగీరధుని రధమును అనుసరించుచు, తన జలముల కాంతులతోప్రకాశించుచు, నాట్యముచేయుచున్నట్లు ప్రవహించుచున్న గంగను తిలకించుటకు ఆకాశమున దేవగంధర్వాదులు వచ్చిరి. కొన్ని ప్రదేశములందు నెమ్మదిగను, కొన్నిచోట్ల వేగముగను, ఎత్తునుండి పల్లమునకు దుముకుచు నాట్యభంగిమలతో పయనించు గంగను చూచి స్వర్గవాసులు సంతోషించిరి. మార్గమధ్యమున జహ్ను మహర్షి యాగశాలను గంగాప్రవాహము భగ్నముచేయగా కోపించిన జహ్ను మహర్షి గంగను తన అరచేత స్వీకరించి ఒకగుటకలోత్రాగెను. గంగ మాయమయ్యెను. దేవతలు, ఋషులు జహ్నుమహర్షి కడకువచ్చి భగీరధుని కొరకు గంగను క్షమింపుమని కోరిరి. దయతలచిన జహ్నుమహర్షి గంగను తన కుడిచెవినుండి విడుదల చేసెను. జహ్ను మహర్షి శరీరమునుండి ఉద్భవించుటచే జహ్నుని కుమార్తెగ "జాహ్నవి" అనుపేర గంగపిలువబడునని పలికి దేవతలు సంతోషించిరి. అనంతరము సముద్రముద్వారా గంగ పాతాళమును చేరెను. ఆపవిత్ర గంగాజలము లతో భగీరథుడు తన పూర్వులకు ఉత్తరక్రియలు జరిపి వారికి స్వర్గలోక ప్రాప్తి కలిగించెను. భగీరధుని ప్రయత్నములతో క్రిందకు దిగివచ్చిన గంగకు "భాగీరధి" అని పేరు వచ్చినది.

గంగావతరణ వృత్తాంతమును వివరించిన విశ్వామిత్రుడు "రాజకుమారులారా! సూర్యుడస్తమించుచున్నాడు. మీపూర్వుడు తెచ్చిన గంగాజలములలో మన సంధ్యా వందనములు ఆచరింతము" అని

పలికెను. గంగానదీ పవిత్ర జలములందు స్నానమాచరించినవారును, ఈదివ్యచరిత్రను చదివిన వారును, వినిన వారును పాపములనుండి విముక్తులగుదురు. బలము, ఉత్సాహమును పొందగల్గుదురు. విశాలనగరమున ఒకరోజు గడిపిన తరువాత విశ్వామిత్రుడు, అతని అనుచరులు మిథిలానగరమునకు బయలుదేరిరి. మిథిలానగర సమీపమున మార్గమధ్యమున ఎవరును కాపురములేని ఒక అందమైన ఆశ్రమమును వారుచూచిరి. "ఈఆశ్రమమెవరిది? ఈసుందర నివాస స్థలము ఎడారిగనుండుటకు కారణమేమి?" అని శ్రీరాముడు విశ్వామిత్రుని ప్రశ్నించెను. విశ్వామిత్రుడిట్లు చెప్పనారంభించెను. "ఈఆశ్రమము ఒక శాపమునకు నిదర్శనము గౌతమ మహర్షి ఇచట తన భార్య అహల్యతో శాంతియుతమైన, పవిత్రమైన తపస్సుతోకాలము గడుపుచు ఇందు నివసించెను. ఒక దినము గౌతముడు ఆశ్రమమున లేని సమయమున సుందరమైన అహల్యపట్ల అపవిత్రమైన కోరికతో ఇంద్రుడు గౌతముని మారు వేషముతో సమీపించి అహల్యను పొందగోరెను. ఇంద్రుని మారువేష ధారణచే ఆమె వంచింపబడలేదు. వ్యర్థమగు తనసౌందర్యముతో దేవేంద్రుని ప్రేమను జయించితినను గర్వముతో అహల్య తన వివేకమును కోల్పోయి అతని కోరికకు లోబడెను. ఇంద్రుడు నేరపు భయముతో పారిపోవుచుండెను. అదేసమయమున గౌతముడు తిరిగి వచ్చెను. ఇంద్రుడు గౌతముని దయకొరకు వంగి నమస్కరించెను. గౌతముడు ఇంద్రుని మగతనము దూరమగుగాకయని శపించెను. ఇంద్రుడు వెంటనే నపుంసకునిగ మారిసిగ్గుతో

దేవలోకమునకేగెను. అనంతరము గౌతముడహల్య వైపుతిరిగి చాలకాలము ప్రాయశ్చిత్తము విధించెను. "నీవిక్కడే అదృశ్యరూపమున ఉండుము. చాలకాలము తరువాత ఈమార్గమున దశరథ పుత్రుడు పయనించును. అతడీఆశ్రమమునకాలుమోపినపుడు నీశాపవిముక్తి జరుగును. అతనిని అతిథిగ ఆహ్వానింపుము. అపుడు నీసౌందర్యమును మరల పొందగలవు" అనెను. పిమ్మట మహర్షి ఆశ్రమమును విడచి హిమాలయములకు తపస్సుచేసుకొనుటకు పోయెను".

విశ్వామిత్రుడిట్లు వివరించి "రామా! ఆశ్రమములోనికి పోదమురమ్ము. నీవు గౌతముడు వాగ్దానము చేసినట్లు అహల్యకు విముక్తినొసగ వలయును" అని పలికెను. వారు ఆశ్రమములోనికి వెళ్ళిరి. శ్రీరాముడు ఆశ్రమమునందు పాదముమోపగనే శాపముతొలగి అహల్య ఆమె పూర్వపు సౌందర్యముతో వారియెదుట నిలబడెను. శ్రీరాముని ఎదుట ఆమెమబ్బు వీడిన చంద్రునివలె ప్రకాశించెను. శ్రీరామలక్ష్మణులు తపస్సుచేపవిత్రమైన గౌతముని భార్య పాదములను తాకిరి. ఆమె దివ్యమైన రాజకుమారులకు అతిథిసత్కారములతో స్వాగతము పలికెను. స్వర్గమునుండి పూలవానకురిసి అహల్య పాపప్రక్షాళననందిన దేవతవలె ప్రకాశించెను. అదేసమయమున గౌతముడు తన ఆశ్రమమునకు తిరిగివచ్చి పవిత్రమైన తన భార్యను స్వీకరించెను. ఇది విశ్వామిత్రునిచే వివరింపబడిన అహల్యయొక్క చరిత్ర.

శ్రీమద్రామాయణము

శ్రీసీతారామ కల్యాణము

జనకుని యాగము కొఱకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయ బడినవి. వేర్వేరు రాజ్యములనుండి అనేకమంది మునీశ్వరులును, బ్రాహ్మణులును మిథిలాపట్టణమునకు విచ్చేసిరి. విశ్వామిత్రుడు, రాజకుమారులును యధోచితముగ స్వాగత సత్కారములనందిరి. జనకుని కులగురువు శతానందుడును, జనక మహారాజును ముందు విశ్వామిత్రుని గౌరవించిరి. జనకమహారాజు విశ్వామిత్రుని రాకతో తనకు కలిగిన ఆనందమును ప్రకటించెను. శ్రీరామలక్ష్మణులను చూపుచు "మహర్షీ! ధనుర్ధారులై దివ్యతేజస్సుతో వెలుగొందు ఈ యువకులెవరు? వీరి తండ్రి ఎవరు? అని జనకుడు మహర్షిని ప్రశ్నించెను. వారు దశరధ మహారాజు పుత్రులని విశ్వామిత్రుడు జనకునకు చెప్పెను. వారు తనయాగ రక్షణము చేసిన విధమును వివరించెను. రాక్షససంహార మొనరించిన విధమును తెలిపెను. "నీభవనమునందున్న శివధనువును దర్శించుటకు ఇటకు వారువచ్చిరి" అనిపలికిన విశ్వామిత్రుని పలుకులను విని జనకుడు సంతోషించెను.

" శివధనువును దర్శించుటకు ఈరాజకుమారునికి స్వాగతము పలుకుచున్నాను. శివధనువునీతడు ఎక్కుపెట్టినయెడల నాకుమార్తె సీతను తనభార్యగ గెలుచుకొనును. ఎందరోరాజకుమారులు శివ ధనువును చూచి, కనీసము దానిని కదపలేక తిరిగిపోయిరి. శివధనువునెక్కుపెట్టుటయందీతడు గెలుపొందినచో సీతనితనికి

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

కన్యాదానము చేయుటకు సంతోషముగనంగీకరింతును" అని పలికి జనకుడు ఇనుపపేటికయందు భద్రపరుపబడిన శివధనువును తెమ్మని తన అనుచరులను ఆజ్ఞాపించెను. రథోత్సవమునందు రథమును తెచ్చిన విధముగ శివధనువు ఎనిమిది చక్రములు గల బండిపై తీసికొని రాబడినది. "మాపూర్వులు, నేనును పూజించుచున్న శివధనువు ఇదియే. శ్రీరాముడు దీనిని చూడవచ్చును" అని జనకుడు పలికెను. విశ్వామిత్రుని, జనకుని అనుమతితో శ్రీరాముడు సభయందలి అందరు చూచుచుండగా శివధనువుగల పేటికను సమీపించెను. ఇనుపపేటికను తెరచి అప్రయత్నముగ పూలదండవలె శివధనువును ఎత్తి నారిని బిగించి, ధనుష్టంకారము చేయబోవ పిడుగులు పడినంత ధ్వనితో శివధనుర్భంగమయ్యెను. స్వర్గమునుండి పూలవాన కురిసెను. "నాప్రియపుత్రికను శ్రీరామచంద్రునకిచ్చి వివాహము గావింతునని" జనకుడు ప్రకటించెను. "జనకమహారాజా! వేగవంతులగు నీదూతలను అయోధ్యకు పంపి, దశరథునకీ శుభవార్తను తెలిపి, ఆహ్వానింపుమని" విశ్వామిత్రుడు జనకునకు తెలిపెను. జనకుని దూతలు మూడురోజులలో అయోధ్యనుచేరిరి. దేవేంద్రునివలె తనసింహాసమున ఆశీనుడైన దశరథునకు దూతలు ఇట్లు నివేదించిరి. "విశ్వామిత్ర మహర్షియు, జనకమహారాజును మీకొక సంతోషకర వార్తను పంపిరి. మిథిలా నగరమునకు వచ్చిన మీకుమారుడు శ్రీరాముడు సీతాస్వయంవర మునకు పణముగ నిర్ణయించిన శివధనుర్భంగము గావించి సీతను గెలుచుకొనెను. జనకమహారాజు శ్రీసీతారాముల కల్యాణోత్సవమునకు

తమరాకకై నిరీక్షించుచు, మీబంధుమిత్రపరివారముతో మిధిలానగరము
నకు ఆహ్వానము పలుకుమని మమ్ము పంపినారు". వశిష్ఠ విశ్వామిత్ర
మహర్షులు అభయమిచ్చినను శ్రీరాముని విశ్వామిత్రుని వెంట
అర్ధాంగీకారముతో సంకోచముతోపంపిన దశరధమహారాజు ఈశుభ
వర్తమానమును వినినంతనే సంతోషముతో పులకించెను. ఈ
వర్తమానమును తనమంత్రులకు తెలిపి ప్రయాణసన్నాహము
లేర్పరుపమని మరుచటి దినముననే జనకుని రాజధానికి బయలుదేరెను.

దశరధుడు తన అనుచరులతో మిధిలానగరమును చేరగనే
అత్యంతాదరపూర్వక స్వాగతము లభించినది. మర్యాదలు అయిన
తరువాత జనకుడు దశరధునితో "మాయాగము వెంటనే పూర్తియగును.
యాగపరిసమాప్తి అయినవెంటనే వివాహము చేయుట మంచిదని
తలచుచున్నాను" అని దశరధుని అంగీకారము కోరెను. "మీరు వధువు
తండ్రిగ మీరుకోరినరీతిగ కార్యక్రమమును ఆజ్ఞాపించుకొనదగినవారు" అని
దశరధుడు జవాబిచ్చెను. నిర్ణీతమైన చైత్రశుద్ధ నవమిరోజు,
వివాహమహోత్సవ సమయమున జనకుడు సీతను రామునకు
కన్యాదానము చేయుచు "ఈమె నాకుమార్తె సీత. నీకు సహధర్మచారిణియై
నడచుకొనును. నీవీమెను పాణిగ్రహణము చేయుము. పతివ్రతయైన ఈమె
నీనీడవలె సర్వదానిన్ననుసరించును".

శ్లో|| "ఇయం సీతా మమసుతా, సహధర్మచారీ తవ
ప్రతీచ్ఛ చైనంభద్రంతే, పాణింగృహ్ణీష్వ పాణినా
పతివ్రతామహాభాగా ఛాయేవానుగతాసదా"

శ్రీమద్రామాయణము

ఈవిధముగ జనకుడు పలుకుచు సీతాదేవిని శ్రీరామచంద్రునకు కన్యాదానము చేసెను. శ్రీసీతారామకల్యాణ ఘట్టము చదివినవారికి, వినినవారికి, వ్రాసినవారికిని సర్వులకును ఆ సీతాసమేత శ్రీరామచంద్రుడు సకలశుభములు చేకూర్చి ఆయురారోగ్య ఐశ్వర్యాది సకలసంపదలనిచ్చి సుఖశాంతులను, సకల అభివృద్ధులను సమర్పించును.

శుభమ్.

శ్రీమద్రామాయణము

అయోధ్యానగరమున తనకు అప్పగింపబడిన దశరథరాజ కుమారులను, మిధిలానగరమున దశరథునకు విశ్వామిత్రుడు క్షేమముగ తిరిగి అప్పగించెను. శ్రీరామ వివాహ మహోత్సవములయిన తరువాత విశ్వామిత్రుడు దశరథజనకమహారాజుల వీడుకోలు తీసికొని హిమాలయ పర్వతమునకు వెళ్ళెను. దశరథ మహారాజు తన అనుయాయులతో అయోధ్యకు బయలుదేరెను. మార్గమధ్యమున అపశకునములు తోచగ దశరథుడు ఆతృతతో ఆయపశకునములేమి సూచించునని వశిష్ఠుని అడిగెను. వశిష్ఠుడు కంగారు పడునవసరము లేదనియు, ఆకాశము నందలి పక్షులు రాబోవు ఆపదను సూచించినను, నేలపైనున్న జంతువులు రాబోవు సంతసమును సూచించుచున్నవని పలికెను. దశరథ వశిష్ఠులు ఈవిధముగ మాటలాడుకొనుచుండగనే పెద్ద గాలివాన మొదలయ్యెను. చెట్లుసమూలము నేలకొరిగినవి. భూమిబ్రద్దలయ్యెను, భూపరాగము మేఘరూపమున ఆకాశమునకు రేగి సూర్యబింబమును కప్పివేసెను. అంతట చీకటులు క్రమ్ముకొనెను. అందఱును భయపడిరి.

క్షత్రియ వంశ శత్రువగు పరశురాముడు ఒకచేత పరుశువు చేతబూని, ధనుర్బాణములను ధరించి ప్రత్యక్షమయ్యెను. అతడు త్రిపురాసుర సంహార సమయమందలి రుద్రునిపోలి భయంకరముగ కనిపించుచుండెను. అతని ముఖము అగ్నిహోత్రమువలె ప్రకాశించు చున్నది. జమదగ్ని మహర్షి కుమారుడైన పరశురాముడు అనేక రాజ సముదాయములను నాశముచేసి క్షత్రియ భయంకరుడయ్యెను. అతడు వెళ్ళిన ప్రదేశమున భూకంపముతోకూడిన తుఫాను సంభవించెను.

క్షత్రియ వంశీయులందరు భయముతోవణకిరి. దశరధుని అనుచరులందలి బ్రాహ్మణులు పరస్పరము ఇట్లు అనుకొనుచుండిరి. "తనతండ్రి ఒకరాజుచే చంపబడిన కారణముగ పరశురాముడు క్షత్రియవంశ నిర్మూలనము గావింప ప్రతినబూనెను. అతని ఆగ్రహము తనచేసంహరింప బడిన క్షత్రియుల రక్తముతో చల్లారినదని తలచితిమి. తనదండయాత్రను మరల ప్రారంభించెనా?" అయినను ఆచారము ప్రకారమతనికి అతిధిమర్యాదలు అందించిరి.

అనంతరము పరశురాముడు స్వయముగ శ్రీరామునితోనిట్లు పలికెను. "దశరధరాజ కుమారా, రామా! నేను నీపరాక్రమము గురించి వినియుంటిని. జనకుని ఇంటగల శివధనుస్సును ఎక్కుపెట్టి దానిని విరిచితివని తెలిసిఆశ్చర్యపడితిని. నీవు విరిచిన శివధనుస్సును పోలిన నాధనువిదిగో. ఇదినాతండ్రికీయబడిన విష్ణుధనువు. దీనిని నీవు ఎక్కుపెట్టకల్గినచో నాతోయుద్ధమునకు సమర్ధుడవగుదువు". ఈసంఘటనకు దశరధుడు చలించిపోయి తనకుమారుడగు శ్రీరాముని క్షమింపుమని పరశురాముని కోరెను. "నీవు బ్రాహ్మణుడవు. నీపగతో తృప్తిచెందినవాడపై నీవు జయించిన భూమిని కశ్యపునకు దానమిచ్చి తపోదీక్షకు వెళ్ళియుంటివని వింటిమి. నీవ్రతదీక్షను భగ్నము చేసి మాప్రాణాధికుడును, నీపట్ల ఏనేరమును చేయనివాడును అగు పసిబాలుడైన మారాజ కుమారుని గాయపరచుటకు సిద్ధపడుట నీకు తగునా?" అనెను. పరశురాముడు దశరధుని పలుకులను వినియు బదులుపలుకక శ్రీరామునితో "విశ్వకర్మ ఒకేవిధమైన రెండు ధనువులు నిర్మించెను.

అందుఒకటి రుద్రునకు రెండవది విష్ణువునకు ఈయ బడినవి. ఇది విష్ణువునకీయ బడిన ధనువు. నీవువిరిచినదని చెప్పుకొనుచున్న ధనువు శివునిది. ఈవిష్ణుధనువును నీవు ఎక్కుపెట్టగలవేమో చూడుము. అట్లైన నీబలపరాక్రమములను గౌరవించి నీతో యుద్ధము చేయగలవాడను" అని గర్వముతో పెద్ద కంఠధ్వనితో పలికెను.

శ్రీరామచంద్రుడు మర్యాదాపురస్సరముగ దృఢమైన కంఠధ్వనితో పరశురామునకు సమాధానమిచ్చెను. "ఓజమదగ్ని కుమారా! నీతండ్రి ఒకక్షత్రియునిచే చంపబడిన కారణముగ నీవు ప్రతీకార కక్షపూరితుడ వైనావు. ఈ కారణముగ నిన్ను నేను నిందించను. ఇతరులను అణగ ద్రొక్కినట్లు నీవునన్ను అణచలేవు. దయయుంచి నీధనువునాకిమ్ము". ఇట్లు పలుకుచు శ్రీరాముడు పరశురాముని నుండి అతని ధనుర్బాణము లను స్వీకరించెను. అతడు ఆవిల్లునెక్కుపెట్టెను. ధనుస్సునందు బాణమును సంధించుచు చిరునవ్వు నవ్వుచు పరశురామునితోనిట్లు పలికెను. "శక్తివంతమైన ఈవైష్ణవ బాణము వింటి నారిపై మోపబడిన తరువాత వ్యర్థమగుటకు వీలులేదు. అది ఏదేని ఒకదానిని ధ్వంసముచేసి తీరవలెను. నీగమన శక్తిని ధ్వంసము చేయుమందువా? లేక నీతపః ఫలములను నాశమొనర్పుమందువా? చెప్పుము". దశరథ కుమారుడు రాముడు వైష్ణవ ధనువును ఎక్కుపెట్టినవెంటనే పరశురాముని తేజస్సు తరిగిపోయెను. అంతటితో పరశురామావతార అవసరము తీరిపోవుటచే విజయునిగకాక పరశురాముడు తనంతతానుగ లొంగిపోయిన ఋషిగ కనిపించెను. అయోద్యారాజకుమారునితో పరశురాముడు మృదువుగనిట్లు

పలికెను. "శ్రీరామా! నేను నీవెవరో గుర్తించితిని. నాదుర్మార్గమును అణచితివని నేను బాధపడుటలేదు. నాతపోబలమంతయు నీకు సంక్రమించుగాక. సూర్యాస్తమయ మగుటకు ముందే కశ్యపునకు నేను చేసిన వాగ్దానముప్రకారము నేను మహేంద్రగిరికి సత్వరగతిని వోవలసి యున్నది. నాగమనశక్తిని ఇందుకు వినియోగించు కొననిమ్ము. నాతపః ఫలములను నీవుధనువున తొడిగిన బాణముచే కొట్టబడుగాక". పరశురాముడిట్లు పలుకుచు శ్రీరామచంద్రుని చుట్టును ప్రదక్షిణముచేసి నిష్క్రమించెను.

అయోధ్యానగర పురజనులు దశరథుడును అతని రాజకుమారులును రాజధానికి తిరిగి వచ్చుచున్నారని విని మిక్కిలి సంతసించిరి. పట్టణమంతయు పూలతో నలంకరింపబడి దేవలోకమువలె ప్రకాశించెను. శ్రీరాముడును సీతయు అయోధ్యానగరమున పండ్రెండు సంవత్సరములు సుఖముగ నివసించిరి. రాముడు తనహృదయమును సీతకు స్వాధీనపరచెను. సీత రాముని అనురాగముతో సంతసించుచు స్వర్గమునందలి లక్ష్మీదేవివలె భాసించెను. చాలకాలముతరువాత సీతారాముల అరణ్యజీవితము ప్రారంభ మయినపుడు అత్రిమహర్షియొక్క భార్య అనసూయ రామునిపట్ల సీతకుగల అనురాగమును మెచ్చుకొనెను. "శ్రీరాముడు సంపూర్ణమైన జీవి. నాయందతనికిగల అనురాగముతో సమానముగ నాకు ఆయనయందనురాగముకలదు. అతని అనురాగము మార్పులేనిది. శ్రీరాముడు నిర్మల హృదయముతో ఇంద్రియములను వశపరచు కొనినవాడు" అని సీతాదేవి అనసూయకు సమాధనమిచ్చెను.

శ్రీమద్రామాయణము

అయోధ్యకాండ

శ్రీరామచంద్రుడును సీతయును అయోధ్యానగరమున పండ్రెండు సంవత్సరములు ఆనందముగ గడిపిరి. శ్రీరామచంద్రుని సౌందర్యమును, ధైర్యమును, హృదయ నైర్మల్యమును మృదుమధుర భాషణమును అతనిధీగుణములును జనులచే ప్రశంసింపబడినవి. రాముడు రాజ్యాభిషిక్తుడు కాగల సమయము కొరకు కుతూహలముతో ఎదురుచూచుచున్నట్లు అతని గుణగణములు ప్రకటితమైనవి. దశరధుడు జనుల మనోభావములను గ్రహించి చాలసంతోషించెను. తనవార్ధక్యమును పరిగణించి శ్రీరామచంద్రునికి యువరాజ పట్టాభిషిక్తుని చేసి రాజ్యపాలనా బాధ్యత నొసగవలెనని తలచెను. తనకోరికను మంత్రులకు తెలియజేయు టకు రాజసభను ఏర్పాటుచేసెను. ఋషీశ్వరులు, విజ్ఞానవంతులు, పట్టణ నాయకులు, పరిసర రాజ్యాధినేతలును రాజసభకు విచ్చేసిరి. అందరును ఉచితాసనములయందు ఆశీనులైన పిమ్మట దశరధుడు లేచి వారితోనిట్లు పలికెను. " నాపూర్వులవలెనే తల్లి బిడ్డను సంరక్షించినట్లు ఈరాజ్యమును రక్షించితిని. నాప్రజలకొరకు నేను నిర్విరామముగ కృషిచేసితిని. నేను ఇపుడు వృద్ధుడనైతిని. కావున నాపెద్ద కుమారుని యువరాజుగ చేసి నాబాధ్యతలనతనికి అప్పగింపదలచితిని. నాపూర్వుల సంప్రదాయము ననుసరించి నాశేషజీవితమును అరణ్యప్రాంతమున తపోదీక్షతో గడుప వలెనని తలచుచున్నాను. శ్రీరాముడు సంపూర్ణముగ రాజపదవికి అర్హుడు. ఆందోళనారహితముగ నేనీరాజ్యభారమును శ్రీరామునకు

అప్పగింపదలచితిని. దీనికి ఈసభ అంగీకరించునని తలతును". అతనిమేఘగర్జనను బోలిన కంఠధ్వని విశాల సభామంటపమంతటా వ్యాపించెను. అతని ముఖము రాజ తేజస్సుతో ప్రకాశించెను.

విశాలసభాభవనమంతటా కరతాళధ్వనులు చెలరేగెను. సభాస్థలి యందలి రాజకుమారులును ప్రసిద్ధులును ఏకగ్రీవముగా "అటులనే అగుగాక " అని పెద్దగా అరచిరి. మరల దశరథుడిట్లు పలికెను. "నాప్రతిపాదనను మీరు అంగీకరించిరి కాని కారణము తెలుపలేదు. ఇది తగదు. విజ్ఞులు తమ అంగీకారమునకు గల కారణము వివరింపవలెను". అపుడు చాలమంది వక్తలు శ్రీరాముని గుణగణములను రాజ్యార్హతను వివరించిరి. శ్రీరాముని ప్రశంసలు వినుటవలన దశరథుని హృదయ మానందముతో నిండినది. చివరకు సభాజనులందరును లేచి ఏకగ్రీవముగానిట్లు పలికిరి. " ఈవిషయము నందు ఆలసించవలదు. శ్రీరాముడు యువరాజుగ అభిషిక్తుడగుగాక". దశరథుడు తనయానంద మును ప్రకటించి వెంటనే జనులకోరికను నెరపేర్తునని పలికెను. అనంతరము వశిష్ఠ వామదేవాది మహర్షులను ఇతర పవిత్రజనులను ఉద్దేశించి "ఇది శుభప్రదమైన చైత్రమాసము. వనవృక్షములన్నియు పుష్పములతోనిండియున్నవి. పూజనీయులైన పెద్దలు శ్రీరాముని పట్టాభిషిక్తుని చేయుటకు తగిన ఏర్పాట్లన్నియు చేయింపుడు" అని పలికెను. దశరథుని ఆజ్ఞలను విని సభాజనులు సంతోషించిరి. ప్రభువుచే ఆజ్ఞాపింపబడిన సుమంత్రుడను మంత్రి శ్రీరాముని తీసికొనివచ్చుటకు వెళ్ళెను.

శ్రీమద్రామాయణము

ఈసంఘటనలు తెలియని శ్రీరాముడు వచ్చి తండ్రియెదుట నిలబడెను. తనను యువరాజుగ అభిషేకించు నిర్ణయమును విని వినయముతో తన అంగీకారమును తెలిపెను. "నీవు ఏమి ఆజ్ఞాపించినను శిరసావహించుట నాబాధ్యత" అని పలికెను. దశరథుడు శ్రీరాముని ఆశీర్వదించి ఇట్లు పలికెను. "నీవు ప్రజలందరి అనురాగమును పొందిన ఉత్తమ రాకుమారుడవు. నీకు గౌరవ మర్యాదలభివృద్ధి చెందగలవు". శ్రీరాముడు తన భవనమునకు తిరిగి వెళ్ళెను. శ్రీరాముడు తన నివాసమునకు వెళ్ళిన వెంటనే సుమంత్రుడు ఆతురతతో రాముని పిలచి తనతండ్రి తనను చూడగోరుచుండెనని తెలిపెను. కారణమడుగగా సుమంత్రుడు చెప్పలేకపోయెను. శ్రీరాముడు "తనపట్టాభిషేక ఉత్సవ విషయమున తనతండ్రి మంత్రులతో సమావేశమైయుండుననియు, ఆవిషయమునందు తనతండ్రికి ఏదైన కష్టము కలిగినదేమోననియు కాని ఏదిజరిగినను మంచిదే" అనియు తలచెను. శ్రీరాముడు ఏవిషయము నందును కుతూహలము చూపక తనధర్మముగా చూచెను. శ్రీరాముడు తనతండ్రి కోరికమేరకు రాజ్యభారమును స్వీకరించుటకును, విడిచి పెట్టుటకును సిద్ధపడి తండ్రికడకేగెను.

దశరథుడు శ్రీరామచంద్రుని కౌగలించుకొని తనసింహాసనము నందు తనప్రక్కన రాముని కూర్చుండబెట్టుకొని ఇట్లనెను. "నేను వృద్ధుడనైతిని. ఒకమానవునిగను ప్రభువుగను జీవితమునునుభవించితిని. నేనిపుడు చేయదగినదేదియును లేదు. మనపెద్దల రాజ్యసింహాసనమున నిన్ను నియమించుటయే నాకోరిక. గతరాత్రి నాకు దుస్స్వప్నములు

కలిగినవి. భవిష్యత్తు తెలిసిన విజ్ఞులు త్వరలో పెద్దదుఃఖముగాని మరణముగాని సంభవించునని సూచించిరి. కావున రేపే నీకు పట్టాభిషేకము చేయగోరుచున్నాను. జ్యోతిష్కులు రేపు అనుకూలమైన దినమని చెప్పుచున్నారు. వెంటనే పట్టాభిషేకము చేయవలెనని నాకనిపించుచున్నది. నీవును సీతయు ఈరాత్రి ఉపవాసముండి రేపటి పట్టాభిషేకమునకు సిద్ధపడవలెను. దర్భలు పరచిన నేలపై పరుండుము. అప్రమత్తులగు స్నేహితులను మీరక్షణకొరకు నియమింపుము. భరతుడు దూరస్థుడై యుండగనే నీపట్టాభిషేకమునకు తగినసమయమని తోచు చున్నది. భరతుడు శుద్ధాత్ముడనియు, నీయందు భక్తి కలవాడనియు నాకు తెలియనిదికాదు. కాని మానవుల మనసులు అనుకోని పరిణామ ములకు లొంగుస్వభావముకలవి". అందువలన శ్రీరామపట్టాభిషేకము మరుచటి రోజనేజరుగవలెనని దశరథుడు నిర్ణయించి తన నిర్ణయమును వశిష్ఠ మహర్షికి చెప్పెను. అకస్మాత్తుగా పట్టాభిషేక ముహూర్త నిర్ణయమునకు దశరథుని దుస్స్వప్నములే కారణభూతమయ్యెను.

శ్రీరాముడు తనతండ్రి కడ శలవు తీసికొని శుభవర్తమాన మును తల్లికి చెప్పి ఆమెదీవనలనందుటకై కౌసల్య మందిరమునకు వెళ్ళెను. కాని ఆరాణి అప్పటికే ఈశుభవర్త మానమును వినియుండెను. కౌసల్య సుమిత్ర. సీతాలక్ష్మణులతో కలసి దైవప్రార్థన చేయుచుండెను. శ్రీరాముడు తల్లికి దశరథుని ఆజ్ఞను తెలిపెను. "ఈవార్త నేను వినియుంటిని. దీర్ఘాయుష్మంతుడవై మంచిప్రభువువు కమ్ము. శత్రువులను జయించి ప్రజలను రక్షింపుము. నీవు నీతండ్రిని నన్నును

సంతోషపెట్టితివి" అని కౌసల్య పలికెను. శ్రీరాముడు తన తల్లికడ, సవతితల్లి కడ శలవు తీసికొని తనస్వంత భవనమునకేగెను. దశరధుని సూచనమేరకు వశిష్ఠుడు రాముని భవనమునకు వచ్చెను. శ్రీరాముడు సింహద్వారముకడ వశిష్ఠునికి స్వాగతము పలికెను. పట్టాభిషేకమునకు ముందురోజు చేయదగిన ఉపవాసమునకు తగు మంత్రములను రామునకు వశిష్ఠుడు ఉపదేశించెను. వశిష్ఠుడు దశరధునికడకు చేరునప్పటికి జనసమూహములు రాజవీధులందు చేరి రేపటి పట్టాభిషేకమును గురించి సంతోషముతో చర్చించుకొనుట చూచెను. భవనములు పూలతోడను పతాకములతోడను అలంకరింపబడుచున్నవి. జనసమూహముల మధ్యనుండి రాజభవనమును చేరుటకు వశిష్ఠునకు కష్టమయ్యెను. ఉత్సవముకొరకు ఉపవాసము ప్రారంభింపబడినదనియు, అన్ని ఏర్పాట్లు సిద్ధమగుచున్నవనియు విని దశరధుడు సంతసించెను. కాని అతని హృదయాంతరాళమందు అవాంఛనీయ సంఘటన జరుగునేమోయని భీతికలదు. పట్టణమంతయు ఆనందమయమైనది. ప్రతియింట ప్రతివీధియందు స్త్రీపురుషులు, పసిబిడ్డలు పట్టాభిషేకోత్సవము తమజీవితములో ఒకపవిత్రమైన సందర్భముగా తలచి కుతూహలముగా ఎదురు చూచుచుండిరి.

సీతారాములు వారినివాసమందు నారాయణుని స్మరించి అగ్నిహోత్రమున నేతిని హోమము చేసి మిగిలిననేతిని కొంచెముత్రాగి కుశలుపరుపబడిన నేలపై నిదురించిరి. మరుచటి ఉదయమున పెందలకడనే నిద్రమేల్కాంచి శుభప్రదమైన పిలుపుతో రాజభవనమునకు

వెళ్ళుటకు సంసిద్ధులైరి. కాని వారికి వచ్చిన పిలుపులు స్వభావ విరుద్ధముగాకనిపించినవి. దశరధుని మూడవ భార్య కైకేయికి మందర యను విశ్వాసపాత్రురాలైన పరిచారిక కలదు. దూరపుబంధుత్వము ఉండుటచే మహారాణితో ఆమె ఎక్కువచనువు కల్గియుండెడిది. దశరధుడు రాముని యువరాజుగ పట్టాభిషిక్తుని చేయనిశ్చయించుటకు రాజసభ నేర్పాటు చేసినరోజున మందర కైకయొక్క అంతఃపురస్త్రీలభవనముల పైభాగమున నిలబడి క్రిందకు పట్టణమును పరిశీలించుట సంభవించినది. పట్టణమంతయు కళ్ళాపులు జల్లి, అలంకరింపబడినట్లు చూచినది. భవనముల పైభాగమున పతాకములు ఎగురవేయబడినవి. జనులు నూతన వస్త్రములు, ఆభరణములు ధరించి పుష్పగంధాదులతో నలంకరించుకొని సంతోషముతో సంభాషించుకొనుచు గుంపులు గుంపులుగ తిరుగుట చూచినది. దేవాలయములందు మంగళ వాద్యములు మ్రోగినవి. మందర దీనికంతటకు కారణము తెలుసుకొన లేకపోయెను. రాజనిర్ణయమామెకు తెలియదు. ఏదో ఉత్సవము జరుగబోవుచున్నదని ఆమెఊహించెను. మందర ఒక పరిచారికను కలిసి యిట్లు ప్రశ్నించెను. "నీవు పట్టువస్త్రములు ధరించినావేల? పట్టణ మందేమిజరుగుచున్నది? కౌసల్య బ్రాహ్మణులకు బహుమతులిచ్చు చున్నట్లు తోచుచున్నది. ఆమె పొదుపరివనిత. కారణములేనిదే ఇట్లు చేయదు. నగరమంతట ఉత్సవదృశ్యములు, శబ్దములు తోచుచున్నవి. ఇదంతయు దేనికొరకోనీకు తెలియునా?" ఆబాలపరిచారిక సంతోషముతో నాట్యము చేయుచు సమాధానమిచ్చెను. "మన రామచంద్రుడు రేపు

ఉదయమున యువరాజ పట్టాభిషిక్తుడు కాబోవుచున్నాడని నీకు తెలియదా?" మందర క్రోధఘూర్ణితయయ్యెను. త్వరగ మేడమెట్లు దిగి కైకేయి భవనములోనికి ఆమె తిన్నగ ప్రవేశించెను. కైకేయి పానుపుపై విశ్రాంతిగొనుచుండెను. మందర ఇట్లనెను. "అవివేకురాలా! లెమ్ము లెమ్ము. దురదృష్టము వరదవలె వచ్చి నిన్ను ముంచి మ్రింగుటకు సిద్ధమగుచున్నది. నీసూర్యుడస్తమించుచున్నాడు. అమాయకురాలా! నిద్రించుటకిదా సమయము?" ఏదోవిపత్తు వచ్చినదని భయపడి కైకేయి "నీబాధాకారణమేమి? ఎందుకు కలవర పడుచున్నావు?" అని మందరనడిగెను.

తెలివిగల మందర ఇట్లు చెప్పనారంభించెను. "దశరధుడు శ్రీరామునకు యువరాజపట్టాభిషేకము చేయనిర్ణయించెను. ఇంతకంటె నీకును నాకును దుఃఖకారణ మేమికలదు? నీవు రాజవంశమునందు జన్మించి, రాజవంశమునందు కోడలివైతివి. సామాన్యస్త్రీవలె నీవు వంచింప బడితివి. తీయని మాటలతో నీభర్త నిన్ను వంచించెను. భరతుడు మేనమామగారింట దూరముగనున్నపుడే అదును చూచుకొని భరతుని పరోక్షమందు శ్రీరాముని పట్టాభిషిక్తుని రేపేచేయబోవుచున్నాడు. నిన్ను నమ్ముకొనిన అందరమును, నీవును నాశనమగుచుండగ పానుపుపై పరుండి విశ్రాంతిగొనుచున్నావు". కైక శ్రీరాముని పట్టాభిషేక వార్త వినగానే మిక్కిలి సంతోషించెను. ఆమెకు రాముని పట్ల మిక్కిలి వాత్సల్యము కలదు. "మందరా నీవు శుభవార్తను నాకు తెలిపితివి. నాకుమారుడు శ్రీరాముడు రేపు రాజ్యాభిషిక్తుడగుచున్నాడా?

ఎంతసంతోషము కలిగించితివి.ఇదిగో ఇది తీసికొనుము. నీకింకేమికావలెనో కోరుకొనుము" అనుచు తన కంఠాభరణమును తనకంఠమునుండి తీసి మందరకిచ్చెను. శుభవార్త తెలిపిన సేవకులకు బహుమతులిచ్చుట రాచమర్యాద.

కైకేయి నిర్మలమైన మనస్సు కలది. కపటాలోచనలకు తావులేనిది. గౌరవప్రదమైన తన వంశసాంప్రదాయానుసారము కుత్సిత భావములకు తావులేనిది. ఉత్తమ ఉదాత్త భావములు కలది. కైకేయి స్వభావము మందర దుఃఖమును పెంచినది. ఆమె తనకీయబడిన కంఠాభరణమును విసిరికొట్టినది. "ఓ మూర్ఖురాలా! సర్వనాశనమయి పోయినను సంతోషముతోనవ్వుచున్నావు. నీవు రాబోవు దురదృష్ట మును చూడలేకున్నావు. నీశత్రువు రాముని తల్లి అతనిని రాజును చేయుచుండగ నీవు సంతోషముతో గెంతుచున్నావు. రాముడు పరిపాలకుడు కాగా భరతుని స్థితి ఏమి? రాముడు భరతుని భయంకర శత్రువుగ చూడడా? రాముడు మానవ ప్రవృత్తి తెలిసినవాడు. భరతుడు జీవించుట తనరాజ్య పదవికి భయకారణమని తలచి అతనిని సంహరింప తలచును. కావున భరతుని ప్రాణములకు రక్షణ లేదు. కౌసల్య రేపటినుండి మహదానందము పొందును. నీవు ఆమెకు బానిసపై వినయముగ చేతులు కట్టుకొని ఆమెముందు నిలువబడవలెను. నీకుమారుడు కూడ రామునకు సేవకుడే అగును". కైకేయి మందర మాటలను విని "మందర ఎందుకు భయపడుచున్నది? రాముడు ధర్మపరుడైనవాడని ఆమెకు తెలియదా?" అని తలచి మందరతోనిట్లనెను.

"మందరా! రాముని నిజాయితీ, మానవత్వము నీకు తెలియవా? రాముడు పెద్దకుమారుడు. కావున రాజ్యపదవికతడే అర్హుడు. భరతుడు అతని తరువాత రాజగును. దీనిలోతప్పేమి? రాముడు నాకెంత ప్రేమపాత్రుడో నీకు తెలుసు. తన తల్లికంటె మిన్నగ నన్ను జాగ్రత్తగ చూచుకొనును. భరతుని తన ప్రాణముకంటె మిన్నగ తలచును. రాముని వలన నీవు భయపడునదంతయు సత్యము కాదు".

"అయ్యో! నీవెంత అమాయకురాలివి. శ్రీరాముడు రాజైనపిమ్మట, అనంతరమతని కుమారుడే రాజగుగాని, భరతుడు, అతని సంతానమునకు అర్హతయుండదన్న విషయము కూడ నీకు తెలియదు. రాముడు రాజైన పిమ్మట భరతుని ప్రాణమునకు రక్షణలేదు. మేనమామ యింటకూడ అతనికి క్షేమము కలుగదు. కావున దూరముగనెచ్చటైనను తలదాచుకొనదగును. నీవు దశరధుని ప్రేమాస్పదురాలవగుటచే కౌసల్య నీపై కక్షబూని ప్రతీకారము తీర్చుకొనును. కావున ఆలోచించి నిర్ణయించుకొనుము. భరతుడు రాజ్యాభిషిక్తుడు కావలెను. శ్రీరాముడు రాజ్య బహిష్కృతుడు కావలెను" అని మందర బోధించెను. కేకయరాజ పుత్రిమనస్సును భయమావరించినది. మందర గెలిచినది.

దశరధ మహారాజునకు పెద్దభార్యలిరువురకును సంతానము కలుగక పోవుటచే కైకేయిని వివాహమాడునపుడు కైకేయి తండ్రి " కైకకు కల్గిన పుత్రునకు రాజ్యపదవి నీయవలెనని " వాగ్దానము పొందెను. సంతానరహితుడైన దశరధుడట్టి వాగ్దానమిచ్చుట సహజము. కైకేయిని వివాహము చేసికొనినను దశరధునకు సంతానము కలుగలేదు. అనేక

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

సంవత్సరములు గడచిన తర్వాతపుత్రకామేష్ఠిచేసిన ఫలితముగ ముగ్గురు భార్యలు సంతానవతులయిరి. వారియందు పెద్దవాడైన రాముడు సర్వ విధముల రాజ్యార్హత కలవాడు. ప్రజాదరణ పొందినవాడు. అట్టి శ్రీరాముని రాజ్యాభిషిక్తుని చేయక, భరతుని ఎట్లు అభిషిక్తుని చేయగలడు? అంతేకాక కైకకాని భరతుడుకాని పూర్వవాగ్దానమును నెరవేర్చుమని కోరలేదెన్నడును. కావున రాముని రాజును చేయువిషయమున ఎట్టి అభ్యంతరము కైకేయి వలన భరతునివలన ఉండవని దశరధుడు తలచెను. భరతుడును కైకేయియు సహజముగ ఉత్తమ స్వభావులే. కాని కైక మందరచే కలుషీకృతహృదయ అయినది. శ్రీరామచంద్రుని తన స్వంత బిడ్డవలె ఆదరించిన కైకేయి మందర దుర్బోధలకు లొంగి కర్తవ్యతా మూఢురాలై మందరను సలహా అడిగెను. "మందరా! మనమిప్పుడేమి చేయవలెను? నేను కౌసల్యకు దాసిని కావలసినదేనా? భరతుడు పట్టాభిషిక్తుడు కావలెను. రాముడు అరణ్యమునకు పంపబడవలెను. కాని ఇట్లు జరుగుటకు మనమేమిచేయవలెను? చెప్పుము. నీవు తెలివిగల దానివి. మనసంకల్పసిద్ధికి మార్గమునెరుగుదువు".

"కైకేయీ! ఇది నిజమైన వింత. ఇది సాధించుటకు నేను నీకు సలహా నీయవలెనా? నీవు నిజముగ మరచితివా? లేక నటించుచుంటివా? కాని నీవుకోరినచో చెప్పుదును వినుము." అని మందర పలికెను. కైకేయి అసహనముతో మందరను తొందర పెట్టెను. "మంచిది. వినుము. నీభర్త దశరధుడు చాలకాలము క్రిందట శంబరాసురునితో యుద్ధము చేయుటకు ఇంద్రుని కోరికమేరకు వెళ్ళి

యుద్ధరంగమున గాయపడి బాహ్యస్మృతిని కోల్పోయినాడు. అపుడు నీవు నేర్పుతో అతని రధమును రణభూమినుండి మరలించి శరీరమందలి బాణములను తొలగించి రక్షించితివి. మరచితివా? అపుడు దశరధుడు కృతజ్ఞతతో నీకుకావలసిన రెండు వరములనిత్తుననెను. "నాకు ఇప్పుడు ఏమియు అవసరములేదు. ఆవరములను తరువాత కోరుకొందును ". అనిన నీతో నీకెపుడు కావలసినపుడా వరములనిత్తునని నీభర్త వాగ్దానము చేసినాడు. ఈసంగతి నీవే నాకు తెలిపితివి. నీవు మరచిన ఆవరములను కోరుకొను సమయమిపుడు వచ్చినది. శ్రీరాముని బదులు భరతుడు రాజ్యాభిషిక్తుడు కావలెననియు, రాముడు పదునాలుగేండ్లు వనవాసమునకేగవలెననియు రెండు వరములను కోరుము."

"ఈవరములను కోరుటకు పాపమని తలచి భయపడకుము. ఇపుడేపోయి కోపగృహమున నేలపై పరుండుము. నీవస్త్రాభరణములను పారవైచి పాతచీరను ధరించి నేలపై పవ్వళింపుము. నీభర్త వచ్చినపుడు అతనితో మాటలాడకుము. కనీసమతనిని చూడకుము. నీభర్త నిన్ను ప్రసన్నురాలిని గావించుటకు చేయు ప్రయత్నములకు లొంగకుము. అపుడే నీకోరికలను వెల్లడించి నీకిచ్చినవాగ్దానమును నిలుపుకొనుమని కోరుము."

మందర సలహావిని ఆమె తెలివిని మెచ్చుకొనిన కైక సంతోషముతో గంతులు వేసెను. మందర సలహాను అనుసరింతునని మందరకు మాటయిచ్చి, ఆమె చెప్పినట్లే కోపగృహమునకేగెను. విలువైన వస్త్రాభరణముల విసిరికొట్టి నేలపై పవ్వళించెను. దశరధుడు సభను

ముగించి, విశ్రాంతి కొరకు కైకేయి గృహమున ప్రవేశించి ఆమెకు రామపట్టాభిషేకవార్త తెలిపి ఆరాత్రి ఆమెతో ప్రసంగములతో సంతోషముగా గడుపవలెనని తలచెను. గృహద్వారమున తనకొఱకు ఎల్లపుడు ఎదురుచూచి ఆదరముతో కౌగలించుకొని స్వాగతము పలుకు తన ప్రియతమమైన భార్య ఈనాడు ఎచ్చటను కనుగొనబడలేదు. తనతో దాగుడు మూతలాడుచున్నదని తలచి ఆమెకొఱకంతట వెదకినను ఆమె కానరాలేదు. అపుడు దశరధుడు తన భార్యను గురించి ఒకపరిచారికనడుగగ "ప్రభూ! రాణిగారుకోపముగ లోపలి గదుల యందున్నారు" అని జవాబిచ్చెను. దశరధుడు ఆగదిలో ప్రవేశించి అలంకారరహితయై కేశాలంకరణ రహితయై నేలపై పడియున్న భార్యను చూచి ఆశ్చర్యపడెను. నిష్కపటమైన దశరధుడు ఆమెకోపకారణము తెలియక నేలపై కైకేయి ప్రక్కనేకూర్చుండి, ఆమె చెదిరిన జుట్టును సవరించుచు , దువ్వుచు అనురాగపూరిత వచనములతో ఆమెను ఓదార్చుటకు ప్రయత్నించెను. "నీకేమైనది? అనారోగ్యము కలిగినదా? ఏదైన నొప్పిగలదా? వైద్యులను వెంటనే రప్పింతును. వారునీబాధను నివారింతురు భయపడకుము." ఈమాటను విని కైక మాటాడలేదు. "మన భవనమున ఎవరైన నేరస్థుడు అనుచితముగ ప్రవర్తించెనా? చెప్పుము. నేనతనిని శిక్షింతును. నీవు కోరినవస్తువేదైనను నీకిచ్చుటయందు నేను నిర్లక్ష్యము చేసితినా? చెప్పుము". ఈవిధముగ ఆమె కలతకుకారణమును అడిగెను. కైక సమాధానమీయలేదు. "నేనేనేరస్థునైనను శిక్షింపవలెనా? ఎవరిశిక్షనైనను తప్పింపవలెనా?

నీకేమికావలెనో కోరుకొనుము తప్పకనెరవేర్తును" అని ప్రశ్నింపగ కైకేయి లేచికూర్చుండెను. రాజు సంతోషించెను.

"నన్నెవరును అగౌరవపరుపలేదు. నాకొఱకు నీవుచేయ గల్గినది, తప్పక చేయవలసినది ఒకటిఉన్నది. నాకోరికను నెరవేర్తునని వాగ్దానము చేయుము. అప్పుడు నేను నాకోరికను వెల్లడింతును" అని కైక దశరథునితో పలికెను. ఈ మాటలు వినుటతోడనే ఆవృద్ధమహారాజు సంతోషించెను. సర్వాధికారి తానగుటచే ఆమెకోరిక ఏదైనను నెరవేర్ప గలనను ధైర్యముతో సంతోషముతో " మంచిది కైకేయీ! నీకోరికను తెలుపుము. అది తప్పకజరుగును. నాభార్యలందు అత్యంత ప్రేమాస్పదు రాలవైన నీపై ప్రమాణము చేయుచున్నాను. పురుషులందు ప్రియతము డైన నారామునిపై ప్రమాణము చేయుచున్నాను. నీవేదికోరినను నెరవేర్తు నని వాగ్దానము చేయుచున్నాను ". శ్రీరామునిపై ప్రమాణము చేసిన తరువాత దశరథుడు మాటతప్పడని కైకకు పూర్తి విశ్వాసము కల్గినది. "రామునిపై ఒట్టుపెట్టుకొని మరియొకమారు నాకోరిక నెరవేర్తునని ప్రమాణము చేయుము" అని కైక కోరగ దశరథుడట్లే రామునిపై ప్రమాణము చేసెను.

కైక నిటారుగ నిలబడి నలుదిక్కులకు ప్రదక్షిణపూర్వకముగ తిరుగుచు "ఓదేవతలారా! ఓపంచభూతములారా! సూర్యచంద్రాది గ్రహము లారా! నాభర్త నాకుచేసిన వాగ్దానమునకు మీరు సాక్షులుగనుండుడు" అనుచు గంభీర ధ్వనితో పలికెను. దశరథుడు సంతోషముతో చూచు చుండెను. కైక ధైర్యముగ నిట్లు పలికెను. "ఓమహారాజా! చాలకాలము

క్రిందట యుద్ధభూమియందునీవు మరణింపబోవు పరిస్థితి ఏర్పడినపుడు నీరథమును రణమునుండి మరలించి , నీదేహమందలి బాణములను తొలగించి , నీకు సౌఖ్యమును కలిగించినపుడు నీవు సంతోషముతోనాకు రెండువరములనిత్తుననగా, నేను ప్రస్తుతము వరములవసరము లేదనియు నీవుజీవించియుండుటయే సంతోషకరమనియు అవసర మైనపుడు ఆవరములను కోరుదుననియు పలికితిని. నీకు జ్ఞాపకమున్నదా?

"ఔను జ్ఞాపకమున్నది. నీరెండువరములను అడుగుము. నీవిపుడు వానిని పొందగలవు" అని దశరథుడు జవాబిచ్చెను. "నీవు శ్రీరామునిపై ప్రమాణముచేసితివి. దేవతలు, పంచభూతములు సాక్షులుగనున్నారు. నీపూర్వులెవ్వరును ఆడినమాట తప్పలేదు. నీవును మాటనిలుపుకొని మీవంశగౌరవమును నిలుపుము. ఇపుడు చేయబడిన ఏర్పాట్లతో భరతుని రాజ్యాభిషిక్తుని చేయుము. ఇదినామొదటికోరిక. శ్రీరాముని దండకారణ్యమున పదునాల్గు సంవత్సరములు నివసింపపంపుము. ఇదిరెండవకోరిక. నీవాగ్దానమును భంగపరుపకుము" అని కైక కోరెను. దశరథుడు పిడుగుపాటునకు గురి అయినట్లయ్యెను. మనస్సు మొద్దుబారిపోగా ఇది కలయా? నిజమా? అను సందేహములో పడెను. ఇది వాస్తవమని నమ్మలేకపోవుచున్నాను అనుకొనుచు నిలబడలేక కనులు మూతబడిపోవుచుండగ స్మృతి తప్పెను. కొంతసేపటికి కనులుతెరచి కైకను చూచి పులిని చూచిన

మగలేడివలె వణికిపోయెను. లేచికూర్చుండి నేలపై అటునిటు దొర్లెను. మరల మూర్ఛపోయెను.

చాలసేపయిన తరువాత ఇంద్రియములు స్వాధీనమగుటచే క్రోధముతోఇట్లు అరచెను. "ఓసీ! దుర్మార్గపు రాక్షసీ! శ్రీరాముడు నీకేమి అపకారము చేసెను? అతడు నిన్ను తనకన్న తల్లివలె చూడలేదా? నీవు ఆడదానివని తలచితిని. ఇపుడు నామరణము కోరి తెచ్చి నాఒడియందు పెట్టుకొనిన విషసర్పమువలె నాకుతోచుచున్నావు ". కైకేయి చలనము లేకుండ మౌనముగనుండెను. "జనులందరు ప్రేమించి, మెచ్చుకొను శ్రీరాముని ఏనెపముతో బహిష్కరించగలను? కౌసల్యాసుమిత్రలను విడిచియుండగలను, శ్రీరాముని విడిచిపెట్టికొనినచో నేను జీవింపలేను. నీరు, సూర్యరశ్మి లేకపోయినను జీవింపగలనేమోకాని రాముడు లేనిదే జీవింపలేను. ఈపాపపుటాలోచనను నీమనస్సునుండి తరిమివేయుము. నీపాదములకు వంగి నమస్కరించి నిన్ను బతిమాలుకొందును. నీకిరువురు కుమారులు ప్రేమాస్పదులు కలరనియు అందు పెద్దవాడు రాముడనియు చాలసార్లు చెప్పియుండలేదా? శ్రీరాముని పట్టాభిషిక్తుని చేయనిర్ణయించుటలో నేచేసిన నేరమేమి? ఈక్రూరమైన వరముల నీవేలకోరితివి? ఇవినిజముగ నీఅభిప్రాయములు కావు. నన్ను పరీక్షించుచున్నావు. మహాపాపముతో మన రాజవంశ ప్రతిష్ఠను నాశము చేయకుము".

ఇప్పుడుకూడా కైకేయి ఏమియుమాటాడలేదు. కాని ఆమెకనులు మాత్రము క్రోధముతో మండుచున్నవి. కైక ఇంతకు

పూర్వము దశరధునకు ఎట్టివిచారము కలుగజేయలేదనియు, రాముని తనకన్న కుమారుడు భరతునికంటె అధికముగ భావించెడిదనియు, అట్టిరాముని క్రూరమృగములతోనిండిన అరణ్యవాసమునకు పంపకోరుట కైకకు కలిగిన ఆలోచనకాదనియు, ఎవరోకైకమనస్సును కలుషితమొనర్చి రనియు, ప్రజలందర చేతను స్తుతింపబడు గుణగణ సమన్వితుడగు రాముని అరణ్యవాసమునకు తాను ఆజ్ఞాపింప లేదనియు, దయతలచి రామారణ్యవాస నియమమును తప్ప మరియొక వరమేదియైనను కోరుకొని మరణావస్థకు సమీపించుచున్న తనను కనికరింపుమనియు, దశరధుడు కైకను పరిపరి విధముల వేడుకొనెను. శోకసముద్రమున దశరధుడు బాధపడుచుండగా కైక కఠినముగనిట్లనెను. "సత్యధర్మముల గురించి మాటలాడు నీవు వాగ్దానము చేసిన వరములను ఎట్లు కాదనగలవు? వాగ్దానమును నిలుపుకొనలేని నీవు ఇతరరాజుల ముఖముల నెట్లుచూడగలవు? నీపూర్వులమార్గముననుసరించి వాగ్దానమును నిలబెట్టుకొనుము. లేనిచోనేను విషమును త్రాగి నీకనుల ఎదుటనేమరణింతును" అని తన తుది నిర్ణయమును కైక తెలిపెను. కైక ప్రకటనను విని దశరధుడు నోట మాట రాక "ఆమెతన భార్యయా? రాక్షసియా?" అని తలచుచు పరశువుచే నరుకబడిన మహావృక్షమువలె మూర్ఛనంది నేలపైపడెను. తెలివి వచ్చినతరువాత "రాముని నేను అరణ్యమునకు పొమ్మని ఆజ్ఞాపించిన అతడు శిరసావహించును కాని నేను, కౌసల్య, సుమిత్ర మరణింతుము. భరతుడు రాజ్యాభిషిక్తుడగుటకు అంగీకరింపడు. విధవవైన నీవు రాజ్యమునునుభవింపుము" అని

నిందాపూర్వకముగ పలికియు, పరిపరి విధముల కైకను మనసుమార్చుకొనుమని దశరధుడు ప్రాధేయపడెను.

ఆరాత్రియంతయు కైకేయి, దశరధులకు వాగ్వివాదము జరిగినది. కైక మనసు మార్చుకొనలేదు. తెల్లవారుజామున రాముని కబురంపి అరణ్యవాసమునకు ఆజ్ఞాపింపుమనియు, రాజ్యము భరతునకు చెందవలసినదనియు, కాలయాపన చేయవలదనియు కఠినముగ పలికెను. ధర్మబద్ధుడైన దశరధుడు "శ్రీరాముని ముఖమును చూచుచు మరణింతుననియు నీవుకోరినరీతిగ జరుగుగాకయనియు" పలికి మూర్చితుడయ్యెను. దశరధుడు తనకుమారునియెడల అనురాగము, కైకకిచ్చినమాట నిలుపుకొను నీతికి నడుమ మిక్కిలి నలిగిపోయెను. శ్రీరాముడు తనకు ప్రజాభిమానముండుటచే తండ్రియైన తన ఆజ్ఞనుల్లంఘించి రాజ్యాభిషిక్తుడైన బాగుండునని దశరధుడాశపడెను. శ్రీరాముడు పితృవాక్య పరిపాలకుడు. దశరధుడు తనమరణము సమీపించినదని తలచెను. ఈసందర్భమున తానుయువకునిగ ఉండగ ఒక మునికుమారుని చంపి, అతని ముసలి తల్లిదండ్రులకు సంతాపము కలిగించిన సంగతి జ్ఞప్తికివచ్చి ఆపాపము తనకుమారునకు తనకు ఎడబాటుకల్గించుచున్నదని తలచెను. తనక్రూరమైన భార్యకిచ్చిన వాగ్దానమును నెరవేర్చుట తప్ప తనకు గత్యంతరము లేదని తలచి, జరుగవలసిన కార్యక్రమము నాజ్ఞాపించు పని కైకకు దశరధుడు విడిచిపెట్టెను.

అరుణోదయమయ్యెను. పట్టాభిషేకమునకు నిర్ణయించిన సమయము సమీపించుచున్నది. వశిష్ఠుడును అతని శిష్యులును పవిత్రనదీజల పూరితమైన సువర్ణపాత్రలతో ఊరేగింపుగ రాజభవనము కడకు వచ్చుచుండిరి. రాజవీధులు అలంకరింపబడి స్త్రీపురుషుల గుంపులతో క్రిక్కిరిసియున్నవి. వశిష్ఠుని, అతని శిష్యుల ఊరేగింపును చూచి సంతోషించిరి. మంగళవాద్యములతో తేనె, పెరుగు, వెన్న, కుశలు, పువ్వులు, పుణ్యస్త్రీలు, ఏనుగులు, రథములు, గుఱ్ఱములు, శ్వేతాతపత్రము, వృషభములను మున్నగు మంగళద్రవ్యములను చూచి ఆనందోత్సాహములతో జనులు కేరింతలుకొట్టిరి. వశిష్ఠుడు రాజభవన ద్వారమును సమీపించి సుమంత్రునితో అన్నిఏర్పాట్లు సిద్ధముగ నున్నవనియు, ప్రజలందరు రాజుకొఱకు నిరీక్షించుచున్నా రనియు దశరథునకు తెలుపుమని చెప్పెను. సుమంత్రుడు రాజగారి పడకగదిని సమీపించి "మహారాజా! రాత్రి గడచినది. వశిష్ఠమహర్షితోపాటు పెద్దలు, పురజనులు అందరు మీదర్శనార్థము వేచియున్నారు. నిద్రమేల్కొంచుడు. మీఆజ్ఞకై అందరు నిరీక్షించుచున్నారు." అని చెప్పెను. ఆసమయమున దశరథుడు వేదనతో మాటాడలేకయుండెను. కాని కైక "సుమంత్రా! రాజుగారు రాత్రి రాముని పట్టాభిషేకము గురించి మాట్లాడుచు గడిపిరి. కావున ఇపుడు కునుకు పట్టినది. నీవు వెంటనే వెళ్ళి రాముని తీసికొనిరమ్ము" అని గంభీరముగ పలికెను.

సుమంత్రుడు శ్రీరాముని భవనమునకు వెళ్ళెను. సీతా రాములు పట్టాభిషేకమునకు సిద్ధపడుచున్నారు. దశరథుడు, కైకేయి

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

రాముని రాకను కోరుచున్నారని తెలిపెను. రాముడు తొందరపడెను. ఊహింపని ఆలస్యములు సందేహములను రేపినవిగాని ఎవరును దానిగురించి మాటాడు ధైర్యము చేయలేదు. "నగర వీధులు అలంకరింపబడినవి. ముహూర్తము సమీపించినది. ఈఆలస్యమెందులకు" అని ప్రజలు ఆశ్చర్యపడిరి. సుమంత్రుడు రాజమార్గమున జనసమూహ ములనదిలించి తప్పించుచు శ్రీరాముని వెంట కైకేయి మందిరము చేరెను. కైకేయిమందిరమున కాలుమోపిన శ్రీరాముడు ఆగదిలో తనతండ్రి కటికనేలపై పడియుండుట చూచి చాల ఆశ్చర్యపడెను. మహారాజు ఏదో విచారముతో పడియుండెనని రాముడు గ్రహించెను. రాముడు దశరధుని పాదములకు, కైకేయి పాదములకు నమస్కరించెను. దశరధుడు నెమ్మదిగ రాముని పేరునుచ్చరించి ఏమియు మాటాడలేక ఊరకుండెను. తన తండ్రి ఆస్థితియందుండుటకు కారణము రాముడూహింప లేకపోయెను. శ్రీరాముడు కైకతో "అమ్మా! నాతో మధురముగ మాట్లాడు తండ్రి మాటలాడకపోవుటకు నేను చేసిన అపరాధమేమి. ఆయనకేమైన అనారోగ్యము కల్గినదా? నేనీసందేహమును భరింపలేకున్నాను. ఏమి జరిగినదో చెప్పుము" అనెను. కైక అవకాశమును గ్రహించి రామునితో నిట్లనెను "ఆయనకు ఎవరిపట్ల కోపములేదు. అనారోగ్యమేమియు లేదు. కాని ఆయనమనసునందలి మాటలను నీకు చెప్పుటకు భయపడుచున్నాడు. అందుచే మౌనముగనుండెను. ఒకానొకప్పుడు నాచర్యలతోసంతోషించిన ప్రభువు నాకు రెండు వరములిచ్చినాడు. ఇపుడు అనాగరికునివలె పశ్చాత్తాపపడుచున్నాడు. ఆయన వాగ్దానమును

నెరవేర్చుటకు నీకు శక్తి కలదు. కాని ఆయన నీకీవిషయమును చెప్పుటకే భయపడుచున్నాడు. నీవు తండ్రియొక్క వాగ్దానమును నెరవేర్చుటకు నీసహాయము నీతండ్రికందింతునని వాగ్దానమును చేసినయెడల ఆవిషయమును నేను నీకు చెప్పెదను".

శ్రీరాముడు చాల విచారించి, "అమ్మా! నాతండ్రి బాధలకు నేనాకారణము? నాతండ్రి నన్ను అగ్నిలోదూకమనినను, సముద్రమున దూకమనినను, విషము త్రాగుమన్నను నేను సిద్ధమే. నాతండ్రియొక్క వాగ్దానమును నిలుపుటకు నేను సిద్ధమేనని నీకు ప్రమాణము చేయుచున్నాను" అనెను. "రామా! నీతండ్రి దేవదానవ సంగ్రామమున శంబరాసురునితో యుద్ధమునందు గాయపడినపుడు ఆయనప్రాణ రక్షణ చేసిన నాపట్ల కృతజ్ఞతతో నీతండ్రి నాకిత్తునన్న రెండు వరములను నేనిపుడు కోరియుంటిని. భరతుడు యువరాజపట్టాభిషిక్తుడు కావలె ననియు, నీవు పదునాలుగు సంవత్సరములు దండకారణ్యమున అరణ్యవాసము చేయవలెననియు కోరితిని. నీవు ఆయన వాగ్దానమును నిర్వర్తించుటకు ప్రమాణము చేసియున్నావు. ఈరోజే అరణ్యవాసమున కేగవలయును" అని కైక పలికెను. కైకయొక్క క్రూరమైన మాటలకు దశరధుడు బాధతో మెలికలు తిరిగెను. శ్రీరాముడు నిర్విచారముగ చిరునవ్వు నవ్వుచు "అటులనే మాతండ్రియొక్క వాగ్దానమును నెరవేరునట్లు చేయుదును. జటావల్కలములు ధరించి నేడే అరణ్యవాసమునకేగుదును" అని పలికెను. "నాతండ్రి నాకీమాటలు చెప్పుటకు వెనుకాడినందుకు నాకు బాధగనున్నది. తానే ఈవిషయము

నాకు స్వయముగ ఆజ్ఞాపించిన సంతోషించెడివాడను" అని రాముడు పలుకగా "నీతండ్రితో పలుకవలెనని నీవు ఆలసింపకుము" అని కైక పలికెను. రాముడు తన తండ్రి పాదములకు వందనమొనర్చెను. గదినుండి వేగముగ బయలుదేరెను. బయట నిలిచియున్న లక్ష్మణుడు జరిగినది గ్రహించి క్రోధముతో ఎఱ్ఱబడిన కనులతో రాముని అనుసరించెను. శ్రీరాముడు పట్టాభిషేకముకొఱకు తీసికొనిరాబడిన పవిత్రజలపూరిత సువర్ణపాత్రలకు ప్రదక్షిణమాచరించి గుమిగూడిన ప్రజాసమూహమును ఇండ్లకుపొండని సలహా ఇచ్చెను. శ్రీరాముడు ఈవార్తను తనతల్లి కౌసల్యకుచెప్పి ఆమెఆశీస్సులు పొంది అరణ్యావాసమునకేగుటకు నిశ్చయించెను. ఈ చరిత్రను చదివినవారందరకు శ్రీరామచంద్రుని అనుగ్రహము కలుగును.

శ్రీరాముడు కౌసల్య భవనమునకు వెళ్ళెను. చాలమంది జనులు ఉత్సాహముతో పట్టాభిషేకోత్సవమును తిలకింప ఎదురుచూచుచుండిరి. కౌసల్యాదేవి లోపలిగృహమునందు అగ్నిహోత్రముముందు కూర్చుండి తనకుమారునకు దీవెనలందించుటకు హోమము చేయుచున్నది. శ్రీరాముడు లోనికి రాగానే రాజుకాబోవుచున్న తనకుమారుని కౌగలించుకొని తన ఆనందమును ప్రకటించెను. "అమ్మా! నేనిపుడు రాజసింహాసనమునకు అందుబాటులోలేను. తండ్రిగారు రాజ్యపదవిని భరతునకీయతలచుచున్నారు. నేను దండకారణ్యమున పదునాలుగేండ్లు గడుపవలెనని ఆయన ఆజ్ఞ. నేను ఈరోజే బయలుదేరవలసియున్నది. వెళ్ళుటకుముందు నీఆశీస్సులకొఱకు నేనిపుడు వచ్చియుంటిని" అని

రాముడు పలికెను. ఈవార్తవినగానే కౌసల్య విచారముతో నేలకొరిగెను. రామలక్ష్మణులు ఆమెను లేపిరి. "నాహృదయము పాషాణనిర్మితమేమో నేనింకను జీవించియున్నాను" అనుచుఆమె దుఃఖించెను.

"తన పడుచు భార్యకు లోబడి ఈ ముసలిరాజు తన ఇంద్రియజ్ఞానమును పోగొట్టుకొనెను. ఈయన రాజుగ తగడు. భార్యమాట విని రాజెట్లుధర్మమును విడువగలడు? శత్రువులుకూడ నిన్ను చూచినమాత్రమున ప్రేమింతురు. కాని మనసుచలించిన ఈముసలితండ్రి నిన్ను వనవాసమునకు పంపుచున్నాడు. సోదరా! మనమిద్దరము రాజునుతరిమి, ఈరాజ్యమును స్వాధీనపరచుకొందము. ఎవరు మనల నెదిరించగలరు? నన్నాజ్ఞాపింపుము నేనొక్కడినే ఈపని చేయగలను" అని లక్ష్మణుడు పలుకుచుండగా కౌసల్య "రామా! లక్ష్మణుని మాటలను గురించి ఆలోచింపుము. నీవు అరణ్యమునకు పోవలదు. నీవు వెళ్ళినచో శత్రువులనడుమ నేను ఒంటరిగ ఉండలేను. నేనును నీతో వత్తును" అనెను.

శ్రీరాముడు "అమ్మా! నాతోపాటు అరణ్యమునకు ఎవ్వరును వచ్చు ప్రసంగములేదు. వృద్ధాప్యమందు విచారముతోనున్న భర్తకు సేవచేయుట, అతని దుఃఖమును పంచుకొనుట నీకర్తవ్యము. నా అరణ్యవాస సమయము పూర్తికాగానే నేను తిరిగివత్తును. నాతండ్రి మాటను చెల్లించుట నాకర్తవ్యము" అని పలికెను. " లక్ష్మణా! నీ ప్రతిపాదనలు తప్పు. నీకు నాపట్లగల ప్రేమ, శత్రువుల నశింపజేయగల నీబలము నేనెరుగుదును. కాని తండ్రిమాటను చెల్లించుట మన

కర్తవ్యము" అని లక్ష్మణుని క్రోధమునుపశమింపజేయ ప్రయత్నించెను. "లక్ష్మణా! మనకు జన్మనిచ్చిన తండ్రి ఏకారణము చేతనైననేమి ఒక వాగ్దానము చేసినాడు. ఆయనమాట చెల్లునట్లుచేయుట మనకర్తవ్యము. ఆయనకు మనశ్శాంతి కల్గించుటయే మనబాధ్యత. కనుకనీవు క్రోధమును విడువుము. సోదరా! రాజ్యసంపదలగురించి ఆలోచించి విచారింపకుము. అరణ్యవాస జీవితమేనాకు మిక్కిలి సంతోషకరము" అనుచు లక్ష్మణుని శాంతింపజేసెను. "ఇట్లగుట విధివిహితము. ఎవరిని నిందించరాదు. విచారింపతగదని" రాముడు లక్ష్మణుని సముదాయించెను. లక్ష్మణుడు కొంతసేపు మౌనము వహించి "ఇది విధికృతమా? అధర్మమును జయించి ధర్మమును స్థాపించుట క్షత్రియ ధర్మము. దేశమంతట రామపట్టాభి షేకము గురించి ప్రకటింపబడి, దానిబదులు అరణ్యవాసము ఆజ్ఞాపింప బడగ విధివిహితమని శిరసావహించుట నాయకలక్షణమా? నేను విధినెదిరించి నిన్ను రాజుగచూడవలెను. నీవు అరణ్యవాసమునకు పోవలెననిన రాజ్యపాలనానంతరము నీ కుమారులకాబాధ్యతనప్పగించి అనంతరము మన పూర్వుల ఆచారము ప్రకారము అపుడరణ్య వాసమునకు వెళ్ళుట ధర్మము. ఈధనుర్బాణములు అలంకారార్థమా? నన్నాజ్ఞాపించి నాపరాక్రమమును పరీక్షించుము" అని పలుకుచున్న లక్ష్మణునితో శ్రీరాముడు "మన తల్లిదండ్రులు జీవించినంతకాలము వారిఆజ్ఞలను శిరసావహించుట మనకర్తవ్యము. తల్లిదండ్రులనవమానించి రాజ్యపదవిని పొందుటలో సంతోషమేమి కలదు?" అనుచు లక్ష్మణుని కనులు తుడిచి శాంతపరచెను.

పురజనులకు రాజభవనాంతర్భాగములందేమి జరిగినదో ఇప్పటికిని తెలియలేదు. శ్రీరాముడు పట్టణమును విడిచివెళ్ళుటకు ముందు కౌసల్య దీవనలను పొందుటకు ఆమెకడకు వెళ్ళెను. "నీవు అయోధ్యను విడిచివెళ్ళిన తర్వాతనేనిచట ఎట్లుండగలను? నాకునీతో అరణ్యమునకు వచ్చుట మంచిది" అని కౌసల్య మరలరామునితోననెను. తనభర్తకు వార్ధక్యమునందు అతనికి సేవచేయుటయు, అతని విచారమునందు భాగస్వామినియగుటయు తనబాధ్యతలని ఆమెకు తెలుసు. కాని ఆమె మనసు దుఃఖముతో కలతచెందియున్నది. శ్రీరాముని వచనముల విని "నీతండ్రి నిర్ణయించినట్లే వెళ్ళి క్షేమముగ తిరిగిరమ్ము" అని కన్నీటి తోడనే దీవించెను. రాముడు చిరునవ్వు నవ్వుచు "పదునాలుగు సంవత్సరములు త్వరగ గడిచిపోయి మరల నన్ను నీవు చూడగలవు" అని సముదాయించెను. సుమంత్రుని పిలుపుతో రాముడు ఒంటరిగ రాజకడకేగెను. సీత సమస్త రాజచిహ్నములతో రాముడు తిరిగి వచ్చునని ఎదురు చూచుచుండెను. కాని ఇపుడు రాముడు రాజచిహ్నములు లేకుండ ఒంటరిగ వచ్చెను. రాముడు "తనను దశరధుడు అరణ్యవాసమునకు వెళ్ళమనెనను వార్త సీతకు చెప్పుట ఎట్లని" ఆలోచించుచుండెను. తన భర్త మనసు బాధతో నిండియున్నదని గ్రహించిన సీత "మీరు క్రొత్తగ కనిపించుచున్నారు, ఏమిటి సంగతి?" అని అడిగెను. శ్రీరాముడు జరిగిన వృత్తాంతము సీతకు క్లుప్తముగ చెప్పి "ప్రియమైన ఓ రాజకుమారీ! నన్ను విడిచి నీవిచట నివసించుట వలన కల్గు దుఃఖమును నేను ఊహింపగలను. జనకరాజకుమార్తెకు తన

విధినిర్వహణ యందు నాఉపదేశము అవసరములేదు. దశరథ మహారాజుకు, నీతల్లులనుబోలిన ముగ్గురు రాణులకు సుఖావహముగ నుండుము. ఈభవనమునగల ఇతరరాజకన్యలకంటె ఎక్కువ గౌరవమునాశింపవలదు. ప్రభువుకాబోవు భరతునిపట్ల గౌరవభావమును కల్గియుండుము. నాపరోక్షమునందు నాపట్ల నీకుగల అనురాగము ఏమాత్రము తగ్గదని నావిశ్వాసము. పదునాల్గు సంవత్సరములు పూర్తికాగానే అరణ్యమునుండి మరలివత్తును. అంతవరకు ఆచారముగ వచ్చు వైదికాది కార్యక్రమములను నిర్లక్ష్యము చేయకుము. విచార పూరితయైన కౌసల్యకు నీపరిరక్షణ అవసరము. నాకుప్రేమాస్పదులైన భరతశత్రుఘ్నులను నీసోదరులవలె పరిరక్షింపవలెను. నేనీరోజే అరణ్యమునకు వెళ్ళవలసియున్నది. నీమనస్సును ప్రశాంతముగ నుంచుకొనుము" అని ఉద్బోధించెను.

ఊహింపని రామునిపలుకులను సీత వినగానేరామునిపట్ల ఆమెఅనురాగము కోపముగ ప్రత్యక్షమయ్యెను. రాముడు నివాసశూన్యుడై దుర్గమమైన అరణ్యముల తిరుగుచుండగ తానుభవనములో సుఖముగ నుండుటయా? అనుకొనుచు సీత ఇట్లు పలికెను. "ఓ ధర్మవేత్తా!చక్కని ఉపన్యాసమిచ్చితివి. ఒక భార్య తనభర్తను విడిచియుండవలెననియు, అతనిబాధ్యత ఆమెకు లేదనియు, అతని బాధలలో పాలుపంచుకొనరా దనియు ఒకకొత్త సిద్ధాంతము వినుచుంటిని. దీనిని నేను ఎన్నడు అంగీకరించను. నీ అదృష్టములునావని నమ్మితిని. శ్రీరాముడు అడవికి వెళ్ళవలసియున్నచో ఆతనిలో సగభాగమైన సీతకు కూడ ఆయాజ్ఞ

వర్తించును. నేను అరణ్యమార్గములందు నీముందు నడచి ముళ్ళను, రాళ్ళను తప్పించి నీకు మార్గము మృదువుగనుండునట్లు చేయుదును. నన్ను మూర్ఖపు పట్టుదలగలదానిగ తలపకుము. నాతల్లిదండ్రులు నాకు ధర్మోపదేశ మిచ్చిరి. వారుచెప్పిన వాక్యములకు నీవు చెప్పినమాటలు పూర్తివిరుద్ధముగనున్నవి. నీవెక్కడకు వెళ్ళిన అక్కడకువెళ్ళుటయే నాపని. ఈరోజు నీవు అరణ్యమునకు వెళ్ళవలసి యున్నచో నేనును వత్తును. ఇందు చర్చింపదగినది ఏమియు లేదు. నేను అరణ్యవాస మును భరింపలేనని తలపకుము. నాప్రక్కననీవుండగ అదినాకు ఆనందకరమైన పవిత్ర దివసము. నీకునేనేవిధమైన కష్టమును కలిగింపను. నీవలెనే నేనును పండ్లను, దుంపలను తిందును. మనము నడుచునపుడు నేను వెనుకపడను. నేను చాలాకాలముగ నీతోపాటు అరణ్యములకు వెళ్ళి నదీపర్వత ప్రాంతములను చూచి ఆనందింపవలెనని కోరికగలిగి యుంటిని. పక్షులను పూలను చూచుచు నదులయందు స్నానమాచరించి నిత్యకృత్యములను చేయుచు ఆనందముగ కాలమును గడుపగలను. నీవులేకుండ స్వర్గమైనను నాకవసరములేదు. నన్నిచట విడిచినచో నేను తప్పక మరణింతును. నన్ను నీతోతీసికొనిపొమ్మని ప్రార్థించుచున్నాను. నాయందు దయయుంచుము. ఇపుడునన్ను విడిచి పెట్టకుము". కోపముతో ప్రారంభమైన ఆమె ప్రసంగము వెక్కిళ్ళతో సమాప్తిచెందెను.

శ్రీరాముడు ఆమె తలచినట్లు అరణ్యవాసము సులభ మైనది కాదనియు, అందలి అపాయములు, కష్టములు తెలియపరచి,

మరల ఆమెతనను అనుసరింపతగదని పలికెను. సీతకనులు నీటితోనిండినవి. పులులు, సింహములు, ఎలుగుబంట్లు, పాములు, ఏవియు నాదగ్గరకురాలేవు. నిన్ను చూడగనే అవి మనదగ్గర నుండి పారిపోవును. ఎండ, వాన, గాలి, ఆకలిదప్పులు, ముండ్లపొదలు, నీవుచెప్పినవన్నియు సంతోషముగ సహింతును. వీనిగురించి నాకు భయములేదు. నీవునన్నిచట విడిచి వెళ్ళినచో నాప్రాణములు పోవుట తథ్యము. నేను మిథిలానగరముననుండగా జ్యోతిష్కులు, బ్రాహ్మణోత్త ములు నేనుకొంతకాలము అరణ్యవాసము చేయవలసియుండునని నాతల్లికి చెప్పిరి. నేను వారి భవిష్యద్వచనమును ఒంటరిగ నెరవేర్చగలనా? నీ సాహచర్యమునందు అరణ్యమును ఉద్యానవన నివాసముగ మలచుకొనుటకు అవకాశము లభించినది. అరణ్యవాస మెవరికి సంతోషరహితమైనది? ఇంద్రియములను నియంత్రించుకొనలేని స్త్రీపురుషులకు మాత్రమే. నీవును నేను ఇంద్రియనియమమున నిపుణులము. నీనుండి నన్ను దూరము చేయవలదని వేడుకొనుచున్నాను."

సీత వేడికోలు వినినతర్వాత, సీతారాములు పరస్పర బద్ధానురాగులగుట చేతను, సీత రక్షణ విషయమున రామునకు తనసామర్థ్యమునందు విశ్వాసముండుట చేతను అరణ్యవాసమునకు సీత రాముని అనుసరించుటకు నిర్ణయింపబడినది. సీతపేదలను పిలిపించి తనకుగల సంపదలను వారికి దానముచేసి అరణ్యవాసమునకు తనను తాను సిద్ధపరచు కొనెను. లక్ష్మణుడు కూడ అగ్రజునితో అరణ్యమునకు

పోయి, అతనికి సేవచేయ నిశ్చయించుకొనెను. రాముడు అంగీకరింప వలసివచ్చెను. ముగ్గురును ముసలిప్రభువునకు వీడుకోలు తెలుపుటకు వెళ్ళిరి. రాజవీధులందు, భవనోపరిభాగములందు ప్రజాతండములు చూచుచున్నవి. భూమియందత్యంత ధనహీనులవలె పాదచారులై నడచు చున్న సీతారామలక్ష్మణులను భవనోపరిభాగములనుండి, కిటికీలనుండి స్త్రీపురుషులు చూచిరి. అంతులేని విచారముతో ప్రజలు పరస్పరమిట్లు మాటాడుకొనిరి. "ఉత్తముడైన రాజకుమారుని అరణ్యమునకు పంపు చున్న ఈయన ఎట్టి ప్రభువు? రథారూఢయై పయనింపదగిన రాకుమారి కాలినడకన నడుచుచున్నది. అరణ్యమున ఎండ, వానలను ఆమె భరింప గలదా? ఇది విపరీతము. మనముకూడ అరణ్యమునకు పోవలెను. అందరము కలసి ఈరాజకుమారులతో అడవికిపోవుదము. ఏఅరణ్యమున రాముడు నివసించునో అదేమన అయోధ్య. మనగృహములు పాడుబడు గాక! పాడుబడిన అయోధ్యను కైకను పాలించుకొననిండు. వన్యమృగము లిచట నివసించుగాక! ఈపట్టణము అడవియగును. అరణ్యము అయోధ్య యగును". ఈప్రజావాక్యములను శ్రీరాముడు వినియు లక్ష్యపెట్టలేదు.

కైకభవన ద్వారముకడ ఒకమూల విచారముతో కూర్చుండిన సుమంత్రుని రాముడు చూచెను. "సుమంత్రా! మేము ముగ్గురము ప్రభువును చూచుటకు వచ్చితిమి. వారిదర్శనమునకు మాకు అనుమతిని కోరుము" అని రాముడు మృదువుగా మాటలాడెను. సుమంత్రుడు ప్రభువునకు తెలుపుటకు వెళ్ళెను. గ్రహణము పట్టిన సూర్యునివలె, ఎండిపోయిన సరోవరమువలె దశరథుడు నేలపై

పడియుండెను. అతనితేజస్సు తరిగియుండెను. సుమంత్రుడు వణకు చున్న కంఠధ్వనితో "రాజకుమారుడు తనకుగల సంపదలను బ్రాహ్మణోత్తములకు దానము చేసి, దండకారణ్యమునకు బయలుదేరుటకు ముందు మీఆశీస్సులు పొందుటకు ద్వారముకడ వేచియున్నాడు" అని చెప్పెను. దశరథుడు రాముని రాకకు అనుమతించెను. శ్రీరాముడు వచ్చి దూరమునుండియే దశరథునకు వంగి నమస్కరించెను. శ్రీరాముని చూచినవెంటనే దశరథుడు పైకిలేచి అతనిని కౌగలించుకొనుటకు చేతులుచాచి కొడుకు సమీపింపకుండగనే మూర్ఛిల్లెను. రామలక్ష్మణులు మృదువుగ లేపి దశరథుని పానుపుపై కూర్చుండ పెట్టిరి. "ప్రభూ! అరణ్యమునకు వెళ్ళుటకు నీఅనుజ్ఞకై వచ్చితిమి. వైదేహియు, లక్ష్మణుడును నాతో వచ్చుచున్నారు. నీఆశీస్సులను, బయలుదేరుటకు నీఅనుజ్ఞను కోరుచున్నాము" అని రాముడు పలికెను. "రామా! నేను కైకకిచ్చిన వరములచే బంధింపబడితిని కాని నీవట్లు బంధింపబడలేదు. నీవు బలాత్కారముగ నన్ను ప్రక్కకు గెంటి రాజ్యమును ఏల స్వాధీన పరచుకొనవు?" అని దశరథుడు ప్రస్తుత సమస్యకు తనమనస్సునందు గల ఒకేఒక పరిష్కారమార్గమును వెల్లడించెను.

"తండ్రీ! నాకు రాజ్యముపట్ల కోరికలేదు. నీవు మరొకవేయి సంవత్సరములు పరిపాలింతువుగాక! నామనస్సు అరణ్యమునకు వెళ్ళుటకు నిశ్చితమైయున్నది. నీఆశీస్సులందుకొని వెళ్ళుటకు సిద్ధముగ నున్నాను. పదునాలుగు సంవత్సరములు గడిచిన పిమ్మట తిరిగివత్తును" అని రాముడు పలికెను.

"కుమారా! మన వంశ ప్రభువులకు ఖ్యాతిని తీసికొని రమ్ము. ఏ హానియు లేకుండ తిరిగిరమ్ము. అపాయము నీమార్గమునుండి పారిపోవుగాక! ధర్మమును విడువకుము. నీనిర్ణయము దృఢమైనది మార్పులేనిది. కాని ఈరోజు వెళ్ళవలదు. ఈ రోజు రాత్రి నాతో గడుపుము. నీరూపముతోనాకనులు నిండనిమ్ము. తెల్లవారుజామున వెళుదువుగాని. నివురుగప్పిన నిప్పువలెనున్న కైకేయిమనసున ఉన్నదేమో తెలిసికొన లేక ఆమెకు వాగ్దానము చేసితిని. నేను నిస్సహాయముగ ఆమెవలలో చిక్కుకొంటిని. నీవు "నాతండ్రి వాగ్దానము చెల్లింతును. నాతండ్రిపేరును అవమానింపబడనీయను. నేను రాజ్యమును విడిచి అడవికి పోవుదును" అందువు. ప్రపంచమున నీవంటి కుమారుడెచట కనుగొనబడును? ఇంత పెద్దదోషమును నేను ఊహింపలేదని ప్రమాణము చేయుచున్నాను " అని దశరధుడు దీనముగ పలికెను. తన చివరి క్షణముననైనను రాముని దృష్టియందు తన గౌరవమును పోగొట్టుకొనకుండ మరణించుట దశరధుని కోరిక.

"తండ్రీ! భరతునికి కబురు పంపి నీవు కైకకిచ్చిన వాగ్దానమును నిలుపుకొనుము. నాపట్ల నేరము చేసితినని తలచి బాధపడకుము. సింహాసనము పట్లనాకు కోరికలేదు. శోక సంకోచములు లేకుండ భరతుని రాజ్యాభిషిక్తుని చేసి నీఆశీస్సులందింపుము. కనుల నీరు చిందించకుము. సముద్రము ఇంకిపోవునా? ఓ తండ్రీ! అట్లే నీవును నీమనస్థైర్యమును విడువకుము. నీవిచ్చిన మాటను చెల్లించుటయే నా అభిమతము. నీమాట అసత్యమైన తర్వాత నాకు ప్రపంచసంపద

యంతయు లభించినను సంతోషము కలుగదు. నేను నాఅరణ్యవాస కాలమును సంతోషముగ గడుపుదును తండ్రీ నీవే నాదైవము. దైవమే నన్ను అరణ్యమునకు పంపెనని తలతును. పదునాల్గు సంవత్సరములు పూర్తి కాగానే నీవు నన్ను మరల చూతువు. విచారింపకుము. నేను రాత్రికిచట నిలిచి రేపు వెళ్ళుట వలన ఏమిలాభము? వాయిదా వేయుట వలన అనివార్యమైన దుఃఖములు సంతోషజనకము కానేరవు" అని రాముడు పలికెను.

మంచిది "సుమంత్రా! సైనికాధికారులను కబురంపి రాముని వెంట అరణ్యమునకు వెళ్ళుటకు రధ గజ తురగ పదాతులను సిద్ధము చేయుడని ఆజ్ఞాపింపుము. సైన్యముతో సహా అరణ్యమున ఋషులతో నివసించుటకు రామునకు అవసరమైన సామగ్రిఅంతయు పంపుము. ధనమునకు, వస్తువులకు, సేవకులకు కొఱతలేకుండ చూడుము" అని దశరధుడు సుమంత్రునితో పలికెను. అమాయకుడగు దశరధుడు రాముని అరణ్య నివాసము నిమిత్తము నియమించబడిన దేశ బహిష్కరణను దైనందిన జీవితమునకు మార్పును కలిగించు ఆనందకర మైన రాజకీయ పర్యటనగ చేయవలెనని ఊహించెను.

దశరధుడిట్లు పలుకగనే కైకముఖము క్రోధముతో వివర్ణమయ్యెను. ఆమె దశరధునిపట్ల మండిపడుచు వణకుచున్న కంఠధ్వనితోనిట్లు పలికెను. "నిజముగ మంచి ఔదార్యముగల అధిపతివి. దప్పికతో చనిపోవుచున్న మానవునకు పరిహాసార్ధము నిర్జలపాత్రనిచ్చు విధముగ నీవు రాజ్యమునందలి అన్ని సంపదలను పిండిన తరువాత

భరతునకు ఇత్తువు. ఎడారిగ చేయబడిన రాజ్యమును పరిపాలించుచు నాకుమారుడు ఏమి సంతోషమును, శోభను కలిగియుండును?" భరింపరాని బరువుతో అణచబడిన మానవుని క్రూరత్వముతో పొడిచినట్లు దశరధుడు అవమానముతో అసహాయుడై నిట్టూర్చెను. క్రోధపూరిత వాక్కులు చుట్టునున్న వారినోట పెల్లుబికినను నిశ్శబ్దముగ బాధపడిరి. ఈసారెలు తనవెంట తీసికొని వెళ్ళుటకు తనకిష్టము లేదని చెప్పుచు శ్రీరాముడు నేరప్రత్యారోపణలకు అంతము పలికెను.

"గౌరవనీయ మహారాజా! అరణ్యనివాసమునకేగుచున్న నాకు ఈ రాజ సైన్యములు సంభారములవలన ఉపయోగమేమి? సంతోషముగ సింహాసనమును పరిత్యజించిన తరువాత ఈ ప్రతిబంధకములవలన నాకేమి ప్రయోజనము? తండ్రీ! నేను సంతోషముగ రాజ్యపదవియందు నాకుగల హక్కును, దానికి సంబంధించిన సంగతులన్నిటి తోడను భరతునికి అతనితల్లికి విడిచిపెట్టితిని. అరణ్యవాసము చేయునట్టి పదునాల్గు సంవత్సరములును ఋషీశ్వరులు ధరించు వృక్షసంబంధమైన నారచీరలు, పార, బుట్టలు మినహాయించి మరేమియు కోరను. నాకు అవసరములేదు". శ్రీరాముడు ఈవాక్యములు పలికిన వెంటనే కైక తాను సిద్ధపరచియుంచిన అరణ్యక వస్త్రములను తెమ్మని తొందరపెట్టి సిగ్గులేకుండా తానే స్వయముగ రామునకిచ్చెను. అక్కడే అపుడే రాముడు ఆదుస్తులను ధరించెను. ఆ దుస్తులలో రాముడు ఋషీశ్వరుని వలె వెలుగొందెను. లక్ష్మణుడుకూడ అరణ్యక వస్త్రములను ధరించెను. దశరధుడు నిస్సహాయముగ చూచుచుండెను. అనంతరము కైక సీతకు

కూడ అరణ్యకవస్త్రములను తెప్పించెను. సీత వానిని స్వీకరించి అట్టిదుస్తులను ఎన్నడును ధరింపకపోవుట చేతను, వానిని ధరించు పద్ధతినెరుగక పోవుటచేతను దిగ్భ్రమచెంది నిలువబడెను. దివ్యతేజస్సుతో వెలుగొందుచున్న శ్రీరాముని సమీపించి సీతసిగ్గుపడుచు "దీనిని ధరించుట ఎట్లో చెప్పుము" అనెను. శ్రీరాముడు ఆదుస్తులను తీసికొని సీతకు చుట్టబెట్టి ఆమె భుజముపై ఒక ముడి వేయగానే, అచట చూచుచున్న స్త్రీలందరు గట్టిగ ఏడ్చిరి. దశరధుడు మూర్ఛిల్లెను. దశరధుడు స్పృహలోనికి వచ్చిన పిమ్మట కైకను గట్టిగ నిందించెను. కాని కైక తిరస్కారపూర్వకముగ చిరునవ్వు నవ్వెను. సీత అరణ్యమునకు పోవుటయందు కైక బాధ్యురాలుకాదు. ఆరాజకుమారి తన భర్తతోపాటు అరణ్యమునకు వెళ్ళుటయందలి ఆనందమును కోరి భర్తచే మళ్ళింపబడలేదు.

శ్రీరాముడు కనులు దించుకొని "తండ్రీ! పుత్రవిహీన, వృద్ధురాలైన నాతల్లి కౌసల్యనిచట విడుచుచున్నాను. ఇది ఆమెకు మృత్యుతుల్యమైనను నీకొఱకు నీదుఃఖము నందు పాలుపంచుకొనుటకు ఆమె నివసించుచున్నది. ఎవరిపట్ల కరుణారహితమైన ఆలోచనలకు తావిచ్చుటకు ఆమె అసమర్ధురాలు. ఆమె ఇంతకు ముందెన్నడును ఇంత తీక్షణమైన వేదననునుభవించలేదు. నేనిచటలేని సమయమందు ఆమెపట్ల దయకలిగి యుండుము. నాదేశబహిష్కరణ సమయానంతరము ఆమె పాదములకు నమస్కరించుటకు నేను తిరిగివచ్చినపుడు శోకముతోఆమె మరణించినట్లు నాకు వినిపింపకుడు". తన తల్లి దుఃఖమును భరింపలేని

స్థితిలో శ్రీరాముడిట్లు పలికెను. శ్రీరాముడిట్లు పలుకుచుండగ దశరథుడు ఆదృశ్యమును చూడలేక తనచేతులతో ముఖమును కప్పుకొనెను. శ్రీరాముడు తన తండ్రిసమక్షమును విడిచినతరువాత వృద్ధాప్యముచే కొట్టబడిన ఆరాజు మాటలాడలేని దుఃఖముతో సాగిలపడెను. బలము పుంజుకొనినపుడు మైమరపునందే సణుగుకొనుచుండెను. "ప్రేమాస్పదులైన హృదయములకునేను గతజన్మమునందు తప్పక బాధకలిగించియుందును. లేగదూడలను తమ తల్లులనుండియు, బిడ్డలను తలిదండ్రులనుండియు, భర్తలను భార్యలనుండియు విడదీసియుందును. లేనిచో నేనింత బాధనెందుకనుభవింతును? మనము కోరినపుడు మరణము రాదు. నా దైవసముడగు కుమారుడు తన జన్మహక్కునుండి తరుమబడి నారవస్త్రములు ధరించిన దృశ్యము నామనోనేత్రములతో చూచి ఎల్లపుడు ఆబాధను నేను భరింపవలసియున్నది. రాముడు రాజ్యబహిష్కృతుడై వెళ్ళెను. కానినేను మరణించలేదు. రామా.... రామా.....నన్నువిడిచి వెళ్ళితివా!".

కొంతసమయము తర్వాత "సుమంత్రా! రథమును సిద్ధముచేసి నాకుమారులను, జానకిని రాజ్యసరిహద్దులవరకు తీసికొని వెళ్ళుము" అని దశరథుడు పలికెను. లక్ష్మణుడు అతని తల్లి సుమిత్రపాదములు స్పృశించి, "అమ్మా" అనిఒక్కమాట పలికెను. ఆమె కుమారుని కౌగలించుకొని అతని శిరస్సు ముద్దిడుకొని "నీ అగ్రజుని పట్ల నీకు గలభక్తి నీతల్లి మనసును గర్వముతోడను, సంతోషముతోడను నింపినది. బిడ్డా! రాముని రక్షించుట, సేవించుట నీకర్తవ్యము. అరణ్యమున ఎల్లవేళలా

రామునిప్రక్కనే జాగరూకుడవై యుండి రక్షింపుము. నీఅగ్రజుడే నీగురువు, ప్రభువు. అదేమన వంశధర్మము". నాదీవెనలతో వెళ్ళుము. లక్ష్మణా! శ్రీరాముని తండ్రిగను, సీతను నావలెను, అరణ్యమును అయోధ్యగను భావింపుము. ప్రియమైన కుమారా! సంతోషముగ వెళ్ళుము. భగవంతుడు నిన్ను ఆశీర్వదించుగాక!" అని సుమిత్ర పలికినది.

"ఓ రాజకుమారా! భగవంతుడు నిన్నాశీర్వదించును గాక! రథమును అధిరోహింపుడు. పదునాలుగు సంవత్సరముల సమయము ప్రారంభమయిన కారణముగ, నేనెచ్చటకు రథమును నడుపవలెనో నాకు చెప్పుము" అని సుమంత్రుడు పలికెను. సీత సంతోషముతో రథము నధిరోహించెను. కౌసల్య సీతకొఱకు వ్యక్తిగతావసరముల నిమిత్తము ఒకమూటను తయారు చేసెను. అన్నదమ్ములిరువురకొఱకు డాళ్ళు, ధనుర్బాణములు, ఇతర ఆయుధములు, గునపములు, బుట్టలు రథమునందుంచబడినవి. గునపములు, బుట్టలు అరణ్యమందవసరము. రామలక్ష్మణులు రథము నధిరోహించిరి. సుమంత్రుడు దానిని ముందునకు తోలెను. వీధులయందలి జనసమూహములు రథచోదకునితో "నెమ్మదిగపోనిమ్ము... నెమ్మదిగపోనిమ్ము... రాముని ముఖమును చూడనిమ్ము" అని అరచిరి.

"అయ్యో! అయ్యో! ఇటువంటి బిడ్డలను ఎవరు అడవికి పంపగలరు? వీరి తల్లులు ఈ విచారమును ఏ విధముగ సహింపగలరు? వైదేహి ముఖమువంక చూడుడు. నిజముగ ఆమె దీవింపబడినది. తాను భక్తితో సేవలందజేయుటకు తగిన అగ్రజుని కల్గియుండుటచే లక్ష్మణుడు

సంతోషించెను. రాముడు నిజముగా ధర్మజ్ఞుడైన నాయకుడు" అని పురజనులు రథమును అనుసరించుచు తమలోతాము మాటలాడుకొనిరి. శ్రీరాముడు రథ సారథితో "తొందరగపోనిమ్ము.... తొందరగపోనిమ్ము...." అనుచుండెను. జనులు "నెమ్మదిగ... నెమ్మదిగ...." అనుచున్నారు. జనసమూహము పెద్దదగుచున్నది. సుమంత్రుడు ఏదోవిధముగ దుఃఖించుచున్న నగరము బయటకు రథమును నడుపగలిగెను. ఆశోకధ్వనికి తోడు వీధులయందలి జనసమూహములు ఇండ్లయందలి మాతాశిశువులయొక్క రోదన ధ్వనులు అధికమయ్యెను. దశరధుడు కైక భవనమునుండి బయటకు వచ్చి వెళ్ళిపోవుచున్న రథమువంక చూచెను. చాలసేపు అతడచట నిలిచి పరిశీలించుచు ధూళి మేఘమును సాకారమైన తన ప్రియతమ కుమారుడు రాముని రూపమునొందినట్లు చూచెను. ఆదృశ్యము కూడ కనుమరుగైన తర్వాత దశరధుడు మూలుగుచు నేలపై పడెను. కౌసల్య కైక అతనికిరుపైపుల కూర్చుండిరి.

"పాపాత్మురాలా! నన్ను నీవు స్పృశింపకుము. నీదృష్టి నాకు అసహనకరము. నీకు నాకు నడుమ అన్నియు అంతరించినవి. నేనిపుడు ఇక్కడ నిన్ను పరిత్యజింతును. భరతుడు నీ ఏర్పాట్లకు అంగీకరించి రాజ్యమును స్వీకరించినచో అతడు నాఉత్తర క్రియలు చేయనవసరము లేదు. ఒకచో అతడు చేసినను నా ఆత్మ అతని తర్పణలను తిరస్కరించును" అని దశరధుడనెను. "రాముడు అడవియందు ఎట్లు నివసించ గలడు? ఒక రాయి గాని కట్టెదుంగ గాని తలగడగధరించి కటికనేలపై పరుండునా? అతడు పండ్లను, కాయలను తినునా?" ఈ విధముగ

దశరథుడు నిస్సహాయముగ శోకించుచునేయుండెను. ఒక్కొక్కమారు అతడు కైకవంక తిరిగి "నీ విజయముతో సంతోషముగ నుంటివా? అనాథపై సంతోషముతో చిరకాలము జీవింపుము" అనెను. భగ్న హృదయుడై శ్మశానము నుండి యింటికి తిరిగి వచ్చుచున్న వానివలె అతడు కైక భవనమును ప్రవేశించెను. హఠాత్తుగ అతడు "ఇక్కడ కాదు. నన్ను కౌసల్య గృహమునకు తీసికొనిపొండు" అనెను. వారు అట్లే దశరథుని కౌసల్య భవనమునకు తీసికొని వెళ్ళిరి. అతడచ్చట మృత్యువు కొఱకు ఎదురుచూచుచు పరుండెను. అర్ధరాత్రిసమయమున దశరథుడు "కౌసల్యా! ఇక్కడ ఉన్నావా? నీచేతితో నన్ను తాకుము. నాదృష్టి రామునితో పోయినది" అని పలికెను. కౌసల్య తనభర్తయగు దశరథునకు వీలైనంత సౌఖ్యము చేకూర్చెను. కాని గాయపడిన హృదయముతోనున్న ఆమె ఏసుఖమును ఈయగలదు? దుఃఖభారముతో గంటలు నెమ్మదిగా గడచుచొలది చల్లని రాత్రి తనను కబళించు అగ్నిజ్వాలగను, చంద్రుడు మధ్యాహ్నసూర్యుని వలెను ఆమెకు తోచెను.

ఆవిధముగ దుఃఖించుచున్న కౌసల్యతో సుమిత్ర ఇట్లనెను. "సోదరీ! నీవు శాస్త్రములు వినియుంటివి. ధర్మజ్ఞురాలివి. ఇట్లు ఎందుకు దుఃఖించుచున్నావు? ఇతరులకు ధైర్యము చెప్పుట నీకర్తవ్యము. నీవు నీమనసును చెదరనీయ తగదు. రాజుగారి గౌరవ రక్షణకు రాముడు అరణ్యమునకు వెళ్ళెను. రాజ్యమును పరిత్యజించి, తండ్రి గౌరవమర్యాద లను నిలబెట్టిన నాయకుని తల్లిగ తల్లులందరయందును గర్వింపదగిన దానవునీవు. ఒక కష్టమైన కర్తవ్యమును దోషరహితముగ పూర్తిచేసిన

కుమారుని గురించి నీవేల దుఃఖింతువు? పూర్వులు చూపిన మార్గమున నడచుచు నాశములేని కీర్తిని సాధించుచున్న వానిగురించి మనము విచారింపతగదు. లక్ష్మణుడు రాముని అనుసరించుటపట్ల నేను గర్వించుచున్నాను. అరణ్యవాసమున ఎదుర్కొనవలసిన కష్టములు తెలిసియున్నను జానకి తనభర్తతో వెళ్ళినది. శ్రీరాముని తేజస్సు ఆరని దీపమువలె ప్రకాశించును. ఇది విచారింపదగిన సమయము కాదు. అతని నిర్మలత్వమును, ధర్మమును వారికి రక్షణ కవచములు. సూర్యుని ఎండ అతనికి తాపము కల్గింపకుండునంత, గాలి అతనికి చల్లదనము చేకూర్చునంతటి పవిత్రుడు, గొప్పవాడు రాముడు. రాత్రి రాముడు నిదురించునపుడు ప్రేమాస్పదురాలైన తల్లి బిడ్డనువలె చంద్రకిరణములచే రక్షింపబడి రాముని నిజాయితీ రక్షించును. నీకుమారునిపట్ల ఆందోళన విడిచిపెట్టుము. ఏశత్రువు అతనిని ఎదిరించి, ప్రాణములతో తప్పించుకొన లేడు. మనరాముడు శుభగుణ సమన్వితుడు. నీకుమారుడు అయోధ్యకు తప్పక తిరిగివచ్చి, సింహాసనమును అధిష్ఠించును. సీత అతనితో నున్నది. సీత సాక్షాత్తులక్ష్మీదేవియే గాని మరెవ్వరుకాదు. రాముని రాజ్యబహిష్కారమునకు శోకించుచున్న రాజ్యము రాముడు మరలివచ్చి, సింహాసనమును అధిష్టించుటతో ప్రకాశించును. రాముని అరణ్యగమనము నకు పౌరులవిచారమును నీవు చూచితివి. నాకుమారుడు లక్ష్మణుడు ధనుర్బాణ ఖడ్గములను ధరించి రాముని రక్షణకు అతనితోవెళ్ళెను. ఏహానియు, అపాయమును రాముని చేరలేవు. అతని దీక్ష పూర్తి అయినతర్వాత రాముడు నగరమునకు తిరిగివచ్చుట నీకనులతోనీవు

స్వయముగ చూడగలవు. నన్ను నమ్ముము. రాముడు పూర్ణిమనాటి చంద్రునివలె అందముగ తిరిగివచ్చి, భక్తితో సంతోషముతో నీపాదములకు నమస్కరించును. అపుడు నీవు ఆనందబాష్పములను విడుతువు. ప్రియమైన కౌసల్యా! నీవిచారమును విడిచిపెట్టుము. వారుముగ్గురు తిరిగివచ్చుట నీవు చూతువు. ఈప్రపంచమున ధర్మమునకు రామునివలె నిశ్చలముగ నిలబడిన వారెవరు? ఇది విచారకారణమా? కాదు. కౌసల్యా! నీకుమారుని చూచి గర్వింపుము". సుమిత్రవాక్యములవిని కౌసల్యకొంత ఊరటచెందెను.

పురజనులు పెద్దగుంపుగ శ్రీరాముని రథమును అనుసరించిరి. "అడవికి పోవలదు. పట్టణమునకు తిరిగి రమ్ము" అని అరచుచు వారు రథమును నిలుపుటకు ప్రయత్నించిరి. "నేను నాతండ్రిమాటను నిలబెట్టుటకు అడవికి వెళ్ళుచున్నాను. ఇందు విచారింపదగిన ప్రసంగము లేదు. మీరు నన్ను ఆటంకపరుపరాదు" అని రాముడు చెప్పెను. కాని ఆగుంపులు రామునిమాటలు వినిపించుకొనక "అడవికి పోవలదు.... అడవికి పోవలదు...." అని అరచుచు అతనివెంట వెళ్ళిరి.   శ్రీరాముడు రథమును ఆపించి "అయోధ్యానగర ప్రజలారా! మీకు నాయందుగల అనురాగమును నేనెరుగుదును. ఆయనురాగమును మాసోదరుడు భరతుని మీదకు మళ్ళింపుడు. అంతకంటె నాకు సంతోషకరమేదియు లేదు" అనుచు భరతుని మంచి గుణగణములను, రాజ్యార్హతను, తెలివిని ప్రస్తుతించి దశరధుని ఆజ్ఞానుసారము మనమందరము నడుచుకోవలెనని బోధించి ప్రజాతండమును మళ్ళింప ప్రయత్నించెను. కొందరు వృద్ధ

బ్రాహ్మణులు రధమును చూచుచు దుఃఖించిరి. "ఓ అశ్వములారా! మారాముని మీరెందుకు అడవికి తీసికొని పోవుచున్నారు? అశ్వములకు వినికిడి శక్తి అధికమని వినియున్నాము. మామాటలను విని రాముని వెనుకకు తీసికొనిరండు" అని అరచిరి. వృద్ధబ్రాహ్మణుల మాటలను విని రాముడు రధమును ఆపించెను. ముగ్గురును క్రిందకుదిగి నడచుచు ముందుకు వెళ్ళిరి. సామాన్యజనులు, బుద్ధిమంతులు, తపస్సంపన్నులు, పక్షులు కూడా రామవన గమనమును ఆటంకపరచుటకు ప్రయత్నించిరి. తమసానదీ ప్రవాహము మార్గమున కడ్డముగ ప్రవహించుచు రాముని ఆటంకపరచునట్లుండెను. రధము నదీతీరమున నిలుపబడినది. సుమంత్రుడు అశ్వములను విప్పి నీరుత్రాగించి గడ్డిమేయుటకు విడిచెను.

శ్రీరాముడు "లక్ష్మణా! మన అరణ్యజీవితమున ఇదేమొదటి రాత్రి. ఈపవిత్రనదీ తీరమున ఈరాత్రిని గడుపుదము. నీవును నేను అనుకొనినట్లు అరణ్యజీవితము శ్రమాన్వితముకాదు. చూడుము. పక్షులు, జంతువులు, వృక్షములు కూడ మనపట్ల సానుభూతి గానున్నట్లు తోచుచున్నది. మనతల్లిదండ్రుల దుఃఖమును గురించి తలచినపుడే బాధగానున్నది. భరతుడు మంచివాడే. మనతల్లిదండ్రులను అతడు అనురాగముతోనే చూచు కొనును. సుమంత్రా! అశ్వములను జాగ్రత్తగా చూచుకొనుము" అని పలికెను. అనంతరము రాముడు నదియందు సాయంసంధ్యావందనము చేసి ఇట్లనెను. "లక్ష్మణా! అరణ్యవాస ప్రధమ రాత్రమును ఉపవాసముతో గడుపుదము. నాప్రక్కన నీయునికి నన్ను అన్ని జాగ్రత్తలనుండి తప్పించును". లక్ష్మణుడు సీతారాములు

నిదురించుటకు భూమిపై గడ్డిని పరచెను. కాని తాను సుమంత్రునితో మాటాడుచు రాత్రిని గడిపెను.

శ్రీరాముడు అరుణోదయమునకు పూర్వమే నిద్రమేల్కాంచి సుమంత్రునితో నిట్లనెను. "మనవెంట అనుసరించి వచ్చిన పౌరజనులు ప్రయాణ బడలికతో గాఢనిద్రయందున్నారు. వారి అనురాగముతో నేను చలించిపోయితిని. కాని వారిప్రేమ నన్ను వెనుకకు మరలించుటకు అనుమతించలేను. కావున వారు గాఢనిద్రయందున్నపుడే మనము కదలిపోవుదము". గుఱ్ఱములు రథమునకు పూన్చబడినవి. రథమునెమ్మదిగా నదిని దాటెను. దక్షిణతీరముపై నిలబడి రాముడు సుమంత్రునితో నిట్లనెను. "నీవు రథమును జనులు నిద్రించుచున్న ఆవలితీరమునకు తోలికొని పోయి అయోధ్యవైపు కొంతదూరము నడిపించి తరువాత ఈ దరికి తీసికొని వచ్చినచో జనులు మేలుకొనుముందు మాప్రయాణమును కొనసాగింతుము. రథచక్రనేమిని చూచి నగరమువైపు మేము మరలి వెళ్ళితిమని తలచి వారు తమంతతాము నగరమునకు తిరిగిపోదురు. నీవిట్లు చేయనిచో జనసమూహము మనలననుస రించును". సుమంత్రుడు అట్లే చేసెను. రథము తిరిగి వచ్చినతరువాత వారు ముప్పురును రథమునెక్కి దక్షిణ దిశకు సాగిపోయిరి.

తమసానదీ తీరమున నిదురించిన పౌరులు ఉదయము నిద్రలేచి చుట్టును పరిశీలించిరి. శ్రీరాముడు, రథమును అదృశ్యమగుట చూచి వారు ఆశ్చర్యపడిరి. వారు రథచక్రముల జాడను అనుసరించిరి. కాని ఆజాడలు రాజధానికి గల ముఖ్యమార్గమున మాయమగుటచే నిరాశ

చెందిరి. వారు తమతమ నివాసములకేగి కైకను నిందించుచు తృప్తిచెందిరి. రాముడు లేకుండా నగరము అందమును కోల్పోయి చీకటిచే ఆవరింపబడి యున్నది.

సుమంత్రుడును, రాజకుమారులును అరుణోదయము నకు ముందే తమసా నదిని దాటి అడవిలోనికి చాలదూరము పోయిరి. అనేక ప్రవాహములను దాటుచు కోసల రాజ్యముయొక్క దక్షిణ సరిహద్దును సమీపించిరి. వారు ప్రయాణము చేయుచుండగా రాముడు సుమంత్రునితోనిట్లనెను. "నేను ఎప్పుడు మరల సరయూనదీ సమీపారణ్యమున వేటాడుదును అని ఆశ్చర్యపడుచున్నాను". అనేక విషయముల గురించి సంభాషించుచు వారు ముందుకు వెళ్ళిరి. రాజ్యముయొక్క దక్షిణ సరిహద్దును చేరగానే శ్రీరాముడు రథమునాపి అయోధ్యవైపు ఉత్తరాభిముఖుడై ప్రార్థనలో తలవంచెను. "ఓ పట్టణ రత్నమా! ఓ ఇక్ష్వాకువంశ పురాతన రాజధానీ! అడవియందు నాతపస్సును ప్రారంభించనా? నాతల్లిదండ్రులను, నిన్ను చూచుటకు జీవింతును. నాకా ఆనందమును అనుగ్రహింపుము" అని పలికెను. రథము గంగానదీ తీరమును చేరెను. నదీసౌందర్యమును మెచ్చుకొనుచు నదీతీరమువెంబడి పయనించిరి. ఒకప్రదేశమును చూచి శ్రీరాముడు "ఈరాత్రి మనమిచట గడుపుదము" అనెను. గుఱ్ఱముల విప్పి వారు ఒకవృక్షముక్రింద కూర్చుండిరి.

ఆ ప్రాంతమునకు నాయకుడగు గుహుడు తన పరివారము వలన శ్రీరాముడచటకు రాబోవుచున్నాడని విని తనపరివారముతో

రామలక్ష్మణులను పలుకరించుటకు వచ్చెను. రాజకుటుంబముపట్ల ,
రామునిపట్ల అతనికి అంతులేని ప్రేమకలదు. గంగానదీ తీరవాసులకు
నాయకుడగుటచే అతడుగొప్ప గౌరవము,శక్తి కల వ్యక్తి. రామలక్ష్మణులు
గుహుని పలకరించుటకు లేచిరి. గుహుడు వారిని కౌగలించుకొని
స్వాగతము పలికెను. "ఈ భూమిని మీ స్వంతముగ తలచుడు. ఈ
ప్రదేశము అయోధ్యవలెనే మీది. మీవంటి అతిథిని పొందుట
ఎవరూహింపగలరు? ఇది నిజముగ నాఅదృష్టము" అనెను. గుహుడు
పెద్దవినోదమునేర్పాటు చేసెను. "మారాజ్యమునందు మీగృహముగ
భావించి ఆనందింపుడు. మీరు పదునాలుగు సంవత్సరములు ఇచట
మాతో గడుపవచ్చును. మీకేలోపము రాదనినేను హామీ ఇచ్చుచున్నాను.
మిమ్ము జాగ్రత్తగ చూచుకొనుట నాకానందకరము. మాఆతిథ్యమును
అంగీకరింపుడు" అనెను. గుహుని మరల కౌగలించుకొని రాముడిట్లనెను.
"సోదరా! నీగాఢమైన ప్రేమను నేనెరుగుదును. నీకోరికయే మీ
ఆతిథ్యముతో సమానము. నాదీక్షచే నేను బంధితుడను. నేను
అరణ్యమున నివసించుటకు వచ్చితిని కాని ఒక నాయకుని అతిథిగ
జీవితముననుభవింపరాలేదు. ఈ గుఱ్ఱములు మాతండ్రిగారి అభిమాన
అశ్వములు. వానిని బాగుగమేపుడు. మేము అల్పాహారముతో రాత్రి
విశ్రమింతుము".

వారు ఆరాత్రి ఒక వృక్షముక్రింద పరుండిరి.
సుమంత్రునితో సంభాషించుచు గుహుడు, లక్ష్మణుడును మెలుకువగ
నుండిరి. "సోదరా! నీవువెళ్ళి విశ్రమించుము. నీకొఱకు ఒక పానుపు

సిద్ధపరుపబడినది. మాపరివారము జాగరూకతతో ఉందురు. నాకు తెలియకుండ ఈఅరణ్యమున ఏమిచేయుటకైనను ధైర్యము చేయలేరు. శ్రీరామునిగురించి ఆందోళణచెంద పనిలేదు. నిద్రింపుము" అని లక్ష్మణునితో గుహుడు పలికెను.

"జనకమహారాజ కుమార్తె, దశరథుని కోడలు సీత కటికనేలపై పరుండియుండగ నేనెట్లు నిదురింపగలను? గుహా! ముల్లోకములను స్వాధీనపరచుకొనగల పురుషోత్తముడు గడ్డిపై పరుండెను. నేనెట్లు నిద్రింపగలను?" అని లక్ష్మణుడు జవాబిచ్చెను. "అయోధ్య దీనినెట్లు భరించుచున్నదని ఆశ్చర్యపడుచున్నాను. రాణుల భవనములు రోదన ధ్వనులతోనుండును. నాతల్లి సుమిత్రయు కౌసల్యయు జీవించి యున్నారా? అని నాసందేహము. నాతండ్రి ఎట్లో బలమును కూడగట్టుకొని రామునితో "అడవికి వెళ్ళుము" అనినాడు. కాని రాముని వియోగము నతడు భరింపలేడు. ఆయన మరణించినచో మాతల్లులుకూడా ప్రాణముల విడిచియుందురు. మరణించినవారికి చివరి కర్తవ్యములు చేయు అవకాశము పోగొట్టుకొని మేము ఇచటనుంటిమి. మావనవాసము పూర్తిచేసుకొని అయోధ్యచేరునప్పటికి మమ్ము దీవించుటకు మాతలిదండ్రులు జీవించుట అసాధ్యము" అని లక్ష్మణుడు విచారముతో పలికెను. గుహుడు కన్నీరు విడిచెను. ఇట్టి సంభాషణతో రాత్రి గడిచెను.

మరుచటి ఉదయము పెందలకడనే రాముడు లక్ష్మణునితో "మనమిపుడు నదిని దాటవలెను. ఈ విశాలనదీ ప్రవాహమును దాటుటకు చాలినంత పెద్దనౌకను సిద్ధము చేయుమని గుహుని కోరుము"

అని పలికెను. గుహుడు తన పరివారమును ఆజ్ఞాపించి , నౌకను సిద్ధపరచి, రామునకు తెలిపెను. సుమంత్రుడు శ్రీరాముని ఎదుట అతని తదుపరి ఆజ్ఞలకొఱకు నమ్రుడై నిలబడెను. రాముడు సుమంత్రుని అవ్యక్తవిచారమును గ్రహించి అతని భుజముపై తనచేయిమోపి "సుమంత్రా! త్వరితగతిని అయోధ్యకు మరలి వెళ్ళి తండ్రిగారి సరసన సంరక్షించుచుండుము. అది నీబాధ్యత" అని పలికెను. సుమంత్రుడు "రామా! సదాచారము, విజ్ఞానము, సంస్కృతి విలువలేనివిగ తోచు చున్నవి. నీవు, సోదరుడు, సీత అరణ్యమందు నివసింపబోవుచున్నారు. మనయోగమెట్లున్నదో? కైకపరిపాలనయందు మనమెట్లు జీవింపబోవు చున్నామో?" అనుచు పసిబాలునివలె విలపించెను. సుమంత్రుని కనుల నీరు తుడుచుచు రాముడిట్లనెను. "నీకంటె ఆప్తులు మాకుటుంబము నకులేరు. తండ్రిని ఊరడించుట నీకర్తవ్యము. ఏమిఆజ్ఞాపించినను బాధ్యతగ నిర్వర్తింపుము. ఆయనమనసునకు బాధ కలిగింపకుము. మాపట్ల ఆందోళన చెందకుము. నాముసలి తండ్రికి నాబదులుగ నీవిట్లు చెప్పుము. అతని పాదములకు నమస్కరించి అయోధ్యనుండి వెడలగొట్టబడినందుకు నేనుగాని, లక్ష్మణుడు గాని, సీతగాని బాధపడుట లేదని చెప్పుము. పదునాలుగు సంవత్సరములు అడవియందు సంతోషముతో గడిపి ఆయన దీవనలకొఱకు తప్పక వత్తుము. మాతల్లి కౌసల్యకు ఆమె ఆశీస్సులతో మేము క్షేమమని తెలుపుము. మాసవతితల్లులకు ముఖ్యముగ కైకకు ఇట్లేచెప్పుము. లేనిచో మేము కోపముతో వెళ్ళినామనుకొనును. మహారాజునకు భరతుని పట్టాభిషేకము

త్వరితగతిని చేయింపుమనియు, మాపరోక్షమునందు భరతుడు అతనికి సదుపాయముగనుండుననియు తెలుపుము ". కాని సుమంత్రుడు తన దుఃఖమును ఆపుకొనలేక విలపించెను. "నేను ఎట్లు మరలివెళ్ళగలను? ఏమాటలతో సుఖముచేకూర్చగలను? మీరులేని ఈరథమును ఎట్లు తోలగలను?" అనుచు దుఃఖించెను. మరియొకమారు రాముడు సుమంత్రుని ఓదార్చి ఓర్పువహింపుమనిపలికి ఇంటికి పంపెను.

"గుహా! నీవుకోరినట్లు నేను పదునాలుగేండ్లు నీరాజ్యమున గడిపినచో నాతండ్రిమాటను నిలుపు దీక్ష నిర్వర్తింపబడునా? నేను తప్పక తపస్వుల జీవితమును గడుపవలెను. పచనము చేయబడిన భక్ష్యము లను తాకరాదు. పండ్లను, దుంపలను, అగ్నులందు హోమము చేయదగిన మాంసములనుమాత్రమే భుజించి జీవింపవలెను". గుహుని అట్లు సమ్మతింపజేసి ఆసోదరులు తమకేశములను మఱ్ఱిపాలతో జడలు కట్టుకొనిరి. వారు సీత నౌకయందు చేరుటకు సహాయపడి, వారును నౌకలోనికి ఎక్కిరి. గుహుడు నావికుని నౌకను దాటింపుమని ఆజ్ఞాపించెను. నావికుడు వారిని వేగముగ నదిని దాటించెను. నదీప్రవాహ మధ్యమున సీత "దేవీ! మాదీక్షను పూర్తిచేసుకొని మాస్వదేశమునకు క్షేమముగ మరలివచ్చుటకు సహాయపడుము" అని గంగాదేవిని ప్రార్థించెను. వారు మాటలాడుకొనుచు గంగ ఆవలితీరమును చేరిరి. మొట్టమొదటిసారిగ ఆముువ్వురును ఏస్నేహితులును, అనుచరు లెవ్వరును లేకుండ ఒంటరిగ నిలబడిరి. "లక్ష్మణా! నీవే మా సంరక్షకుడవు. ముందు నీవు నడువుము. నిన్ను సీత అనుసరించును.

మీ ఇరువుర వెనుక నేను నడతును. అరణ్యజీవన కష్టములనుండి వీలైనంత వరకు సీతను మనము రక్షింపవలెను. ఇకనుండి మనకెవ్వరును తోడుగనుండరు" అని రాముడు పలికెను.

శ్రీరాముని ఆలోచనలు తల్లియగు కౌసల్యవైపు మరలెను. "లక్ష్మణా! నీవు అయోధ్యకు తిరిగివెళ్ళి మనతల్లులు కౌసల్య, సుమిత్రాదేవుల సంరక్షణ చూడరాదా? నేనేదోవిధముగ నాఅరణ్య వాసమును నిర్వహింతును" అనెను. "క్షమించుఅగ్రజా! నేను అయోధ్యకు మరలి వెళ్ళుట లేదు" అని లక్ష్మణుడు జవాబిచ్చెను. రాముడు తల్లులను విడిచి వచ్చినందుకు విచారించుచుండగ లక్ష్మణుడు ధైర్యము చెప్పుచుండెను. ఆ రాత్రి వారొక వటవృక్షచాయయందు గడపి, మరుచటి ఉదయము బయలుదేరి సూర్యాస్తమయ మగుసరికి భరద్వాజాశ్రమమును చేరిరి. భరద్వాజ మహర్షి ఆతిధ్యమును స్వీకరించి తామెచ్చట తమ అరణ్యవాసమును ప్రశాంతముగ గడుపగలమో తెలుపుడని అడిగి ఆయన ఆశీస్సులతో ఆయన సలహామేరకు చిత్రకూటమునకు బయలుదేరుటకు నిర్ణయించిరి. శ్రీరాముడు రాత్రిని భరద్వాజాశ్రమమున గడిపి, ఉదయము ఆమహర్షికి నమస్కరించి, శలవు తీసికొని చిత్రకూటపర్వతమునకు బయలుదేరెను. భరద్వాజముని వారిని స్వంతబిడ్డలవలె అనురాగముతో గౌరవించి వారు అనుసరింపనగు అరణ్య మార్గమును తెలియజేసి, ఆశీస్సులతో సాగనంపెను.

ఆముమ్వురు భరద్వాజుని స్థలవర్ణన సూచనలననుసరించి కాళిందీనదిని చేరిరి. వారు అరణ్యమందలి దుంగలతోడను, వెదుళ్ళతోడను

ఒక తెప్పను నిర్మించిరి. దానిపై లక్ష్మణుడు పత్రములతోనేర్పాటుచేసిన ఆసనముపై సీతకూర్చుండెను. ప్రవాహమధ్యమున సీత నదీదేవతను "రాముడు వనవాసదీక్షను పూర్తిచేసి, తాముక్షేమముగ ఇంటికి చేరునట్లు చేయుమని" ప్రార్థించెను. కొన్ని చిన్నప్రవాహములను దాటిన తర్వాత భరద్వాజునిచే వర్ణింపబడిన ఒక పెద్దవటవృక్షమును చేరిరి. ఆవృక్ష ఛాయయందు కూడా సీతాదేవి ప్రార్థనలు చేసెను. రాముడు సీతను వెంటనిడుకొని ముందులక్ష్మణుని నడువుమని కోరి, తాను వారిరువురి వెనుక నడిచెను. "మార్గమునందు సీతకోరిన ఫలపుష్పములను ఆమెకు అందింపుమని" చెప్పెను. సీత కుతూహలముతో అరణ్యవృక్షముల గురించి, తీవెలగురించి అడుగుచు అడవియందమును మెచ్చుకొనుచు నడచెను. వారు ఆనందముగ ప్రయాణము చేసి ఒకనదీతీరమున రాత్రి విశ్రాంతిగొనిరి. రామలక్ష్మణులు క్షత్రియులగుటచే ఫలమూలములతోపాటు జంతుమాంసమును కూడ వేటాడి ఆహారముగ స్వీకరించుచు పయనించిరి.

మరునాటి ఉదయము రాముడు "లక్ష్మణా! లెమ్ము పక్షులకూతలు వినుము. తెల్లవారుచున్నది. మనము బయలుదేరు సమయమయ్యెను" అనెను. లక్ష్మణుడు అరణ్య వాససమయమును నిద్రాహారములు లేకుండ గడిపెనని చాలమంది తలతురు. కాని వాల్మీకి రామాయణమునందట్లు లేదు. శ్రమకారణముగ ఒక్కొకమారు లక్ష్మణుడు పెందల కడనే నిద్రమేల్కొనకలేకపోయిన రాముడు అతనిని మేలుకొలిపెడి వాడు. వారు తమ సంధ్యావందనాదికములు పూర్తిచేసికొని భరద్వాజునిచే

సూచింపబడిన మార్గమున పయనించిరి. అది వేసవికాలమగుటచే చెట్లు, మొక్కలు అనేకరంగులపూలతో ప్రకాశించుచుండెను. చెట్లకొమ్మలు ఫలపుష్పభరితమై వంగియున్నవి. శ్రీరాముడు ఆటవికసౌందర్యమును సీతకు చూపుచు "మానవ స్పర్శచే నాశముకాకుండ ఉన్న ఈవన సౌందర్యమును చూడుము. పూలచేకప్పబడిన భూమిని చూడుము. పక్షులకూతలు ఎంతమధురముగనున్నవి? ఇట్టి దృశ్యములనెల్లపుడు చూడగల్గిన జీవితము ఆనందమయమగును" అని పలికెను. అనంతరము కొంతదూరములోవారు చిత్రకూటపర్వతమును చూచిరి. సంతోష ముతోవారు వేగముగ నడువనారంభించిరి. "ఈప్రదేశము ఎంత అందముగ నున్నది? పండ్లతో, దుంపలతో, మధురనిర్మల జలములతో నిండి యున్నది. ఋషులు ఈఅడవిలో ఆశ్రమములందు నివసింతురు. మనము వారి సాహచర్యముతో ఆనందముగ జీవింతుము" అని రాముడు పలికెను.

వారు తమకొఱకు ఒక ఆశ్రమమును నిర్మింపనారంభించిరి. లక్ష్మణుడు తెలివైనవాడు. వెంటనే అతడు ఒకబలమైన కుటీరమును నిర్మించి, దానిని సౌకర్యవంతముగను, సౌఖ్యవంతముగను చేసెను. ఒంటరిగ లక్ష్మణుడు ఆకుటీరమును మట్టితో నిర్మించి, వెదుళ్ళతో, ఆటవిక కలపతో గుమ్మములు, కిటికీలు అమర్చెను. అందమైన చిత్రకూట పర్వత సమీపమున, మలయవతీనదీతీరమున ఆముగ్గురు ఆకుటీరమందు తమ భక్తియుక్త నిత్యకృత్యములనాచరించుచు నివసించిరి. వారు

రాజ్యబహిష్కరణను మరచి దేవతలతో ఇంద్రునివలె ఆనందముగ కాలముగడపిరి.

సుమంత్రుడు, గుహుడు శ్రీరాముని, లక్ష్మణుని, సీతను వారుచూడగలిగి నంతసేపు చూచిరి. వారిదృష్టినుండి అదృశ్యముకాగానే విచారముతో గుహుని నగరమునకు వెళ్ళిరి. కొంతసేపైనతర్వాత సుమంత్రుడు అయోధ్యకు తిరిగివెళ్ళెను. అతడు దుర్గద్వారమును దాటి నగరమందు ప్రవేశించగానే రధము జనసముదాయముచే చుట్టుముట్ట బడినది. "నీవెచ్చట రాముని విడిచితివి? అపుడతడెట్లుండెను?" అనుచు కుతూహలముతోనడిగిరి.

"అయోధ్యాపుర జనులారా! రామలక్ష్మణులు గంగానదిని దాటి, నన్ను ఇంటికిపొమ్మని ఆజ్ఞాపించి వారు కాలినడకన అడవిని ప్రవేశించిరి" అని సుమంత్రుడు చెప్పెను. ఈ మాటలు వినగానే జన సమూహము రాముడు లేనిరధమును చూచి పెద్దగదుఃఖించిరి. సుమంత్రుడు సిగ్గుతోతన ఉత్తరీయముతో ముఖమును కప్పుకొని రధమును ముందుకు తోలుకొనిపోయి దశరధుని భవనముముందు రధమునాపి అందుండిదిగెను. పెరుగుచున్నదుఃఖముతో సుమంత్రుడు కౌసల్యమందిరమును ప్రవేశించి జీవచ్ఛవమువలెపడియున్న దశరధుని చూచెను. రాముని సందేశమును రాజునకు నెమ్మదిగ వినిపించెను. కౌసల్య దుఃఖమునాపుకొనలేక "నీవాజ్ఞాపించిన రీతిగ నాకుమారుని అడవియందు దిగవిడిచి సుమంత్రుడు వచ్చినాడు. కైకేయికి వరముల నిచ్చి, ఇపుడేలసిగ్గుపడుదువు? నీవుచేసిన పనికి ఫలితమిదియని నీకు

తెలియదా? నీమాట నిలబడినందుకు సంతోషింపుము. నాదుఃఖము నెవరు పాలుపంచుకొందురు? నేనేభరింపవలసియున్నది. మౌనముగ నుంటివేల? రాముని గురించి సుమంత్రుని అడిగి తెలిసికొనవలసిన మానవత్వము నీకులేదా?" అనుచు దశరథుని బాధను నివారించుటకు బదులు కౌసల్య రామునియందలి ప్రేమతో గ్రుడ్డిదానివలె భర్త బాధను పెంచునట్లు మాటాడెను. సుమంత్రుడు కౌసల్యను ఓదార్చుటకు ప్రయత్నించినకొలది ఆమె దుఃఖించుచు తనను రాముడున్న అడవి యందు దింపుమని కోరెను. "రాముడు అయోధ్యలోకంటె అడవి యందెక్కువ సంతోషముతోనున్నాడనియు, అన్నకు సేవలందించుటలో లక్ష్మణుడు సంతసభరితుడైయుండెననియు, సీత భర్తసన్నిధియందు అత్యంత ముదముగల్గియుండెననియు, వారిగురించి నీవు విచారింపబని లేదనియు" సుమంత్రుడు కౌసల్యను ఓదార్చెను. అయినను ఆమెవిచారము ద్విగుణీకృతమయ్యెను.

దశరథునకు పరిస్థితులు హృదయభగ్నత కల్గించుటయే గాక తనపై తనకు అసహ్యాకరముగానున్నవి. దుఃఖాన్వితయగు కౌసల్యమాటలు మరింత హృదయశల్యములయ్యెను. "కైక, భరతుడు ఆనందముగానుండుట నీకు చాలును. అరణ్యవాసదీక్ష పూర్తి అయిన పిమ్మట రాముడు భరతునిచే పాలింపబడిన రాజ్యమును ముట్టడు. ఇతర జంతువులచే చంపబడిన మాంసమును పులి ముట్టుకొనదు. కావున కైక భరతుల ఆనందము భంగమగునని నీకు భయపడపనిలేదు" అని పలికిన కౌసల్యతో దశరథుడిట్లు పలికెను. "కౌసల్యా! నాపైదయ

చూపుము. విచారముతో భగ్నహృదయుడనగు నీభర్తయందు కనికరము చూపుము" అనుచున్న దశరథుని మాటలకు కౌసల్య బాధపడి పుత్రవియోగ దుఃఖముతో తానుచేసినతప్పిదమును గ్రహించి భర్తపాదములపైపడి క్షమార్పణ కోరెను.

అనంతరము కొంతసేపటికి దశరధునకు చాలకాలము క్రిందట జరిగిన సంఘటన జ్ఞప్తికివచ్చి బాధతో కౌసల్యతోనిట్లనెను. "కౌసల్యా! కర్మఫలము నెవ్వరును తప్పించుకొనలేరు. నేను యవ్వనము నందున్నపుడు ధ్వని మాత్రము విని లక్ష్యమును సాధించు ధనుర్విద్య యందు నిపుణునిగనుండెడివాడను. ఆలక్ష్యసాధనకు అభ్యసించుచు ఒక అమాయకుని సంహరించి మహాపాపము చేసితిని. నీవింకను మాగృహమునకు రాకముందు ఒకవానకాలపురాత్రి సరయూనదికడ నేను శబ్దము మాత్రమువిని బాణముతో జంతువుల సంహరించుటయందు నేర్పు సాధించుచుంటిని. ఏనుగు నీరుత్రాగుచున్నట్లు ఊహించి శబ్దము విని బాణప్రయోగముచేయగా అది ఒకమునిబాలకునకు తగిలెనని గ్రహించితిని. నేను చేసిన పొరపాటును అతనికి తెలిపి, అతడు అంధులైన వృద్ధమాతాపితల దప్పికనిమిత్తము పాత్రయందు నీరునింపుకొనుచుండగా ఆశబ్దమువిని నేనుబాణప్రయోగము చేసియుంటినని అతడు మరణించుచు నాకు తెలిపిన అతనివృత్తాంతమునుబట్టి మంచినీటితో అతని ముసలి తలిదండ్రులను కలసితిని. జరిగినవృత్తాంతము విని ఆ అంధదంపతులు తాము పుత్రవియోగముతో మరణించుచు "నీవును మావలెనె నీపుత్రులు నీసమీపమునుండి దూరముగానున్నపుడు

నీవుమరణింతువు" అని శపించిరి. అటుపిమ్మట వారు నాసహాయముతో తమపుత్రుని సమీపించి ఉత్తరక్రియలుజరిపి తామును అగ్నికి ఆహుతి అయిరి. నాపూర్వకృతపాపము, నేనుచేసిన నేరము నన్నిపుడు చంపు చున్నది. అమాయకుడైన నాకుమారుని అరణ్యమునకు పంపి నేను దుఃఖముతో యమపురికేగుచుంటిని. కౌసల్యా! నాకనులు అగుపించుట లేదు. దగ్గరకు వచ్చినన్ను తాకుము. యమదూతలు నన్ను పిలుచు చున్నారు. రామునిచూడకుండగనే నేను మరణించుచున్నాను. హా.... కౌసల్యా! ఓ.... సుమిత్రా! అని పలుకుచు ఆరాత్రి ఎపుడో ఎవరికీతెలియని సమయమున దశరధుడు మరణించెను. తరచు తమభర్త మూర్ఛ మునుగుచుండుటచే కౌసల్యాసుమిత్రలు అతనిమరణమును గుర్తించలేదు. ఉదయము నిత్యకృత్యముగ రాజుగారిని మేలుకొలుపుటకు మంగళ వాద్యములు మ్రోగినవి. సేవకులు రాజుగారింకను లేవకపోవుటకాశ్చర్యపడి లోనికేగి అతడుమరణించినట్లు గ్రహించిరి. దశరధుడు పరలోక గతుడైనవార్త రాజభవనమంతట వ్యాపించినది.

అనాధలైన దశరధుని భార్యలు ఒకరినొకరు కౌగిలించుకొని అనాధబాలలవలె మిగుల విలపించిరి. కౌసల్య భర్త శరీరమునుపట్టుకొని "రాజుగారితోపాటు నేను యమపురికేగుదును. భర్తృపుత్రవిహీననై నేనెట్లు బ్రతుకుదును?" అని ఏడ్చెను. పెద్దలు, అధికారులు ఆమెను భర్తదేహము నుండి విడిపించి దూరముగ తీసికొనివెళ్ళిరి. అపుడు దహనసంస్కార ముల గురించి చర్చించిరి. రామలక్ష్మణులు అడవికి పోవుటచేతను భరతశత్రుఘ్నులు మేనమామ ఇంటనుండుటచేతను వెంటనే ఉత్తర

క్రియలు జరుప వీలుపడదు. భరతునికొఱకు కబురంపుటకును అతని రాకవరకు దశరథుని శరీరమును తైలమునందు భద్రపరచుటకును నిర్ణయింపబడినది. అయోధ్యానగరము అంధకారమునందు మునిగినది. స్త్రీలు గుంపులుగాకలిసి కైకను   నిందించిరి. రాజ్యము అరాచకమైనదని ప్రజలు భయపడిరి.

ఉదయము మంత్రులు, అధికారులు, పెద్దలు సమావేశ మయ్యిరి. మార్కండేయ, వామదేవ, కశ్యప, కాత్యాయన, గౌతమ, జాబాలి, సుమంత్రుడు, తదితరమంత్రులు వశిష్ఠమహర్షికి నమస్కరించి ఇట్లుపలికిరి.   "అయ్యా! రాజుగారు ఇకలేరు. రామలక్ష్మణులు అరణ్య మందున్నారు. భరతశతృఘ్నులు తాతగారింట నున్నారు. పరిపాలనా బాధ్యత ఎవరో ఒకరు స్వీకరింపవలసియున్నది. రాజ్యము అరాచకముగా నుండరాదు. ప్రభువులేనిచో పద్ధతి మాయమగును. కుమారుడుతండ్రికిని, భార్యభర్తకును అవిధేయులగుదురు. దొంగలు విజృంభింతురు. ప్రజలపరస్పర విశ్వాసము నశించును. వానలుకురియవు. దేవాలయము లందు ఉత్సవములు ఆగిపోవును. పంటలు పండవు. నాగరికత నశించును. రాజరక్షణతోనే తపస్సులు, దీక్షలు ఆధారపడియున్నవి. రక్షణ నశించును. క్రూరత్వము పెరుగును. కావున రాజు అవసరము. ధర్మము అపాయస్థితిలో నున్నది. కావున ఒకరాజును నియమింప వలసియున్నది". వశిష్ఠుడు దూతలను పిలిచి వారితోనిట్లుచెప్పెను. "మీరువెంటనే బయలుదేరి వేగముగ కేకయదేశమునకు వెళ్ళుడు. మీ ముఖమందు, నడవడియందు విచారము కనబడనీయకుడు. దశరథుని

మరణవార్తను భరతునకు తెలుపకుడు. కులగురువును, మంత్రులును వారిరాకను కోరుచున్నారని తెలిపి వెంటనే అయోధ్యకు తీసికొనిరండు. సీతారాముల వనగమన విషయమునుకూడా వారికి తెలుపకుడు. వారికి ఏసందేహము కలుగకుండునట్లు కేకయమహారాజునకు అలవాటు ప్రకారము వస్త్రాభరణములను కానుకలుగ కొనిపొండు".

వెంటనే రాజదూతలు కావలసినఏర్పాట్లతో వేగవంతమైన అశ్వములనెక్కి కేకయదేశమును చేరి రాజకుమారులున్న భవనమున మరుచటి ఉదయము వారిని కలుసుకొనుటకు వేచియుండిరి. దూతలు చేరినరాత్రి భరతుడు దుస్వప్నములనుకాంచి ఆందోళణ చెందెను. ఉదయము రాజదూతలు కేకయరాజునకు, అతనికుమారుడు యుధాజిత్తునకు వందనములు తెలిపి రాజకుమారులకు మర్యాదను ప్రదర్శించి భరతునితోనిట్లు పలికిరి. "మీగురువులు, మంత్రులు మీకు తమదీవెనలు తెలిపి మిమ్ము వెంటనే అయోధ్యకు రమ్మనిరి. మీరాక అవశ్యమని చెప్పిరి". వెంటనే బయలుదేరుడనిరి. మీమేనమామకు పంపబడిన బహుమతులను వారికందింపుడనిరి. భరతుడు తనయింట అందరక్షేమమును గురించి దూతలను ప్రశ్నించెను. "తనే తెలివిగలదాననని విశ్వసించు మాతల్లికైక క్షేమమా?" అనియు అడిగెను. "ఓరాజా! అందరును క్షేమముగానున్నారు. ఆలసింపకరథమునెక్కుము" అని దూతలు తొందరపరచిరి. భరతుడు తనతాత, మామల శలవుగొని వారిచ్చిన బహుమతులను వెంటనిడికొని శత్రుఘ్నసహితముగ

రధమునెక్కి అయోధ్యకు బయలుదేరెను. ఎనిమిదవరోజున అయోధ్య చేరిరి.

అయోధ్యచేరిన భరతునకు పూర్వమువలె తోచలేదు. "అయోధ్య కొత్తగానున్నదేమి? అందరును విచారవదనములతోనున్నారు. ఎందుకు?" అని సారధిని భరతుడడిగెను. భరతుని రధము నగరమును ప్రవేశించెను. "ప్రజలు పుష్పగంధాదులతో అలంకరించుకొనలేదేమి? మంగళవాద్యములు నిశ్శబ్దముగానున్నవేమి? ఈచెడు చిహ్నములేమి? నాకు ఆందోళణగానున్నది" అని సారధిని అడిగెను. లోనికేగిన భరతునకు దశరధభవనమున దశరధుడు కనిపింపలేదు. కైకేయిభవనమున ప్రవేశించగనే కైక తనసింహాసనమునుండిదిగి కొడుకును కౌగిలింప వచ్చెను. భరతుడామెపాదములకు నమస్కరించెను. తల్లి కొడుకు శిరసును ముద్దిడుకొని తనఆశీస్సులు తెలిపెను. “ప్రయాణము బాగుగ జరిగినదా? నీతాత, మేనమామ కుశలమా? వారిగురించి చెప్పుము ” అని కైక అడిగెను. "కేకయ రాజ్యమందు తాత, మామ అందరును క్షేమం. వారు నీకు విలువైన బహుమతులు పంపిరి. అవి వెనుక వచ్చును. దూతలు తొందరపెట్టుటచే నేను ముందు వచ్చితిని. తండ్రిగారికి నమస్కరించుటకాయన భవనమునకు వెళ్ళిన నాకాయన కనిపింపలేదు. ఇక్కడనులేరు. నాపెదతల్లుల భవనములందున్నారు కాబోలు. నేను వెళ్ళి ఆయనకు నమస్కరింపవలెను" అనిభరతుడు పలికెను.

"కుమారా! నీతండ్రి ఈజీవితమునకు సరిపడు దీవెనల నందించిరి. ఆయనకీర్తి గొప్పది. ఆయన అన్నియాగములు చేసెను.

ఆయన మంచికి ఆశ్రయము. ఇపుడు ఆయన ఉన్నతలోకములు ప్రవేశించి దేవతలలోకలిసిరి" అని కైక జవాబిచ్చెను. ఈ మాటలు వినినంతనే భరతుడు ఏడ్చుచు భూమిపై పడెను. అనాధబాలునివలె భూమిపైపడి దుఃఖించెను. గొడ్డలిచే నరుకబడిన వృక్షమువలె భూమిపైపడియున్న కుమారుని చూచి కైక యిట్లు పలికెను. "ఓరాజా! లెమ్ము. ఒక ప్రభువునకు నేలపై పడి, దొర్లి దుఃఖించుట తగదు. గౌరవము నీఅనుమతికి ఎదురుచూచుచున్నది. నీవు ధర్మమునుద్ధరించి నీరాజవంశ పెద్దలవలె యజ్ఞము చేయవలిసియున్నది. నీతెలివి మధ్యాహ్నసూర్యునివలె ప్రకాశించును. బలముతో, ధైర్యముతో లేచి నిలువుము". భరతుని మనస్సు నిర్దోషమైనది. మచ్చలేనిది. చాలసేపు దుఃఖించినతర్వాత భరతుడు లేచియిట్లనెను. "నేను మేనమామగారింటికి వెళ్ళినపుడు త్వరగ శ్రీరాముని యువరాజపట్టాభిషేకము జరుగుననియు, నేను మరలివచ్చునపుడు గొప్ప ఉత్సవములు చూతుననియు తలచితిని. ఎంతవిరుద్ధముగ జరిగినది? ఈవిపత్తును నేనెట్లు భరింపగలను? నాతండ్రి ముఖము నేను చూడలేను. అతను దేనివలన మరణించెను? ఆయనకు ఎట్లు అనారోగ్యము కలిగినది? ఆయన జబ్బుపడినపుడు నేను ప్రక్కన లేను. ఆఖరి నిముషమందు ఆయనను జాగ్రత్తగా చూచుకొను అవకాశము రామునకీయబడినది. నాపట్ల నాతండ్రి ఎంతవాత్సల్యము కలిగియుండెడివాడు? ఏదైనా ధూళి నాశరీరముపై నున్నచో ఆయన తనచేతితో తుడిచెడివాడు. ఆయనస్పర్శ ఎంత మృదువుగ, సంతోషకరముగ నుండెడిది? ఆయనకు సేవచేయు

అవకాశము నాకీయబడలేదు. కాని అమ్మా! రాముడెక్కడున్నాడు? ఇకనుండి అతడేనాకు తండ్రియు, గురువును. నేను వెంటనే అతనిని చూచి అతనిపాదములను ముద్దిడవలెను. నాతండ్రియొక్క చివరి సందేశమేమి?"

కైకయొక్క జవాబు నిజముతోను ఆమెఆలోచనలతోను పొత్తుకలిగియుండవలెను. దశరధుడతని చివరిక్షణములందు "హా రామా! హా లక్ష్మణా! హా జానకీ! " అని అరచుచు భరతునిగురించి ఆలోచించనే లేదని కైకభరతునకు చెప్పెను. అంతేగాక సీతారామలక్ష్మణులు మరల తిరిగి వచ్చుట చూచుటకు జీవించు అవకాశము నాకీయబడలేదు. అనుచు దశరధుడు మరణించెనని తెలిపెను. ఈ మాటలను విని రామలక్ష్మణులు కూడ తండ్రి సరసన లేరని భరతుడు గ్రహించెను. "వారెక్కడ ఉన్నారు? తండ్రిగారి అవసానసమయమున ఆయననుండి వారిని దూరముచేసిన పనిఏమి?" అని భరతుడు పలికెను. "కుమారా! రాముడు తపస్వివలె వస్త్రములను ధరించి లక్ష్మణుని, సీతను వెంటనిడికొని దండకారణ్యమునకు వెళ్ళెను" అని కైకచెప్పెను. భరతుని ఆశ్చర్యమునకంతములేదు. "నీవు చెప్పుచున్నదేమియు నాకు తెలియుటలేదు. రాముడేపాపము చేసెను? ఏబ్రాహ్మణ ధనమైనను అపహరించెనా? ఏ అమాయకునైనను గాయపరచెనా? పరస్త్రీలను వాంఛించెనా? అతడు అడవికెందుకు పోవలసివచ్చెను? ఈప్రాయశ్చిత్తము నెవరువిధించిరి?" ఈప్రశ్నలవర్షముతో వణికిన కైకేయి నిజమునిట్లు వెల్లడించెను. "రాముడు ఏనేరము చేయలేదు. అతడు ఎవరికి హాని

చేయలేదు. ఎవరిసొమ్ము దొంగిలింపలేదు. పరస్త్రీలను కోరికతోచూచుట రాముని స్వభావముకాదు. రాముని పట్టాభిషేకవార్తవిని, నేను దశరధుని సమీపించి, అతడునాకు గతములో వాగ్దానము చేసినవరములను "నీకుపట్టాభిషేకమొనర్పవలెననియు, రాముడు అరణ్యమునకు బహిష్కరింపబడవలెననియు" నీకొఱకు వేడితిని. దశరధుడు తనమాట నిలుపుకొనుటకు అంగీకరించెను. కావునరాముడు సీతాలక్ష్మణుల వెంటనిడికొని అడవికేగెను. ఈవియోగమును భరింపలేక నీతండ్రి మరణించెను. వ్యర్ధమైన శోకముతో నీసమయము వ్యర్ధము కానీయకుము. ఇపుడు నీవేమిచేయవలెనో ఆలోచింపుము.నీవు ధర్మము నెరుగుదువు. రాజ్యపదవీభారమును వహించుటకంగీకరించుట నీ కర్తవ్యము. ఇదంతయు నేను నీకొఱకే చేసితిని. నాకృషిఫలమును నీవంగీకరింపుము. నీప్రమేయములేకనే నగరము, రాజ్యము నీకధీనమైనవి. వశిష్ఠాది విజ్ఞులసూచనలను అనుసరించి నీతండ్రి ఉత్తరక్రియలు పూర్తిచేసి పట్టాభిషేకమునకు సిద్ధమగుము. నీవు క్షత్రియుడవు. నీతండ్రిరాజ్యమునకు వారసుడవైతివి. నీపైపడిన కర్తవ్యమునకు అనుసరింపుము".

ఇపుడు భరతుడు తనతల్లిచేచేయబడిన దుష్కృత్యము నంతటిని గ్రహించెను. శోకక్రోధములచే ముంచబడినవాడై తనను తాను నిగ్రహించుకొనలేకపోయెను. "ఏమిపనిచేసితివి? నేనెన్నడైన రాజ్యమును అపేక్షించితినా? నాతండ్రి మరణమునకు, నాసోదరుని రాముని రాజ్యబహిష్కరణకు కారకురాలవై నన్ను రాజ్యమును పాలింపుమని

కోరుచున్నావు. ఇది నాశోకాగ్నియందు ఆజ్యముపోయుటే. నిన్ను భార్యగనెన్నుకొనుటలో నాతండ్రి ఎంత దురదృష్టవంతుడోకదా! కౌసల్య సుమిత్రకూడ శోకముతో మరణింతురు. నీయందు భక్తిసంయుతుడగు రామునకిట్లు చేయుటకు ఎట్లుసిద్ధపడితివి? కౌసల్యనిన్ను తనస్వంత చెల్లెలుగ భావించెను. నేను రామునియందెంత అనురాగముగలవాడనో నీకుతెలియదా? దురాశ నీవిజ్ఞానమును నాశమొనర్చెను. నాసంతోషము కొఱకు అంతమూర్ఖపుటాలోచన ఎట్లుచేసితివి? వారిపరోక్షమున రాజ్యపాలన నేను చేయగలనని నీవెట్లునమ్మితివి? నాసహాయముతో నీకోరిక ఎన్నడునెరవేరదు. నిన్ను నాతల్లిగనేనిక చూడలేను. నీతో నాకుగల సంబంధమును తెగతెంపు చేసికొందును. రాజవంశమర్యాద నతిక్రమించి, చిన్నవాడు రాజ్యాభిషిక్తుడు కావలెనని ఎట్లు తలచితివి? నేను మనరాజవంశమర్యాదకు భిన్నముగ నీకోరికను నెరవేర్చను. నేను అడవికి పోయి రాముని వెనుకకుతెత్తును. రాజమకుటమునతని శిరసుపైనుంచి, అతనిసేవకునిగ సంతోషింతును". భరతుడు కంఠధ్వనిని పెంచి, "నీవు ధర్మ పథమును తప్పితివి. నీవు భర్తను చంపిన హంతకివి. హంతకురాలి కుమారునిగనుండుటకంటె నేను మరణించుటయే ఉత్తమము. నీవు ఉత్తముడగు అశ్వపతికి కుమార్తెవుకావు. రాక్షసివి. కౌసల్యయొక్క ఏకైకపుత్రుని బహిష్కరించిననీవు ఏనగరమునకు పోదువో, ఏమిశిక్షననుభవింతువో తెలియదు. నేను తండ్రిగారికి ఉత్తరక్రియలు నిర్వర్తించి, అడవికి వెళ్ళి, రాముని పాదములపైపడి, అతనిరాజ్యమునకు అతనిని తీసికొని వత్తును. అపుడు నాపాపమును, నీచర్యవలన

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

నాకుకలిగిన అవమానమును తొలగించుకొనుటకు దండకారణ్యమున తపస్వివలె జీవితముగడుపుదును".

తల్లిపై క్రోధవాక్కులతో తనపరితాపము చల్లారదని తలచి తల్లిదృష్టిని సహింపలేక భరతుడు తనశోకనివృత్తికి కౌసల్యభవనము మంచిదని భావించి అచ్చటకు వెళ్ళెను. ఆవిధముగ కైకేయి గాలిమేడలు కూలిపోయెను. వెంటనే భరతుని రాకవార్త భవనమంతటావ్యాపించెను. శోకముతోనున్న కౌసల్య ఈవార్తవిని సంతోషించి సుమిత్రకు చెప్పెను. "రమ్మ్క, భరతుని చూతము" అనుచు రెండు అడుగులు వేయగానే భరతుడే స్వయముగ వారికరుణకొఱకు బతిమాలునిమిత్తము వచ్చుటచూచిరి. తనకు కల్గిన అదృష్టమును పొందుటకు తొందరగ వచ్చియుండునని కౌసల్య భరతుని రాకగురించి ముందు తలచెను. వశిష్ఠాదివృద్ధులు, మంత్రులు దశరధుని అంత్యక్రియలు చేయించుటకు, భరతుని పట్టాభిషిక్తుని గావించుటకు కబురంపి రప్పించినట్లు ఆమెకు తెలియదు. కావున భరతునిచూడగనే కౌసల్యకు భర్తృపుత్రులఎడబాటు మనసును కలచివేయగ నెమ్మదిగ భరతునితోనిట్లనెను. "భరతా! కైకచేనీకు భద్రపరుపబడిన రాజ్యపదవి నీకైనిరీక్షించుచున్నది. నీవు ఏమాత్రము భయపడనవసరములేదు. తీసికొనుము. ఒకేఒక వరమిమ్ము. మీతండ్రిచితిపై నన్ను ప్రవేశింపనిమ్ము". ఈమాటలు భరతుని చెవిలో విషము పోసినట్లనిపించెను. అతడు కౌసల్యపాదములపై పడి అవాక్కయ్యెను. "ఓభరతా! కనీసము అడవియందు రాముడున్న ప్రదేశమునకు నన్నుతీసికొనిపొమ్ము" అని కౌసల్య మరలపలికెను.

కౌసల్యమాటలువిని భరింపలేక, నోటమాటరాక భరతుడు మూర్ఛిల్లెను. కొంతసేపటికి లేచి యిట్లనెను. "అమ్మా! అమాయకుడనైన నన్ను ఎందుకు చిత్రహింస పెట్టుచున్నారు? నేను సుదూరప్రాంత మందుంటిననియు, ఇక్కడ జరుగుచున్న దుర్మార్గపు సంఘటనలు నాకుతెలియవనియు తెలిసికొనుము. నాకురామునిపట్లగల అను రాగమును నీవెరుగవా? నేను అతనికి అట్టిఅపకారమెన్నడైన చేయుదునా? ఈచెడు గురించి నాకేమాత్రము సంబంధము ఉన్నను ప్రపంచమందలి అన్నిపాపములు నాకు సంక్రమించుగాక! నాకు ఏమాత్రము కోరికలేదు". ఈ కుతంత్రమునందు తనకేమాత్రము భాగమున్నను తనకు ఘోరమైన పాపములు, వానికి శిక్షలు కలిగితీరునని భరతుడు వివరించెను. భరతుని నిజాయితీని కౌసల్య గుర్తించి భరతుని మృదువుగ నేలపైనుండిలేపి, రామునితో సమానముగ భావించి అతనితలను తనఒడిలోనిడుకొని సముదాయించెను. "కుమారా! నీఅమాయక హృదయవేదన చూచిన తర్వాత నావిచారము ద్విగుణీకృత మయ్యెను. మనమేమి చేయగలమునాయనా! మనము విధియొక్క ఆటవస్తువులము. ఈ ప్రపంచమున నీమంచితనమునకు ప్రతిఫలము లభించుగాక!" అనెను.

మరణించిన దశరధుని అంత్యక్రియలు నిర్వర్తింపబడినవి. వశిష్ఠాదివిజ్ఞులు, పెద్దలు భరతశత్రుఘ్నులకు గంభీరమైన శాస్త్రీయమైన ఓదార్పును అందించిరి. రాజమరణమునకు పదునాల్గురోజుల తరువాత మంత్రులు రాజ్యసభా సమావేశమొనర్చి భరతునితోనిట్లుపలికిరి.

"దశరధమహారాజు పరలోకగతులయ్యిరి. రామలక్ష్మణులు అరణ్యమం దున్నారు. రాజ్యము అరాచకముగనున్నది. మాప్రార్ధనమేరకు పరిపాలన బాధ్యత నీవుస్వీకరింపవలసియున్నది. పట్టభిషేకమునకు అన్నిఏర్పాట్లు పూర్తి అయినవి. పౌరులు, మంత్రులు నీఅంగీకారముకొఱకు ఎదురు చూచుచున్నారు. నీకిదిన్యాయ బద్ధముగ నీపూర్వులనుండి సంక్రమించిన రాజ్యము. అభిషేకింపబడి ధర్మముగ మమ్ము పరిపాలింపవలసిన బాధ్యతనీది". భరతుడు ముకుళితహస్తములతో పట్టాభిషేకార్ధము సేకరింపబడిన సామగ్రిచుట్టును ప్రదక్షిణముచేసి సభాసదులకు, పెద్దలకు గంభీరకంఠధ్వనితోనిట్లు చెప్పెను. "మీరు రాజ్యపదవిని అంగీకరింపుమని నన్నుకోరుట సమంజసమని నేను భావింపను. మనగృహ సాంప్రదాయము ప్రకారము సింహాసనము అగ్రజునకు చెందవలసి యున్నది. మీఅందర ఆదరణతో నేను అడవికివెళ్ళి సలక్ష్మణుడైన శ్రీరాముని అయోధ్యకు తీసికొనివచ్చి అతడు అభిషిక్తుడగునట్లు చేయవలెనని నిశ్చయించితిని. దీనికొఱకు మనుజలను, వస్తు సముదాయమును సిద్ధముచేయుడు. ప్రయాణమునకు మార్గమును తయారుచేయుడు. రాజమకుటముపట్ల నాఅంగీకారము లేకపోవుటయే నాతుదినిర్ణయము".

రాజకుమారునిమాటలు వినుచునే సభ అంతయు సంతోషించి భరతుని సలహాను స్తుతించిరి. భరతుని అనుసరించుటకు సైన్యము, పరివారము సిద్ధమయ్యెను. మార్గముతయారుచేయుటకు కొంతపరివారము పరికరములనుతీసికొని ముందువెళ్ళిరి. అడవిప్రాంతము

పరిచయముకలవారును, కాలువలు, నూతులు త్రవ్వువారును, నౌకానిర్మాతలును, వడ్రంగులును, శ్రీరాముని అయోధ్యకు కొనితెచ్చుట యందు కోరికతో కుతూహలముతో పనిచేసిరి. చెట్లు నరకబడినవి. వంతెనలు వేయబడినవి. రాజును, పరివారమును పయనించుటకు విశాలమార్గము వేయబడినది. ఎత్తుపల్లములు చదునుచేయబడినవి. సైన్యమునకు విశ్రాంతి ప్రదేశములును, త్రాగుటకు మంచినీరును అన్ని సదుపాయములు వెంటనే సిద్ధముచేయబడినవి. భరతుని అరణ్య ప్రయాణమునకు ఏర్పాట్లు చేయబడినను వశిష్ఠుడును, మంత్రులును మరల సభాసమావేశమునేర్పాటు చేసిరి. భరతుని రాజ్యాభిషిక్తుని చేయుకోరికను వారువిడువలేదు. వారు దూతలను భరతుని భవనమునకు పంపి అతనిని సభాభవనమునకు ఆహ్వానించిరి. మంగళ వాద్యములతో అతనిని సమీపించిరి. ఇదంతయు అతనిని బాధించెను. భరతుడు వాద్యకారులను మాన్పించి దూతలను వెనుకకు పంపి శత్రుఘ్నునితోనిట్లనెను. "నేను రాజ్యపదవిని తిరస్కరించినతర్వాత ఇంకను వీరు నన్నెందుకు హింసింతురు? దీనికి నాతల్లియే కారణము. నాతండ్రి స్వర్గమునకువెళ్ళి ఇదంతయు ఒంటరిగ భరించుటకు నన్ను విడిచినాడు. రాజ్యమునకు ప్రభువు అవసరము. మనము వెంటనే రాముని వెనుకకు తిసికొనిరావలెను". రాజ్యసభ నిర్దుష్టమైన రాజకుమారుని ప్రవేశముకొఱకు కుతూహలముగ చూచుచు కూర్చుండిరి. పూర్ణిమచంద్రుడు ఆకాశమున ఉదయించినట్లు భరతుడు

సభాభవనమును ప్రవేశించెను. పెద్దలకు నమస్కరించి అతడు కూర్చుండెను.

"ఈరాజ్యము నీతండ్రిచేతను నీసోదరుడు శ్రీరామునిచేతను నీకుఈయబడినది. ప్రాచీన సాంప్రదాయముననుసరించి దీనిని అంగీకరించి నీవు మమ్ము రక్షింపుము" అని వశిష్ఠుడు పలికెను. భరతుని మనస్సు దూరముననున్న రామునితోనున్నది. అతనికనులనుండి కన్నీరు కురిసెను. ఆరాజ్యసభామధ్యమున యువరాజకుమారుడు గట్టిగానేడ్చెను. దుఃఖముతో కులగురువులపట్ల గౌరవముతో భరతుడిట్లు పలికెను. "ఈరాజ్యము, నేను అన్నియు రామునకుచెందినవి. మాఅందరయందు పెద్దవాడు, ధర్మపరుడు, దిలీపనహుష చక్రవర్తులతో సమానుడు. అతడే అర్హతగలరాజు. ముల్లోకములను పాలింపతగినవాడు. అడవియందలి శ్రీరామునకు నావిధేయతను ఇక్కడనిలబడి ప్రకటించుచున్నాను. అతడేరాజు. నేనుకాదు". భరతుడిట్లు పలుకగనే సభ ఆనంద బాష్పములరాల్చెను. "నేను రాముని అంగీకరింపజేయలేకపోయినచో, నేను తపస్సు చేయుచు అరణ్యమందే ఉందును. ఓపెద్దలారా! రాముని తీసికొనివచ్చుట మీబాధ్యత. రాముని వెనుకకు అయోధ్యకుతెచ్చి రాజునుచేయుటకు నేనుచేయగలిగినదంతయు చేతును" అని భరతుడు పలికెను.. అపుడు తనసమీపమున నిలిచియున్న సుమంత్రుని అరణ్యప్రయాణపు ఏర్పాట్లను త్వరితముచేయుమని ఆదేశించెను. శ్రీరామునిరాకకు ముందుగా నగరము తన ఆనందమును వ్యక్తపరచెను.

భరతుని బాధ్యతాయుతమైన అనురాగమును ఏశక్తియు నిరోధింపలేదని భావించిరి.

ఆటవికనాయకుడు గుహుడు గంగానదిని పరిశీలించి చూచి నదిఆవలియొడ్డున అసాధారణమైన అలజడిని కనుగొనెను. అచట పెద్దసైన్యము విడిసియున్నది. తనప్రక్కనున్న బంధువులకు ఆసైన్యమును చూపి ఇట్లనెను. "ఎవరితడు? పెద్దసైన్యముతో అతడిటకెందుకు వచ్చెను? నదినిదాటతలచినట్లు కనబడుచున్నది. పతాకమును బట్టి కైకేయికుమారుడు భరతుడును, అతనిసైన్యముగా తోచుచున్నది. అవును రధముపై ఎగురుచున్న కేతనమును నేను చూచుచుంటిని. అది వృక్ష చిహ్నముగ గుర్తించితిని. అది అయోధ్యరాజుల కేతనమే. అది నేటి అయోధ్యాధిపతియు, శ్రీరామునకు శత్రువునైన భరతుడే. తనతల్లి కైకద్వారా రాజ్యపదవి అన్యాయముగ భద్రపరుప బడినను, రామునివధించుటకిక్కడకు వచ్చినట్లుతోచుచున్నది. మన బంధుమిత్రులను, యుద్ధవీరులను సమీకరింపుడు. ఈదరిని అందరను సిద్ధముగ నిలుపుడు. నౌకలను ప్రోగుచేసి సాయుధులైన జనులతోనింపి యుద్ధమునకు సిద్ధముచేయుడు. పరిశీలించి చూతముగాక! ఈ నూతనవ్యక్తులు రామునకు ఇష్టులైనచో వారు నదినిదాటుటకు మనము సహకరింతము. కాని వారు విరుద్ధభావముతోనున్నయెడల గంగను దాటకుండ వారిని మనము ఆటంకపరతుము". అన్నిఏర్పాట్లు చేసికొని గుహుడు కొన్నిబహుమతులు వెంటనిడికొని ఒకనౌకనుఎక్కి భరతుని కలియుటకు వెళ్ళెను.

అదేసమయమున ఆవలియొడ్డున సుమంత్రుడు భరతునకిట్లు చెప్పుచుండెను. "చూడుము. శ్రీరామునకు భక్తిసహితుడగు స్నేహితుడు, ఆటవిక నాయకుడు గుహుడు తనపరిజనులతో మనకు స్వాగతముపలుకుటకు వచ్చెను. అతడీప్రాంతమునకు పాలకుడు. అతడును, అతనిబంధువులును ఈయడవిప్రాంతమంతయు బాగుగ పరిచయముకలవారు. వారు రాముడెచటనున్నదియు తెలిపి మనలను వేగముగ క్షేమముగ ఆప్రదేశమునకు కొనిపోవుటకు సమర్థులు". ఇంతలో గుహుడు ప్రవాహమును దాటి భరతునిసమీపించి నమస్కరించి ఇట్లు పలికెను. "మేము ఊహింపని మీరాకకు మేము ఆశ్చర్యపడినను, ఇచ్చటనున్న నాసంపదనంతటిని నీదిగ గుర్తించి నన్ను ఆజ్ఞాపింపుము. నిన్నును, నీసైన్యమును స్వాగతముపలికి మీకు వినోదముకల్గించుట నాకుగౌరవప్రదముగ భావింతును". "ఓ నాసోదరమిత్రుడా! అంతపెద్ద సైన్యమునకు ఆతిథ్యమిచ్చుటకు సిద్ధపడిన నీదయ మెచ్చుకొనదగినది. నేను భరద్వాజాశ్రమమునకు వెళ్ళవలెనని కోరుచున్నాను. మాకు మార్గము తెలియదు. ఈనదీప్రవాహమును మేము దాటవలసియున్నది". అని భరతుడు జవాబిచ్చెను. గుహుడు వినయముగ నమస్కరించి గౌరవముగనిట్లుచెప్పెను. "ఓప్రభూ! నేనును, నాసేవకులును మీకు మార్గదర్శకులుగ మీవెంట వచ్చుటకు సిద్ధముగనుంటిమి. నీవుతెచ్చిన పెద్దసైన్యమును చూడగానే నాకుకల్గిన సందేహమును ప్రకటించుటకు నన్ను క్షమింపవలెను. రామునకు వ్యతిరేకముగ నీకేవియు అభిప్రాయములు లేవుకదా?" ఈమాటలచే బాధపడిన మనసు కలవాడై,

నిర్మలహృదయముతో భరతుడిట్లనెను. "అయ్యో! రామునిపట్ల అనురాగ ముగలజనులు నన్ను అనుమానించి భయపడుటకంటె, ఇంతకంటె గొప్ప అవమానమునాకేమిగలదు? గుహా! నీకే భయసందేహములును అవసరము లేదు. నాతండ్రినికోల్పోవుటచే రాముడే నాకిపుడు తండ్రి. రాముని అయోధ్యకు తిరిగిరమ్మని ప్రార్థించుటకే నేనిటకు వచ్చితిని. నామనసునందు ఇంతకంటె ఏమియులేదని నేనుప్రమాణము చేయుచున్నాను".

రామునిపట్ల భరతునకు గల అనురాగమును, జరిగినదానికి అతనికిగల విచారమును అతనిముఖమునచూచి గుహుడు సంతోషించెను. "ప్రభూ! ఈప్రపంచమున పరిత్యాగమునందు నీతోసమాను లెవ్వరు? నీవుతప్ప తనకువచ్చుసంపదను, అధికారమును ఎవరు వదులుకొందురు. నీకీర్తియు, నీతేజస్సు శాశ్వతముగ ప్రకాశించును" అని మెచ్చుకొనెను. ఆయాటవికనాయకుడు భరతునిసైన్యమునకు వలసిన వన్నియు సమకూర్చెను. గృహస్థులును, అతిథులును ఆరాత్రికి విశ్రమించిరి. గుహునితో కలయిక భరతుని విచారమును పెంచెను. అతనిని ఊరడించుటకు గుహుడు ప్రయత్నించెను. "రాముడిచట నున్నపుడేమి భుజించెను? ఎక్కడకూర్చుండెను? ఎక్కడ పరుండెను? ఏమిచెప్పెను? ఏమిచేసెను?" అని భరతుడు ప్రశ్నించెను. గుహుడాప్రశ్న లన్నింటికి ప్రేమతో సమాధానములిచ్చి రాముడు నిద్రించినప్రదేశమును చూపెను.లక్ష్మణుడెచట నిదురించెనని భరతుడు అడుగగా "సీతారాములు కటికనేలపై పరుండియుండగా నేనెట్లునిద్రింపగలను? అనికన్నీరు

పెట్టుకొనుచు లక్ష్మణుడు నాప్రక్కనే నావలెనే ధనుర్ధారియై రాత్రియంతయు నిలబడెను" అని గుహుడు చెప్పెను. భరతుడు ఆరాత్రి సీతారాములు నిదురించిన ప్రదేశమును చూచి దుఃఖించుచున్న రాణులకు చూపెను. "రాముడేమితినెనని భరతుడడుగగా "ప్రభూ! ఆరాత్రి వారు ఉపవసించిరి. లక్ష్మణుడు కొంత నీరు తీసికొనిరాగా రాముడు కొంతత్రాగి మిగిలినది లక్ష్మణునకు త్రాగనిచ్చెను. నేనుతెచ్చిన ఆహారము రుచిచూడకుండగనే తిరిగిపంపిరి. మరుచటి ఉదయము వారు కేశములను జడలుగట్టుకొని అడవిలోనికి నడచిరి" అనిసమాధానమిచ్చెను. భరతుడు "రామా! నాకొఱకు నీవుగడ్డిపై పరుండితివి. నేనా ప్రదేశమును చూచియు బ్రతికియున్నాను. వారు రాజమకుటమును ధరింపుమని నన్నుకోరు చున్నారు" అనుచు శోకించెను. అనంతరము భరతుడు "నేనేదోవిధముగ రాముని అయోధ్యకు తీసికొనివెళ్ళి సింహాసనముపై కూర్చుండజేతును. తన వనవాసదీక్ష నిర్వర్తింపబడవలెనని అతడుకోరినచో అతనికిబదులు నేను పదునాల్గు సంవత్సరములు వనవాసము చేయుదును. ఇది యుక్తమైనది, సమంజసమైనది. కావున అతడంగీకరించునని తలతును" అనుచు తనను తాను శాంతపరచుకొనెను.

ఉదయము భరతుడులేచి "శతృఘ్నా! ఇంకనూనిద్రించు చుంటివా? తెల్లవారినది. సైన్యము నదిని దాటవలసియున్నది. గుహుని కొఱకు కవురంపి ప్రయాణమునకు ఏర్పాటుచేయించుకొనవలెను" అనగా "సోదరా! నేను నిద్రపోలేదు. నీవలెనె నేనును రాముని గురించియాలో చించుచు రాత్రిని గడపితిని" అని శతృఘ్నుడు జవాబిచ్చెను. వారు

మాటాడుకొనుచుండగనే గుహుడువచ్చి వందనమాచరించి నౌకల గుంపు సిద్ధముగనున్నదని తెలిపెను. సైన్యము, సామగ్రి అంతయు నౌకలపై పెట్టబడినవి. గొప్ప ఉత్సవమువలె నదినిదాటు కార్యక్రమము ఆనందకర మయ్యెను. భరతుడు బయలుదేరినపుడు రాముడు తప్పకతిరిగి వచ్చునని ప్రజలు నిశ్చయించుటచే భరతుని మనసులోని దుఃఖమును వారు చూడలేదు. రాముడు మహారాజుగ తమమధ్యకు వచ్చుననియు, ఇటీవలి తమదుఃఖములన్నియు దుస్స్వప్నములవలె తొలగిపోవు ననియు సంతోషించుచు వారు ముందునకేగిరి. సైన్యమంతయు నదిని దాటినది. భరతుడు ప్రత్యేకనౌకయందు గంగానదిని దాటెను. భరద్వాజాశ్రమమును చేరిరి.

భరతుడు, అతని పరివారమును ప్రయాగ అరణ్యమును చేరినతర్వాత వారు ఒక అందమైన ఉపవనమును, దానినడుమ ఒక కుటీరమును కాంచిరి. అదియే భరద్వాజాశ్రమమని తెలిసికొని భరతుడు తనపరివారమును అచట విడిచి, వశిష్ఠుడు మున్నగు కొలదిమంది పెద్దలచే అనుసరింపబడినవాడై కాలినడకన ఆయాశ్రమముకడకు నడచెను. తనపట్టువస్త్రములను, ఆయుధములను విడిచిపెట్టి కాలినడకన వశిష్ఠుడును, మంత్రులును వెంటరాగా ఆశ్రమమును సమీపించి మంత్రులనుకూడా అచటనిలిపి తానును వశిష్ఠుడును మాత్రమేముందుకు వెళ్ళిరి. భరద్వాజుడు వశిష్ఠుని చూడగానే తన ఆసనమునుండి లేచి ఆ సుప్రసిద్ధ అతిధికి స్వాగతసత్కారములు చేయుటకు పాద్యము తెచ్చుటకు తనశిష్యులను నియమించెను. భరతుడు భరద్వాజునకు వినయ

వందనములనాచరించెను. అతడు దశరథపుత్రుడు భరతుడని తెలిసికొని భరద్వాజుడు అతనికి రాజగౌరవమునందించెను. భరద్వాజుడు ఉద్దేశ పూర్వకముగనే దశరథుని దురదృష్టమును గురించి ప్రసంగమును వెనుకకు పెట్టెను. భరద్వాజుడును గుహునివలెనే భరతుని అనుమానించి ప్రశ్నలు వేసెను. భరద్వాజుని ప్రశ్నలువిని భరతుడు దుఃఖించెను. "ఇట్టి జీవితముకంటె మరణమే మేలు" అని ఏడ్చుచు ఇట్లు పలికెను. "అయ్యా! మీరు నన్ను సందేహించుచున్నారా? నాకుతెలియకుండా నాపరోక్షము నందు నాతల్లి చేసినపనికి నన్ను నిందింపకుడు. నేను నాయథాశక్తి ప్రయత్నించి శ్రీరాముని అయోధ్యకు తీసికొనివెళ్ళి పట్టాభిషిక్తుడగుటకు అంగీకరింప చేయుటకు వచ్చితిని. నాజీవితాంతము అతనికి సేవకునిగా నుండుట నా అభిప్రాయము. శ్రీరాముడు ఎచట నివసించుచున్నాడో మిమ్ములనడిగి తెలిసికొని వెళ్ళి అతనిని తిరిగి ఇంటికి రమ్మని ప్రార్థించు టకు మీకడకు వచ్చితిని. ఇట్టి నన్ను మీరుసందేహించుచున్నారు".

అంతట భరద్వాజుడు ఇట్లు పలికెను. "భరతా! నీనిజ స్వభావము నేనెరుగుదును. నీవు రఘువంశజుడవు. నీఅనురాగమును, రాజభక్తిని బహిర్గతముచేసి, నీతేజస్సు విస్తరింపజేయుటకు కోరి నేను నిన్ను ప్రశ్నించితిని. విచారింపకుము. రాజపుత్రుడు శ్రీరాముడు చిత్రకూట పర్వతముపై నివసించుచున్నాడు. నేటికి ఇక్కడ ఉండుము. రేపునీవును, నీమంత్రులును అచటకు వెళ్ళవచ్చును. మా ఆశ్రమమునందు ఒకరోజు మా ఆతిథ్యమును అంగీకరించి మాకు సంతోషము చేకూర్చుము". ఆ మాటలువిని భరతుడు "స్వామీ! మీఆశీస్సులు, మీఅనురాగపూరిత

వాక్కులే మాకువిందు. ఇంతకంటె ఏమికావలెను" అనెను. ఒక పేద తాపసిపై పెద్ద సైన్యమును పోషించు భారమును మోపుట భరతునకు ఇష్టములేదని భరద్వాజుడు గ్రహించి చిరునవ్వు నవ్వెను. "నీ మంచితన మునకు, నీహోదాకు తగినవిధముగ నీకువిందుచేయుట మాకర్తవ్యము. మీసైన్యమును, మీపరివారమును విడిచి వచ్చితివేమి?" అని అడిగెను. "ఋష్యాశ్రమమునెవ్వరును పరివారముతో సమీపింపరాదను నియమ మును అనుసరించితిని. నన్ను అనుసరించి పెద్ద గుంపుకలదు. వారందరును ఇచటకువచ్చిన అదిమీకు పెద్దకలతకాగలదు" అని జవాబిచ్చెను. "అట్టిదేమియులేదు. వారందరను ఇక్కడకు రమ్మని ఆజ్ఞాపింపుము" అని భరద్వాజుడనెను. భరతుడట్లే ఆజ్ఞాపించెను. భరద్వాజుడు తన హోమాగ్నిశాలకు వెళ్ళి మంత్రములను చదువుచు మూడుమార్లు జలములు చల్లి, విశ్వకర్మ, మయ, యమ, వరుణ, కుబేర, అగ్ని మొదలుగాగల దివ్యస్వరూపులను ఆహ్వానించి అనుచరులతో కూడిన భరతునకు గొప్పవిందును ఏర్పాటుచేయుడని ఆజ్ఞాపించెను. అపుడు ఒక అద్భుతము జరిగెను. భరద్వాజాశ్రమమున సిద్ధముచేయ బడిన విందు విశ్వామిత్రునకు పూర్వము వశిష్ఠుడు ఇచ్చిన విందును పోలియున్నది. ఇక్కడ ఉన్న విభేదమొక్కటే. అది వివాదము, కలహ మును లేకపోవుట. ప్రతిఒక్కరికి కావలసినంత వసతి సదుపాయము కలదు. సుగంధము, పుష్పములును, ఆహారపానీయములును, దివ్య రమణులచే సంగీత నృత్యములును అన్నియు ఏర్పరుపబడినవి. ప్రతిస్పర్ధులగు రాజులు ఒకరికొకరు ఏర్పాటుచేసుకొను విందులకంటె

భరద్వాజుని విందు మిక్కిలి వైభవముగా, దివ్యముగా నున్నది. నివాస భవనములును, వాహనములును పరిజనులును ఒక్కసారిగ సిద్ధమైనవి. అతిధులు ఆవిందునందు తమనుతాము మరచిపోయిరి. ప్రస్తుత సుఖానుభవముతో పరవశులైన భరతుని సైనికయోధులు "మనము దండకారణ్యమునకు పోవలదు. మనము అయోధ్యకును తిరిగివెళ్ళ వలదు. మనమెప్పటికిని ఇక్కడే ఉందము" అని తమలోతాము ఆనందాశ్చర్యములతో అరచిరి. అతిధులందరును తృప్తిగాభుజించి వెంటనే గాఢముగ నిద్రించిరి.

మరుచటి ఉదయము భరద్వాజుడు భరతునకిట్లు చెప్పెను. "ఇక్కడనుండి రెండున్నర యోజనములదూరమున మందాకినీనది ప్రవహించుచున్నది. దానితీరమునందు నిర్జనమైన ఒకవనముకలదు. దానికి దక్షిణమున చిత్రకూటపర్వతము కలదు. ఆకొండ చెరియయందు గల కుటీరమందు నీసోదరులు రామలక్ష్మణులును, సీతయు నివసించు చున్నారు" అనుచు వారువెళ్ళవలసిన మార్గమును వివరించెను. భరద్వాజుని ఆశీస్సులు పొందుటకు ముగ్గురురాణులును వచ్చిరి. "ఈమె శ్రీరామునితల్లి కౌసల్యాదేవి. ఆమెకు కుడిప్రక్కనున్న ఈమె లక్ష్మణ శత్రుఘ్నుల తల్లి. ఈమె నాతల్లి. నావిచారమంతటికిని కారణభూతురాలు" అనుచు భరతుడు కైకేయిని భరద్వాజునకు చూపెను. ముగ్గురురాణులును మహర్షికి సాష్టాంగనమస్కారములు చేసిరి. భరద్వాజుడు తనప్రశాంత దృక్కులను ప్రసరించుచు "నీతల్లిని కఠినముగ విమర్శింపకుము. జరిగినదంతయు ప్రపంచమునకు మేలుచేయుటకే జరిగినది" అనెను.

భరద్వాజుడు సూచించిన మార్గముననుసరించి భరతుడు, అతని పరివారము అరణ్యమార్గము పట్టెను. దూరమునుండి చిత్రకూటమును చూచిరి. కుతూహలముతో ముందుకు సాగగా రాజకుమారుల నివాస ప్రదేశము పొగచే గుర్తింపబడినది. సంతోషముతోకూడిన అరపులు అరచిరి. పరివారమునంతటిని దిగవిడచి భరతుడు వశిష్ఠుని, సుమంత్రుని వెంటనిడికొని ముందునకువెళ్ళెను.

భరతుడు ఆవిధముగ ఇతరులచేచేయబడిన అనర్ధమును తప్పించుకొను ప్రయత్నములో నిమగ్నుడైయుండగా చిత్రకూట పర్వతప్రాంతారణ్యమున కుటీరనివాసము ఆనందముగా సాగుచున్నది. లక్ష్మణుడును సీతయు ప్రక్కనున్న శ్రీరామునకేలోపమును లేదు. పర్వతారణ్య దృశ్యములశోభ పక్షులకిలకిలారావములు రాముని హృదయానంద దాయకములయ్యెను. శ్రీరాముడు రాజ్య బహిష్కరణ వలన కల్గిన విచారమును మరచెను. "సీతా! ఆపక్షుల ఆటలు చూడుము. ఆపర్వతముపై వివిధ వర్ణములతో శోభిల్లు రాతిని చూడుము. పూలతోనిండియున్న ఈచెట్లను, తీగలను చూడుము. ఇంత సంతోష దాయకమని తెలియక మనము అరణ్యవాసమునుగురించి భయపడితిమి. నేనిచ్చట చాల ఆనందముగానుంటిని. ఇంతేగాక నాతండ్రి వాగ్దానమును నిలిపితినను అదనపు ఆనందముననుభవించుచున్నాను. వీనినన్నింటిని మించి మాసోదరుడు భరతుడు రాజ్యపాలన చేయుచున్నాడని నాకానందముగానున్నది". ఆవిధముగా రాముడు తనవిచారమునుండి తప్పించుకొని సీతను ఆనందపరచెను.వారు పర్వతమునుండి క్రిందకుదిగి

కొన్నిమార్లు మందాకినీనదికిపెళ్ళి అక్కడకాలముగడుపుచుందురు. "ఆఇసుకతిప్పలను చూడుము. పద్మములపై ఆడుచున్న ఆహంసలను చూడుము. ఈప్రవాహము నీవలెనే ప్రేమాస్పదముగానున్నది. జంతువులు నీరుత్రాగుటకు వచ్చురేవులు క్రొత్తమట్టితో అందముగా నున్నవి. దీనివలె కుబేరుని రాజ్యమందలి నదికూడా ఇంత అందముగా నుండదు. ఋషీశ్వరులు ఇచట స్నానముచేసి ప్రార్ధనలుచేయుచు నిలుచుట, సూర్యుని స్తోత్రములు చేయుట చూడుము. కొమ్మలనుండి నీటిపై రాలుచున్న పూలనుచూడుము. ముత్యములను పెదజల్లు సెలయేరును చూడుము. జనసమ్మర్దముగల పట్టణమునకు దూరముగ అడవియందుండుట నిజముగ మన అదృష్టము. అయోధ్యలో మనము నిత్యము ఇచ్చట స్నానమాచరించు నిర్మలాత్ములైన ఋషులను చూడలేము. ఈపర్వతమే మన అయోధ్య. ఈమందాకినే మన సరయూ నది. నీవును లక్ష్మణుడును నాప్రక్కనుండగ నేనెంతో ఆనందముగా నున్నాను. నిర్భీతిగ జంతువులు ఈప్రవాహమునందు నీరుత్రాగుటను చూచుట ఎంత ఆనందదాయకము. ఇచ్చటినీటియందుమునుగుచు, ఫలములను, దుంపలను తినుచు, అడవియందు తిరుగుచు, కొండల నెక్కుచు, రాజ్యమును అధికారములను గురించి నేనెందుకు ఆలోచింప వలసియున్నది?" అనుచు సీతాలక్ష్మణుల సాహచర్యమందు శ్రీరాముడు సంతోషదివసములను గడుపుచుండెను.

వారు ఒకరోజు మామూలుగ పర్వత చెరియలపై ప్రశాంతముగ కూర్చుండియుండగ హఠాత్తుగ దూరమునందు

ధూళిమేఘము లేచి తామున్నప్రదేశమువైపు కదలివచ్చుచున్నట్లు గమనించిరి. వెంటనే పెద్ద గుంపునకు సంబంధించిన ధ్వని వినబడినది. రాముడు ఆటవికమృగములు భయముతో అటునిటు పరుగులెత్తుట గమనించెను. ఏదోసైన్యము అరణ్యమందు ప్రవేశించినట్లు తోచెను. రాముడు లక్ష్మణునితో నిట్లనెను. "లక్ష్మణా! నీవు ఆధ్వనిని వింటివా? ఏనుగులును దున్నపోతులును లేళ్ళును చిందరవందరగ పరుగిడు చున్నవి. ఏమి అయియుండును? ఏరాజైన వేటకొఱకు ఇక్కడకు వచ్చియుండునా? లేక పులిగాని, మరియొక భయంకరజంతువుగాని వెదకుచూ వచ్చినదా? చూచినాకు చెప్పుము". లక్ష్మణుడు ఒకపెద్ద వృక్షమునెక్కి చుట్టును పరికించెను. అతడు రథగజతురగపదాతులతో కూడిన పెద్దసైన్యము ఉత్తరదిశనుండి సమీపించుట చూచెను. రాముని హెచ్చరించుచు అతడు అరచెను. "అగ్రజా! వినుము. కేతనములు ఎగురవేసికొనుచు పెద్దసైన్యము సమీపించుచున్నది. మనముజాగ్రత్తగ నుండవలెను. అగ్నిని చల్లార్పుడు. రక్షణకొఱకు సీతను గుహలోనికి తీసికొనిపొమ్ము. కవచము ధరించి యుద్ధమునకు సిద్ధముకమ్ము" అనెను. "లక్ష్మణా! తొందరపడకుము. రథముపైనున్న కేతనమును మరలపరిశీలించి చూచి, ఏరాజు సైన్యమునిటకు నడుపుచున్నాడో నాకు తెలుపుము" అని రాముడు పలికెను. లక్ష్మణుడు చూచి క్రోధముతోనిట్లు పలికెను. "ఓఅగ్రజా! అతడు భరతుడు. రాజ్యముతో తృప్తిచెందక అతడిచ్చట మనలను వెంబడించుచున్నాడు. మందమారుతమువలన ఎగురుచున్న మనజండాపై వృక్షము చిహ్నామును చూచితిని.

మనలవధించుటకే అతడు వచ్చినాడు. కానికైకకుమారుడు నేడు ప్రాణములతోనానుండి తప్పించుకొనలేడు. ధర్మమును నాశముచేసిన వీనిని సంహరించుటయందేమి పాపముకలదు? వారు మనకడకు వచ్చుటవరకు ఆగుటయా? పర్వతశిఖరమునుండి యుద్ధమొనర్చు టయా? అనునదియే ప్రస్తుత సమస్య. మనలను సంహరింపవచ్చిన వానిని సంహరించుట పాపముకానేకాదు. వానితోపాటు వానితల్లి ఆశకూడ నశించును. నీవు అరణ్యమార్గములు రక్తసిక్తమైనవిగచూతువు. ఏనుగుచే నిర్మూలముచేయబడిన వృక్షమువలె భరతుడు నాచే నేలకు ఒరుగును. ఈసైన్యమును మనము నాశము చేయవలసియున్నది".

శ్రీరాముడతనిని శాంతపరుప ప్రయత్నించెను. "నీవు తలచినచో ఏడు లోకములను నీవు నాశమొనర్పగలవని నేను ఎరుగుదును. వినుము. నీవు భరతుని, అతనిసైన్యమును సులభముగ చంపగలవు. కాని నీప్రయత్నమునకు ముందు ఆలోచింపదగిన విషయ మొకటి కలదు. తండ్రిని తిరస్కరించుట, అవమానించుట, మనసోదరుని చంపుట, అంతులేని అపవాదమును సంపాదించుట వలన, యుద్ధము చేసి రాజ్యమును జయించుటవలన ఏమిమేలును పొందగలము? ఎందుకు, ఎవరికొఱకు మనము రాజ్యమును, సంపదనుకోరుట?తప్పుడు మార్గమున రాజ్యమునెవరు పొందగోరును? నీప్రేమాస్పదులతో పాలుపంచుకొనలేనపుడు రాజ్యమువలన సంతోషమేమి? వాస్తవమునకు నీవును, భరతుడు శత్రుఘ్నుడును నాతోకలసి అనుభవింపలేని సంపద, అధికారముపైపు నేను చూడను. భరతుడు ఇచటకు ఎందుకు

వచ్చుచున్నాడో నాకుతెలియును. నీకుచెప్పెదను. అతడు ధర్మమార్గము నెరుగును. అతడు రాజ్యమును నాకు అప్పగించుటకు వచ్చుచున్నాడు. అతడు తనమేనమామయింటకాక అయోధ్యయందుండినయెడల కైకేయిని వారించి, మనతండ్రిని పెద్ద విచారమునుండి రక్షించియుండెడివాడు. నన్ను అయోధ్యకు మరల తీసికొనివెళ్ళుటకే ఇపుడు వచ్చియున్నాడని నానిశ్చయము. భరతునిగురించి చెడుగ ఆలోచించి, కఠినముగ మాటలాడుట నీనేరము. నిన్నింత క్రూరముగచేయునది రాజ్యకాంక్షయే అయినచో చెప్పుము. ఆరాజ్యమును నీకిమ్మని భరతునితో చెప్పుదును. సంతోషముతో అతడట్లే చేయును. ఇందునాకు సందేహములేదు" అని రాముడు నవ్వుచు పలికెను. లక్ష్మణుడు సిగ్గుతో ముడుచుకొని పోయెను."బహుశః మనతండ్రి దశరధమహారాజు మనలను స్వయముగ చూడవచ్చుచున్నాడేమో" అని లక్ష్మణుడనెను. శ్రీరాముని మాటలువినిన తర్వాత తనభయము తగినదికాదని లక్ష్మణుడు ఒప్పందపడెను. అపుడు సైన్యమేలవచ్చుచున్నదని ఆశ్చర్యపడి, అడవియందలి మనలచూచుటకు దశరధుడు వచ్చుచున్నాడనియు, ఆయనను పెద్దపరివారము అనుసరించినదనియు తలచెను. రాముడు లక్ష్మణుని మాటలనువిని సంతోషించెను. "అవును నీవుచెప్పినట్లే అయియుండును. అరణ్య జీవితము కష్టతరమని తలచి మనలను ముఖ్యముగ సీతను మరల పట్టణమునకు తీసికొనిపోవుటకై రాజు వచ్చియుండును. కానిరాజుగారి శ్వేతాతపత్రము కనిపించుటలేదు. కాని ఏది ఏమైనను నీవు ప్రశాంతముగ

నుండవలెను". లక్ష్మణుడు మర్యాదపూర్వకముగ చేతులుముడుచుకొని రాముని ప్రక్కన నిలిచెను.

భరతుడు కొంతదూరమున సైన్యమును నిలిపి కొద్దిమంది మనుజులను పంపి పొగఎచటినుండివచ్చినదో పరిశీలించి తెలుపుడని పంపెను. వారు భరద్వాజునిచే వర్ణింపబడిన ప్రదేశమిదేననియు, ఆకుటీరము బహుశః రాముని అరణ్యనివాస స్థలమేననియు వార్త తెచ్చిరి. భరతుడు శత్రుఘ్న, వశిష్ఠ, సుమంత్రులతో ముందునకు బయలుదేరెను. వారు ముందునకు వెళ్ళుకొలది ఆయాశ్రమము వాడుకలోనున్నట్లు సూచనలు కనబడెను. నదికి వెళ్ళుటకు మార్గముకలదు. ప్రస్తుతము వారు ఆకులతో నేయబడిన ఒక కుటీరముకడకు వచ్చిరి. దానిదగ్గర పుల్లలమోపులు, అడవిదున్నల యొక్క, లేళ్ళయొక్క ఎండు పిడకలు కనిపించినవి. కుటీరమునందు గోడలపై బలమైన ధనుర్బాణములు, ఖడ్గములును కలవు. వారు చెట్లకొమ్మలపై ఆరబెట్టిన నారబట్టలను చూచిరి. భరతుడు తన అన్నగారి నివాసమునందలి ఈగుర్తులపై దృష్టినిలిపెను. లోపలినుండి నిత్యపూజలసంబంధమైన ధూప నైవేద్యములు తోచుచుండ, లోన ప్రవేశించిన భరతుడు ప్రకాశించుచున్న అగ్నిని, జడలుగట్టిన శిరోజములతో లేడి చర్మమును, నారవస్త్రములను ధరించినను, ప్రపంచశాసకునివలె విశాల వక్షస్థలముతో, విశాల బాహువులతో ప్రకాశించుచున్న శ్రీరామచంద్రుని చూచెను. అతని ప్రక్కనే సీతయు లక్ష్మణుడును ఉన్నారు. భరతుడు తనపై కేంద్రీకృతమైన అపఖ్యాతినిగురించి ఆలోచించుచు, రాముని కలిసినపుడు ఏమిచెప్ప

వలెను, ఏమిచేయవలెననియు ఆశ్చర్యపడుచుండెను. కాని ఇప్పుడు రాముని చూడగానే అతనిలో ఉప్పొంగినప్రేమతో అంతయు మరచి పోయెను. ఆప్రేమ ఇతర ఆలోచనలను భయములను ముంచివేసెను. రాముడుకూర్చుండిన ప్రదేశముకడకు అతడు ముందునకు దూకెను. "సోదరా!" అనుట తప్ప ఇంకేమియు పలుకలేక, అతని పాదములపైపడి వెక్కివెక్కి ఏడ్చెను. సుమంత్రుడును గుహుడును ఈసమయమునకు అతనిని కలిసిరి.

ప్రార్ధనపూర్వకముగ చేతులు ముడుచుకొని జడలు గట్టినకేశములతో నారవస్త్రములను ధరించి నేలపై తనముందు పడియున్న భరతుని రాముడు చూచెను. దుఃఖముతో ఉపవాసములతో అతనిదేహము శుష్కించెను. బడలికచే కమిలిపోయెను. రాముడతనిని కౌగలించుకొని శిరస్సున ముద్దాడెను. "ప్రియమైన సోదరా! నీవు మనతండ్రిని విడిచి, ఈయడవికి ఎందుకు వచ్చితివి? నీవు ఎందుకింత శుష్కించితివి?" అని అడిగెను. భరతుడు అవాక్కయ్యెను. రాముడు తమ కుటుంబ యోగక్షేమములను ప్రశ్నించెను. కొంతవిరామానంతరము భరతుడు బలమును పుంజుకొని ఇట్లు జవాబిచ్చెను. "నేనే రాజ్యాధిపతి నన్నట్లు నన్ను రాజ్యముగురించి ప్రశ్నింతువేమి? నాకును రాజ్యము నకును సంబంధమేమి? నీవు అర్హతగల రాజువైయుండగా నన్ను రాజనుపేర పిలువబడుచు రాజ్యమునెట్లు పాలింతును? నీకుసేవ చేయుటయే నావిధి. అదిచేయుటకు అవకాశమీయబడలేదు. పెద్దకుమారుడు రాజ్యభారమును వహింపవలసియున్నది. ఇదియే

న్యాయమును, ఆచారమును. నాతో అయోధ్యకు రమ్ము. మకుటమును ధరింపుము. మనకుటుంబముమీద, ప్రజలమీద నీదయను కురిపింపుము. ముసలిమహారాజుగారికీప్రపంచమునందు పనిపూర్తి అయినది. ఆయన స్వర్గమునందు ప్రవేశించిరి. నీవు అయోధ్యను విడిచి అరణ్యమునకు వచ్చినపుడు, నేను కేకయదేశమునుండి మరలివచ్చుటకు ముందు, నీఎడబాటు వలన దుఃఖముతో రాజు ప్రాణములను వీడెను. విచారమునకు తావుఈయకుము. మనతండ్రికి ఉత్తరక్రియలు చేయుము. నీగురించి ఆలోచించుచునే ఆయన అసువులుబాసెను. నీవుచేసిన ఉత్తరక్రియలు మాత్రమే ఆయనఆత్మను శాంతింపజేయును" అని భరతుడు తనను తాను నిదానించుకొని పలికెను.

శ్రీరాముడు తనతండ్రి మరణవార్త వినినంతనే గొడ్డలిచే నరుకబడిన వృక్షమువలె క్రింద పడెను. కౌసల్యకు, గుహునకు, భరద్వాజునకును వివరణ ఇచ్చినరీతిగ రామునిముందు క్షమార్పణలుగాని, వివరణలుగాని అవసరము భరతునకు కలుగలేదు. రాముని కన్నులు దుఃఖముచేకొట్టబడిన శరీరమునందు చిక్కినముఖమునందు స్థిరపడి యుండగా వివరణలనిచ్చుటకవకాశమెక్కడకలదు? రాముని అయోధ్యకు మరలించి తీసికొని వెళ్ళుటయందే సంబంధముకల భరతుడు, ఆవిషయమును తప్ప తనగురించి ఏమియును పలుకలేదు. ఆరాజకుమారులు సీతతోడను, సుమంత్రునితోడను నదికివెళ్ళి మరణించిన దశరథుని ఆత్మశాంతికి తిలోదకములను సమర్పించిరి. ఇతర సాంప్రదాయ విధుల అనంతరము ఆరాకుమారులు కుటీరమునకు తిరిగివచ్చిరి. వారు

ఒకరిచేతుల నొకరుపట్టుకొని పెద్దగా రోదించుచు తమదుఃఖమును వెడలగ్రక్కిరి. దశరథరాజకుమారులు నల్గురును, రాణులు ముగ్గురును తిరిగి ఏకమై ఒకేప్రదేశమున కలిసియుండుట చూడవీలుకలిగెనని సైన్యమునందును, పరివారమునందును సామూహిక సంతోషము వెల్లివిరిసెను. ఆసంతోష దృశ్యమును చూడవలెనని వారు ప్రవాహమువలె ముందునకు వచ్చిరి. రాముడు తప్పక అయోధ్యకు తిరిగివచ్చునని విశ్వాసముతో, జనులు సంతోషముతో ఒకరినొకరు ఆలింగనము గావించుకొనిరి. వశిష్ఠుడు రాణులు ముఫ్ఫ్వరను కుటీరమునకు నడిపించెను. మార్గమధ్యమున వారు మందాకినీనదిని చూచిరి. వశిష్ఠుడు రాకుమారులు తమ నిత్యావసరములకు నీటిని గ్రహించు ప్రదేశమును చూపగానే కౌసల్య సుమిత్రయు వెక్కివెక్కి దుఃఖించిరి. "సుమిత్రా! నీకుమారుడు ప్రతిరోజూ ఈనదీ సరోవరమునుండి ఆశ్రమమునకు నీటిని తీసికొనిపోవును. లక్ష్మణుడు తన అన్నకొఱకు సామాన్యమైన పనిని సంతోషముగాచేయుటకు సిద్ధపడెను. తన రాకుమార భుజముపై నీటి పాత్రను మోయుటకు అతడుకించపడడు". రామలక్ష్మణులు తమతండ్రి ఆత్మకు తిలోదకములను సమర్పించిన ప్రదేశమును రాణులు చూచిరి. తిలపిండములప్రక్కన దక్షిణాగ్రముగనుంచబడిన దర్భలనుకూడా తిలకించిరి. కౌసల్య సుమిత్రనుపట్టుకొని "సోదరీ! మనమహోన్నత మహారాజు మరణానంతరము గ్రహింపవలసిన ఆహారము ఇదే" అని పలికెను. వారు కుటీరమును చేరిరి. అక్కడ పర్ణశాలయందు శోకమేఘములచే కప్పబడిన ముఖములుగల రాజకుమారులు

కూర్చుండియుండగా చూచిరి. ఆదృశ్యమును చూడలేక ఆరాజమాతలు నేలకుక్రుంగిరి.

రాముడు కౌసల్యను పైకిలేవదీయగానే ఆమె తన కుసుమకోమలహస్తములతో సంతోషదుఃఖములతో అతనినితాకెను. ఆమె సీతనుకౌగలించుకొని "జనకుని కూతురును, అయోధ్యానగర ప్రభువునకు కోడలునైన ఓనాబిడ్డా! అడవియందీకుటీరమున నీవు నివసించు చున్నావా? ఓ వాడినపద్మమా! బూడిదచేకప్పబడిన స్వర్ణమా! నిన్నుచూడగానే నాహృదయము కరిగిపోవుచున్నది". మరియొక దేవగురువు బృహస్పతిని పోలిన వశిష్ఠుని పాదములకు భక్తిపూర్వకముగ రాముడు నమస్కరించి తనతల్లి ప్రక్కన కూర్చుండెను. భరతుడు సగౌరవముగ కొంచెముదూరములో రామునివైపు చూచుచు కూర్చుండెను. పెద్దలు భరతుడేమి చెప్పునో, రాముడెట్లు స్పందించునో అని కుతూహలముతో ఎదురుచూచుచు వారిచుట్టును కూర్చుండిరి. "భరతా! లేడి చర్మమును ధరించి జడలుకట్టుకొని రాజరికపుబాధ్యతలను విడిచిపెట్టి ఇక్కడకు వచ్చితివేల?" అని రాముడడిగెను. భరతుడు చాలసేపు మాటాడలేక చివరకు పెద్దప్రయత్నముతో "సోదరా! నిన్ను అరణ్యమునకు పంపి, ఆబాధను భరించలేక, మనతండ్రి ఆత్మ స్వర్గమునకు ఎగిరెను. తనదురాలోచనతో నాతల్లిపొందినమేలు ఏమనిన పాపాత్మురాలైన విధవగ శోకనిమగ్నయగుట. ప్రపంచముచే తృణీకరింప బడి ఆమె భూమియందే నరకముననుభవించుచున్నది. నీవొక్కడవే మమ్ము రక్షింపగలవు. చేయబడిన చెడును తప్పింపుము.

రాజ్యాభిషిక్తుడగుటకంగీకరించి మాకన్నీటిని తుడువుము. నేనును, పౌరులును, సైన్యమును, అనాథలైన రాణులును నిన్నీవిషయమున వేడుకొనుటకు వచ్చితిమి. నీమాటకొఱకు అందరము ఎదురుచూచు చున్నాము. మాప్రార్థనను మన్నింపుము. ఇది ఒక్కటే మా విచారమును అంతమొందించి మనవంశధర్మమును పునఃస్థాపించును. సమర్థుడైన ప్రభువు లేనిచో భూమి అనాథయగును. నీవు అయోధ్యకు మరలివచ్చి సంతోషమును రక్షణను కల్పింపుము. ఇక్కడగలమంత్రులును, నేనును నీపాదములపైపడి వేడుకొందుము. అగ్రజా! కాదనకుము" అనుచు భరతుడు కన్నీరునిండిన కనులతో రామచంద్రుని పాదములను పట్టుకొనెను.

శ్రీరాముడు భరతుని లేపి కౌగలించుకొనుచు ఇట్లనెను. "సోదరా! మనము గౌరవప్రదమైనకుటుంబమున జన్మించి మంచి మార్గమున పెంపబడితిమి. నీవుగాని నేనుగాని ఏనేరముచేయలేదు. ఓసోదరా! నీదోషమేమియులేదు. విచారపడకుము. నీతల్లినిగురించి నిర్దయగ మాటలాడకుము. నీవామెను నిందింపతగదు. మనతండ్రి మనము చేయవలసినది చెప్పుటకు అధికారము కల్గియున్నాడు. మనతల్లిదండ్రులను గౌరవించుట మనకర్తవ్యము. వారి ఆజ్ఞను నేనెట్లు అతిక్రమింతును? నేను అరణ్యమునకేగుట మనతండ్రి ఆజ్ఞను తిరస్కరించుటయగునా? ఆయననీకు రాజ్యమునిచ్చెను. అరణ్యవాసము నాకాజ్ఞాపించెను. మనజీవితములను స్థిరపరచుటకు ఆయనకు హక్కుకలదు. ఆయనఆలోచనలను కాదనుటకుగాని మార్పుచేయుటకు

గాని మనకేమిహక్కు కలదు? భూమిని పాలించుట నీకర్తవ్యము. పదునాలుగు సంవత్సరములు దండకారణ్యమున నివసించుచు మనతండ్రిగారి ఆజ్ఞను నిర్వర్తించుకర్తవ్యము నాకుకలదు. తండ్రికోరిక నెరవేర్చకుండ ప్రపంచమందరముందు నేను తృప్తికలిగియుందునా?" అనెను. భరతుడు చాలసార్లు తనను తాను నిందించుకొనెను. "నిన్ను నీవు నిందించుకొనకుము. ఇదంతయు నీకారణముగ జరిగినదని తలచకుము. విధి అన్నిటిని పాలించును. నీవిచారమును విడిచిపెట్టుము. అయోధ్యకు వెళ్ళి రాజ్యమును పాలింపుము. మనతండ్రి అప్పగించిన మన కర్తవ్యములను మనము చేయుదము" అనెను. ఈసంభాషణ వినినజనులు రాజకుమారుని నిర్ణయమును చూచి సమసంతోష దుఃఖములను పొందిరి. భరతుని అనురాగమును నిజాయితీయును వారిని గర్వముతో సంతోషముతో నింపినవి. రాముడు తననిర్ణయమును భరతునకిట్లు చెప్పెను. "నేను తండ్రిగారి ఆజ్ఞకు అవిధేయుడనుకాను. నన్ను సమ్మతింపజేయుటకు ప్రయత్నించవలదు. లక్ష్మణుడు నా అరణ్య నివాసమునందు నాకు సహాయకుడుగానున్నట్లు, నీరాజ్యపాలనయందు సహాయపడుటకు శతృఘ్నుడున్నాడు. నాప్రక్కన లక్ష్మణుడుండగా నాకులేనిదిలేదు. సోదరా! మనము నలుగురము మనతండ్రి ఇచ్ఛానుసారము చేయుదము" అనెను.

భరతుని అనుసరించి వచ్చినవారిలో జాబాలిమహర్షి రామునితోనిట్లనెను. "నీతండ్రియొక్క ఆజ్ఞగురించి నీవు మరల మరల చెప్పుచుంటివి. దశరధుని భౌతికశరీరము పంచభూతములందు కలిసి

పోయినది. ప్రస్తుతము లేని ఆవ్యక్తితో ఇంకను సంబంధమున్నట్లు మాటాడుచున్నావు. ఇదికేవలము భ్రమ. జుట్టువిరబోసుకొని శోకించు చున్న స్త్రీవలెనున్న అయోధ్య నీరాకకు నిరీక్షించుచున్నది. వెళ్ళుము. రాజమకుటము నంగీకరింపుము. జీవితానందమునను భవింపుము. భరతుడు చెప్పునది వినుము. నీకర్తవ్య నిర్వహణయందు ఓడిపోకుము". ఈఉపన్యాసము రాముని క్రోధపరవశుని చేసెను. అతడు తీక్ష్ణముగానిట్లు పలికెను. "అయ్యా! సత్యము, సదాచారములందు మీరు తక్కువ విలువనుంచుచున్నట్లు తోచుచున్నది. మీఅనాత్మవాది ప్రసంగము నన్ను అసహ్యముతో నింపినది. నీవంటి నాస్తికుడు న్యాయస్థానమునందు సహింపబడునని ఆశ్చర్యపడుచున్నాను". అపుడు వశిష్ఠుడు రామునితో నిట్లనెను. "శ్రీరామా! మొత్తముమీద నీవు అయోధ్యకువచ్చి సింహాసనమును అంగీకరింపవలెనని నాఅభిప్రాయము. నీతండ్రియాజ్ఞ పరిపాలింపదగినదే. నీవువెంటనే అతని ఆజ్ఞను శిరసావహించితివి. కాని ఇప్పుడొక క్రొత్తపరిస్థితి ఏర్పడినది. భరతుడు నిస్సహాయుడై భయపడుచు నీపాదములనాశ్రయించెను. అతనిని నీవెట్లు తిరస్కరింతువు? నీవతని నీప్రాణసమానముగ ప్రేమింతువని మాకుతెలియును. నీసహాయము కొఱకు వచ్చినవారిని నీవు ఎన్నడును తిరస్కరింపవు. ఇపుడు భరతుని నీవెట్లువ్యతిరేకింతువు? నీపాదములనాశ్రయించి శరణుకోరినవారికి సహాయపడుట నీజీవితలక్ష్యముకదా!" అయినను శ్రీరాముడు కనికరించునట్లు కనబడలేదు. అనంతరము భరతుడు సుమంత్రునితో "నాసోదరునకు నాపట్ల దయ, జాలి లేవు. దయయుంచి నాకొఱకు ఇచట

దర్భగడ్డితో ఒక పరుపును పరచుము. నేను ఆమరణనిరాహారదీక్ష స్వీకరింతును" అని పలికెను. సుమంత్రుడు సంకోచించి రామునివైపు చూచెను. అపుడు భరతుడు స్వయముగా దర్భలను తెచ్చుకొని, పరచుకొని దానిపైకూర్చుండెను. "నాయనా! ఇదిసరికాదు. లెమ్ము. అయోధ్యకువెళ్ళి నీకర్తవ్యమును నిర్వర్తింపుము. క్షత్రియ ధర్మమునకు వ్యతిరేకముగ వెళ్ళకుము" అని రాముడు పలికెను.భరతుడు పైకిలేచెను.

భరతుడు చివరిప్రయత్నముగ అయోధ్యనుండి తనను అనుసరించి వచ్చిన పౌరులను, సైనికులనుద్దేశించి "ఓ అయోధ్యాపుర వాసులారా! మౌనముగ చూచుచు నిలిచియున్నారేల? రాముడు తిరిగి నగరమునకు వచ్చుట మీకిష్టములేదా? అపుడుమీరు మౌనముగా నున్నారేల?" అని అడిగెను. "రాముడు సత్యమునుండి చలింపడు. అతడు తండ్రివాగ్దానమునకు స్థిరముగ నిలుచును. అతడు అయోధ్యకు తిరిగిరాడు. ఇంకను అతనిని బలవంతము చేయుటవలన ప్రయోజన మేమి?" అని జనులు జవాబిచ్చిరి. "అనుజా! వారిమాటలను వినుము. వారు మన ఇరువురమంచిని కోరుచున్నారు. నీతి, ధర్మమును వారిమనస్సులందు నివసించును" అని రాముడనెను. భరతుడిట్లనెను. "ఇక్కడనేను రామునివలెనే నిరపరాధిని. తనకు తగిన ప్రతినిధిని. రాజుగారిమాట నిర్వర్తింపబడవలెనన్న రాముని స్థానములో అరణ్యము నందు నన్ను నిలువనీయుడు. నాస్థానమును భర్తీచేయుచు రాముని అయోధ్యను పరిపాలింపనిండు". రాముడు నవ్వి పలికెను. "ఈవిధి నిర్వహణ మార్పు పద్ధతి ఇచ్చట వర్తించదు. ఇది వర్తకముకాదు,

వ్యాపారము కాదు. ఒకడు తనబాధ్యతలను నిర్వర్తించుటయందు తగినంతబలము చాలక అసమర్ధుడైనచో, ఒకరిబరువు మరియొకరు భరించి తొలగించుట ధర్మమే. కాని ఈసందర్భమునందు అది ఎట్లు పొసగును? అరణ్యనివాసమునకు తగినంతశక్తి నాకులేదనియు, భరతునకు మాత్రమే ఉన్నదనియు మీలో ఎవరైనను చెప్పగలరా?". అపుడు విజ్ఞుడైన వశిష్ఠుడు ధర్మము ధర్మముతో పోరాడినపుడు, ఏది గొప్పధర్మము అని ఆలోచించినపుడు, అందు ఒక పరిష్కారమార్గమును కనుగొనెను.

"ఓభరతా! రాముని అధికారమునందు, అతని ప్రతినిధిగ నీవు రాజ్యమును పాలింపుము. అపుడు నీకేనిందయు అంటదు. ప్రతిజ్ఞ నిలబడును, రక్షింపబడును". రాముడు భరతుని తనఒడిలోనికి తీసికొని చెప్పెను. "అనుజా! నాబహుమతిగ నీవు రాజ్యమును చూచుకొనుము. మనతండ్రికోరినవిధముగ దానిని అంగీకరించి పాలింపుము". రామునిపైనను భరతుని మీదను ఒకతేజము దిగివచ్చెను. ఆసమయము నందు వారిరువురును ఇద్దరు సూర్యులవలె ప్రకాశించిరి. భరతుడిట్లు పలికెను."అగ్రజా! నీవే నాతండ్రివి, దైవము. నీస్వల్పమైనకోరికయే నాధర్మము. నీపాదుకలునాకిమ్ము. నీవుతిరిగివచ్చు వరకు నీచిహ్నములు అయోధ్యను పరిపాలించును. ఈపదునాల్గు సంవత్సరములు నేను పట్టణమునకు ఆవల నివసించుచు నీస్థానము నందు రాచరికపు బాధ్యతలను నీపాదుకలకు భక్తిపూర్వకమైన వందనములు సమర్పించుచు నెరవేర్తును. ఈ అరణ్యవాససమయము

చివరిభాగమున నీవు వచ్చి రాజ్యపదవిని అంగీకరింపవలెను".
"అట్లేకానిమ్ము" అని రాముడనెను. రాముడు పాదుకలపై తనపాదములను మోపి, వానిని భరతునకిచ్చెను. భరతుడు తనంతతాను సాగిలబడి మ్రొక్కి, ఆపాదుకలను తలపై పెట్టుకొనెను. భరతుడును అతని అనుచరులును అయోధ్యకు తిరిగివెళ్ళిరి. మార్గమధ్యమున వారు భరద్వాజమహర్షిని కలుసుకొనిరి. జరిగినదంతయు తెలిపిరి. "నీసన్మార్గము చిరకాలము జ్ఞప్తియందుంచుకొనబడును. సూర్యవంశ జాతుడవు కాదా? నీరు పల్లపు ప్రాంతమునకు ప్రవహించునట్లు మీకుటుంబ సన్మార్గ ప్రవర్తన నీయందు పరుగెత్తును. నీతండ్రి దశరథుడు తప్పక సంతోషించును. అతడు మరణింపలేదు. కాని అతడు మరల నీలో శాశ్వతముగ జీవించును" అనుచు భరద్వాజుడు భరతుని దీవించెను. వారు మరల గుహుని కలిసికొనిరి. గంగను దాటి అయోధ్యను చేరిరి.

భరతుడును, అతని అనుయాయులును అయోధ్యను ప్రవేశించిరి. దశరథుడు, రాముడునులేని నగరము భరతునకు నిర్జనముగ తోచెను. కేకయ దేశమునుండి త్వరగా వచ్చినపుడు అతడు అలసటతో ఆకారములేని భయముతో నగరమున ప్రవేశించెను. కానినేడు విచారమంతయు తొలగిన నగరమున ప్రవేశించెను. అతడు జరిగిన దంతయు జ్ఞప్తియందుంచుకొనెను. ప్రస్తుతమును గురించి ఆలోచించెను. అతడు భవనమునకు వెళ్ళి రాణులను వారి నిర్జనభవనములకు తీసికొని వెళ్ళెను. తరువాత తాను సభాభవనమునకు వెళ్ళెను. "నాదుఃఖము గొప్పది. కాని నేను దానిని భరింపవలయును. నేను రామునకు

వాగ్దానము చేసినరీతిగ నందిగ్రామమునందుండి నాకార్యములను నిర్వర్తింతును. దీని నిమిత్తము అన్ని ఏర్పాట్లు చేయుడు" అని భరతుడు పలికెను. అతడు చెప్పినట్లే జరిగినది. భరతుడు గంభీరముగా సభయందిట్లు ప్రకటించెను. "ఈరాజ్యము రామునకు చెందినది. ప్రస్తుతము అతనికి ప్రతినిధిగ నన్నుండుమని శ్రీరాముడు కోరెను. మా అన్న స్థానమునందు అతని పాదుకలను నేను స్థాపించుచున్నాను. వారినుండి పొందుచున్న అధికారముతో నేను రాజువలె నాపనిని చేయుదును". అనుగుణముగ రాముడు అరణ్యవాసమును పూర్తిచేసికొని తిరిగి వచ్చునంతవరకు, భరతుడు నందిగ్రామములోనుండి, మంత్రుల సహాయముతో రాజ్యమును పాలించెను. నిజమునకు ఎవరైనను ప్రపంచమునకు స్వార్ధరహితముగ సాన్నిహిత్యము లేకుండ సేవచేయ వలెననునది న్యాయముకాదా? ఫలితము మాత్రము భగవంతునకు విడువవలెను. శ్రీరాముడు పదునాల్గు సంవత్సరములు అరణ్యమందు తపస్సు చేసెను. భరతుడుకూడా అయోధ్య సమీపమున నందిగ్రామము నందు తపస్సుచేసెను.

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

శ్రీమద్రామాయణము

అరణ్యకాండ

చిత్రకూటమునకు అనతిదూరమునందు జనస్థానము అనుపేరుగల రాక్షస సైనిక స్థావరము ఒకటికలదు. దానికి రావణుని సోదరుడు ఖరుడనువాడు ప్రతినిధిగానుండెను. జనస్థానమునుకేంద్రముగ చేసికొని భయంకరమైన రాక్షసులు ఆయరణ్యమందు ఏకాంతముగ ఆశ్రమములందు నివసించు ఋషీశ్వరులను బాధించుచు అడవియంతట తిరుగుచుందురు. చిత్రకూట ప్రాంతమందలి ఋషీశ్వరులు తమ ఆశ్రమములను విడిచిపెట్టుకొనునంత అభద్రత రాక్షసులు కల్పించిరి. రాముడు వారిని నివారింపగలడు. భరతుడు అయోధ్యకువెళ్ళినతరువాత రాముడు చిత్రకూటమునందు సంతోషముగలేడు. నిరాశచెందిన తన సోదరుడు భరతుని అశ్రుపూరితముఖమును, తనతల్లియొక్క విచార వదనమును అతనికి నిరంతరము గుర్తువచ్చుచున్నవి. ఋషీశ్వరులు రాక్షసభయముతో ఆశ్రమములను విడిచిపోవుటచే ఒంటరితనము సంభవించినది. విచారయుత జ్ఞాపకములతో నిండిన ఈకుటీరమును విడిచి దండకారణ్యమున మరియొక విశ్రాంతి ప్రదేశమును అన్వేషింప వలెనని రాముడు తలచెను. అందుచే వారు చిత్రకూట పర్వతమును విడిచి దేశమంతయు తెలిసిన అత్రిమహర్షి ఆశ్రమమునకు వెళ్ళిరి. ఎక్కడ నివాసమేర్పరచుకొనవీలగునోయని ఆ మహర్షియొక్క సలహాను పొంద నెంచిరి. వారు అత్రిమహర్షిచే అనురాగపూర్వక స్వాగతమును పొందిరి. సీత అత్రిమహర్షి భార్యయగు అనసూయయొక్క హృదయమును గెలుచు

కొన్నది. సీతయొక్క పతిభక్తికి మెచ్చి అనసూయ ఆమెకు అందమైన వస్త్రములును, శరీర సౌందర్యాభివృద్ధికరములగు ద్రవ్యములును ఇచ్చి ఆశీర్వదించెను. అనసూయ మూర్తీభవించిన స్వచ్ఛమైన వనిత. ఆమె ఇచ్చిన బహుమతులు సీతకు అందమును, ఆత్మబలమును పెంపొందించెను.

సీత ఆబహుమతులను స్వీకరించి "నాభర్త శ్రీరాముడు ఒకతల్లి, ఒకతండ్రివలె నన్ను అనురాగముతో చూచుకొనును. నేను నిజముగ అదృష్టవంతురాలను" అని అనసూయకు చెప్పెను. రామ లక్ష్మణులు మార్గమును గురించి సమాచారమును గ్రహించి తమ ప్రయాణమును తిరిగి ప్రారంభించిరి. దండకారణ్యమునందు నడచుచు సీతారామలక్ష్మణులు చాలమంది ఋషీశ్వరులు నివసించు ఒకప్రదేశ మును చేరిరి. వారాప్రదేశమును సమీపించగనే యాగోపకరణములును, నారచీరలను, జింకచర్మములను చూచి అది పవిత్రమైన ఆశ్రమమని గుర్తించిరి. ఆప్రదేశము చూడముచ్చటగనున్నది. పక్షులును, జంతువు లును నిర్భయముగ సంచరించుచున్నవి. వృక్షములు పండ్లతోనిండి యున్నవి. వేదఘోష వీనులవిందుగనున్నది. వారు దగ్గరకు వచ్చి ఋషీశ్వరుల ఉజ్వలమైన ముఖములను చూచిరి. ఆఋషులు శ్రీరామునకు స్వాగతము పలికిరి. "ఓప్రభూ! నీవుమారక్షకుడవు. మేమునగరమందున్నను, అరణ్యమందున్నను నీవే మాకురాజువు" అనిపలికి వారికికావలసినవన్నియు సమకూర్చి విశ్రాంతికొఱకు ఒకప్రదేశమును చూపిరి. మరుచటి ఉదయము ముువ్వురును

ఋషీశ్వరులకడ శలవు తీసికొని మరల అరణ్యమునందు ప్రవేశించిరి. ఈఅరణ్యప్రదేశము ఇంతకుముందుకంటె దట్టముగానుండి పులులు మున్నగు క్రూరజంతువులను కలిగియుండెను. వారు నెమ్మదిగ, జాగ్రత్తగ ముందుకు నడచిరి.

అకస్మాత్తుగ ఒకబ్రహ్మాండమైన, వికృతమైన, పగులగొట్ట బడిన పర్వత శకలమువంటి ఆకారము భయంకరమైన ధ్వనిచేయుచు వారిని సమీపించెను. అది ఒకనరమాంసభక్షకుడగు రాక్షసుని రూపం. అతని అరపు మేఘగర్జననుబోలియున్నది. అతడు చెప్పుటకు వీలుకానంత అసహ్యముగనున్నాడు. అతడు ధరించిన పులితోలు రక్తసిక్తమైయున్నది. చంపబడిన జంతువుల మాంసపుముద్దలు ఇంకను అంటియున్నవి. మూడు సింహకళేబరములును, ఒక ఏనుగు కుంభస్థల మును అతని బల్లెమునకు గ్రుచ్చబడియున్నవి. ఆరాక్షసుడు తన ఆయుధమునెత్తి భయంకరముగ అరచుచు ముందుకు దూకి సీతను పైకి ఎత్తెను. రాకుమారులనుద్దేశించి "ఓకుఱ్ఱలారా! మీరెవరు? ఈఅరణ్యమున ఎంతధైర్యముగ ప్రవేశించినారు. మీరు యువకులుగనున్నారు. కాని నారచీరలను జడలను ధరించియున్నారు. తాపసవేషములను ధరించి, ధనుర్బాణములను ధరించి, ఈవనితను వెంటనిడికొని తిరుగుచున్నారు. ఎవరిని మోసగింప ప్రయత్నించుచున్నారు? మీప్రవర్తన పట్ల మీరుసిగ్గుపడుటలేదా? మీప్రవర్తనతో ఋషీశ్వరులమంచిపేరును చెరుపు చున్నారు. నన్ను విరాధునిగ తెలిసికొనుడు. ఋషీశ్వరుల మాంసమే నానిత్యభోజనము. ఈఅందమైన యువతిని నేను భార్యగ స్వీకరింతును.

తెలిసినదా! దురాత్ములారా! నేనిపుడు మీరక్తమును త్రాగుదును" అని అరచెను. ఆరాక్షసుని చేతియందు బంధింపబడిన సీత భయముతో వణికెను. శ్రీరాముడు ఆత్మనిగ్రహమును కోల్పోయి "లక్ష్మణా! ఇది భరింపశక్యముకానిది. మనలను అరణ్యమునకు పంపిన కైకేయికిదంతయు తెలిసియేయుండును" అనుచు రాముడు దిగ్భ్రమచెంది ఆరాక్షసుని ఎదిరించుట ఎట్లో తెలియకుండెను. కాని లక్ష్మణుడు కోపించిన సర్పమువలె బుసకొట్టుచునిట్లనెను. "రామా! నీవు ఇంద్రునంతటి బలవంతుడవు. నేను నీప్రక్కననుండగా నీవిట్లు మాటాడరాదు. నాధనుర్బాణములేమిచేయునో చూడుము. భూమి ఈరాక్షసుని రక్తమును త్రాగగలదు. అయోధ్యలో అణచబడిన నాయాగ్రహము, ఇంద్రుడు పర్వతముల రెక్కలను నరకినట్లు, ఈరాక్షసుని ధ్వంసముచేయును. ఈప్రాణిని నేనెదుర్కొని సంహరింతును". విరాధుడు "మీరెవరు? వెంటనేచెప్పుడు" అని మరల అరచెను. రాముని మనసు నిర్మలమయ్యెను. అతని ముఖము ధైర్యముతో వెలిగెను.

"మేము ఇక్ష్వాకువంశ రాకుమారులము. మేము అరణ్యమున నివసింపవచ్చితిమి. నీవెవరో మేము తెలుసుకొనవచ్చునా?" అని శాంతముగా రాముడడిగెను. రాక్షసుడిట్లు జవాబిచ్చెను. "అలాగా! అయిన మీరు దశరధుని కుమారులు. అవునా? నాతండ్రి పేరు జయుడు. రాక్షసులు నన్ను విరాధుడందురు. ఓచిన్న క్షత్రియులారా! మీరును, మీఆయుధములును నన్నేమి చేయగలరు? నేను ఏఆయుధమును నన్ను బాధింపకుండ బ్రహ్మవరమును పొందితిని. మీరు మిమ్ములను

రక్షించుకొనదలచినచో ఈబాలికనిచట విడిచి పారిపొండు". రాముని కనులు క్రోధముతో ఎఱ్ఱబడినవి. "నీవు యముని దగ్గరకు పోవు సమయమిదియే" అని ఒక పదునైన బాణమును రాక్షసునిపై ప్రయోగించెను. ఆబాణము రాక్షసదేహమును గాయపరచి రక్తముతో తడిసి అగ్నివలె ప్రకాశించుచు నేలపై పడెను. కాని రాక్షసుడు చంపబడలేదు. బాధతో విజృంభించి రాక్షసుడు సీతను నేలపైదించి తనబల్లెమునెత్తి నోరు పెద్దగాతెరుచుచు రామలక్ష్మణులవంక వేగముగ వచ్చెను. రాజకుమారులు అతనిపై బాణవర్షమును కురిపించిరి. తనదేహమునకు గ్రుచ్చుకొనిన బాణములనన్నింటిని రాక్షసుడు తనదేహమును విదిలించి క్రిందపడవేసెను. తనబల్లెముతో ముందుకు వచ్చుచున్న రాక్షసుని బల్లెమును రామలక్ష్మణులు రెండు బాణములతో పగులగొట్టి, కత్తిని చేతబూని అతనిపైబడిరి. కాని రాక్షసుడు వారిద్దరిని తనరెండుచేతులతో ఎత్తి తనభుజములపై పెట్టుకొని అడవిలోనికి పరుగెత్తెను. అరణ్యమందలి చీకటిలో వారు అదృశ్యమగుటచూచి సీత గట్టిగానేడ్చెను. రామలక్ష్మణులు అతని రెండు భుజములపై కూర్చుండి, ఆయుధములతనిని చంపలేవని తెలియుటచే, అతని బాహువులను ఊడబెరికి నేలపై పడవేసిరి. అపుడు వారు ఆతనిని తమచేతులతోడను పాదములతోడను ఎదిరించిరి. అయినను బ్రహ్మవరప్రభావముచే వారతనిని చంపలేకపోయిరి. అతని గాయములబాధ చాలతీవ్రముగా నుండుటచే అతడు గట్టిగా అరచెను. దురదృష్ట వశమున అతడు మృత్యురాహిత్యమును వరమడిగెను కాని బాధనుండికాదు. ఆసోదరులు

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

రాక్షసుని నేలపై పడవేసిరి. అతడుపైకిలేవకుండా రాముడు తన పాదమును రాక్షసుని కంఠముపై మోపి నిలువరించెను. రాముని పాదస్పర్శచే తనగతజన్మమందు తనకు సంప్రాప్తమైన శాపవృత్తాంతము జ్ఞప్తికివచ్చుటచే ఆరాక్షసుడు తనచేతులు జోడించి మర్యాదగానిట్లు పలికెను. "ప్రభూ! నీపాదములు నన్ను తాకినవి. నాకనులు తెరువ బడినవి. నీవెవరో నేనుతెలుసుకొంటిని. నేనొకశాపగ్రస్తుడను. నీవునన్ను రక్షింపగలవు. నాపుట్టుకచే నేను రాక్షసుడను కాను. గంధర్వుడను. నేను సంపాదించిన వరము నావిమోచనమును అడ్డగించుచున్నది. నీవేదో విధముగ నన్ను సంహరించినయెడల నేను నాసహజ రూపమునుపొంది స్వర్గమునకు పోవుదును". తగినట్లుగా రామలక్ష్మణులు ఆయుధములు లేకుండ అతనిని వినాశమొనర్చి భూమియందు ఒక గోతినిత్రవ్వి అందు పాతిరి. ఆరాక్షసుడు గంధర్వలోకమునకు తిరిగివెళ్ళెను. అపుడు రామలక్ష్మణులు సీతయున్న ప్రదేశమునకు వెనుకకు వెళ్ళి భయముతోనున్న సీతకు జరిగినదంతయు చెప్పిరి.

శ్రీరామలక్ష్మణులు శరభంగాశ్రమమునకు వెళ్ళిరి.

ఇంద్రుడు ఇతర దేవతలతో కలిసి ఆఋషీశ్వరునితో మాటలాడుచుండెను. రాముడు వచ్చినట్లు తెలిసి, అతడు ప్రసంగమును ఆపుచేసి వెడలి పోయెను. అనంతరము రాముడు సీతాలక్ష్మణులతో ఋషీశ్వరుని సమీపించి నమస్కరించెను. ఆవృద్ధ తపస్వి "నేను నీకొఱకే నిరీక్షించు చుంటిని. నాదేహమును పరిత్యజించు సమయమైనది. కాని నిన్ను చూచుటయే నామొదటికోరిక. అందుచే నేను నిరీక్షించుచున్నాను.

ఇపుడు నాకోరికనెరవేరినది. నా తపఃఫలములన్నింటిని నీకు సంక్రమింప చేయుచున్నాను" అనెను. రాముడిట్లు జవాబిచ్చెను. "స్వామీ! నేను నాస్వంత సుకృతమును సంపాదించుకొనరాదా? నీవుసంపాదించినదానిని నేనెట్లు స్వీకరింపగలను? నేను అరణ్యమునందు నివసించుటకు అన్నిటిని పరిత్యజించితిని. అరణ్యమందు నేనెక్కడ నివసింపగలనో సలహానిచ్చి మీఆశీస్సులతో నన్ను ముందుకు పంపుడు". ఆఋషీశ్వరుడు రామావతార రహస్యము తెలిసినవాడు. "నీవెచట నివసింపవలసి యున్నదియు సుతీక్ష్ణ మహర్షివలన తెలిసికొనుము" అని చెప్పెను. అనంతరము శరభంగుడు అగ్నిని రగిలించి అందు ప్రవేశించెను. అతని భౌతికశరీరము అగ్నియందు హుతమై, చితినుండి యవ్వనదేహము పైకిలేచి స్వర్గమునకు ఎగసిపోయెను. విరాధుని మరణవార్త విని ఆయరణ్యమందలి ఋషీశ్వరులు రాముని కడకువచ్చి అతని చుట్టును నిలిచిరి. "ఓరాజా! నీవీఅరణ్యమందు నివసింపవచ్చుట మాయదృష్టము. ఇకనుండి రాక్షసభయము లేకుండ మేము మాతపస్సును చేసుకొన వలయును. అడవియంతట విసరబడిన ఆఎముకలను చూడుము. అవి రాక్షసులచే చంపబడి, తినబడిన తాపసుల అస్థికలు. పంపా, మందాకినీ నదీతీరములందు ఋషీశ్వరులు నరమాంసభక్షకులగు రాక్షసులవలన నిత్యము ప్రాణభయముతో నివసించుచున్నారు. తనప్రజలను రక్షించుట రాజధర్మము. సామాన్య గృహస్థులు పన్నులు చెల్లించినట్లుగా, మా తపఃఫలమునందు కొంతభాగము ప్రభువునకు వెళ్ళును. నీవు దేవతలప్రభువగు ఇంద్రునివలె ప్రకాశింతువు. రాక్షసులనుండి మమ్ము

రక్షింపుము. నీవేమాకు శరణ్యము" అని వేడుకొనిరి. రాముడిట్లు జవాబిచ్చెను. "ఓమహానుభావులారా! మీఆజ్ఞను శిరసావహించుటకు నేను కట్టుబడియున్నాను. నేను నాతండ్రికోరికమేరకు రాజ్యమును పరిత్యజించి అరణ్యమునకు వచ్చితిని. ఒకకుమారునిగ నావిధిని నిర్వహించుచు నేను మిమ్ముకూడా సేవించి మీకు మేలు చేయుదును. రెండువిధముల దీవెనలను పొందినట్లు పరిగణింతును. నేనీఅరణ్యమున నిలిచి రాక్షసుల నాశమొనర్చి మీబాధలనుండి విముక్తులనుచేయుదును. భయమును విడిచిపెట్టుడు". రాముని వాగ్దానము ఋషీశ్వరులకు ఉపశమనమును సంతోషమును ఇచ్చెను.

సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణుని ఆశ్రమమునకు బయలు దేరిరి. దట్టమైన అరణ్యముచే ఆవరింపబడిన పెద్దపర్వతముకడకు వచ్చి అరణ్యమందు ప్రవేశించిరి. అచ్చట వారు ఎండలో ఆరబెట్టిన నారవస్త్రము లను చూచిరి. కొంతసేపటికి ఒక వృద్ధమహర్షి తనంతతాను అచటికి వచ్చెను. "ఓపవిత్రమహర్షీ! నాపేరు రాముడు. నీదర్శనమునకు వచ్చితిని. నీఆశీస్సులను ప్రార్థించుచున్నాను" అని రాముడు నమస్కరించుచు పలికెను. ఆమహర్షిలేచి రాముని కౌగిలించుకొనెను. "ధర్మసంరక్షకుడా! స్వాగతము. నీరాకచే నాఆశ్రమము ప్రకాశించు చున్నది. ఇది ప్రస్తుతము నీదే. నీవు అయోధ్యను విడిచి చిత్రకూటమున నివాసమేర్పరచుకొనినట్లు వినినప్పుడు నీవిచటకువత్తువని నేనెరుగు దును. నిన్ను చూడవలెనను కోరికతో జీవించియుంటిని. కానిచో నేనెపుడో ఈదేహమును విడువవలిసియున్నది. నేను ప్రోగుపెట్టిన

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

తపశ్శక్తిని ఇపుడు నేను నీకు సంక్రమింపజేయుదును. నీవును, నీసోదరుడును, సీతయును ఈశక్తిని స్వీకరింపుడు" అనెను. పవిత్రమైన కాంతితో ఆమహర్షిముఖము ప్రకాశించెను. అతిధులుగా వచ్చినవారికి ఆవిధముగ తపశ్శక్తిని ధారపోయుట ఋషీశ్వరుల ఆచారము. శ్రీరాముడు "ఓమహర్షీ! నేను నాస్వంత సుకృత్యములచేతనే సుకృతమును సంపాదింపవలెను. మీఆశీస్సులతో ఆవిధముగా చేయు కుతూహలము కలదు. నేను ఈఅరణ్యమున నివసింపగోరుచున్నాను. శరభంగమహర్షి మీకడకు వెళ్ళి, మీఆశీస్సులు స్వీకరించి, నాఅరణ్యజీవితశేషమును ఎచటగడుపవలసినదియు మీసూచనలను పొందుమని నన్ను పంపించెను" అని పలికెను.

ఆఋషీశ్వరుని ముఖము సంతోషముతో ప్రకాశించెను. అతడు అర్ధవంతముగ నిట్లు పలికెను. "నీవీయాశ్రమమున నివసింప వచ్చును. దీనిచుట్టును చాలమంది ఋషీశ్వరులు జీవించుచున్నారు. ఈయడవి పండ్లతో, దుంపలతో నిండియున్నది. కాని క్రూరజంతువులు నాల్గు దిక్కుల ఋషులను బాధించుచు వారి తపస్సును భంగపరచు చున్నవి. ఋషీశ్వరులు ఈబాధను భరింపలేకున్నారు. కాని దీనికొఱకు ఈ ప్రదేశము మంచిది". రాకుమారుడు మహర్షి చెప్పదలచుకున్నది గ్రహించెను. అతడు తనధనస్సును ఎక్కుబెట్టి, ఠంకారముచేసి ఇట్లు పలికెను. "ఓమహర్షీ! ఈదుష్టులను నేను నాశము చేతును. నాధనుస్సు బలముగను, నాబాణములు పదనుగను ఉన్నవి. మేమీఆశ్రమమున నివసించుట తగదు. మీతపస్సును మాయునికి భంగపరచును.

ఈసమీపమున మాకొఅకు ఒకప్రదేశమును చూచుకొందుము. మేమట్లు చేయుటకు అనుమతింపుడు". ఆరాత్రి వారు ఆమహర్షి ఆశ్రమమందు అతిధులుగ నిలిచిరి. మరునాడు ఉదయము ఆముప్పురును నిద్రలేచి పూలసువాసనతోకూడిన చల్లని నీట స్నానమాచరించి, పవిత్రాగ్నిని వెలిగించి, వారిపూజలు నిర్వర్తించి, ఆఋషీశ్వరుని పాదములకు నమస్కరించిరి. "మీఅనుగ్రహముతో మేమీరాత్రిని సుఖముగ గడిపితిమి. మేమీప్రాంతమందలి ఇతరఋషులను చూచి వారి ఆశీస్సులు పొందదలచితిమి. సూర్యుడు వేడిఎక్కకముందు బయలుదేరుటమంచిది. మేము బయలుదేరుటకు అనుమతింపప్రార్ధన" అనిరి. ఆమహర్షి రాకుమారులను కౌగిలించుకొని దీవించి ఇట్లనెను. "దండకారణ్యమునగల మంచిఋషీశ్వరులను దర్శింపుడు. వారందరును గొప్పనిష్ఠలను ఆచరించి దివ్యశక్తులను పొందిరి. లేళ్ళతోడను, పక్షులతోడను, పద్మములతోనిండిన సరోవరములతోడను ఈయడవి సుందరముగానున్నది. ఈపర్వతములు సెలయేరులతోను, నెమిళ్ళతోను అందముగానున్నవి. లక్ష్మణా ! నీఅగ్రజునితోడను సీతతోడను ఇపుడు వెళ్ళుడు. మీకు ఇచ్ఛఒడమినపుడు ఈఆశ్రమమునకు రండు". ఆముగ్గురు ఆమహర్షికి ప్రదక్షిణ మాచరించి శలవుతీసికొనిరి. సీత వారిఖడ్గములను, ధనుర్బాణములను రాకుమారులకు స్వాధీనపరచెను. రాజకుమారులు మహాఋషుల ఆశీస్సులతో పూర్వముకంటె ఎక్కువ తేజస్సంపన్నులై అక్కడనుండి బయలుదేరిరి.

శ్రీమద్రామాయణము

శ్రీరామచంద్రునిపై ఒకక్రొత్త బాధ్యత మోపబడినది. దండకారణ్యమునందు ఋషులను బాధించుచున్న రాక్షసులను రాముడు నాశముచేయవలసియున్నది. సీతమనసునందు భయము ఉత్పన్న మైనది. "అడవియందు తాపసవృత్తియందుండ వలసిన మీరును లక్ష్మణుడును ఋషుల రక్షణబాధ్యతను మీయంతటమీరు ఎందుకు తీసికొనినారు?" అని తన ప్రేమాస్పదుడగు భర్తను ప్రశ్నించెను. "గతించిన రాజుగారి వాగ్దానమును నిలబెట్టుటకు మీరు ఇక్కడకు వచ్చినారు. ఋషులను రక్షించు బాధ్యత నిజముగ ఎవరురాజ్యపాలనచేయుచున్నారో వారికి సంబంధించిన విషయము. ఋషులరక్షణ మీకు సంబంధించినదికాదు. ఆత్మరక్షణయందు తప్ప ఎవరినైన సంహరించుట తాపసజీవననియమములకు విరుద్ధము. కాని ఋషీశ్వరుల రక్షణ చేతునని అనాలోచితముగ మీరు వాగ్దానము చేసిరి. ఇది మనలనెటు నడిపించునో అని భయపడుచున్నాను" అని సీత సుతీక్ష్ణుని ఆశ్రమమునుండి దండకారణ్యమందలి ఇతరఆశ్రమములకు వెళ్ళు సందర్భమున, మృదువుగ, అనురాగపూరిత పదములతో రాముని ప్రశ్నించెను. "స్వామీ! మీకు సలహానిచ్చినందులకు నన్ను క్షమింపుడు. మీయందలి అంతులేని అనురాగముచేతనే, నేను అబలవలె మాటాడితిని. మీకు ధర్మము తెలియును. కాని మానవులు కోరికచే మూడురకముల పాపములు చేయుటకు తరుమబడుదురని చెప్పబడినది. ఒకటి అసత్యము, రెండవది కామము, మూడవది దౌర్జన్యము. సత్యముకొఱకు రాజ్యమును విడిచి అడవియందున్ననీకు అసత్యము వర్తింపదు.

శ్రీ శ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

నీమనస్సునందు మరియొకస్త్రీయొక్క ఆలోచనను భరింపలేవని నాకు తెలియును. కాని నేను మూడవరకపు పాపమునుగురించి భయపడు చున్నాను. మనలను ఎదురింపని వ్యక్తిని మనము సంహరింపవచ్చునా? అతడు రాక్షసుడగుగాక, ఇతరులగుగాక. మనలగురించి పట్టించుకొనని ఒకవ్యక్తిని మనమేలచంపవలెను? దుర్మార్గులను శిక్షించుట, నాశ మొనర్చుట క్షత్రియధర్మమే. కాని రాజ్యపదవిని విడిచి అరణ్యవాసము చేయుచున్నను నిన్నాబాధ్యత అంటిపెట్టుకొనియుండునా? రాజరికపు బాధ్యతలు నిజమైనహోదాతోనుండును. నారవస్త్రములును, జడలును ధరించియున్న నీవు తాపసివి. నీకు అన్నియు బాగుగా తెలియును. ఏపనినైనను చేయుముందు బాగుగ ఆలోచింపుమని కోరుచున్నాను".

"నిజమేసీతా. నీవునిజమైన జనకుని కుమార్తెవలె మాటాడితివి. కాని సీతా! ఒకమారు నీవేచెప్పితివి. క్షత్రియులచే నిర్మింపబడిన ఆయుధములు ఇతరులను రక్షించుటకొఅకేయని. కాదా? నిస్సహాయులైన జనులు బాధపడుచుండగా క్షత్రియుడు ఊరకయుండుటెట్లు? మనము వచ్చినపుడు ఇక్కడనున్న ఋషులు తమబాధలను చెప్పుకొని మనరక్షణ కోరిరి. వారు రాక్షసుల దుర్మార్గములను సహింపలేరు. రాజేకాక క్షత్రియుడెవడైనను తనధర్మమును నిర్వర్తింపవలెను. ఋషులు నీవేమారక్షకుడవనిరి. నేను వారికి మాటయిచ్చితిని. వారికిచ్చినమాట తప్పలేను. నీవు,నేను కలిసి ధర్మమార్గమువెంట నడువవలెను. మనలో విభేదమేమికలదు?" అని మాటాడుకొనుచు అడవిమార్గమున పయనించిరి.

దండకారణ్యమున చాలఆశ్రమములు కలవు. రాజ కుమారులు ఒకరిఆశ్రమమున ఒకనెల, మరియొకరి ఆశ్రమమున మరికొంతకాలము వంతున కాలము గడిపిరి. అడవి వివిధజంతువుల తోడను, పక్షులతోడను, చెట్లుతీగలతోడను అందముగా నున్నది. పదిసంవత్సరములు రాముడు సీతాలక్ష్మణులతోపాటు పవిత్ర మునీశ్వరుల సాహచర్యముతో ఆనందముగాగడిపెను. అరణ్యనివాసమున చివరి సమయము ఆసన్నమయినది.

రాముడు దక్షిణ భారతదేశమున నివసించుచున్న అగస్త్యమహర్షి దర్శనము చేయగోరెను. అగస్త్యమహర్షి విశ్వామిత్రుని వలెనే ముల్లోకములందును ప్రసిద్ధుడు. శివపార్వతుల వివాహ సందర్భమున ఋషులందరును కైలాసమునకు వెళ్ళిరి. అగస్త్యుడు ఒక్కడు మాత్రమే దక్షిణ దిగ్భాగమున నిలిచియుండి భూమియొక్క భారమును సమతుల్యము చేసెను అను ఒక కధకలదు. ఒకమారు వింధ్యపర్వతము స్వర్గము వరకు నిటారుగ పెరిగి సూర్యపథమునకు ఉత్తరదక్షిణ దిగ్భాగములకు అడ్డుగా నిలిచి ప్రతిబంధకమగునను భయమును కలిగించెను. దేవతలు భయపడి అగస్త్యుని సమీపించి సహాయముకోరిరి. అగస్త్యుడు వింధ్యపర్వతము ముందు నిలబడెను. వింధ్యుడు అతనికి విధేయుడై తలవంచెను. "నీవు ఎల్లప్పుడును ఇట్లేవంగియుండుము" అని ఆశీర్వదించి అగస్త్యుడు వింధ్యుని సూర్యపథమునుండి తప్పించెను.

వాతాపియు, ఇల్వలుడునను ఇద్దరు రాక్షసులు ఋషులకు బాధకలిగించెడివారు. తనశరీరమునెన్ని ముక్కలుగా నరికినను మరల యధాపూర్వముగ జీవించునట్టి వరమును వాతాపి పొందియుండెను. ఇల్వలుడు బ్రాహ్మణ వేషమును ధరించి ఒక్కొక్క ఋష్యాశ్రమమునకే వెళ్ళి వారిని తమయింట విందు భోజనమునకు ఆహ్వానించెడివాడు. విందును తిరస్కరింపక అంగీకరించుట ఆనాటి ఆచారము. దాని ప్రకారము తమయింటికి వచ్చినవారికి ఇల్వలుడు తనసోదరుని వాతాపిని ఖండించి వండి ఆహారముగ పెట్టెడివాడు. అతిధులు తృప్తిగా భుజించినతరువాత ఇల్వలుడు వాతాపిని పిలిచెడివాడు. వరప్రభావమున వాతాపి అతిధుల పొట్టలను చీల్చుకొని యధాతధముగ జీవములతో తిరిగివచ్చెడివాడు. ఈవిధముగ చాలమంది ఋషులు మరణించిరి. ఒకరోజు ఇల్వలుడు తన ఉపాయమును అగస్త్యునిపై ప్రయోగించెను. మామూలుగ వాతాపిమాంసమును అగస్త్యుడు భుజించెను. అగస్త్యునకు వీరిమాయోపాయము తెలియును. అతడు గణపతియొక్క భక్తుడు. రాక్షసుని జీర్ణముచేసికొను శక్తిని కలిగియుండెను. అందుచే "వాతాపీ జీర్ణం" అనుచు అగస్త్యుడు వాతాపిని జీర్ణించుకొనెను. ఇల్వలుడు మామూలుగా వాతాపిని పిలిచెను. కాని అగస్త్యుడు నవ్వుచు "వాతాపిజీర్ణమైపోయినాడు" అని చెప్పెను. అంతట ఇల్వలుడు నాసోదరుని చంపితివా? అనుచు అగస్త్యునిపైకి వేగముగా వచ్చెను. అంతట అగస్త్యుడు తనకనులుతెరచి రాక్షసుని భస్మము చేసెను.

అప్పటినుండియు రాక్షసులెవ్వరును అగస్త్యుని దరిచేరలేరు. ఆవిధముగ అగస్త్యుడు ఋషీశ్వరులను రక్షించెను.

శ్రీరాముడు అగస్త్యుని దర్శించుటకు ముందు అగస్త్యుని అనుజుని ఆశ్రమమునకువెళ్ళి ఆయన ఆశీస్సులు పొందెను. దక్షిణదిశకు పయనించి అగస్త్యాశ్రమము దరిచేరి ఆప్రదేశము నిర్భయముగ తిరుగు మృగపక్ష్యాదులతోను, పూజలనిమిత్తము పూలనుసేకరించు బ్రాహ్మణుల తోను ప్రశాంతముగ తేజస్సంపన్నమై యున్నట్లు గుర్తించెను. శ్రీరాముడు లక్ష్మణుని ముందుగావెళ్ళి ఆమహర్షికి తనరాకను గురించి తెలుపుమని పంపెను. లక్ష్మణుడు వెళ్ళి అచటనున్న శిష్యులలో ఒకనిద్వారా "దశరథకుమారుడు శ్రీరామచంద్రుడు భార్యా సోదరసహితముగ అగస్త్య మహర్షి దీవెనలనందుటకు వచ్చెనని " కబురంపెను. అగస్త్యుడు అనురాగ పూర్వకముగ స్వాగతము పలికి ఆరాకుమారులతో "మీరు చిత్రకూటమున నివసింపవచ్చినారని విని నేను మీరాకకై నిరీక్షించుచున్నాను. మీనగర బహిష్కరణ సమయము పూర్తికానున్నది. మిగిలిన కాలము ఇచట ప్రశాంతముగానుండుడు. ఈప్రదేశము రాక్షస భయరహితము" అనెను. "మీఆశీస్సులు పొంది నేను చాలసంతోషించుచున్నాను. మీస్వాగతవచన ములకు ధన్యవాదములు. కాని నేను దండకారణ్యమందలి ఋషీశ్వరు లకు, రాక్షసభయమునుండి రక్షించుటకు వాగ్దానము చేసియున్నాను. మీఆశీస్సులు పొంది దండకారణ్యమునకు వెళ్ళవలసియున్నది" అని రాముడు జవాబిచ్చెను. "రామా! నీవుచెప్పినది నిజము. రాక్షసులను ఈఆయుధములతో నాశముచేయుము" అనిపలుకుచు రామునకు

అగస్త్యుడు విశ్వకర్మ నిర్మితమైన విష్ణుధనువును, బాణములను, ఖడ్గమును ఇచ్చెను. మిగిలిన అరణ్యవాసకాలమును పంచవటియందు గడుపుమని సలహాయిచ్చెను. "ఓరామా! నిన్ను భగవంతుడు రక్షించు గాక! నీయందలిప్రేమతో అరణ్యవాస కష్టములను భరింప నీతోవచ్చిన సహజ సుకుమారియగు సీతను జాగ్రత్తగా చూచుకొనుము. ఆమె అరుంధతివలెనున్నది. నీవును సీతయు లక్ష్మణుడును ఎచటనుందురో ఆప్రదేశము అందముతోనిండియుండును. గోదావరీనదీతీరమునగల పంచవటి చాల అందమైనది. సీత అచట నివసించుటకు సంతసించును. పండ్లును, దుంపలును సమృద్ధిగాగల గోదావరీ తీరమున మీఅరణ్యవాస శేషకాలమును గడిపి నీతండ్రి మాటను నిర్వర్తింపుము" అని పలికెను.

అగస్త్యుని సూచనలననుసరించి సీతారామలక్ష్మణులు పంచవటికి పయనమయ్యిరి. మార్గమధ్యమున ఒకపెద్ద వృక్షముపై వ్రాలిన ఒక పెద్దపక్షిని కలిసిరి. అది రాక్షసుడని తలచిరి. ఎవరునీవు? అని రాముడు కోపముతో అడుగగా అనురాగపూరిత కంఠధ్వనితో ఆగ్రద్ద "బిడ్డా! నేను నీతండ్రియొక్క వృద్ధమిత్రుడను" అని పలికి తనవృత్తాంతమునిట్లు చెప్పనారంభించెను. విష్ణువాహనమగు గరుడుని సోదరుడగు అనూరుని కుమారులు జటాయువు, సంపాతియును. అందునేను జటాయువును. నీవు అడవికి వేటకు వెళ్ళినపుడు ఒంటరిగానున్న సీతను నేనుజాగ్రత్తగా చూచుకొందును" అని పలికిన జటాయువుకు కృతజ్ఞతలు తెలిపి రాకుమారులు ముందుకు సాగిరి. రాముడు పంచవటి సౌందర్యమునకు సంతోషించి ఆప్రదేశమును గురించి సలహాయిచ్చిన అగస్త్యునకు

తనమనమున కృతజ్ఞతలు తెలిపి "లక్ష్మణా! ఈకొండలు, పూలతో నిండిన చెట్లు, ప్రక్కననది, స్వచ్ఛమైన ఇసుకతిన్నెలతో చాల అందముగా నున్నది. ఈప్రదేశమున ఎంతకాలమైన ఉండగలము. మనకు ఒకమంచి స్థలమును ఎంపికచేసి కుటీరమును నిర్మింపుము" అని పలుకగా లక్ష్మణుడు రాముడు చెప్పినట్లు ఒక ఆశ్రమమును నిర్మించెను. ఆకాలమున విద్యయనిన అన్నివిధములనేర్పులతోపాటు గృహనిర్మాణ నైపుణ్యముకూడా అభ్యసింపబడెడిది. కావున రాముడు కుటీర నిర్మాణ మున లక్ష్మణుని అభినందించి సంతోషించెను. పంచవటియందలి ఆశ్రమము నందు లక్ష్మణుడు సేవించుచుండ సీతారాములు ఆనందముగా జీవించిరి.

శీతకాలమందు ఒకరోజు వారు ముప్పురును పెందలకడనే మామూలుగ గోదావరికివెళ్ళి స్నానముచేసి దైవప్రార్థనలు పూర్తిచేసుకొని నిత్యావసరమునకు వలసిన నీటిని తెచ్చుకొనుచుండిరి. ప్రసంగవశమున రాజ్యసుఖములను అనుభవింపవలసిన భరతుడుకూడ తమవలె తాపసవృత్తినవలంబించి కష్టములను అనుభవించుచుండుననియు తమకొఱకు రాజ్యసుఖములను విడిచిన భరతుని సుగుణములను మెచ్చుకొని లక్ష్మణుడు క్రూరాత్ముురాలైన కైకకు ఇంతసుగుణవంతుడు ఎట్లుజన్మించెనని పలుకుచుండగా రాముడతనిని నివారించెను. "లక్ష్మణా! భరతునిగురించి, మనతండ్రిని గురించి సుగుణములనెన్నింటినైనను చెప్పుము. కాని కైకను నిందింపవలదు. మన నల్గురుసోదరులమొక్కచో కలిసి నివసించు అదృష్టము ఎప్పటికిలభించునో" అని తలచుచు తమ

స్నానాదికములను ముగించుకొని ఆశ్రమమునకు తిరిగివచ్చిరి. అనంతరము తమగతమధురస్మృతులను జ్ఞప్తికితెచ్చుకొనుచు కూర్చుండి ఉండగా ఒకరాక్షసస్త్రీ అచ్చటకువచ్చి వారిని చూచెను. ఆమె లంకాధిపతి మరియు రాక్షసరాజైన రావణుని చెల్లెలు సూర్పణఖ.

అసహ్యాకరమైన రూపముతో, తనుకోరిన రూపము నొందగల శక్తితో అడవియందు సంచరించు ఆమె రాముని దివ్య స్వరూపమును చూచి అంతులేని వాంఛతో రాముని సమీపించెను. "తాపసులవేషము ధరించి, ధనుర్బాణములను ధరించి, స్త్రీని వెంటపెట్టుకొని రాక్షసులకు సంబంధించిన ఈఅరణ్యమునందున్న మీరెవరు? ఎందుకున్నారు?" అని సూర్పణఖ పలికెను. ఆనాటి సాంప్రదాయము ప్రకారము రాముడు తనగురించి, తనతండ్రి ఆజ్ఞమేరకు తాను భార్యానుజ సమేతుడై అరణ్యవాసము చేయుచున్న వృత్తాంతమంతయు వివరించి, ఆమె వివరములు అడిగెను. "విశ్రవసుపుత్రుడు, రాక్షస అధిపతి రావణుని పేరు వింటివా? నేను అతని సోదరిని, సూర్పణఖను. కుంభకర్ణ, విభీషణులు నాసోదరులు. ఈప్రాంతమునకు అధిపతులు ఖరదూషణులు కూడా నాసోదరులే. నేను సర్వ స్వతంత్రురాలను. అందరూనన్నుచూచి భయపడుదురు" అనితన ఘనతను తెలిపెను. "నేను నిన్ను చూడగనే ప్రేమయందు పడితిని. ఇపుడు నీవు నాభర్తవు. ఈఅల్పప్రాణివనితతో ఎందుకు తిరుగుదువు? నేనేరూపము వలసిన ఆరూపమునందగలను. నాతోరమ్ము. ఆమెగురించి దిగులు పడకుము. నేనామెను భక్షించిపేయుదును. సంకోచించవలదు" అని

సూర్పణఖ పలికెను. ఆమెమాటలకు ఆశ్చర్యపడిన రాముడు చిరునవ్వునవ్వి "ఓసుందరీ! నీవునన్ను కోరినచో ఒకకష్టమున్నది. నాభార్య ఇక్కడనే ఉన్నది. నాతమ్ముడు ఒంటరిగానున్నాడు. నన్ను పోలియున్నాడు. అతనితో సవతిపోరులేని సౌఖ్యమునంద గలవు. కావున నీచేతిని అతనికందింపుము. సుఖింపుము" అని పలికెను. రాముని పలుకులు విని లక్ష్మణుని చేరి సూర్పణఖ "ఓయువకుడా! నాతో దండకారణ్యమంతటా విహరింపరమ్ము" అనుచు కోరెను. "ఓఅమాయకు రాలా! రాముడు నిన్ను మోసగించుచున్నాడు. నేను నాసోదరుని సేవకుడను. అతడు ప్రభువు. నన్ను పరిణయమాడిన, నీవును నాతోపాటు అతనిని సేవింపవలసివచ్చును. కావున రాముని రెండవభార్యగ స్వీకరింపుమని కోరుము" అనెను. లక్ష్మణుని వాక్కులు నిజమని భావించి రామునేస్వీకరింపుమని కోరుచు తనకు, రామునకు నడుమ అడ్డుగానున్న సీతను మ్రింగివేయుదునని సీతమీదకు సూర్పణఖ దూకెను. రాముడు సీతను పరిరక్షించి "ఈమెకు గుణపాఠము చెప్పుము" అని లక్ష్మణుని కోరెను. లక్ష్మణుడు ఖడ్గముతీసికొని సూర్పణఖయొక్క ముక్కుచెవులను కోసి తరిమెను. ఆమెపెద్దగా అరచుచు అడవిలోనికి అదృశ్యమయ్యెను.

రక్తము స్రవించుచుండగా బాధతో ఆమె సభయందున్న ఖరునిఎదుట నేలపైపడి, తనకు జరిగిన అవమానమును వివరించి ఇది రాక్షసవంశమునకే అవమానకరమనియు దీనికి కారణభూతులైన రామలక్ష్మణులు ఖరుని పరిపాలన ప్రాంతమందే తిరుగుచున్నారనియు,

వారిని శిక్షింపుమని ఖరుని ప్రేరేపించెను. అంతటఖరుడు నీకుబాధ కల్గించినవారెవరో తెలిపి వారి వివరములు తెలుపుము. వారినిపుడే సంహరింతునని లేచెను. "ఎవరో దశరథుని కుమారులట. సీతకొఱకు నన్నవమానించిరి. వారిని వెంటనేసంహరింపుము అని కోరెను. అంతట ఖరుడు "వెంటనేవెళ్ళి రామలక్ష్మణులను చంపి వారి మృతదేహము లతోపాటు ఆస్త్రీనికూడా తీసికొనిరండు అని తన సేనాపతులను ఆజ్ఞాపించెను. పదునల్గురు సేనాపతులు అతని ఆజ్ఞను పాలించుటకు వెళ్ళిరి. ఖరుని పదునల్గురు సేనాధిపతులను వెంటనిడికొని సూర్పణఖ రాముని ఆశ్రమమునకు వచ్చి రాజకుమారుల రక్తమును త్రాగి పగతీర్చుకొనవలెనని నిశ్చయించెను. ఆయువకులిద్దరను చూపుచు "వారే నన్ను వికృతరూపిని చేసి అవమానించిరి. వెంటనే వారిని చంపుడు" అని పలికెను. రాముడు పరిస్థితిని ఆకళించుకొని సీతను జాగ్రత్తగా చూచుకొనుమని లక్ష్మణునకు ఆదేశించి తాను ధనుర్ధారియై నిలిచెను. యుద్ధనిబంధనలననుసరించి రాముడు "మీరిచటకు వచ్చిన కారణమేమి? మేము ఋషీశ్వరుల ఆజ్ఞననుసరించి వారి శత్రువులను నిర్మూలించుటకు ఇచటనుంటిమని తెలుసుకొనుడు. మీరు మీప్రాణము లను కాపాడుకొనవలెననిన మమ్ము విడిచి పారిపొండు" అని హెచ్చరించెను. రాక్షసులు శాంతికి ఇష్టపడలేదు. యుద్ధమునందు రాముడు స్వల్ప వ్యవధియందే వారినందరినీ సంహరించెను.

మరియొకమారు సూర్పణఖ ఏడ్చుచు ఖరుని సమీపించి సేనాపతుల మరణవార్తను తెలుపగా ఖరుడు విశ్వసింపలేక తనచెల్లెలితో

నిట్లనెను. "మానవమాత్రులకు భయపడి మాటాడుదువేల? కొంచెము సహనమువహింపుము. వారిరక్తమును నీవుత్రాగగలవు" అనుచు ఖరుడు ముందుగా దూషణుని పెద్దసైన్యముతో యుద్ధమునకు పంపి, వెనుక తానును వెడలెను. అపశకునములు తోచినను లక్ష్యపెట్టక ధైర్యముతో ముందుకు సాగెను. సైన్యముయొక్క కల్లోల ధ్వనిని విని రాముడును లక్ష్మణుడును యుద్ధమునకు సిద్ధపడిరి. "జనస్థానమందలి రాక్షసులు మృత్యువుకొఱకు వచ్చుచున్నారు. ఆయుధములను ధరించి సీతను కొండగుహలోనికి తీసికొనివెళ్ళి రక్షింపుము. నేను రాక్షస సముదాయమును నాశముచేయుదును. నాకు సహాయమవసరము లేదు. త్వరగావెళ్ళుము" అనుచు రాముడు లక్ష్మణునకు చెప్పి తాను కవచము ధరించి ధనుష్టంకారము చేసెను. రాముడు ఆదేశించినట్లు లక్ష్మణుడు సీతను కొండగుహలోనికి కొనిపోయెను. పెద్దసంగ్రామమును ఊహించిన దేవగంధర్వ సముదాయము దివినుండి తిలకించుటకు వచ్చి రాముడు విజయమునొందవలెనని ప్రార్థించుచుండిరి. చేతియందు ధనువుతో నిలిచినరాముడు పినాకపాణియగు శివునివలె ప్రకాశించెను.

రాక్షససైన్యము రణభేరులు మ్రోగించుచు సూర్యుని క్రమ్ముటకు వచ్చిన మేఘములవలె రాముని చుట్టుముట్టిరి. యుద్ధము ప్రారంభమైనది. దేవతలు ఆశ్చర్యపడునట్లు రాముడు శరవర్షమును కురిపించి మండుచున్న అగ్నియందు పడుచున్న మిడుతలవలె రాక్షసులను సంహరించెను. దూషణుడు రాముని ముందుకు రాగా సూర్యకిరణములు ప్రసరించురీతిగ రాముడు అన్నిదిశలకు బాణ

పరంపరను వెదజల్లి, రథగజతురగయోధ సముదాయమును నేలపై పడవేసెను. రాక్షసులదేహములను గాయపరచి రాముని బాణములు రక్తసిక్తమై బయటకువచ్చి అగ్నివలె ప్రకాశించెను. రాక్షససేన పూర్తిగా నాశమయ్యెను. రాముడు ప్రళయసమయమందలి శివునివలె నిలిచి యుండెను. దూషణుడు మరల పెద్దసైన్యముతో రామునిముందుకు రాగా రాముని బాణములు అతనిరథమును, గుఱ్ఱములను, సారథులను సంహరించెను. దూషణుడు క్రిందకుదూకిరాగా రాముని బాణములు అతనిబాహువులను మొండెమునుండి వేరుచేసినవి. పెద్ద ఏనుగువలె అతడు నేలపైపడెను. ఇతరరాక్షసులుకూడ రామునిమీదకు దండెత్తివచ్చి అతని శరపరంపరచే సంహరింపబడిరి. ఈవిధముగ ఖరుని సైన్య మంతయు నశించినది. ఖరుడును, త్రిశిరుడును మాత్రము మిగిలియుండిరి.

త్రిశిరుడు తాను ముందుగ రామునితో యుద్ధ మొనరింతునని ఖరునిఆపి, రామునిమీదకు యుద్ధమునకు వెళ్ళి రామునియొక్క సర్పములనుబోలిన బాణపరంపరకు హతుడయ్యెను. త్రిశిరుని అనుయాయులు లేళ్ళవలె పరుగెత్తిరి. ఖరుడు పారిపోవుచున్న సైన్యమును ఆపి, తనకు జయింతునని విశ్వాసములేకపోయినను మానుషముకొఱకు యుద్ధముచేసెను. ఖరుడు రథముపై యమునివలె నిలిచి తన బాణప్రవాహములు పంపెను. ఒక్కక్షణము రాముడు తనధనస్సుపై వంగినపుడు రాముని కవచము ఖరుని బాణములచే చీల్చబడెను. రాముడు విష్ణుచాపమును తీసికొని ఖరుని రథమును

ధనువును ధ్వంసమొనర్చెను. ఋషులును, దేవతలును యుద్ధమును కుతూహలముగ ఆందోళణతో చూచుచు రామునకు తమ ఆశీస్సులను అందించిరి. "దుర్మార్గులకు శరీరశక్తి ఉపయోగపడదు. నీవు తపస్సుచేసుకొను ఋషీశ్వరులను చంపితివి. ఆపాపమునకు శిక్ష అనుభవించి తీరవలెను. నేను దండకారణ్యమునున్న రాక్షసుల సంహారముకొఅకే వచ్చితిని. నాబాణములు మీబంధువులనందరను గాయపరచును. నీతల వెంటనే నేలపై పడును" అనుచు రాముడు పలుకగా "దశరధకుమారా! నీవింతకుముందు చంపిన రాక్షసుల వంటివాడనుకాను. నేను సాయంత్రమగుసరికి నిన్ను చంపి నాఅనుయాయుల మరణమునకు పగతీర్చుకొందును" అనుచు విజృంభించెను. తన ఆయుధము ఛిన్నమైన పిమ్మట ఖరుడు పెద్దవృక్షమును పెరికి రామునిపైకిరాగా రాముడాతని చేతి వృక్షమును ఛేదించి తన వాడిబాణములతో ఖరుని అంతమొందించెను.

దేవతలు ఆనందముతో పూలవానకురిపించి సంతోషముతో "రాముడు పాపాత్ములైన రాక్షసులను సంహరించెను. నేటినుండి దండకారణ్యమందు మానవులు ప్రశాంతముగ నివసింతురు. ఒక్కగంటలో ఖరదూషణ, త్రిశిరులు మొదలుగాగల రాక్షసులను, వారిసైన్యమును నాశముచేసెను. రాముడు నిజమైన నాయకుడు" అని అరచిరి. సీతయు, లక్ష్మణుడును పర్వతగుహనుండి తిరిగివచ్చిరి. లక్ష్మణుడు రాముని కౌగలించుకొని ఒంటరిగానేనీవు ఋషీశ్వరులకిచ్చిన వాగ్దానమును చెల్లించుకొంటివని సంతోషమును ప్రకటించెను.

పంచవటియందు రాక్షససంహారమందు తప్పించుకొనిన అకంపనుడను రాక్షసుడు లంకకువెళ్ళి సభయందున్న రావణునకు "జనస్థానమునాక్రమించిన రాక్షసులందరు చచ్చిరి. నేనుమాత్రము తప్పించుకొంటిని" అని చెప్పెను. రావణుడు క్రోధముతో "నాజనస్థానము నెవరు నాశమొనర్చిరి? యముడా? అగ్నియా? విష్ణువా? మృత్యుదేవతకే మృత్యువు కల్పింతును. సూర్య, అగ్ని, వాయువులను నాశమొనర్తును. చెప్పుము. జనస్థానమునందలి నాజనులనెవరు చంపిరి? నేను పగతీర్చుకొందును" అని అరచెను. దుష్టులకు అప్రియ వాక్కులు చెప్పుట ప్రమాదకరమగుటచే అకంపనుడు రావణుని ఆత్మరక్షణ కొఱకు ప్రార్థించి "సింహపరాక్రమసముడగు దశరథ రాకుమారుడు రాముడు పంచవటికడ ఖరదూషణాదులతో యుద్ధముచేసి అందరను ఒంటరిగ నాశముచేసెనని" భయపడుచు తెలిపెను. రాక్షసరాజు రావణుడు సర్పమువలె బుసకొట్టి "ఏమిచెప్పుచుంటివి? ఇదెట్లుజరిగెను? ఇంద్రాదిదేవతలు రాముని పక్షమున భూమికిదిగి యుద్ధమొనర్చిరా?" అని అడిగెను. "అటువంటి దేమియులేదు. రాముడు ఒక్కడే ఖరదూషణులను, ఇతరసైన్యమును నాశమొనర్చెను" అనుచు ఆయుధ ప్రయోగ విషయమున రామునకుగలవేగమును, నేర్పును ఎంతగానో మెచ్చుకొనుచు వర్ణించెను. రావణుడు రాముని వృత్తాంతమంతయు గ్రహించి "ఇదంతయు నాకు అర్థమగుటలేదు. కానినేను వెంటనే బయలుదేరి ఈఅల్పమానవ కీటకములనాశముచేయవలెనని" లేచెను. అపుడు అకంపనుడు రామునిబలపరాక్రమములను వివరించి,

శ్రీమద్రామాయణము

రావణుడుసైతము రామునితో యుద్ధముచేసి జయింపలేడని తెలిపి, రామునకు ప్రియమైన అతిసుందరమైన భార్యను సీతను తననుండి దూరముచేసిన, ఆఎడబాటువలన కల్గుదుఃఖముతో రాముడు మరణించు అవకాశము కలదని, అట్లుచేయుటకు ప్రయత్నింపుమని సలహానొసగెను. సీతయొక్క అందమునుగురించి వినగానే రాక్షసునికోరిక మొలకెత్తెను. ఖరదూషణాదులు చంపబడుట తన అదృష్టవశమున మరియొక సౌందర్యరాశి తనకు భార్యగలభించుటకే అని తలచి అకంపనుని సలహాను మెచ్చుకొనెను. తన ఆలోచనకనుగుణముగ రావణుడు తనరధముపై ఆకాశమార్గమున మారీచుని ఆశ్రమమునకు వెళ్ళెను.

మారీచుడు రావణునకు స్వాగతము పలికి ఏఅత్యవసర కార్యముతో తనకడకువచ్చినావని రావణుని ప్రశ్నించెను. రావణుడు జనస్థానమున ఉంచబడిన రాక్షససైన్యమంతయు దశరధకుమారుడు రామునిచే సంహరింపబడినదనియు, దానికి ప్రతీకారముగ తాను రాముని భార్యను అపహరింపదలచితిననియు, ఈపనియందుతనకు మారీచు డొక్కడు మాత్రమే సహాయము చేయగల సమర్ధుడనియు తెలిపి అతని సహాయమును కోరెను. మారీచునకు రాముని బలము, తన అనుభవము జ్ఞప్తికివచ్చి భయముతో "నీశత్రువు మిత్రునిగ నటించుచు నీనాశమునకు, రాక్షసనాశమునకు మూలమగు సలహానిచ్చినాడని తలతును. నీకు అందమైన గృహము అందునీపట్లభక్తిగల భార్యలున్నారుకదా! పోయి వారితో సుఖింపుము. రాముని భార్య సీతను అపహరించి తెచ్చుట నీరాక్షసవంశ నాశనమునకే అని తెలిసికొనుము" అని హితోపదేశ

మొనర్చెను. దశకంఠుడగు రావణుడు మారీచుని సలహా ఉచితమైనదని తలచి లంకకు తిరిగిపోయెను. మానవులవలన తప్ప మిగిలిన అందరవలన తనకు ప్రాణభీతిలేకుండునట్లు వరముపొందిన విషయ మతనికి జ్ఞప్తికి వచ్చెను. రాముడు ఖరదూషణత్రిశిరాది రాక్షసులను, ఇతర సైనికులను సంహరించెనను వార్తతెలిసి, మారీచుని సలహాయే మంచిదని అంగీకరించెను. కాని విధి అతనిని అట్లుండనీయలేదు.

రావణుడు తనమంత్రులతో సభయందు తన సింహాసనముపై కొలువుతీరి యుండెను. అతని ముఖము హోమాగ్ని వలె ప్రకాశించుచుండెను. అతని శరీరమందలి గాయముమచ్చలు దేవదానవులతో యుద్ధములందు అతడు సాధించిన విజయములను చాటుచున్నవి. అతని బలము, ధైర్యము అంతులేనివి. అట్లే అధర్మమును. దేవతలను బాధించుట, యజ్ఞములను నాశమొనర్చుట, స్త్రీలను అపహరించుటలో అతనితో సమానులెవ్వరును లేరు. దేవతలు, అసురులు కూడ అతనికి భయపడువారే. జీవులన్నిటికి అతడు భయంకరుడు. సిరిసంపదలననుభవించుచు, మృత్యుభీతిలేక, లంకాధినేత రావణుడు పాపభీతిగాని, దైవభీతిగాని లేకయుండెను. పదితలలతో, విశాలనేత్రములతో, పెద్ద అవయవములతో భయంకరముగనున్న అతనియందురాజసము ఉట్టిపడుచున్నది. విలువైన వస్త్రాభరణములతో అలంకరింపబడి మంత్రులమధ్య సమావేశమునందు కూర్చున్న సమయమున రక్తముకారుచు వికృతరూపమునందిన సూర్పణఖ బాధ, దుఃఖము, అవమానముమూర్తీభవించినట్లు రావణుని ముందు ఏడ్చుచు

ప్రత్యక్షమయ్యెను. అందరు ఆందోళనతో చూచుచుండగ కోపముతోనిట్లు పలికెను. "ఇంద్రియసుఖములనుభవించుచు, నీఉనికిని నిర్లక్ష్యముచేసి నిన్ను భయభ్రాంతుని చేయుచున్నపరిస్థితిని గ్రహించి మేలుకొనని నీవెంత అవివేకివి. ఒకసామాన్య మానవుడు రామునిచే నీసోదరులు ఖరదూషణాదులు, త్రిశిరుడు, పదునాలుగువేలరాక్షససైన్యము, నీసైనిక స్థావరము జనస్థానము ధ్వంసము చేయబడినట్లు నీవెరుగవా? నీచెల్లెలగునేను వికలాంగను చేయబడి అవమానముతో గుండెబ్రద్దలయి విలపించుచున్న నన్ను చూచినను నీకు పగతీర్చుకొనవలెనని ఆలోచనరాలేదా? నీవేమినాయకుడవు? ఏమివీరుడవు?".

సూర్పణఖ బాధను దుఃఖమును చూచి రావణుని హృదయము బాధనందగ "తప్పక పగతీర్చుకొందును. కాని రాముడు ఎవరు? ఎట్టివాడు? అతని ఆయుధములేవి? అతడెట్లు యుద్ధముచేయును? దండకారణ్యమునందు అతడేమికోరును? నీవంత క్రూరముగ వికృతరూపమునందుటకు కారణమేమి?" అని రావణుడు ప్రశ్నించెను. సూర్పణఖ రావణుని యందుగల రాక్షససహజమైన ఈర్ష్యాసూయలు పెంపొందునట్లు రామలక్ష్మణుల బలపరాక్రమములను, కుతూహలమును కోరికను అతిశయింపజేయునట్లు సీతయొక్క సౌందర్య సౌకుమార్యములను విపరీతముగ వర్ణించెను. తరువాత "సీత సౌందర్యము చూచి ఆమె నీకు భార్యగనుండతగినదని తలచి, నీకొఱకు ఆమెను తీసికొనివత్తమని ప్రయత్నించగా, ఆలక్ష్మణుడు నా ప్రయత్నమును భంగపరచి, నన్నిట్లు వికృతరూపిని చేసి అవమానించి

పంపెను. నీకోసమే నేనిట్లు బాధపడితిని. ఈఅవమానమునకు ప్రతీకారము చేయుకోరికనీకు ఉన్నచో లేచి వెంటనేబయలుదేరుము. నీస్వశక్తిని నీవెరుగవు. నీవు సులభముగ సీతను నీస్వంతము చేసికొనగలవు. నీరాక్షసవంశమునకు అవమానమును భరింతువా? అన్నియు ఆలోచించి నీకు యోగ్యమైనవిధముగ చేయుము. రక్షింపుము. రాక్షసవంశగౌరవమును కాపాడుము" అని పలికెను. తన సోదరియొక్క మాటలు విని, సీత సౌందర్య ప్రశంసను విని రావణుడు సభను వీడుకొలిపి ఏకాంతముగ ఆలోచనలోపడెను. ఆలోచించి, ఆలోచించి మారీచుని మాటలను జ్ఞప్తికి తెచ్చికొనియు, తనలోతాను తర్జనభర్జన చేసికొని చివరకు ఒకనిర్ణయమునకువచ్చి రహస్యముగ రథమును సిద్ధము చేయించెను. పిశాచముఖములతోనున్న కంచరగాడిదలు పూన్చబడిన బంగారురథమునెక్కి సముద్రముపైభాగమున, భూమిపైభాగమున ఆకాశ మార్గమునపయనించి జటాజిన వల్కములు ధరించి తాపసజీవనము సాగించుచున్న మారీచ ఆశ్రమమును చేరెను.

తన ప్రభువు, బంధువునగు రావణుని చూడగనే మారీచుడు యధోచిత స్వాగతము పలికి "ముందుగ తెలియపరచ కుండగనే రెండవసారి ఇచ్చటకేలవచ్చితివి?" అని అడిగెను. భాషణ నైపుణ్యముగల రావణుడిట్లనెను. "నేను నీవుమాత్రమే రక్షింపగల ఒక కష్టములోనుంటిని. అందుచే నీసహాయమును కోరుచున్నాను. జనస్థాన మునగల నాసోదరులు, యోధులు శత్రుబాధనెరుగక ఎన్నోఏండ్లుగ జీవించుచున్నవారిని నేలపై నిలబడి రథములేకుండ రాముడు ఒంటరిగ

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

మట్టుపెట్టి, ఋషీశ్వరులకు రాక్షసభయము లేకుండ రాక్షససైన్యము నంతటిని ధ్వంసమొనర్చినాడు. రాముడు ఏదోనేరమునకు శిక్షగ తండ్రిచే బహిష్కరింపబడిన అయోగ్యుడైన రాకుమారుడు. అతడు తనభార్యను వెంటపెట్టుకొని ఒంటరిగ అడవియందు తిరుగుచున్నాడు. అతడు తాపసి వలె వేషము వేసికొని అధర్మముగ ఇంద్రియసుఖములననుభవించు చున్నాడు. బలగర్వముతో అకారణముగ నాసోదరిని వికృతరూపను చేసి రాక్షసవంశమునవమానపరిచినాడు. ఈబాధను అవమానమును పొందిన నాసోదరి బాధపడుచునాకు మొరపెట్టుకొనినది. ఈపరిస్థితియందునేను ఉపేక్షవహించిన నేను రాజనెట్లగుదును? నాపగతీర్చుకొనుటకు దండకా రణ్యమునుండి రాముని భార్యను అపహరించుకొనిపోవుటకు నిశ్చ యించితిని. రామునిఅవమానించి, శిక్షించుటకు నీసహాయమవసరము. బలము, ధైర్యము, నేర్పు, మాయలయందు భూమియందునీతో సమాను లెవ్వరునులేరు. అందుచేనీసహాయము కోరినేను వచ్చితిని. నీవు తిరస్క రింపకుము. ఏవిధముగ సహాయపడవలెనన్నది నేను నీకు చెప్పుదును. నీవు వెండి చుక్కలుగల బంగరులేడి రూపమును ధరించి రాముని ఆశ్రమ సమీపమందు సీతకనులఎదుట సంచరింపవలెను. స్త్రీసహజమైన బుద్ధితో సీత రామలక్ష్మణులను బంగరులేడిని పట్టుకొని తనకు తెచ్చిపెట్టుడని కోరును. వారు నిన్ను పట్టుకొనుటయందు నిమగ్నమైయుండగ సీత ఒంటరిగనున్నపుడు నేను సులభముగ ఆమెను అపహరించుకొని పోదును. సీత మిక్కిలి సౌందర్యవతి. అట్టిభార్యనుకోల్పోయిన రాముడు

బెంగతో కృశించి శారీరకమానసిక శక్తులు తగ్గి బలహీనుడగును. అపుడు అతనిని సంహరించి మనపగ తీర్చుకొనవీలగును".

మారీచుడు రావణుని నివ్వెరపోయిచూచెను. అతని ముఖము తెల్లబోయెను. రావణుని పథకమునకు మారీచుడు భయ పడెను. రాముని శక్తిపట్ల తన అనుభవము తోడను, తపస్సువలన తనకుకల్గిన జ్ఞానమువలనను ఏమిజరుగబోవుచున్నదో మారీచుడు చూడగల్గెను. విధి అను ఉరిత్రాడు రావణుని మెడకు బిగింపబడి నాశనమునకు దారితీయుచున్నదని స్పష్టమయ్యెను. రాక్షసవంశ గౌరవ మనియు, రాజబాధ్యతయనియు, సూర్పణఖ అవమానమనియు చెప్పిన వన్నియు అసత్యములు. కాని నిజమునకతడు సీత సౌందర్యముపట్ల మోహితుడగుట సత్యము. ఇదంతయు మారీచుడు గుర్తించెను. తనకు వికృతరూపమును కల్గించిన లక్ష్మణునిపైకాక తనకోరికకు అడ్డముగ నిలచిన సీతమీద సూర్పణఖ పగపెంచుకొని, ఆపగతీర్చుకొనుటయందు రావణుని వినియోగించుకొనునిమిత్తము, సీత సౌందర్యమును అధికముగ రావణుని ముందు పొగడి, రావణుని వాంఛను రెచ్చగొట్టి తనపగను సాధించుటకు ప్రయత్నించెను. మారీచుడు రావణునికిట్లు చెప్పెను.

"ఓప్రభూ! నీవు చెప్పినదంతయు విన్నాను. అంతులేని విచారములో మునిగినాను. ముఖస్తుతి మాటలు చెప్పుట సులువు. ముఖస్తుతి ఎప్పుడును చెవులకు ఇంపుగనుండును. రుచించని మంచి సలహా నిచ్చువారు కొద్దిమంది. ఆమంచిసలహాను ఇష్టపడువారు ఇంకను తక్కువమంది ఉందురు. అయినను కఠోరసత్యమును నీకు చెప్పుట

నాబాధ్యత. తీపిమాటలునీకిపుడు సంతోషముకల్గించును. అవి నిన్ను విపత్తునకు, నాశమునకు నడిపించును. నీకుసమాచారము తెలిపినవారు రామునిగురించి నిజముచెప్పలేదు. రామునిగురించి యితరులు చెప్పినది విని నీవు మోసపోకుము. రాముడు స్వపక్షత్యాగిగాని,నేరస్థుడుగానికాడు. కాని తండ్రిమాటను నిలుపుటకు అరణ్యవాసముచేయుచున్న బాధ్యతగల కుమారుడు. అతడు సమర్ధుడైన యోధుడు. అతని శత్రువును చేసికొని నీకు, నీప్రజలకు, రాజ్యమునకునాశనమును తేకుము. నీనాశమును సాధించుటకే సీతజన్మించినట్లు తోచుచున్నది. నీకారణముగ రాక్షస వంశము, లంకాపట్టణము తొందరగ నిర్మూలింపబడును. నీమదిలోనికి ఇట్టి విపత్కరమైన ఆలోచనను ప్రవేశపెట్టిన ఆశత్రువు ఎవరు? నిన్ను, నీరాజ్యమును, నీవంశమును విపత్తునకు, నాశమునకునడిపించు చెడు సలహాను నీకెవరుఇచ్చిరి? రాముడు సుఖములయందు, అసత్యము లందు ప్రీతిగలవాడని నీకెవరు చెప్పిరి? రాముడు మూర్తీభవించిన ధర్మము. అతడు తన బలపరాక్రమములను ధర్మమునకు సేవచేయుట యందు వినియోగించును. దేవతలందరయందు ఇంద్రుడు ప్రధముడయి నట్లు మానవులయందు రాముడు ప్రధమగణ్యుడు. సీతపై కన్ను వేయుటకు నీకెంతధైర్యము? సీతనీకెపుడైనా లొంగునా? రాముని నుండి నిజముగ సీతను తీసికొనిరమ్ము.ఎవరైనను సూర్యునివంచించి, అతనికాంతిని దొంగిలించగలరా? ప్రజ్వలించు అగ్నివంటి జనకుని కూతురును సమీపించినచో నీవు భస్మమయిపోవుదువు. రాముని బాణములకు ఎరకాబోకుము. నీమరణమును కోరితెచ్చుకొనకుము.

రామరక్షితమైన అగ్నిని సమీపింపకుము. సంపూర్ణముగ ఆలోచించనిదే ఏపనికి సిద్ధపడరాదు. నీవురాముని యుద్ధమున ఎదిరించలేవు. నామాటలు పెడచెవినిపెట్టకుము. రాముని బాల్యమునందు విశ్వామిత్రుని యాగరక్షణకొరకు వచ్చినపుడు నేను యాగాగ్నిని కలుషితము చేయుటకు వెళ్ళగా, బాలుడైనరాముడు ఒకబాణముతో సుబాహుని సంహరించి, రెండవ బాణముతో నన్ను సముద్రములోనికి విసరివైచెను. ఆరాముడిపుడు బలవత్తరమైన యుద్ధనైపుణ్యముగల సంపూర్ణ మానవుడు. నీవు సీతపై వ్యామోహమును వీడకున్నచో లంకాపట్టణ మును, ప్రజలును, సైన్యములును, సర్వము నాశమగును. ఈపాపకార్య మును విడిచిపెట్టుము. రామునిపైనీకు ఆగ్రహమున్నచో రామునితో ద్వంద్వయుద్ధముచేసి వీరస్వర్గమునలంకరింపుము. తప్పుడుమార్గము నవలంబించి నన్ను దానిలోనికి లాగకుము. వెనుకకు వెళ్ళి నీభార్యలతో సుఖముగనుండుము. నీభూమికి, నీవంశమునకు యముని పిలువకుము".

ఆవిధముగ మారీచుడు రావణుని మంచికొఱకు వాదించెను. రోగి ఔషధమును తిరస్కరించినట్లు రావణుడు మారీచుని మాటలను తిరస్కరించెను. "ఒకప్రభువు ఒకపనిని చేయవలెనా? లేదా? అనితెలుసుకొనదలచినచో సలహాదారుడు మంచిచెడులు ఆలోచించి చెప్పునవసరము కలదు. కాని నేను నిశ్చయించినకార్యమునకు నీసహాయమును కోరి వచ్చిన ప్రభువును నేను. అందుచే నీసలహా నాకు అవసరము లేదు. నేను నిన్ను కోరిన సహాయము నీవు చేసితీరవలెను.

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

నీవు క్రొత్తరకపు లేడివలె మార్పుచెంది, సీతయెదుట కనిపించి, ఆమెను ఆకర్షించిన ఆమె నిన్ను పట్టితెచ్చుటకై రాముని పంపించును. నీవు రాముని దూరముగ తీసికొనిపోయి రాముని కంఠధ్వనిని అనుకరించుచు "హా...సీతా! హా....లక్ష్మణా!" అని అరచిన సీత రామునకు సహాయ పడుటకు లక్ష్మణుని పంపును. ఒంటరిగానున్న సీతను నేను లంకకు తీసికొనిపోవుదును. నీవు నేనుచెప్పినపని చేసినయెడల నీవు నీఇష్టాను సారము ఉండవచ్చును. లేనిచో నీప్రాణములను విడుచుకొననగును" అని రావణుడు పలికెను. మారీచుడు తనలోతాను ఇట్లు ఆలోచించెను. "పాపపు కోరిక రావణుని యమునికడకు నడపుచున్నది. రావణుని చేత చంపబడుటకంటె రామునిచేత చంపబడుట నాకు మంచిది" అని తలచి రావణుని సంకల్పమునకు మారీచుడు అంగీకరించెను. రావణుడు మారీచుని కౌగిలించుకొని ఆనందించెను. అనంతరము రావణమారీచు లిరువురును రథమునెక్కి దండకారణ్యమునకేగి, అచట కదళీ వనము నందున్న రాముని ఆశ్రమమును చూచిరి. ఆశ్రమమునకు కొలది దూరమున క్రిందకు దిగినతర్వాత రావణుడు తమ పథకము ప్రకారము చేయుమని మారీచుని కోరెను.

ఒక్కసారిగ మారీచుడు అద్భుతమైన లేడిరూపమును ధరించెను. ఆకాశమున ఇంద్రధనువునుపోలి బంగారము, వెండి, రత్నముల కాంతులతో నిండిన చర్మముతో సుందరముగ తయారైన మాయలేడి రాముని ఆశ్రమ పరిసరప్రాంతమున తిరుగనారంభించెను. ఆలేడి గడ్డిమేయుచు, అటునిటు పరుగులెత్తుచు, ఇతరజంతువుల

మురిపించుచు , వివిధరకముల తన అందమును ప్రకటించుచు, పూలను సేకరించుచున్న సీతకంట పడి ఆమెను ఆకర్షించెను. సీత లేడి సౌందర్య మునకు వింతచెంది రాముని పిలిచెను. ఆమె పిలుపు విని రామ లక్ష్మణులు కుటీరము వెలువడి వచ్చి ఆలేడి సౌందర్యమునకు ఆశ్చర్య పడిరి. లక్ష్మణుడు సంకోచించి, అదిసామాన్య మృగము కాదనియు, రాక్షస మాయయనియు పలికెను. కాని సీత ఆలేడిని పట్టితెచ్చి ఇమ్మనియు, ఇంతకుపూర్వమెన్నడును తానిట్టిలేడిని చూడలేదనియు, దానిని పెంచు కొందమనియు, ఏదోరీతిగ దానిని పట్టుకొనుమనియు రాముని కోరెను. ఆమృగమును సజీవముగ బంధింపలేకపోయినచో దానిని చంపి కనీసము దానిచర్మమునైనను కొనిరమ్మని రాముని మరలమరల ప్రార్థించెను. శ్రీరాముడు సీతకోరికను కాదనలేకపోయెను. "లక్ష్మణుడు చెప్పినరీతిగ రాక్షసమాయయైనచో ఆరాక్షసుని వధింతుమనియు, సజీవముగ లేడిని బంధింపలేనిచో దానిని చంపి ఆచర్మమును సీతకీయవచ్చుననియు, అంతముచ్చటపడి కోరిన సీతకోరికను కాదనుట యుక్తముకాదనియు" తలచి రాముడు లక్ష్మణుని తన ధనుర్బాణములను తెమ్మని కోరెను. లక్ష్మణునకు ఇష్టములేకున్నను అగ్రజుని ఆజ్ఞను శిరసావహించెను. "లక్ష్మణా! నీవు సీతప్రక్కనే ఉండి ఆమెను జాగరూకతతో రక్షింపుము. నేను ఈమృగమును సజీవముగగాని, సంహరించిగాని కొనివత్తును. ఇది రాక్షసమాయయైనచో వాతాపి అగస్త్యమహర్షిచే సంహరింపబడినట్లు,నాచేత ఈరాక్షసుడు చంపబడును. జాగ్రత్తగా నుండుము" అని రాముడు లక్ష్మణుని హెచ్చరించి మాయలేడిని వెంబడించెను.

రావణునకు ఎక్కువసమయమును కల్పించునుద్దేశముతో లేడి రూపముననున్న మారీచుడు రామునకు అందుబాటులో కనిపించినట్లు తోపించుచు, అంతలో దూరముగ పరుగులిడుచు దూర ప్రాంతములకు రాముని కొనిపోయెను. విసుగుచెందిన రాముడు బాణమును సంధించి విడువగా, మారీచుడు స్వస్వరూపము నొంది, రాముని కంఠస్వరముననుకరించుచు "హా....సీతా! హా.....లక్ష్మణా!" అనియరచి మరణించెను. "లక్ష్మణుడు తలచినదేనిజము. ఈలేడి నిజముగా రాక్షసుడే. ఈకేకను విని సీతభయపడునేమో! సీత భయపడి నను రక్షణ నిమిత్తము లక్ష్మణుడున్నాడుకదా!" అనుచు తనకట్టి అనుజుడున్నందులకు ఎంతయో గర్వసంతోషములను రాముడుపొందెను.

"అయ్యో! హా....సీతా! హా....లక్ష్మణా! " అను రాముని కంఠధ్వనిని అనుకరించుచు మారీచుడు వేసిన కేకలతో సీత మోసగింపబడెను. గాలివానయందలి అరటి చెట్టువలె వణకిపోయెను. "లక్ష్మణా! మీఅన్న కంఠధ్వనిని నీవు వినలేదా? అతనికి సహాయపడుటకు పరుగెత్తుము" అని లక్ష్మణుని త్వరపెట్టెను. కదలివెళ్ళుటకు ఇష్టపడని లక్ష్మణుని చూచి ఆందోళణతో, ఆవేదనతో సీత మరలమరల రామునకు సహాయముగ వెళ్ళుమని లక్ష్మణుని ఒత్తిడిచేసెను. "నేను నాభర్త రాముని కంఠధ్వనితో సహాయార్ధము వేసిన కేకలు విన్నాను. ఆలస్యము చేయక వెళ్ళుము. రాక్షసులచే చుట్టుముట్టబడి అతడేదో పెద్దప్రమాదమునందుండియుండును. ఇంకను నీవిక్కడనిలిచియున్నావేమి? అతనికి సహాయపడుటకు పరుగెత్తుటకు బదులు ఇంకను నీవిచట నిలబడి యుంటివేమి?"

అని సీత పలికెను. లక్ష్మణుడు రాక్షసుల మాయలు తెలిసినవాడు. అతడు తన అన్న ఆజ్ఞను గుర్తు ఉంచుకొని అచటనుండి కదలలేదు. సీత భయసందేహములతో ఆగ్రహముతో చెలరేగెను. తనరెండుచేతులతో గుండెను బాదుకొనుచు అంతులేని క్రోధముతో "సుమిత్రానందనా! నీవును శత్రువుగామారితివా? ఇన్ని సంవత్సరములును రాముని చావుకొఱకు నిరీక్షించుచు మాతోఉన్నావా? స్నేహితునిగ నటించుచు, రాముని మరణముకొఱకు ఊహించుచు అనంతరము నన్ను సంపాదించుటకు చూచుచున్నావా? లేనిచో అతడు సహాయార్థముకేక వేయగ అతనికి సహాయము చేయుటకునిరాకరించి ఎందుకు ఇంకను నిలబడి యున్నావు? వంచకుడా! ద్రోహీ!" అని సీత పలికెను. సీతయొక్క క్రూరమైన మాటలు విషపూరితబాణములవలె లక్ష్మణుని హృదయమును గాయపరచెను. అతడు తనచేతులతో చెవులను మూసుకొనెను. సీతతో మర్యాదగానిట్లు పలికెను.

"వైదేహీ! ప్రపంచమున ఏశత్రువునైనను రాముడు జయించి నిర్జింపగలడు. భయపడవలసిన పనిలేదు. తల్లికంటెమిన్నయగు ఓమాతా! శాంతించుము. ఈవిశ్వమందెవ్వరును రాముని తాకుటకుగాని, అతనికి హాని కలిగించుటకుగాని తగినంతశక్తిమంతులు లేరు. నీవు ఉచ్చరించిన మాటలు నీకు తగవుతల్లీ! భయమును విచారమును విడిచి పెట్టుము. నీవుకోరిన బంగరులేడి శరీరముతో రాముడు తిరిగివచ్చుట నీవు చూతువు. మనము విన్న ఆకంఠధ్వని రామునిది కాదు. అది రాక్షసమాయ. మోసగింపబడి దుఃఖించకుము. నిన్ను రక్షింపుమని

నన్ను నాఅన్న ఇచట నియమించెను. నిన్ను ఒంటరిగ విడిచి వెళ్ళుమని నన్నడుగకుము. నాఅన్న ఆజ్ఞను నేను తిరస్కరించలేను. మనము జనస్థానమునందలి రాక్షసులను సంహరించినది మొదలు, వారి అనుయాయులు పగతీర్చుకొనుటకు అనేకరీతుల ప్రయత్నించుచున్నారు. వారిమాయరూపములతోడను, మాయకంఠధ్వనులతోడను మనము వంచింపబడరాదు. అది సహాయముకొఱకు చేసిన రాముని అరపుకాదు. నీవెంతమాత్రము భయపడనవసరము లేదు" అని లక్ష్మణుడు ఎంతగా నచ్చచెప్పినను, బతిమాలినను సీతవినిపించుకొనక లక్ష్మణుని భరతునిచేపంపబడిన శత్రువుగను రాముని మరణము కొఱకును, సీతను పరిగ్రహించుటకు వచ్చిన వంచకునిగను ఎన్నోరకముల దూషించుచు, నిప్పులుగ్రక్కు కనులతో గుండెలు బాదుకొనుచు, విలపించుచు "లక్ష్మణా! నీవు నీఅన్నకు సహాయపడుటకు వెంటనే వెళ్ళనిచో, నేను అగ్నియందు దుమికిగాని, గోదావరిలోదూకిగాని, ఉరిపోసుకొనిగాని మరణింతును. నీవు వెళ్ళుదువా? నేను మరణించనా?" అని సీత లక్ష్మణుని బెదిరించెను. లక్ష్మణుడు ఆమెమాటలను భరించలేక భక్తితో తనచేతులెత్తి "సోదరీ! నేను నీమాటను శిరసావహించి, మాఅన్నఆజ్ఞను తిరస్కరింతును. నిన్ను నేను ఒంటరిగవిడిచి వెళ్ళుదును. నీవు క్షేమముగనుండుము. ఈఅరణ్య దేవతలు నిన్ను రక్షింతురుగాక! నీఆజ్ఞనునేను నెరవేర్తును. నాకు అపశకునములుతోచుచున్నవి. నేను చాలబాధపడుచున్నాను. నిన్ను రామునితో మరలచూడగలనా? అని భయపడుచున్నాను. అయినను నేను వెళ్ళుచున్నాను" అని లక్ష్మణుడు పలికి అయిష్టముగానే, మరల

మరల వెనుకకు తిరిగిచూచుచు వెళ్ళెను. దుఃఖముతోను, విచారము తోను, బరువెక్కినహృదయముతో లక్ష్మణుడు సీతను విడిచి నడచెను. సీతమాటలను భరింపలేక మరువలేక బాధపడుచు రాముడువెళ్ళినదిశకు లక్ష్మణుడు వెళ్ళెను. ఈతరుణముకొఱకు వేచియున్న రావణుడు పరిశుభ్రమైన కుంకుమపువ్వు వర్ణముగల వస్త్రములను ధరించిన తాపసపరివ్రాజక వేషమును ధరించి వేదమంత్రములను ఉచ్చరించుచు రాముని ఆశ్రమమును సమీపించెను.

సీత అరణ్యమువంక దృష్టిని కేంద్రీకరించి కుతూహ లముతో రాముని రాకకై నిరీక్షించుచు, కుటీరద్వారముకడ నిలిచి యుండెను. రావణుడు సీతను చూచెను. చూడగనే సూర్పణఖచే విత్తబడిన సీతపట్ల కోరిక, రావణుని మనస్సున పెద్దవృక్షమైపెరిగి, సీతను పొందుటకు రావణుడు నిశ్చయించుకొనెను. కాషాయవస్త్రములను ధరించి దండకమండలములను ధరించి తిరుగుచున్న తాపసిని చూచి సీత సంప్రదాయముననుసరించి మర్యాదగ అతనిని పలుకరించెను. ఆచారము ప్రకారము అతనికి ఆసనమును చూపించి, అతనిముందు కొన్ని పండ్లను దుంపలను పెట్టెను. ఆతాపసి సీతను మరలచూచెను. అతనికోరిక బలవత్తరమయ్యెను. అతడు పాపాత్ముడగు రాక్షసుడైనను సీతయొక్క మనసును జయించి ఆమెఅంగీకారముతో తనకు భార్యగ చేసికొందమని తలచెను. లంకాధిపతి తనసంపద, అధికారములతో సీతను స్వాధీన పరచుకొననెంచెను. రాముని శిక్షించుటకును అవమానించుటకును ఇదేమంచి మార్గమని తలచెను. తనకు తెలిసిన ఇతరస్త్రీలవలెనే సీత

ప్రవర్తించుననియూహించెను. సీతచే సమర్పింపబడిన ఫలమూలముల ఎదుట కూర్చుండి ఆతాపసి సీతసౌందర్యమును పొగడనారంభించెను. "రాక్షసులును, వన్యమృగములును సంచరించు ఈయరణ్యమున ఒంటరిగ ఎందుకుంటివి?" అని అడిగెను. సీత ఆశ్చర్యపడినను ఆమె జవాబిచ్చెను. తనభర్త వచ్చునని తలచి తనదృష్టిని కుటీరద్వారమునందు నిలిపి యుంచెను. తాపసి కొంచెము కొంచెముగ తానెవరో వెల్లడిచేసి, తన గొప్పతనమును, తనకుటుంబమును, అధికారమును, సంపదను వర్ణించెను. తనను తాను స్తుతించుకొనిన తర్వాత "నాభార్యవగుము. ఉజ్వలమైన జీవితమును నాతోపాటు లంకలో అనుభవింపుము. రమ్ము. వెళ్ళుదము" అని పలికెను. ఊహింపని ఈపరిస్థితియందు సీతయొక్క నిజాయితీ ఆమెకు ధైర్యమునిచ్చి, అతనిని తిరస్కరించుటకు "దుర్మార్గుడా! నీనాశము సమీపించినది. ప్రాణములతో తప్పించుకొన దలచినచో వెంటనే ఈయాశ్రమమును విడిచిపొమ్ము" అని సర్పమువలె బుసకొట్టుచు పలికెను.

రావణుడు క్రోధముగలవాడై తననటనను, మంచితనమును విడనాడి తన స్వస్వరూపమును, క్రూరత్వమును ప్రదర్శించెను. ఒకచేత సీతయొక్క జుట్టు పట్టుకొని రెండవచేత ఆమెను ఎత్తిపట్టుకొని చెట్లచాటున వేచియున్న తనరధమునందు ఆమెను బలవంతముగ కూర్చుండబెట్టి ఆమెతో ఆకసమునకు ఎగిరెను. "ఓనాస్వామీ! రామా! ఎక్కడనుంటివి? సంపూర్ణ భక్తివిశ్వాసపూరితుడపైన ఓలక్ష్మణా! మూర్ఖపు పట్టుదలతో నేనెందుకు నిన్ను దూరముగాతరిమితిని" అని గట్టిగా సీత

రోదించెను. రావణుడు సీతను స్థిరముగా పట్టుకొని ఆకసమార్గమున రథమును నడిపించెను. సీత అరణ్యమందలి చెట్లను మొక్కలను తన దయనీయస్థితిని గురించి రామునకు తెలియజేయుడని ప్రార్థించెను. ముదుసలియగు జటాయువు ఒకచెట్టుకొమ్మపై మగతగా నిద్రించుచు ఎగురుచున్న రథమును చూచెను. ఒకస్త్రీయొక్క అరపుతో ఒక్కక్షణము నందు ఉలికిపడి మేలుకొని కంఠధ్వనినిబట్టి ఆమెను సీతగా గుర్తించెను. సీతకూడా జటాయువును చూచి తనను రక్షింపుమని వేడుకొనెను. జాలిగొలుపు సీతగతిని చూడగనే జటాయువు రక్తము వేడెక్కి "ఆగుమాగుము. ఏమిటి ఇదంతయు?" అని అరచుచు ఆకసమున ఎగురుచున్న రథము వెనుక ఎగిరెను. "లంకాధిపతి నన్ను బలవంత ముగా మోసికొని పోవుచున్నాడు. ఓముసలి మిత్రుడా! వానిని వారించుటకు నీవేమిచేయగలవు? రామలక్ష్మణులకడకు ఎగిరివెళ్ళి నానిస్సహాయస్థితిని వారికి తెలియజేయుము" అని సీతరోదించెను. ఆకాశమును పరిపాలించిన పక్షిరాజవంశమున జన్మించినరక్తముతో, భయములేక, రావణుని శక్తిని లెక్కచేయక, ఒక ఆపదలోనున్న రాజకుమారిని చూచి తనస్నేహితుడగు దశరథుని తలచుకొని, రామునకు తానిచ్చిన వాగ్దానమును జ్ఞప్తికి తెచ్చుకొని, తాను జీవించియుండగా ఇట్టిదౌర్జన్యము జరుగుటకు వీలులేదని జటాయువు రావణుని నిరోధించు టకు సిద్ధపడెను.

"ఓరాజా! పక్షులకు రాజును నేను జటాయువును. ఓరాజసోదరా! ఈక్రూరకృత్యమును విడిచిపెట్టుము. అవమానకరమగు

ఈతప్పును చేయుచు నీవు నిన్ను రాజుగా ఎట్లు చెప్పుకొందువు? స్త్రీలగౌరవమును కాపాడుట రాజధర్మము. సీత ఒకరాజకుమారి. ఆమెను విడిచి వెళ్ళనిచో నీకు మరణము తప్పదు. ఆమె చూపు మాత్రమే నిన్ను భస్మము చేయును. నీవు భయంకరమైన సర్పమును నీఒడిలో మోయుచున్నావు. యమపాశము నీమెడకు చుట్టుకొని నిన్ను నరకమునకు లాగుచున్నది. నేను వృద్ధుడను, నిరాయుధుడను. నీవు సాయుధుడవైన రధారూఢుడవగు యువకుడవు. అయినను సీతను నీవు తీసికొని పోవుచుండగా నేను చూచుచు ఊరకుండను. రాముని పరోక్షమందు ఈపిరికి పని ఎందుకు చేయుచున్నావు? అతనిపట్ల నీకేమైన బాధయున్నచో అతనిని ముఖాముఖికలుసుకొనుము. నానుండి ఎగిరిపోవుదువా? నేను జీవించియుండగా నీవు తప్పించుకొనలేవు. నీపది తలలును, రధమును, నీబాహువులను చూచి లక్ష్యపెట్టను. నీతలలు ఇపుడే నేలపై దొర్లగలవు. నీవు పిరికిపందవు, దొంగవు. కాని పక్షమున నీరధమునుండి దిగి నాతోయుద్ధము చేయుము" అని జటాయువు పలికెను.

రావణుడు కోపముతో మండిపడెను. అతడు జటాయువు నెదిరించెను. అది ప్రచండవాయువునకును, దట్టమైన మేఘమునకును మధ్య ఘర్షణను పోలియుండెను. అరణ్యపైభాగమున ఆకాశమునందు యుద్ధము జరిగెను. జటాయువు రెక్కలుగల పర్వతమువలె యుద్ధము చేసెను. రావణుడు భయంకరమైన బాణములను జటాయువుపై ప్రయోగించెను. జటాయువు వానిని అడ్డగించి, తనగోళ్ళతో రావణుని

శరీరమాంసమును చీరెను. రెచ్చిపోయిన రావణుడు సర్పములను బోలిన అస్త్రములను ఆపక్షిపై ప్రయోగించెను. ఆపక్షిరాజు విపరీతముగా గాయపడి నాడు. కాని సీత కన్నీటితోనిండిన కన్నులతో చూచుచుండగా నిర్భయుడై యుద్ధమొనర్చెను. తన వయస్సును, గాయములను పరిగణింపక జటాయువు రావణుని ఎదిరించి అతని వజ్రకిరీటమును విసరికొట్టి, అతని ధనువును లేకుండా చేసెను. రథచోదకుని సంహరించి,రథమును ధ్వంసమొనర్చెను. రావణుడు నేలపై పడినను సీతను మాత్రము విడువలేదు. జటాయువు రావణుని బాహువులను ఛేదించి సీతను అతని చేతులనుండి తప్పింపప్రయత్నించెను. ఇరువది బాహువులు గల రావణుడు ఒకచేయి పోయినను దానిస్థానములో మరియొక బాహువు పునరుత్పత్తినందుటచే సీత అతని బాహువులయందు బంధింపబడి యుండెను. చివరకు రావణుడు తన ఒరనుండి ఖడ్గమును బయటకులాగి జటాయువు రెక్కలను, గోళ్ళను నరకెను. వృద్ధపక్షీంద్రుడు నిస్సహాయ ముగా నేలపైపడి కదలలేకపోయెను. జానకి పరుగెత్తి జటాయువును కౌగిలించుకొని "ఓనాతండ్రీ! నాకొఱకు నీప్రాణములను విడిచితివి. నాభర్తకునీవు రెండవతండ్రివి. ఓభక్తిపూరిత, ధైర్యసహిత హితుడా! నీవికమాకులేవు" అని దుఃఖించెను. అనంతరము రావణుడు సీతను మరలపైకి తీసికొని పోవుటకు ఆమెకడకు వచ్చెను. "ఓరామా! ఎక్కడ ఉన్నావు? ఓ లక్ష్మణా! ఎక్కడ ఉన్నావు? మీరు నన్ను రక్షింపరారా?" అని ఏడ్చుచు అటునిటు పరుగులెత్తెను. చివరకు రావణుడు ఆమెను పట్టుకొని ఆకసమునకు ఎగిరెను.

సీతను మోసుకొని పోవుచున్న రావణుడు దావాగ్నిచే కప్పబడిన పర్వతమువలెనుండెను. పెద్దనల్లని మేఘము విద్యుల్లతతో కూడినట్లుండెను. ఆవిధముగ సీతరావణునిచే అపహరించి తీసికొని పోబడెను. సూర్యకాంతి తగ్గెను. భూమిపై అకాలమునందు చీకటి అలుముకొనెను. "ధర్మము నశించినది. నిజాయితీ అదృశ్యమైనది" అని సమస్తజీవులును ఆక్రోశించినవి. మూగజీవులు పైకి చూచుచు కన్నీరు విడిచినవి. రావణుడు క్రూరముగ సీతను పట్టుకొని తనవినాశమునకు ఎగిరిపోయెను. సీత మోసికొనిపోబడుచుండగా ఆమెధరించిన పూలు మార్గమంతట పడియుండెను. సీత క్రోధముతో ఎఱ్ఱబారినకన్నులతో రావణుని చూచుచు "నీచుడా! నీవు నీకీర్తినిగురించి, వంశమును గురించి అసత్యములాడితివి. నీవు ధైర్యవంతుడైన యోధునివలె ప్రవర్తించితివా? నీవు నీగురించి సిగ్గుపడుటలేదా? నాభర్తదగ్గరలేని సమయమునకు నిరీక్షించి, సమీపమున రక్షించుటకెవ్వరును లేనిసమయమున, అసహాయురాలైన ఒంటరి స్త్రీని అపహరించిన నీవేమియోధుడవు? నన్ను రక్షింప ప్రయత్నించిన ముసలి పక్షిని చంపుట వీరత్వమా? ఆశ్రమములో ఎంతధైర్యముగ మాటాడితివి. యుద్ధముచేయు ధైర్యములేక దొంగిలించుటకు సిద్ధపడు నీధైర్యమును ప్రపంచము జ్ఞప్తియందుంచుకొనును. నీవు నిజముగ గౌరవవంశమున జన్మించినవాడవైనచో ఆవంశమునకు నీవెంత అవమానమును కలుగజేసితివి. నన్ను తీసికొని పోయి ఏమిసాధింప దలచితివి? ఎంతకాలము జీవింపనెంచితివి? రాముడు నీ ఉనికిని కనుగొనగానే నీవుమరణించుట తథ్యము. నేను నీకు స్వాధీనము

కాకుండగనే మరణింతును. నీవునాప్రభువునుండి తప్పించుకొనలేవు. రాముడు జనస్థానమందలి నీసైన్యమును, రాక్షసయోధులను ఒక్కగంటలో సంహరించెను. అతడునిన్ను పారిపోనిచ్చునా? వెంటనే నిన్నతడు యముని కడకు పంపించును" అని పలికెను. సీత అట్లు క్రోధముతో మాటలాడుచుండగా రావణుడు ఆకాశమార్గమున పర్వతములను నదులను దాటుచు సీతను లంకవైపు తీసికొని పోవుచుండెను. ఒకపర్వతశిఖరమున కొందరు నిలిచియుండుట చూచి సీత తన నడికట్టు బట్టతీసి తన నగలను అందు మూటగట్టి ఆమూటను క్రిందకు విసిరెను. రాముడు తనచే విసరబడిన నగలను చూచి తాను ఏదిశగా అపహరించు కొనిపోబడెనో ఊహించుటకు జాడగ్రహించునని సీత ఆవిధముగ నగల మూటను జారవిడిచెను.

రావణుడు పంపానదిని, సముద్రమునుదాటి లంకాపట్టణ మున ప్రవేశించెను. శోకతప్తయగు సీతతో అతడు తనభవనమునకు వెళ్ళెను. ఆయవివేకి తానొక బహుమతిని సంపాదించితినని తలచెను. కాని స్త్రీరూపముననున్న తనమృత్యువును తనగృహమునకు తీసికొని వెళ్ళెను. అనంతరము పిశాచములను బోలిన రాక్షసవనితలను పిలిపించి తన అనుమతిలేనిదే ఎవ్వరును సీతను సమీపింపకుండునట్లు ఆజ్ఞాపించి సీతను భద్రముగ చూచుకొనుడని ఆదేశించెను. "మీరునన్ను ఎట్లు గౌరవింతురో ఆవిధముగ ఆమెను గౌరవించుచు వస్త్రములును, బంగారునగలును మున్నగునవి ఆమె ఏమికోరినను అవి ఆమెకిచ్చుచు సేవింపుడని ఆదేశించెను. తెలిసిగాని, తెలియకగాని ఆమెమనసును

నొప్పించువిధముగ మాటాడినవారికి మరణశిక్ష తప్పదని హెచ్చరించెను. ఆవిధముగ సీతను తన అంతఃపురమున ప్రవేశపెట్టినతరువాత ఏమిచేయవలసియున్నదని ఆలోచించెను. కొంతమంది తెలివైన గూఢచారులను కబురంపి "వెంటనే జనస్థానమున ఖరుని నివాస ప్రదేశమునకు వెళ్ళి రాముడేమిచేయుచున్నాడో పరిశీలించి ఆవార్తను నాకు తెలుపుడు. రాముడు జీవించియున్నంతకాలము నేను నిదురింప లేను. అతడు నాగొప్పశత్రువు. ఏదోవిధముగ అతనిని చంపవలసి యున్నది. ధైర్యముగ వెళ్ళి పనిపూర్తిచేసికొని తిరిగిరండు" అని పంపెను. సముద్ర ఆవృతమైన ద్వీపమునందు ఒకదుర్గమునందు బంధింపబడిన సీతకు తానెక్కడయున్నదియు రామునకెంత దూరముననున్నదియు తెలియదు. తనభర్త ఏదోవిధముగ వచ్చి రావణుని సంహరించి తనను విడిపించునని ఆమె ఊహించెను. అంతవిచారమునందున్నను తనభర్త బలపరాక్రమముల గురించి ఆలోచించి ఆమె ధైర్యముగానుండెను. రాక్షసరాజు తనపట్ల మృగమువలె ప్రవర్తింపలేదని ఊరట చెందెను.

జనస్థానమునకు తన మనుజలను పంపి రావణుడు సీతదగ్గరకు మరల వచ్చెను. ఆమె దుఃఖముతో కన్నీరువిడుచుట చూచెను. రాక్షసవనితలు సీతను జాగ్రత్తగా చూచుచున్నారు. తన సంపదను, అధికారమును చూచి సీతతనకు లొంగునని రావణుడు తలచెను. కావున తనసంపదను, వైభవమును చూపుటకు ఆమెను తన భవనసముదాయములన్నింటియందును త్రిప్పెను. సీతకు బంగారము, నగలు, పట్టువస్త్రములును, వాహనములును, వేలకొలది పరిచారికలును

అన్నియు చూపబడినవి. కాని ఆమె ఆలోచనలు వేరుగానున్నవి. తాము ప్రదర్శించిన సంపదలన్నియు సీతకు స్వంతమగుననియు, తనను వివాహమాడిన తనభార్యలందరకంటె అధికముగ ఈమెనే మిన్నగా చూచుకొందుననియు, తనలంకాపట్టణము సముద్రముచే పరివేష్ఠింపబడి శత్రుదుర్భేధ్యమైనదనియు, దేవతలు అసురులు కూడ తనతోయుద్ధమున సాటిరారనియు, రాముడు లంకాపట్టణ సమీపమునకెన్నడును చేర లేడనియు, తనను, దేవతలందరను సీతకు సేవకులుగా భావింపు మనియు, యవ్వనమును వృధాచేసికొనవలదనియు, రామునిపై ఆశవిడిచి తనను గ్రహించి లంకకురాణియై సుఖింపుమనియు రావణుడు పరిపరివిధముల సీతను స్వాధీనపరచుకొనుటకు ప్రయత్నించెను. అంతట సీత ఒక గడ్డిపరకను తనకును రావణునకును నడుమపెట్టి దశరధ కుమారుడు రాముడు మహాపరాక్రమశాలియనియు, అతడేతన భర్త యనియు, ఖరదూషణాదిరాక్షసులను సంహరించిన తనభర్తనుమోసగించి అతనిపరోక్షమున పిరికివానివలె తనను ఎత్తుకువచ్చినాడనియు, రావణుడు చేసిన తప్పునకు శిక్షగా రాముడు సముద్రమునింకించివచ్చి రావణుని వంశనిర్మూలనము గావించుననియు, కాకి హంసనుచేరలేనట్లే, రావణునిపొందును తానంగీకరింపననియు, ఆశకుగాని, భయముచేతగాని తాను రావణునకు లోబడననియు ఉద్ఘాటించి మౌనము వహించెను.

"అలాగా! మంచిది. నీకునేను పండ్రెండునెలలు గడువు ఇచ్చుచున్నాను. నీవు నన్ను అంగీకరించితివా మంచిదే. కాని ఆగడువు సమయము పూర్తి అయినతరువాత నీవు తిరస్కరించినచో మావంటవాడు

నిన్ను నాకు ఆహారముగ చేయును ". ఈవిధముగ సీతను హెచ్చరించి, అక్కడనున్న రాక్షసపరిచారికలకు ఇట్లు ఆజ్ఞ ఇచ్చెను. "ఏదోవిధముగ మీరు ఆమెగర్వమును పోగొట్టవలెను. ఆమెను అశోకవనమున ఒంటరిగ నుంచుడు. నేర్పుతో ఆమెను భయముతోడను, ఆశతోడను మనకు లోబడునట్లు చేయుడు" అని కోపముగాపలికి తనభవనమునకు వెళ్ళెను. ఆరాక్షస వనితలు సీతను అశోకవనమునకు తీసికొని వెళ్ళిరి. అది స్త్రీలభవనముల ప్రక్కన ఉన్న ఒక అందమైన ఉద్యానవనము. అందలి చెట్లు ఫలపుష్పములతోనిండియున్నవి. ఆచెట్లపై అందమైన పక్షులు సంచరించుచున్నవి. ఇక్కడ భయంకరమైన, అసహ్యకరమైన రాక్షసస్త్రీలచే ఆక్రమింపబడి, రక్షింపబడుచు సీత బందీకృతురాలయ్యెను. ఎంత దుఃఖములోనున్నను రామలక్ష్మణులు ఏదోవిధముగ తానున్న ప్రదేశ మును కనుగొని తనను రక్షింతురను నమ్మకము సీతకల్గియున్నది. తనభర్త రావణుని నశింపజేసి తనను సంతోషకరమైన జీవితమునకు తీసికొని పోవునని సీతనమ్మియుండెను. ఈవిశ్వాసముతోడనే వారు భయపెట్టినను భయపడలేదు. ఆశలుచూపినను మోసపోలేదు. ఒకరోజును రెండు రోజులును కాదు, కొన్ని నెలలు అశోకవనమున ఆవిధముగ సీత బందీకృతయై బాధపడెను.

మారీచుడు రామబాణవిద్ధుడై మరణించుటకు ముందు తనరాక్షస స్వరూపమును పొంది రాముని కంఠధ్వనిని అనుకరించుచు "హా....లక్ష్మణా! హా.....సీతా!" అని గట్టిగా అరచెను. అపుడు రాముడు రాక్షసమాయచే తాము మోసగింపబడినట్లును మారీచునిచే తాను

చాలదూరము తీసికొని పోబడినట్లును గ్రహించి ఆశ్రమముకడ ఏమిజరిగినదో? అని ఆందోళణ చెందెను. "అయ్యో! మనము చాల మోసపోయితిమి. మారీచునికేకతో లక్ష్మణుడు కూడా మోసపోయిన యెడల, సీతను ఒంటరిగ విడిచి నాకుసహాయముగ వచ్చినయెడల ఏమగునో? రాక్షసులు పధకము ప్రకారము సీతను దొంగిలించి భుజింపనెంచినట్లు తోచుచున్నది. సీత మారీచునికేకను విన్నంతనే ఆకేక నాదని తలచి, లక్ష్మణుని నాకు సహాయార్ధము వెళ్ళుమని తప్పక నియోగించును. నక్కలకూతలును, పక్షులప్రవర్తనయు విపత్తును సూచించుచున్నవి". తనలోతాను ఇట్లనుకొనుచు రాముడు తొందరగ ఆశ్రమమునకు వచ్చుచుండెను. మార్గమధ్యమున తనకడకు పరుగున వచ్చుచున్న లక్ష్మణుని చూచెను. "అయ్యో! నేనెట్లు భయపడితినో అట్లే జరిగినది" అని రాముడు బాధపడెను. అతడు లక్ష్మణుని చేతులు పట్టుకొని "లక్ష్మణా! సీతను అడవియందు ఒంటరిగవిడిచి నీవెందుకు వచ్చితివి. రాక్షసులు ఆమెను చంపి తినివేసియుందురు. ఆమెను విడిచి ఇట్లు వచ్చుట నీకు సరికాదు" అని దుఃఖముతో అరచెను. అలసట , దప్పికలతోనున్న రాముడు కోపము, ఆందోళణ తోడుకాగా "మనము ఆశ్రమమును చేరునప్పటికి సీత కనుపించనిచో నేను తప్పక మరణింతును. లక్ష్మణా! నీవు అయోధ్యకువెళ్ళి జరిగినదంతయు వారికి చెప్పుము. అయ్యో! కౌసల్య ఈదుఃఖమునెట్లు సహించగలదు. ఈపాటికి రాక్షసులు ఒంటరిగనున్న సీతను చంపి భక్షించియుందురు. ఆమెను ఒంటరిగవిడిచి నీవెట్లు రాగలిగితివి? మారీచుని మాయకేకతో నీవెట్లు

మోసపోయితివి? ఇపుడు నేనేమిచేయుదును? రాక్షసుల పథకము నెరవేరినది. నీపైనాకుగలనమ్మకము పోయినది. ఇక సీతను నేనెన్నటికిని చూడలేను. ఆమెను నీవెట్లు విడువగలిగితివి లక్ష్మణా?" అని రాముడు దుఃఖించెను. లక్ష్మణుడు కన్నులనిండా నీరుతోనిట్లు జవాబిచ్చెను.

"అగ్రజా! నేనేమి చేయగలను? "హా....సీతా! అయ్యో .....లక్ష్మణా!" అన్న కేక వినగానే సీత భయపడింది. ఆలస్యములేకుండ వెంటనేనీకు సహాయపడుటకు వెళ్ళుమని నన్ను తొందరపెట్టెను. ఆకేక నీది కాదనియు, ప్రపంచమందెవ్వరును నీకు హాని కల్గింపలేరనియు నేనెంతచెప్పినను ఆమె వినలేదు. నేను నీమరణకాంక్షిననియు అనంతరము తనయందు నీచపుకోరికతోడ నుంటిననియు నన్ను నిందించెను. ఆమాటలకు నేను సగము చచ్చితిని. నీసహాయార్ధము నేనచటినుండి కదలనిచో తాను మరణింతునని ప్రకటించి తాను పిచ్చిదై, నాకు పిచ్చి ఎక్కించినది. చేయునది ఏమియు లేక నేను నీవున్నకడకు పరుగెత్తి వచ్చితిని". కాని రాముడు తృప్తి చెందలేదు. "భయముతో ఒక అవివేకపు వనిత ఏమి మాటలాడినను నీవు అక్కడే ఉండిఉండ వలసినది. ఆమెను రక్షణ రహితముగ విడిచియుండవలసినదికాదు. ఇంత తెలివితక్కువ పనిని ఎట్లుచేయగలిగితివి? నీవునాకు ఆపద తెచ్చితివి. నేను మరల ఎన్నటికిని సీతను చూడలేను" అని పలికెను. ఇద్దరును ఆశ్రమమునకు త్వరితగతిని వచ్చిరి. మార్గమునందు ఎన్నో అపశకునములు తోచినవి. ఆశ్రమమును చేరి వారుభయపడినట్లే కాళీగా ఉండుట చూచిరి. సీత అచట లేదు. లేడిచర్మమును, కుశలును,

దర్భాసనమును అన్నియు నేలపై విసిరివేయబడియుండెను. రాముడు కుటీరమంతట అటునిటు పరుగులెత్తుచు దుఃఖించెను. అతడు పిచ్చివానివలె తిరిగెను. "అయ్యో! ఆరాక్షసులు ఆమెను ఎత్తుకొనిపోయి ఆమెను భక్షించియుందురా? ఆమె భయముతో ఎంతవణకి పోయినదో. నేను ఆయాలోచననే భరింపలేకయున్నాను. ఒకచో నీరుతెచ్చుటకు నదికి వెళ్ళియుండునా? పూలనుకోయుటకు బయటకు వెళ్ళియుండునా? చూతము రమ్ము" అని ఆమె తనతో దాగుడుమూతలాడుచున్నదేమో అనుకొనుచు చెట్లనన్నింటిని వెదుకనారంభించెను.

అతని దుఃఖము సముద్రము వలెపొంగి చెట్లతో మాటలాడు స్థితికి దిగజార్చెను. "ఓఅశోకవృక్షమా! నావిచారమును పోగొట్టి నీపేరును నిజము చేసికొనుము. ఓఉన్నత తాళవృక్షమా! సీత ఎచటనున్నదో నీవు చూడగలవు. ఎక్కడనున్నదో చెప్పుము. ఓపెద్దపులీ! ఏనుగును, లేడియును నిజమును చెప్పుటకు భయపడుచున్నవి. నీవు భయము లేనిదానివి. నిజమును చెప్పుము". "ఓసీతా! నీవెచ్చటనో దాగియుంటివి. నీతెలివితక్కువ చాలు. ఇకనేను భరింపలేను" అని పరిపరి విధముల అటునిటు తిరిగి ప్రయోజనము లేకపోగా రాముడు "హా...లక్ష్మణా! హా....సీతా!" అని మూలుగుచు నేలపై పడెను. "లక్ష్మణా! సీత ఎక్కడను లేదు. రాక్షసులు సీతను బంధించి ముక్కలు చేసికొని భక్షించిరి. నేనింకను ఎట్లు జీవింపగలను? నామరణము సమీపించినది. పరలోకమున నాతండ్రి నన్నుచూచి "కుమారా! నాఆజ్ఞను నిర్వర్తింపక ఇక్కడకేల వచ్చితివి?" అని ప్రశ్నించును. అన్ని విషయములందును

నేను ఓడితిని". లక్ష్మణుడు ఈదృశ్యమును చూడలేకపోయెను. "సోదరా! నీవిట్లు దుఃఖింపతగదు. అడవియంతట వెదకుదము. సీతకు గుహలలో ప్రవేశించుట, పొదలయందుదూరుట ఎంతోఇష్టము. నదీస్నానమొనర్చుట కాని, పూలుకోయుటకాని చేయుచుండును. మరల వెదకుదము. ఆమె మనలను పరీక్షించుచున్నది. దుఃఖింపకుము. మరల వెదకుదము రమ్ము".

ఇరువురును కొండలమీద, సరోవరములకడ, నదీ తీరమున అంతటా మరల వెదకినను సీతను కనుగొనలేకపోయిరి. "సీత ఎచ్చటను కనబడుటలేదు. లక్ష్మణా! నేనిపుడేమిచేయుదును?" అని రాముడు విలపించెను. లక్ష్మణుడు ఆశాజనకములగు మాటలతో రాముని ధైర్యపరచుటకు ప్రయత్నించెను. కాని రాముడు "లేదు...లేదు... అనుజా! ఇక ఆశలేదు. సీత ఎచటనూ లేదు. నేను ఆమెను కోల్పోయితిని. నేను జీవింపరాదు" అనుచు బాహ్యస్మృతిని కోల్పోయెను. మరలలేచి పెద్దగ విలపించెను. లక్ష్మణుడు ఏమి చెప్పినను అతనిని ఊరడింపలేకపోయెను. "లక్ష్మణా! నేను అయోధ్యకు ఎట్లు తిరిగివెళ్ళగలను? రాక్షసులచే సీత సంహరింపబడి, భక్షింపబడినతరువాత ఒంటరిగా తిరిగివచ్చిననన్ను చూచి వారునవ్వరా? అడవికి ఆమెను తీసికొని వచ్చి రక్షింపలేక పోయిననేను జనకునకేమి చెప్పుదును? లేదు. నీవు ఒంటరిగ అయోధ్యకు వెళ్ళవలెను. వెళ్ళి మనతల్లులను జాగ్రత్తగ చూచుకొనుము. నాతరపున భరతుని కుశలప్రశ్నలడిగి, అతడే రాజ్యపాలన కొనసాగింపవలయునని నా అవసానకాంక్షయని తెలుపుము" అని

పలుకుచున్న రాముని ఊరడించుటకు చేసిన లక్ష్మణుని ప్రయత్నము లన్నియు వ్యర్థములాయెను. "మనసు పాడుచేసికొనకుము. ధైర్యముగ నుండుము. దృఢసంకల్పము విధిని జయించును. ముందు నీమానసిక దౌర్బల్యమును జయించవలెను. మరియొకసారి అడవియంతట పరిశీలింతము. విచారమునకు లొంగుట బదులు ఉత్సాహముగ ఉందము" అని లక్ష్మణుడు చెప్పినను రాముడు వినిపించుకొనలేదు. శ్రీరాముడు విష్ణువుయొక్క అవతార పురుషుడైనను సామాన్యమానవుడు భార్యనుకోల్పోయినపుడు ఎట్లు విలపించునో అట్లే విలపించినట్లు వాల్మీకి వర్ణించెను.

రామలక్ష్మణులిరువురును "సీతా!" అని గట్టిగా పిలుచుచు పర్వతారణ్య నదీతీర ప్రాంతములన్నియు వెదకిరి. కాని నిరుపయోగమయ్యెను. ఎక్కడను సీతజాడ కనుగొనలేకపోయిరి. రాముడు గోదావరి ఎదుట, దేవతల ఎదుట, పంచభూతములఎదుట విలపించెను. రాక్షసరాజగు రావణునకు భయపడి వారు బదులు పలుకక మౌనము వహించిరి. లేళ్ళగుంపు ఒకటి దక్షిణదిశగ నడచుచు రామలక్ష్మణులను అటు పయనింపుడని సూచించినట్లు తోచి వారును దక్షిణదిశకు పయనమయ్యిరి. కొంతసేపటికి మార్గముపై పూలు చిమ్మబడినట్లు కనుగొనిరి. రాముడు ఆపూలను చూచి "ఇవే నేను సీతకిచ్చినపూలు. ఆమెతలనుండి రాలియుండును" అనుచువిలపించెను. పూలు చెదరిపడియున్న ప్రదేశమును పరిశీలింపగా రాక్షసుని పాదముద్రలును, సీతయొక్క చిన్నపాదచిహ్నములను కనుగొనిరి.

సీతయొక్క నగలనుండి చిందిన బంగరుపూసలను కనుగొనిరి. అనంతరము అనేక రధశకలములను, రక్తపు ముద్దలను, రాజరికపు నగలను నేలపై చిందరవందరగ పడియున్నట్లు చూచిరి. ఈవస్తువుల విషయమేమైయుండునని రామలక్ష్మణులు ఆందోళనచెందిరి. వెంటనే ఒక విరిగిన పెద్ద ధనువును, చినిగిన పతాకమును, పగిలిన కవచమును, రధసారధి కళేబరమును చూచిరి.ఒక పెద్దయుద్ధము అచట జరిగినదని స్పష్టమైనది. "సీతను తినుటకు ఇద్దరు రాక్షసులు పెనుగులాడి యుందురని" రాముడు నిట్టూర్చెను. "ధర్మము సీతను రక్షింపలేదు. దైవము ఆమెను రక్షించుటకురాలేదు. ఈక్రూరప్రపంచమును నాశమొనర్చుట తగును" అని రాముడు తలచి క్రూరముగ పలికెను. రాముని శాంతపరచుటకు లక్ష్మణుడు యధాశక్తి ప్రయత్నించెను. "గొప్ప విచారము అందరమనస్సులను కలత పరచును. నీనిగ్రహమును ఏల కోల్పోవుచున్నావు? ఒక వ్యక్తికి జరిగిన దుస్సంఘటనకు ప్రపంచ మంతటిని అసహ్యించుకొని శపింతువేల? ఓనాసోదరా! ఎన్నిమార్లు నీవు నాకోపమును శాంతపరచి, న్యాయపధమున నడిపించలేదు? కాని ఇపుడు ఒక పెద్దదుఃఖము నీమనసును కల్లోలపరచినది. తన అన్నకు ధైర్యము చెప్పి స్వస్థత చేకూర్చువంతు అతని తమ్మునకు వచ్చినది. మనకు శత్రువు ఎవరో తెలుసుకొని అతనితో వ్యవహరింతము" ఇట్టి ప్రేమపూరితమైన మాటలతో రామునకు ధైర్యమును, ఊరటను కలిగించి లక్ష్మణుడు రాముని ముందునకు నడిపించెను.

అనతి దూరములో రక్తసిక్తమై, వికృతరూపుడై, గుర్తింప వీలుకాని స్థితియందు భూమిపై పడియున్న జటాయువును చూచిరి. రాముడు తమను మోసగింపవచ్చిన రాక్షసుడు అతడేయని తలచి "చూడుము. సీతను భక్షించిన రాక్షసుడితడే" అనుచు కోపముతో ధనువు చేతబూని వేగముగ ముందుకు వెళ్ళెను. అపుడు ముడుతలు పడిన, రక్తము గడ్డకట్టిన తన తలను మిక్కిలి బాధతో పైకి ఎత్తి, మృత్యువుతో పోరాడుచు జటాయువు "ప్రియమైన రామా! నన్ను చంపకుము. నేనింక ఎన్నో క్షణములు బ్రతుకను. నీవు వెదకుచున్న నీప్రియభార్యను రావణుడు నాప్రాణములు హరించినతరువాతనే దొంగిలించికొనిపోయినాడు. ఆకాశము నందు ఎగురుచున్న రావణుని రథమునందు సీతను చూచి నేను రథమును ఆపి, అతనితోయుద్ధము చేసితిని. నేను అతని ధనువును విరిచి రథమును నాశము చేసి సారథిని చంపితిని. ఈపరిసర ప్రాంతము లందు నాచివరి యుద్ధచిహ్నములు నీవు చూడగలవు. నీకొఱకు నేను చేయగల్గినది చేసితిని. చివరకు అతడు నారెక్కలు, కాళ్ళు నరకి గాయపడునట్లు చేసి మృత్యుముఖమునకు చేరినేలపై పడినతరువాత, సీతను తీసికొని దక్షిణ దిశగ ఆకాశమార్గమున ఎగిరిపోయెను. మరణ వేదనతో బాధపడుచున్నను నీయందలి ప్రేమతో నాకుతెలిసిన సంగతి నీకు చెప్పుటకు జీవించియున్నాను. ఇది నేను చేసినది. ఇపుడు నన్ను మరణింపనిమ్ము" అని పలికెను. జటాయువు యొక్క కథవినగానే శ్రీరాముని కనులనుండి కన్నీరు ప్రవహించెను. అతడు తన ధనువును ప్రక్కకు విసరివేసి ఆపక్షిరాజును కౌగిలించుకొనెను. ఆ రాకుమారుల

దుఃఖమునకు అంతులేదు. వారు భూమిపై దొర్లుచు గట్టిగ దుఃఖించిరి. "లక్ష్మణా! నేను జీవించియున్న అత్యంత అసంతుష్ట మానవుడను. రాజ్యమును విసర్జించి అడవికి వచ్చితిని. ఇక్కడనేను నాసీతను పోగొట్టుకొంటిని. నానిమిత్తము మనకు మరియొక తండ్రివంటి జటాయువు తన అసువులబాసెను. నేను అగ్నియందుపడినచో నాదురదృష్టము అగ్నిని ఆర్పివేయునని భయము. నేను సముద్రమునందు దూకినచో అది ఇంకిపోవునని భయము. లక్ష్మణా! నేనెంతభయంకరమైనపాపిని. ఎవరికి తెలుసు? ఒకరోజు ఓలక్ష్మణా! నేను నిన్ను కూడా వదులుకుందునేమో!".

జటాయువును కౌగిలించుకొని "ఓనాతండ్రీ! నీవు నిజముగా సీతను చూచితివా?" అని అడిగెను. కాని జటాయువు మాట లేకుండ నేలపై పడియుండెను. కొన్ని నిముషముల తరువాతజటాయువు నీరస కంఠధ్వనితోనిట్లు పలికెను. "రామా! భయపడకు. నీవు తప్పక సీతను చూతువు. ఆమెకు ఏహానియు కలుగదు. నీవుకోల్పోయిన నీసంపద నీకులభ్యమై నీవు మహదానందమును పొందగలవు". ఈ మాటలు పలికి జటాయువు రక్తమును క్రక్కుకొనుచు ప్రాణములను విడిచెను. రామలక్ష్మణులు అరణ్యవాసమునకు వచ్చుటచే వారి స్వంత తండ్రి దశరధుడు మరణించినపుడు తండ్రికి ఉత్తరక్రియలు చేయు అవకాశము కోల్పోయినారు. భరతశతృఘ్నులాపనిని చేసిరి. ఇపుడు వారు జటాయువును తమ స్వంతతండ్రిగ భావించి, అతని ఉత్తరక్రియలు జరుపుటతో దశరధునికి ఉత్తరక్రియలు జరుపుటకు తాముదగ్గర లేకపోయితిమను విషయమునందు సానుభూతిని పొందిరి. "లక్ష్మణా!

ఎండు పుల్లలను ప్రోగుచేయుము. నేను అగ్నిని మథింతును. మనము మనతండ్రికి ఉత్తరక్రియలు చేయలేకపోయితిమి. మనకొఱకు ప్రాణములను విడిచిన తండ్రివంటి జటాయువునకు ఉత్తరక్రియలు జరుపుదము". ఆ రాకుమారులు గతించిన జటాయువు ఆత్మకు తిలోదకములు ఇచ్చునపుడు పవిత్రమైన ప్రార్ధనలు గానము చేసిరి. "ఓపక్షిరాజా! గొప్ప యజ్ఞములు చేసిన ధర్మాత్ముడు పొందునట్టి పరమసుఖమును నీవు అనుభవింతువుగాక! మహాతపస్సు చేసిన వానప్రస్థులు పొందు దివ్య సౌఖ్యమును నీవు అనుభవింతువుగాక! గొప్ప భూదానములు చేసిన పుణ్యాత్ముడు పొందుసౌఖ్యమును నీవనుభవింతువుగాక! యుద్ధ రంగమున పరాక్రమముతో యుద్ధముచేసినయోధులు పొందు సుఖమును నీవనుభవింతువుగాక!". ఆకార్యక్రమము పూర్తి అయినతరువాత శ్రీరాముడు నిశ్చలమును, బలవత్తరమును అయిన మనసుగల వాడయ్యెను.

అరణ్యమందు నడుచుచుండగా శిరఃపాదరహితుడైన, అసహ్యాకరమైన పెద్ద శరీరముకల ఒక రాక్షసునిచే హఠాత్తుగ శ్రీరామలక్ష్మణులు బంధింపబడిరి. అతనినోరు తన పెద్ద ఉదరమందే కలదు. అతడున్న ప్రదేశమునుండి కదలకుండగనే, పులులు, ఎలుగుబంట్లు మొదలగు తనకందుబాటులోనుండు జంతువులను పట్టి మ్రింగుటకుపయుక్తమగు మిక్కిలి పెద్ద చేతులు రెండు కలవు. అతనికి వక్షస్థలమునందు ఒకేఒక నేత్రముకలదు. ఈరాక్షసునిచే పట్టుకొనబడి రాజకుమారులు ఏమిచేయుటకు తోచక దిగ్భ్రమచెందిరి. అపుడు

రాముడు లక్ష్మణునితో "కంగారుపడవద్దు. నీవు ఒకబాహువును ఖండింపుము. నేను మరియొకదానిని ఖండింతును" అని పలికెను. వారు అట్లే చేసిరి. ఆరాక్షసుని పేరు కబంధుడు. అతని హస్తములును బాహువులును ఖండింపబడగా నిస్సహాయుడై అతడిట్లు చెప్ప నారంభించెను. "నాచెడుప్రవర్తనకారణముగా నేనీ రూపమును, నామమును ధరించునట్లు ఇంద్రునిచే శపింపబడితిని. మీరు రామలక్ష్మణులని నమ్ముచున్నాను. ఎపుడు మీరిరువురు వచ్చి నాబాహువులను నరకి, నాశరీరమును అగ్నికి ఆహుతిచేయుదురో, అపుడు నాశాపము తొలగునని ఇంద్రుడు నాకువాగ్దానము చేసెను ". ఆ దురదృష్ట రాక్షసుడు కోరిన విధముగ రాజకుమారులు అతని శరీరమునకు నిప్పుపెట్టిరి. ఆయగ్ని జ్వాలనుండి ఒక అందమైన రూపము పైకిలేచి దివ్యరథమునెక్కి, దివ్యలోకములకు అధిరోహించెను. అతడు దివ్యలోకములకు పోవుటకుముందు "రామా! నీవు సీతను తప్పక మరలపొందగలుగుదువు. సుందరమైన పంపానదీతీరములకు వెళ్ళుము. ఋష్యమూక పర్వతముపై నివసించుచున్న సుగ్రీవుని సహాయమును పొందుము. అతడు తన అన్న వాలిచే రాజ్యమునుండి బయటకు తరుమబడి శాశ్వత భయవిపత్తులతో జీవించుచున్నాడు. అతని స్నేహమును సంపాదింపుము. నీప్రయత్నము ఫలించును" అని పలికి కబంధుడు అదృశ్యమయ్యెను.

శ్రీరామలక్ష్మణులు పంపానది దిక్కునకు ముందునకు పయనించిరి. ఆఅందమైన ప్రదేశమందు మతంగ మహర్షియొక్క

శిష్యురాలైన శబరియను ముసలి సన్యాసినియొక్క ఆశ్రమమును చూచిరి. ఆమె ఆతిధ్యమును అంగీకరించిరి. వృద్ధ మతంగమహర్షి ఆశ్రమమున నమ్మకస్థురాలైన సేవకురాలు శబరి. మతంగమహర్షి మరణించినపుడు ఆమెకూడా మరణింపకోరెను. కాని మతంగమహర్షి ఇంకను సమయము కాదనియు, విష్ణువుయొక్క అవతారమగు రాముని రాకకు నిరీక్షింప వలయుననియు ఆయనదర్శనభాగ్యము ఆమెకు కలదనియుతెలిపెను. కావున ఆముసలి వనిత, సన్యాసిని జీవితమును గడుపుచు. ఆశ్రమ మును నమ్మకముగా పరిరక్షించుచు వాగ్దానము పొందిన అతిధికొఱకు నిరీక్షించుచుండెను. రాజకుమారులు రాగానే తాను ప్రోగుచేసి దాచి యుంచిన పండ్లను వారికి సమర్పించినది. మతంగాశ్రమముయొక్క వింతలను వర్ణించి చూపినది. అనంతరము వారి అనుమతితో అగ్నిహోత్ర మును రగిలించి అందు ప్రవేశించి స్వర్గమునధిరోహించెను. సన్యాసినీ సమావేశమును, పంపానదీజలములును ఆరాకుమారులకు మానసిక బలమునిచ్చినవి. తరువాత ఏమిచేయవలెనో ఆలోచించిరి.

"లక్ష్మణా! మనము జయింపవలసినదని నేను ఆలోచింపనారంభించితిని. మనము సహాయము పొందవలసిన సుగ్రీవుని కొఱకు అడవియందు అన్వేషింతము" అని రాముడనెను. వారు పంపానదీ తీర ప్రాంతమంతయు సంచరించిరి. ఆప్రదేశము సుందరముగానున్నది. కాని ఆప్రదేశసౌందర్యము, జంతువులును, పక్షులును, వృక్షములును, లతలును రాముని విచారమును వృద్ధిపొందించినవి. ప్రతి అందమైన వస్తువు రాముని హృదయమును పీడించెను. "సీత ఈసౌందర్యమును

చూచి ఎంతసంతోషించెడిది?" అని ఆలోచింపజేసెను. ఎంతప్రయత్నించి నను అతడు తనమానవసహజమగు విచారమును అదుపు చేసుకొన లేకపోయెను. లక్ష్మణుడు రాముని ధైర్యోత్సాహములను పునరుద్ధ రించుటకు ప్రయత్నించెను. "సీత దేవమాత అదితి గర్భమునందు దాచబడినను మనమామెను కనుగొనగలము. రావణుడు తప్పించుకొన లేడు. రావణుని చంపుట, సీతను విడిపించు కొనుట తప్పదు. ఆవిధముగ నిరాశపడుట నీకుతగదు. ఆందోళనను, బలహీనతను నీదరికి ఎందుకు చేరనిచ్చుచుంటివి? ఒక విలువైన వస్తువును కోల్పోయినపుడు దానిని తిరిగిపొందుటకు ప్రయత్నించవలెను. కొన్నిమార్లు మన అనురాగమే మనకు శత్రువగును. అత్యనురాగము దుఃఖహేతువగును. దుఃఖము మానవప్రయత్నమును బలహీనపరచును. ఇవన్నియు నీకు చెప్పనవసరము నాకేమికలదు? అన్నియు నీవెరుగుదువు. ఆశను విడువవలదు. దుఃఖమును మరువవలెను. ధైర్యముగా ఆశకలిగి యుండుము. మనము సాధింతుము. అగ్రజా! విచారమును విడిచి పెట్టుము" ఆవిధముగ అనుజుడు అగ్రజుడగు రామునకు సలహానిచ్చెను.

వ్యాఖ్యాతలు లక్ష్మణుని విష్ణువుయొక్క పానుపు అగు ఆదిశేషునిగా గుర్తింతురు. కావున లక్ష్మణుడు రామునకు నూతన శక్త్యుత్సాహములను ఇచ్చుటకు సతతము ప్రయత్నించెను.

శ్రీమద్రామాయణము

కిష్కింధ కాండ

రామలక్ష్మణులు అడవులయందు సంచరించుట చూచి తన ఆశ్రితులతోకూడిన వానరయోధుడు సుగ్రీవుడు భయముతో, సందేహముతో బాధపడెను. వాలిచే రాజ్యమునుండి వెడలగొట్టబడిన సుగ్రీవుడు, ఒక మునీశ్వరుని శాపకారణముగ, వాలికి చేరశక్యముకాని ఒక పర్వతప్రాంతమును తానుండుటకు ఎన్నుకొనెను. ఇపుడు వాలి మారువేషముతో తనను సంహరించుటకు ఇక్కడకూడా అనుసరించు చున్నాడని అతడు భయపడెను. కాకపోయినచో వాలిపక్షము నవలంబించిన క్షత్రియయోధులు తనను సంహరించుటకు వచ్చి యుందురని భయపడెను. ఇతరవానరవీరులు భయముతో అటునిటు పరుగులెత్తిరి. హనుమంతుడు సుగ్రీవుని ముఖ్యమంత్రి. "ఇతడు వాలికాదనియు, అతని స్నేహితులుకూడా కాదనియు నాకుతోచు చున్నది. భయపడవలసిన అవసరములేదు. నేను వెళ్ళి వారితో మాటలాడి నిజమును కనుగొందును" అని పలికి అతడు సుగ్రీవునకు అభయమిచ్చెను. సుగ్రీవుడు సంతోషించి ఇట్లనెను. "అట్లే కానిమ్ము. కాని జాగ్రత్తగా వెళ్ళి నిజమును తెలుసుకొని మరలిరమ్ము. నీనైపుణ్యమంతయు ఉపయోగింపుము. నేను సందేహముతో నిండియున్నాను. వారు దేనికొఱకో వెదకుచున్నట్లు తోచుచున్నది. వారు అన్వేషించునది నన్నుకాదుకదా!".

శ్రీమద్రామాయణము

బ్రాహ్మణ వేషమును ధరించి హనుమంతుడు శ్రీరామ లక్ష్మణులను సమీపించెను. అతడు వెళ్ళి వారియెదుట నిలబడగానే అతని హృదయమున విశ్వాసభావము అంకురించినది. వారితో నిష్కపటముగ మాటలాడనారంభించెను. తననుతాను బయలు పరచకుండా హనుమంతుడు నిజమును తెలిసికొనుటకు ముందునకు వెళ్ళెను. కాని అతడు మాటలాడుచుండగా, అతడు ముందుజాగ్రత్తను విడిచి, తనగురించి, వానరప్రభువును గురించి వివరముగ వారికి తెలిపెను. రామలక్ష్మణులను చూడగానే, భక్తుడు భగవంతుని సమక్షమునందువలె ప్రక్కకు ఒదిగి నిలిచి, వారిని ప్రస్తుతించెను. తానొక వానరుడననియు, తన ప్రభువుకోరిక మేరకు మారువేషముతో అక్కడకు వచ్చితిననియు తెలిపెను. రాజర్షులారా! మీరాక నాహృదయమునానందభరితము చేసినది. మీరు దేవతామూర్తులవలె మీచుట్టును తేజస్సు ఆవరించియున్నది. మీరు ఈఅరణ్యమునందు తపస్సు చేయుటకొఱకు వచ్చినారని తలతును. కాని ఈదుర్గమమైన ప్రదేశమునకు మీరేలవచ్చినారు? మీరెవరో దయయుంచి తెలుపుడు. మీరాకతో ఈనది, ఈఅడవి ఇంకనూ సుందరముగ చేయబడినవి. మీముఖములును, మీరూపములును తేజస్సంపన్నమై సుందరముగనున్నవి. ఈ అడవిజీవులన్నియు మిమ్ము భయభక్తులతో చూచుచున్నవి. మీబలధైర్యములు ప్రత్యక్షముగనున్నవి. మీరెవరు? ఏదేశమునుండి వచ్చితిరి? మీరు జన్మతః రాజ్యపరిపాలనార్హత గలవారని స్పష్టముగ తెలియుచున్నది. అయినను మీరు తాపసదుస్తులు ధరించియున్నారు. జటావల్కలములను ధరించియు ధనుర్బాణములను

మోయుచున్నారు. మీరు మౌనముగానున్నారేల? ఇక్కడ వానరరాజు సుగ్రీవుడు, అతని సోదరుడు వాలిచే రాజ్యమునుండి తరుమబడి, ఇక్కడ దాగియున్నాడు. అతడు విచారముతోనున్నాడు. నేను అతని మంత్రిని. నాపేరు హనుమంతుడు. నేను వాయుదేవుని కుమారుడను. మారాజాజ్ఞ ననుసరించి ఈబ్రహ్మచారి రూపముతో మీసమక్షమునందుంటిని" అని హనుమంతుడు పలికెను.

హనుమంతుని మర్యాదపూర్వకమైన మాటలను విని శ్రీరాముడు లక్ష్మణునితోనిట్లనెను. "అనుజా లక్ష్మణా! హనుమంతుని మాటలు నాకు నమ్మకము కలిగించినవి. నేను అతనిని పూర్తిగా నమ్ముదును. నీవు అతని భాషాసౌందర్యమును గుర్తించితివా? అతని ఉచ్ఛారణ ఎంతస్ఫుటముగ, లయబద్ధముగనున్నదో చూచితివా? వేద వ్యాకరణములయందు నిష్ణాతునివలె మాటలాడుచున్నాడు. అతడు ఆదర్శమైనదూత. అట్టిరాయబారిని కలిగియుండుట ఆరాజు అదృష్టము. మనమెవరిని అన్వేషించుచున్నామో అతడే మనలను వెదకుచున్నాడు. సుగ్రీవుని చూచుటకు మనమిక్కడకు వచ్చితిమి. అతడు తనరాయబారిని మనకడకు పంపెను. అతనికి స్వాగతము తెలుపుదము". అపుడు వారు పరస్పరము స్వేచ్ఛగా మాటాడుకొననారంభించిరి. రామలక్ష్మణులు ఒకవైపు, హనుమంతుడొకవైపు తమచరిత్రలును, సుఖదుఃఖములును, తమఆశలను, భయములను గురించి వివరించుకొనిరి. ఈసంభాషణ ఫలితముగ లక్ష్మణుడు హనుమంతునిపట్ల గొప్ప అనురాగమును పొందెను. అతడు హనుమంతునకిట్లు చెప్పెను. "నాసోదరుడు గొప్ప

సంపదతో జన్మించి, ఒకచక్రవర్తికి పెద్దకుమారుడై తన రాజ్యమును విడిచి అరణ్యమునకు వచ్చెను. ఇక్కడ అతని ప్రాణసమానమైన భార్యను, రావణుడు మోసపూరితమైన ఉపాయముతో, ఆమెయున్న ఆశ్రమము నకు మమ్ము దూరముచేసి, అపహరించెను. శాపవశమున రాక్షస రూపమునొందిన ఒకవ్యక్తి "మీరువానరరాజైన సుగ్రీవుని సహాయమును సంపాదించినచో, రాక్షసునిచే దొంగిలింపబడిన మీరాకుమారిని మరల పొందగలరని" తెలుపగా మేము సుగ్రీవుని సహాయమునన్వేషించుచు సీతను రక్షించుటకు, రావణుని నుండి విడిపించుటకు ఇక్కడకు వచ్చితిమి. అందుచే ఇక్కడనున్నాము. మీరాజుయొక్క సహాయమును కోరుచున్నాము". అంతహనుమంతు డిట్లనెను . "సుగ్రీవుడుకూడ వాలిచే హింసింపబడి రాజ్యకళత్రవిహీనునిగ చేయబడెను. అతడు మరల ఆరెంటిని తప్పకపొందగలడని అనిపించుచున్నది. మారాజు మీస్నేహమువలన ఎక్కువ లబ్ధినందగలడు. అతని సహాయముతో మీరు మీప్రయత్నము లందు విజయమును సాధింపగలరు".

అనంతరమాముగ్గురును సుగ్రీవునికడకేగిరి. మార్గము వానరులకు మాత్రమే సుగమమైయుండెను. హనుమంతుడు తన సహజవానరరూపమును పొంది రామలక్ష్మణులను తనవీపుపై మోసికొని పోయెను. మలయ పర్వతముమీద ఎక్కి హనుమంతుడు ముందుగా సుగ్రీవునికడకువెళ్ళి రామలక్ష్మణుల దర్శనమును గురించి ప్రకటించెను. "రాముడు తెలివి, సుగుణము గలరాజకుమారుడు. అతడు ప్రసిద్ధిచెందిన దశరథ చక్రవర్తి పెద్దకుమారుడు. తనతండ్రి వాగ్దానమును చెల్లించుటకు

అతడు అయోధ్యను విడిచి, భార్యాసోదరులతో అడవికి వచ్చెను. దశరథుడు తనచిన్న భార్యచే, తనకెప్పుడో వాగ్దానము చేయబడిన కోరికలను తీర్చునిమిత్తము, రాముని రాజ్య బహిష్కృతుని చేయుమని నిర్బంధింపబడెను. అడవియందు రాకుమారుల పరోక్షమున రావణుడు రాముని భార్యను ఎత్తుకొని పోయెను. ఆమెను వెదకుటయందు నీసహాయమును కోరి రాముడిటకు వచ్చెను. ఆరాకుమారులు నీ స్నేహమునకు యోగ్యులు. వారిస్నేహముతో నీవుకూడ లాభము నందవచ్చును". సుగ్రీవుడు సుందర మానవరూపము ధరించి, ఆరాకుమారులతో తన హృదయమును విప్పి మాటలాడెను. రామునకు తనచేతిని అందించుచు "ఓరాజకుమారులారా! మీరు ఒకవానరునితో స్నేహము చేయదలచినచో ఇదిగో నా చేయినందుకొని అంగీకరింపుడు. హనుమంతుడు మీసుగుణములు, గొప్పతనములనుగురించి నాకు తెలిపినాడు" అని పలికెను. రాముడు సుగ్రీవుని చేతిని పట్టుకొని అతనిని కౌగిలించుకొనెను. వెంటనే హనుమంతుడు కొన్ని ఎండుపుల్లలను ఒకచోటచేర్చి నిప్పును రగిలించెను. అగ్ని జ్వాలలకు ప్రదక్షిణము చేయుచు రామసుగ్రీవులు తమ అన్యోన్య స్నేహమును గురించి ప్రమాణము చేసిరి. "మనము మన సంతోషదుఃఖములను సమముగ పంచుకొందము. మనస్నేహము శాశ్వతమగుగాక!". వారొక చెట్టు కొమ్మను నరకి దానిపైకూర్చుండి రామసుగ్రీవులు ఉత్సాహపూరిత సంభాషణయందు నిమగ్నమయ్యిరి. అదేవిధముగ హనుమంతుడును, లక్ష్మణుడును సంభాషించుకొనిరి. సుగ్రీవుడు, తాను తన అన్న వాలియు

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

శ్రీమద్రామాయణము

ఒకప్పుడు ఒకరికొకరు బద్ధానురాగులై ఎట్లుండెడివారో, ద్వేషముగల విధి సుగ్రీవుని అపరాధములేనిదే ఎట్లువారిరువురను బద్ధ శత్రువుల నొనర్చినదో వివరించుచు, సుగ్రీవుడు తన జీవిత చరిత్రను వర్ణించెను.

ఒకానొకప్పుడు మాయావియను రాక్షసుడు తమ రాజధాని కిష్కింధనగర ద్వారముకడకు అర్ధరాత్రి సమయమున వచ్చెను. పురాతన వంశ కలహముననుసరించి దంభములు పలుకుచు తనతో ద్వంద్వయుద్ధమునకు రమ్మని వాలిని కయ్యమునకు కాలుదువ్వెను. ఎప్పుడును యుద్ధమును తిరస్కరింపనివాలి, సుగ్రీవునిచే అనుసరింప బడి, యుద్ధమునకు ముందునకు వెళ్ళెను. వారిరువురను చూచి రాక్షసుడు పరుగెత్తెను. అతనిని వెంబడించి వెళ్ళినవారు, పెద్దపొదలచే కప్పబడిన ముఖద్వారముగల గుహయందు ప్రవేశించి, మాయావి అదృశ్యమయినట్లు కనుగొనిరి. వాలి తాను తిరిగి వచ్చువరకు గుహాముఖ ద్వారముకడ నిరీక్షించునట్లు సుగ్రీవుని నుండి బలాత్కారముగ ప్రతిజ్ఞను తీసికొని శత్రువు వెనుక గుహయందలి చీకటిలో దుమికెను. సుగ్రీవుడు చాలకాలము నిరీక్షించెను. కాని వాలి బయటకు రాలేదు. పెద్దపెద్ద అరపులును, నురుగులతోనిండిన రక్తప్రవాహములను విని, చూచి, వాలి ఈయుద్ధమున సంహరింపబడియుండునని సుగ్రీవుడు ఒకనిశ్చయము నకు వచ్చెను. జయించిన రాక్షసుడు ఆపర్వత గుహనుండి బయటకు వచ్చి కిష్కింధను నాశము చేయకుండుటకై పెద్దరాతితో ఆగుహా ముఖద్వారమును మూసి, సుగ్రీవుడు కిష్కింధకు తిరిగివచ్చెను. వాలిమరణవార్తను తెలిపెను. అరాచకమైన పరిస్థితియందు మంత్రులును

పెద్దలును కాళీగానున్న సింహాసనమును అధిష్ఠింపుమని సుగ్రీవుని కోరిరి. సుగ్రీవుడు రాజ్యాధికార మధురిమలను అనుభవించుచుండగా, పెద్దగా గాయపడిన వాలి తిరిగివచ్చెను. సుగ్రీవుని నిందించుచు ఆద్రోహి తన సోదరుడగుటచే కిష్కింధనుండి ప్రాణములతో బయటకు పారద్రోలెను. క్రూరమైన విధిచే ఆవిధముగ సుగ్రీవుడు ఇంటినుండి, సింహాసనము నుండి, భార్యనుండి దూరముగా తరుమబడెను. అరణ్యమున తన విశ్వాసపాత్రులైన కొలదిమందిస్నేహితులతో ఆశ్రయము వెదకుకొన వలసివచ్చెను. ఒకఋషీశ్వరుని శాపకారణముగ వాలికి ప్రవేశము నిషేధింపబడిన ఈప్రదేశమునందు సుగ్రీవుడు క్షేమముగ నివసింప గల్గుచున్నాడు.

వాలి సుగ్రీవుల చరిత్రయందు కోపము సత్యమును గుర్తింపనీయదు, కావున క్రోధము నాశమునకు దారితీయును. ఇతరులకు చెందవలసినదానిని ఎవ్వరును కోరరాదు. అను నీతులు ప్రస్ఫుటమగు చున్నవి. సుగ్రీవుడు తన కథను రామునకు వినిపించి కనికరమగు విన్నపమును చేసికొనెను. "వాలివలన భయముతో నేను అరణ్యము లందు తిరుగుచున్నాను. ఇక్కడ దాగుకొని నివసించుచున్నాను. నీవువాలిని చంపుదువా? చంపగలవా? నారాజ్యమును, నాభార్యను నాకు అప్పగించగలవా?".

"తప్పక చేయుదును. నాధనస్సునుండి వాలి తప్పించుకొనలేడు. ధైర్యముగనుండుము" అని రాముడు సమాధాన మిచ్చెను. రామసుగ్రీవులిట్లు మాటాడుకొనుచుండగా సుదూరమున

అశోకవనముననున్న సీతకు ఆడవారికి శుభశకున సూచకమగు ఎడమకన్ను అదిరెను. అదేసమయమున రావణునకు అశుభ సూచకముగ ఎడమకన్నుకూడా అదిరెను. అనంతరము పంచవటియందు రఘురాజకుమారులు అనుభవించిన విపత్కర వృత్తాంతమును సుగ్రీవుడు విని, సీతయొక్కఎడబాటుతో రాముని హృదయవిదారకమగు బాధను, ఆందోళనను అర్ధముచేసికొనెను. రాముని ఓదార్చుటకు సుగ్రీవుడు ప్రయత్నించెను. "లక్ష్మణుని ద్వారా నేనంతయు వినియున్నాను. సందేహములును, భయములును విడిచిపెట్టుము. ఎక్కడదాచబడి యున్నను మనము సీతను తప్పక కనుగొందుము. అదియు వెంటనే". నేనును నా అనుచరులును "ఓరామా! ఓలక్ష్మణా! " అని దుఃఖముతో అరచుచున్న ఒక స్త్రీని ఒక రాక్షసుడు ఆకాశమార్గమున మోసికొని వేగముగా పోవుట చూచితిమి. ఆమెకూడా మమ్ము గుర్తించినది. తన నడికట్టు వస్త్రమునందు తననగలను మూటకట్టి ఆచిన్నమూటను క్రిందపడవైచెను. మేము ఆమూటను తీసి భద్రపరచితిమి. చూడుము. ఈనగలు సీతవేనేమో". ఈ మాటలు వినగానే ఉద్రేకముతో "ఆమూటను ఇటుతెండు. ఇటుతెండు" అని రాముడు అరచెను. వారు గుహనుండి ఆనగలమూటను తెచ్చిరి. ఆనడికట్టువస్త్రమునుచూడగానే రాముడు విచారమగ్నుడయ్యెను. ఆచిన్నమూట రాక్షసునిచేతులయందు సీత పడుచున్న బాధలను రాముని కనులముందుకు తెచ్చెను. రాముడు కనులుమూసుకొని, తాను స్వయముగ ఆనగలను చూచుట భరింపలేక, ఆమూటనువిప్పి నగలను పరిశీలింపుమని లక్ష్మణుని కోరెను. లక్ష్మణుడు

అట్లేచేసెను. "ఇవి నిజముగ సీతయొక్క కాలియందెలే. ఇందు సందేహములేదు. ఇవి ఆమెవే. తరచు ఆమెపాదములపై నేను నాశిరస్సునుమోపి నమస్కరించునపుడు చూచితిని. వీనిని నేనెరుగుదును. మిగిలిన ఆభరణములను నేను పరిశీలించి ఎప్పుడును చూడని కారణముగ నాకు తెలియవు"అని పలికెను. రాముడు ఆనగలనన్నింటిని తనచేతులలోనికి తీసికొని ఒకదానితరువాత మరియొకటి తనకన్నులకద్దుకొనెను. "ఇవి మెత్తని గడ్డిపైపడియుండును. అందుచే చెడకుండా ఉన్నవి. శోకమును, క్రోధమును మించగా ఆరాక్షసుని ఆహ్వానించుటకు యమలోకపు ద్వారములు తెరువబడియున్నవి. అతడు తనప్రజలందరతోడను వెంటనే నాశమునొందగలడు" అని రాముడు పలికెను. రాముని దుఃఖమును చూచి సుగ్రీవుడు ఆందోళణచెందెను. తమ పరస్పర స్నేహమును, సహాయములును పవిత్రాగ్నిముందు ప్రతిజ్ఞ చేయబడినను ఎవరిపనికి ముందు ప్రాధాన్యతనీయవలెనని ఆలోచించెను.

సుగ్రీవుడు కిష్కింధకు ప్రభువుగానుండి రామునకు ఎక్కువసేవచేయుటకు వీలుపడుననితలచుట, అది స్వార్ధమును, పలాయన ఉపాయమును కానేరదు. కావున వాలిని సంహరించి, సుగ్రీవుడు సింహాసనాధిష్ఠితుడగుట ప్రధమాచరణీయముగ తోచుచున్నది. ఈపద్ధతి మాత్రమే తనకును రామునకును విజయమును చేకూర్చును. కాని రామునియొక్క మానసికస్థితిని గుర్తించి సర్వతోముఖముగ నడచుకొనుటకు సుగ్రీవుడు నిశ్చయించుకొనెను. "నేనాదుర్మార్గుడైన రాక్షసుని బలమునుగాని అతని నివాసస్థలమునుగాని ఎరుగను. అతడు

సీతను ఎక్కడకు తీసికొని వెళ్ళెనో, ఎక్కడ దాచెనో మనకు తెలియదు. అయినను సీత ఎక్కడనున్నను, నేను సీతను, ఆమెను బంధించినవానిని కనుగొని, వానిని నిర్మూలము చేయుటకును, సీతను మరలస్వాధీన పరచుకొనుటకును మార్గములను కనుగొందును అని నీకు వాగ్దానము చేయుచున్నాను. ఆదుర్మార్గ రాక్షసుని నీవు చంపుదువు. తేజస్సును సాధింతువు. నిరుత్సాహపడకుము. దుఃఖమునకు లొంగకుము. నన్ను చూడుము. నీవలెనే నేనును భార్యను పోగొట్టుకొంటిని. నారాజ్యమునుండి వెడలగొట్టబడితిని. అయినను నేను నావిచారమునదుపులోనుంచుకొని ధైర్యముతోనున్నాను. ఒకవానరుడనైననేనే ఈపనిచేయగలిగినపుడు మానవుడవైననీకు సులభతరము. శోకము అతిశయించినచో అతడు నిస్సహాయుడై ఏమియు చేయలేడు. అందుచేత ఓహితుడా! నీదుఃఖమునదుపులోనుంచుకొనుము అని నిన్ను ప్రార్థించుచున్నాను" అని సుగ్రీవుడు రామునకు చెప్పెను. సుగ్రీవుని ఈవచనములు రాముని హృదయమున సదభిప్రాయము కలిగించెను. అతడు కన్నీరు తుడుచుకొని సుగ్రీవుని కౌగిలించుకొనెను. సీతయొక్క ఆభరణములను చూచినపుడు కలిగిన బలహీనతను విడిచిపెట్టి మనస్థైర్యమును, ఆత్మసంయమనమును పొందెను.

"సుగ్రీవా! నీస్నేహము నాకు ప్రియమైనది. నేను నీసలహాను పాటింతును. మనము సీతాన్వేషణ ఎప్పుడు ప్రారంభింప వలసినదియు ఆలోచింపుము. నీవివాదమును నాదిగా తలతును. కిష్కింధ సింహాసనముపై నిన్ను కూర్చుండజేతును. ఈమాటలు

చెప్పిననేను నాజీవితమునందు వ్యర్థమైన, అసత్యమైన పలుకులను పలికియుండలేదు. ముందు పలుకబోను. నీకు ప్రశాంతినెట్లు కలుగ జేయగలనో నిష్కపటముగ నాకు చెప్పుము. నీవు చెప్పినట్లే చేయుదును" అని రాముడు చెప్పెను. రాముని మాటలను విన్న సుగ్రీవుడును అతని మంత్రులును మిక్కిలి సంతోషించిరి. వెంటనే వారిబాధలు అంతమొందునని తృప్తిచెందిరి. సుగ్రీవుడు మరియొకమారు వానరప్రభువగునని ఆనందించిరి. సుగ్రీవుడు తనరాజ్యమును కుటుంబ మును తిరిగి పొందగలనని విశ్వాసముతోనున్నను, ఈసంఘటన ఎట్లుజరగబోవునదియు ఊహింపలేకున్నాడు. అతనికి అతనికోరిక నిర్వర్తింపబడుటకు నడుమ వాలియొక్క బలము అసాధ్యమగు ఆటంకముగ తోచెను. అతని మంత్రి హనుమంతుడు రాముని సహాయముతో నీవు జయింతువని నచ్చచెప్పుటకు ప్రయత్నించెను. కాని సుగ్రీవుని సందేహములు విడువకుండెను. "రాముని బలము వాలి బలమును అతిక్రమించునా? అదినిరాశాజనకముగ అసాధ్యమని తోచెను. వాలియొక్క శరీరము ఉక్కు వంటిది. అతనిని రాముడు ఎట్లుచంపబోవు చున్నాడు?" రాముని గురించి సుగ్రీవునకు పైసందేహములు కలవు. కాని అతనికి సహాయమొనర్పనింకెవ్వరును లేరు. తనకోరికను విడిచిపెట్టుటకు అతడు సిద్ధముగ లేడు. రాముని బలమును పరీక్షింపనిర్ణయించెను. ఒక స్నేహితుని బలమును అమర్యాదపూర్వకముగ అనుమానించి పరీక్షించుట ఎట్లు? రాముడు ఈపని చేసిపెట్టుదునని వాగ్దానము చేసెను.

అతని అర్హతను పరిగణించుటకు అవకాశమెట్లు కల్పింపబడును? సుగ్రీవుడు చాలసేపు ఆలోచించి ఒక పధకమును సిద్ధపరచెను.

అతడు రామునితో మృదువుగనిట్లు పలికెను.

"ఓప్రభూరామా! నీపలుకులు నాహృదయమందలి దుఃఖమును పార ద్రోలినవి. నీశక్తినేనెరుగుదును. నీధనువునుండి విడువబడిన ఒక్క బాణము ముల్లోకములను నాశము చేయగలదు. దానిముందు వాలియొక్క శరీరమెట్లు నిలుచును? వాలియొక్క బలము గురించి అంతయు నీకు చెప్పవలసిన బాధ్యత నాకు కలదు. అతడు ఉదయ సంధ్యావందనము కొఱకు ఆపోశన పట్టుటకు నాలుగు సముద్రములకు వెళ్ళగలడు. పెద్దబరుపైన రాతిని తీసికొని బంతివలె ఆటాడగలడు. గొప్ప అరణ్య వృక్షములను గడ్డిపరకలవలె పెరికి వేయగలడు. ఒకమారు దుందుభి అను రాక్షసుడు వేయిఏనుగుల బలముగల దున్నపోతు రూపమును ధరించి, సముద్రమును తనతో యుద్ధమునకు పిలిచెను. సముద్రము "నీవు నీతో సాటియైనవారితో యుద్ధము చేయవలెను. అక్కడ ఉత్తరదిశయందు హిమవంతుడు కలడు. వెళ్ళి అతనిని యుద్ధము నకు పిలువుము. అశక్తుడనగు నన్ను విడువుము" అని పలికి తప్పించు కొనెను. దుందుభి అందుకంగీకరించి ఉత్తరదిశగ వేగముగా వెళ్ళి హిమవంతుని కలిసి తనకొమ్ములతో అతని రాతిబండలను ఎదుర్కొనెను. హిమవంతుడు తనస్వభావమును నియమించుకొని "నీవెందుకు నాపైపడుదువు? నేను యోధుడను కాను. నాతోనివసించుటకు ఇష్టపడు ఋషుల సాహచర్యములో నాజీవితమును గడుపుదును" అని అడిగెను.

"మంచిది. కాని నేను ఎవరితో యుద్ధము చేయదగునో ఒక్కనిని గురించి చెప్పుము. నేను ఈరోజు సమర్థుడైన శత్రువును కోరుచున్నాను" అని దుందుభి పలికెను. నీకు తగిన శత్రువు దక్షిణ దిశయందు కలడు. అతడు వానర ప్రభువు వాలి. అతని బలము అతని తండ్రి ఇంద్రుని బలము వంటిది. నీవతని కడకు వెళ్ళి యుద్ధమునకు పిలువుము" అని హిమవంతుడు చెప్పెను.

దుందుభి తిన్నగా వాలిదగ్గరకు వెళ్ళి కిష్కింధాపట్టణ ద్వారముకడ పెద్ద అరపు అరచెను. అతడు చెట్లను విరిచి, ద్వార గుమ్మమును పడగొట్టి "బయటకురమ్ము. నాతోయుద్ధముచేసి నీబల మును నిరూపించుకొనుము" అని అరచెను. వాలి అపుడు తనరాణితో విశ్రమించుచుండెను. దుందుభి పిలుపును వినగానే స్త్రీలు అనుసరింపగా తన భవనమునుండి బయటకు వచ్చెను. "ఓదుందుభీ! మాపట్టణ ద్వారముకడ నీవెందుకు సందడి రేపుచుంటివి? నీజీవితమున అలసితివా?" అని అడిగెను. వాలియొక్క తిరస్కారపూర్వకమైన సంబోధన దుందుభిని రెచ్చగొట్టెను. "నీబలమును గురించి నిన్ను మెచ్చుకొను స్త్రీలముందు దంభములు పలుకకుము. నేను నీతోయుద్ధము చేయవచ్చితిని. నీలో పౌరుషమున్న బయటకు రమ్ము. చూపుము. నీవు యుద్ధము చేయుటకు, అతిగా త్రాగియున్నానని చెప్పవచ్చును. కాని నీమత్తు తగ్గువరకు నేను వేచియుందును. నీకిష్టమున్నచో ఈరాత్రి నీభోగములతో గడుపుము. నీప్రేమాస్పదులకడ కన్నీటి వీడ్కోలు తీసికొని ఉదయమే నాచే సంహరింపబడుటకు నాకడకు రమ్ము" అని దుందుభి

పలికెను. వాలి దుందుభి మాటలకు నవ్వి ఇట్లనెను. "ఓప్రియమైన వనితలారా! లోనికి వెళ్ళుడు. ఓరాక్షసుడా! నేను త్రాగునంత చెడుప్రవర్తన కలవాడనుకాను. నీవు యుద్ధమును కోరినచో వర్తమానముకంటె తగిన సమయము లేదు. నీకు సమయమున్నదా?" అని పలుకుచు, నవ్వుచు, ఆరాక్షసుని తోకపట్టుకొని గిరగిరా గుండ్రముగ అతనినిత్రిప్పి విసరివేసెను. దుందుభి రక్తము క్రక్కుకొని నేలపై పడెను. కొంతసేపటికి దుందుభి మరల లేచెను. ఘోరయుద్ధము జరిగెను. ఇంద్రకుమారుడు వాలి ఆరాక్షసుని మరణించునట్లు బాదెను. మరణించిన ఆదున్నపోతు శరీరమును ఒకయోజనదూరమునందు భూమిపై పడునట్లు విసరెను. ఆరాక్షసశరీరమునుండి రక్తపుబిందువులు గాలిచే కొనిపోబడి మతంగాశ్రమముమీద పడెను. ఆఋషీశ్వరుడు ఘనుడు. ఈఅశుచికి కారణభూతులెవరో వెంటనేకనుగొనెను. వాలి గర్వముతో రక్తము స్రవించుచున్న శవమును విసరి పవిత్ర ప్రదేశమును అపవిత్రము చేసెనని తెలిసికొనెను. "ఈవాలి ఈఆశ్రమ ప్రాంతములందు ప్రవేశించినచో అతడు తనప్రాణములను పోగొట్టుకొనును" అని ఆమహర్షి శాపమును ప్రకటించెను.

ఓరామా! అందుచేతనే నేను నాస్నేహితులతో ఇచట క్షేమముగా జీవించుచుంటిని. శాపభయముతో వాలి ఈప్రదేశమును సమీపింప ధైర్యముచేయడు. ఈసాల వృక్షములను చూడుము. వాలి వీనిలో ఒక వృక్షమును పెరికి చొక్కాదుమ్ము దులిపినట్లు ఆచెట్టు ఆకులన్నియు రాలిపోవునట్లు దులపగలడు. అతని బలము అంతటిది.

ఇంతటి భయంకర సోదరునితో శతృత్వము కలిగియుండియు నేనెట్లు రక్షణనందగలను?".

లక్ష్మణుడు సుగ్రీవునకు విశ్వాసము కలిగించుటకు రాముని బలప్రదర్శన అవసరమని అర్ధము చేసికొనెను. "రాముడు వాలిని సంహరింపగలడని నీకు నమ్మకము కలిగించుటకు అతడేమి చేయ వలెనని నీవు కోరుచున్నావు?" అని సుగ్రీవుని లక్ష్మణుడు అడిగెను. "నిజమునకు నాకేసందేహమునులేదు. నివురుగప్పిన నిప్పువలె దాగియున్నను రాముని శక్తిని నేనెరుగుదును. నేను అతనిని శరణము పొందినాను. అయినను వాలియొక్క శక్తివంతమైన చర్యలు జ్ఞప్తికి వచ్చినపుడు నేను వణకుదును. అంతే" అని సుగ్రీవుడు చెప్పెను. సుగ్రీవునకు తనయందుగల నమ్మకమును, వాలిపట్ల అతనికి గల భయమును గ్రహించి రాముడు అతని సందేహములను నివృత్తి చేయదలచెను. తనబొటనవ్రేలితో మీటి, అక్కడ పడియున్న దుందుభి కాయమును గాలిలో ఎగురుచు పది యోజనముల దూరమున పడునట్లు చేసెను. కాని సుగ్రీవుడు పూర్తిగా తృప్తిచెందలేదు. "మాసోదరుడు దుందుభి కాయమును ఆకాశమున విసరినప్పుడు అది రక్తమాంసము లతో నిండియుండి, వాతావరణముచే పాడుబడిన ఇప్పటి అస్థిపంజరము కంటె చాల బరువుగనుండెడిది" అనెను. అంతట రాముడు తనధనువును ఎక్కుబెట్టి వింటినారిని తనచెవివరకు లాగి ఒక బాణమును ప్రయోగించెను. ఆబాణము సుగ్రీవుడు చూపిన ఒక సాలవృక్షముతోపాటు మరియొక ఆరు ఇతరవృక్షములనుకూడ నరకెను. అట్లు ఏడు వృక్షములను నరికి

ఆబాణము నేలనుతాకి మరల రాముని అమ్ములపొదియందు వచ్చిచేరెను. సుగ్రీవుడది చూచి సంతోషముతో ప్రక్కకు తప్పుకొనెను. ఇపుడు రామునిబాణము వాలియొక్క పెద్దశరీరమును పడగొట్టగలదని విశ్వసించెను. అతడు రామునిముందు సాష్టాంగపడెను. "నాస్వంత కన్నులతోనేను నీశక్తిని ఇపుడు కనుగొంటిని. ఇంద్రాదిదేవతలందరును వచ్చి నిన్ను యుద్ధమున ఎదిరించినను నీవిజయము తథ్యము. అపుడు వాలిగురించి చెప్పవలసినది ఏమున్నది? నేను నీస్నేహమును సంపాదించితిని. భయశోకములు నాకవసరములేవు. వాలిని సంహరించి నన్ను రక్షింపుము. మనమీరోజే కిష్కింధకు వెళ్ళుదము" అని సుగ్రీవుడు రామునితో అనెను.

శ్రీరామలక్ష్మణులు ఇరువురును అంగీకరించిరి. ఏవిధముగాచేయుట మంచిదని ఆలోచించిరి. సుగ్రీవుడు ముందుగా కిష్కింధకువెళ్ళి వాలిని ద్వంద్వయుద్ధమునకు ఆహ్వానింపవలెనని నిర్ణయించిరి. వాలి యుద్ధమునకు తప్పక బయటకు వచ్చును. ఆసోదరులు యుద్ధము చేయుచుండగా ఒకబాణముతో రాముడు వాలిని సంహరించును. వారు కిష్కింధకు వెళ్ళిరి. సుగ్రీవుడు ముందు వెళ్ళెను. రాముడు సుగ్రీవుని అనుసరించి దట్టమైన అడవియందు ఒకవృక్షము వెనుక దూరముగ నిలబడెను. సుగ్రీవుడు గట్టిగాపిలిచెను. వాలి ఆఅరపును విని ఉదయపు సూర్యునివలె ప్రకాశించుచు కోటనుండి బయలుపెడలి వచ్చెను. సోదరులిరువురును పరస్పరము భయంకరముగ పోరాడిరి. కాని ఒకవృక్షమువెనుక ధనువును ధరించి నిలిచియున్న

రాముడు దిగ్భ్రమచెందెను. వారిరువురును పెనుగులాడుచుండగ, రూపమునందును, ముఖవైఖరియందును, యుద్ధముచేయు పద్ధతి యందును సోదరులిద్దరును ఒకేరీతిగనుండి, వారియందుఎవరు వాలియో, ఎవరు సుగ్రీవుడో గుర్తింపలేక, రాముడు వాలికి బదులు సుగ్రీవుని చంపుటయగునేమో అని భయపడి బాణమును విడువలేకపోయెను. ఇంతలో సుగ్రీవుడు విపరీతముగ యుద్ధముచేసి తనసోదరుని చేతినుండి తప్పించుకొని వ్యర్ధప్రయత్నముతో గాయపడి నిరాశతో, నిరుత్సాహముతో ప్రాణములను రక్షించుకొనుటకు పరుగెత్తి ఋష్యమూక పర్వతారణ్యమును చేరుకొనెను. వాలి తనసోదరుని చంపుటకు ఇష్టపడకపోవుటచే సుగ్రీవుడు ఈవిధముగనైన ప్రాణములతో బయటపడగలిగెను.

రామలక్ష్మణులు దుఃఖమగ్నుడైన సుగ్రీవుని మరల కలిసిరి. అతడు తనకనులు పైకి ఎత్తకుండా నేలవైపుచూచెను. రాముడు తనమాటను తప్పి తనకు సహాయము చేయుటలో ఓడిపోయెనని సుగ్రీవుడు కోపముతోనుండెను. "నీవు వాలినిచంపుటకు ఇష్టపడనిచో ముందుగా నీవునాకామాటను చెప్పియుండవలయును. అపుడు వాలిశక్తి తెలిసిననేను అతనిని యుద్ధమునకు ఆహ్వానింపకయేపోదును. వ్యతిరిక్తముగ నీవు నన్ను నమ్మపలికితివి. నేనుజీవించియున్నాడనని ఆశ్చర్యపడునంత విపరీతముగా హింసింపబడితిని" అని సుగ్రీవుడు రామునితో పలికెను. "సుగ్రీవా! కోపింపకుము. కాని వినుము. నేను నాబాణమును ముందుకు విడువకపోవుటకు ఒక మంచికారణమున్నది. నీవును, వాలియును ఎత్తునందు, నడకయందును, అరపులయందును,

వస్త్రాభరణముల యందును ఒకేరీతిగనున్నారు. యుద్ధము ప్రారంభమైన తరువాత నేను నిన్నును వాలిని వేరువేరుగ గుర్తింపలేకపోయితిని. దిగ్భ్రమచెంది నిస్సహాయముగానిలిచితిని. వాలిబదులు నిన్నునేను చంపియుండినయెడల అదిచాలభయంకరవిషయము. కోపించుకొనకుము. వాలిని మరియొకసారి యుద్ధమునకు పిలువుము. ఈసారి నేను తప్పక అతనిని చంపుదును.

లక్ష్మణా! ఆపూలతీగను ఇటుతెమ్ము. ఆతీగను ఒకదండవలె సుగ్రీవుని మెడకు చుట్టుము. ఇపుడువారు యుద్ధము చేయుచుండగ ఎవరు మనస్స్నేహితుడు, ఎవరు వాలి అనునది తెలుసు కొనగలను. సుగ్రీవా! ఇప్పుడు వాలినేలపైదొర్లుట నీవు చూడగలవు" అని రాముడు సుగ్రీవునకు ధైర్యము చెప్పెను. సుగ్రీవుడు సంతృప్తి చెందెను. అతనిశక్తులు పుంజుకొన్నవి. లక్ష్మణుడు పూలతీగను దండవలె సుగ్రీవుని మెడయందు వేసెను. మరియొకసారి సుగ్రీవుడు మునుపటికంటె ఉత్సాహముతో కిష్కింధకు బయలుదేరెను. రామలక్ష్మణులును మునుపటివలెనె అతనిని అనుసరించిరి. సాయంకాలము అగుచున్నది. మరియొకసారి సుగ్రీవుడు కిష్కింధానగర ద్వారముకడ నిలిచి గట్టిగ ఎలుగెత్తివాలిని యుద్ధమునకు పిలిచెను. అపుడు హాయిగ విశ్రాంతి గొనుచున్న వాలి ఉలికిపడెను. కలవరపెట్టు నిమిత్తముతో పాలిపోయెను. కాని క్రోధావేశముతో భూమి బ్రద్దలగునట్లు దూకెను. అతని ప్రేమాస్పదు రాలైన రాణి తార అతనిని ప్రేమతో తన బాహువులందు గాఢముగ బంధించి అనురాగపూరిత వచనములతో అతనిని నిలుపుటకు

ప్రయత్నించెను. "ఓనాప్రియమైన స్వామీ! ఈరోజునకు తగినంతయుద్ధము నీవు చేసియుంటివి. కనుక ఒకమారు ఉపయోగించిన పూలదండను విడిచిపెట్టినరీతిగ నీకోపమును విడిచిపెట్టుము. రేపు మరియొకయుద్ధము చేతువుగాని. ఈసమయమున బయటకు వెళ్ళవద్దని నాప్రార్థన. ఇపుడు నీసోదరుని కలియుటకు బయటకు వెళ్ళుముందు, నీవు ప్రశాంతముగ ఆలోచింపవలసియున్నదని నాకుతోచుచున్నది. ఈవిషయమునందు నాకు భయమగు చున్నది. నీసోదరుడు ఓడిపోయి, ప్రాణరక్షణకొఱకు పారిపోయినాడు. ఇప్పుడుమరల తిరిగివచ్చి ఈగోల చేయుచున్నాడు. నీచే శిక్షింపబడినవెంటనే తనకు తగినంత రక్షణహామీ లేనిదే మరలనీతో యుద్ధమునకు సిద్ధపడునంత తెలివితక్కువ వాడు నీసోదరుడు కాడని నాకుతోచుచున్నది. ఈసారి అతడు నిన్ను యుద్ధమునకు ప్రేరేపించుచు పిలుచుకంఠధ్వనిలో నమ్మకమున్నట్లు నీకుతోచలేదా? అడవులయందు సంచరించు మనవేగులద్వారా మన అంగదుడు తెలిసికొని చెప్పిన సమాచారమును నీకు తెలుపుదును. అయోధ్యనుండి రామలక్ష్మణులను ఇద్దరు పరాక్రమవంతులైన రాజకుమారులు వచ్చిరనియు, సుగ్రీవుడు వారి సహాయమునుపొందు వాగ్దానమును సంపాదించెననియు తెలిసినది. నాస్వామీ! నీసోదరుడు సుగుణవంతుడును, ధైర్యవంతుడును. నీవతనిని ఎందుకు అసహ్యించుకొందువు? ఈప్రపంచమున అతనికంటె మనకు దగ్గరసంబంధము కలవారెవరు? అతడు నీయందు భక్తిగల సేవకుడు, బలమైన స్నేహితుడునగును. గతమును మరచి ఆవిధముగ సుగ్రీవుని చేరదీయుట తగును. నాస్వామీ! నామాటలు వినుము".

వాలి ఆమె సలహాను ఇష్ట పడలేదు. అతని తెలివిని కోపము ఆవరించెను. యమపాశముచే బంధింపబడి బయటకు లాగబడెను. కారణము తెలియదు. తననిర్ణయమునకు స్థిరపడెను. నక్షత్రమువలె ప్రకాశించు సుందరమైన తారచెప్పినదంతయు వ్యర్థ మయ్యెను. "నీవు చెప్పునది ఏమి? నాశత్రువైన సోదరుడు యుద్ధ కాంక్షతోనరచుచుండగా విని మౌనముగనుండవలసినదేనా? శత్రువు యుద్ధమునకు పిలిచినపుడు ఏయోధుడు వెనుకకుమరలునో అది వానికి అట్లు వెనుకంజవేయుటకంటె మరణమే మేలు. రాముని గురించి నీవు భయపడకుము. అతడు ధర్మజ్ఞుడు. పాపభీతితో పెరిగినవాడు. నేను సుగ్రీవుని చంపను. వానికి గుణపాఠము చెప్పి, వాడు మరల మరచిపోని విధముగ చేసి, ప్రాణములతో విడిచిపుత్తును. నన్ను వెళ్ళనిమ్ము. నాయందలి ప్రేమతోనీవు చెప్పితివి. నేను సుగ్రీవుని వెనుకకు పంపి విజయముతో తిరిగివత్తును. నాగురించి నీవు భయపడకుము" అని వాలి తారనూరడించెను. తార కన్నీరుతో తనభర్తకు ప్రదక్షిణముచేసి, అతని విజయమును కోరి ప్రార్ధనలుచేసి, తనభవనమునకు తిరిగి వెళ్ళెను. తారను, ఆమెఅనుయాయులను విడిచిపెట్టి వాలి తనకోటనుండి కోపించిన సర్పమువలె బుసకొట్టుచు సుగ్రీవుని చేరెను. వాలి తేజస్సుతో ధైర్యముతో నిలిచియున్న సుగ్రీవుని చూచి తన నడికట్టు బిగించుకొని అతనిపై దుమికెను. సుగ్రీవుడుకూడ వాలిని ఎదిరించుటకు ముందునకు పరిగెత్తెను. "నీప్రాణములందు నీకుప్రేమ ఉన్నచో ఇటనుండి పారిపొమ్ము" అని వాలి హెచ్చరించెను. సుగ్రీవుడు ప్రతిహెచ్చరిక చేసెను. యుద్ధమారంభ

మయ్యెను. రాముని సహాయమందలి విశ్వాసముతో, తెచ్చుకొనిన ధైర్యబలములతో సుగ్రీవుడు చాలసేపు ద్వంద్వయుద్ధము కొనసాగించెను. ధనుర్బాణములతో వేచియున్నరాముడు సుగ్రీవుడు యుద్ధమును ఎంతోకాలము కొనసాగింపలేడని భావించి తనబాణమును వింటినారికి తగిలించి ఆకర్ణాంతము లాగి వాలి వక్షమునకు గురిచూచి బాణ ప్రయోగము చేసెను. ఆబాణముచే గాయపరుపబడినవాడై వాలి గొడ్డలిచే నరుకబడిన అరణ్య వృక్షమువలె రక్తము స్రవించుచు నేలపైపడెను. అయినను వాలి తేజస్సంపన్నుడై మేఘము అస్తమించుచున్న సూర్యునిచే ప్రకాశింపబడుచున్నట్లు ప్రకాశించెను. ఇంద్రునిచే ఈయబడిన దివ్యకంఠాభరణము అతని వక్షస్థలమున ప్రకాశించెను. అతని శరీరము నకు ఇంద్రదత్త కంఠాభరణమును, రామబాణమును, రక్తమును స్రవించు చున్న గాయమును ఇంకను కాంతిని పెంచెను. నిజమైనయోధుడు యుద్ధరంగమున మరణించుచు పడియున్నపుడు అంత అందముగ ఎప్పుడునుండలేదని వాలిసౌందర్యము వాల్మీకిచే వర్ణింపబడినది.

ఊహింపని విధముగ బాణవిద్ధుడై నేలపైపడిన వాలి చుట్టును పరికించి, ధనువును చేబూని తనను సమీపించుచున్న రామలక్ష్మణులను ఆశ్చర్యముతో చూచెను. విపరీతమైన కోపముతో, కన్నీటితో, మందగించిన కంఠధ్వనితో ద్వంద్వయుద్ధమునందు పాల్గొనిన ఒక వ్యక్తిని నిష్కారణ మరణమునకు గురిచేసినందులకు వాలి రాముని నిందించెను. "ఓరామా! నీవు దశరథ చక్రవర్తి కుమారుడవు. సద్వంశమున జన్మించిన నీవు ఇట్టికృత్యమునెట్లు చేసినావు? నీశక్తి

సామర్థ్యములను ప్రపంచమంతా కొనియాడుచున్నది. అయినను నేను మరియొక వ్యక్తితో యుద్ధమునందిమిడియుండగ, నీవు వెనుకనుండి, నాచేచూడబడకుండ బాణమును నాపైప్రయోగించితివి. ఎంత అవాంఛనీయ మైన దోషము. ఈప్రపంచము నీగురించి ఇపుడేమి తలచును? నేను ఎన్నడైనను నీకేమి హాని చేసియుంటిని? నేను నీతో యుద్ధముచేయ వచ్చితినా? చెట్లవెనుక దాగియుండి హంతకునివలె నన్ను సంహరించి తివి. ఒకరాజకుమారుడు అమాయకుడగువానిని ఈవిధముగ చంపుట విచారింపదగిన పాపము. నీకు రాజ్యార్హత లేదు. భూదేవి నిన్ను భర్తగ స్వీకరించుటకంగీకరింపదు. నేను నీచమైన, పాపాత్ముడైన దౌర్భాగ్యునిచే చంపబడితినని నావిచారము. నీవు నాతో యుద్ధముకోరియుండినయెడల నేను నీతో యుద్ధముచేసి ఇపుడునేనున్న స్థితియందు నీవుండునట్లు నిన్ను చంపియుండెడివాడను. నీసీతను తిరిగిపొందుటకు నీవుచేయు సహాయమనుకొనినచో, నేను ఒక్కరోజులో ఆమెను నీకు అప్పగించి యుండెడివాడను. నేను రావణుని సంహరించి అతని మెడకు త్రాడు బిగించి అతని శరీరమును ఈడ్చుకొనివచ్చి నీపాదములకడ ఉంచెడి వాడను. అతడు సీతను ఎక్కడదాచినను నేను ఆమెను కనుగొని నీకామెను స్వాధీనపరచెడివాడను. జన్మించినవారందరు మరణింప వలసినదే. ఇది న్యాయము. అందుచే నేను నామరణమును గురించి విచారించను. ఈవిధముగ నన్ను సంహరించుటలో నీపాపము గొప్పది" ఈవిధముగ ఇంద్రకుమారుడు వాలి కొన ఊపిరితో రాముని నిందించెను.

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి , నేదునూరు, తూ||గో||జిల్లా

సుగ్రీవునితో తలపడిన యుద్ధమునందు చితుకకొట్టబడి, అనేకగాయములనుండి రక్తము స్రవించుచు వాలి మరణవేదనతో పడి యుండెను. తనరాణిని, ప్రేమాస్పదుడగు కుమారుడు అంగదుని చూచుటకు తగినంతసమయము మాత్రము జీవించెను. "అంతా అయిపోయినది. నేను నిన్నింక ఏమియు నిందింపను. నాప్రియ పుత్రుడు అంగదుడు అనాథ అయ్యెను. నీవును సుగ్రీవుడును అతనిని జాగ్రత్తగ రక్షింపవలెను. నేను అతనిని నీకప్పగించుచున్నాను. జాగ్రత్తగ చూచు కొనుము. ఎండిపోయిన చెరువునందలి వాడిపోవు పద్మలతవలె, అంగదుడు వాడిపోకుండునట్లు చూచుట నీబాధ్యత. తార నన్ను తనపై యుద్ధమునకు పంపినదని ఊహింపవలదని సుగ్రీవునకు తెలుపుము. అంగదుని గౌరవ, అనురాగములతో యువరాజుగ ఆదరింపుమని సుగ్రీవు నికి తెలుపుము. నాకోఱకు ఈమాత్రము చేయుము. నాకింకేమియు కోరిక లేదు. వీరస్వర్గమునన్ను పిలుచుచున్నది". ఆవిధముగ వాలి జీవితము ముగిసెను.

ఇంద్రదత్తమైన కంఠాభరణ రక్షణకారణముగ రాముడు వాలిని ముఖాముఖి ఎదుర్కొనలేక జయింపలేకపోయెను. రావణుడు దేవతలచే జయింపబడనట్లే వాలియు జయింపనశక్యుడు. రాముడు అదృశ్యముగానుండియే వాలిని వధింపగలడు. అసలు వాలిఎందుకు వధింపబడవలెను? అన్నప్రశ్న మిగిలియున్నది. కబంధుడు శాప విమోచనమునందుచు రామునకు కృతజ్ఞతతో సుగ్రీవుని సహకారముతో నీవు సీతను తిరిగిపొందగలవు అని చెప్పుటచే, రాముడు సుగ్రీవుని

సహాయార్థము ప్రయత్నించుటలో వాలిని సంహరింపవలసివచ్చెనని భావింపవలసియున్నది. వాలి ఒక ధనుర్ధారిచే సంహరింపబడెనను వార్తరాగానే కిష్కింధ రాజ్యమునందు భయము ఆవరించి నిరాశ, ఆందోళణలతో వానరులు అటునిటుపరుగులెత్తిరి. ఇదిచూచిన తార తనదుఃఖమును ప్రక్కకు పెట్టి రాణిగ తనభర్తయొక్క అనుచరులకు ధైర్యము చెప్పుటకు ప్రయత్నించెను. "ఈరోజువరకు మీరు మీరాజుకు ముందర యుద్ధమునందు ముందు నడచిరి. ఇపుడు మీరు భయముతో ఏలపరుగిడుచున్నారు? మీకే అపాయమును లేదు. రాముడు సుగ్రీవుని రాజును చేయుటకుమాత్రమే వాలిని సంహరించెను. మీజీవితములేవియు ప్రమాదభరితములు కావు. మీకు మరియొకడు పరిపాలకుడుగ మాత్రమేవచ్చును. అంతే. మీరు భయపడి పారిపోనవసరములేదు" అని తారపలికెను.

తార తనభర్త మరణించిపడియున్న ప్రదేశమునకు వెళ్ళుటకు ప్రయత్నింపగా వానరులు ఆమెను ఈవిధముగ పలుకుచు ఆటంకపరచిరి. "మేము అంగదుని ప్రభువుగ చేయుదుము. కోటను భద్రపరతుము. సుగ్రీవుని నుండి అతని స్నేహితులనుండి నగరమును రక్షింతుము". కాని తార ఇట్లనెను. "నాభర్తమరణించెను. ఫరవాలేదు". రామలక్ష్మణులు నిలిచియున్న ప్రదేశమునకు తార సూటిగ ధైర్యముగ వెళ్ళెను. తన భర్తగాయపడి మరణించి పడియుండుట చూడగానే ఆమె తనదుఃఖమును అదుపులోనుంచుకొనలేక వెక్కివెక్కిఏడ్చెను. "ఓనా ప్రభూ! ఎంతమందినాయకులను నీవు సంహరించితివో. అట్టి నీవీనాడు

మరణించితివి. నన్నిచట విడిచితివి". వెంటనే వాలికుమారుడు అంగదుడు ఆప్రదేశమును చేరెను. సుగ్రీవుడు ఇదంతయు చూచుచు తనకారణముగ ఇట్టివిపత్తు సంభవించెనని తలచి పశ్చాత్తాపపడెను. తార నేలపైదొర్లి "అంగదుని అనాధనుచేసి, నన్ను నిస్సహాయనుచేసి తిరిగిరాని లోకమునకు వెళ్ళినావా స్వామీ!" అని రోదించెను. హనుమంతుడామెను ఓదార్చుటకు ప్రయత్నించెను. "వాలి వీరస్వర్గమునలంకరించెను. అతని కొఱకు విచారమేల? సమయము వచ్చినపుడు అంగదుడు రాజ్యాభిషిక్తు డగును. అంగదుని రక్షణబాధ్యతమాది. ఇపుడు వాలికి ఉత్తరక్రియలు చేయు ఆలోచన చేయవలెను".

"నేనుదేనికీ లక్ష్యపెట్టను. వాలికి ఉత్తరక్రియలు జరుపుట, అంగదుని పరిరక్షించు బాధ్యతలు సుగ్రీవునివి. నేను చేయునదేమున్నది? వేయిఅంగదులు నాభర్తతో సాటిఅగుదురా? అతనితో పాటే నేనును యమలోకమును ప్రవేశింతును. అదే నాకు ఆనంద దాయకము" అని తారపలికెను. ఇంతవరకు మూర్ఛనందినవాలి కనులు తెరిచి "సోదరా! మనమిద్దరముకలసి స్నేహముగ రాజ్యపాలన చేసికొని యుండిన బాగుండెడిది. అట్లుచేయలేదు. ఇకనుండి నీవు రాజ్యమును పాలించుకొనుము. తారకును నాకును ప్రియమైన అంగదుడు నీతోసమాన మగుయోధుడు. అతనికి తండ్రివై రక్షింపుము. తారపట్ల దయకలిగి యుండి, తెలివైన ఆమె సలహాలను పాటింపుము" అని పలికి ఇంద్రదత్తమగు మహిమాన్విత కంఠాభరణమును సుగ్రీవునకిచ్చి ఆశీర్వ దించెను. "సుగ్రీవుడు నీప్రభువు. అతనిని గౌరవించి నీఅనురాగపూరిత

సేవలను అతనికి అదింపుము" అని అంగదునకు సలహానిచ్చెను. నీలుడు సౌమ్యముగ వాలి వక్షమునుండి రామబాణమును తొలగించెను. గాయమునుండి రక్తముస్రవించి వాలిమరణించెను. తార వాలిమరణము నకు దుఃఖించెను. సుగ్రీవుడు రాజ్యపదవియందలి కోరికతో తాను గుహాముఖమును మూసి పాపము చేసితినని పశ్చాత్తాపపడెను. కామము సుగ్రీవుని, క్రోధము వాలిని పాపము చేయించినవి. కావున కామక్రోధములను దూరముగనుంచుకొనవలెను.

"నేను పెద్ద నేరముచేసినను నాసోదరుడు నన్ను చంపకవిడిచెను. నేను అతనిని చంపించి పెద్దపాపము చేసితిని. నేను జీవించుట వ్యర్థము" అనుచు సుగ్రీవుడు పశ్చాత్తాపపడెను. రాముడు వాలిభార్యకడకు భయముతో సమీపింపగ, ఆమె క్రోధమును విడిచి ప్రశాంతముగ తానులేనిదే తనభర్త పరలోకమున ఒంటరిగ జీవింప లేడనియు, తననుకూడాచంపి తనభర్తకడకు చేర్చి పుణ్యము కట్టుకొను మనియు, ఈచర్య రాముని పాపమును తొలగించుననియు కోరెను. తారయు, సుమిత్రయు రామునియందు విష్ణువును చూచిన భక్తులు. కావున వారు ధన్యులు. వాలియొక్క ఉత్తరక్రియలు యధోచితముగ జరుపబడినవి. అనంతరము సుగ్రీవుడు రాజుగను, అంగదుడు యువరాజుగను అభిషిక్తులయ్యిరి.

వానకాలము ప్రారంభమయ్యెను. సుగ్రీవుడును, అతని అనుయాయులును కిష్కింధలో భోగములతో కాలముగడిపిరి. రామ లక్ష్మణులు సమీపమందలి పర్వతగుహయందు బడలిక కలిగించు

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

రోజులను గడిపిరి. అడవిమార్గములు వరదలతో ప్రయాణయోగ్యముగ లేకపోవుటచే సీతాన్వేషణ వాయిదావేయబడినది. వర్షకాలమధిగమించు వరకు రాముడుసహనముతో నిరీక్షించెను. కిష్కింధ వాలిమరణమునకు విచారించినను, సుగ్రీవుని అతని సహచరుల ఏలుబడితో సంతోషించెను. సుగ్రీవుడు తననగర బహిష్కరణను, అగ్రజ వియోగమును మరచి రాజ్యభోగములనుభవించుటలో నిమగ్నుడయ్యెను. తన కుమారుని గురించి తార తనంతతానుగ తిరిగి సుగ్రీవునితో సఖ్యతనేర్పరచుకొన్నది. రాజ్యభవనమంతయు మిక్కిలి సంతోషముతో వానకాలముననుభవించు చుండగ, రఘురాజకుమారులు విచారగ్రస్తులై కృశించుచున్నారు. హనుమంతుడు మాత్రము ఆందోళనాభరితుడై రామునకిచ్చిన వాగ్దాన మును సుగ్రీవప్రభువునకు జ్ఞప్తిచేయచూచుచుండెను. చివరకు వానలు తగ్గి, ఆకాశము నిర్మలమై పూలపరిమళముతో గాలిసుగంధపూరిత మయ్యెను. బాధ్యతలను మంత్రులకప్పగించి భోగలాలసుడైయున్న సుగ్రీవునకు, రామునకిచ్చిన వాగ్దానమును చెల్లించుకొనుమని జ్ఞాపకము చేయునిమిత్తము హనుమంతుడు వెళ్ళి సుగ్రీవునకు ఆవిషయమై మనవిచేసెను. "మనస్నేహితులకిచ్చిన వాగ్దానమును సకాలములో చెల్లించుట ఉత్తమము. వాగ్దానము పొందినవారిచే జ్ఞాపకము చేయించు కొనువరకు ఆగుట మంచిదికాదు. వర్షకాలము గతించినది. రాముడు మనకిచ్చిన వాగ్దానమును వెంటనే చెల్లించినట్లే, మనమును ఆలసింపక వెంటనే సీతాన్వేషణకు తగు ఏర్పాట్లు చేయుటయు, వాగ్దానమును చెల్లించుకొనుటయు మనబాధ్యత". వినయపూర్వకముగ హనుమంతుడు

ఇచ్చిన సలహాకు అంగీకరించి సుగ్రీవుడు "ఈప్రపంచమంతటిని వెదకి సీతజాడ కనుగొనవలయును. శక్తిమంతులగు వానరులనందరను వచ్చి మనసైన్యమున చేరుమనుడు. రానివారు శిక్షింపబడుదురు. సీతాన్వేషణకు తగు ఏర్పాట్లు చూడుము" అని నీలునకు ఆజ్ఞాపించి తన అంతఃపురములోనికి సుగ్రీవుడు తిరిగివెళ్ళెను.

వానలు వెనకపట్టి అడవిసుందరవనమును తోపింపగ రాముడు దండకారణ్య ప్రాంతమున సుందరప్రదేశములందు ఆనందముగ సంచరించిన తనభార్య సీతను జ్ఞప్తికి తెచ్చుకొని, ఆమె బందీకృతయై ఏమి బాధలు పడుచున్నదో?, తనవియోగశోకముతో ఎంతవిలపించుచున్నదో? అని ఆలోచించుచు దుఃఖించెను. సీతాన్వేషణకొఱకు సహాయపడుదునని వాగ్దానము చేసి మరచిన వానరరాజు సుగ్రీవుడు తనభోగములందు నిమగ్నుడై వాగ్దానమును విస్మరించెనని లక్ష్మణుని సుగ్రీవునికడకు పంపి తనవాగ్దానమును వెంటనే చెల్లించుకొనుమనియు, లేనిచో రాముని కోపాగ్నికి నాశమునందవలసి వచ్చుననియు సుగ్రీవుని హెచ్చరింప నియోగించెను. మరల లక్ష్మణుని తొందరస్వభావము తెలిసినవాడగుటచే రాముడు మనస్నేహితుడు సుగ్రీవునకు కఠినముగకాక సౌమ్యముగ తనదోషమునెరుకపరచుమని చెప్పి పంపెను. లక్ష్మణుడు అన్న ఆజ్ఞను అంగీకరించియు, తన ఆగ్రహమును అదుపుచేసుకొనలేక ధనుర్బాణము లను ధరించి కిష్కింధ ద్వారముకడకేగెను. అచటి వానరులు భయపడి సుగ్రీవునికడకేగి "క్రోధపూరితుడై లక్ష్మణుడు వచ్చినట్లును, అతనిని తాము నిరోధింపలేకున్నామనియు" తెలిపిరి. మద్యపానమత్తుడై స్త్రీలచే

పరివేష్టింపబడిన సుగ్రీవుడు గమనించలేదు. రాజసేవకులు లక్ష్మణుని ప్రవేశమును నిరోధింప ప్రయత్నించిరి. కాని లక్ష్మణుడు లోనికి ప్రవేశించి యువరాజగు అంగదునిచూచి "బిడ్డా! తన శోకతప్తుడగు అన్న విషయము మాటాడుటకు లక్ష్మణుడు వచ్చి భవనద్వారముకడ వేచియున్నాడని మీవానరప్రభువునకు చెప్పుము" అని పలికెను. అంగదుడు లోనికేగి లక్ష్మణుడు వచ్చినట్లు సుగ్రీవునకు తెలిపెను. కాని సుగ్రీవుడు అర్ధముచేసికొను స్థితియందులేడు. అంగదుడు మంత్రులను సమావేశపరచి ఏమిచేయదగినదని యోచించెను. హనుమంతుడును, ఇతరమంత్రులును వివరింపగా సుగ్రీవుడు మత్తునుండి బయలుపడెను. "నేనేతప్పును చేయలేదు. రామలక్ష్మణులు నాపై ఎందుకు ఆగ్రహించిరి? ఏశత్రువులైనను నాగురించి వారికి కధలుచెప్పి వారికి నాపై ఆగ్రహము కలుగజేసిరికాబోలు" అని సుగ్రీవుడు పలికెను.

అనంతరము హనుమంతుడు "ఓప్రభూ! నీవురామున కిచ్చిన వాగ్దానమును చెల్లించుటకు ఆలస్యము చేసితివి. రాముని దుఃఖమును మరచితివి. ఇంకను సమయము మించిపోలేదు. మనము చేయవలసిన పనిని వెంటనే త్వరగ చేయవలయును. లక్ష్మణుని క్షమింపుమని వేడుకొందము. రామునకిచ్చిన వాగ్దానమును చెల్లించు కొనుటకు వలసిన ఏర్పాట్లు ఏమాత్రము ఆలస్యము చేయకుండా చేయుదము". అపుడులక్ష్మణుని లోనికి రప్పించుటకు సుగ్రీవుడంగీక రించెను. వానర పట్టణమునందు లక్ష్మణుడు ప్రవేశించి ఆనగర సౌందర్యమునకు, నాగరికతకు అద్భుతపడి సుందరమార్గములవెంబడి

రాజభవనమును చేరి బయటనిలిచెను. లోపలినుండి నృత్య, గాన, సంగీతములు విని వానరులు భోగలాలసులై తమవాగ్దానమును మరచిరని కోపము విజృంభించగ స్త్రీల భవనములందు ప్రవేశింపక బయటనే ఒకమూల నిలబడి ధనుష్ఠంకారము గావించెను. ఆధ్వనికి కిష్కింధ భయముతో వణకెను. సుగ్రీవుడా ధ్వనిని విని రాజకుమారులు నిజముగ క్రోధముతోనున్నారని గుర్తించి, అపాయమునూహించి, లక్ష్మణుని శాంతపరచుమని తారను కోరెను.

లోకజ్ఞానమును, చతుర భాషణమునుగల తార లక్ష్మణుని సమీపించెను. "చాలకాలము తర్వాత మీఅనుగ్రహముతో లభించిన రాజ్యభోగములందు మునిగి సుగ్రీవుడు తన ఇంద్రియములను మరచెను. అతని నేరమును మీరు క్షమింపవలెను. మీపట్ల అతని బాధ్యతను మరువలేదు. అన్ని దిక్కులనుండి వానర యోధులను ఇటకు రమ్మని ఆజ్ఞలు జారీచేసెను. నేడోరేపో వానరయోధులందరు ఇక్కడకు వత్తురు. సీతాన్వేషణయు, రావణునితో యుద్ధమును ప్రారంభమగును. సందేహపడవద్దు. ఇపుడులోనికి వచ్చి సుగ్రీవుని చూడుడని ప్రార్థన" అని తార లక్ష్మణునకు విన్నవించెను. లక్ష్మణుడు కోపమునుపసంహరించుకొని లోనికి వెళ్ళెను. సుగ్రీవుడు తనఆసనము నుండి దిగి లక్ష్మణుని ఆహ్వానించెను. "నానేరములను క్షమింపుము. రాముని స్నేహసహాయ ములతో రాజునైననేను రామునకిచ్చిన వాగ్దానమెట్లు మరతును. రాముడు మాసహాయమవసరములేకనే తన శత్రువులను నాశము చేయగలడు. నేను నాసైన్యముతో అతనిని అనుసరింతును. అంతే.

రావణుడు తప్పక అంతమొందును. సీతాన్వేషణ వెంటనే ప్రారంభింపబడును. జరిగిన ఆలస్యమునకు నేను సిగ్గుపడుచున్నాను. క్షమింపుము".

లక్ష్మణుడు సంతోషించి ఇట్లనెను. "రాముడు గౌరవము నందును, పరాక్రమమునందును నీతో సమానుడు. నాతో ఋష్యమూక పర్వతమునకు రమ్ము. అతని విచారమును తొలగించు మాటలను చెప్పుము" అని సుగ్రీవునకు చెప్పెను. సుగ్రీవుడు లక్ష్మణునితో ఒక పల్లకిలో రాముని కడకువెళ్ళి అంతకుముందే సిద్ధముచేయబడిన ఏర్పాట్లను వివరించి రాముని తృప్తిపరచెను. రాముడు సంతోషించి "నీవు నిజమైన స్నేహితుడవు. మేఘములు వానను, సూర్యుడు వెలుతురును, చంద్రుడు మానవహృదయములకానందమును ఇచ్చునట్లు మంచి స్నేహితుడు తనమిత్రునకు సహాయముగ తనంతతాను వచ్చును. నీస్నేహముతో నేను సంతోషించుచున్నాను. వంశసహితమైన రావణుని అంతము తప్పదు" అని పలికెను. రాముడిట్లు తనసంతోషమును కృతజ్ఞతను వెల్లడించుచుండగనే పెద్దపెద్దగుంపులుగ వానరులు తమనాయకులతో అచ్చటకు వచ్చి సమావేశమయ్యిరి. వారు పర్వతారణ్య ప్రదేశములనుండియు, సముద్రతీరములనుండియు లక్షలకొలది వివిధ రంగులు, ఆకారములతో వానరములు, ఎలుగుబంట్లు వచ్చినవి. సుగ్రీవుడు వారందరకు నివాసస్థలములు కేటాయించి వారిని ఎనిమిది విభాగములుగ చేసి వారందరకు నాయకులను నియమించి సీతకొఱకు

ఎనిమిది దిక్కులందలి ప్రదేశములను సమగ్ర పరిశీలనతో అన్వేషింప వలసినదిగ ఆజ్ఞాపించెను.

సుగ్రీవుడు రామునకు వానరసైన్యమును చూపి "ఈబలవత్తరమైన యోధాన్వితమగు ఈవానరసైన్యమంతయు నీఆజ్ఞలను శిరసావహించుటకు సిద్ధము. నీవేమి ఆజ్ఞాపించిన అది చేయగలరు" అని చెప్పగా రాముడు సంతోషముతో సుగ్రీవుని కౌగిలించుకొని "మొదట సీత జీవించియున్నదా? ఎచటయున్నది? అను విషయమును తెలిసికొన వలెను. తరువాత రావణునిగురించి తెలిసికొనవలెను. అనంతరమేమి చేయనవసరమో అది చేయవలెను. కాని ఈ మీసైన్యమును రాజుగ నీవే ఆజ్ఞాపింపవలెను. నీవంటి స్నేహితుడును, లక్ష్మణునివంటి సోదరుడును లభించుట నాఅదృష్టము" అని రాముడనెను. అపుడు సుగ్రీవుడు నాలుగు దిక్కులకు నాలుగు సైన్య విభాగములను సీతాన్వేషణకొఱకు వారివారినాయకులను ఆజ్ఞాపించెను. ఇతరనాయకులను బయటకు పంపినతర్వాత సుగ్రీవుడు హనుమంతుని తనప్రక్కన కూర్చుండబెట్టుకొని "వాయుపుత్రా! నీతండ్రియొక్కబలమును తేజస్సును కలిగియున్న నీవొక్కడవే ఈవిషయమున విజయమును సాధింపగలవు. అందుచే సీతనుకనుగొను బాధ్యత నీకు అప్పగించుచున్నాను" అని పలికెను. శ్రీరాముడుకూడా హనుమంతుని ప్రయత్నములు ఫలించునని భావించెను. ఎన్ని ఆటంకములు ఏర్పడినను హనుమంతుడధిగమింప గలడని తలచి రాముడు తన ఉంగరమును హనుమంతునకిచ్చి "నీవు సీతను కనుగొందువని నాకుపూర్తి విశ్వాసముకలదు. నీవునాదూతవని

ఈనాఉంగరము సీతకు తెలుపును. హనుమా! నీవు సీతను నన్నును ఒకచోచేర్పుము" అనెను. సుగ్రీవుడు తన సైన్యములనిట్లాజ్ఞాపించెను. "సీత ఎక్కడ దాచబడినను మీరామెను కనుగొనగలరు. కనుగొన వలసినదే. ఆమెకు సంబంధించిన వార్తలతో ఒక నెలలోపు వ్యవధియందు మీరు తప్పక తిరిగిరావలయును".

చీమలపర్వతమునుండి బయలువెడలిన చీమలవలె సైన్యములు బయలుదేరి నాల్గుదిశలయందు వ్యాపించినవి. శతబలి ఉత్తరమునకును, వినత తూర్పునకును, సుషేణుడు పడమరకును, హనుమంతుడును, అంగదుడును, తారుడను నాయకుడును దక్షిణ దిశకును పయనించిరి. అందరును రావణుని పట్టి చంపుటకును, సీతను తిరిగితెచ్చుటకును సమమగునుత్సాహముతోవెళ్ళిరి.

శ్రీరాముడు "సుగ్రీవా! నీవు అన్ని దిశలయందలి భూభాగములను నీకనులతో చూచినట్లు వర్ణించితివి. ఎపుడు, ఎట్లు వానినన్నిటిని నీవుచూచితివి" అని అడిగెను. "వాలి నన్ను చంపుటకు నావెంట తరిమినపుడు నేను ఈప్రపంచమంతట చుట్టితిరగవలసి వచ్చినది. అందుచే ఇవన్నియు నాకుతెలిసినవి. ఆవిధముగ తిరిగినపుడు మతంగమహర్షి ఆశ్రమము మాత్రము శాపకారణముగ వాలిసమీపింప వీలుకాని ప్రదేశమని తెలిసికొని అక్కడ రక్షణపొందితిని" అని సుగ్రీవుడు జవాబిచ్చెను. పశ్చిమోత్తర ప్రాగ్దిశలకు వెళ్ళిన సైన్య సముదాయములు నెల వ్యవధిలో తిరిగివచ్చి సీత ఎచ్చటను కనుగొనబడలేదని ప్రకటించిరి.

దక్షిణ దిశకు వెళ్ళిన హనుమంతుడు తిరిగిరాలేదు. రాముడు వానరులు తమశక్తికొలది ప్రయత్నించినారని సంతోషించెను.

హనుమంతుడును, అంగదుడును అడవులను, వింధ్య పర్వత గుహలను ప్రవేశించి వెదకిరి. ఒక ఋషి తపము చేసికొనుచున్న ఒక ఎడారికి వెళ్ళిరి. అతని శాపకారణముగ ఆప్రాంతము వృక్ష, మృగ, పక్షి రహితమైయున్నది. దక్షిణమునకు పయనించుచు వారొక పెద్ద రాక్షసుని చూచిరి. ఆక్రూరుడు వానరబృందమును ఆహారముగ గ్రహింప ముందునకు దూకెను. వానరులు అతడే రావణుడని తలచిరి. అంగదుడు కొట్టిన బలమైన దెబ్బతో ఆరక్కసుడు రక్తము కక్కుకొని మరణించెను. వానరులు రావణుడే మరణించెనని ఆనందించి సీతకొఱకు ఆప్రాంతమంతయు వెదకి కనుగొనలేక మరియొకచోటికి వెళ్ళిరి. సీత కనుపింపకపోవుటచే నిరాశచెందిన వానరులను అంగదుడును, గంధమాదనుడును ప్రోత్సహించెడివారు. చాలరోజులు గడిచిపోయినవి. దక్షిణదిశగ చాలదూరము వెళ్ళి వెదకిరి. ఒక ఎడారియందు పయనించుచు ఆకలి దప్పులతో అలమటించుచు వానరులు ఒకగుహను చూచిరి. ఆగుహనుండి విచిత్రమైన పక్షులును, పద్మపరిమళ భరితమైన వాయుపరిమళములును వెలువడినవి. ఈసూచనలను బట్టి వానరులు ఆపక్షులు వచ్చిన ప్రదేశమందు నీరుండియుండునని నిర్ణయించిరి. వానరులు పరస్పరము చేతులు పట్టుకొని ఆగుహయందలి దట్టమైన చీకటిలోనికి జాగ్రత్తగ ప్రవేశించిరి. కొంతదూరము వెళ్ళిన తరువాత వారు జలాశయమును, పండ్లతోనిండిన వృక్షములను, అకస్మాత్తుగ కనిపించిన

వెలుగులో కనుగొనిరి. తర్వాత వజ్రములు పొదిగిన బంగరువీధులుగల అందమైన నగరమునకు చేరిరి. ఇంకనూ ముందునకువెళ్ళి నారచీరలను ధరించిన తేజస్సంపన్నురాలైన ఒక ముసలి తపస్వినిని చూచిరి. హనుమంతుడు ధైర్యము చేసి ఆమె దగ్గరకు వెళ్ళి వంగినమస్కరించి "తల్లీ! నీవెవరో మేము తెలుసుకొనవచ్చునా? అలసటతో, దప్పికతో మేమిచట నీరులభించునను ఆశతో ఈచీకటి గుహయందు ప్రవేశించి నాము. ఇపుడు నిర్మానుష్యముగానున్న ఈబంగరునగరమును చెట్లతోను, చెరువులతోనుండుట చూచి మేము భయపడుచున్నాము. ఇదంతయు వివరించి మాభయమును తొలగింపుము" అని వేడుకొనెను. "మీరీ గుహలోనికి మార్గమునెట్లు కనుగొన్నారు? మీరిచట అనేక ఫలములను, పానీయములను స్వీకరింపవచ్చును. దానవశిల్పి మయునిచే ఈభవనము నిర్మింపబడినది. ఈకళను అతడు శుక్రాచార్యుని నుండి అభ్యసించెను. చాలకాలము మయుడు ఇంద్రునితో శత్రుత్వము సంభవించి అతనిచేచంపబడువరకు, ఇచట ఆనందముగ జీవించెను. తరువాత ఇంద్రుడు నాస్నేహితురాలు హేమకు ఈబంగారు భవనమును ఇచ్చెను. ఈబంగారు భవనములును, ఉద్యానవనములును ఆమెవే. ఆమె ప్రస్తుతము దేవతలనివాసమునకు వెళ్ళినది. కాని మీరిచ్చటకు వచ్చినపనిఏమి? అడవులయందుతిరుగుచు మీరు బడలికనందుచున్నా రేల? ముందు మీకు కావలసినవి తిని, త్రాగి మీఅలసటను తీర్చుకొనుడు. తర్వాత మీగురించినాకు తెలుపుడు" అని ఆతపస్విని జవాబిచ్చెను.

వానరులు తిని త్రాగి అందరు అలసటను తీర్చుకొనిరి. అపుడు హనుమంతుడు తాము అడవులందు తిరుగుచున్న కారణము నిట్లు ఆతాపసికి వివరించెను. "దశరధరాజకుమారుడు రాముడు తన తండ్రి ఆజ్ఞమేరకు కళత్రసోదర సహితుడై అరణ్యమున నివసించుచు, ఒక రాక్షసునిచేత అపహరింపబడిన తన భార్యసీతను వెదకుకొనుచు మారాజు సుగ్రీవునిసహాయము కోరివచ్చి అతనితో స్నేహము కుదుర్చుకొనెను. సుగ్రీవుడు సీతను వెదకి కనుగొని ఆసమాచారమును నెలవ్యవధిలో తనకందింపవలెనని శాసించెను. మేమీచీకటిగుహలో ప్రవేశించి మామార్గమును తప్పితిమి. వ్యవధి పూర్తి అయిపోయినది. ఇపుడేమి చేయవలెనో తెలియదు. సుగ్రీవుడు కచ్చితమైన యజమాని. ఆతని ఆజ్ఞను వ్యతిరేకించిన మాకు అతడు మరణశిక్ష విధించును". స్వయంప్రభ అను ఆతపస్విని "అయ్యో! మీఅంతట మీరు ఈగుహ వెలువడి వెళ్ళలేరు. ఈగుహలో ప్రవేశించిన కొత్తవారెవరైనను ప్రాణములతో తిరిగిబయటకు వెళ్ళలేరు. కాని మీకార్యము చాలగొప్పది. అందుచే మిమ్ము నాతపశ్శక్తితో బయటకు పంపింతును. ఇపుడు మీరందరును కనులుమూసుకొనుడు" అని పలికెను. అట్లే వానరులందరును కనులు మూసుకొనిరి. వెంటనే వారందరును సముద్రతీరముననున్నట్లు గుర్తించిరి.

సముద్రమును చేరగానే వారు చుట్టునుచూచి వసంత ఋతువుయొక్క ప్రారంభముగ గ్రహించి ఉలికిపడిరి. "అయ్యో! మనకిచ్చిన గడువు తీరిపోయినది. సీతను గురించి ఏసమాచారమును లేకుండ మనము కిష్కింధకు పోయినచో రాజు మనకు మరణశిక్షను

విధించును. నాయందు ప్రేమతోకాక రాముని వత్తిడిచే సుగ్రీవుడు నన్ను యువరాజుగ చేసెను. కాని అతడు నన్ను అసహ్యించుకొనును. అక్కడకు వెళ్ళి మరణశిక్షనందుటకు బదులు నిరశనదీక్షతోనిక్కడ మరణించుట మేలు" అని అంగదుడు పలుకగా అతని అనుయాయులు చాలమంది దానికి అంగీకరించిరి. వానర సేనాధిపతి తారుడు ఇట్లనెను. "నేను అంగీకరింపను. మనమెందులకు మనజీవితములను ముగించుకొనవలెను. తపస్విని స్వయంప్రభయొక్క గుహకు పోయి సుఖముగ జీవింతము. అక్కడ అన్నియు సమృద్ధిగనున్నవి. సుగ్రీవుడు కాని, ఇతరులుకాని అక్కడకురాలేరు. మనము మనశేషజీవితములను అక్కడ స్వేచ్ఛగ గడుపవచ్చును". కాని హనుమంతుడిట్లు పలికెను. "ఎంత అయోగ్యమైన మాట ఇది? కిష్కింధయందు దూరమున మనకుటుంబములను విడిచి ఈగుహయందు తిని, త్రాగి, నిదురచెందుటవలన ఏమి సంతోషముకలదు? సుగ్రీవుడు మంచిప్రభువు. అతని వలన మనము భయపడనవసరములేదు. సుగ్రీవుడేకోపించి, మనలను శిక్షించుటకే నిశ్చయించిన ఈగుహ మనకు రక్షణనెట్లీయగలదు. లక్ష్మణుని కోపము ముందు ఆగగలదా? అతడు గుహను ముక్కలుగ ధ్వంసమొనర్చి మనలను చంపలేడా? తారుని మాటలయందు నేను ప్రయోజనమును చూడలేకున్నాను. మనము సుగ్రీవుని కడకు తిరిగివెళ్ళి, నిజమును తెల్పి క్షమింపుమని కోరుదము. మనక్షేమమునకు ఇదిఒక్కటే మార్గము".

"నేను హనుమంతుడు చెప్పినదానికి అంగీకరింపను. సుగ్రీవునకు నాయందు ప్రేమగాని, దయగాని లేవు. అతడు నన్ను తప్పక

వధించును. అతడు దుర్మార్గ స్వభావుడు. నాతండ్రినెట్లు సంహరించెనో జ్ఞప్తికి తెచ్చుకొనుడు. అతడునేను జీవించుట కోరడు. నన్నుచంపుట కతడు ఏదో నెపమును కనుగొనును. తనమార్గమునకు ఆటంకముగ నన్ను అతడు తలచును. అతడు సీతను వెదకింతునని రామునకిచ్చిన వాగ్దానమును మరువలేదా? వాగ్దానమును భంగపరచుట అతనికి లెక్కలేదు. లక్ష్మణుడును, అతని ధనువును కారణముగ సుగ్రీవుడు మనలను సీతాన్వేషణకు పంపెను. నాతల్లి నాకొఱకు సుగ్రీవుని రక్షణకు లొంగిపోయెను. ఆమె నాకొఱకు జీవించుచున్నది. నేను మరణించినట్లు విన్నచో ఆమె మరణించును. నేను విచారగ్రస్తుడను. ఏమి చేయుటకును ఎరుగను. కిష్కింధకు వెళ్ళినచో నామరణము తప్పదు. ఇక్కడ ఉపవసించి మరణించుట మేలు" అని అంగదుడు పలికి నేలపై కుశలు పరుచుకొని, దేవతలకు నమస్కరించి, తూర్పుగ తిరిగి మరణింపనిశ్చయించెను. యువరాజు అంగదుడు అట్లు దీక్షపూనగ ఇతరవానరులు దుఃఖముతో విలపించి తాముకూడ మరణింప నిశ్చయించి తూర్పు ముఖముగ కూర్చుండిరి.

సమీపమందలి పర్వతమునుండి ప్రాణత్యాగము చేయుచున్న ఆవానర బృందమును పక్షిరాజు సంపాతి చూచెను. రెక్కలు పోగొట్టుకొనుట చేతను, తానున్నచోటునుండి కదలలేకపోవుటచేతను సంపాతి చాలకాలము అన్నపానాదులులేక పస్తులుండెను. "చాలకోతులు ఇక్కడ కలిసి చావబోవుచున్నవి. ఏప్రయత్నమును అవసరములేకుండ చాలకాలమువరకు నేను ఆహారమును పొందగలను" అనుకొనుచు

సంపాతి సంతోషించెను. ఇంతలో వానరులు మరణమును కోరుకొనుచు తమలోతాము జరిగినదంతయు గట్టిగానేడ్చుచు చెప్పుకొనుచుండిరి. "కైక కారణముగ దశరధుడు మరణించెను. దశరధుని కారణముగ రాముడు అరణ్యవాసము చేయవలసివచ్చెను. రావణుడు సీతను ఎత్తుకొని పోయెను. సీతను రక్షించు ప్రయత్నమందు జటాయువు మరణించెను. అతడు మరికొంతసేపు యుద్ధమును చేయగల్గియుండినచో రామ లక్ష్మణులాప్రదేశమునకు వచ్చి సీతను తిరిగి పొందియుండెడివారు. విధికారణముగ ఈసంఘటనలన్నియు జరిగినవి. ఈకధకు చివరి భాగముగ మనమిచట మరణించుచున్నాము. విధి ఎంతవిచిత్రమైనది?".

ఈరోదనలను వినిన సంపాతి తనసోదరుడు జటాయువు ప్రసంగము రాగానే నివ్వెరపోయి చూచెను. అతడు మరణించినట్లు వినగానే అతడు పూర్తికధను వినగోరెను. సంపాతి మిక్కిలి వృద్ధుడు. విష్ణువాహనుడగు గరుత్మంతుని సోదరుడును, సూర్యరధచోదకుడునగు అనూరుని కుమారులే సంపాతియు, జటాయువును. సోదరులిరువురును వారి యవ్వనదశయందు ఆకాశమున ఎవరు ఎక్కువఎత్తు ఎగురగలరని పందెము వేసికొని పైకి ఎగురనారంభించిరి. సూర్యమండల సమీపమునకు వెళ్ళుసరికి ఆవేడిని భరింపనశక్యముగ నుండి, జటాయువు కాలిపోవు స్థితియందుండగ, సంపాతి సోదరప్రేమతో తనరెక్కలు చాపి జటాయువును రక్షించెను. ఫలితముగ సంపాతి రెక్కలు కాలిపోయెను. ఎగురలేక సంపాతి నేలపై ఒకపర్వతోపరితలమున పడిపోయెను. అప్పటినుండియుఆహారము లేక ఆకలితోఅలమటించుచు అదేప్రదేశమున సంపాతి జీవించియుండెను.

"నాప్రియసోదరుడు జటాయువు యొక్క విషాద వార్తను ఎవరు తెచ్చిరి? ఓవానరులారా! మాజటాయువు నిజముగ మరణించెనా? దశరధ కుమారుడు రాముడు అడవికి ఎందుకు వెళ్ళెను? అతడు తనభార్యను ఏలకోల్పోయెను. జటాయువు రావణునిచే చంపబడెనా? అంతయు నాకు తెలుపుడు" అని బాధతో అరచెను. వానరులు ప్రాణత్యాగమొనర్చుటకు నిర్ణయించుకొనగ, రెక్కలులేని సంపాతి అనాయాసముగ లభించిన ఆహారముగ స్వీకరింపదలచెను. కాని ఇపుడు పరిస్థితి మరియొక విధముగ మారినది. వానరులు లేచి సంపాతి కడకు వెళ్ళి నెమ్మదిగ అతనిని కొండదిగువకు తీసికొని వచ్చిరి. అపుడు వారుమాటలాడి ఒకరి సంగతులనొకరు చెప్పుకొనిరి. సంపాతి తనకధను తిరిగి చెప్పెను. అంగదుడు కిష్కింధయందు జరిగినదంతయు తెలిపి, రామునకెట్లు సహాయమందింపవీలగునని అడిగెను. సంపాతి ముదుసలి, బలహీనుడు. కాని అతని నేత్రములు తీక్ష్ణతను కోల్పోలేదు. అతడు మిక్కిలి దూరము నుండియే చూడగలడు. అతడు సీతలంకయందు బంధింపబడియుండుట చూడగలిగెను. రావణుని రాజ్యసంపదను సవిస్తరముగ వర్ణించెను. సీత రాక్షసస్త్రీలచే చుట్టువారబడి లంకలో కూర్చుండియుండెనో చూచివర్ణించెను.

వానరులానందముతో "ఇపుడు మనము సీతను గురించి అంతయు తెలుసుకొంటిమి. మనకు మరణించు అవసరములేదు. రాముని ప్రయోజనము సాధింపబడును" అని గంతులు వేసిరి. సంపాతి కష్టములు కూడ అంతరించినవి. రామునకు సహాయము చేసినప్పుడు అతనిరెక్కలు తిరిగిపొందగలడని ఈయబడినవరము నిజమయ్యెను.

అతడుమాటాడుచుండగనే చిన్నచిన్నరెక్కలు అతనిప్రక్కలయందుమొలిచి పెరిగినవి. సంపాతి ఇపుడు క్రొత్త అందముతో ప్రకాశించి జటాయువునకు ఉత్తరక్రియలు జరుపుటతో తృప్తినందెను. వానరులు సంపాతివలన రాక్షసులచే సీతబంధింపబడిన ప్రదేశమును తెలిసికొనిరి. శతయోజన ముల సముద్రమునకు ఆవలభూమియందు సీత బందీగా ఉన్నది. కాని ఈవార్తతో సుగ్రీవుని కడకేగుటవలన ప్రయోజనములేదు. సంపాతి వర్ణించినది తమకన్నులతోచూచిగాని అన్వేషణను నిలుపలేరు. అపుడే రాముని పనిని నెరవేర్చుటయగును. కాని అపుడు వారుసముద్రమును దాటవలసియున్నది. వారు నీటి అంచువరకువెళ్ళి చర్చించిరి. "మనము సముద్రమును ఎట్లు దాటగలము? లంకను ప్రవేశించి సీతను చూచి ఎట్లు తిరిగిరాగలము? అని ఆందోళణ, భయములతో వారు దిగ్భ్రమచెందిరి.

"సమస్య ఎంత జటిలమైనదైనను కష్టముకాదు. ఎవరును తమధైర్యము విడువరాదు. ధైర్యమే విజయమూలము. హృదయ ధైర్యమును కోల్పోవుట అనిన సర్వమును కోల్పోవుటయే అని అంగదుడు పలికెను. అంతట తన అనుయాయులందరిని ఎవరెంత ఎక్కువదూరము దూకగలరో నిజము చెప్పుడని అంగదుడు అడిగెను. గజుడను వానరుడు తాను పదియోజనములు దూకగలననెను. గవాక్షుడు ఇరువది యోజనములను, మరియొక వానరయోధుడు ముప్పదియోజనము లను, ఇట్లే ఒకరిని మించి ఒకరు తాము దూకగలిగిన దూరమును వెల్లడించిరి. చివరకు వృద్ధుడగు జాంబవంతుడిట్లనెను. "నేనిపుడు వృద్ధుడను. అశక్తుడను. మనరాజభక్తిని ప్రదర్శించుటకు శక్తి ప్రధానము.

నేను తొంబదియోజనములు ఎగురగలననుకొందును. కాని లంకను చేరుటకు ఈశక్తి చాలదు ". యువరాజు అంగదుడు ఇట్లు చెప్పెను. "నేను నూరుయోజనములుదాటి లంకను చేరగలను. సందేహములేదు. కాని లంకనుండి తిరిగివచ్చుటకు మరియొకసారి దుముకు శక్తి నాకున్నదో, లేదో సందేహించుచున్నాను". జాంబవంతుడిట్లు జవాబిచ్చెను. "యువరాజా! నీవు నీశక్తిని సందేహింపనవసరములేదు. నీశక్తి వాలిశక్తితో సమానమైనది. ఇతరులు తమఆజ్ఞలను ఆచరించువారుండగ యువరాజు ఇట్టిసమస్యను స్వీకరించుట తగదు". అనంతరము జాంబవంతుడు మెచ్చికోలుగ ఆశ్చర్యయుతముగ హనుమంతుని చూచెను. అతడు ఏమియు మాటాడకుండ దూరముగ కూర్చుండి వినుచుండెను. "మౌనముగ కూర్చుండిన వాయుపుత్రుడు ఈసముద్ర లంఘనము చేయుటకు తగిన బలనైపుణ్యములు కలవాడని నాఅభిప్రాయము" అని వృద్ధవానరుడు జాంబవంతుడు హనుమంతుని కడకు నడిచివెళ్ళి అతనిని వారందరమధ్యకు తీసికొని వచ్చెను. వేలకొలది వానరులు వినుచుండగ జాంబవంతుడు హనుమంతుని ఉద్దేశించి "ఓయోధుడా! అన్నివిధముల విజ్ఞానము కలిగియుండియు నీవెందుకు దూరముగ మౌనముగనుంటివి? నీవు సుగ్రీవ మహారాజుతో సమానుడవు. తేజోబలములచే నీవు మమ్ములనందరను మించినవాడవుకదా? రామలక్ష్మణులతో సాటియైన వాడవుకాదా? పక్షిరాజు గరుత్మంతుడు సముద్రమును లంఘించుట చూచితిని. నీభుజబలము గరుడుని రెక్కల బలమునకు ఏమాత్రమును తీసిపోదు. నీజవసత్వములు వినతకుమారునకు ఏమాత్రము తక్కువ

కాదు. కాని నీధీశక్తిని భుజశక్తిని నీవెరుగవు. ప్రపంచమంతటియందు నీతోసమానులెవ్వరునులేరు.

అంజన దేవతాస్త్రీలందరయందు ఉత్కృష్టమైన కన్య. ఒక ఋషీశ్వరుని శాపవశమున ఆమె వానరస్త్రీగ జన్మించెను. ఒకరోజు ఒకపర్వతప్రాంతమున ఆమె స్వేచ్ఛగా తిరుగుచుండగా వాయుదేవు డామెను చూచి ఆమెయందు అనురక్తుడై ఆమెను కౌగిలించుకొనెను. ఆమెకోపించి "దుర్మార్గుడా! ఎవరునీవు? నన్ను అవమానింప ఎవరు ధైర్యము చేసిరి?" అని అడిగెను. అంతట వాయుదేవుడు "కోపింపకుము నాస్పర్శచే నీశరీరము మలినీకృతము కాదు. పవిత్రతను కోల్పోదు. శారీరకముగా కాక మానసికమగు కోరికతో నేను నిన్ను ఆలింగనము చేసికొంటిని. అతిసూక్ష్మమైన ఆలింగనకారణముగ జవసత్వములందు నాతోసమానుడగు ఒక బిడ్డ నీకు జన్మించును. అతడు వానరులందరకంటె బుద్ధిమంతుడును, బలవంతుడును అగును" అని అంజనను శాంత పరచెను. "ఓహనుమంతుడా! నీవు బాల్యమునందు ఉదయించుచున్న సూర్యుని ఒకఫలముగ ఊహించి, దానిని తీసికొనుటకు సూర్యుని దగ్గరకు ఎగిరితివి. నీ అప్రయత్నమైన నిర్భయమైన గంతుచూచి ఇంద్రుడు సూర్యుని రక్షణకొఱకు తనవజ్రాయుధమును నీపై విసిరెను. దానిచే కొట్టబడిననీవు ఒకపర్వతముపై పడితివి. నీదవుడ ఎముక విరిగినది. దీనికి కోపించి నీతండ్రి వాయుదేవుడు తన చాలనములనాపి, నిశ్చలముగనుండెను. జీవులన్నియు గాలిపీల్చుకొనలేక నిశ్చలమైనవి. దేవతలు వాయువును కోపమును విడువుమని బతిమాలి తమఆశీస్సు

లను నీపైకురిపించిరి. బ్రహ్మ, ఇంద్రుడు నీకు వరములనిచ్చిరి. ఏఆయుధమును నిన్ను సంహరింపలేదు. మరణము నీకిష్టమైనపుడు మాత్రమే నిన్ను చేరును. నీవు అమరుడవు. అంజనావాయుదేవులకు జన్మించిన కారణముగ నీవు తేజోబలములందును, తెలివియందును వాయుదేవునితో సమానుడవు. కాని ఇంతబలసంపన్నుడవైన నీవు సన్మార్గుడవు. వినయశీలివి. నీవుమాత్రమే రామకార్యమును నెరవేర్చ గలవు. సముద్రలంఘనము నీకొక సమస్యకాదు. దుఃఖసాగరమున బాధపడుచున్న వానరసైన్యమును నీవేరక్షింపవలెను. సముద్ర లంఘనము చేయగల నీవు నీశక్తిని నిరుపయోగమొనర్చరాదు. నీరూపమును పెంచుము. నీవు గరుత్మంతునితో సమానుడవు. ఒకప్పుడు నేనుకూడ నీయంతబలముగల్గియుండి ఇరువదియొక్కమార్లు భూగోళము చుట్టును ప్రదక్షిణలు చేసితిని. క్షీరసముద్రమధన సమయమందు దేవతల ఆజ్ఞప్రకారము నేను నాల్గుదిక్కులనుండి ఓషధులు సేకరించితిని. కాని నేనిపుడు ముసలివాడను, బలహీనుడను. వానరులందర ఆశనీవే. ఓఅంజనాకుమారా! మేము నిన్ను ప్రార్థించు చున్నాము. నీదివ్యశక్తితో ఆలసింపకుము. నీ నిజశక్తిని జ్ఞప్తికి తెచ్చుకొని ముందుకు దూకుము. త్రివిక్రముని వలె ఒక్కగంతుతో నీవు సముద్రమును దాటగలవు. సముద్రమును లంఘించి మాకష్టములను తొలగింపుము".

వృద్ధుడైన జాంబవంతుడు ఆవిధముగ హనుమంతుని స్తుతించి, అతని శక్తిని అతనికి గుర్తుచేసి అతని ధైర్యమును పెంచెను.

ఒక్కసారిగ సముద్రకెరటమువలె హనుమంతుని శరీరము ఉవ్వొంగెను. వానరులు చూచుచుండగనే వాయుపుత్రుని శరీరము పెరిగెను. అతని దేహకాంతి అంగదుని, అతని అనుచరులను సంతోష అద్భుతములతో నింపెను.

సుందరకాండ

ఇక్కడనుండి రామాయణ కథానాయకుడు హనుమంతుడే. విష్ణు భక్తులు హనుమంతుని విష్ణువునకు రెండవ సేవకునిగను, గరుడుని ప్రథమసేవకునిగను పరిగణింతురు. జాంబవంతునిచే గుర్తుచేయబడిన తన బలసంపద గలవాడై హనుమంతుడు రామకార్యమును నెరవేర్చుటకు నిశ్చయించుకొనెను. ఉత్సుకతతో తన విశ్వాసమునిట్లు ప్రకటించెను. "మీపలుకులు నిజమగుగాక! ఆకాశమున ఎగిరి లంకను చేరుకొని నేను జానకిని చూతును. సందేహములేదు. నేను తిరిగివచ్చి మీకు శుభవర్తమానమును తెత్తును. గంతుపేయుటకు నేను నాపాదమును భూమిపై బలముగనొక్కవలెను. నాఒత్తిడికి ఈపర్వతము నిలువకలదు" అని పలికి అతడు మహేంద్రపర్వతమునధిరోహించెను. అతడు అచట కొంతసేపు తనశక్తినంతటిని పాదమునందుచేర్చి కొన్ని అడుగులునడచెను. పర్వతమందలిజీవులు దానిని భరింపలేక బయలుపెడలెను. మహేంద్ర పర్వతముపై నిలిచిన హనుమంతుడు యోగముతో కేంద్రీకృతమైన తన మనస్సును, దృష్టిని లంకాపట్టణముమీదకు ప్రసరించెను. "నేను వెదకి

సీతను కనుగొందును. నేను ఆకసమున ఎగిరి సముద్రమును దాటుదును" అని తనలో అనుకొనెను. ఈనిశ్చయముతో సూర్య, ఇంద్ర, వాయు, బ్రహ్మాది దేవతలను ప్రార్థించెను. అనంతరము తూర్పునకు తిరిగి తనతండ్రి వాయుదేవునకు వందనమాచరించి తనదేహమును పెంచుకొని దక్షిణమునకు తిరిగెను. అతడు తనపాదములతోడను, చేతులతోడను మహేంద్రగిరిని గట్టిగ అణచెను. ఆఒత్తిడికి చెట్లనుండి పూలురాలి కొండను కప్పెను. తిరుగులేని విధముగ అతని పాదములచే అణచబడిన పర్వతము, ఏనుగుచెక్కిళ్ళనుండి మదమును స్రవించినట్లు నీటి ప్రవాహములను ఎగజిమ్మెను. జంతువులు గుహలనుండి బాధతో అరచుచు బయలువెడలెను. సర్పములు విషమును కక్కుచు రాతిని కరువగ విషాగ్నికణములు వెలువడెను.

హనుమంతుని రోమములు నిలబడినవి. అతడు తనతోకను నేలపైకొట్టి గర్జించెను. అతడు తనదేహమందలి వెనుక అవయవములను సంకోచింపజేసెను. ఊపిరి బిగించెను. పాదములను అణచెను. చెవులు వంచుకొనెను. తనకండరములను బిగించెను. పెద్ద అరపుతో ఆకసములోనికి లేచి గరుడునివలె, రామబాణమువలె ఎగిరెను. అతని గమన వేగమునకు చాలవృక్షములు వేళ్ళతోసహా పెకలింపబడి అతనిని అనుసరించెను. సాగనంపుచున్న స్నేహితునివలె కొంతదూరము వెళ్ళి పూలను కురిపించి క్రిందపడిపోయెను. ఇంద్రునిచే నరుకబడిన రెక్కలుగల పర్వతములవలె ఒక్కొక్కవృక్షమే సముద్రమునందు పడినవి. అందమైన పూలచే కప్పబడిన సముద్రము, నక్షత్రములతో వెలుగొందు

ఆకసమువలెనున్నది. ముందుకు ఎగురుచున్న హనుమంతుడు ఆకాశమును మ్రింగబోవుచున్నట్లున్నది. ఎగురుచున్న హనుమంతుని చాపబడిన చేతులు, అయిదుతలల పాములవలెనున్నవి. అతని కన్నులు మండుచున్న పర్వతారణ్యములవలెను, ఎఱ్ఱని ముక్కు సాయంతన సూర్యునివలెను ఉన్నవి. అతడు ఎగురుచుండగ గాలి హోరుపెట్టెను. అతని క్రిందభాగమున అతని నీడ సముద్రపునౌకవలె పయనించెను. మేఘములచేకప్పబడి మరల బయలు పడుచున్న అతడు ఆకాశమున పయనించు చంద్రునివలెయుండెను. గంధర్వులు పూలను కురిపించిరి. దేవర్షులు ఆశీర్వదించిరి. సమయోచితముగ ధైర్యము, ముందుచూపు, నైపుణ్యములతో తన పయనమును హనుమంతుడు సాగించెను. అతని మార్గమునందు సముద్రమునుండి మైనాకమను ఒకపెద్దపర్వతము పైకిలేచి నిలిచెను. హనుమంతుడు ఆమైనాక పర్వతమును తనవక్షస్థలముతో దెబ్బకొట్టి గాలిచేకొట్టబడిన మేఘమువలె ఆపర్వతమును అణచెను. మైనాకుడిట్లనెను . "కుమారా! నేను మైనాక పర్వతమును. సగరవంశజుడైన శ్రీరామ సహాయమునకు సముద్రుడు నన్ను పంపెను. సముద్రము ఆవంశమునకు పూర్వ స్నేహితుడు. ఆసంబంధముతో నీవిచట కొంతవిశ్రమించి రామకార్యమునకు వెళ్ళవచ్చును. వజ్రాయుధముతో ఇంద్రుడు పర్వతములరెక్కలు నరికినపుడు సముద్రుడు నన్ను దాచి రక్షించెను. నాకురక్షణనిచ్చిన సముద్రుడు ఇపుడునీకు సహాయపడుమని ఆజ్ఞాపించెను. నీతండ్రి వాయుదేవుడు ఇంద్రుని వజ్రాయుధమునుండి తప్పించుకొనుటకు నాకు

సహాయము చేయలేదా? నీవు మాఆతిథ్యమును స్వీకరించి ఇచట కొంతసేపు విశ్రమించిన సముద్రుడును, నేనును సంతసింతుము".

కాని హనుమంతుడు మైనాకుని వేడికోలునకు లోబడక సౌమ్యముగా నిట్లుచెప్పెను. "స్నేహితుడా! నేను ఆగలేను. నేను సమయమును విడుచుకొనలేను. నేనీవిషయమున ఆలస్యమును భరింపలేను. నీదయగలమాటలే నాకు సంతోషకరములు". అతడు అనురాగముతో పర్వతమును తనచేతితో ఒకమారు తాకి ముందునకు సాగెను. తరువాత ఒకపెద్ద ఆకారము అతని మార్గమునందునిలిచి ఇట్లనెను. "నానోటిలోనికి ప్రవేశింపుము. నేను చాలకాలము ఆహారము లేకయుంటిని. కుతూహలముగ నీకొఱకు ఎదురుచూచుచుంటిని". ఆరాక్షసి తననోటిని పర్వతగుహవలె తెరచెను. హనుమంతుడు "రామకార్యమును నిర్వర్తించుటకు నేను వెళ్ళుచున్నాను. నన్ను ఆపకుము" అనెను. "వీలు పడదు. నీవునానోట ప్రవేశింపవలసినదే" అని రాక్షసి పలికెను. హనుమంతుడు వేగముగ ఆలోచించి నిర్ణయించెను. అతడు తనశరీరమును కొంచెముకొంచెముగ పెంచనారంభించెను. రాక్షస రూపమును ధరించిన నాగవనిత సురస తననోటిని పెద్దగావెడల్పుచేసెను. ఆరాక్షస ముఖము అతిపెద్దదైనవెంటనే హనుమంతుడు సూక్ష్మరూపము నంది ఆరాక్షసముఖమున ప్రవేశించి పరుగున బయటకు వచ్చెను. తరువాత తనస్వరూపమును పెద్దచేసెను. అప్పుడతడు నవ్వుచు నీకోరికను నేను తీర్చితిని. నేను నీనోటియందు ప్రవేశించితిని. నీకింకేమి కావలెను? అని పలికెను. అంతట ఆనాగదేవత "నీప్రయత్నము

జయించును. దేవతలు నిన్ను పరీక్షచేయదలచి నన్నాజ్ఞాపింపగ నేనిట్లు చేసితిని. నీవు చేయుచున్న రామకార్యము తప్పక విజయమును సాధించును" అని ఆశీర్వదించెను. అతడు ఆకాశమున ఎగురుచుండగా, ఎదురుగాలిచే నౌకవేగము నిరోధింపబడినట్లు, తనవేగము నిరోధింప బడుచున్నట్లు గుర్తించెను. ఏదోపెద్దశక్తి తనను పట్టుకొని క్రిందకు లాగుచున్నట్లు తోచెను. అతడు నలుదిక్కులు పరికించెను. కారణము తెలిసెను. ఒక పెద్దరాక్షసి తననీడను ఆధారముగ పట్టుకొని తనను క్రిందకు లాగుచున్నట్లు గ్రహించెను. ఆరాక్షసి "రమ్ము...రమ్ము... నీకొఱకు చాలకాలముగ నిరీక్షించుచుంటిని. నాఆకలిని ఎంతోసేపు భరింపలేను" అనుచు తననోటిని పర్వతగుహవలె తెరచెను. వెంటనే హనుమంతుడు ఆమెనోట ప్రవేశించి, ఆమె ప్రేగులు త్రెంచి బయటకు వచ్చెను. ఆరాక్షసి చచ్చి ఆనీటములిగెను. గ్రహణమునుండి వెలువడిన చంద్రునివలె హనుమంతుడు ప్రకాశించుచు ప్రయాణించెను.

ఆవిధముగ తన ధైర్యముతోడను, బలముతోడను సముద్రమును లంఘించి అరటి, కొబ్బరి చెట్లతోనిండిన లంకాపట్టణ తీర ప్రాంతమును చేరుకొనెను. ఆద్వీపతీరమున తోటలను, పర్వతములను, అడవులను, నదీముఖములను అతడు చూచెను. హనుమంతుడు రావణరాజ్య సంపదను, లంకాపట్టణసౌందర్యమును చూచెను. "నేను నాగమ్యమును చేరితిని. నేనెవరో, ఎందుకువచ్చితినో, రాక్షసులకు తెలియ కుండ సీతదాచబడిన ప్రదేశమును నేను వెదకి తెలిసికొనవలయును" అని హనుమంతుడు తనలోతాను తలచెను. అతడు తనరూపమును

తగ్గించుకొని సామాన్యవానరాకారముతో లంకయందు ఒకపర్వత శిఖరముపై దిగెను. ఆశాపూరితుడై హనుమంతుడు దిగి లంకలో కాలుమోపెను. కాని అచటహనుమంతుడు ఆలోచనలోపడెను. "నిజమే నేను సముద్రమును దాటితిని. నాప్రయత్నమునందు ఇదియే మొదటిదశ. త్రికూటపర్వతముపై రావణుని సుందరపట్టణము కలదు. ఆపట్టణము సంపదలతో సుందరముగనున్నది. ఆనగరము, కోటయు అమరావతికి, భాగవతికి ఏమియుతీసిపోవు. సుందరమగు ఉద్యాన వనములును, పెద్దభవనములును, రక్షణయంత్రములును, లోతైన కందకములును మున్నగునవి నాకు ఆశ్చర్యమును, విచారమును కల్గించుచున్నవి. ఎవరు రావణుని ఎదిరించి జయించగలరు? నేనిపుడు దాటినసముద్రమును ఒకసైన్యము ఎట్లుదాటగలదు? ఒకచో సైన్యము సముద్రమును దాటినను, ఈదరికి చేరినను సాయుధులైన యోధులచే సంరక్షింపబడుచున్న ఈకోటను ఎట్లు ఎదిరించి జయింపగలరు? కపటము గాని, శక్తిగాని దీనిని జయింపలేదు. కాని ముందుగా సీతజీవించి యున్నదా లేదా? అన్నది కనుగొనవలెను. మిగిలిన ప్రశ్నలు ఇంకను కలవు. సురక్షితమైన ఈనగరమును నేను ఎపుడు ఎట్లు ప్రవేశించుట మంచిది? సీత ఎక్కడ దాచబడినదియు కనుగొనవలెనన్న నేను లంకను సమగ్రముగ వెదుకవలెను. ఆలోచనారహితముగ ఏదేని తప్పుచేసినచో నాతొందరపాటు, నిర్లక్ష్యము కారణముగ గొప్పకార్యము చెడగలదు. నేను పగటి భాగమున పట్టణమును ప్రవేశించినచో అది రాక్షసులచే గమనింప బడును. నేను రాత్రినగరము లోనికేగుట మంచిది. కాని నేను

ఏరూపముతో ప్రవేశించవలెను? అనుమానమును తొలగించుటకు అస్పష్టమైన చిన్న ఆకారమును ధరింపవలెను".

తనఆలోచనకు తగినట్లుగా హనుమంతుడు పిల్లితో సమానమగు చిన్నకోతిరూపమునకు తనశరీరమును కుదించుకొనెను. ఈవిశాలమైన నగర భవనములందును, ఉద్యాన వనములందును ప్రవేశించి వెదకుటకు ఈరూపము అనుకూలముగనుండును. ప్రస్తుత రూపము సాధారణ రూపముకంటె అతిచిన్నది. సముద్రమును లంఘించిన రూపము అతి పెద్దది. ఇపుడు సూర్యుడస్తమించెను. చిన్నవానరుడు కోటగుమ్మమువంక నడచెను. చంద్రుడు ప్రకాశవంతముగ ప్రకాశించెను. హనుమంతుడు సంతోషించి అన్వేషణాసహాయములకు చంద్రునకు కృతజ్ఞుడయ్యెను. దూరమునుండి రావణ రాజధానియొక్క సంపత్సౌందర్యములు హనుమంతుని ఆశ్చర్యపరచెను. బంగారము, వజ్రములతో ప్రకాశించు లంకాపట్టణము ఇంద్రుని అమరావతి, కుబేరుని అలకాపురివలె తోచినది. రామదూత అట్టి సంపద, సైన్య శక్తియుగల యజమానిని జయించుట ఎట్లని ఆశ్చర్యాందోళణలను పొందెను. అట్లు వచ్చుచున్న హనుమంతుడు ఆపట్టణ రక్షణ దేవతచే మోటుగ అడ్డగింప బడెను. "ఓబాల వానరమా! ఎవరునీవు? ఇక్కడకెట్లు రాగలిగితివి? ఇక్కడ ఎందుకున్నావు? నిజము చెప్పుము".

"నిజమే నేను నిజముగ చిన్నకోతినే. ఈఅందమైన పట్టణమును చూడవచ్చితిని. నేను ఈపట్టణమంతట తిరిగి అన్నీచూచి తృప్తి చెందినతర్వాత నేను మరలి పోవుదును" అని హనుమంతుడు

జవాబిచ్చెను. ఆదేవత కోపముతో వానరునిపై ఒక దెబ్బకొట్టెను. హనుమంతుడు నిర్లక్ష్యముగ ఎడమచేతితో దెబ్బకొట్టెను. ద్విగుణీకృత వేదనతో ఆమె క్రింద పడెను. ఒక కోతి ఎపుడు వచ్చి ఒక్కదెబ్బతో తనను పడగొట్టునో అపుడు తనచే రక్షింపబడు పట్టణము నశించును, అనిన జ్యోతిషశాస్త్రజ్ఞుల మాట ఆమెకు గుర్తుకు వచ్చెను. "రావణుని పాపము లనేకములు, దుఃఖకరములును. లంకాపట్టణ నాశము సమీపించు చున్నది. దేవతలమాటలు నెరవేరబోవుచున్నవి" అని తనలోతాను అనుకొన్నది. ఆమె ప్రక్కకు తప్పుకొన్నది. ఆలంకాధిదేవత లంకిణి రావణుని సేవకురాలుకాదు. ఆపట్టణ శక్తిమాత్రమే.

హనుమంతుడు ప్రాకారకుడ్యమునెక్కి పట్టణములోనికి దుమికెను. శత్రువులు పట్టణముఖద్వారముగుండాకాక కోటగోడనెక్కి దుమికి కోటలోప్రవేశింపవలెనని ప్రాచీనసాంప్రదాయము. రాక్షసుల నాశమునుకోరి హనుమంతుడు లంకాపట్టణ కోటలోనికి తనఎడమకాలు ముందుమోపి ప్రవేశించెను. అందమైనపూలచే పరువబడిన రాజమార్గము వెంబడి హనుమంతుడు వెళ్ళెను. మెరుపులతోకూడిన మేఘమువలె నున్న ఆపట్టణసౌందర్యమును మెచ్చుచు అతడులోన ప్రవేశించెను. భవనోపరిభాగములు, వీధులును చక్కగ అలంకరింపబడియున్నవి. చక్కని సంగీతధ్వనులు వినవచ్చినవి. అందమైనస్త్రీలు అందెలధ్వనులతో తిరుగుచున్నారు. పట్టణమంతయు ఆనందోత్సాహములతోనున్నట్లు ధ్వనించుచున్నది. కొన్ని గృహములందు వేద మంత్రములు వినిపించు చున్నవి. మరికొన్ని గృహములందు రావణుని కీర్తిని వర్ణించుగీతములు

ఆలపింపబడుచున్నవి. అంతటా రక్షకభటులు కలరు. వీధులయందలి జనులు మతసంబంధమైన దీక్షలయందు నిమగ్నమైయుండిరి. కొందరు క్రూరముగను, అసహ్యకరముగను కలరు. రక్షకభటులు ధనుర్బాణములును, ఖడ్గములును మున్నగు ఆయుధములను ధరించియున్నారు. యోధులందరును కవచములు ధరించియున్నారు. కొంతమంది అందముగను, కొందరు అసహ్యముగను ఉన్నారు. వివిధవర్ణములు కలిగియుండిరి. కొందరు పొడుగుగను, కొందరు మిక్కిలి పొట్టిగను ఉండిరి. ఆవిధముగ వివిధప్రాంతములనుండి, వాతావరణములనుండి వచ్చిన జనులు, అనేకప్రాంతముల నుండి సైన్యములలోనికి సైనికులుగ నియమింపబడినట్లున్నారు. భవనోపరి భాగములందు అందమైనస్త్రీలను, కొందరు భర్తలతోకలసియున్నవారిని హనుమంతుడు కనుగొనెను. బంగారు శరీరచ్ఛాయలతోనున్న యువతులను చూచెను. కొందరు భవన ఉపరితలమునందు కూర్చుండియున్నారు. కొందరు పాన్పులపై పరుండి, కొందరు నృత్యములు చేయుచు, మరికొందరు పాటలుపాడుచునున్నారు.

ఎందరో అందమైన స్త్రీలను చూచెను. కాని రామునికొఱకు బాధపడుచున్న సీతను కనుగొనలేదు. అంతమంది సుందరులను చూచుట వలన హనుమంతునిహృదయము నిరాశతో, విచారముతో నిండినది. అతడు చాలమంది రాక్షసుల ఇండ్లలో ప్రవేశించి పరిశీలించెను. అచ్చట ఏనుగులును, గుఱ్ఱములును, రథములును, ఆయుధధారులగు యోధులును ఉన్నారు. చాలభవనములును, ఉద్యాన వనములును దాటినతర్వాత మిక్కిలి ప్రకాశవంతమైన గొప్పభవనము

కడకు వచ్చెను. రథగజాశ్వపదాతి యోధులతో రక్షింపబడుచున్న అందముగ, ధనవంతముగ అలంకరింపబడిన ఆభవనమును చూడగనే అది లంకాధిపతి రావణుని భవనమని హనుమంతుడు తలచెను. ఆభవనములోనికి ప్రవేశించెను. ఎక్కడచూచినను, భూమియందలి స్వర్గమువలె అన్నివిధముల రావణుని శక్తిసంపదల వెలయించుచున్నది. ఉద్యానవనము, ఆడుకొనుచున్నపక్షులతో, దేవతాయతనములు అంతటా వ్యాపించియుండగ హనుమంతుడు చూచి ఆశ్చర్యపడెను. "ఆహా! ఏమిసంపద? ఏమిసౌందర్యము?" అని హనుమంతుడు మెచ్చుకొనెను. తాను వచ్చిన పని సీతను కనుగొనలేకపోయితినను దుఃఖము అతని ఆశ్చర్యమును అధిగమించెను. ఎన్నోభవనములగుండా పయనించి రావణుని అంతఃపుర భవనమునందు ప్రవేశించెను. అది అన్ని భవనములకన్న మిన్నగ దేవతల నివాసమువలె అత్యంత ధనవంతముగను భోగవంతముగను ఉండెను. ఎక్కడ చూచినను బంగారము, వెండి, వజ్రవైడూర్యములు, అందమైన తివాసీలును, ఆసనాదులతోనలంకరింపబడి యున్నది.

ఆభవనములనడుమ హనుమంతుడు పుష్పకవిమానమును చూచెను. కుబేరునిచే బ్రహ్మనుండి పొందబడిన మహిమాన్విత ప్రయాణసాధనము పుష్పకవిమానము. కుబేరుని జయించి రావణుడు దానిని లంకకు తెచ్చెను. వశిష్ఠుని ధేనువునుండివలెనే, పుష్పక విమానమునుండికూడ కోరిన వస్తువులనన్నింటిని పొందు వీలుకలదు. ఇప్పుడు హనుమంతుడు ప్రవేశించిన రావణుని మందిరము ఆనంద

సాగరమువలెనున్నది. విశాలమైన గదియందు లెక్కలేనంతమంది అందమైనస్త్రీలు నిదురించుచున్నవారు పరుండియుండిరి. ఒకరిచేతులు మరియొకరితో పెనవేసుకొని స్వేచ్ఛగ నిర్లక్ష్యధోరణిలో అస్తవ్యస్తముగ నిదురించిన స్త్రీలతో ఆప్రదేశము పూల లతలతో అందమైన వనమువలె దృగ్గోచరమగుచున్నది. ధర్మముచేనదుపునందుంచుకొనబడిన మనో నిబ్బరముతో ఒకరిని మించిన అందముతో వెలయుచున్న మరియొకరు గల ఆసుందరస్త్రీలనందరను వారియందు ఎక్కడైనను సీత ఉన్నదేమోనని పరిశీలనగ హనుమంతుడు చూచెను.

ఇంతమంది సుందరీమణులను చూచినతరువాత, ఏరూపమునైనను ధరించి అందరు స్త్రీలను సంతోషపరుపగల శక్తిసామర్థ్యములు గలవాడు రావణుడని హనుమంతునకు తోచెను. "ఈగుంపునందు సీతలేదని నిశ్చయము. ఈస్త్రీల సముదాయమందు సీతకొఱకు వెదకిననేను చాలతెలివితక్కువ వాడను. ఆమె ఉండదగిన ప్రదేశమిదికాదు" అని హనుమంతుడు తనలోతాననుకొనెను. అంతట అతడు మరియొకచోటకు వెళ్ళెను. ఆగదియందతడు చాలపానుపులు చూచెను. అన్నియు బంగారము, వజ్రములతో అలంకరింపబడినవే. వానియందు ఉత్తమమైన పాన్పుపై మరియొక మేరుపర్వతమువలె చాచుకొని పరుండిన రావణుని చూచి, అతని రూపమును తేజస్సును కనుగొని హనుమంతుడు ఒక్కక్షణము వణకెను. నిద్రించుచున్న రాక్షస రాజు అవయవముల పొందిక, బాహుబలము, తేజస్సు, సౌందర్యములను చూచుచు అందమును, భయంకరమునైన అతని రూపమునకు

హనుమంతుడాశ్చర్య చకితుడయ్యెను. చుట్టును గల పాన్పులపై పాటలు పాడుచు, వాద్యములు వాయించుచు, గాఢనిద్రలోమునిగిన స్త్రీలను చూచెను. చివరిసారిగ ఒకదివ్య సుందరమైన వనితను చూచెను. ఆఅవయవముల పొందిక, సౌందర్యము చూచిన హనుమంతుడు ఆమె సీతయగునేమో అని ఊహించెను. సంతోషముతో గంతులు వేసెను. మరు క్షణము తనబుద్ధిహీనతను నిందించుకొనెను. "సీత ఇట్లు పరభవనమున అలంకరించుకొని నిర్లక్ష్యముగ నిద్రింపగలదా? నాఈఆలోచనే పాపకరము" అని తనదోషమునకు విచారించుచు సిగ్గుపడెను. "ఆమె ఈరాక్షసునకు లోబడని కారణముగ అతడామెను చంపియుండుననియు, ఈఅన్వేషణను కొనసాగించుటవలన ప్రయోజనముండదనియు" తలచెను.

ఇంతవరకు హనుమంతుడు రావణుని భవనాంతర్భాగ ములను వెదకెను. పడకగదులు, భోజనశాలలు, పానశాలలు, సంగీత శాలలు మున్నగునవన్నియు వెదుకబడెను. కాని సీతజాడ గుర్తింపబడ లేదు. "నియమ విరుద్ధముగ నేను అన్ని భవనములందును ప్రవేశించి అణువణువున, ప్రతిస్త్రీని పరిశీలించి వెదకితిని. కాని అంతయు వ్యర్థ మయ్యెను. రావణుని భవనమంతట ప్రతి అంగుళము వెదకితిని. లంక అంతయు వెదకితిని. ఇంక ఇక్కడ నేనేమిచేయగలను? సీతను చూడకుండ తిరిగివెళ్ళుటయా? లేదు. లేనిచో నాప్రాణములను త్యజించ వలెను. అవును అదేనేను చేయతగిన ఒకేఒకపని" అని తలచి మరల అట్టినీచమైనభావము కలిగినందులకు తనను తాను నిందించుకొనెను. అతడు మరల అంతటా ఇంతకుముందు తాను చూచిన ప్రదేశములే

మరింతపరిశీలనతో వెదకెను. అక్కడ అందమైన స్త్రీలును, అసహ్యమైనవారును, అందమైన మానవనాగ కాంతలును రాక్షసులచే బంధింపబడినవారుకలరు. కాని సీతకానరాలేదు.

"సీతను చూడకుండ కిష్కింధకు వెళ్ళిన, రాముడు తప్పక మరణించును. పిమ్మట ఇతరులు ఏమగుదురు? సుగ్రీవునికడకు వెళ్ళి నాప్రయత్నము లన్నియు వ్యర్థమైనవని తెలుపుటకంటె ఇచటనే సముద్రతీరారణ్య ప్రాంతమున నాజీవితముగడపుట మేలు. మరణించుట ఉత్తమము. కాని సంపాతి సీతను లంకలో చూచితినని చెప్పెను. సంపాతి చూచిన తరువాత సీత రాక్షసులచే చంపబడినదా? అన్నీసందేహములే. ఏమి చేయవలెను?" అని హనుమంతుడు ఆలోచించెను. అంతట హనుమంతుడు ఆభవనముల పార్శ్వమున పెద్ద గోడలచే ఆవరింపబడిన ఒక ఉద్యానవనమును చూచి ఈవనమును మాత్రము నేను వెదుకలేదు. సీత తప్పక ఈవనమున ఉండియుండునని తలచుచు ఉత్సాహము నందెను. వాయుపుత్రుడు రాముని ధ్యానించి, ఉన్నతమైనగోడలచే పరిరక్షితమగు వనమును చూచి సీత ఈవనమున తప్పక ఉండునని అనుకొని మరియొకమారు దేవతలకు నమస్కరించి ఎగిరి అశోకవన కుడ్యములపై కూర్చుండి ఆసుందర వనమును పరిశీలించెను. హనుమంతుడు అశోకవనకుడ్యముమీద నిలువగానే అతనికి కారణము తెలియకపోయినను అతని శరీరమంతట, హృదయమును ఆనందముతో నిండిపోయినది.

అది వసంతకాలమందలిరాత్రి తెల్లవారుజాము. చెట్లు, మొక్కలు పూలతోనిండియున్నవి. దట్టముగ చెట్లసముదాయముగల ప్రదేశమునకు హనుమంతుడు దూకెను. ఈఅవాంతరము వలన నిద్రించుచున్న పక్షులు మధురమైనకూతలు కూయుచు ఎగిరినవి. లేళ్ళు మొదలైన మృగములు కదిలినవి. చెట్లకొమ్మలనుండి రాలినపూలు హనుమంతుని శరీరమును కప్పినవి. జీవులన్నియు పూలచేకప్పబడిన హనుమంతుని సౌందర్యరూపమును చూచి వసంతుడు తెల్లవారుజామున ఈవనమును చూడవచ్చెనని తలచెను. సరోవరములును, బంగారము వెండితో అలంకరింపబడిన మేడలును, స్ఫటికసోపానములును, కృత్రిమ పర్వతములును , జలపాతములతో హనుమంతునకు వనసౌందర్యము సంతోషమును కలిగించెను. కొన్ని చెట్లచుట్టును బంగారు అరుగులు కలవు. చెట్లకుగల గంటలు గాలికి మ్రోగుచున్నవి. మొదలుచుట్టును బంగారుతిన్నెగల ఒక ఆకులతోదట్టమైన చెట్టుపై దాగి హనుమంతుడు కూర్చుండెను. "సీతలంకలో జీవించియుండిన ఆమెకు తోటలనినఇష్టమని రాముడు చెప్పినాడుకావున తెల్లవారుజామున సీత పూజకొఱకు ఇక్కడకు తప్పక వచ్చునని" హనుమంతుడు అనుకొనెను. తననుతాను దాచుకొనుచు చెట్లఆకులసందులనుండి హనుమంతుడు అంతటా తొంగిచూచుచు చెట్టుకొమ్మపైకూర్చుండి క్రిందకు చూచెను. ఆచెట్టుకడ నున్న అరుగుపై దివ్యసౌందర్యముతో కూర్చుండిఉండిన ఒకస్త్రీమూర్తిని చూచెను. ఆమె సన్నముగ, శుక్లపక్షప్రారంభమందలి చంద్రునివలెను, మలినమైన నారచీరను ధరించిన ఆమె బురదతోనున్న పద్మమువలె

నున్నది. ఆమెముఖము కన్నీటితో స్నానము చేసినట్లున్నది. ఆహారపుకొరతచే సన్నమైనదిగనున్నది. విచారముతప్ప మరిఏ ఆలోచనయు లేదామెకు. ఆమెనుచూచి ఈమెయేసీత అయియుండును, రాముడు రావణునిచే అపహరింపబడినపుడు సీత శరీరముపైగలవని తెలిపిన ఆభరణములలో కొన్ని ఆమెచే ఋష్యమూక పర్వతముమీద విసరబడిన నగలను పోలిననగలు ఇపుడు చెట్లకొమ్మలపై వ్రేలాడదీయబడి కనిపించుచున్నవి. ఆమెకట్టిన వస్త్రముకూడ మలినమైనదైనను మనము నగలమూటగ చూచిన వస్త్రభాగమే. ఈసుందరవనిత శ్రీరాముని ప్రేమాస్పదురాలైన రాణియగు సీతయే. హనుమంతుడా వనితను చూచుచుండగా అతని హృదయము తిరిగిసముద్రమును దాటి భక్తితో రాముని పాదములనుతాకెను.

"ఈదివ్య నారీరత్నముకొఱకే వానరశ్రేష్ఠుడు పరాక్రమ మందు రావణసముడు వాలి మరణించెను. ఈమెకొఱకే విరాధుడును, కబంధుడును మృత్యువును సమీపించిరి. జనస్థానమునందు ఖరదూషణ త్రిశిరాదులు తమ అనుయాయులతో పదునాల్గువేల రాక్షసులతో సంహరింపబడిరి. ఈమెకొఱకే వానరరాజ్యము వాలినుండి సుగ్రీవునకు ఈయబడినది. ఈమెకుసేవచేయుటకే నేను నదీనాధుడు సముద్రునిదాటి ఇపుడులంకయందున్నది. ఇవన్నియుకాక రాముడు సీతకొఱకే ఈ ప్రపంచము నాశముచేయదగును" అని హనుమంతుడు సీతను కనుగొని తనలోతాననుకొనెను. హనుమంతుడు ఆకులమధ్యకూర్చొని సీత ముఖమును మరియొకసారిచూచెను. ఆమెను రక్షించుచున్న రాక్షసస్త్రీలు

చాల అసహ్యముగనున్నారు. ఒకామె ఒకేకన్నుకలది. మరియొకతె ఒక్కచెవిగలది. కొందరు చెవులులేనివారు. కొందరుముక్కులు లేనివారు. కొందరుపెద్ద ఉదరము కలవారు. కొందరు ఒంటిపెదవులుకలవారు. పులిముఖము కలవారు, దున్నపోతుముఖముకలవారు, మున్నగు వికృతరూపులగు రాక్షసస్త్రీలు చేత ఆయుధములు ధరించియున్నారు. వీరందరనడుమ ఆధారములేని పూలతీగవలె నేలపై పడియున్నది సీత.

ఉషోదయసమయమున రావణుడు వేదమంత్రములు వినిపించుచుండగా నిద్రమేల్కొంచెను. లేవగానే సీతనుగురించి ఆలోచించి, ఆమెదాచబడిన అశోకవనమునకు బయలుదేరెను. రాజలాంఛన శ్వేతాత పత్రములతో అనుయాయులు వెంటరాగా దివ్యాభరణములును శ్వేత వస్త్రములును ధరించి మరియొకమన్మధుని వలె రావణుడు రాజభవన పార్శ్వ ఉద్యానవనమును ప్రవేశించెను. స్త్రీలకాలి అందెల ధ్వనులతో రావణ అనుయాయుల బృందము వనద్వారమును చేరగానే సమీపించు చున్న రావణుని చూచిన హనుమంతుడు మరింతదట్టమైన ఆకులవెనుక దాగిచూచుచుండెను. రావణుని చూడగానే సీతశరీరము వణకెను. సీత అంగీకారమును పొందుటయందాశతో రావణుడు సీతను సమీపించెను. సీతదేహము ధూళిధూసరితమైయున్నది. ఏఆభరణములును ధరింపక పోయినను సర్వాభరణ భూషితవలెనున్నది. ఆమె అందమైన చెట్టుపడిన రీతిగను, నలువైపుల అగ్నితో తపింపబడునట్లుగను, ఎండిపోయిననది వలెను, ఏనుగులచే ధ్వంసమొనర్పబడిన పద్మసరోవరమువలెను, పూలతీగ పెకలింపబడి ప్రక్కనపడవేసినట్లును శోభతగ్గియున్నది.

రావణుడు సమీపించగనే సీతమనసు రాముని కడకుపోయినది. "వారెపుడు వత్తురు? అసలువారువత్తురా?" అని తనలోతాను ప్రశ్నించుకొని దైవధ్యానముచేసికొనెను. రావణుడు సమీపించి సీతతో మాటలాడెను. హనుమంతుడు క్రిందజరుగుచున్నదానిని వృక్షముపైనుండి పరిశీలించుచుండెను. విచారసాగరమున మునిగి, ధర్మమును గురించి, తనభర్తను గురించి ఆలోచించుచున్న సీతతో రావణుడు ఇట్లుపలికెను.

"ఓసుందరీ! నన్ను చూచి భయపడెదవేల? బలాత్కారముగ ఇతరులభార్యలను లోబరచుకొనుట రాక్షసధర్మమైనను నేను నీకడ భిక్షుకుడనే. నీఅనుమతిలేనిదే నేను నిన్ను తాకను. భయపడకుము. ఓసుందరీ! నీతోసమమగువారు ప్రపంచమునందెవ్వరును లేరు. నూతన వస్త్రాభరణముల విడిచి నీజవ్వనసౌందర్యమును వ్యర్ధముచేయుట తగదు. నిండుచంద్రునిపోలిన నీముఖము నుండి నాచూపును మరలింపలేను. ఇంతసౌందర్యముకలనీవు బాధపడనెందులకు? నన్ను అంగీకరించి ప్రపంచమందలి అన్నిభోగములననుభవింపుము. నేను, నాసంపద, ఈ రాజ్యము సమస్త భూమండలము నీదే. నాబలము దేవాసురులందరకు తెలుసు. నావారందరును నిన్ను సేవింప సంతోషముతోనెదురు చూచుచున్నారు. రాజ్యభ్రష్టుడై అరణ్యములందుతిరుగు రాముడేమి చేయగలడు? అతడిపుడు జీవించియున్నాడా? అనునది సందేహమే. నీవున్న ఈపరిస్థితి యందుకూడా నీవు నాఇతర భార్యలనుండి నన్ను నీవైపు లాగుచున్నావు. నీవు నారాణివై ఇతరభార్యలపై అధికారము చలాయింపవచ్చును. రాముడేవిధముగను నాకుసాటికాదు. నాతోకలిసి

సమస్త సుఖములననుభవింపుము" అనుచు రావణుడు తన ప్రేమను వెల్లడించెను.

రావణుని మాటలను విని సీత ఒకగడ్డిపరకను త్రుంచి మధ్యలోనుంచి నవ్వుచు రావణునితోనిట్లు పలికెను. "రావణా! నాగురించి అట్టి వ్యర్థపుటాలోచనలను ప్రక్కకు పెట్టుము. నన్ను కోరుట నీకేవిధముగను సమంజసముకాదు. నీభార్యలవైపు నీమనసును మరలించుకొనుము. నీవు చెప్పు నీచపు ప్రవర్తనకు నేనెన్నడును అంగీకరింపను. నేను పుట్టిన, మెట్టిన వంశములగురించి ఆలోచించి తెలివితక్కువ కోరికలను విడిచిపెట్టుము. ధర్మము నతిక్రమింపకుము. పాపపుమార్గము ననుసరింపకుము. నీవు నీభార్యలనితరులస్పర్శ లేకుండునట్లు రక్షించుకొన్నరీతిగ, ఇతరులు తమభార్యలను రక్షించుకొన వలదా? పరస్త్రీవ్యామోహము నీవు, నీవంశమును, నీరాజ్యసంపదల నాశమునకే కారణమగును. నీమంచికోరి చెప్పుచున్న నామాటలను వినుము. రాముని వినయముగ క్షమింపుమని కోరుము. అతని క్రోధమునుండి తప్పించుకొనుము. నీనాశమును వెదకుకొనుచు పోకుము. రాముడు దయామయుడు. నీవు కోరినచో అతడు తప్పక నిన్ను దయతోక్షమించును. క్షమార్పణకోరి క్షేమముగనుండుము. రాముడు జనస్థానమునందున్న నీరాక్షస సముదాయమును ఒంటరిగ అవలీలగ సంహరించుట నీకు తెలియనిదా? అతని జవసత్వములు తెలిసియే, నీవు కపటోపాయముతో దొంగవలె నన్ను అపహరించితివి. నీవు వారితో యుద్ధమున ముఖాముఖి ఒక్కనిముషము నిలబడగలవా? శునకము

పెద్దపులిని సమీపించగలదా? నీవు పర్వత, అరణ్య, సముద్రప్రాంతము లందు ఎచటదాగినను రాముడు, లక్ష్మణుడును నిన్ను నాశము చేయుదురు. వారినుండి నీవు తప్పించుకొనలేవు" అని సీత ఎంతగ హెచ్చరించి హితవు చెప్పినను రావణుడు తనకోపమును అదుపునందుంచుకొని ఇట్లనెను.

"ఓసీతా! రాముని గురించి నీవు తెలివిహీనతతో ఏవేవోపలికి నాఅనురాగమును అవమానపరచుచున్నావు. అయినను నీయందలి అమితానురాగము కారణముగ నేను నాకోపమును అదుపులోనుంచుకొనుచున్నాను. లేనిచో ఇపుడేనీవు మరణించి యుందువు. నీకు గతములో మాట ఇచ్చిన తీరుగ ఇంకను రెండుసెలలు వ్యవధియున్నది. ఈలోగా నీవు నీమనసును మరలించుకొని నాభార్యపై నాప్రక్కకురమ్ము. లేనిచో నీవు మావంటశాలకు పంపబడి నాకు ఆహార మగుదువు. జాగ్రత్త" అనుచు హెచ్చరించుచున్న రావణుని క్రోధమును చూచి రావణుని భార్యలలోనొకామె ధాన్యమాలి రావణుని కడకు వచ్చి అతనిని ఆలింగనము చేసికొని "ఓనాధా! ఈమానవమాత్రురాలిగురించి నీవెందుకింత వ్యర్థప్రయత్నములు చేయుదువు? ఆమెకు నీభార్యగా నుండు అదృష్టములేదు. నీవెందుకామెకొఱకు సమయము వృధా చేసికొందువు? రమ్ము. మనము సుఖములననుభవింతము" అని అనురాగపూరితముగ రావణుని తనవైపునకు లాగుకొన్నది. రావణుడు నవ్వుచు ఆమెను వెంబడించెను. రావణుడు లోనికి వెళ్ళుటకుముందు సీతకు కాపుంచిన రాక్షసస్త్రీలకు ఏదోవిధముగ సీత తనకోరికనంగీక

రించునట్లు చేయుడని ఆజ్ఞాపించెను. రావణుడు లోనికి వెళ్ళగానే రాక్షసస్త్రీలు సీతచుట్టును చేరి, రావణజన్మ ఉత్కృష్టమైన బ్రహ్మ వంశమునుండియనియు, అతడు సమస్త దేవతలను జయించిన ఘనుడనియు, తన భార్యలందరకంటె సీతనే అధికముగ కోరుచున్నాడనియు, ప్రపంచమున రావణుని మించినవారెవ్వరు లేరనియు, దేవతలందరునతనికి విధేయులనియు, అట్టిఘనుడు నిన్నెంతగనో అనురాగముతో కోరుచుండ తిరస్కరించుట నీదురదృష్టమనియు తమకు తోచిన విధముగ సీతయొక్క మంచినికోరి సలహానిచ్చితిమనియు, రావణుని కోరికను కాదన్నచో సీతకు మరణముతప్పదనియు ఆరాక్షసస్త్రీలు సీతకుపదేశములు చేసిరి.

ఏనెలకానెలసీత రాముడు తనను వెదకి తన ఉనికిని తెలుసుకొని తనను రక్షింపవచ్చునని ఎదురుచూచుచు అతనియందను రాగముతో, తనరక్షణకు రాలేకపోయినాడను బెంగతో కృశించియు, ఇంకను రాముడు తప్పకవచ్చునను నమ్మకముతో రాక్షసస్త్రీలనడుమ బాధలు పడుచు జీవములతోనున్నది. రాక్షసస్త్రీలు తనతో పలికిన బెదిరింపులువిని సీత కనులనీరుపెట్టుకొన్నది. "మీరెంతపాపపుపలుకులు పలికితిరి. మీరుచెప్పినట్లెన్నడును నేను చేయను. మామానవస్త్రీలు భర్త ఎట్టిపరిస్థితియందున్నను అతనిని విడుచు స్వభావము కలవారుకాదు. సూర్యకాంతి సూర్యునకే చెందినట్లు, శచీదేవి ఇంద్రునకు, అరుంధతి వశిష్ఠునకు చెందినట్లు నేను రామునకే ధర్మపత్నిని" అని రాక్షసస్త్రీలకు సీతచెప్పెను. రాక్షసవనితలు మొండియు, అవివేకియునగు సీతకు

శ్రీమద్రామాయణము

ఏమిచెప్పినను ప్రయోజనములేదనియు, తమకు తమకుటుంబసభ్యులకు నరమాంసభక్షణము ఇష్టమనియు, సీతను చంపి ఆమె అవయవములను పంచుకొని భక్షింతమనియు ప్రభువునకు సీతదుఃఖముచే మరణించినదని చెప్పి, తాము నరమాంసముతో విందుచేసికొందమనియు తమలోతాము అనుకొనిరి. వారి మాటలను విని సీత వెక్కివెక్కిఏడ్చెను. అయినను ఆమె మనస్సునందు రామునే ధ్యానించుచు, జనస్థానమున వేలకొలది రాక్షసులవధించినరాముడు, దండకారణ్యమున విరాధుని చంపిన రాజ కుమారులు తన ఉనికిని గ్రహింపలేక తన దురదృష్టవశమున తనను రక్షింప రాలేకపోయినారని విచారించి, తానిక్కడ ఉన్నట్లు రాముడు కనుగొనినవెంటనే తన రక్షణకు తప్పక వచ్చునని నమ్మకము కలిగియుండెను. లంకాపట్టణముతోను, సమస్తరాక్షస వంశముతోను రావణుడు తప్పకనశించునని తలచుచు ధైర్యము తెచ్చుకొనెను.

అనంతరమామెకు వివిధ ఆలోచనలు మనసునకు వచ్చెను. తన ఎడబాటును సహింపలేక రాముడు మరణించినాడేమో అనియు, లేనియెడల ఇన్నినాళ్ళు తనను నిర్లక్ష్యము చేయడనియు, తన హృదయము పాషాణనిర్మితమనియు, ఇన్ని ఇడుమలు కలిగినను తాను బ్రతికియుంటిననియు, రాముడు జీవించియేయుండెనని తనమనసు దృఢముగ విశ్వసించుచున్నదనియు, ఒకచో రాముడు తనజీవితమును తపోదీక్షతో గడుపనిశ్చయించెనేమో అనియు, అంతటి యోధుడైన రాముడు తనభార్య శత్రువుల పాలుకాగా ఆమెను విడిచి సన్యాసి జీవితమును గడుపడనియు తనఉనికి తెలియకనే తనను రక్షింప

రాలేదనియు, ఇంతవరకు తనతెలివితక్కువతనముతో ఇట్లాలోచించితి నినియు, రాముడు తనను రక్షింప తప్పక వచ్చుననియు ఆమె పరిపరి విధముల ఆలోచించెను. చివరకు ఆత్మహత్య చేసికొన నిశ్చయించి తనజడతో మెడకు ఉరివేసికొని ఒక శింశుపావృక్షశాఖనుండి క్రిందకు సీతదూకెను.

తమప్రయత్నములు వ్యర్ధమగుటచే ఆవార్త రావణునకు తెలుపుటకు రాక్షసస్త్రీలు వెళ్ళిరి. ఆరాక్షసస్త్రీలయందు త్రిజటయనునామె మిగిలిన రాక్షసాంగనలతో తనకు వచ్చిన స్వప్నవృత్తాంతమునిట్లు వివరించెను. "రాముడు సూర్యుని వలె ప్రకాశించుచు సీతను కనుగొన లంకకు వచ్చెను. రావణుడు యమలోకమును ప్రవేశించుట చూచితిని. రాముడు సీతను ఏనుగుపైనెక్కించుకొని కొనిపోవుట, రావణుడు ఇతర రాక్షసులతో మాసినవస్త్రములతో యమునిచే ఈడ్చబడినట్లును కలగంటి ననియు, ఈకలననుసరించి త్రిజట సీతను బాధింపవలదనియు, నాశము కోరితెచ్చుకొన వలదనియు, ఆమెపాదములపైబడి ఆమెయనుగ్రహమును కోరుడనియు త్రిజట చెప్పెను. త్రిజట స్వప్న వృత్తాంతము రాక్షసాంగనలకు వివరించుచుండగా సీత ఆత్మహత్యా ప్రయత్నము చేయుచుండగా సీతకు అకస్మాత్తుగ చాలశుభశకునములు తోచెను. ఆమె ఎడమకంటిరెప్పలును, భుజమును, పాదమును అదిరినవి. ఒక్కసారిగ ఆమె మనసునకు ధైర్యము కలిగెను. ఆత్మహత్యాలోచనలు అదృశ్యమయ్యెను.

చెట్టుకొమ్మల నడుమ దాగి జరిగినదంతయు చూచు చున్న హనుమంతుడు తర్వాత ఏమి చేయవలెనని ఆలోచించెను. అతడు

లంకకుచేరి సీతను కనుగొనుటతో తృప్తిచెందలేదు. "నేను సముద్రమును దాటి లంకను చేరి సీతను కనుగొంటిని. రాక్షసనగరమును, దానిరక్షణ పథకమును పరిశీలించితిని. నేను ఇపుడు రామునకు, సుగ్రీవునకు ఈవార్తచెప్పుటకు వెళ్ళినచో ఇచట ఏమిజరుగునో ఎవరు తెలుసుకొన గలరు? రామలక్ష్మణులును, వానరసమూహమును ఇచ్చటకు చేరక ముందు సీతకష్టములు భరింపలేక మరణించినచో నాసేవలన్నియు వ్యర్థమగును. నేను సీతను చూచినంతమాత్రమున చాలదు. ఆమెతో మాటలాడి రాముని క్షేమవార్తతెలిపి, ఆమెకు ధైర్యముచెప్పి, ఆశను కల్పించి, ప్రాణములతో జీవించియుండునట్లు చేయవలయును. ఏదో విధముగ సీతతోమాటలాడుమార్గము చూతును" అని యోచించి బుద్ధిమతాంవరిష్ఠుడగు హనుమంతుడు "ఏరూపముతో సీతకు తాను కనపడవలయును? ఏభాషతో మాటాడవలయును? అశోకవనమున అకస్మాత్తుగ ఒకకోతి ఆమెతోమాటాడిన సీత తనను రావణమాయగ తలచునేమో? తనను చూచినవెంటనే భయపడి సీత అరచినచో విశ్రమిస్తున్న రాక్షసవనితలు లేచి తనను కనుగొందురు. శత్రుపక్షము నుండి తాను వచ్చినట్లు భావించి తనతోయుద్ధముచేయ రాక్షసులను నియమించిన వారిని తాను యుద్ధమునందు సంహరించినను తానుకూడ బందీకృతుడగుటయగునేమో? ఇట్లు జరుగ వీలులేదు. అందుచే తొందర పడి ఏపనిని చేయరాదు. సీతతోమాటాడి ఆమెకు సంతోషమును, ఆశయు కల్పించుట మొదటచేయదగినది, మంచిది. ఆమె వినునట్లురామచరిత్రను, రాముని గుణగణములను వర్ణింతును. ఆమాటలు విని ఆమె సంతసించిన

తర్వాత నాపై నమ్మకము కుదిరిన పిమ్మట నేను కనపడుదును. అంత వరకు ఇచటనే దాగియుందునని తలచెను. అనంతరము హనుమంతుడు చిన్న కంఠస్వరముతో రామనామమును మధురముగ ఉచ్చరింప నారంభించెను.

హనుమంతుడు అశోకవనమునందు చెట్టుకొమ్మల యందు దాగియుండి సీతకు వినిపించునట్లు రామచరిత్రను గానము చేయనారంభించెను. "ఇక్ష్వాకువంశమున దశరథమహారాజు ఉత్తమ ప్రభువు. అతని నలుగురు కుమారులందు అగ్రజుడు రాజ్యార్హత కలవాడు శ్రీరాముడు. అతడు సుగుణవంతుడు, ధనుర్విద్యాపారగుడు, ధర్మపరుడు, బలపరాక్రమసంపన్నుడు, సుందరుడు. తండ్రిమాటను నిలుపుటకై రాజ్యమును విడిచి భార్యసీత, సోదరుడు లక్ష్మణునితో అరణ్యవాసము చేయుచుండగా ఖరదూషణాది రాక్షసుల సంహరించి ఋషీశ్వరుల రక్షించెను. ఈవార్తనువిని పగతో రావణుడు మాయోపాయముతో రాముని సీతకు దూరముచేసి, సీతనెత్తుకొని పోయెను. దుఃఖముతోనున్న రాముడు సీతను వెదకుచు వానరరాజు సుగ్రీవుని స్నేహము చేసికొని, అతని అన్న వాలిని సంహరించి సుగ్రీవుని వానరప్రభువుగ నియమించెను. సుగ్రీవుడు తనవానరమూకలను నలుదిక్కుల వెదకి సీతజాడతెలిసికొని రమ్మని పంపెను. వానరవీరులు తాముకోరినరూపము ధరింపగల సమర్థులు. తప్పిపోయిన సీతను వెదుకవచ్చిరి. అందు సంపాతి సూచన మేరకు నేను నూరుయోజనముల విస్తీర్ణముగల సముద్రమును లంఘించి ఇచ్చటకు వచ్చితిని. రాముడు వర్ణించి చెప్పిన లక్షణములుగల రాముని

భార్యగాతోచుచున్న ఒకవనితను నేనిపుడు ఇచట కనుగొంటిని" అను మాటలు చెప్పి హనుమంతుడు ఆగెను.

ఎవరిచేతనో ఎచటనుండియో పలుకబడిన ఈమధుర వాక్కులు సీతను ఆశ్చర్యచకితను చేసెను. ఇంత మృదుమధురమగు భాషతో పలికినకంఠధ్వని ఎవరిదని ఆమె తనచుట్టును పరికించెను. ఆమె తనచుట్టును, పైన, క్రింద కూడ పరికించినను చెట్టుకొమ్మపై కూర్చుండి యున్న చిన్నకోతితప్ప మానవులెవ్వరును కనుపింపలేదు. సీత వాయు పుత్రుడును, వానరరాజమంత్రియు, బుద్ధిమంతుడునగు ఉదయకాల మందలి సూర్యునివలె ప్రకాశించుచున్న హనుమంతుని చిన్నవానర రూపమును చూచెను. హనుమంతుని చూచినసీత తనలోనిట్లనుకొనెను. "నేను విన్నది, నేనుచూచిన ఆకారము నిజముకాదు. నేను నాస్వామి చరిత్రను తలచుకొనుటచే సతతము అతని ధ్యానమగ్ననగు నాకు ఇట్లు స్వప్నముకలిగియుండును. కలలో వానరమును కనుగొనుట అశుభ సూచకమందురు. భగవంతుడు రామునకు ఎట్టిహానియు కల్గకుండ రక్షించుగాక! అట్లే లక్ష్మణుని, మిథిలానగరమున నాబంధువులను ఏహానియు చేరకుండునట్లు భగవంతుడు రక్షించుగాక! అని అనుకొని ఇదికలకాదు. నాకన్నులు తెరచియేయుంటిని. ఆయాకారముఇప్పుడును అట్లే కనిపించుచున్నది. నేను నిద్రించుటలేదు. ఇదికలకాదు. ఓదేవత లారా! ఈ వానరము నాప్రభువునుండి వచ్చినరాయబారియా? ఓ వాచస్పతీ! ఓ అగ్నీ! ఓ స్వయంభూ! ఓ దేవతలారా! మీకందరకు వందనములు. నన్ను రక్షింపుడు. ఇతడు రాముని దూతయా?".

హనుమంతుడు సంతోషముతో సీతను చూచుచు చెట్టునుండి క్రిందకుదిగి చేతులుజోడించి నమస్కరించుచు సీతయెదుట నేలపైనిలబడెను. "తల్లీ! కనులనీరుపెట్టుకొనుచు కూర్చుండిన నీవెవరు? దేవతవా? నాగకాంతవా? చంద్రునకు దూరముగనున్న రోహిణివా? అరుంధతివా? పరిశీలించిచూడగ నీవు మానవకాంతవలె తోచుచున్నావు. జనస్థానమునుండి రావణునిచే హరింపబడిన మారామచంద్రుని ప్రియభామినివగు సీతవా నీవు?" అని ప్రశ్నించెను.

సీత ఎంతోసంతోషించి ఇట్లనెను. బిడ్డా! నేను నిజముగ విదేహరాజకుమార్తె, శ్రీరామచంద్రుని ధర్మపత్నినగు సీతనే. అయోధ్యయందు నేను రామునితో పండ్రెండు సంవత్సరములు సుఖములననుభవించితిని. పదమూడవ ఏట నాభర్తను రాజ్యాభిషిక్తుని గావింప దశరధుడు ఏర్పాట్లు చేయగా ఆయన చిన్నభార్య కైక కోరిన మేరకు భరతునకు పట్టాభిషేకమును, రామునకు పదునాల్గేండ్లు రాజ్యబహిష్కరణతో అరణ్యనివాసమును నిర్ణయింపబడెను. నాకోరికమేరకు రాముడు నన్నును తనతమ్మునితోపాటు అరణ్యవాసమునకు కొనిపోగా దండకారణ్యమున ముువ్వురము నివసించుచున్నాము. ఒకరోజు దుర్మార్గుడగు రావణుడు నన్నెత్తుకొనివచ్చి ఈఅశోకవనమున నన్ను బంధించి యుంచెను. అతడుపెట్టిన ఏడాది గడువునందు ఇంకరెండునెలలుమాత్రమే మిగిలినవి. అవి పూర్తికాగానే నేను చంపబడుదును" అని నిస్సహాయ స్థితియందున్న ఆరాజకుమారి విచారముతో హనుమంతునకు వివరించెను. వామనుడు బలిచక్రవర్తియొక్క అహంకారమును తొలగించి

రక్షించినట్లే హనుమంతుడును సీతామాతలచే తెలుపబడిన శ్రీరామచంద్ర చరిత్ర మన అహంకారమును తొలగించును. హనుమంతుడును సీతయు వర్ణించిన శ్రీరాముని వృత్తాంతము చదివినవారికి అంతులేని ఆనందమును చేకూర్చును.

"ఓ విదేహ రాజకుమారీ ! గౌరవప్రదుడు మహా యోధుడగు శ్రీరామచంద్రుడు నీకు శుభవర్తమానముతో నన్నిటకు పంపెను. నీక్షేమమును కోరురాముని సోదరుడు లక్ష్మణుడు నాద్వారా నీకు తనవందనములను పంపెను" అని హనుమంతుడు పలుకగానే సీత "ఆహా! నాకు నీవెంతసంతోషమును కలిగించితివి" అని ఆనందపడెను. ఈసంతోషసమయమందు కుతూహలముతో హనుమంతుడు సీతకు దగ్గరగా ఒక్క అడుగు వేయగనే మరల సీతకెందుచేతనో సందేహముకలిగి కనులు మూసికొని హనుమంతునికి దూరముగా జరిగెను. "నేను మోసగింపబడితిని. నీవు రావణుడు తప్ప మరెవ్వరును కాదు. ఓరావణా! ఒకమారు తాపసవేషముతో నన్ను మోసగించిననీవు ఇపుడు మరియొక విధముగ మోసగింపదలచితివా? ఇదినీకు మంచిదికాదు" అని పలికి కనులు తెరచి చూచి "ఇతడురావణుడు కాదు. ఇతనియందు విశ్వాసము, స్నేహభావము నాకుగోచరించుచున్నవి. ఇతనిని సందేహించుట నాతప్పు. అనుకొని ఓవానరా! నీవునిజముగ రామదూతవేనా? రాముని గురించి ఇంకను చెప్పుము అనెను. సందేహముతోడనే ఆమె హనుమంతుని చూడక మౌనముగ, దూరముగ కూర్చుండెను. హనుమంతుడు సీత యొక్క భయసందేహములను అవగతము చేసికొనెను. రాక్షసులచే

మోసగింపబడినవారికిది సహజము. అందుచే ఆమెకు ఇంకనునమ్మకము కల్గింప ప్రయత్నించెను. "శ్రీరామచంద్రుడేనన్ను పంపెను. రాముడు సూర్యతేజస్సుకలవాడు. చంద్రునివలె చూడముచ్చటైనవాడు. శ్రీరాముడు విష్ణువు తోడను, తెలివియందు బృహస్పతితో, అందమున మన్మధునితో సముడైన ఆరాముడే నన్ను పంపెను. రామలక్ష్మణులును, వానర ప్రభువగు సుగ్రీవుడును నిత్యము నిన్నే తలచుచున్నారు. నిన్ను సజీవ ముగ చూడగల్గుట నాఅదృష్టము. ఇక ఏవిధమైన కాలవిలంబనమును ఉండదు. వెంటనే రామలక్ష్మణులును, సుగ్రీవుడును వానర సైన్యమును వెంటనిడికొని లంకకు వత్తురు. నేను సుగ్రీవుని మంత్రిని. నాపేరు హనుమంతుడు. నన్ను అనుమానింపకుము" అని కనుల నీరు పెట్టుకొనుచు పలికెను.

ఈమాటలు విని ధైర్యము, నమ్మకమునందిన సీత "ఓవానరస్నేహితుడా! రాక్షసులచే మోసగింపబడుటచే నేను అనవసర మగు భయమునకు లోబడుచున్నాను. శ్రీరామదూతవగు ఓ హితుడా! నీవు రాముని మొదట ఎట్లు కలిసితివి? వానరులతో రాముడెట్లు స్నేహముచేసెనో నాకంతయు తెలుపుము" అని పలికెను. వాలి సుగ్రీవులకు కలహకారణము, రాముడు సుగ్రీవునితోసఖ్యతనందిన విధము, రాముడు సుగ్రీవునకిచ్చిన వాగ్దానము ప్రకారము వాలిని సంహరించి సుగ్రీవుని రాజును చేయుట, సుగ్రీవాదులు దాచినసీత నగలను రాముడు చూచి గుర్తించుట, వానకాలము గతించినతర్వాత వానరసేనలు సీతాన్వేషణకు వెళ్ళుట, అంగద నాయకత్వమున వచ్చిన

వానరులలో హనుమంతుడు సంపాతి సూచనమేరకు సముద్రము లంఘించి, లంకను చేరి సీతను అశోకవనమున కనుగొనుట, మున్నగు సంఘటనలనన్నింటిని వివరించి హనుమంతుడు చివరకు రాముడు తనకు ఆనవాలుగనిచ్చిన రాముని అంగుళీయకమును సీతచేతనుంచెను. సీత ఆఉంగరమును తీసికొని సంతోషముతో దానిని తనకనులకద్దు కొనెను. రాక్షసమాయల భయము తొలగి సీతకు హనుమంతునిపై పూర్తి నమ్మకమును, అతనిపట్ల అత్యంతానురాగమును పొందెను. "బిడ్డా! నేనెంత అవివేకిని? నీవంటివానిని నేనెట్లు అనుమానించితిని?" అని సీత పలుకగా హనుమంతుడు తనతండ్రిఎవరో, తానెవరో, తనశక్తి ఎట్టిదో వివరించి, నేను తిరిగివెళ్ళి నీవున్న ప్రదేశమును గురించి వారికి తెలిపినవెంటనే శ్రీరామలక్ష్మణులతో వానరులు ఇటకు వచ్చి రాక్షస వంశము, రాజ్యముతోసహా రావణుని ధ్వంసమొనర్తురు" అని పలికి సీతావియోగముతో రాముడు అనుభవించుచున్న అవస్థలను వర్ణించెను. రాముని దుఃఖమును తలచుచు సీత తనదుఃఖమును మరచెను.

"ప్రియాతిప్రియమైన ఓవానర స్నేహితుడా! నీవు తెచ్చిన ఈవార్తకు నేను దుఃఖించవలెనో, సంతోషించవలెనో తెలియుటలేదు. నీ వాక్కులు అమృతముతోకలిసిన విషమువలెనున్నవి. నాస్వామికి నాయందుగలప్రేమ అమృతతుల్యము. నాయెడబాటు వలన కలిగిన దుఃఖము విషతుల్యము. మానవులెవ్వరును సుఖదుఃఖములనుండి తప్పించుకొనలేరు. నాస్వామియు, లక్ష్మణుడును, నేనును ఒకేపథములో నుంటిమి. ఓ వానరా! రాముడు ఎపుడువచ్చును? లంకను, రావణుని,

ఇతరరాక్షసులను ఎపుడు నాశమొనర్చును? ఇదంతయు రెండునెలల వ్యవధిలోనే జరుగవలయును. రావణుని చిన్నసోదరుడు విభీషణుడు "సీతను రామునకు తిరిగిసమర్పించి లంకను, రాక్షసవంశమును రక్షింపుమని" రావణునకు చెప్పి విఫలమయ్యెను. రావణుడు యమపురీ మార్గముననున్నాడని నాకుతెలియును. వెంటనే నాస్వామి రావణుని సంహరించి నన్ను స్వీకరించును. ఇందు సందేహమేమియులేదు" అని సీతకన్నీరు విడుచుచు మాటలాడెను.

హనుమంతుడు సీతదుఃఖమును చూడలేక "తల్లీ! నేను వెంటనే వెళ్ళి వానరసైన్యముతో రాముని ఇటకుతెత్తును. కాని నీవెందుకు ఇంకను దుఃఖింతువు? నీవు అంగీకరించినచో నావీపుపైకూర్చుండుము. క్షణములో నిన్ను తీసికొనిపోయి శ్రీరామునకప్పగింతును. అగ్ని హోమద్రవ్యమును ఇంద్రునకందించురీతిగ నిన్ను నేను రామునకందింతును. నీవనుమతించుము. నేను నిన్నేకాదు, ఈలంకను, దానిపాలకుడు రావణునిసైతము పెకలించి రాముని పాదములకడ పడవైతును. నా వీపుపై కూర్చుండుము. రోహిణి చంద్రుని మరలకలసినట్లు నీవు రాముని మరలకలియగలవు. ఒక్కగంతుతో నీతోపాటు అవ్వలితీరము చేరుదును" అని హనుమంతుడు అనురాగ కుతూహలములతో చెప్పెను. సీత తన ముందున్న చిన్నకోతి తనను మోసుకొని సముద్రమునెట్లు దాటగలదని ఆశ్చర్యపడెను. హనుమంతుడు ఆమె సందేహమును గ్రహించి ఆఅరుగు నుండి క్రిందకు దూకి తనశరీరమును పెద్దగా పెంచనారంభించెను. సీత సంతోషించెను. "ఓవాయుపుత్రా! నీశక్తిని నేను గ్రహించితిని. కాని నీవు

నన్ను మోసికొనిపోవుట సరికాదు. మార్గమధ్యమున రాక్షసులు నిన్నడ్డగింపగా నీవు వారితో పోరాడవలసియుండును. నన్ను రక్షించుయుద్దేశముతో నీవు వారితో యుద్ధముసరిగా చేయలేవు. యుద్ధమునందు విజయమెవరిదో నిర్ణయించలేము. నీవు యుద్ధమున పడినచో నాగతి ఏమి? నీవు ఘోరయుద్ధము జరుపుచుండగ నేను నీవీపుపై కుదురుగ కూర్చుండగలనా? నేను జారి సముద్రములోపడుదునేమో? అందుచే నీవు నాతోసముద్రలంఘున ప్రయత్నము చేయరాదు. అంతేకాదు హనుమా! రాముడేవచ్చి శత్రువును జయించి విజయబహుమతిగ నన్ను స్వీకరించిన క్షత్రియధర్మమగునుగాని నీవు తీసికొనిపోవుట దొంగతనమే యగును. కావున ఇదిసమంజసముకాదు. కావునకుమారా! వెంటనే రాముని కడకువెళ్ళి, నాసమాచారమందించి రామలక్ష్మణులను, వానర సైన్యమునిటకు రప్పించి లంకను, రావణుని, రాక్షసులను నశింపజేసి నన్ను తీసికొనివెళ్ళు ఏర్పాటుచేయుము" అనెను. "నీవు చెప్పునదే నిజము. నేను ఒంటరిగనే తిరిగివెళ్ళుదును. కానిరామునకేమి చెప్పుదును? నిన్నుకలిసి మాటాడినట్లు నేనేమి ఆనవాలుకొనిపోవుదును?" అని ఆంజనేయుడడిగెను. అపుడు సీత తాను తనభర్తకు మాత్రమేతెలిసిన కొన్నిసంఘటనలను హనుమంతునకు చెప్పి రామునకు ఆనవాలుగ తెలుపదలచెను.

ఒకమారు చిత్రకూట పర్వతముపై నదీతీరమునందలి తోటలలోతిరిగి అలసినరాముడు తనఒడిలో తలపెట్టుకొని నేలపైపరుండి నిద్రించిన సమయమున ఒక కాకివచ్చి తనను గాయపరచెననియు,

నిద్రమేల్కాంచిన రాముడు కాకిని రాక్షసునిగ గుర్తించి ఒకబాణమును ప్రయోగింపగా ఆబాణము కాకిని వదలక అనుసరింపగా ఆకాకాసురుడు రామునకు పాదాక్రాంతుడై క్షమార్పణ కోరెను. అని ఈసంఘటనను వివరించి ఓహనుమా! నేను చాలరోజులు నిరీక్షింపలేను. రామునకు వేగముగ వచ్చి తనను రక్షింపుమని తెల్పుమని సీత చెప్పెను. లక్ష్మణుడు పవిత్రహృదయుడు. తనస్వంతతల్లిని విడిచి అన్నకు సేవచేయ అడవికి వచ్చి నన్ను తల్లిగాభావించి సేవించెను. రాముడు బంగరులేడికొఱకు వెళ్ళినపుడు అంతటి లక్ష్మణుని సీత తాను అవమానపురస్సరమైన మాటలతో బాధపెట్టిన సంగతి గుర్తుకు తెచ్చుకొని మిక్కిలి బాధపడెను. సీతకు తాను ప్రాణములవిడుచు సమయమునకు వచ్చి రామక్షేమ సమాచారమందించి తనను రక్షించిన హనుమంతుని విడుచుటకు ఇష్టములేకపోయెను. చివరకు ఆమె "బిడ్డా! ఇదిగో నాపరిణయ సమయమున నాకునాతల్లిచేనీయబడిననగ. దశరధచక్రవర్తిచే నాశిరసున అలంకరింపబడిన శిరోరత్నము. నాగుర్తుగ దీనిని తీసికొని వెళ్ళి నాభర్త కిమ్ము" అని పలుకుచు సీత తనచీరకొంగును ముడివిప్పి ఒక దివ్యాభరణమును హనుమంతునకిచ్చెను. హనుమంతుడు దానినివినయ ముగ స్వీకరించెను. అతని మనస్సు సంతోషముతోను గర్వముతోను నిండెను. అతడు దూరముగనున్నను మానసికముగ రాముని సమక్షమును చేరి సంతోషకరవార్తను రామునకందించెను.

హనుమంతుడు బయలుదేరబోవుచుండగా సీత "ప్రియమైన హనుమంతుడా! నాఅభిమానమును శ్రీరామునకు, సుగ్రీవు

నకు, ఇతరవానరులకు తెలియజేయుము. నన్నీ దుఃఖసాగరమునుండి రక్షించుటకు రామునకు తమసహాయమునందింపవలసినదిగ నేను వారిని వేడుకొనినట్లు వారికితెలుపుము. నీవు అందరకంటె ఎక్కువగ రామునకు ధైర్యము చెప్పి అన్ని విషయములందు త్రోవ చూపుదువని తలతును" అనెను. "ఓప్రియరాజకుమారీ! నీదుఃఖమును విడిచిపెట్టుము. రామలక్ష్మణులును, వానరసైన్యమును లంకకు వచ్చి రాక్షసనాశమొనర్చి నిన్ను విడిపింతురు. సందేహమువలదు" అని ఆంజనేయుడు నమ్మ బలికెను. "కొంతసేపు ఇచటనెక్కడనో విశ్రమించి వెళ్ళరాదా? వెంటనే తిరిగివెళ్ళవలెనా? నీవు మహాసముద్రమును లంఘించి వచ్చితివి. రాముడును, పెద్దవానరసైన్యమును సముద్రమునెట్లు దాటగలరు? దాని గురించి ఆలోచించితివా?" అని తనసందేహమును సీత వెలిబుచ్చెను.

హనుమంతుడు "రాణీ! సందేహమువలదు. సముద్రమును దాటగల వాడను నేనొక్కడనే అనుకొనుచున్నావా? ప్రతి వానరుడును నన్ను మించిన శక్తి నైపుణ్యములు కలవారే. సుగ్రీవుడే కాదు, అతనిసైన్యమందు చాలమంది ప్రపంచమును చుట్టిరాగలరు. ఈ సన్నసముద్రము వారికెంత? ఆకాశమందు తిరుగగల్గినవారు వేలకొలది యోధులున్నారు. సందేహములేకుండా ఉండుము. నేను రామలక్ష్మణులను నావీపుపై మోసికొని వత్తును. రావణుని వంశనిర్మూలనమగును. నీవు దుఃఖసాగరమును దాటి అవ్వలితీరమును చేరుకొందువు" అని సమాధానమిచ్చెను. రామలక్ష్మణులు నీగురించి నానుండి వినినవెంటనే ఒక్కక్షణమైనను ఆలసింపక బయలుదేరుదురు. ఇట్లు చెప్పుచు

హనుమంతుడు వెళ్ళుటకు సిద్ధపడెను. రామలక్ష్మణులకు నేను జీవించి యున్నానని చెప్పుమని సీత అరచెను. కాలము వ్యర్థము చేయవలదు. భగవంతుడు నిన్ను రక్షించుగాక! అని ఆశీస్సులతో సీత సాగనంపెను. హనుమంతుడు లంకను విడిచెను. సీతదుఃఖమును పోగొట్టిన ఆంజనేయుని మనము స్మరింతము. ఆయన అనుగ్రహమును ప్రసాదింపుమని వేడుకొందము.

సీతకడ శలవు తీసికొనిన హనుమంతుడు ఉద్యానవన కుడ్యముపై కొంతసేపుకూర్చుండి ఆలోచించెను. "సీతకు ధైర్యము కలిగించుటకును, రావణునకు, అతని మిత్రులకు భయమును కలిగించు టకును నేనేమి చేయగలను? సీతను బాధింపకుండునట్లు రావణునకు భయమును కలిగించుట చేయదగియున్నది. రావణునకు అంతులేని సంపదకలదు. అతని స్నేహితులెవ్వరును అతనినుండి విడిపోరు. కావున ఈ విషయమందు సామదానభేదోపాయములు నిరుపయోగములు. రావణాదులను భయపెట్టి సీతను వారు అమర్యాద చేయకుండునట్లు నేనేదో ఒకటి చేయవలసియున్నది. అవును నేను తిరిగివెళ్ళుముందు ఈపని చేసితీరవలెను". ఇట్లాలోచించి ఒక్కసారిగ తనదేహమును పెద్దఆకారమునకు పెంచి వృక్షముల విరిచెను. విలుకాండ్రు మరణించిరి. తటాకములు, కృత్రిమపర్వతములును నాశమయినవి. సుందరమైన అశోకవనము ధ్వంసమై అందున్నలేళ్ళును, పక్షులును భయముతో పారిపోయినవి. నిద్రించుచున్న రాక్షసస్త్రీలు మేలుకొని ఆదృశ్యములను చూచి భయపడిరి. హనుమంతుడు తానుచేసిన ధ్వంసమునకు

సమాధానము కొఱకు ఎదురుచూచుచు ఉద్యానవన కుడ్యముపై కూర్చుండెను. రాక్షసస్త్రీలు ఆభయంకర ఆకారమునుచూచి భయముతో అరచి, కొందరు రావణునకీవార్తను తెలుపుటకు పరుగెత్తిరి. కొందరు సీతకడకు వెళ్ళి "ఈపెద్దకోతి ఇచటకెట్లు వచ్చెను? అతడెవరోనీకు తెలిసియుండును. అతడునీకేమైనా చెప్పెనా? నిజము చెప్పుము. చెప్పుటకు భయపడకుము" అని అడిగిరి.

"ఈరాక్షస మాయాప్రపంచమున ఏమిజరుగునో నాకేమి తెలియును? ఈవానరముకూడ బహుశః ఒకరాక్షసుడే అయియుండును. అతనిగురించి నాకంటె మీకేఎక్కువగ తెలియును" అని సీతజవాబిచ్చెను. రాక్షస స్త్రీలు భయముతో పారిపోయి రావణునకు తెలియజేసిరి. "ఓప్రభూ! చూచుటకు భయంకరమైన ఒకపెద్దకోతి రాజోద్యానవనమును ధ్వంస మొనర్చెను. ఆకోతి సీతతో రహస్యముగ మాటాడినది. మేము సీతనుండి కొంతసమాచారమును గ్రహించుటకు మాశక్తికొలది ప్రయత్నించితిమి. ఆమెజవాబు చెప్పలేదు. ఆకోతిని పట్టిసంహరించుటకు బలమైన శత్రువును పంపుము. సీతకూర్చుండిన శింశుపా వృక్షముతప్ప మిగిలిన అశోకవనమంతయు ధ్వంసము చేయబడినది. అన్నిటిని నాశముచేసిన కోతి సీత ఆశ్రయమును మాత్రము చెరుపలేదు. దీనికేదోకారణముండును. ఇది సామాన్య క్రూరజంతువుకాదని మేము సందేహించుచున్నాము. మీశత్రువులు ఇంద్రుడుగాని, కుబేరుడుగాని దీనిని పంపియుండును. లేక రామునిచేతనైనను పంపబడియుండును. లేనిచో సీతతోమాటలాడు ధైర్యమెక్కడిదీకోతికి. రాముని దూతయైయుండును. ఈభయంకర

జంతువును బంధింప నీయోధులను పంపుము". తనకభిమానపాత్రమైన ఉద్యానవనము ధ్వంసము చేయబడినదని తెలిసి రావణుడు మిక్కిలి కోపించెను. అతని కన్నులు క్రోధాగ్ని జ్వాలలను వెలువరించెను. తన అంగరక్షకులను వెంటనేవెళ్ళి ఆరాక్షసకోతిని ధ్వంసమొనర్పుడని ఆజ్ఞాపించెను. ఒక బలమైన సైన్యము ప్రభువుయొక్క ఆజ్ఞను నిర్వర్తించుటకు సాయుధులై బయలుదేరిరి.

రాక్షసయోధులు ఉద్యానవనద్వారముపై కూర్చుండిన వానరమును ఆశ్చర్యముతోచూచిరి. వీరు సమీపించినతర్వాత ఆకోతి ఇంకను పెద్దదయ్యెను. "ఆ... వచ్చితిరా! అని పలికి కిందకుదూకి తోకను ఝుళిపించి, తోకతోనేలను కొట్టుచు నాలుగు దిక్కులును వణకునట్లు అరచెను. ఆద్వారమునుండి ఒకపెద్ద ఇనుపకడ్డీనిలాగి దానిని ఆయుధముగ చేతబూని రాక్షసులనందరను ఎదిరింపమొదలిడెను. ఆఇనుపకమ్మిని త్రిప్పుచు రాక్షసులనొకరితర్వాత మరియొకరిని నేలపై పడగొట్టెను. వారినందరను చంపినతర్వాత స్తంభములుగలద్వారముపై కూర్చుండి మరియొకమారు గర్జించెను. "రాముడు చిరకాలము జీవించుగాక! లక్ష్మణుడు చిరకాలము జీవించుగాక! సుగ్రీవుడు చిర కాలము జీవించుగాక! ఓ.... ఏ..... లంకాపట్టణ రాక్షసులారా! మీనాశము దగ్గర పడినది. యోధాగ్రేసరులు శ్రీరామలక్ష్మణులును, సుగ్రీవప్రభువును మిమ్ము ధ్వంసముచేయ నన్నిటకు పంపిరి. వేలసంఖ్యలో మీరు రండు. మిమ్ము నశింపచేయుటకే నేనిచట నిలిచియుంటిని.నేను సీతకు

నమస్కరించి ఆమె దీవెనలను పొందినాను. నేనిపుడు మీపట్టణమును నాశమొనర్పబోవుచున్నాను".

లంక అంతయు పిడుగువంటి హనుమంతుని మాటలను విని భయపడిరి. ఈవార్త, తనచేపంపబడిన యోధులందరును చంపబడినా రన్నవార్త విన్న రావణుడు తనభయంకర నేత్రములను ఆశ్చర్యముతో విశాలముగ తెరచెను. "మీరు చెప్పునదిఏమి?" అని అరచి ప్రహస్తుని కుమారుడగు జంబుమాలిని పిలిచి "వెంటనేవెళ్ళి ఆకోతిని శిక్షించి నాకు చెప్పుము" అని ఆజ్ఞాపించెను. ఆరక్కసుడు జంబుమాలి కవచమును ఆయుధములను ధరించుటకు కొంతసమయము తీసికొని శత్రువును ఎదిరించుటకు సిద్ధమయ్యెను. ఇంతలోహనుమంతుడు ఉద్యానవన మందలి ఒక ఆలయశిఖరమునెక్కి రెండవసూర్యునివలె ఆకసమున వెలుగుచు నిలిచెను. తనశరీరమునింకను పెంచి స్వర్గమునందలి మేరు పర్వతమువలె ప్రకాశించెను. అతని గర్జనలు లంక ఎనిమిదిదిక్కులందును ప్రతిధ్వనించి రాక్షసులగుండెలు భయముతోవణకెను.

"రామలక్ష్మణులును, సుగ్రీవ ప్రభువునుదీర్ఘాయుష్మంతు లగుగాక! కోసలరాజ రాయబారిగ నేనిచటకు వచ్చితిని. లంకను నాశ మొనర్ప వచ్చితిని. వాయుపుత్రుడను హనుమంతుడను. రామశత్రువుల ధ్వంసమొనర్ప వచ్చితిని. సీతదీవెనల తీసికొంటిని. వేయిమంది రావణుల నైనను నేను సంహరింపగలను. పెద్దగండ శిలలను, ఊడబెరికిన చెట్లను విసరి రాక్షసులనంతము చేయగలను. నేను వచ్చినపని ఇదియే". ఆలయ రక్షకులు వివిధాయుధములు చేగొని హనుమంతునెదిరించిరి.

క్రిందకు దూకి హనుమంతుడు ఆలయమునకు ఆధారభూతమైన ఒక పెద్దస్తంభమునూడబెరికి సంహారకునివలె నిలిచెను. తన ఆయుధమును త్రిప్పుచు ఆలయరక్షకభటులను చంపెను. ఊడబెరకబడిన స్తంభముగల ఆలయము కూలెను. హనుమంతుడు స్తంభముతో నేలను బాదగా చుట్టును నిప్పురవ్వలు లేచెను. "సుగ్రీవుని సైన్యమందు నన్ను మించిన బలమైన వానరులు కలరు. వారందరును వెంటనే ఇటకు వచ్చి మిమ్ము, మీరాజును, పట్టణమును నాశముచేతురు. ఇక్ష్వాకు వంశప్రభువుతో మీరాజు వైరము తెచ్చుకొనెను. లంక నాశమును సమీపించినది. రాక్షస నాశము కానున్నది. మృత్యుదేవత రావణుని సమీపించుచున్నది" అని హనుమంతుడరచెను.

చివరకు జంబుమాలి విశాలనేత్రములతో అసహ్యాకర మగు పండ్లతో చెవులకు పెద్ద బంగారు కంకణములు ధరించి ధనువు ధరించి ఖడ్గము చేతబూని రథమెక్కి వచ్చెను. కుడ్యముపై కూర్చున్న హనుమంతునిపై జంబుమాలి కొన్ని బాణములను ప్రయోగించెను. ఆ బాణములు మారుతి ముఖమును గాయపరచి అతని ముఖమునకు రక్తముతో మరికొంత అందములు పెంచినవి. పెద్దగండశిలనూడబెరికి మారుతి జంబుమాలి రథముపై విసిరెను. ఒకసాలవృక్షమునూడబెరికి జంబుమాలిపై విసిరెను. ఆలయమునుండి పెద్ద ఇనుపకడ్డీని పీకి రథమును తునకలు చేసి అవయవములను గుర్తింపవీలుకాని విధముగ జంబుమాలి శరీరమును మాంసపుముద్దగ చితుకగొట్టెను. ఈయుద్ధవార్త రావణుడు విని ఆశ్చర్యపడెను. "ఇది నిజమునకు క్రొత్తగ యున్నది.

ఈహంతకుడు జంతువుకాదు. సామాన్యమైనకోతికాదు. నాపాతశత్రువులు దేవతలచేపంపబడిన కొత్తప్రాణి" అని తలచి బలవంతులైన సేనాధిపతులను పెద్ద సైన్యముతోపెళ్ళి ఆప్రాణిని పట్టిబంధించి తనముందు నిలుపుడని ఆజ్ఞాపించెను. పెద్ద సైన్యముతో ఎదిరించిన సేనాధిపతులను నవ్వుచు నిలబడి హనుమంతుడు వారుప్రయోగించిన అస్త్రములను లెక్కచేయక గండశిలలు, వృక్షములతో ఆనాయకులనందరను చితుకగొట్టి చంపెను. వారిని అందరను చంపి మారుతి ఉద్యానవనకుడ్యముపై కూర్చుండి సింహనాదమొనర్చెను. తనచేపంపబడిన అయిదుగురు సేనాధిపతుల మరణవార్తతెలిసి రావణుడు మొదటిసారిగ భయపడెను. ఇదంతయు దేవతల కుట్రయని రావణుడు భావించెను.

రావణుడు తనసభలోని సభ్యులందరవైపు చూచెను. అతని కుమారుడు అక్షయుడు ఉత్సాహపడుచుండగా రావణుడతనిని యుద్ధమునకు పంపెను. విజయమందు విశ్వాసముతో అక్షయుడు యుద్ధమునకు వెళ్ళెను. తపశ్శక్తితో సాధించిన బంగరు రధముపై వెళ్ళిన అక్షయుడు ఆంజనేయుని చూచి తనకు తగిన యోధునితో యుద్ధము చేయు అవకాశము లభించినందులకు సంతసించుచు ఆంజనేయునిపై మూడుబాణములు ప్రయోగించెను. గాయపడిన హనుమంతుడు రాక్షస యువకుని శక్తికి సంతోషించెను. మరల కొలది బాణములు ఆకసమునకు ఎగిరి మారుతికి తగిలెను. రాతిపై కురిసిన వర్షమువలె హనుమంతుని శరీరముపై కురిసెను. హనుమంతుడు అక్షయుని నాయకత్వమును మెచ్చుకొనెను. కాని అతనిని చంపుటకు మనస్సు అంగీకరింపకపోయి

నను హనుమంతుడు తనహృదయమును కఠినపరచుకొనెను. అక్షయుని రధమును ముక్కలుచేసి అశ్వములను చంపిన అక్షయుడు ఖడ్గమును, ధనువును చేతబూని ఆకసమునకు లేచి హనుమంతునితో ఘోరరణ మున పాల్గొనెను. చివరకు ఆంజనేయునిచే అక్షయుని ఎముకలు విరువ బడి చంపబడెను. అక్షయుడు హనుమంతునిచే నిహతుడైనట్లు విని రావణుడు క్రోధముతో వణకినవాడై అదుపునందుంచుకొని ఇంద్రుని జయించిన ఇంద్రజిత్ అను తనకుమారుని పిలిచెను. "నీకు సర్వ శస్త్రాస్త్ర ములును అధీనమైనవి. బ్రహ్మనుండి బ్రహ్మాస్త్రమును సంపాదించితివి. రణమున దేవాసురులను జయించితివి. తపశ్శక్తితో నీకు అసాధ్య మేమియులేదు. నాచే పంపబడిన కింకరులును, జంబుమాలియు, అయిదుగురు సేనాపతులును నీసోదరుడు అక్షయుడును వానరరూపు డగు శత్రువుతో పోరాడి మరణించిరి. అతనిపై పగతీర్చుకొన నీవు వెళ్ళుము. శత్రువును తక్కువగ అంచనా వేయకుము. ఏమి అవసరమో అట్లుయోచించి విజయముతో తిరిగిరమ్ము. తపశ్శక్తితో సాధించిన అస్త్రములు ఇపుడు నీకు సేవచేయును. స్థిరచిత్తుడవై యుద్ధ మొనర్పుము" అని ఇంద్రజిత్తునకుపదేశించి రావణుడు అతనిని హనుమంతునితో యుద్ధమునకు పంపెను.

సింహములు పూన్చబడిన రధమునెక్కి ఆయుధముల ధరించి ఇంద్రజిత్తు హనుమంతుని ముందుకురాగా పెద్దయుద్ధము నూహించిన నాగ, యక్ష, సిద్ధాది దేవతలు ఆకసమున సమావేశమై చూచుటకు నిలిచిరి. ఇంద్రజిత్తును చూడగనే ఆంజనేయుడు తన

శరీరమునింకను పెంచి సింహగర్జనచేసెను. మౌనముగ ఇంద్రజిత్తు బాణ వర్షమును కురిపించెను. హనుమంతుడాకసమున మెరపువలె సంచ రించుచు బాణపరంపరను క్రిందకుకొట్టెను. యుద్ధనైపుణ్యమున ఇరువు రును సమముగనున్నారు. ఎన్నిగాయములు తగిలినను హనుమంతుని బలము తగ్గిన చిహ్నములు కనబడుటలేదు. "నాబాణములు ఈవానరుని అణచలేవు. నాతండ్రిమాటలు నిజమే. బ్రహ్మాస్త్రముతోడనే ఈతనిని బంధింపవలెను" అని ఇంద్రజిత్తు తలచి మారుతిపై బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. బ్రహ్మాస్త్రము తాకగానే హనుమంతుడు నిస్సహాయుడై బంధితుడయ్యెను. అనంతరము బ్రహ్మవరప్రసాదమున హనుమంతుడు ఒక్కముహూర్త సమయము మాత్రమే బంధింపబడునను విషయమును జ్ఞప్తికితెచ్చుకొనిన మారుతి నిస్సహాయముగ బంధింపబడిన తనను రాక్షసులేమిచేతురో, రాయబారిగ మాటలాడు అవకాశము లభించునేమో అను ఆలోచనతో బ్రహ్మాస్త్రమునకు బంధింపబడినట్లు హనుమంతుడు నటించుచు నేలపై పరుండెను. భయముతో దూరముగ నిలచిన రాక్షసులు నేలపై పరుండిన హనుమంతుని ధైర్యముగ సమీపించి అతనిని వివిధ రకముల అవమానించుచు కొందరు హనుమంతుడు నటించుచున్నట్లూ హించి త్రాళ్ళతో బంధించి అతనిని తమప్రభువగు రావణునికడకు ఈడ్చుకొనిపోవ తలచిరి. రాక్షసులు చేసిన తప్పును ఆలస్యముగా గుర్తించిన ఇంద్రజిత్తు, బ్రహ్మాస్త్రముచే బంధింపబడినవానిని ఇతరబంధము లతో బంధితుజేసిన బ్రహ్మాస్త్రముపసంహరింపబడునని తెలియనిమూర్ఖులు చేసిన పనికి ఇంద్రజిత్తు విచారించెను.

హనుమంతుడు తాను బ్రహ్మాస్త్ర విముక్తుడుగానెరిగి, రాక్షసులుచేయు అవమానములను సహించుచు రావణుని కడకువెళ్ళు అవకాశముకొఱకు నిస్సహాయుని వలెనటించుచు వీధులవెంబడి స్త్రీలు, పిల్లలు చూచుచుండగ ఈడ్చుకొని పోబడెను. హనుమంతుని బంధించిన వారు అతనిని రావణుని న్యాయస్థానమునకు కొనిపోయి తమ ప్రభువునెదుటనుంచిరి. తనకుగల బాధలను, అవమానములను మరచి హనుమంతుడు కుతూహలముతో రాక్షసరాజును చూచెను. బంగారు ఆభరణములతో పట్టువస్త్రములతో ఆవరింపబడి శిరసుపై రాజమకుటము ధరించి రావణుడు ప్రకాశించు తేజోమూర్తివలెనుండెను. సభయంతయు బంగారము, పట్టువస్త్రములును, వజ్రములును, ముత్యములతోప్రకాశించు చుండెను. రావణుని నల్లని శరీరము రాజలాంఛనములతో ఉజ్వలమైన పర్వతమువలె కనిపించెను. "అయ్యో! ఈఘనుడు ధర్మమార్గమును విడువకుండినచో ఇంద్రుడుకూడా ఇతనితో తుల్యుడుకాడు. ఏమి ఆకారము? ఏమి తేజస్సు? ఏమిబలము? తానుసంపాదించిన వరము లతో తప్పుడుమార్గములవలంబించి తనఘనతను ఆనందమును పోగొట్టుకొనెను".

హనుమంతుడీవిధముగా ఆలోచించుచుండగా "ఈదుర్మార్గుని గురించి ఈతడెవరు? ఎక్కడనుండివచ్చెను? ఎవరీతని నిక్కడకు పంపిరి? లంకయందు ఎందుకు ప్రవేశించెను? నిజము తెలుపుమని తెలుసుకొనుడు" అని రావణుడు తనమంత్రులనాజ్ఞా పించెను. రాజుచే ఆజ్ఞాపింపబడిన విధముగ ప్రహస్తుడు హనుమంతుని

"ఓవానరా! భయపడకనిజము చెప్పుము. ఇంద్రుడు నిన్ను పంపెనా? కుబేరుని సేవకుడవా? ఎవరి ఆజ్ఞలను పాటించుచున్నావు? ఇక్కడ కెందుకు వచ్చితివి?" అని ప్రశ్నించెను. ఆంజనేయుడు రావణునివైపు తిరిగి ఇట్లుచెప్పెను. "నన్ను ఇంద్రుడుగాని, కుబేరుడుగాని పంపలేదు. నేను వానరుడను. రాక్షసరాజును చూడవచ్చితిని. అందుకే ఈఉద్యాన వనమును ధ్వంసమొనర్చితిని. కానిచో ప్రభుదర్శనమును నేను పొందలేనుకదా! వారు నన్ను ఎదిరించి చంపప్రయత్నించిరి కావున ఆత్మరక్షణకొఱకు నేను వారిని చంపితిని. వానరప్రభువగు సుగ్రీవుని దూతగానిటకు వచ్చితిని. ఓరాక్షసరాజా! మాప్రభువు నిన్ను సోదరునిగా భావించి నీకు అభినందనలు పంపినాడు. దశరథరాజ నందనుడు రామచంద్రుడు సుగ్రీవునితో మైత్రిచేసికొని వాలిని చంపి సుగ్రీవుని వానర రాజుగా చేసెను. రామచంద్రుడు తనతండ్రి మాటకొఱకు తనరాజ్యార్హతను విడిచి అరణ్యమున నివసించుచు తనపరోక్షమునందు భార్యను పోగొట్టు కొనెను. సుగ్రీవుడు సీతజాడ తెలుసుకొనుటకు ప్రపంచమంతట వెదకుటకు తనవారిని పంపెను. అట్లు వెదకుచు నేను లంకకు వచ్చి ఆమెనిచట చూచితిని. నీకు సోదరునివంటి సుగ్రీవుని దూతగను, అయోధ్యారాజ కుమారుని భక్తునిగను నేను నీతో మాటాడుచుంటిని. సీతను ఎత్తుకొని వచ్చుట ధర్మవిరుద్ధమని నీకును తెలియును. ఇది నీకు, నీవంశమునకు నాశనహేతువగును. సీతను రామునకప్పగించి క్షమింపుమనికోరుము. సీతరూపమున మృత్యువు నీకడకు వచ్చెనని తెలిసికొనుము. రాముని శత్రువును చేసికొని నీనాశమును తెచ్చుకొనకుము. నీవు సంపాదించిన

వరములు రఘువంశజునితో యుద్ధమున నిన్ను రక్షింపలేవు. వానర ప్రభువుయొక్క సందేశమును విని మంచిమార్గమునకు మరలి క్షేమమును కనుము. ఒకసోదర ప్రభువునుండి వచ్చిన వాక్కులు సత్యములును, నీ క్షేమదాయకములును". హనుమంతుడు ఈ హెచ్చరికను గంభీరకంఠధ్వనితో పలికెను.

రాక్షసరాజు ఈమాటలనువిని కోపముతో కన్నులెఱ్ఱబడగ ముందుగ హనుమంతుని సంహరింపుడని ఆజ్ఞాపించెను. కాని విభీషణుడు రాజదూత చంపదగినవాడుకాడనియు, వికృతరూపునిగ చేయుటగాని, కొరడాదెబ్బలు కొట్టుటకాని రాజధర్మమని చెప్పెను. రావణుడు అంగీకరించి "కోతులకు తోకచాల ఇష్టమైనదనియు, కావున ఈకోతి తోకకు నిప్పంటించి తరుముడనియు" ఆజ్ఞాపించెను. రాక్షసరాజు మాటలువిని అతని సేవకులు హనుమంతుని బయటకు తీసికొని వెళ్ళి అతని తోకకు పాతగుడ్డలు చుట్టి ఇంకను పెరిగినతోకకు మరిన్నిగుడ్డలు చుట్టి నూనెతోతడిపి పెద్దజ్వలించు కాగడావలె నిప్పంటించిరి. త్రాళ్ళతో బంధింపబడి, తోకమండింపబడి హనుమంతుడు లంకాపట్టణమంతయు వీధులందు త్రిప్పబడెను. "మననగరమును ప్రవేశించిన దొంగ ఇడిగో" అనుచు స్త్రీలును పిల్లలును అరచిరి. లంకవీధులన్నిట బూరాలతో భేరీలతో ధ్వనులు చేయుచు రాక్షసులు మారుతిని త్రిప్పిరి.

అశోకవనమున రాక్షసస్త్రీలు సీతతోమాటాడిన వానరుని తోకకు నిప్పుపెట్టి ఊరేగించుచున్నారని ఆమెకు తెలిపిరి. సీత అగ్నిని రగిలించి "ఓఅగ్నిహోత్రా! నాలో మంచితనమును, నిజాయితీ ఉన్నచో

హనుమంతునిపట్ల నీవు చల్లనై అతనికి హానికల్గింపకుము" అని అగ్ని దేవుని ప్రార్థించెను. హనుమంతుడు మంటలను, అవమానములను భరించి ఆ ఊరేగింపునెపముతో పట్టణవీధులనన్నిటిని అన్ని రహస్యము లతో ముందుచూపుతో మౌనముగ పరిశీలించెను. "ఆహా! ఏమిమాయ. నాతోకకు కట్టిన నూనెగుడ్డలు మండుచు నాతోకకేమియుపేడితాకకున్నది. రాముని పనికివచ్చిన నాయందు పంచభూతములు దయచూపుచున్నవి కాబోలు. సముద్ర మధ్యమున పర్వతముపైకిలేచి ఆతిథ్యమును ఇవ్వ జూపినాడుగదా. అట్లే అగ్నిదేవుడు నాకు హానిచేయకుండెనుకాబోలు. కాక అగ్ని నాతండ్రి వాయుదేవుని స్నేహితుడు. కావున నాతో చెలిమిని ప్రదర్శించెనో. ఈఅవకాశమును వినియోగించుకొని రాక్షసులకు దేవతల పట్ల భయమును కలుగజేతును" అని ఆలోచించి హనుమంతుడు హఠాత్తుగ తనరూపమును కుదించుకొని కట్టినత్రాడు విడిపోగా మండు తున్న తోకతో పెద్ద ఎత్తైన భవనోపరిభాగమునకెగిరెను. ఒకస్తంభమును పీకి గుండ్రముగ త్రిప్పుచు తనను బంధించినవారిని బెదరించి ఒక భవనమునుండి మరియొకభవనముమీదకు దూకుచు వానిని అగ్ని కాహుతిచేసెను. క్రమక్రమముగా పట్టణమంతయు మంటలతోనిండెను.

రాక్షసులును, స్త్రీలును, పిల్లలును భయముతో అరచుచు అటునిటు పరుగులెత్తిరి. ఈకోతి యముడేతప్ప మరేమియు కాదనియు, అతడు అగ్నిదేవుడే అనియు అనుకొనుచు అందరును మండుచున్నతమ గృహములనుండి పారిపోయిరి. హనుమంతుడు మండుచున్నమంటలను చూచి తనకు జరిగిన అవమానములకు

ఫలితముగ తలచుకొని సంతోషించెను. త్రికూట పర్వతముపై కూర్చుండి ఎఱ్ఱనిమంటలతో నిండిన పట్టణమును చూచి తృప్తిచెందెను. అనంతరము సముద్రమునకేగి తనతోకను నీటముంచి చల్లార్చుకొని తీరమునకు వచ్చెను. "అయ్యో! నేనెంతపని చేసితిని. నాకక్షతో నాజ్ఞానమును మరచితిని. కోపమునదుపులోనుంచుకొననిచో బలము నైపుణ్యమునుండి ఏమి ప్రయోజనము? నేను రేపినమంటలలో సీతకూడా మరణించియుండును. నాకోపము నాపనిని మొత్తము నాశనము చేసినది. ఈభూమండలమున నావంటిపాపాత్ముడును బుద్ధిహీనుడును ఉండరు. రాక్షసులమీదనాకుగల కోపము సీతను అంతముచేసినది. ఇక్కడ ఇప్పుడు నేను సిగ్గుతో నా జీవితమునకు అంతము చేసికొనవలయును" అని బాధపడుచుండగా హనుమంతుడు ఆకాశమున కొన్ని కంఠధ్వనులను వినెను. చారణులు, యక్షులును ఆకాశమున సంచరించుచు "ఏమి ఆశ్చర్యము, హనుమంతుని శక్తి ప్రకాశించుగాక! సీత ఉన్న ప్రదేశముతప్ప మిగిలిన లంక అంతయు మంటలలోనున్నది" అనుకొనిరి. ఈమాటలను వినిన హనుమంతుడు చింతనుండి విముక్తుడయ్యెను. సీత తననురక్షించుకొని నన్నును రక్షించినది. ఆమె నిర్మలత్వమే నన్ను అగ్ని హానిచేయకుండ రక్షించినది. అగ్నివంటి సీతను అగ్ని చేరలేదు. అని ఆలోచించుచు హనుమంతుడు మరల అశోకవనమునకేగి అచట శింశుపావృక్షముక్రింద సజీవముగానున్న సీతను కనుగొనెను.

హనుమంతుడు ఆనందముగ సజీవముగానున్నందుకు సీత సంతోషించెను. సంతోషించుచు హనుమంతుడు సీతకు నమస్కరించి

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి , నేదునూరు, తూ||గో||జిల్లా

"ఓతల్లీ! నీవు క్షేమముగానున్నట్లు చూచితిని. ఇదినీశక్తియే, నా అదృష్టమును. ఇపుడునేను వెళ్ళుటకు అనుమతినిమ్ము" అనెను. అపుడు సీత ఇట్లనెను. "నీవు నిజమైన నాయకుడవు. నీకు సాధ్యము కానిదిలేదు. నాస్వామి వెంటనే ఇటకు వచ్చి రాక్షస సంహారముచేసి నన్ను తీసికొని పోవునట్లు చేయుము. నేను నీపైనాధారపడియున్నాను. నీఒక్కడివే దీనిని సాధింపగలవు".

"తప్పకసుగ్రీవుడు రామలక్ష్మణులతో వానరయోధుల తోనిటకు వెంటనేవచ్చి రావణుని, అతని అనుయాయులను సంహరించును. శ్రీరామచంద్రుడు సంతోషముగ నిన్ను తీసికొని అయోధ్యకు వెళ్ళును విచారింపకుము. భగవంతుడు నిన్ను ఆశీర్వదించుగాక!" అని హనుమంతుడు పలికి సీతకడ శలవుగొని సముద్రతీరమునకు వెళ్ళి అందమైన అరిష్ట పర్వతమునెక్కి ఆకసమునకెగిరెను. త్రోవలో మైనాకుడు కుతూహలముతో తనకొఱకు నిరీక్షించుట చూచెను. అనురాగపూరితముగ ఒకమారు తనచేతితో మైనాకుని తాకెను. కాని నిలువలేదు. ధనువునుండి విడువబడిన బాణమువలె తిన్నగ ప్రయాణము చేసెను. మహేంద్ర పర్వతమును కనుగొనగానే అవ్వలితీరమును చేరుచున్నట్లు తెలుసుకొని గట్టిగా అరచెను.

ఇంతలో హనుమంతుడు తమవైపు పక్షివలె ఎగురుచువచ్చుట చూచినవానరులు "అతడు వచ్చెను. అతడు వచ్చెను" అని అరచిరి. ఇంతవరకు వారిహృదయములు జాగ్రత్తతోనిండియున్నవి. కనులు తడిసినవి. ఇపుడు ఆనందముతో గంతులువేసిరి. "అతడు తప్పక

విజయముతోవచ్చుచున్నాడు. కానిచో ఈవిధముగ అరవడు" అని జాంబవంతుడనెను. లంకనుండి తిరిగివచ్చుచున్న హనుమంతుని చూచుటకు వారు చెట్లను, కొండలను ఎక్కినిలిచిరి. చెట్లును, కొండలును తనస్నేహితులతో నిండియున్నందుకు హనుమంతుడు సంతసించెను. వారి ఆనందపూర్వకమైన అరపులను వినిచు అతడు మహేంద్ర పర్వతముపై దిగెను. హనుమంతుని చూడగనే సంతోషముతో వానరు లందరును మహేంద్రగిరి శిఖరమున సమావేశమయ్యిరి. అనుభవజ్ఞుడైన జాంబవంతుడు అత్యంతానురాగముతో వాయుపుత్రునకు స్వాగతము పలికి అందరతరపున ఇట్లు మాటాడెను. "మేమంతా కుతూహలముతో నీప్రయాణ విశేషములను, విజయవంతమైన ఫలితమును విన కుతూహలముతోనున్నాము. ప్రత్యేకముగ నీవు సీతనెట్లు కనుగొనగలిగి తివో అని ఆందోళణతో తెలిసికొన కోరికతోనున్నాము. ఆమె ఇపుడెట్లు న్నది? ఆమెశారీరక మానసిక స్థితి ఎట్లున్నది? ఓఅంజనకుమారా! రావణుని పరిస్థితిని అతని ప్రవర్తనను గురించి చెప్పుము. అన్ని సంగతులు తెలుసుకొనిన తరువాత ఏమిచేయవలసియున్నదను విషయ మును నిర్ణయించు పరిస్థితి ఏర్పడును". హనుమంతుడు మానసికముగ సీతకు వందనములు సమర్పించి చెప్పనారంభించెను.

తాను మహేంద్రగిరినుండి బయలుదేరిన సమయము నుండి తన ప్రయాణవిశేషములను, మార్గమధ్యమున తనకు కల్గిన అవాంతరములను, వానిని తానధిగమించిన తీరును, లంకాపట్టణ ప్రవేశమును, అందు సీతాన్వేషణ ప్రయత్నములును, చివరకు అశోక

వనమున సీతను కనుగొనుటయును, రావణుడామెను బెదిరించిన విధమును, సీతతో తాను పరిచయమేర్పరచుకొని మాటాడి ఆమె భీతిని పోగొట్టి తనపై విశ్వాసము కల్గించుకొన్న విధమును, సీతయొక్క గుణగణ వర్ణనమును, రామునికొఱకామె పరితపించువిధమును తానామెను ఓదార్చి ధైర్యము చెప్పిన విధమును, అనంతరము తాను రాక్షసరాజును దర్శింప అశోకవనమును ధ్వంసమొనర్చి రక్షణార్థము తనపైకి వచ్చిన వీరుల సంహరించిన విధమును, ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రముచే బంధితుడై సభాస్థలియందు రావణుని దర్శించిన విధమును, రావణుని తాను హెచ్చరించిన విధమును, ఫలితముగ శిక్షగ తనతోకకు నిప్పంటించి రాక్షసులూరేగించిన విధమును, అనంతరము తాను ఆతోకతో లంకాపట్టణ మును దహించిన విధమును, మరల సీతక్షేమమును చూచి ఆమెకు రాముడు వానరసైన్యముతో వచ్చి రాక్షస సంహారమొనర్చి తనను విడిపించునని తెలిపి ధైర్యము చెప్పిన విధమును , తన తిరుగు ప్రయాణ విశేషములను అన్నింటిని సమగ్రముగ వివరించి వానరులకందరకును తెలిపెను.

మనప్రయత్నములు విజయవంతముగ పూర్తిఅయినవి. సీతయొక్క పాతివ్రత్యమహిమచే ఈకార్యక్రమము సాధింపబడినది. ఇంత పతివ్రతను రావణుడు బంధించి మోసికొని పోయికూడా ఆమెశక్తిచే రావణుడింకను భస్మీభూతుడుకాక ఎట్లునిలిచియున్నాడని నాకాశ్చర్యము కలిగినది. కాని రావణుడు తనతపశ్శక్తితో చాలశక్తిని సాధించెను. అయినను సీతతలచిన తనపాతివ్రత్యముతో రావణుని బూడిద చేయ

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

గలదు. అయినను ఆమె సహనముతో ఈబాధలను సహించెను. ఆమె తనస్వామిద్వారా రావణుని శిక్షింపదలచెను. కావున సహించెను. ఇపుడు మీసలహాఏమి? మనము లంకకు తిన్నగావెళ్ళి రావణుని, రాక్షసులను సంహరించి సీతను రామునకప్పగింతమా? నేనొక్కడినే ఆపనిచేయగలను. జాంబవంతుడైనను, మనయువరాజు అంగదుడైనను, పనసుడు, నీలుడు, అశ్వనీపుత్రులు మైంద, ద్వివిదులు ఎవ్వరైనను ఒంటరిగ రాక్షస సంహార మొనర్పగలరు. లంకలో సభలో నేను "రాముని దూతగ, సుగ్రీవుని మంత్రిగ మిమ్ము నాశముచేయుటకు వచ్చితిని" అని గట్టిగా ప్రకటించితిని. ఇపుడు స్వచ్ఛతకు మారుపేరైనసీత అశోకవనమున శింశుపావృక్షము క్రింద రాక్షస స్త్రీలనడుమ బందీగా రక్షణకొఱకు ఎదురుచూచుచున్నది. నేను రాముడు త్వరగావచ్చి ఆమెను తప్పక చెరనుండి విడిపించునని హామీయిచ్చి వచ్చినాను. ఆలోచించి ఇపుడేమిచేయదగినదని నిర్ణయింపుడు" అని పలికెను.

ఈవృత్తాంతమంతయు విని అంగదుడు మిక్కిలి కోపముతో గంతులువేయుచు "ఇదంతయు నేనొక్కడినే చేయగలను. యుద్ధ దాహముతో ఉత్సాహముతోనున్న యోధులు ఇక్కడ మనలో చాలమందికలరు. ఇన్నినాళ్ళతర్వాత మనము రిక్తహస్తములతో సీత మనతో లేకుండ రామునికడకు వెళ్ళుట అసమంజసము. మనము లంకకు తిన్నగావెళ్ళి ససైన్యముగ రావణుని చంపి మనమధ్య సీతను వెంటనిడికొని కిష్కింధకు తిరిగి వెళ్ళుదము" అని పలికెను. వృద్ధుడు, బుద్ధిమంతుడునగు జాంబవంతుడు "కాదు. అది సరియైనపద్ధతికాదు.

ఓరాజకుమారా! మనము అన్ని విషయములను రామలక్ష్మణులకు తెలుపవలెను. అపుడువారు కోరినరీతిగ చేయవలెను. రాముని కార్యము ఆయనకోరిన రీతిగ నెరవేర్పబడవలెను. అదిమాత్రమే తగును" అని సలహానీయగ హనుమంతుడును, అంగదునితోసహా వానరులందరును ఇట్లు చేయుటయే తగునని అంగీకరించి ఆకసమునకెగిరి కిష్కింధవైపు ఎగిరిరి. వారందరును సురక్షితమైన వానరప్రభువుయొక్క ఉద్యానవనము కడ దిగిరి. రక్షక భటుల హెచ్చరికలను లెక్కచేయక వారు వనములోనికి ప్రవేశించి తేనెనుత్రాగి, ఫలములను భక్షించిరి. వారు అదుపులేని విలాస ముతో ఆసుందరవనమును ధ్వంసమొనర్చిరి. సంబరముచేసుకొనుచున్న వారి ప్రవర్తనను నిలుపలేక సుగ్రీవుని మేనమామయు, రాజోద్యానవన రక్షకుడునగు దధిముఖుడు ప్రభువుకడకు తొందరగ వెళ్ళి చెప్పెను.

"ప్రభూ! మీసురక్షిత ఉద్యానవనము ధ్వంసమైనది. దక్షిణదిశకు వెళ్ళిన వానరులు తిరిగివచ్చి, వనమునదిగి నామాటలు లెక్కింపక నన్నవమానించి తేనెయంతయు త్రాగివేసిరి. వారిష్టము వచ్చిన రీతిగ పండ్లన్నియు తినివేసిరి. అంతేగాక ఒడలు తెలియకపడియున్నారు. చెట్లు, మొక్కలు అన్నియు నశించినవి. ఈఅక్రమకార్యములు చేసిన వానరులను ప్రభువులు శిక్షింపవలయును". ఒక్కసారిగ సుగ్రీవుడు పరిస్థితిని అవగతము చేసికొనెను. "లక్ష్మణా! హనుమంతుడు, జాంబ వంతుడు, అంగదుడును వారి అన్వేషణయందు విజయమును సాధించిరి. వారి విజయోత్సవమునిట్లు జరుపుకొనుచుండిరి". ఈమాటలు పలుకుచు అతడు దధిముఖునితో "వెంటనే వారినందరను ఇటకు పంపుము" అని

చెప్పెను. దధిముఖుడు పరిస్థితులను అర్ధముచేసికొని వానరులకడకు వేగముగా వెళ్ళి వారికి ప్రభునాజ్ఞను తెలియపరచెను.

సుగ్రీవుని ఊహ రాముని చెవులకు అమృతమువలె సోకినది. కుతూహలముతో వానరులరాకకై వారు నిరీక్షించిరి. కొద్దిసేపటిలో ఆకాశమున గొప్ప అలజడి ఏర్పడి విజయోత్సాహముతో వానరులు కేకలువేయుచు క్రిందకు దిగిరి. రామలక్ష్మణులతో ఎదురుచూచుచున్న సుగ్రీవుని కడకు హనుమంతుడు, అంగదుడు వానరులను నడిపించుకొని వచ్చిరి. హనుమంతుడు నమస్కరించి "చూచితిని నిష్కల్మషదేవతయగు నీరాణి సీతను. ఆమె లంకలో క్షేమముగానున్నది. నేనిక్కడనుండియే ఆమెకు నమస్కరింతును" అనుచు దక్షిణ దిక్కునకు తిరిగి సీతకు నమస్కరించెను. ఈవిధముగ సీతయొక్క క్షేమమును శ్రీరామచంద్ర ప్రభువునకు హనుమంతుడు తెలిపెను. సుగ్రీవలక్ష్మణులు రాముని సంతోషముతో ఆలింగనము చేసికొనిరి. అయోధ్య రాకుమారుడు రాముడు ఆశ్చర్యముతో "ప్రియమైన వానర స్నేహితులారా! సీత ఎచ్చటనున్నదో చెప్పుడు? సీత ఎట్లున్నది? నీవు ఆమెను ఎట్లు చూడగలిగితివి? అన్ని విషయములు సవిస్తరముగ చెప్పుము" అని కుతూహలముతో రాముడు ప్రశ్నలవర్షము కురిపించెను. ఇతరవానరులు వెనుక నిలబడిన హనుమంతుని చూచి అక్కడచూచినది, జరిగినది అంతయు వర్ణింపుమని కోరిరి. హనుమంతుడు తనబలపరాక్రమములతో ఒంటరిగ అంతటి ఘనకార్యమును సాధించెను. అయినను యువరాజు అంగదునకు, వృద్ధుడు జాంబవంతునకు ప్రాధాన్యతనిచ్చి రామునకు, సుగ్రీవ ప్రభువు

నకు ఎదుటకు తనంతతానుగ ముందుకురాక వారు తనను మాటాడు మని అడుగునంతవరకు మౌనముగానుండెను.

నూరుయోజనముల సముద్రమును దాటి దక్షిణతీర మందలి దుర్మార్గుడగు రావణుని పట్టణమును చేరితిని. రాజభవన పార్శ్వమునగల ఉద్యానవనమున బందీకృతయైన సీతను చూచితిని. ఆమె సుష్కించిన రూపము చూచుటకు ఆశ్చర్యము కల్గినది. ఆమె తన భర్తను తలచుచు, అతని నామోచ్చారణముచేయుచు మాత్రమే జీవించి యున్నది. క్రూరమైన, జుగుప్సాకరమైన రాక్షసవనితలు ఆమెను చుట్టియుండిరి. ఆమె ముఖము దుఃఖముతోనిండి నేలపై పరుండి యుండెను. రాక్షసరాజ భయబెదిరింపులతో ఆమె నేను చేరుసరికి ఆత్మహత్యాప్రయత్నమందున్నది. నేను నీగుణగణములను నెమ్మదిగ కొనియాడనారంభించితిని. ఒకసామాన్య కోతినగునేను ఆమెకింతకు పూర్వము అపరిచితుడను. మొదట ఆమెకు నాపై నమ్మకము కల్గునట్లు చేసికొని అపుడామెతో నేను మాటలాడితిని. ఆమెకు మీకును, సుగ్రీవునకును కుదిరిన ఒప్పందముగురించి తెలిపితిని. నీదుఃఖము గురించి, ఆమెపట్ల నీకుగల ప్రేమను గురించి ఆమెకు చెప్పితిని. ఈమాటలు ఆమెను తీయని దుఃఖముతోనింపి ఆమెయందు ఆశను మేలుకొలిపి బ్రతుకుపై కోరికకలిగించెను. ఆనవాలుగ నాచే అడుగబడిన ఆమె నిర్మలదేవత నాకీ ఆభరణమును సమర్పించెను. నీకిమ్మనిచెప్పెను. నీవు నిదురించుచుండ ఒకానొకప్పుడు ఒకవాయసము తనను బాధించిన విధమును, దానికి నీవు బాధపడినవిధమును నీకు గుర్తు చేయుమనెను.

పర్వతములపై తిరుగుచుండగా చెమటచే చెదరిన తిలకమును చూచి నీవు ఒకరాతిని రాపిడిచేసి తనముఖమున ఎఱ్ఱని రంగును తిలకముగా దిద్దిన సంఘటనను నీకు గుర్తుచేయుమనెను. తాను ఒకమాసము మాత్రమే బాధపడుచు జీవించియుండుననియు, తరువాత రావణుని చేతులయందు చంపబడుటగాని, తనంతతాను ప్రాణత్యాగమొనర్చుటగాని చేతుననియు నీకు తెలుపుమనికోరెను. ఆమె తనమర్యాదలు వానర ప్రభువునకు తెలుపుమనెను. కావున వెంటనే లంకకు వెళ్ళి ఆరాకుమారిని తిరిగివిడిపించి తెచ్చుటకు కావలసిన ఏర్పాట్లు చేయుట గురించి మనము ఆలోచింపవలసియున్నది". ఇట్లు చెప్పుచు హను మంతుడు సీతయొక్క శిఖామణిని శ్రీరామచంద్రునకు సమర్పించెను.

శ్రీరాముడు హనుమంతుని చేతులనుండి ఆయాభరణ మును తీసికొని దానిని చూడగానే అంతులేని సంతోషదుఃఖములతో మూర్ఛనందెను. అతడాఆభరణమును తనగుండెలకు హత్తుకొని ఓలక్ష్మణా! అని అరచి హనుమంతుని ఆలింగనము చేసికొని "ఓవాయు పుత్రుడా! సీతను చూచిననీవు ఆశీర్వదింపబడుదువుగాక! నేనుకూడా ఇపుడు నాముందు సీతను చూచుచున్నాను. నీవు నిజముగ సీతను నాకడకు తెచ్చితివి. ఓప్రియనాయకా! నాహృదయహితుడా! అన్నివిషయ ములను పూర్తిగ మరల చెప్పుము. సీతపలుకులు మరలనాకు తెలుపుము. ఆమె మధురవచనములను మరల వినిపింపుము" అని పలికెను. హనుమంతుడు వృత్తాంతమంతయు మరల వివరించెను. "చాలమంది రాక్షసులను రాముడు సంహరించెను. కాని రావణుని

సంహరించి నన్ను బాధలనుండి రక్షించుటకు రాముడేలరాలేదు? దుర్మార్గులను సంహరించుటకు లక్ష్మణుని ఏలపంపలేదు? అతని ప్రేమను పోగొట్టుకొనునంతనేరము ఒకఆలోచనగాని ఒకమాటగాని ఒకపనిగాని నేను చేసియుండలేదే" అను సీతమాటలు వినుటతోడనే రాముడు దుఃఖించెను. అంతట హనుమంతుడు "రాముడు, లక్ష్మణుడును నిన్ను మరువలేదు. రాముడు నిన్నేస్మరించుచున్నాడు. నీఆలోచన, దుఃఖము లేనిక్షణము రామునకులేదు. నిద్రాహారములు విడిచి నిన్ను స్మరించు చున్నాడని తెలిపి ఆమెకు ధైర్యమును కలిగించితినని" రామునకు చెప్పెను.

ఇట్లు సీత వృత్తాంతమును రామునకు మరల వినిపించి హనుమంతుడు రాముని ఓదార్చి దుఃఖమును పారద్రోలి, ఇపుడు చేయ దగిన కర్తవ్యమాలోచింపుడు, సైన్యముతో మనమెట్లు సముద్రమును దాట గలమని సీత సందేహము వెలిబుచ్చెను. ఏసందేహము అవసరములేదని నేను ఆమెకు హామీయిచ్చితిని. నాకంటెబలమైన వీరులున్నారనియు నావీపుపై రామలక్ష్మణుల మోసికొని వత్తుననియుతెలిపి ఆమెకు సందేహ నివృత్తి గావించితిని" అని హనుమంతుడు పలికెను. రాముడు హనుమంతుడు చెప్పినదంతయు కనులనీరు పెట్టుకొనుచు హృదయ పూర్వకముగ ఆలకించెను. హనుమంతుడు తనకుచేసిన ఉపకృతికి ప్రతిఫలముగ అతనికి తానేమియు ఈయలేని స్థితియందున్నందుకు చింతించి నాకు నీవొనర్చిన సేవలకు కృతజ్ఞతగనేనిపుడు ఈయగలిగిన దిదియే అనుచు రాముడు హనుమంతుని గాఢముగ కౌగిలించుకొనెను.

సుగ్రీవా! హనుమంతుడు అద్భుతకార్యమును నిర్వహించెను. రాక్షసరక్షితమగు లంకలో ప్రవేశించి సీతను కనుగొని ఆమెను ఓదార్చి ఆమె ప్రాణములను కాపాడెను. ఆమెగురించి శుభవార్తను తెచ్చి నా ప్రాణములను రక్షించెను. కానిమనమిపుడు సముద్రమునెట్లు దాటబోవు చున్నాము? మనపెద్దసైన్యమవ్వలితీరమునెట్లు చేరగలదు? రావణపట్టణ మును, రాక్షససైన్యమును ఎదిరించుటకు ముందు సముద్రమును దాట వలెను. హనుమంతుని విజయము, అతడుతెచ్చిన శుభవార్తయు మన భవిష్యత్పధకమును మరపించినవి". రాముని మాటలను విని వానర ప్రభువు సుగ్రీవుడు "ప్రభూ రామా! క్రుంగిపోవు కారణమేమి? నా యోధులు నీకొఱకు తమ ప్రాణములనిచ్చుటకు సిద్ధముగనున్నారు. నిన్ను, లక్ష్మణుని లంకకు చేర్చుట మాకు సంతోషదాయకము. హనుమంతుడు లంకను చూచిన వెంటనే అది, దానికోట పడిపోయినట్లే. సందేహము యోధులను బలహీనపరచును. మనవిజయము తప్పదు. నామనసునందలి విశ్వాసము మనకు శుభశకునము వంటిది". ఆవిధముగ సుగ్రీవుడు రామునకు నమ్మకము కలుగజేసి కర్తవ్య నిర్వహణకు ప్రోత్సహించెను. అనంతరము రాముడు, హనుమంతుడు లంకను గురించి, పట్టణము, కోట దాని రక్షణ మున్నగువిషయములపై చర్చించిరి. హనుమంతుడు లంకాపట్టణ సంపద, రాక్షసుల సుఖ జీవనము, రావణుని పట్లవారికిగల నమ్మకము, అనురాగములను

రామునకు వివరించెను. రావణుని సైన్యబలము, కోటయొక్కఆకారము, బలము, రక్షకభటుల జాగరూకత, కందకములు, గోడలు, ద్వారములు మున్నగు రక్షణ పటిష్ఠతలగురించి హనుమంతుడు రామునకు చెప్పెను. సముద్రతీరమేవిధముగ శత్రునౌకలు సమీపించకుండ రక్షింపబడుచున్నదో రామునకు వివరించెను.

"అయినను మనవానరసేన లంకసేనకు పూర్తిగ సమ మైనది. మనసైన్యమందు సాటిలేనియోధులు అంగదుడు, ద్వివిదుడు, మైందుడు, జాంబవంతుడు, పనసుడు, నలుడు, నీలుడు మున్నగు వారుకలరు. అంతులేనిసైన్యము కలదు. మనము ఆకసమున ఎగురుచు, నేలను తాకకుండ, లంకను నాశమొనర్చగలము. దాని పర్వతములు, అడవులు మొదలగు రక్షణలు మనకులెక్కలేవు. మనము లంకాపట్టణ మును నేలమట్టము చేయగలము. అనుకూలమైన శుభముహూర్తమును నిర్ణయించి మేము బయలుదేరుటకు ఆజ్ఞాపించుము" అని హను మంతుడు పలికెను.

జయప్రదమగు నక్షత్రము ఉత్తరఫల్గుణీ నక్షత్రమందు, మిట్టమధ్యాహ్న సమయమున వానరసైన్యము దక్షిణసముద్రమువంక బయలుదేరెను. మంచి శకునములు వారిని ఆశీర్వదించెను. సైన్యము ముందుకు నడచుచుండగా శ్రీరామలక్ష్మణులును, సుగ్రీవుడును పరస్పరము మాటాడుకొనుచు వెళ్ళిరి. "మనము బయలుదేరినట్లు సీతకు తెలిసినచో ఆమె ప్రాణములను నిలుపుకొనుటకు ధైర్యము కలుగును" అని రాముడనెను. మార్గముతెలిసిన రక్షకభటులు

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

చాటుమాటునదాగిన శత్రువులకొఱకు పరిశీలించి చూచుచుముందుగ వెళ్ళిరి. పెద్దసైన్యమునకు ఆహారపానీయములను కల్పింపవీలున్న మార్గములవెంబడి సైన్యమును నడిపించిరి. సైన్యము మిక్కిలి వేగముగ పర్వతములను, అరణ్యములను దాటెను. వానరులు తమప్రయాణము వేగవంతమగుటకు రామలక్ష్మణులను తమభుజములపై కొన్నిమారులు మోయుచుండిరి. వానరుల కుతూహలము ప్రతిక్షణము వృద్ధియగు చుండెను. వారు దుముకుచు అరచుచు క్రీడించిరి. వారొకరితోమరియొకరు "రావణుని నేను చంపుదును రావణుని నేను చంపుదునని" మాటలాడు కొనుట రాముడు వినెను. నీలుడు, కుముదుడు సైన్యమునకు ముందు భూస్వభావమును పరిశీలించుచు వెళ్ళిరి. బలమైనయోధులు సైన్య పృష్ఠభాగమున వెనుకనుండి రక్షణార్థము ఉంచబడిరి. ప్రభువు సుగ్రీవుడు, రామలక్ష్మణులును మధ్యభాగముననున్నారు. మార్గమధ్యమందలి పట్టణ ములకు పల్లెలకునెట్టిహానియు కల్గింపరాదని శ్రీరాముడు సైన్యమునకు ఖచ్చితమైన ఆజ్ఞలనిచ్చెను. సైన్యఘోష సముద్రఘోషవలె ఎనిమిది దిక్కు లందు నిండినది. సైన్యముచే లేపబడిన ధూళి ఆకసమును మూసినది.

వారుమహేంద్రపర్వతమును చేరినతర్వాత రాముడు గిరిశిఖరమునధిరోహించి సముద్రమును పరిశీలించెను. "ఇపుడుమనము, మనసైన్యము సముద్రము ఎట్లుదాటగలదో ఆలోచించి నిర్ణయింపవలెను. అంతవరకు ఈసైన్యము అరణ్యమందు మకాముచేసి విశ్రమింపనిండు" అని రాముడు పలికెను. సుగ్రీవుడు సేనాపతులను ఆజ్ఞాపించెను. సముద్ర తీరమున అరణ్యమందు వానరులు మకాముచేసిరి. సుగ్రీవుడును,

రామలక్ష్మణులును సైన్యమంతయు సుఖముగ స్థిరపడినదని తృప్తిచెందిన తరువాత సోదరులిరువురు దూరముగ విశ్రమించిరి. "ఒకవ్యక్తి తనకు ప్రియమైన ఒక వస్తువును కోల్పోయినచో దానిగురించి మరచిపోవునట్లు కాలము సహకరించునని జనులు చెప్పుదురు. కాని లక్ష్మణా! నేను కనుగొనినదిదికాదు". రామునకు తానుకోల్పోయిన సీతను గురించి విచారము పూర్వముకంటె అధికతరమైనది. రావణుడు సీతను బంధించి ఎత్తుకొనిపోయినపుడామె "హా నా స్వామీ! హా రామా! హా లక్ష్మణా! అని గట్టిగానేడ్చుచు అరచియుండవచ్చును. ఆమెను రక్షించుటకెవ్వరురాలేదు. మనము ఆమె రక్షణకు వెళ్ళలేకపోయితిమి. ఈపరిస్థితిని నేను తలచి నపుడెల్ల నాదుఃఖము పెల్లుబుకుచున్నది. నేనేమిచేయగలను? విషము త్రాగినవాని అవయవములవలె నాశరీరమంతయు బాధతోమండు చున్నది. ఆమె క్రూరరాక్షస వనితల గుప్పిట చిక్కినది. జనకమహారాజు కూతురు, దశరథమహారాజు కోడలు రాక్షసస్త్రీలచే బందీగా చుట్టువారబడి కటికనేలపై పరుండెను" అని రాముడు విలపింపగా లక్ష్మణుడు "రామా! విచారమును విడువుము. వెంటనేమనము రావణుని సంహరించి, సీతను రక్షించి మన గృహమునకు అయోధ్యకు ఆమెను తీసికొని పోదుము. ఆమె పాతివ్రత్య దేవతవలె మనపట్టణమున ప్రవేశించును. నీవిచారమును విడిచిపెట్టుము. ధైర్యముతోనుండుము" అని పలికెను.

లంకయందు హనుమంతుడు సాధించిన విజయమును గురించి రాక్షసరాజు రావణుడు సిగ్గుపడెను, భయపడెను. తనమంత్రులతో సమావేశము నేర్పరచెను. "జరిగినదంతయు క్రొత్తగను ఊహాతీతముగా

నున్నది. ఇంతవరకు ఎవ్వరును మనలంకాపట్టణమునందు కాలుమోప లేదు. కాని రాముని దూత లంకలో ప్రవేశించుటయేకాక బందీకృత సీతను కలసిమాటాడెను. అతడు ఆలయములను, భవనములను నాశమొన ర్చెను. అతడు మన మంచియోధులందు కొందరను చంపెను. మన ప్రజలకు భయముకలిగించెను. ఈవిషయమింతటితో ఆగునట్లు తోచుట లేదు. అందుచేత మనమేమి చేయవలసినదియు ఆలోచింపవలెను. ప్రభువు తనమంత్రులతో ఆలోచించి ఏదైనా నిర్ణయించవలెనని మీరెరుగుదురు. అందుచే నేనీసమావేశము నేర్పాటుచేసితిని. రాముడు మనకు శత్రువుగా పరిణమించెను. దానిగురించి మనమేమి చేయవలసి యున్నది? ఆలోచింపుడు. యధార్ధమును గుర్తించలేని మంత్రులవలన ప్రభువునకు ఉపయోగములేదు. మనముందున్న సంగతి చాలముఖ్య మైనది. రాముడు, అతనిసేన బలవత్తరము. సముద్రలంఘనమునకు వారు యుక్తిపన్నుట తధ్యము. ఒకరక్షణను నమ్ముట అవివేకము. ఏవిధముగ మనబలమును పెంచుకొని మనపట్టణమును, సైన్యమును రక్షించుకొనవచ్చునో, మనల రక్షించుకొనుట కేమిచేయవలెనో బాగుగ ఆలోచించి నాకు తెలుపుడు" అని రావణుడు పలికెను.

రావణుని మాటలను విని సభయందలి సభ్యులందరు ఏకగ్రీవముగనిట్లు పలికిరి. "ఓమహారాజా! ప్రపంచమంతటియందును మనసైన్యము, మనఆయుధములును మిక్కిలి బలవత్తరమైనవి అని తెలిసియుండియు నీవు ఆందోళణ పడనవసరమేమికలదు. మనకోటను, మనసైన్యమును ఎదిరించునట్టి విజయకాంక్షయున్నట్టి శత్రువు ఎక్కడ

కలడు? నీశక్తి ఎంతటిదో ప్రపంచమునకు తెలియును. నీవు భోగవతీ పట్టణముపై దండెత్తి నాగలోకప్రభువును ఓడించలేదా? శక్తివంతుడైన కుబేరుని, యక్షులను జయించి పుష్పకవిమానమును, లంకాద్వీపమును స్వాధీనపరచుకొనలేదా? మయుడు నీకు భయపడి నిన్ను మంచిచేసి కొనుటకు తనకుమార్తెను నీకిచ్చి వివాహముచేసినాడుకదా? కాలకేయులతో యుద్ధముచేసి వారల జయించితివి. ఇకరాముడెంత? నీకుమారుడు ఇంద్రజిత్తు ఒక్కడే రాముని, అతని వానరసైన్యమును అంతమొందించ గలడు. అతడు ఇంద్రుని బంధించి తరువాత విడిచిపెట్టలేదా? అట్టి యోధుని ఎదిరించి రాముడు, వానరులును ఎట్లు నిలువగలరు? నీవు వానరసైన్యమును ధ్వంసమొనర్పుమని ఇంద్రజిత్తును ఆజ్ఞాపించిన చాలును. అంతయు పూర్తియగును. ఓ మహారాజా! ఎందుకునీవు ఆందోళన పడుదువు?" అనుచు తమరాజును కీర్తించుచు పలికిరి.

ప్రధానసేనాధిపతి ప్రహస్తుడు పెద్దనల్లని మేఘమువలె లేచి "ఓచక్రవర్తీ! దేవదానవగంధర్వాదులను రణరంగమునజయించిన నీవు ఈఅల్పజీవుల గురించి ఎందుకు ఆందోళన చెందుచున్నావు? నిజమే. ఒకకోతివచ్చి నిద్రలోకునికిపాట్లు పడుచున్న మనలను పట్టుకొని కొంతకీడు చేసినది. కాని ఇట్టిసంఘటన మరల ఎన్నడును జరగదు. అతడు మరలవచ్చిన అతనిని ఏవిధముగ నిభాయించవలెనో నేనెరుగుదును. నీవుఆజ్ఞాపించినచో నేనొక్కడనే వానరవంశమునంతటిని ధ్వంస మొనర్పగలను. ఈచిన్నపొరపాటుచే సీతను ఎత్తుకొని వచ్చుటచే నీవు భయపడనవసరములేదు" అని పలికెను. అనంతరము దుర్ముఖుడు లేచి

"ఈకోతిని విడిచిపెట్టరాదు. నేను వెంటనేవెళ్ళి వానర సైన్యమును సమూలముగ నిర్మూలించివత్తును" అని అరచెను. వజ్రదంష్ట్రుడనువాడు తన ఆయుధమును పైకెత్తి చూపుచు మనశత్రువులు రామలక్ష్మణులు. మీరు అనుమతించిన వెంటనే వెళ్ళి వారిని వానరసైన్యమును సంహరించి వత్తును. మనరాక్షసులను కొందరను మానవరూపమున వెళ్ళి రామునకు సహాయముగ భరతుడుపంపినట్లు తెలిపి ఇంకను పెద్దసేన వెనుక వచ్చుచున్నదని రామునకుచెప్పి అతడు నిర్లక్ష్యధోరణియందున్నపుడు మనరాక్షససేన ఆకాశమార్గమున వెళ్ళి వారిని, వారిఅనుయాయులను అవ్వలిసముద్రతీరమునందే నాశముచేయుట నాసలహా" అని పలికెను. కుంభకర్ణుని కుమారుడు నికుంభుడు, మరియొకరాక్షసుడు, ఇతరరాక్షసులును లేచి రాజునకు ధైర్యవచనములు చెప్పుచు తమఆయుధములనెత్తి చూపుచు గట్టిగ అరచిరి.

రావణుని కనిష్ఠసోదరుడు విభీషణుడు వారినందరను కూర్చుండజేసి చేతులుజోడించి రావణునితోనిట్లుచెప్పెను. "అగ్రజా! వీరు చెప్పిన తీపిమాటలు నిజముకాదు. నీతిశాస్త్రమునతిక్రమించి ఏపనిచేసినను దుఃఖమును, నాశమును కల్గించును. సామదానభేద ఉపాయములను ఉపయోగించిన తర్వాతనే దండోపాయమును గురించి ఆలోచింపవలెను. వీరిసలహాలననుసరించి యుద్ధమునకు సిద్ధపడిన లంకయొక్క, మనందరయొక్క నాశమునుకోరినట్లే. ధర్మమును గురించి ఆలోచించినపుడు రాముని భార్యను నీవు అపహరించితెచ్చుట మహాపాపము. ముందు మనపాపమును మనము ప్రక్షాళన చేసికొనవలెను. రాముడు

మనకుచేసిన హానియేమి? దండకారణ్యమున రాముడుచేసినదిఆత్మరక్షణ మాత్రమే. తనను చంపుటకు వెళ్ళినవారితోమాత్రమే అతడుయుద్ధ మొనర్చి చంపినాడు. అతనిభార్యను ఎత్తుకొని వచ్చుట న్యాయముకాదు. అతనిపై ఏమైన చర్యతీసికొననెంచిన అతనితోయుద్ధమున నెదిరింపవలసి యున్నది. దానికి బదులుగ అతనిని దగ్గరలేకుండాతరిమి అతని భార్యను బంధించుట చాలనేరమును, పాపభరితమును. తప్పునీయందుంచుకొని యుద్ధమునకు వెళ్ళుట నీతికాదు. యుద్ధమునకు వెళ్ళుముందు రాముని, అతనిసైన్యముయొక్క బలములను తెలిసికొనవలయును. హనుమంతునిశక్తి, నిపుణతలను మనము రుచిచూచియున్నాము. దాని గురించి తేలికగ మాటలాడుట మంచిదికాదు. అతడు గుర్తింపదగిన పనులను చేయలేదా? మనబలము గొప్పదైనను, ఎదుటివారిబలముతో సరిచూచుకొని యుద్ధముచేయుటయు, మానుటయు నిర్ణయించవలెను. కాని మనము మొదటచేయదగినది సీతను రామునకప్పగించుట. రాముడు, వానరులును లంకను ఎదిరించకముందే రామునకు సీతనప్పగించుట మంచిదని నాసలహా. ఓ అగ్రజా! ఇదంతయు నీమంచి కొఱకు నేను చెప్పుచుంటిని. నాపై కోపింపవలదని ప్రార్ధించుచున్నాను. ముందు మనతప్పును సవరించుకొని మిగిలినవిషయములాలోచింప వలెను" అని వినయపూర్వకముగ రావణునకు విభీషణుడు చెప్పెను.

రావణుడు తనమంత్రులచేత, సేనాధిపతులచేతను చెప్పబడిన మాటలతో సంతోషించినను, అతని మనసునందు సందేహము కలదు. కావున విభీషణుని మాటలు వినినతర్వాత "రేపు మరల కలిసి

ఈవిషయమై ఆలోచింతము" అని రావణుడు సమావేశమును ముగించి విశ్రాంతికి వెళ్ళెను. సూర్యోదయముకాగానే విభీషణుడు రావణుని క్షేమమును గురించి ఆలోచించి అతనిని రక్షించునిమిత్తము అతని మనస్సును మార్చుటకు రావణమందిరమును ప్రవేశించి వినయముగ నిలబడెను. రావణుడు ప్రధానమంత్రులు మినహా మిగిలినవారిని బయటకుపంపి తనసోదరుని మాటాడుమనెను. "ఓనాసోదరప్రభూ! నేను చెప్పుమాటలు నీకు నచ్చనిచో నన్ను క్షమింపుము. నిన్ను గొప్ప ప్రమాదమునుండి రక్షించుకొనుటయే నాకోరిక. దానికింకను సమయ మున్నది. నేను చెప్పినది విని ఏమిచేయునది నిర్ణయించుకొనుము. నీవు సీతను లంకకు తెచ్చిననాటినుండియు మనము దుశ్శకునములే చూచుచున్నాము. సరియైన మంత్రములతో హోమము చేసినను అగ్ని ప్రజ్వలించుటలేదు. ఆవులు పాలనీయుటలేదు, ఏనుగులు, గుఱ్ఱము లును జబ్బుపడినవి. ఆహారమును తీసికొనుటలేదు. ఇండ్లపై కాకులు గుంపులుగచేరి కూయుచున్నవి. అందుచే మనకీ అనవసర శత్రుత్వ మెందుకు? సీతను రామునకప్పగించి సుఖముగ జీవింతము". ఈవిధముగ విభీషణుడు తన అగ్రజునితో వాదించెను.

"లేదు. సీతను తనవారికి తిరిగి అప్పగించు ప్రసంగమే లేదు. ఈశత్రుత్వముగురించి ఆలోచించనవసరములేదు. ఇందు భయపడ వలసినపనిలేదు. ఇపుడు నీవు వెళ్ళవచ్చును" అని రావణుడు విభీషణుని వెళ్ళగొట్టెను. రావణునకు అప్పటినుండియు మనశ్శాంతి లేకుండెను. సీత తనకులొంగలేదు. తనదగ్గరబంధువులు తనప్రవర్తనను

సమ్మతించుటలేదు. అతడు మరల సమావేశమేర్పరచెను. కామము అతనిని అపమార్గమునకు నడిపించుచున్నది. సమస్తరాజలాంఛనము లతో రావణుడు మంగళవాద్యములు ప్రతి ధ్వనించుచుండ రధారూఢుడై సభాభవనమును ప్రవేశించెను. మయనిర్మితమైన స్వర్ణ భవనమున రావణుడు సింహాసనాధిష్ఠితుడయ్యెను. రాజాజ్ఞను శిరసావహించివేలకొలది రాక్షసయోధులు సమావేశమయ్యిరి. వీధులయందు వాహనములు బారులుతీరియున్నవి. మతగురువులు, వేదపండితులు సభలో ఉచితాస నములనలంకరించిరి. విభీషణ, శుక, ప్రహస్తాదులు వారివారి ఆసనము లందు ఉపవిష్టులైరి. ఆసభ ఇంద్రసభను పోలియున్నది.

రావణుడు గంభీర కంఠధ్వనితోనిట్లనెను. "మీరందరు యుద్ధకళలందు బలధైర్య నిపుణతలుకలవారు. కష్టమునుండి బయట పడు ఉపాయములు తెలిసినవారు. మీసలహాలెపుడును వ్యర్ధముకాలేదు. అందుచే మీసలహాలకొఱకు మిమ్ము సమావేశపరచితిని. నేనేమి చేసితినో మీకుతెలియును. నేను సీతయందుకోరికతో ఆమెను దండకారణ్యము నుండి ఇక్కడకు తెచ్చితిని. రాముడు వచ్చి తనను తిరిగి తీసికొనిపోవు నను ఆశతో ఆమె నాకోరికను తిరస్కరించెను. ఒకసంవత్సరము వ్యవధి అడిగెను. నాకోరికనెరవేరలేదు. నేను సీతను రామునకప్పగించి రాముని క్షమాభిక్ష వేడుటకిష్టపడను. ఇంతవరకు నేనుగాని నాయుద్ధవీరులుగాని ఓటమి ఎరుగము. ఒకపెద్దకోతి సముద్రముదాటివచ్చి ఇచట కొంతమాయ చేసినది. రాముడును, ఇతరవానరసైన్యమును సముద్రమును దాటి రాలేరు. ఒకచో వచ్చినను మనము భయపడనవసరము లేదు.

సముద్రము అవ్వలితీరమున రామలక్ష్మణులును, సుగ్రీవుడును, వానరులును మకాములోనున్నారు. నేను ముందుగా సమావేశమేర్పాటు చేసితిని. కుంభకర్ణుడు గాఢనిద్రలోనుండెను. ఏవిధముగ రామలక్ష్మణులను మనము చంపగలము?". ఈవిధముగ రావణుడు మోహముచే గుడ్డివాడై తన ఆందోళనను, సత్యమును కప్పిమాటాడెను. సీత తనకోరిక తీర్చుటకు ఒకసంవత్సర వ్యవధి కోరెనని రావణుడసత్యమాడెను. తనను వివాహము చేసుకొనుమని కోరుచు ఆలోచించుకొనుమని సీతకేరావణుడు ఒకసంవత్సరము వ్యవధి ఇచ్చెను. అటుపిమ్మట ఆమెను వండించుకొని భక్షింతునని బెదిరించెను.

కుంభకర్ణుడు రావణుని తమ్ముడు. సమావేశమునందిట్లు మాటాడెను. "ఓమహారాజా! దేశరక్షణనియమములు విస్మరించి నీవు పెద్దప్రమాదములోనికి పరుగెత్తితివి. రామలక్ష్మణులపైగల నీక్రోధ వైరములకు మూలకారణమేమైనయున్నచో వారిని ముఖాముఖి ఎదిరించి జయించి సీతను ఎత్తుకొని వచ్చుటకు ముందే సంహరించియుండ వలసినది. నీవట్లుచేసియున్నచో సీత నిన్ను మెచ్చుకొని నిన్ను అంగీకరించు అవకాశముండెడిది. నేరముచేసి రామునితో శత్రుత్వము తెచ్చుకొనకముందు నీవు మాతో ఆలోచించలేదు. కాని చాల ఆలస్యమైన తర్వాత మమ్ము సంప్రదించినావు. ఒకప్రభువు అనుసరించవలసిన పద్ధతి ఇదికాదు" అని కఠినముగమాటలాడి కుంభకర్ణుడు ప్రభువు వైపుచూచి అతడు బాధపడినట్లు గ్రహించెను. తన అన్న విచారగ్రస్త ముఖమును చూచి సహింపలేకపోయెను. "సరే. నీవు ముందుచేయవలసిన పనిని

తరువాత చేసితివి. నీవు చేసినది తప్పు. ఆపని చేయుటకు నీవవలంబించిన పద్ధతికూడ తప్పే. అయినను ఫరవాలేదు. నేను రాముని సంహరింతును. భయపడకుము. అతని బాణములు ఒకటిరెండు నాకు తగులుగాక! నేనతనిని చంపి అతని రక్తమును త్రాగుదును. విజయము నీదే. సోదరా! నీవిచారమును ప్రక్కకు పెట్టి ఇతరవిషయములాలోచింపుము" అనెను.

రావణుని ముఖ్యమంత్రి ప్రహస్తుడు ప్రభువుయొక్క బలమును గూర్చి మాటాడి అతనిని ఉత్సాహపరచెను. రావణుడు కుతూహలముతో "నేను కుబేరుని జయించి అతనిని లంకనుండితరిమి లంకను సొంతము చేసికొనలేదా? ఎవరిక్కడకువచ్చి నన్ను ఎదిరింతురు? చూతము" అని పలికెను. సభ్యులు ఆమాటలు మెచ్చుకొనిరి. విభీషణు డొక్కడు మాత్రమే అతనిని మెచ్చుకొనలేదు. అతడు తనసోదరుని ప్రమాదమునుండి తప్పుడుమార్గములనుండి తప్పించుట తనకర్తవ్యమని తలచెను. రావణుని, రాక్షసవంశమును కాపాడుటకు యధాశక్తి ప్రయత్నింపదలచెను. "నీవుసీతను, నీమృత్యువును, నీవంశనాశమును తెచ్చితివి. సీతను రామునికి అప్పగించుట నీప్రధమకర్తవ్యము. నీవీపని చేయనిచో మనమందరము తప్పక నశింతుము. ఇది తప్పదు" అని విభీషణుడు పలికెను. అతడు రాముని బలనైపుణ్యములను అతని శస్త్రాస్త్రసంపదను నిర్భయముగ వర్ణించి రాముని ఎదిరించినచో ఓటమి తప్పదు. సీతను రామునకు సమర్పించి రాముని శరణుకోరి మన రాజ్యమును, మనవంశమును రక్షింపుమని చెప్పెను. విభీషణుని

ఈమాటలు విని రావణుని కుమారుడు ఇంద్రజిత్తు సహనమునుకోల్పోయి ఇట్లనెను. "మాపినతండ్రి మాటలు నన్ను సిగ్గుతో ముంచినవి. మన వంశమేమి, మనబలమెట్టిది. మాపినతండ్రి ప్రతిపాదనలను మనము అంగీకరింపలేము. ఇద్దరు అల్పులైన మానవులకు భయపడుటయా? నేను దేవేంద్రుని యుద్ధమున పడగొట్టలేదా? మనముందు ఈప్రపంచ మంతా భయముతో వణకదా? విభీషణుని మాటలు మనవంశమునకే అవమానము".

"బిడ్డా! అనుభవములేక నీవట్లు మాటాడు చున్నావు. నీవు రాజకుమారుడవు. అతనికి స్నేహితుడవు. కాని శత్రువువలె నిరూపించుకొనుచున్నావు. నీవును, మంత్రులును ప్రభువు నకు మంచి సలహా ఈయవలసినది, రాజును నాశమునకు నడిపించు చున్నారు. లంకాపట్టణ ప్రభువా! నేను చెప్పినమాట తిరస్కరింపకుము. సీతను రామునకర్పించి లంకను, రాక్షసులను రక్షింపుము" అని విభీషణుడు హెచ్చరించెను. రావణుని కోపము అదుపుతప్పెను. "నీవు నాసోదరుడవగుటచే బ్రతికితివి. లేనిచో చచ్చియుండెడివాడవు. నీలో నా శత్రువును చూచుచున్నాను. శత్రుపక్షమునవలంబించిన సోదరులే భయ కారకులు. ఎంతకాలము ఒకడు సంపదలతో సుఖముగనుండునో అంత కాలము చిరునవ్వుతో పలకరించినసోదరులు, ఏదైనా ప్రమాదము సంభవించినపుడు విడిచిపోదురు. విభీషణా! నీవు మావంశమునకే అవమానకరము" అని రావణుడు పలికిన మాటలకవమానము భరింప లేక విభీషణుడు లేచి "ఓసోదరా! నీ ఇచ్చవచ్చినట్లు నీవు మాటాడ

వచ్చును. నీవు ధర్మపథమును విడిచి నడచినను నాసోదరుడవగుటచే నేను నిన్ను హెచ్చరించితిని. యమపాశములచే ఈడ్చుకొని పోబడుచున్న నీవు వినాశకమార్గమునకు పోవుచున్నావు. నాసలహా వందనీయము, కాని నీకునచ్చక తిరస్కరించితివి. తీపిమాటలు చెప్పుట తేలిక. నీ మంత్రులు చేయుచున్నదదియే. నేను నీమేలుకోరి చెప్పితిని. నిజము కఠినముగనుండును. నీవు అసహ్యించుకొంటివి. నీకు వీలైనవిధముగ నీపట్టణమును, నీప్రాణములను రక్షించుకొనుము. నన్ను శత్రువుగ పలికితివి. నేను పోవుచున్నాను. నీవు సుఖముగనుండుము. నీఅవసరము నందు నీసేవ చేయుదమనుకొంటిని. నీవు తిరస్కరించితివి. మృత్యువు సమీపించినవారు మంచిసలహాను తిరస్కరింతురు" అని పలికెను.

ఒకపాపము చేసి అపాయమునందు చిక్కుకొనిన రావణుడు తనను తాను తప్పించుకొనుట ఎట్లో చూడలేదు. సందిగ్ధములో నున్న ఇతరరాజులవలెనే అతడు మంత్రులను సమావేశపరచెను. కొందరు ముఖస్తుతిమాటలు చెప్పిరి, ఇద్దరు మాత్రము కఠినముగ మాటాడిరి. కుంభకర్ణుడు "నీవు తప్పుచేసితివి. అయినను నీకొఱకు నాప్రాణములను సమర్పింతును" అనెను. విభీషణుడు "నీవు పాపము చేసితివి. కాని పశ్చాత్తాపమునకు, పరిస్థితులనుండి తప్పించుకొనుటకు ఇంకనుసమయ మున్నది. సీతను రామునకప్పగించి, రాముని శరణుకోరిన మనము నాశమునుండి తప్పించుకొని సుఖముగజీవింపనగును" అని తెలిపెను. రావణుడు అది సాధ్యపడదనెను. అపుడు మనమార్గములు వేరుకనుక నేను నిన్ను వీడిపోవుచుంటిని అని విభీషణుడనెను. తనకింక లంకలో

స్థానము లేదని గుర్తించి తనసమస్తమును పరిత్యజించి ఆకసమునకు లేచి రామలక్ష్మణులు నివాసమున్న ప్రదేశమునకు నేరుగావెళ్ళెను. నలుగురు మంచిరాక్షస స్నేహితులతనిని అనుసరించిరి. రావణుని స్వతంత్ర భావములు తనతప్పును సవరించుకొననీయవు. పాపము చేయుటకు ధైర్యము కావలెను. దానిని అంగీకరించుటకు ఇంకను ధైర్యమవసరము. ఆధైర్యము రావణునకు లేదు. రావణునకు సలహాలనిచ్చిన ఇరువురు అన్నదమ్ములు కుంభకర్ణ, విభీషణులందు కూడ ఎవరిని తప్పుపట్టలేము.

ఉత్తర సముద్రతీరమున నిలిచియున్న వానర సేనానాయకులు ఒక్కసారిగ ఆకాశమున మేరుపర్వతమును పోలిన బంగరుకాంతి ఉద్భవించినట్లు కనుగొనిరి. ఆకాంతియందు అయిదు పెద్ద రాక్షసాకారములు గుర్తింపబడినవి. వానరప్రభువు సుగ్రీవుడు వారిని చూచుచు "వీరులంకనుండి వచ్చుచున్న శత్రుపక్షపు రాక్షసులు. సందేహములేదు" అనెను. ఈమాటలు వినగానే వానరయోధులు వృక్షములు, గండశిలలు ఆయుధములుగ గొని "రండి మనము వెళ్ళి వారినిచంపి నేలకు తీసికొనివత్తము" అనిరి. విభీషణుడీమాటలు విని భయపడక శాంతధైర్యములతో స్పష్టమైన కంఠధ్వనితో ఆకసమునుండియే ఇట్లు పలికెను. "రాక్షసుల దుర్మార్గపు రాజగు రావణుని సోదరుడు విభీషణుడు మీముందు నిలిచియున్నాడు. రావణునకు తనదుర్మార్గపు పద్ధతులు మార్చుకొని సీతను రామునకప్పగించి శరణువేడుమని సలహా చెప్పి అంగీకరింపని రావణునిచే అవమానింపబడితిని. అందుచే నేను మీ యెదుట నిలిచితిని. రాజ్యమును, భార్యాబిడ్డలను పరిత్యజించి శ్రీరాముని

పాదములచెంత శరణుకోరుచున్నాను. ఈవిషయమును రామునకు తెలుపుడని ప్రార్థించుచున్నాను". సుగ్రీవుడు విభీషణుని విశ్వాసమును నమ్మక రామునకిట్లు చెప్పెను. "రావణసోదరుడు విభీషణుడు నలుగురు అనుచరులతో నీశరణుకోరి ఆకసమున నీఅనుమతికొఱకు వేచియుండెను. వ్యవహార నిపుణతగల నీవు బాగుగ ఆలోచించి నిర్ణయము తీసికొనుము. రాక్షసులనేక మాయలు చేయగలరు. వారిని నమ్మరాదు. వీనిని రావణుడే పంపియుండునని నావిశ్వాసము. వారు మనతోకలసి మనకు హానిచేయ వచ్చిరని నా అభిప్రాయము. అతనిని అనుయాయులతోసహా చంపుటకు మాకు అనుమతినిమ్ము". తన అభిప్రాయమును నిష్కర్షగ రామునకు తెలిపి మౌనముగ రాముని జవాబుకొఱకు సుగ్రీవుడు ఎదురుచూచెను.

సుగ్రీవుని మాటలు విని రాముడు హనుమంతుడు మొదలుగాగల ఇతరనాయకులతో "రావణుని సోదరుడు వచ్చి మన సఖ్యతకోరి వేచియుండెను. ఈవిషయమై మీఅభిప్రాయములు తెలుసుకొన గోరుచున్నాను. ఒకసమస్య వచ్చినపుడు స్నేహితుల సలహాలనడుగ వలెను. మీమనసులోని భావములను తెలుపుడు" అనెను. వానర యువరాజు అంగదుడు , శరభుడు, జాంబవంతుడు, మైందుడు మున్నగు వానరవీరులు రాక్షసవంశ సంభూతులు మాయలవారనియు, వారిని నమ్ముట అంతమంచిదికాదనియు, వారిప్రవర్తనలను పరిశీలించి, నమ్మిక కలిగినమీదట చేరదీయనగునేమోయనియు, పరీక్షించి నిర్ణయించుట మంచిదనియు, తమ అభిప్రాయములను వెలువరించిరి. అనంతరము రాముడు హనుమంతుని అభిప్రాయము తెలిసికొనగోరెను. శ్రీరామునికి

జవాబుగా హనుమంతుడు తన అభిప్రాయమును మధురముగ, స్ఫుటముగనిట్లు చెప్పెను. "నీవు మాసలహాలకొఱకు ఏల అడుగు చుంటివి? నీకు తెలియని విషయములు బృహస్పతికూడ నీకు తెలుప సమర్థుడా? పరీక్షచేయుటకు సమయమేమున్నది? అతడు వచ్చిన సమయమును బట్టి, వచ్చిన విధమునుబట్టి అతనిని అనుమానింప నవసరములేదు, అని తోచుచున్నది. అతని ముఖమునందుగాని, మాటలయందుగాని సందేహింపదగు సూచనలు కనబడుటలేదు. ముఖము మనసుయొక్క అద్దమువంటిది అని బుద్ధిమంతులు చెప్పు దురు. విభీషణుడు నిజముగనే నీశరణువేడవచ్చెనని నాఅభిప్రాయము. నీవు వాలిని చంపి కిష్కింధను సుగ్రీవునకిచ్చిన సంగతి విభీషణునకు తెలుసు. అట్లే లంకను తానుపొందు అవకాశముకొఱకు నీఅండ కోర వచ్చును. అందులో ఏదోషమునులేదు. కావున అతనిని, అతని కోరికను మనము అంగీకరింపవచ్చునని నాఅభిప్రాయము". ఓర్పుతో రాముడు వానరవీరుల వివిధ అభిప్రాయములను వినెను. చివరకు హనుమంతుని పలుకులయందు తృప్తినిపొందెను. ఒకమంచిమనిషి తననిర్ణయమును ఒకస్నేహితుని అభిప్రాయము బలపరచిన సంతోషించును.

శ్రీరాముడిట్లు జవాబిచ్చెను. "ఒకవ్యక్తి స్నేహితునిగ నాకడకు వచ్చినపుడు అతనిని నేనెట్లు తిరస్కరింపగలను. నాజీవితము నందు నాన్యాయమునకు అట్లు తిరస్కరించుట విరుద్ధము. నా స్నేహితులు, సహాయకులు దీనిని తెలిసికొనవలెను. ఒకవ్యక్తి తనంత తాను వశమగుటకు వచ్చినపుడు అతని తప్పిదములన్నియు పరిగణ

నీయములు కావు". సుగ్రీవుడు తృప్తి చెందలేదు. "తనస్వంతసోదరుడు అవసరములోనుండగ విడిచివచ్చిన వానిని విశ్వసించుటయెట్లు?" అని ప్రశ్నించెను. ఈమాటలను వినిన రాముడు చిరునవ్వుతో లక్ష్మణుని వంకచూచెను. శ్రీరాముడు సుగ్రీవునకిట్లు చెప్పెను. "రాజులకు తమ సోదరులను, పరిసరప్రభువులను శంకించుట సహజము. రావణుడు విభీషణుని అనుమానించి అవమానించుటలో ఆశ్చర్యమేమున్నది? లంకలోనుండగ తనకు రక్షణలేదని విభీషణుడు తలచుటయు సహజమే. అతనికి రాజ్యముపై దృష్టికలదనుకొందము. మనచేతులలో రావణుని అపజయమునూహించి, ఈకోరిక అతనికుండుటయు తప్పుకాదు. లక్ష్మణా! జనులందరును మనభరతుని పోలియుందురని ఊహించ గలమా?" అని భరతుని నిస్వార్ధపరతను జ్ఞప్తికి తెచ్చుకొని రాముడు ఒక్కక్షణము మౌనము వహించెను. "ఈప్రపంచమున భరతునివంటి సోదరుని, దశరధునివంటి తండ్రిని కల్గియున్న నాఅంత అదృష్టవంతు డెవరున్నారు? నేను అడవికిరాగానే నాయందలి ప్రేమతో నాతండ్రి ప్రాణముల విడిచెను. మీవంటిస్నేహితులను కలిగియున్ననేను అదృష్ట వంతుడను" అని పలుకుచు రాముడు తనకన్నీరు తుడుచుకొని ప్రస్తుత విషయమునకు వచ్చెను. "విభీషణుడు తన అన్నను విడిచినట్లేమనలను విడిచిపోవుననుటలో నాకు ఉచితత్వము కనుపింపదు. మనకు లంక యందు కోరికలేదు. కాని అతడులంకను కోరును. అది సహజము. మన విజయము ద్వారానే అతడు లంకను పొందగలడు. ఈవిషయమై విభీషణుని తిరస్కరించుట దోషమగును. ఎవరైనా నాకడకు శరణము

కోరివచ్చిన నేను తిరస్కరింపలేను. ఇదినాధర్మము. దీనికారణముగ నేను బాధపడవలసి వచ్చినను బాధలేదు. నాజీవితము అంతమైనను నేను నాబాధ్యతను నిర్వర్తింతును. నేనెప్పుడును దానినతిక్రమింపను. కడకు రావణుడే స్వయముగ నాశరణుకోరి వచ్చినచో నేను తప్పక అంగీక రింతును. అట్టిసమయమున ఏదోషమును చేయని రావణుని సోదరుని నేనెట్లు తిరస్కరింపగలను? వెళ్ళి విభీషణుని తీసికొనిరండు". అంతట సుగ్రీవుడు "ఓస్వామీ రామా! నాకన్ని సంగతులు అవగతమైనవి. నేను వెళ్ళి విభీషణుని తీసికొనివత్తును. మావలెనే అతడుకూడ నీప్రియ స్నేహితుడగును" అనుచు విభీషణుని తీసికొని వచ్చుటకు వెళ్ళెను.

ఈలోపు రావణుడు ఒక అవివేకపు పనిచేసెను. రామునియందు సుగ్రీవునకుగల రాజభక్తిని తొలగింపజేయుటకు ఒక గూఢచారిని పంపెను. శుకుడను పేరుగల ఆరాక్షసుడు సముద్రమును దాటివచ్చి సుగ్రీవుని రహస్యముగ కలిసి ఇట్లుపలికెను. "లంకాధిపతి రావణుడు నీయందనురాగముతో నన్ను నీకడకు పంపెను. అతడునీకు తనసోదరశుభాకాంక్షలు పంపెను. నీవు ఒకమహారాజువు అతడు సోదరమహారాజు. నీఔన్నత్యమును క్రిందుపరచుకొని ఒక సామాన్యునకు మద్దతుగ బలవత్తరమైన ఒకరాజుతో ఎదుర్కొనుట అర్ధములేనిపని. రావణుడు రాముని భార్యనుకోరి అపహరించికొని వెళ్ళినచో అది నీకేవిధముగ సంబంధించినది? దానివలన నీవు నష్టపోవునది ఏమి? బాగుగ ఆలోచించి చేయుము. నీవును, నీసైన్యమును వెంటనే కిష్కింధకు తిరిగిపోవుట యుక్తము". సుగ్రీవుని జవాబు తిరస్కారపూర్వకముగను,

సూటిగను ఉండెను. "నీచుడా! నేను తనసోదరుడను కానని మీరాజుకు చెప్పుము. అతడు దుర్మార్గుడు. అతడు నాస్నేహితుడు రామునకు శత్రువుకనుక నాకును శత్రువే. మేము అతనిని, అతని దుర్మార్గ ప్రపంచ మును నాశమొనర్ప సిద్ధముగనున్నాము. రాముని ఎదిరించి జీవించి యుండగలనని తలచుట అతని అవివేకము. అతడు తప్పించుకొను అవకాశము లేదని చెప్పుము. ఈమాటలు నేనేచెప్పితినని చెప్పుము". సుగ్రీవుడు తన సందేశమును వెలువరచగనే వానరులు ఆరక్కసుని పట్టుకొని హింసింపనారంభించిరి. కాని రాముడు వారిని నిరోధించి ఆ రక్కసుని వచ్చినమార్గమున వెడలనిచ్చెను. ఆరాక్షసుడు లంకనుచేరి తనప్రయత్న ఫలితమును రావణునకు అందించెను.

రామునిచే విభీషణునకు చేయూత అంగీకరింపబడగానే లక్ష్మణుడును, సుగ్రీవుడును సముద్రజలములతో విభీషణునకు అభిషే కము చేసి లంకకు ప్రభువును చేసిరి. విభీషణుడు మార్పులేని స్నేహము రామునితో కల్గియుందునని ప్రమాణము చేసెను. రాముడు రావణుని సంహరించనిదే తాను అయోధ్యకు తిరిగివెళ్ళనని శపథము చేసెను. అనంతరము సుగ్రీవుడు, విభీషణుడు, లక్ష్మణుడును సముద్రమునెట్లు దాటుటయని ఆలోచించిరి. సముద్రుని ప్రార్థించి మొదలుపెట్టుట మంచిదని తలచి తమ అభిప్రాయమును రామునకు తెలియజేసిరి. రాముడు అందుకు అంగీకరించి సముద్రతీరమున దర్భలు పరచుకొని, దానిపై పరుండి, ఉపవాసముండి సముద్రమును తనయందు తమకు ఒక మార్గమునిమ్మని ప్రార్థించెను. మూడురోజులు ఆవిధముగ ఉపవాస దీక్షతో

సముద్రుని ప్రార్థించెను. కాని సముద్రునినుండి సమాధానములేదు. సముద్రుని నిర్లక్ష్యమునకు కోపించినరాముడు లక్ష్మణునితోనిట్లనెను. "అల్పబుద్ధులు వినయమును, మంచితనమును అపార్ధముచేసికొందురు. శాంతగుణము, సాధుత్వము వారిపై వ్యర్థము చేయుటయేయగును. ఈగర్వితుడైన సముద్రుని నేనేవిధముగ నాబాణములతో, తనయందలి పెద్దమత్స్యములశవములతో ఉక్కిరిబిక్కిరియై భయంకర వాసనతో ఎండి పోవునట్లు చేయుదునోచూడుము. సౌమిత్రీ! నాధనుర్బాణములనందిం పుము". అపుడు ధనువు చేతబూని ప్రళయాగ్నివలె ప్రజ్వలించుచు రాముడు సముద్రగర్భమునందు పిడుగుపాటులవంటి బాణములు విడిచి పెట్టెను. ఈఅస్త్రములు సముద్రమును అధోభాగము వరకు కలచి, అందలి జీవులన్నియు నశింపగ నీరు ఆవిరగునట్లు చేసెను. రాముడు ఆసముద్ర మును ఇంకించి ఎడారిగచేయుననిపించెను. సముద్రుడు నిలువలేక మేరు పర్వతమువెనుక ప్రకాశించు ఉదయసూర్యునివలె రాముని ముందు ప్రత్యక్షమయ్యెను.

చేతులు జోడించి సముద్రుడిట్లనెను. "ఓనాస్వామీ! రామచంద్రా! ఈవిశ్వమునందు ప్రకృతిసంపదలో భూమి, గాలి, ఆకసము, వెలుగు మొదలగువానిలో నేనొకడిని. పెద్దగ, లోతుగ, కెరటములతోనిండి అగమ్యముగనుండు నాప్రకృతిని నేనెట్లు విడువగలను? కాని ఇది మాత్రము చేయగలను. మీవానరులను వృక్షములు, గండశిలలు తెచ్చి ఒకసేతువును కట్టమనుము. నేను అనుమతింతును. రాళ్ళను, చెట్లను స్వీకరించుటకు, భద్రపరచుటకును నేను సహాయపడుదును. నేను చేయ

దగినది ఇది. ఈసేతునిర్మాణమునకు అనుకూలమైన ప్రదేశమును కూడ నేను మీకుచూపుదును. ఈమార్గము నిర్మించుసామర్థ్యముగల విశ్వకర్మ యొక్కపుత్రుడు నలుడు నీకడనున్నాడు. విజయము నీకు లభించు గాక!". రాముడు తనస్వభావమునకు తగినట్లుగ సముద్రుని క్షమాపణ ను, అతనిసహాయమును అంగీకరించెను. అనంతరము రాముని ఆజ్ఞచే వానరులందరును పనిచేయనారంభించిరి. వేలకొలది వానరులు కుతూహ లముతో ఈపనియందు నిమగ్నులై సేతునిర్మాణమును పూర్తిచేసిరి. వానరులు పర్వతముల వద్దకు, అరణ్యములకు వెళ్ళి రాళ్ళను, చెట్లను సంగ్రహించి సముద్రతీరమునకు ఈడ్చికొనివచ్చిరి. పెద్దవానరులు పెద్ద గండశిలలను తెచ్చిసముద్రములోనికి విసరిరి. అవిపడినపుడు నీరు ఆకసమునకెగిరెను. నలుడచట నిలిచి పనిని పర్యవేక్షించెను. నాయకులు వానరులను ప్రోత్సహించిరి. రాళ్ళు చెట్లు స్థిరపడినతర్వాత పైభాగము గడ్డితోడను, కట్టెలతోడను సమతలము చేయబడెను. సేతునిర్మాతల అరుపులతో సముద్రఘోష క్రిందుపరుపబడినది. ఆవిధముగ సేతు నిర్మాణము పూర్తి అయినది. సముద్రమందలి నూతనమార్గము ఆకస మున పాలపుంతవలె నున్నది. పైనదేవతలు, క్రిందవానరులు సంతోష ముతో కేరింతలు కొట్టిరి. దేవతలు, ఋషులును దీవెనలు పలికిరి. అంతట వానరులు ఆసేతువుపై నడచివెళ్ళిరి. హనుమంతుడు రాముని, అంగదుడు లక్ష్మణుని తమభుజములపై మోసికొని వెళ్ళిరి. వానరసైన్యము సముద్రమును దాటెను.

సైన్యమంతయు రాత్రి సువేల పర్వతముపై విశ్రమించిరి. మరుచటి ఉదయము పర్వతశిఖరముపై నిలిచి లంకను స్ఫుటముగ చూచిరి. త్రికూటపర్వత శిఖరమునుండి ఆసుందర నగరము ఆకాశమునుండి ప్రేలాడగట్టబడినట్లుండెను. దళసరియగు కోటగోడ వెలుపల రక్షణార్ధము నిలిచినసైన్యము మరియొక స్థూలమగు కుడ్యము వలెనున్నది. లంకయందలి గొప్పసుందర భవనములను చూచి రాముడు జాలితో కదలిపోయెను. "కాలపాశముచే లాగబడిన ఒకవ్యక్తి పాపము చేసిన కారణముగ ఇపుడు ఈసంపదయు, రాక్షసవంశమంతయు నాశము కాబోవుచున్నది. ఈగౌరవప్రదమైన వంశాంకురము తమ నిజమైన గొప్పతనమును మరచి తన అనుయాయులతోసహా తననాశమునకు లాగుచున్నాడు. ఏదియేమైనను ఈయుద్ధమున జయించుటకు రావణుని నాశము చేయుటకును మనము ఆలోచింపవలయును. రాక్షసులు మనలను మోసముచేయ ప్రయత్నింతురు. వానరులు, భల్లూకములు వారిసహజరూపములతోడనే యుద్ధము చేయుమనుడు. విభీషణుడును అతని స్నేహితులును మాత్రమే, నేనును లక్ష్మణుడువలె మానవ రూపములను ధరింతురు. మనశత్రువులు రాక్షసులు. నరవానర రూపములను ధరింపరు. అట్లు ధరించుట వారిగౌరవమునకు భంగకర మని తలతురు. మనము ఆజ్ఞాబద్ధులమై చరించిన ఎవరు ఎవరన్నది గుర్తింపగలము. శత్రువులను చంపి స్నేహితులకు సహాయపడవచ్చును" అని పలికెను.

శ్రీమద్రామాయణము

వానరసైన్యము సువేలపర్వతమునుండి దిగి లంకానగర పార్శ్వమునగల అరణ్యమందు ప్రవేశించెను. సైన్యము వరదవలె పెల్లుబికి రాగా జంతువులును, పక్షులును భయపడి అన్ని దిక్కులకు పరుగులెత్తినవి. పర్వత క్రింద భాగమునుండి కోటను విశ్వకర్మనిర్మితమైన లంకాపట్టణ దివ్యసౌందర్యమును చూచి రాముడు అద్భుతపడెను. "ఓహో! ఏమిసౌందర్యము? ఏమిసంపద?" అనుకొనెను. వానరులు వారివంతుగ రాక్షసయోధుల బలమును , యుద్ధసంసిద్ధతను బలిష్ఠమైన కోటగోడలును మున్నగునవి గుర్తించిరి. రాముడు లంకను చూచుచులక్ష్మణా! ఈపట్టణ సౌందర్యమును చూడుము అనెను. అతని మనసు సీతమీదకు మళ్ళినది. ఈసరికి తాను సైన్య సహితముగ లంకను చేరినట్లు సీత తెలిసికొని ఆమె మనసు కొంతకుదుట పడును. తనమనసునందలి ఆలోచనలనురాముడు వెల్లడించకుండగనే సైన్యమును ఏర్పాట్లు చేయుటలో నిమగ్నుడయ్యెను.

రాక్షసులయందు వృద్ధుడు, రావణుని తాతయగు మాల్యవంతుడు రావణుని విధానములందలి తప్పులను చూపి అతనిని మంచిమార్గమునకు మరలింప యధాశక్తి ప్రయత్నించెను. "రావణా! నీఅదృష్టకాలము గడచినది. నీపాపములు తమఫలమును అనుభవింప జేయుటకు, నీతేజస్సును తగ్గించుటకు ప్రారంభించినవి. నీవు దేవతల నుండి పొందినవరములను నమ్ముకొనలేవు. నీశత్రువులతో శాంతి కుదుర్చుకొనుము. వానరులు, భల్లూకములతో నిండిన భయంకరమైన సైన్యమును చూడుము. త్వరగ నిర్మింపబడిన అద్భుతమైన సేతువును చూడుము. ఈరాముడు మానవరూపముతోవచ్చిన విష్ణువని నాకు

తోచుచున్నది" అనెను. అట్టి ఉపదేశమును వినుటకోర్పు రావణునకు లేదు. "నీమాటలు నాచెవులకు చేదుగానున్నవి. నీవుకూడా నాశత్రువు లందు చేరినట్లు అనిపించుచున్నది. తనతండ్రిచే అడవులకు తరుమబడిన దౌర్భాగ్యమానవుని గురించి భయపడుదువేల? అతనికి సహాయకులు కోతులును, ఎలుగుబంట్లును. అట్టిమనిషికినీవు భయపడుచున్నావు. నీగురించినేను నిజముగ సిగ్గుపడుచున్నాను. నేను సంతోషముగ నుండుట చూచి సహింపలేకపోవుచుంటివా? నాతో ఎందుకిట్లు మాటాడు చుంటివి? నేను రామునిముందు వంగలేను. అది నాస్వభావమని గ్రహింపుము. నేను దానిని మార్చుకొనలేను. శాంతికొఱకు రాముని బ్రతిమాలుటకంటె అతనితోయుద్ధముచేయుచు మరణించుటమేలు" అని రావణుడు పలికెను. మాల్యవంతుడు "ఆలోచించి నీకు ఉత్తమమని తోచిన రీతిగ చేయుము" అని పలికి ఇంటికి వెళ్ళెను.

రాక్షస గూఢచారి శుకుడు వెళ్ళి రావణునితో ఇట్లు పలికెను. "నీవు సూచించినరీతిగ నేను నాబాధ్యతను నిర్వర్తించితిని. కాని నాప్రయత్నములు విఫలములయ్యెను. వారునాపట్ల కఠినముగ ప్రవర్తించి, ప్రాణములతోమరలివచ్చుటకనుమతించి నన్ను వారికి కృతజ్ఞుడనుగచేసిరి. విరాధ, కబంధ, ఖరదూషణాదుల సంహరించుట ఎవరికి క్రీడావిలాసమో అట్టిరాముడు సుగ్రీవుని సైన్యముతో వచ్చియుండెను. వారు ఏదోవిధముగ సీత బంధింపబడిన ప్రదేశమును తెలిసికొనగలిగిరి. భల్లూకములును, వానరులును సముద్రమును దాటి యుద్ధముచేయుటకు లంకయెదుట నిలిచియుండిరి. భూమి అంతయు వారిసైన్యముచే కప్పబడియున్నది.

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి , నేదునూరు, తూ||గో||జిల్లా

చర్చలతోడను, సమావేశములతోడను సాధింపబడునది ఏమియులేదు. వారివైరము మనరక్తముతోమాత్రమే చల్లారును. ఓరాజా! ఏమిచేయదగి నదో బాగుగ ఆలోచించి చేయుము" అని పలికి భయముతో తగ్గించిన కంఠధ్వనితో "సీతమరల తిరిగి అప్పగింపబడినచో మనము తప్పించు కొనగలము" అని పలికెను. రావణుడు క్రోధముతో రెచ్చిపోయి "నీవు చెప్పినది ఏమి? సీతను తిరిగి అప్పగించు విషయము ఎవ్వరును నాతో మాటాడనవసరములేదు. ఇట్లు మాటాడువారికి నాబలము తెలియదు. నేను దేవతలను, వానరులను, గంధర్వులను, యక్షులను అందరిని సంహరింపగలను. నాబాణములు ఇంద్రుని, యమునికూడ కాల్చగలవు. ఈదౌర్భాగ్యుడు రాముడు, అతని సైన్యము ఎట్లునశింపబడుదురో వేచి చూడుడు" అని పలికెను. రావణుడు తాను చెప్పినదే నమ్మెను. తాను పూర్వముసాధించినవానితో అతడు చాలకాలము నివసించెను, గర్వముతో నిండెను.

అనంతరమతడు తనమంత్రులిరువురనుకబురుపంపి వారితో నిట్లనెను. "గూఢచారులు వచ్చి పెద్దసైన్యము సముద్రమునకు సేతువుకట్టి లంకకువచ్చియుండిరని తెలిపిరి. ఇది నిజమునకు క్రొత్తవార్త. అయినను ప్రమాదమేమియులేదు. వెళ్ళి శత్రువులను పరిశీలించి, వారి బలముగురించి పూర్తివివరములను నాకు తెలుపుడు". తగినట్లుగా వేగులు వానరరూపములధరించి రాముని మకామునకువచ్చి ఇతర వానరులతోకలిసి చుట్టును పరిశీలించిరి. కాని విభీషణుడు వారిమాయను గుర్తించి, వారిని బంధించి రామునిముందునిలబెట్టెను. వారు కేవలము

వారిరాజుచే పంపబడిన దూతలమని వాదించి, తమను విడువుడని ప్రార్థించిరి. రాముడిట్లు పలికెను. "వీరికి మనసైన్యమును చూపుడు. వారు వెళ్ళుముందు చుట్టును బాగుగచూడనిండు. మనబలమును చూచుటకు వారికి పూర్తి స్వేచ్ఛను, అవకాశమును కల్పింపుడు. ఓరాక్షసదూతలారా! మీరు రావణునకడకేగి ఇట్లు చెప్పుడు. "నీవు సీతను అపహరించుకొని పోవునపుడు నీవేశక్తిని నమ్మియుంటివో ఆశక్తి ఇపుడు పరీక్షింపబడును. నీకోట, నగరము, నీసైన్యమును నాశమగును. రాముని బాణములు నిన్ను గాయపరచును" అని ఈ సందేశమును మీరాజునకుఅందింపుడు". గూఢచారులు రామునిమాటలను విని తమప్రభువునకు అందించుటకు అంగీకరించిరి. అనంతరము బహుశః అలవాటుప్రకారము నీకుజయమగు గాక! అని పలికిరి. వానరసైన్యము దీనిని శుభశకునముగ పరిగణించిరి.

ఆగూఢచారులు రావణుని కడకేగి "ఓప్రభూ! మేము విభీషణునిచే కనుగొనబడితిమి. మృత్యుభయముతోనుంటిమి. కాని రాముడు మమ్ము చంపనీయలేదు. మమ్ము విడిచిపెట్టుడనిఆజ్ఞాపించెను. ఓరాజా! మనశత్రువులు నిశ్చయించుకొనిరి. రామలక్ష్మణులును, వానరప్రభువు సుగ్రీవుడును, విభీషణుడును అందరును ఒకేఅభిప్రాయము కలవారు. అట్టియోధులచే నడిపింపబడు సైన్యమునెదిరించుట కష్టము. మేము దశరథకుమారుని రాముని చూచితిమి. అతడొక్కడే మనపట్టణమును సైన్యమును నాశముచేయగల బలవంతుడని మాకు అనిపించినది. మేము వానరులధైర్యమును, వారియుద్ధోత్సాహమును చూచితిమి. వారితోయుద్ధమొనర్చి మన అదృష్టమును పరీక్షించుట

యుక్తముకాదు. సీతను రామునకప్పగించుట మంచిదనిపించుచున్నది. ఏమిచేయవలెనో ఆలోచింపుము" అని పలికిరి. సలహామంచిదే అయి వుండవచ్చు. కాని రావణుడు తనక్రోధమునదుపుచేసికొనలేకపోయెను. "ఈప్రపంచమంతయు నాకెదురు తిరిగినను నేను భయమునకు లొంగను. దేవతలు, గంధర్వులు, వానరులు అందరుకలసి నన్ను ఎదిరించినను నేను సీతను అప్పగించను. శత్రువులచే మీరు దెబ్బలు తినియుండుటచే మీరు ఈరీతి పిరికిసలహానిచ్చితిరి. బలహీనహృదయులారా! నన్ను జయింపగలశత్రువెచటగలడు?" ఇట్లు పలికి రావణుడు తన ఉన్నతభవన శిఖరమునకు వెళ్ళి శత్రుసైన్యబలమును పరిశీలించెను.

అతని మంత్రులును, అధికారులును అతనిని వెంబడించిరి. వారిలో ఒకడిట్లు చెప్పెను. "చూడుడు. ఆదివ్యమైన, దయామయుడైన, జడలుకట్టిన శిరోజములతో, చేతధనువు ధరించిన ఆయువకుడేరాముడు. అతడు తనకనులతో ప్రేమగ తనచుట్టూనెట్లు చూచుచున్నాడోచూడుడు. అతని చూపులతో ఆజ్ఞాపించుచు దిక్కులను వెలిగించుచు అందరను ఎట్లు భక్తివిశ్వాసములతో నింపుచున్నాడోచూడుడు. అతనిప్రక్కన సాయుధుడై యున్నయోధుడు లక్ష్మణుడు. సాటిలేని ధానుష్కుడు, రాముని రెండవ ప్రాణము. చూడుడు. అతని తరువాత వాలియొక్క హారమును ధరించిన వాలిసోదరుడు సుగ్రీవుడు. వాలితో తుల్యుడు. అతని తర్వాత మీసోదరుడు విభీషణుడు. అట్టియోధులను జయించుట సులభముకాదు. ఈపరిస్థితి యందు బాగుగ ఆలోచించి విజయమునకు అవసరమగు అన్ని ఉపాయ ములను, సాధనములను తీసికొనుము". శత్రువు యొక్కబలమును

మంత్రులు వివరించుకొలది రావణుని క్రోధము అధికాధికమగుచున్నది. క్రూరప్రభువుయొక్క మార్గమిది. తెలివిగల ప్రభువు నిజమగు వార్తలను చెప్పువారిని, తనమంచికోరి మంచిసలహానిచ్చు మంత్రులను కోపింపడు. రావణునకు నిజములతోడను, మంచిసలహాలతోడను ప్రయోజనములేదు. అతని ఆలోచన ఒకక్రొత్త త్రోవను అనుసరించెను. సీతను ఏదోవిధముగ తనకు లొంగునట్లు చేసికొనినచో రాముడు గుండెపగిలి తనయింటికి మరలిపోవునని తలచెను. అందుచే మరియొక ఉపాయముతో అతడు చివరిప్రయత్నము చేయదలచెను.

అతడు ఒకరాక్షసమాంత్రికుని సహాయము కోరెను. "ఓవిద్యుజ్జిహ్వుడా! రాముని సన్నిహితులును, ప్రియులును నమ్మునట్లు సరిగా రాముని పోలిన తలనొకదానిని తయారుచేయుము. నేను నీకు కబురంపినపుడు సీత బంధింపబడిన ఉద్యానవనమునకు ఆశిరస్సును తెచ్చి ఆమెముందు పెట్టుము ". అతడాజ్ఞాపించినట్లు ఆమాంత్రికుడు చేయుటకంగీకరించెను. అనంతరము రావణుడు మరియొకమారు అశోక వనమునకువెళ్ళి సీతను మోసపుచ్చ ప్రయత్నించెను. "నీభర్తయు, అతని సైన్యమును నశింపబడినవి. మాయోధులు సముద్రమును దాటి వచ్చిన రాముని, అతనివానరులను ఎదిరించిపోరాడి, వారు అలసి నిద్రించినపుడు వారినందరిని సంహరించిరి. ఒకయోధుడు నీభర్తశిరమును నాకు చూపుటకు తెచ్చెను. నీవు నీపట్టుదలనెందుకు విడిచిపెట్టవు? నాభార్యలయందుకలసి వారిని నాయకురాలిగ పాలింపుము. నాసలహాను గ్రహించి లంకకు రాణివికమ్ము".

అనంతరము రావణుడు విద్యుజ్జిహ్వుని తీసికొని రమ్మని ఒకరాక్షసుని ఆజ్ఞాపించెను. మాంత్రికుడు వచ్చి రాముని తలవంటి ఒకతలను సీతముందుంచెను. ఈదృశ్యమును చూడగానే సీత ఉలికిపడి "ఇదా నాఅదృష్టము" అని అరచి నిరాశతోకూడిన శోకమున పడెను. ఇంతలో రాముని సైన్యము లంకకుదగ్గరగ వచ్చినది. మంత్రులు రావణుని తో అత్యవసర సమావేశము నిమిత్తము రావణునకు కబురుపంపిరి. అందుచే రావణుడు సీతను విడిచి వెంటనే రాజ్యసభాభవనమునకు వెళ్ళవలసి వచ్చెను. మాంత్రికుడు సృష్టించిన భ్రాంతిని నిశ్చలముగానుంచ వలెనన్న రావణుని ఉనికి అవసరము. కావున రావణుడు ఆప్రదేశమును విడువగానే రామునితల అదృశ్యమయ్యెను. రాజమందిర పరిచారిక "సరమ" అనునామె సీతకు సహచరిగ నియమింపబడిన వనిత, ఈభ్రమను గురించి సీతకు వివరించి ఆమెను ఓదార్చెను. "రాముని ఎవ్వరూ చంపలేదు. అతడు పెద్దసైన్యముతో లంకను చేరెను. వారు ఒక అద్భుతమైన సేతువును సముద్రమునకు అడ్డముగ నిర్మించిరి. లంకను సముద్రమునందు ముంచెత్తుటకు సిద్ధముగనున్నారు. నిర్నిమిత్తముగ పుట్టిన దిగులుతో రాక్షసులు బాధపడుచున్నారు. రావణుడు మాత్రము నిన్ను మాంత్రికవిద్యతో మోసగింప ప్రయత్నించుచున్నాడు" అని సరమ ఇంకను సీతకిట్లు సమాచారమందించెను.

"చాలమంది మంత్రులు నిన్ను రామునకప్పగించి తనను కాపాడుకొనుమని రావణునకు సలహానిచ్చిరి. కానివారిమాటలు రావణుడు వినలేదు. "నేను యుద్ధరంగమున మరణింతును కాని

రామునిముందు తలవంచను. సీతను తిరిగి యీయను. శాంతినికోరను" అనెను. ఓపతివ్రతా! నీకు ఏహానియు సమీపింపదు. రాముడు తప్పక విజయము సాధించును. ఈదుర్మార్గుడు మరణించును". సరమ ఇట్లు చెప్పుచుండగనే వానరసైన్యముచే మ్రోగింప బడిన భేరీభాంకారధ్వనులు సీతచెవులను చేరి ఆమె సంతోషముతో నిండెను. రావణుని అవసానదశ సమీపించెనని ఆమెకుతెలిసెను. లంకయందలి రాక్షసులు అదేధ్వనిని విని భయముతో వణికిరి. రాముని వానరసైన్యము అల్లకల్లోలితమైన సముద్రమువలె లంకను చుట్టుముట్టినదని రావణునకు సమాచార మందింపబడెను. రావణుడు కోపముతో తనభవనోపరిభాగమునకు వెళ్ళి ఆదృశ్యమును చూచెను. అన్నిదిక్కులందును వానరయోధులు వృక్షము లును, గండశిలలును ఆయుధములుగగొనియుండుట రావణుడు చూచెను. ఈపెద్ద బలగమును ఎట్లు ధ్వంసమొనర్పగలమని రావణుడు సంశయించెను.

అరుణకాంతులతోనిండిన సాయంకాలపు ఆకసము నందుగల నల్లని మేఘమువలె, ఎఱ్ఱని వస్త్రములు ధరించి లంకాపట్టణ మహోన్నత భవనోపరిభాగమున కూర్చుండిన రావణుని చూడగానే సుగ్రీవుడు ఎవరికిని చెప్పకుండ, నిశ్శబ్దముగ అకస్మాత్తుగ ఆకసమునకు ఎగిరి రావణునిముందు నిలిచెను. ఇంద్రుని గజము ఐరావత దంతముచే చేయబడిన మచ్చరావణుని వక్షస్థలమునందు చంద్రవంకవలెనున్నది. "రావణా! నీవు బంధింపబడితివి. నేను రాముని స్నేహితుడను, సేవకుడను. ఇదే నీచివరి రోజు" అని సుగ్రీవుడు అరచెను. రావణుని

మీదకు దుమికి అతని కిరీటమును పడగొట్టి అతనిని పెద్దదెబ్బ కొట్టెను. వారిరువురును చాలసేపు పెనుగులాడిరి. ఇద్దరును ద్వంద్వయుద్ధము నందు అనుభవజ్ఞులు. రావణుడు తనశక్తులు సన్నగిలినతర్వాత ద్వంద్వ యుద్ధమును మాని మాయోపాయమును స్వీకరింపగ, సుగ్రీవుడు తనను తాను విడిపించుకొని రాముడున్నప్రదేశమునకు తిరిగి దూకివచ్చెను. వానరనాయకులు సూర్యపుత్రుడు తిరిగివచ్చుట చూచి మెచ్చుకొనుచు అరచిరి. పెద్దధ్వనితో అతనికి అభినందనలు తెలిపిరి. అది తొందరపాటు నిర్లక్ష్యపు చర్య. అయినను శత్రువులగు రాక్షసులకు శత్రువర్గ పౌరుషమును గురించి ఒక అభిప్రాయమును తెలుపును. సుగ్రీవుడు సురక్షితముగ తిరిగివచ్చినందుకు రాముడు సంతసించెను. సుగ్రీవుని శరీరముపై రక్తముకారుచున్న గాయములనుచూచి "సుగ్రీవా! నీపరాక్రమ వంతమైన శూరకృత్యమును చూచి నేను ఆనందాశ్చర్యములతో నిండితిని. కాని నీవుచేసినపని మంచిదికాదు. ఒకప్రభువు సమస్యలకు గురికారాదు. నీవు ఎవరికిని చెప్పకుండ అంతభయంకరమైన కృత్యమునకు ఎట్లు సిద్ధపడితివి?". సుగ్రీవుడు తనతప్పును అంగీకరించెను. "నిజమే. నీకు చెప్పకుండ యుద్ధమునకు చొరబడుట యుక్తముకాదు. కాని సీతను అవమానపరచిన ఖలుని చూడగానే నేను కోపముతో నాబాధ్యతను మరచితిని".

రాముడు అంగదునకు కబురంపి ఇట్లు చెప్పెను. "యువరాజా! నావర్తమానమును రావణునకందింపుము. వానికిట్లు చెప్పుము. ఓమహాపాపాత్ముడా! నీఅవసానకాలము సమీపించుచున్నది.

రాముడు నీకోటగుమ్మముకడ యుద్ధమునకు సిద్ధముగ వేచియున్నాడు. దేవతల వరములను నమ్మికొని నీవు గర్వముతో క్రూరుడవైనావు. నీవీ ప్రపంచమును బాధించుచు అనేక పాపములను చేసితివి. ప్రపంచమునకు నిన్ను తుడిచిపెట్టు సమయము వచ్చినది. నీవు ప్రత్యక్షముగ యుద్ధము నకు వచ్చి మరణించినచో నీపాపములు కడిగివేయబడును. ఊర్ధ్వ లోకములయందు నీకొక నాయకునిగ స్థానము లభించును. నీకు ప్రాణములందాశయున్నచో మర్యాదగ సీతను ఆమెభర్తకప్పగించి శరణము వేడుము. అపుడు నీప్రాణములను దక్కించుకొననగును. ఏమైనను నీవురాజుగానుండతగవు. లంకారాజ్యము ఇపుడు విభీషణునకు చెంద వలసియున్నది. పరిపాలించుటకు సమర్థత, రక్షింపగల సమర్థత కలవాడతడే. నీవులోబడి, క్షేమమును కోరనిచో, ముందుగనే నీ అపరకర్మలు చేయించుకొనుము. లంకయందలి నీప్రేమాస్పదులంరకడ నీచివరి వీడ్కోలు తీసికొనుము. మరణించుటకు సిద్ధమగుము. బయటకు వచ్చి రాముని యుద్ధరంగమున కలుసుకొనుము". అంగదా! వెళ్ళి రావణునకు ఈనా సందేశమును వినిపింపుము.

రాముడు చెప్పినట్లే ధైర్యవంతుడగు అంగదుడు రాముని సందేశమును వినిపించెను. "రావణా! వినుము. నీవెవరిని నిస్సందేహ ముగ గుర్తుంచుకొంటివో ఆవాలియొక్క కుమారుడను అంగదుడను నేను. నేను రాముని దూతగ వచ్చితిని. నీపాపములనుండి విముక్తినందు సమయము వచ్చినది. నీవుకోరినచో యుద్ధమునందుమరణించి వీర స్వర్గమునలంకరింపుము. కాని ప్రాణములందు ప్రీతియున్నచో మర్యాదగ

రామునకులొంగి శరణు అడిగినచో రాముడెప్పుడును తిరస్కరింపడు. నేను వినినదానిని బట్టి నీవు యుద్ధమునే కోరుకొందువు. మీరాక్షస వంశమున ఎవ్వరును జీవించియుండరు. కావున ముందుగనే నీ అపరకర్మలు చేయించుకొనుము. లంకను చివరిసారిగ ప్రేమగ చూచు కొనుము" . రావణుని కోపము అగ్నివలె ప్రజ్వలించెను. ఆనీచుని బంధింపుడు, చంపుడు అనుచు అరచెను. వెంటనే ఇద్దరు రాక్షసులు అంగదుని పట్టుకొనిరి. అంగదుడు ఆఇద్దరు రాక్షసులను రెండువైపుల మోయుచు ఆకసమునకు లేచి, వారిని క్రింద పడవైచెను. అతడు మిక్కిలి ఎత్తునకు ఎగిరి, క్రిందకు వచ్చుచు, రాజభవన శిఖరమును తన్ని పగుల గొట్టెను. అనంతరము చిన్నగంతుతో రాముడున్న ప్రదేశమునకు తిరిగి వచ్చెను. అంగదుని సాహసకృత్యమునుగని రాక్షసులు భయభ్రాంతు లయిరి. కానివారు బయటపెట్టలేదు. రావణుడు పగిలిన భవన శిఖర మును చూచి దానిని అపశకునముగ తలచి పెద్దగానిట్టూర్చెను. అంగదుడు తిరిగిరాగానే రాముడు లంకపై దండెత్తుటకు తనసైన్యమును ఆజ్ఞాపించెను.

రావణుడు జాగ్రత్తగ యోధులను రక్షణకు నియమించెను. ప్రహస్తుని తూర్పుద్వారముకడ, మహాపార్శ్వమహోదరులను దక్షిణ ద్వారముకడ, ఇంద్రజిత్తును పడమరదిశయందు నియమించెను. తానుస్వయముగ ఉత్తరద్వారముకడ నిలిచియుండెను . సైన్య సర్వా ధ్యక్షుడు విరూపాక్షుడు నగరమందు రక్షణకై నియమింపబడెను. తన సైనికబలములను నియమించుకొని తనదేవిజయమని నిర్ధారించుకొనెను.

అతని అవసానకాలము సమీపించుటచే ఎవరిమాటలు వినలేదు. అవివేకముతో తాను జయింపశక్యముకానివానిగ నమ్మెను. రాజును సంతోషపరచుటకు అతని మంత్రులు జయశబ్దములు పలికి నిష్క్రమించిరి.

రామసుగ్రీవవిభీషణులు ఇతరులతో సమావేశమైరి. గూఢచారులు తెచ్చిన రావణయుద్ధ సన్నద్ధవార్తలను విభీషణుడు రాముని సమావేశమందు తెలిపెను. "రావణునిచే ఇపుడు చైతన్యవంతము చేయబడినసైన్యము సంఖ్యయందు బలధైర్యములందును కుబేరుని ఎదిరించిన సైన్యమును మించును. అయినను రాముని విజయముగురించి నాకు సందియము లేదు". రాముడు తన సైన్యమునుకూడ పంచెను. అతడు నీలుని తూర్పు ద్వారముకడ ప్రహస్తుని ఎదిరింపుమనెను. అంగదుడు దక్షిణద్వారమున మహాపార్శ్వ మహోదరులను, పడమర ద్వారముకడ హనుమంతుడు ఇంద్రజిత్తును ఎదిరించుటకు నియోగించెను. లక్ష్మణుడును నేనును రావణుని ఎదిరించుచు లంకపై దండెత్తు సూచనలనిత్తుము. మనప్రధాన సైన్యము వెనుక సుగ్రీవుడును, జాంబవంతుడును, విభీషణుడును ఉందురు అని నియోగించెను. రాముడు సూచించినరీతిగ సైన్యము నిలిచియున్నది.

యుద్ధమునకు సిద్ధమైన లంకనుండి భేరీభాంకారధ్వనులు వానరవీరుల యుద్ధకుతూహలమును పెంచినవి. రాముడు నియోగించిన విధముగ అన్నిదిక్కులనుండి వానరసైన్యము లంకను చుట్టుముట్టెను. రాక్షసులచే సురక్షితమైన లంకానగరమును రాముడు చూచెను. ఆపట్టణ కుడ్యములలోపల బంధింపబడిన సీతయొక్క శోకతప్త

ఆకృతిని రాముడు తనమనోనేత్రములతో చూచెను. అతడు వెంటనే దండెత్తుడు అని వానరసైన్యమునాజ్ఞాపించెను. వానర ప్రభువునకు జయము. జయము జయము శ్రీరామలక్ష్మణులకు. రాక్షసులను చంపుడు. అని గట్టిగ అరచుచు వానరసైన్యము లంకమీదకు ముందుకు ఉరికెను. కొంతమంది కోటగోడలమీద, పట్టణద్వారములమీదను గండశిల లను రువ్విరి. ఇతరులు వేళ్ళతోసహాపెకలించిన పెద్దవృక్షములను చేతబూని రాక్షసులమీదకు దుమికిరి. అపుడు రావణుడు ఒక పెద్దసైన్యమును ముందునకు పంపెను. అతడు వారినిబయటకు వెళ్ళి వానరులనందరను ఒక్కసారిగ సంహరింపుడని ఆజ్ఞాపించెను. ఆకాశము ప్రతిధ్వనించునట్లు వారు భేరీభాంకారములను మ్రోగించిరి. వానరులమీద పడిరి. వానరులు రాక్షసులనెదిరించుటకు గండశిలలను, వృక్షములను, తమనఖములను, ముష్టులను ఉపయోగించిరి. ఇరుపక్షములందును వేలకొలది సైనికులు మరణించిరి. రణరంగము రక్తముతోడను ఖండ ఖండములు చేయబడిన శరీరములతోడను కప్పుబడినది.

ఈవిధముగ మూకుమ్మడి యుద్ధము జరుగుచుండగనే, కొందరు ద్వంద్వయుద్ధములందు నిమగ్నమైయుండిరి. రుద్రుడు, యమునితో పోరాడినట్లు అంగదుడు ఇంద్రజిత్తుతో తలపడెను. ప్రజంఘుడు అను రాక్షసుడు, విభీషణుని అనుయాయుడగు సంపాతితో ద్వంద్వయుద్ధమున పాల్గొనెను. హనుమంతుడు జంబుమాలితో ద్వంద్వ యుద్ధమొనర్చెను. నీలుడు నికుంభునితో, లక్ష్మణుడు విరూపాక్షుని తోడను ద్వంద్వయుద్ధములు చేసిరి. ఇంద్రజిత్తుయొక్క రధమును,

అశ్వములును ధ్వంసమొనర్చబడినవి. అంగదుడు ఇంద్రజిత్తుయొక్క వేత్రపుఘాతమునకు గురియయ్యెను. జంబుమాలి తన ఆయుధముతో హనుమంతుని ప్రహరించెను. హనుమంతుడు జంబుమాలిరధమును ముక్కలు చేసెను. రాక్షసులు రాముని ఎదిరించుటయందు ఏకాగ్రచిత్తులై అతని బాణపు దెబ్బలకు వేలసంఖ్యలో నేలకొరిగిరి. విద్యున్మాలి సుషేణునిపై బాణముల ప్రయోగించెను. సుషేణుడు ఒకశిలతో రాక్షస రధమును భగ్నమొనర్చెను. విద్యున్మాలి తనవేత్రదండమునుచేగొని సుషేణుని ఎదిరించెను. సుషేణుడు పెద్దశిలతో విద్యున్మాలిని చిదుకకొట్టి చంపెను. ఈవిధముగ చాలమందియోధులు యుద్ధమొనర్చిరి. అనేక మంది మరణించిరి. యుద్ధము పగలంతయు జరిగెను. రాత్రి రాక్షసులు యుద్ధమునాపలేదు. యుద్ధము భయంకరముగ తయారయ్యెను. రక్తప్రవాహములు ప్రవహించెను. ఇరువర్గములందును భయంకరమగు సంహారము సంభవించెను. అంగదుడు ఇంద్రజిత్తును ఎదిరించి అతని అశ్వములను, రధచోదకుని సంహరించి రధమును ధ్వంసమొనర్చెను. వానరులు తమ యువరాజుయొక్క యుద్ధనిపుణతను బలమును కొనియాడుచు సంతోషముతో కేరింతలుకొట్టిరి. సైన్యమునందలి యోధులందరును వానరయువరాజుయొక్క శక్తిని మెచ్చుకొనిరి.

ఇంద్రజిత్తు తనరధముతోపాటు తనప్రకృతిని పోగొట్టుకొని వానిమాంత్రికశక్తికి అంకితమయ్యెను. తనను తాను అదృశ్యపరచుకొని రామలక్ష్మణులపై అనేకబాణములను ప్రయోగించెను. కంటికి కనుపింపని, తెలియని శత్రువుయొక్క అన్నిదిక్కులనుండి ప్రయోగింపబడుచున్న

బాణవర్షమునకు రామలక్ష్మణులు బాధింపబడిరి. అనంతరము రామ లక్ష్మణులపైపు ఇంద్రజిత్తు నాగాస్త్రములను ప్రయోగించెను. ఆఅస్త్రములచే బంధింపబడిన రామలక్ష్మణులు కదలలేక యుద్ధరంగమున నిస్సహాయులుగ పడియుండిరి. ఆశ్చర్యముతో ఏమిచేయవలెనని పరస్పరము చూచుకొనిరి. రాముని దుస్థితికి లక్ష్మణుడు మిక్కిలి విచారించెను. వానరులు శోకభరితమగు దిగ్భ్రమతో వారిచుట్టును నిలబడిరి. ఇంద్రజిత్తు రాక్షస సైన్యమునభినందించి నగరమునకు తిరిగివెళ్ళెను. తనవిజయమునకు ఉప్పొంగుచు తనతండ్రికడకు వెళ్ళి రామలక్ష్మణుల చరిత్రముగిసినదని ప్రకటించెను. రావణుడు మిక్కిలి సంతసించెను. అతడు తనకుమారుని ఆలింగనము చేసికొని అతని శక్తిని కొనియాడెను.

వానరయోధులు గాయపడి క్రిందపడినేలపై పరుండిన రామలక్ష్మణులను చూచి అంతయు పూర్తిఅయిపోయినదని తలపోసిరి. నిస్సహాయముగ దీనస్థితియందున్న సుగ్రీవుని విభీషణుడు చూచి వానరప్రభువునకు ధైర్యము చెప్పెను. "ఆశను వదలుకొనుటఅవివేకము. రామలక్ష్మణులపైపు చూడుము. వారిముఖములింకను తేజస్సంపన్నమై యున్నవి. వారుమరణించలేదు. భయపడకుము. వారు త్వరలో మూర్ఛనుండి తేరుకొని యుద్ధమొనర్తురు" అని పలికెను. సేనాపతులు తమతమ సేనాబృందములను బాధనుండి తొలగించి నూతనోత్తేజమును కలిగించిరి.

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

ఇంతలోరావణుడు రామలక్ష్మణులు ఇంద్రజిత్తుచే చంపబడిరని లంకయందు చాటించెను. అతడు తనస్త్రీలను కబురంపి వారికిట్లు చెప్పెను. "వెంటనే వెళ్ళి రాముడికలేడని సీతకు చెప్పుడు. రామలక్ష్మణులిరువురును యుద్ధరంగమున మరణించిపడియుండిరి. వానరసైన్యము నాశము చేయబడినది. చివరిసారిగ ఆమెను నమ్మించుటకు ఆమెను పుష్పకవిమానముపై తీసికొని వెళ్ళి ఆకాశమునుండి యుద్ధరంగమును చూపుడు. మూర్ఖపు పట్టుదలగల సీతను స్వయముగ జరిగినసంఘటనను చూచుకొననిండు. అది చూచినతర్వాత నేను తప్ప తనను చూచుకొనువారు లేనికారణముగ నావైపు మరలును". రాక్షస వనితలు రావణుడు చెప్పినట్లే చేసిరి. విమానమునుండిసీత యుద్ధ రంగమును చూచెను. రామలక్ష్మణులు నేలపైకదలికలేకపడియుండుట, వారి ఆయుధములు ప్రక్కనే చిందరవందరగ పడియుండుటయుచూచెను. ఆమెదుఃఖముతో నిండిపోయెను. ఆమె అంతయు అయిపోయినదనితలచి ఏడ్చెను. "నేను సౌఖ్యవంతమైనభార్యగ, తల్లిగ, మహారాణిగ నివసింతును అని చెప్పిన ఋషీశ్వరులు, జ్యోతిషపండితులవాక్కులను అసత్యము చేయుచు విధినన్నిట్టిఅంత్యదశకు తెచ్చినది. ఓకౌసల్యా! ఇపుడు నిన్నెవరు ఊరడింతురు? సముద్రమును లంఘించినవారు చిన్న సరోవరమునందు పడిపోయినట్లు, ఘనకార్యములు సాధించినవారు ఇపుడు చచ్చిపడియున్నారు. ఓరాకుమారులారా! మీదివ్య ఆయుధములు మిమ్మెట్లు ఓడించినవి? అయ్యో! విధిచాల బలీయమైనది".

సీత అట్లు మిక్కిలి దుఃఖముతో నిరాశతోనుండగ, ఆమె రాక్షస సహచారిణి త్రిజట కదలికలేని రామలక్ష్మణులరూపములను దగ్గరగ చూచి అకస్మాత్తుగ ఇట్లనెను. "ప్రియమైనసీతా! నీవు విచారింప నవసరములేదు. నీభర్తగాని లక్ష్మణుడు గాని మరణించలేదు. వారి ముఖములను చూడుము. చనిపోయినరీతిగనున్నవా? వారుఏదో మంత్రపూతమైన ఆయుధముచే బంధింపబడి మూర్ఛనందియున్నారు. ఈసైన్య వ్యూహమును చూడుము. ధైర్యము కల్గియుండుము. భయపడ కుము". ఆమె మాటలు అమృతమువలె సీతచెవులందుపడెను. విమానము లంకకు తీసికొని పోబడెను. సీతతిరిగి అశోకవనమునకు తీసికొని పోబడెను.

ఇంతలో మంత్రింపబడిన బాణము బలము తగ్గినది. రాముడు కనులు తెరచి లేచికూర్చుండెను. బాధించురీతిగ గాయపడినను రాముడు తన ఆత్మశక్తితో బలమును పుంజుకొని లేచికూర్చుండెను. నేలపై పడియున్నతన సోదరునిచూచి గట్టిగ ఏడ్చెను. "అయ్యో!నాకిపుడు విజయమును సాధించుటవలన ఉపయోగమేమి? ప్రియమైనసోదరా! నాతో నిన్ను అడవికి ఎందుకు తీసికొని వచ్చితిని? ఈవిధముగ నిన్ను ఎందుకు చంపించితిని? నీవులేకుండ నేను అయోధ్యకెట్లు తిరిగివెళ్ళ గలను? నావిచారమును పోగొట్టుటకు నీవు నన్ను ఓదార్చుచుండెడి వాడవు. గొప్పవిచారమును నేనెదుర్కొనవలసినపుడు నీవు మౌనము వహించితివి. నేను నిన్నెట్లు రక్షించుకొందును? ప్రపంచమందు నీవంటి యోధుడెచట గలడు? ఏవస్తువునైనను పోగొట్టుకొనిన దానిని భర్తీచేసికొన

వచ్చును. నీస్థానమును భర్తీచేయుటకు నేనెవరిని కనుగొనగలను? కార్తవీర్యార్జునుడు తనవేయిబాహువులతో బాణముల ప్రయోగించినటులు నీవు నీరెండుచేతులతో బాణవర్షములు కురిపించి రాక్షసులను సంహరించితివి. మృత్యువు నీకడకు ఎట్లు రాగల్గినది? నీవునాతో అరణ్యమునకు వచ్చితివి. ఇపుడు నేను నీతోపాటు యమసదనమునకు వచ్చి నీఋణమును తీర్చుకొనవలసియున్నది. నేను నాఓటమిని అంగీకరించుచున్నాను. నేను విభీషణునకిచ్చినమాట నెరవేరదు. ఓవానరప్రభూ! నీయోధులతోనీవు కిష్కింధకు తిరిగివెళ్ళుము. మీరు నాకొఱకు కష్టపడి పనిచేసితిరి. మైత్రియొక్కబాధ్యతలన్నియు నీవునెరవేర్చితివి. నీకు నాకృతజ్ఞతలు. ఇంకను మీరుమరణించుటవలన ప్రయోజనములేదు. మీరు మీనగరమునకు తిరిగివెళ్ళుడు. నన్నిచట మరణింపనిండు" అని రాముడు నిస్సహాయముగ దుఃఖించెను.

అనంతరము విభీషణుడు వేత్రదండమును చేతబూని అచటకు వచ్చెను. అతని నల్లని పెద్ద ఆకృతిని చూచి వానరులు అతనిని ఇంద్రజిత్తుగ ఊహించి ఎగురనారంభించిరి. యుద్ధరంగమున మరియొక భాగమున సుగ్రీవుడు, అంగదుడును ఇట్లు చర్చించుకొను చుండిరి. "వానరులు భయముతోనట్లు విడివిడిగ చెదరిపోవుచున్నారేల? ఏమి జరిగినది" అని సుగ్రీవుడడిగెను. "రామలక్ష్మణులు గాయపడినేలపై పడియున్నారని నీకుతెలియదా?" అని అంగదుడు సమాధానమిచ్చెను. "అదికాదు. ఆమార్గమువంక చూడుము. వారు చిందరవందరగ పరుగులిడుచున్నారు. దీనికి అచట వేరే కారణముండియుండును" అని సుగ్రీవు

డనెను. అపుడు ఇంద్రజిత్తు చేతులందు బాధలుపడిన వానరులు విభీషణుని చూచి ఇంద్రజిత్తనుకొని భయపడిరి. ఆవానరుల భ్రాంతిని తొలగించి వారిని భయమునుండి కూడదీయుమని సుగ్రీవుడు జాంబవంతుని పంపెను. విభీషణుడు రామలక్ష్మణులవంక చూచెను. గాయపడి శరీరమంతట బాణములచే కప్పబడి యుద్ధముచేయలేని స్థితియందున్న వారినిచూచి విభీషణుడు ఏడ్వనారంభించెను. "అంతా అయిపోయింది. ఇంకచేయుటకేమున్నది".

సుగ్రీవుడు తనమేనమామ సుషేణుని వంకతిరిగి "రామలక్ష్మణులను కిష్కింధకు తీసికొనిపొండు. నేను రావణుని సంహరించి సీతను విడిపించి అక్కడకు తీసికొని వత్తును" అనెను. సుషేణుడిట్లు జవాబిచ్చెను. "ఈరాకుమారుల గాయములను తగ్గింపగల, ఆరోగ్యమును తిరిగిరప్పింపగల ఓషధులు కలవు. ఈఓషధులు ఎచట కనుగొనబడునో తెలిసినవారు మనలోకలరు. హనుమంతుడెక్కడ నున్నాడు? నీవు అతనిని పంపినచో అతడు ఓషధులను తేగలడు". వారిట్లు మాటాడుచుండగా సముద్రమును, గాలియును పెద్దగాలిచే మథింపబడినవి. పక్షీంద్రుడు గరుత్మంతుడు దృష్టిపథమునకు వచ్చెను. గరుడుడు రాగానే రామలక్ష్మణులను కప్పిన నాగాస్త్రములు అదృశ్యమయ్యెను. అవి అన్నియు ఇంద్రజిత్తు యొక్క మాయవలన రాజకుమారుల బంధించిన బాణములరూపముననున్న విషసర్పములు. వారిశత్రువగు గరుడుడు కనిపించగనే అవి ఎగిరిపోయినవి. అంతట గరుడుడు సౌమ్యముగ రామలక్ష్మణుల శరీరములను తాకి వారికి తిరిగి

సంపూర్ణబలమును అప్పగించెను. గాయములు పూడ్చబడి ఇంతకు పూర్వముకంటె అధిక బలతేజోసంపన్నులై రామలక్ష్మణులు లేచినిలిచిరి. రాముడు "నాకుపకారివగు నీవెవరు?", తాను విష్ణువునని తన వాహనము గరుత్మంతుడని తెలియక రాముడిట్లు ప్రశ్నించెను. "నేను నీకుమంచి స్నేహితుడను. నీకు పాతపరిచితుడను. నీకు కీర్తిలభించుగాక! నన్ను ఇప్పుడు వెళ్ళనిమ్ము. యుద్ధము పూర్తయినతర్వాత పరస్పరము తెలిసికొందము" అని పలుకుచు గరుడుడు ఎగిరిపోయెను. రామ లక్ష్మణులు పూర్తి ఆరోగ్యము సంతరించుకొని యుద్ధమునకు సిద్ధముకాగా వానరులు అధికోత్సాహముతో రావణుని కోటను ఎదిరించుటకు సిద్ధపడిరి.

రావణుడు తనభవనమునందుండియే గాలివాలున వానరులయొక్క ఉత్సాహముతోకూడిన జయజయధ్వానములను విని ఆశ్చర్యపడెను. అతడు తన పార్శ్వమునందున్న రాక్షసులను చూచి "వానరులంత సంతోషించు కారణమేమైయుండును. ఏదో క్రొత్తసంఘటన జరిగియుండును. వెళ్ళి అదియేమో తెలిసికొనిరండు" అని పలికెను. కొందరు రాక్షసులు కోట గోడపైకి ఎక్కిచూచిరి. తిరిగివచ్చి భయముతో వణకుచు వారు రావణునకిట్లు చెప్పిరి. "మహారాజా! సుగ్రీవుని నాయకత్వమున వానరసైన్యము ధైర్యముతో మనకోటను ఎదిరించు చున్నది. రామలక్ష్మణులిరువురును జీవించియున్నారు. ఏనుగులవలె వారు తమ బంధనములను ఛేదించుకొనిరి. ఇంద్రజిత్తుచే బంధింపబడిన నాగాస్త్రములను రామలక్ష్మణులు దులుపుకొని సైన్యమునందు తిరిగిచేరి ఆకలితోనున్న సింహములవలె తీవ్రముగ యుద్ధరంగములోనికి వచ్చు

చున్నారు. ఇంద్రజిత్తుయొక్క బాణములును, అస్త్రములును వ్యర్థము లయ్యెను". రావణుని ముఖము క్రూరమైనది. అతడు ఆందోళణతోనిండి "నీవు చెప్పునది విని నేను ఆశ్చర్యపడుచున్నాను. ఈఅస్త్రమునుండి ఇప్పటివరకు ఎవ్వరును తప్పించుకొనలేదు. ఆయాయుధములు ఈ మానవులపట్ల శక్తిహీనములయినచో మనము నిజముగ ప్రమాదములో పడితిమి" అని పలికెను. అనంతరము రావణుడు విపరీతమగు కోపముతో అరచెను. "ధూమ్రాక్షా! వినుము. నీవిక్కడనుండగా నేనెందుకు బాధపడ వలెను? నీకు కావలసిన వారినందరను నీతో కలుపుకొనుము. వెంటనే వెళ్ళి ఆఇద్దరు అల్పమానవులను నాశముచేసి త్వరగ తిరిగిరమ్ము".

ధూమ్రాక్షుడు తన ప్రభువుచే ఆవిధముగ ప్రత్యేకింప బడుటచే నిజముగ సంతోషమును, గర్వమును పొందెను. అతడు ఒక యోధుల బృందమును వెంటగొని, కోటబయటకు వచ్చి హనుమంతుని నాయకత్వమున పడమటిద్వారమునందు ప్రవేశింప ప్రయత్నించు బృందముతో తలపడెను. ఆయుద్ధమునందు ఇరుపక్షములందును చాల మంది మరణించిరి. చివరకు ధూమ్రాక్షుడు హనుమంతునిచే చంపబడెను. కొలదిమంది రాక్షసులు మాత్రమే తప్పించుకొని కోటలోనికి పారిపోయిరి. మిగిలినవారందరును మరణించిరి. ఈఅపజయవార్త విని రావణుడు అదుపులో పెట్టుకొనలేని కోపముతో నిండెను. అతడు త్వరగ వజ్రదంష్ట్రుని కబురు పంపెను. "ఓయోధులందరయందు ధైర్యవత్తరమైనవాడా! ఆలసింపక వెళ్ళి ఆదుర్మార్గులను సంహరింపుము" అని ఆజ్ఞాపించెను. వజ్రదంష్ట్రుడు రాజునకు వంగినమస్కరించి బలమైన సైన్యమును వెంట

నిడికొని దక్షిణ ద్వారమునుండి బయటకు దుమికి అంగదునితో యుద్ధ మునకు సిద్ధపడెను. వజ్రదంష్ట్రుని నాయకత్వమున రాక్షసులు భయంకర మైన యుద్ధమొనర్చి లెక్కలేనంతమందివానరులను చంపిరి. అయినను వానరసైన్యము స్థిరముగ నిలిచి వెనుకంజవేయలేదు. గండశిలలు, వృక్షములను ఆయుధములుగగొని అసంఖ్యాకమైన రాక్షసులను సంహరించిరి. ఇరుపక్షములందు యుద్ధము తీవ్రమైనది. అంగదుడును, రాక్షసనాయకుడు వజ్రదంష్ట్రుడును చాలసేపు బాహాబాహీగా ద్వంద్వ యుద్ధము చేసిరి. సాహసముతో చివరవరకు పోరాడి వజ్రదంష్ట్రుడు చంప బడెను. రాక్షసులు ఆందోళణతో పరుగెత్తిరి. వానరులు అంగదుని చుట్టును చేరి సంతోషముతో కేకలు పెట్టిరి.

అటుపిమ్మట రావణుడు ప్రహస్తుని ఆజ్ఞాపించెను. "అకంపనుని, మిక్కిలి భయంకరమైన రాక్షసుల వెంటనిడికొని యుద్ధము నకు వెళ్ళుమని పంపుడు. వెళ్ళి రాముని, సుగ్రీవుని వానరసైన్యమును సంహరింపుమనుడు. అకంపనుని శక్తిని, నిపుణతను ఎవరును నిరోధించ లేరు". ఆజ్ఞానుసారము ప్రహస్తుడు అకంపనుని నాయకత్వమున రాక్షససైన్యమును పంపెను. అకంపనుడు అతని పేరుకు తగినట్లు యుద్ధరంగమున స్థిరుడు, కదిలింపనశక్యమైనవాడును. అతడు తన ఆయుధములను, యోధులను జాగ్రత్తగా ఎన్నుకొనెను. అతడు బయలు దేరగ దుశ్శకునములు ఎదురయ్యెను. అతడుగాని అనుయాయులుగాని లెక్కింపలేదు. వారి కయ్యమునకు కాలుదువ్వుధ్వని సముద్రఘోషను మించినది. పెద్దసంగ్రామము జరిగెను. రక్తము ప్రవాహములుగ పారెను.

ధూళిపరాగము పైకిలేచి సూర్యకాంతిని క్రిందుపరచెను. ఇరుపక్షము లందును మరణించినవారి సంఖ్య అసంఖ్యాకము. కుముదుడు, నలుడు, మైందుడు, ద్వివిదుడును అకంపనుని ఎదిరించిరి. ధైర్యముతోఅకంపనుడు తనను తాను రక్షించుకొనెను. యుద్ధము వానరయోధులవంక మరలెను. వానరయోధులు పారిపోవుటకు సిద్ధపడుచుండగా హనుమంతుడు వారికి ధైర్యము కల్పించుచు తానువచ్చి యుద్ధమునకు సిద్ధపడెను. అకంపనుడు ఒకబాణములజల్లును హనుమంతుని మీదకు పంపెను. హనుమంతుడు దానిని పరిగణింపక పెద్దగండశిలను ఎత్తి, గిరగిరత్రిప్పుచు, అకంపనుని మీదకు విసిరెను. రాక్షసుని బాణములు ఆగండశిలను తాకి దానిని చూర్ణమొనర్చినవి. అంతట హనుమంతుడు తనదేహమును పెద్దగపెంచి, సూర్యునివలె దుర్నిరీక్షుడై పెద్దవృక్షమును ఊడబెరికి ఆవృక్షముతో ఆరాక్షసుని ఎదిరించి వానిని సంహరించెను. ఆరాక్షస సైన్యము భూకంపమునందలి అరణ్యమువలె ధ్వంసమొనర్పబడెను. చావగామిగిలినవారు, చంపబడినవారిచే పరుపబడిన యుద్ధరంగము నుండి పారిపోయి ఈవార్తను లంకయందు వ్యాప్తిచేసిరి. వానరులు హనుమంతుని చుట్టునుచేరి పెద్దఘోషతో తమ మెచ్చుకోలునుప్రకటించిరి.

అకంపనుని మరణవార్తను వినిన రావణుడు ఉత్సాహము సన్నగిల్లి, కోపముతో బలమును పుంజుకొని క్రొత్త పథకముల గురించి ఆలోచింపనారంభించెను. అతడు పట్టణరక్షణ విషయమై యోచించి, ప్రధాన సైనికాధికారి ప్రహస్తునితో సమావేశమునేర్పాటు చేసెను. "మనము వానరుల కోటముట్టడిని భంగపరుపవలెను. మనము

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

సైన్యమునంతటికి ప్రధానస్థలమున ఎదురుదాడిచేసి, వానరనాయకులను సంహరింపవలెను. నేను, కుంభకర్ణుడు, నీవు, ఇంద్రజిత్తు, నికుంభుల యందు మన అయిదుగురయందు ఒకరు సైన్యమును నడిపించు బాధ్యతవహించి కోటబయటకు నడిపింపవలెను. మనము కోతులకు భయపడుదమా? ఒకరాక్షసుని అరపు వినినంత మాత్రమున వారు భయముతో ఎగిరిపోవుదురు. వారు యుద్ధశాస్త్రమునెరుగరు. వారు నైపుణ్యములేని మూర్ఖులు. మనతో యుద్ధమునందు నిలబడుటకు వారలకు శక్తి ఎక్కడిది?" అనెను. ప్రహస్తుడు మర్యాదగానిట్లు జవాబిచ్చెను. "మనము భవిష్యత్తును ఊహించినట్లే జరిగినది. మేము మర్యాద పూర్వకముగ చిరకాలము క్రిందట సీతను రామునకప్పగించి, శాంతి కుదుర్చుకొనుమని మనవి చేసికొనియుంటిమి. కాని మేము మీఆజ్ఞలను శిరసావహించుటకు కట్టుబడితిమి. నీగురించి నేను నాప్రాణములను, కుటుంబమును, నాసమస్తమును త్యాగమొనర్చుటకు సిద్ధముగా నున్నాను. నీకు సంతోషమైనచో, మనకోటమీదకు దండెత్తివచ్చిన సైన్యముపై ఎదురుదాడిని నడిపించుటకు నేను సిద్ధము".

ఒక పెద్దసైన్యము ప్రోగుచేయబడినది. ఎదురుదాడికి సర్వము సన్నద్ధమైనది. అనంతరము ప్రహస్తుడు రణభేరి మ్రోయించి తదనుగుణముగ యుద్ధమునకు నడిచెను. దుశ్శకునములు తోచెను. కాని వానిని అతడు నిర్లక్ష్యము చేసెను. వానరులు ప్రహస్తునిచే పెద్ద సైన్యము కోటయొక్క తూర్పుద్వారమునుండి వెలువడి నడిపింపబడుట చూచి, సంతోషముతో గట్టిగాఅరచుచు యుద్ధమునకు సిద్ధపడిరి. అగ్ని

జ్వాలయందు దుముకు శలభములవలె రాక్షసులు వానరసైన్యము మీదకు దూకిరి.

"చూడండి పెద్దసైన్యముతో నాయకునిగ ఒకరాక్షసుడు కోటవెలుపలకు వచ్చుచున్నాడు. అతడెవరు?" అని రాముడు ప్రశ్నించెను. విభీషణుడిట్లు జవాబిచ్చెను. "అతడు రావణుని ప్రధాన సైన్యాధ్యక్షుడు ప్రహస్తుడు. రాజసైన్యమందు మూడవవంతు అతని అధీన మందుండును". అపుడు గండశిలలు, చెట్లను ధరించిన వానరులకును, ఖడ్గములు, బల్లెములును, ధనుర్బాణములును, గొడ్డళ్ళు మున్నగు ఆయుధధారులగు రాక్షసులకును నడుమ గొప్పయుద్ధము జరిగెను. బాణములకు ప్రతిగ రాళ్ళవర్షము కురిపించుచు మృత్యుదేవత గుప్పిట పెనగులాడుచు ఇరువర్గములును భయంకరముగ రణరంగమును రక్తసిక్తము చేయుచు పోరాడిరి. ప్రహస్తుని అనుచరులు నరాంతక, మహానాద, కుంభహను మొదలగువారు, ద్వివిద, దుర్ముఖ, జాంబవంతు లచే ఎదిరించబడి చంపబడిరి. ప్రహస్తునకు , నీలునకు నడుమ చాలసేపు యుద్ధము జరిగినది. చివరకు ప్రహస్తుడు పెద్దయినుప వేత్రదండమును ధరించి నీలునివంక దూసుకు వచ్చెను. నీలుడు తనవంతుగ ఒకపెద్ద గండశిలనూడబెరికి దానితో ప్రహస్తుని శిరమును భిన్నముచేసి చంపెను. రాక్షసయోధులు అన్ని దిక్కులకు పారిపోయిరి. ఈఘనవిజయానంత రము నీలుడు రామలక్ష్మణులకడకేగి వారికి నమస్కరించి జరిగిన దంతయు వారికితెలిపెను. రామలక్ష్మణులు అతని శక్తిని మెచ్చుకొని అతనిని అభినందించిరి.

రణరంగమునుండి పారిపోయిన కొందరు, రాక్షస ప్రభువునకు, అగ్నిపుత్రుడు నీలుడు ప్రహస్తుని సంహరించెనని వార్త తెలిపిరి. రావణుడు క్రోధముతో విచారముతో దుఃఖించెను. "ఇంద్రాది దేవతలను జయింపగల నాసేనాధ్యక్షుడు ఈవానరులచే సంహరింప బడెను. దీనిని తేలికగా భావింపరాదు. మనము రాముని, అతని వానరసేనను తప్పక సంహరింపవలెను" అని పలుకుచు రావణుడు తన రధమునెక్కి ప్రళయకాలరుద్రునివలె ముందుకు వెళ్ళెను. తేజోవంతమైన తనరధమున కూర్చుండి, నగరమును బయలువెడలి వచ్చుచు రావణుడు వానరసైన్యమును చూచెను. సముద్రఘోషవలె ప్రతిధ్వనించు వానరసైన్య ఘోషను వినెను. క్రొత్త రాక్షసుడు సైన్యమును వెంటనిడికొని కోట వెలుపలకు వచ్చుట చూచిన వానరులు శిలలను వృక్షములను ధరించి యుద్ధసన్నద్ధులై నిలిచిరి. విభీషణుడు రాక్షసయోధులను ఒకరితర్వాత నింకొకరిని రామునకు చూపెను. "అక్కడ రధమునందు ఉపవిష్టుడై ఉదయభానుని వలె ప్రకాశించువాడు ఇంద్రజిత్తు " అనుచు ఒకరి తర్వాతనొకరిని పరిచయముచేసి రావణుని దగ్గరకు వచ్చెను. “అక్కడ పెద్దరధమందు సూర్యతేజయుతుడై కూర్చుండినవాడు దశగ్రీవుడు రావణుడు" అని చెప్పెను.

శ్రీరాముడు గంభీరమైన, ప్రకాశవంతమైన రావణుని రూపమును శ్రద్ధతో, జాలితో చూచెను. "గొప్పయోధాగ్రేసరుడే. సందేహము లేదు. కాని అతడు సంహరింపదగినంత దుర్మార్గుడు" అని రాముడు పలికెను. రావణుడు అసంఖ్యాకమైన వానరులను ఎదిరించి సంహరించెను.

నీలుడు రావణుని ధైర్యముగ ఎదిరించెను. కాని ఆగ్నేయాస్త్రముచే పడగొట్ట బడెను. హనుమంతుడు రావణుని ఎదిరించెను. కొంతసేపు వారిరు వురును సమముగ పోరాడిరి. కాని రావణుడు వశపరుప వలనుపడలేదు. వానరసమూహమునందు పెద్దనాశమును సృష్టించెను. రావణునకు, లక్ష్మణునకు నడుమ యుద్ధము జరిగెను. లక్ష్మణుడు స్మృతితప్పి పడిపోయెను. కాని హనుమంతుడు వచ్చి లక్ష్మణుని రాముని కడకు మోసికొనిపోయెను. అనంతరము రాముడు హనుమంతుని భుజములపై అధిరోహించి రావణునితో యుద్ధము చేయవచ్చెను. రాక్షసరాజు నెప్పికల్గునట్లు గాయపరుపబడెను. అతని బంగారుకిరీటముబ్రద్దలయ్యెను. అట్లే రధమును పగులగొట్టబడెను. ప్రతి ఆయుధము నిరుపయోగము చేయబడుటచే రాముని ఎదుట నిలబడెను. "ఇప్పుడు నీవు వెళ్ళవచ్చును. నేడునీవు బాగుగ యుద్ధముచేసితివి. వెళ్ళివిశ్రాంతి తీసి కొనుము. విశ్రమించినతరువాత రేపు సాయుధుడపై మరలరమ్ము" అని రాముడు విడువగా రావణుడు సిగ్గుతోకూడిన ముఖముతో నగరమునకు తిరిగివెళ్ళెను. రావణుడు రణరంగమునుండి మరలివెళ్ళి, చిన్నబుచ్చు కొనుటను కనిన దేవతలు త్వరలో భవిష్యత్తునందు తమబాధల నివారణను కనుగొని చాలసంతోషించిరి.

రావణుడు అవమానముతో ఆందోళణతో కోటలో ప్రవేశించెను. కొంతసేపు ఆలోచించినతరువాత తనధైర్యమును కూడగట్టు కొని నిద్రించుచున్న తనసోదరుడు కుంభకర్ణుని లేపుడని ఆజ్ఞాపించెను. ఒకశాపముకారణముగ కుంభకర్ణుడు నెలలతరబడి నిద్రించు స్వభావము

కలిగియుండెను. అతడు కొలదిరోజులక్రితమే నిద్రించుటకుపక్రమించెను. రావణుడు కుంభకర్ణుని వెంటనే నిద్రలేపుటకు అన్నివిధముల ప్రయత్నింపుడని, అతనిని యుద్ధము చేయుటకు సిద్ధపరపుడని తన మంత్రులను కోరెను. "నాతపస్సులన్నియు వ్యర్థములని నిరూపింప బడినవి. ఋషీశ్వరుల భవిష్యత్కథనమే నెరవేరునట్లు తోచుచున్నది" అని రావణుడు తనలోతాను అనుకొనెను. కాని చివరకు యుద్ధము చేయుటకే నిశ్చయించుకొని అంతిమవిజయము తనదే అను నిశ్చయముతో నున్నట్లు ఆజ్ఞలు చేసెను. "యోధులందరు కోటకు అన్నిదిక్కుల పరిరక్షింతురు గాక! నాసోదరుడు గాఢనిద్రలోనున్నాడు. నాఆందోళణతో సంబంధములేకుండా అతడు సుఖముగ నిద్రించుచుండెను. అతనిని ఒంటరిగ వదలినచో అతడు నెలలతరబడి నిద్రలేవడు. అతడు నిద్రకుపక్ర మించి తొమ్మిదిరోజులుమాత్రమే అయినది. వెంటనే అతనిని లేపుడు. అతడులేచి యుద్ధభూమికి వెళ్ళినచో శత్రువులు తప్పక చెదరిపోవుదురు. మాకుంభకర్ణుని ఎదుట ఎవరునిలబడగలరు? అతడు లేచి నాశత్రువు లను రణమున ఎదిరించినచో నాకు భయపడనవసరములేదు".

రావణుని ఆజ్ఞమేరకు అతని అధికారులును, సేవకు లును కుంభకర్ణుని భవనమునకు వెళ్ళిరి. అతడు కనులు తెరవగానే విపరీతమగు ఆకలితోనుండునని వారికి తెలియును. అందుచే పర్వత ముల పరిమాణముతో ఆహారమును తయారుచేయించి ప్రోగుపెట్టిరి. తరువాత వారు భేరీలు వాయించుచు శంఖములూదుచు పెద్దధ్వని చేసిరి. రాక్షసుని పెద్దశరీరమును కదుపుచు, కుదుపుచు చాలమందిరాక్షసులు

అలసిపోయిరి. అరపులతో, భేరీలతో, బూరాలతో వారుచేసినధ్వని ఆకాశ మంతట నిండి లంకలోని మృగములును, పక్షులును భయపడినవి. కాని నిద్రయందున్న కుంభకర్ణుడు మాత్రమేమియు వినలేదు. రాక్షసులు అతనిని లేపుటకు కష్టపడి పనిచేసిరి. వారు ఏనుగులను అతనిశరీరముపై నడిపించిరి. దుడ్డుకఱ్ఱలను తీసికొని అతనిని బాదిరి. చివరకు అతని కనురెప్పలు కొద్దిగ తెరువబడినవి. నిద్రపోవుచున్నవాడు దోమను తుడిచి వేసినట్లు కుంభకర్ణుడు అందరిని ప్రక్కకు గెంటివేసెను. ఆవులించెను. కుంభకర్ణుడు ఆవిధముగ తననిద్రనుండి భంగపరుపబడెను. లేనిచో కొన్ని నెలలపాటు నిద్రించియుండెడివాడు. తననిద్రాభంగమునకు కారణమును తెలిసికొనుటకు ముందు అతడు తినుట, త్రాగుటకు ఆరంభించెను. మాంసపుగుట్టలును, రక్తభాండములును, మద్యభాండములును తన కొఱకు సిద్ధముచేయబడినవన్నియు పూర్తి అయినవి. అతని ఆకలి కొంత ఉపశాంతినందినతర్వాత రాక్షసులు అతనిని సమీపించి పరిస్థితిని వివరించిరి.

రావణుని మంత్రి యూపాక్షుడిట్లుచెప్పెను. "ఓప్రభూ! యుద్ధరంగమున మనము ఓడింపబడి పెద్దప్రమాదమునందుంటిమి. సీతనుగురించి వచ్చినతగవు నీకు జ్ఞప్తియందుండవచ్చును. వానరులు శ్రీరామలక్ష్మణులతో వచ్చి కోటను బ్రద్దలుకొట్ట ప్రయత్నించుచున్నారు. ఇంతకుముందు అపజయమెరుగని మన సైన్యమును సంహరించిరి, జయించిరి, ఓడించిరి. సముద్రమును బోలిన వానరసైన్యముచే లంక చుట్టుముట్టబడినది. రావణుడు స్వయముగ యుద్ధభూమికివెళ్ళి మరలి

శ్రీ బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

వచ్చెను. అతడు ప్రాణములతో తప్పించుకొనుట మన అదృష్టము". ఈవాక్కులు విని కుంభకర్ణుడు మిక్కిలి క్రోధమును పొందెను. "ఇపుడే నేను వెళ్ళి ఆశత్రువును పరిమార్తును. వానరులను చంపి రామలక్ష్మణుల రక్తమును త్రాగుదును. ముందు ఈపని చేసినతరువాత రాజుకడకు వెళ్ళుదును" అని కుంభకర్ణుడనెను. ఈక్రోధపూరిత వచనములను విని మంత్రులు సంతోషించిరి. కాని ముందుప్రభువును దర్శించి అతనితో ఏమిచేయదగునో ఆలోచించి తరువాత యుద్ధమునకు వెళ్ళదగునని మంత్రులు కుంభకర్ణునకు తెలిపిరి. కుంభకర్ణుడంగీకరించెను . ముఖము కడుగుకొనెను. లంకాధిపతియొక్క భవనమునకు చింతాక్రాంతమైన తగ్గిన ప్రాభవముతో పెద్దపెద్ద అంగలు వేసికొనుచు వెళ్ళెను. రాజమార్గమునందు నిలిచియున్న రాక్షసులు కుంభకర్ణుడు నడచివెళ్ళుట చూచి క్రొత్త ధైర్యమును సంతోషమును పొంది అతనికి వంగినమస్కరించి అతనిపై పూలజల్లులు కురిపించిరి. అతడు రాజభవనమునందు ప్రవేశించి రావణుని ఎదుట నిలబడెను. సాటిలేని తనసోదరుని రాకతో సంతోషించి రావణుడు తనసింహాసనమునుండి క్రిందకుదిగి తనను కౌగిలించుకొనెను.

కుంభకర్ణుడు "అగ్రజా! నేను నీకేమిచేయగలను? ఎందుకు నీవు నానిద్రాభంగమొనర్చితివి? నీకుదేని వలన భయము కలిగినది? ఎవరు తనజీవితమున విశ్రాంతికోరుచు, పీనుగుగ మార దలచెనో తెలుపుము?" అని అడిగెను. రావణుడు ఇట్లు సమాధాన మిచ్చెను. "అనుజా! ఏమిజరిగినదో నీకు తెలియదు. నీవు నిద్రించు చుంటివి. ఆ నరుడు రాముడు నిజముగ నాకొక బెదిరింపు అయినాడు.

మనము అతిక్రమింపరానిదని తలచిన సముద్రమునకతడు ఒక సేతువును నిర్మించి మరియొక సముద్రము వలె వానరసైన్యముతో లంకను చుట్టుముట్టెను. మనయోధులు ఎవరు బయటకువెళ్ళి ఎదిరించిరో వారందరు జయింపబడి చాలమంది చంపబడినారు. ఇపుడు మమ్ము వినాశమునుండి రక్షించు బాధ్యత నీది. నీవీపని చేయగలవని నాకు తెలియును. నీవు దేవతలను ఓడించి పారద్రోలితివి. నీకు నాయందుగల ప్రేమనెరుగుదును. యుద్ధమందుగల నీనిశితత్వమును నీధైర్యమును నేనెరుగుదును. వెంటనే వెళ్ళి ఈశత్రువులను సంహారింపుము. అవసరమందు మాకు సహాయపడి లంకను రక్షింపుము". కుంభకర్ణుడు రావణుని ఆందోళణతోకూడిన మాటలను వినగానే శత్రువుపై క్రోధముతో కదిలెను. కాని వెంటనే రావణుని చరిత్ర అంతయు జ్ఞప్తిచేసికొనెను. రావణునకు తన అజేయత పట్లగల వ్యర్ధ విశ్వాసము కుంభకర్ణుని చిరునవ్వునవ్వునట్లు చేసెను.

"ఓసోదరా! క్షమింపుము. నీవు మమ్ము సంప్రదించినపుడు మేమిచ్చిన హెచ్చరిక నీవు వినిపించుకొనలేదు. మాభయములు నిజమైనవి. మేమిచ్చిన మంచిసలహాను నీవు తిరస్కరించితివి. నీదోషము, పాపములవలన కల్గిన ఫలితములను ఇపుడు నీవనుభవించుచున్నావు. నీవు సీతను దూరముగ తెచ్చితివి. ఆశతో తరుమబడి ఆలోచించకుండ పనిచేసినచో ఏమిజరుగును? నీకంతకోరికయున్నచో, నీబలమందు నీకు విశ్వాసమున్నచో తెలివిగ ముందుగనే రామలక్ష్మణులను చంపి సీతను బంధింపవలసినది. ముందు ఆలోచనలేకుండ నీవు

తప్పుడు క్రమములో పనిచేసితివి. బంధువుల, స్నేహితుల తెలివైన విశ్వాసపాత్రుల మాటలను, సలహాలను లెక్కచేయకుండ నడచుకొను వ్యక్తి అపాయములోనికి పరిగెత్తి నశించుననుటలో ఆశ్చర్యము లేదు. ఎవరు తనకు మంచిసలహాయిత్తురో, ఎవరు చెడుసలహానిత్తురో ఒక ప్రభువు తెలిసికొననక్కరలేదా?" అని మాటాడెను.

రావణునకు ఈఉపన్యాసము నచ్చలేదు. అతని ముఖము క్రోధముతోనిండెను. అదుపు చేసికొని అతడిట్లనెను. "సోదరా! అట్టిమాటలకు సమయము మించినది. నాకు ఇపుడు అవసరమైనది నీ విమర్శకాదు, నీశక్తి. జరిగినదేదోజరిగినది. అది న్యాయమా, అన్యాయమా, తెలివిగలపనియా, తెలివిహీనమైనపనియా? అను చర్చ నిరుపయోగము. ప్రస్తుతము చేయదగినది ఏది? అన్నదేసమస్య. గతదోషములవలన ఫలితములను నీబల నైపుణ్యములతో ప్రస్తుత విపత్తులను తుడిచిపెట్ట వలెను. ఆపదలోనున్నప్పుడు సహాయపడినవాడే నిజమైన స్నేహితుడు, బంధువు. నీకు నిజముగ నాయందభిమానమున్నచో నాప్రవర్తనను విమర్శింపక నాకు సహాయముచేయు సమయమిదియే. నేను నీబల శక్తులపై ఆధారపడియుంటిని. నీఅంతులేని ధైర్యముతో నాకు సౌఖ్యమునిమ్ము".

ఈప్రార్థనతో కుంభకర్ణుడు చలించిపోయెను. "భయ పడకుము. నేను నీసోదరుడను. ఎప్పుడును నిన్ను విడిచిపెట్టను. రామలక్ష్మణులు మరణించినట్లు నిశ్చయింపుము. నేను వానర సైన్యమును చెల్లాచెదురుచేసి చంపుదును . రాముని శిరమును నీ

పాదములచెంత విసరుదును. వానరప్రభువు యొక్క రక్తము రణరంగ మునపారుట నీవు చూతువు. అతడు రాగలిగితే నామృతదేహము మీద నుండియే రాముడు నిన్ను సమీపింపగలడు. అది సాధ్యము కాదు. ఎవరును నన్ను జయించుటకాని, సంహరించుటకాని చేయలేరు ". కుంభకర్ణుని గర్వముప్పొంగినది. "నీశత్రువెవరైనను ఫరవాలేదు. నేను అతనిని నాశముచేతును. అతడు యముడు, సూర్యుడు, అగ్ని ఎవరైనను నేను వారినందరను భక్షింతును ". ఈమనోభావములతో కుంభకర్ణుడు యుద్ధభూమికి వెళ్ళుటకు సంసిద్ధుడయ్యెను. నిద్రనుండి అకస్మాత్తుగ లేచిన కుంభకర్ణుని మనసు అస్తవ్యస్తమయినది. అతని ఆకలిదప్పులు చల్లారగనే అతడు స్థిమితపడి రావణునకు హితోపదేశమొనర్చెను. రావణుని బాధ చూచిన తర్వాత అన్నయందు ప్రేమ, జాలి అన్నిటిని మరచునట్లు చేసినవి. రావణుడు సంతసించెను. "ఓనిజమైనయోధుడా! ఓనానోదరా! అవసరమునకు వచ్చు స్నేహితుని నీయందుచూచు చుంటిని. కుంభకర్ణా!" అనుచు కుంభకర్ణుడు విజయముతో తిరిగి వచ్చునను విశ్వాసముతో రావణుడభినందించి పలికెను. కుంభకర్ణుడు ఒకపెద్ద బల్లెమును చేతపట్టుకొని ఒంటరిగ యుద్ధరంగమునకు బయలు దేరగ రావణుడు అతనివెంట రక్షణకొఱకు సైన్యము నిచ్చిపంపెను. అతడు తననోదరుని శరీరమును నగలతో, హారములతోనింపి "వెళ్ళుము. శత్రువులజయించి తిరిగిరమ్ము" అని దీవించిపంపెను. పొడపైన, బలమైన అవయవములుగల కుంభకర్ణుడు ప్రకాశించు ఆభరణములతో కప్పబడిన వాడై త్రివిక్రమునివలె తేజస్సంపన్నుడైయుండెను. అతడు తన అన్నకు

ప్రదక్షిణముచేసి, వంగినమస్కరించిచేతబల్లెము పట్టుకొని, పెద్దసైన్యమును వెంటనిడికొని పూలజల్లులమధ్య కుంభకర్ణుడు బయలుదేరెను.

కుంభకర్ణుని పెద్దశరీరము,రాక్షసులందు మహారాక్షసుని వలె కోటగోడపైనుండి బయటకు అడుగుపెట్టుచున్న అవసానదశయందలి యమునివలెనున్న కుంభకర్ణుని చూచి వానరులు భయపడి అన్ని దిక్కులకు పరుగెత్తనారంభించిరి. వానరనాయకులు గొప్ప కష్టముతో వారిని నిలిపి యుద్ధమునకు నిలిపిరి. అంగదునిచే మరలకూడదీయబడిన వానరులు ధైర్యమును కూడగట్టుకొని కుంభకర్ణుని ఎదిరించి పోరాడుటకు సిద్ధమయ్యిరి. వారు అతనిపై రాళ్ళను విసిరిరి. చెట్లతో పెద్దగ మోదిరి. కాని కుంభకర్ణుడు ఆదెబ్బలను లెక్కచేయక చిరునవ్వుతోభరించుచు చాల భయంకరమైన క్రూరత్వముతో వానరులను చంపనారంభించెను. కొంత మంది వానరులు క్రొత్తగ నిర్మింపబడిన సేతువుమీదకు పరుగెత్తగా, మరికొందరు సముద్రతీర ప్రాంతారణ్యములందు దాగికొనప్రయత్నించిరి. మరియొకమారు అంగదుడు సేనాపతులను, యోధులను ధైర్యముచెప్పి యుద్ధముచేయ సన్నద్ధపరచెను. ద్వివిదుడు , హనుమంతుడు, నీలుడు, వృషభుడు, శరభుడు మొదలగు ఇతరులగు సేనాపతులు కుంభకర్ణుని భయంకరముగ ఎదిరించిరి. కాని అతడు వారినందరిని నిర్లక్ష్యముచేసి వానర సంహారమును కొనసాగించెను. అంగదుడు దెబ్బతిని నేలపైపడెను. సుగ్రీవుడు కొట్టబడెను. మూర్ఛిల్లిన వానర ప్రభువును ఎత్తుకొని కుంభకర్ణుడు లంకవంక తీసికొని పోయెను. రాక్షసయోధులు మిక్కిలి

సంతోషముతో విజయధ్వానములు చేసిరి. కుంభకర్ణుడు తానుబంధించిన వానరప్రభువును తన అన్న రావణునకు బహుమతిగనీయకోరెను.

కుంభకర్ణుడు రాజమార్గమందు స్పృహతప్పిన వానర రాజును మోసికొని పోవుచుండగ రాక్షసులు, వారివనితలు మేడలపై నిలుచుండి పూల జల్లులు కురిపించిరి. మంచిగంధరసమును ఒలికించిరి. ఈపని మరల సుగ్రీవుని బ్రతికించెను. అతడు కనులు తెరచి తను ఎక్కడనున్నది, ఏమిజరిగినది అని ఆశ్చర్యపడెను. అతడు వెంటనే అంతయు తెలుసుకొనెను. తనను మోసికొని పోవుచున్న రాక్షసుని చెవులను, ముక్కును తన దంతములతో కొరికి, గోళ్ళతో చీరనారంభించెను. ఆవిధముగ బాధపెట్టబడిన కుంభకర్ణుడు సుగ్రీవుని నేలపై పడవేసి పాదముతో త్రొక్కదలచెను. కాని నేలపై కాలుమోపగానే సుగ్రీవుడు ఎగిరి ఆకాశమార్గమున పయనించి శ్రీరాముడున్న ప్రదేశమునకు వచ్చెను.

సుగ్రీవుడు ఏదోవిధముగ తిరిగివచ్చునని హనుమంతుడు ధైర్యముగనుండెను. సుగ్రీవుడు మరలవచ్చుటను ఊహించిన హనుమంతుడు వానరబృందములను కూడగట్టి మరలయుద్ధమునకు సన్నద్ధపరచెను. తెగిన ముక్కు, చెవులుకలిగి భయంకరాకారముతో అసహ్యముగనున్న కుంభకర్ణుడు గొప్పరక్త అరుణకాంతితో కూడిన మేఘమువలె ప్రళయకాలమృత్యువువలె క్రోధముతో ఒకపెద్ద ఇనుప దండమును చేతధరించి రణరంగమునకు తిరిగివచ్చెను. కుంభకర్ణుని ఎవరును ఇపుడు ఆపలేరు. అతడు వానరులను చంపి మింగివేయ నారంభించెను. ఈవిధముగ సైన్యమంతయు అదృశ్యమవనారంభించెను.

వానరులు అతని పర్వతకాయము మీదకు ఎగబ్రాకి శరీరమును నఖములతోడను, దంతములతోడను చీల్చుచున్నను అతడు ఈగలను తోలినట్లు వానరులను తుడిచివేసెను. వానరనాయకులు ఎవరును అతనిని పట్టుకొనలేకపోయిరి. లక్ష్మణుడు తనబాణములతో అతనిని ముందుకు రాకుండ అడ్డగింప ప్రయత్నించెను. కాని కుంభకర్ణుడు లక్ష్మణుని తప్పించుకొని రాముని ఎదిరించుటకు ముందుకు వచ్చెను. చాలసేపటినుండి రాముడు రాక్షసునిపై ప్రయోగించుటకు శక్తివంతమగు అస్త్రముల సిద్ధపరచెను. ఏడుసాలవృక్షములనరికి, వాలిని సంహరించిన అస్త్రము కుంభకర్ణునిపై ప్రయోగించెను. పదునైన, బలమైనబాణముల ప్రయోగించిరాముడు రాక్షసుని పాదములను, బాహువులను గాయ పరచెను. కాని మృత్యువుకంటె అల్పమైనదేదియు అతనిని ఆపలేదు. అతని పాదములు, కాళ్ళునరకబడినవి. కాళ్ళులేకుండనే మొండెము తోడనే కదలి పైశాచిక క్రూరత్వముతో కుంభకర్ణుడు తన అన్నకొఱకు యుద్ధముచేసెను. చివరకు ఒకబాణముతో శ్రీరాముడు కుంభకర్ణుని శిరమును నరకెను. నరుకబడినశిరము రాముని బాణముచేమోయబడి, మండుచున్న అడవులతోకూడిన పర్వతమువలె, ఆకసమునకెగిరి రక్తముతో తడిసి లంకలో పడెను. ఈ వార్త రావణునకు అందింపబడెను.

"నీసోదరుడు కుంభకర్ణుడు, అందరిని నాశమొనర్చు ప్రళయకాలమందలి మృత్యువువలె భయంకరుడైనవాడు, వీరస్వర్గము నలంకరించెను. వేలకొలది వానరులనతడు చంపెను. వినాశన భయముతో వానరసైన్యమును, రామలక్ష్మణులను చాలసేపు ఉంచెను. చివరకు

అతడు రామునిచే చంపబడెను. కాళ్ళుచేతులు లేకుండ వికృతరూపునిగ చేయబడిన అతని శరీరము దావాగ్నిచే ఆకారములేకుండా చేయబడిన వృక్షమువలె పడియుండెను. ఒకభాగము సముద్రమునందు పడగొట్ట బడినది. రెండవపెద్దభాగము కోట ప్రవేశద్వారమును మూసివేసెను. గాయపడినతల ఆకసమున ఎగురుచువచ్చి నగరమున పడియున్నది. నీప్రియమైన సోదరుడు స్వర్గమునకేగెను". రాక్షసులు ఈచరిత్రచెప్పగనే రావణుడు తనప్రాణమేపోయినట్లు అనుభూతినంది మూర్ఛిల్లెను. తెలివొందిన పిమ్మట రావణుడు దుఃఖముతో, క్రోధముతో అరచెను. "ఓబలసంపన్నయోధుడా! నన్ను విడిచి నీవు యమలోకమునకెట్లు పోయితివి? నాకుడిభుజము నరుకబడినది. ప్రపంచమందు ఏశత్రువు సమీపింప ధైర్యము చేయని నిన్ను రాముడెట్లు సంహరించెను? నీవు నేలపడగానే స్వర్గమునుండి దేవతలు సంతసపడుట చూచితిని. వానరులు సంతోషముతో నాట్యము చేసిరి. ఈరాజ్యమువలన నాకిక ప్రయోజనమేమి? నాప్రియసోదరుడు నన్ను విడిచినతరువాత నేనెందుకు జీవింపవలెను? అవును. మాసోదరుని చంపిన నరుని చిత్రహింసపెట్టి చంపవలెను" అని దుఃఖించి "అయ్యో! విభీషణుని వాక్కులను వినుటకు నేనెందుకు తిరస్కరించితిని? " అని విలపించెను. త్రిశిరుడు , ఇతర కుమారులును రావణుని ఓదార్పప్రయత్నించిరి. "దుఃఖించుటవలన ప్రయోజనమేమి? బ్రహ్మనుండి బలమును, కవచమును పొందిన నీవు ఎందుకు భయపడుదువు? శోకమునందుపడుదువేల?" అని వారు పలికినతరువాత త్రిశిరుడు స్వయముగ రణరంగమునకేగెను.

చాలమంది ఇతరులు ఏనుగులమీద, రధములమీద అతనిని అనుసరించిరి. గొప్ప యుద్ధముజరిగినది. నరాంతకుడు గుఱ్ఱముపై స్వారిచేయుచు, చేతబల్లెము ధరించి వానరులనాశము చేసెను. అనంతరము సుగ్రీవుని మీదకు వెళ్ళుచుండెను. అంగదుడు నరాంతకుని నిరోధించి అతనిని, గుఱ్ఱమును సంహరించెను. అట్లే దేవాంతకుడును, త్రిశిరుడును హనుమంతునిచే సంహరింపబడిరి. మహోదరుడు నీలునిచేత చంపబడెను. అతికాయుడు లక్ష్మణుని బాణములకు నేలకు ఒరిగెను. కాని వారు మరణించుటకు ముందు ఈనలుగురును నలుగురు యములవలె యుద్ధముచేసి వానరసేనలకు విపరీతనష్టము కలుగజేసిరి. అతికాయుడు సంహరింపబడినట్లు తెలియగానే రావణుడు దిగ్భ్రమచెందెను. "ఇది అవిశ్వసనీయము. పర్వతమువలె స్థిరమైన, బలమైన, సముద్రమువలె అనివార్యమైన ఈనాయోధులు ఒకరితరువాత మరియొకరు శత్రువులచే చంపబడిరి. ఇంతవరకు అపజయమెన్నడును ఎరుగనివారు నేడు యుద్ధ రంగమున ఓడింపబడి చచ్చిపడియుండిరి. నాసాటిలేని వీరకుమారుడు ఇంద్రజిత్తుచే నాగాస్త్రములచే బంధింపబడిన నాశత్రువులు ఇంకను నిలిచి యున్నారు. ఈఅద్భుతమైన నరుడు రాముని బలముగురించి వివరింప లేకున్నాను. అతడేస్వయముగ నారాయణుడా?" ఇట్లు రావణుడు దిగ్భ్రమనొందెను. అతడు శత్రుసైన్యములు కోటలోనికి, ప్రత్యేకించి అశోక వనములోనికి ప్రవేశింపరాదని కోరెను. దీనస్థితియందు చిన్నబోయిన రావణుడు రక్షణబలములను మరియొకసారి పర్యవేక్షించి తనభవనము నకు తిరిగివచ్చెను.

ఇంద్రజిత్తు తనతండ్రికి తనమాటలతో ఉపశమనమును చేకూర్చెను. "నేనిచట బ్రతికియుండగా నీవెందుకు బాధ పడుదువు" అని పలికి ఒకసైన్యమును ప్రోగుచేసి తమకోటపై ముట్టడి చేసిన దండుమీదకు దండెత్తెను. అతడు వానరసేనలను తన్నుకుపోయి వేలాది వానరులను గాయపరచి చంపెను. ఇంద్రజిత్తు కోపావేశము ముందు వానరులు నిస్సహాయులైరి. రాముని, లక్ష్మణుని కూడా ఇంద్రజిత్తుయొక్క బ్రహ్మాస్త్రము బంధించియుంచినది. రామలక్ష్మణులు మూర్ఛనంది నేలపై పడియుండిరి. రాక్షసరాజకుమారుడు ఆందోళణాభరితుడగు తన తండ్రి కడకు నేరుగ ఆనందకరమైన వార్తను తానుసాధించినదానిని తెలుపుటకు వెళ్ళెను.

విభీషణుడు వానరనాయకులను ప్రోగుచేసి అన్ని దిక్కులకు చెదరిపోయిన వారిని ధైర్య ఉత్సాహములతో నింపెను. జాంబవంతుడు మృతతుల్యుడై జీవించియుండి నెమ్మదిగ కదలి "హనుమంతుడు జీవించి యున్నాడా?" అని వాకబుచేసెను. హను మంతుడు జాంబవంతునకు వినయముగ నమస్కరించి "ఉన్నాను, నేనిక్కడ ఉన్నాను" అనెను. "కుమారా! సముద్రమునకు అడ్డముగ ఉత్తరదిశగ హిమవత్పర్వతమునకు ఎగిరివెళ్ళుము. ఋషభ , కైలాస శిఖరములనడుమ అక్కడ మూలికలపర్వతము కలదు. ఆపర్వత శిఖర మునందు నాలుగు దివ్యౌషధపు మొక్కలు కలవు. నీవు వానిని త్వరగ ఇచటకు తెచ్చినచో శ్రీరామలక్ష్మణులును, మనవానరసైన్యమును మూర్ఛ నుండి తేరుకొందురు. వారిగాయములు మాని పూడ్చబడి వారు మరల

యుద్ధము చేయగల్గుదురు. ఆలస్యము చేయక ఈపని చేయుము. నీవొక్కడవే ఈపని చేయగలవు" అని జాంబవంతుడు హనుమంతునితో పలికెను. అతడు కోరినమేరకు హనుమంతుడు గాలిలోనికి ఎగిరి వేగముగ పయనించెను. జాంబవంతునిచే వర్ణింపబడిన పర్వతమును చేరెను. అతడు కావలసిన మొక్కలను గుర్తించలేనికారణముగ మొత్తము పర్వతమునే పెకలించి మోసికొనుచు లంకకు తిరిగివచ్చెను. సంజీవ పర్వతము సమీపమునకు తీసికొని రాగానే శ్రీరామలక్ష్మణులును, వానరసైన్యమును వారిశరీరములనుండి అస్త్రములు జారిపడినట్లు అనుభూతినందిరి. వారిగాయములు పూడ్చబడినవి. వారుబలయుతులై లేచినిలచిరి. యుద్ధము మరల ఆరంభింపబడెను.

సుగ్రీవుడు రామునితోమాటలాడి కొంతమంది వానరులను ఎన్నుకొని వారికి లంకలో ప్రవేశించి పట్టణమునకు అగ్ని దరికొల్పుడని ఆజ్ఞాపించెను. అర్ధరాత్రి సమయమునకు వారుకాగడాలు తీసికొని లంకాపట్టణమున ప్రవేశించిరి. వారు రక్షకభటులను ఎదిరించి వారిని ఓడించి లంకయందలి భవనములకు నిప్పంటించిరి. వేలకొలది భవనములు భస్మమయ్యెను. గర్వభరితమైన పట్టణమిపుడు పాడుబడిన భవనసముదాయమయ్యెను. లంకాపట్టణము అగ్నికి ఆహుతియగుట చూచి రావణుడు క్రోధపూరితుడై కుంభకర్ణుని కుమారులు కుంభ నికుంభులను, యూపాక్షుని ఇతర రాక్షసయోధులతో రణరంగమునకు పంపెను. భయంకరయుద్ధానంతరము కుంభుడు సుగ్రీవుని చేతను, నికుంభుడు హనుమంతునిచేతను చంపబడిరి. ఖరుని కుమారుడు

మకరాక్షుడు రాముని ఎదిరించి అతని భయంకరమగు బాణములచే కొట్టబడెను. చాలమంది బలవంతులైన రాక్షసులు సంహరింపబడిరి.

అనంతరము రావణుని ఆజ్ఞానుసారము ఇంద్రజిత్తు మరియొకసారి రణరంగమునకు వెళ్ళెను. అతడు ఆకాశమునకు ఎగిరి అదృశ్యుడయ్యెను. వానరులకు కనిపించకుండా మరల యుద్ధముచేసెను. ఇంద్రజిత్తు తన మంత్రవిద్యతో మాయాసీతను సృజించి ఆమెను ఒక రధమున కూర్చుండబెట్టి వానరసైన్యము ఎదుటకు తీసికొనివెళ్ళి వానరుల ఎదుట ఆమెను సంహరించెను. మోసగింపబడి భయపెట్టబడిన వానరులు "ఈయుద్ధమును కొనసాగించుటవలన కలుగు మంచియేమి?" అని పరస్పరము ప్రశ్నించుకొనిరి. వారు రణరంగమును విడిచి హృదయ విదారకమైన ఈవార్తతో రామునికడకు వెళ్ళిరి. ఇంద్రజిత్తు ఈకపటో పాయము ఫలితముగ అసురసంబంధితమగు ఒకయజ్ఞమును చేయుటకు తగినసమయమును పొందగలిగెను. రామలక్ష్మణులుకూడా వానర యోధులవలెనే సీతమరణించినదని నమ్మి శోకమున మునిగిరి. విభీషణుడు వచ్చి ఏమిజరిగినదని సమాచారము నడిగినతరువాత వారు దిగ్భ్రమచెందిరి. విభీషణుడు వారు చెప్పినవృత్తాంతమును విని ఇట్లనెను. "మీరు మోసగింపబడితిరి. రావణుడు సీతను ఎన్నడును సంహరింప నీయడు. ఇది మాంత్రికోపాయము మాత్రమే. మాంత్రికశక్తితో ఇంద్రజిత్తు మిమ్ము ఓడించవలెనని ప్రయత్నించుచున్నాడు. సామాన్యపరిస్థితుల యందు విజయమును సాధించు ఆశనుకోల్పోయిన ఇంద్రజిత్తు గొప్ప శక్తివంతమైన ఆసురికయాగమును చేయవెళ్ళినాడు. అతడాయాగమును

పూర్తిచేసినచో అతనిని మనము జయించలేము. కావున మనమువెళ్ళి అతని యాగమును విఘ్నపరుపవలెను. వెంటనే లక్ష్మణుడు వెళ్ళి ఇంద్రజిత్తు ప్రయత్నమును చెడగొట్టనిండు".

ఈసలహాను అంగీకరించి శ్రీరాముడు హనుమంతుని, ఇతరవానరులతోపాటు విభీషణుని కూడా తోడిచ్చి లక్ష్మణుని పంపెను. ఇంద్రజిత్తు క్షుద్రశక్తులకు బలియిచ్చు సమయమునకు వారందరు ఇంద్రజిత్తు ఉన్న ప్రదేశమునకు వెళ్ళిరి. యాగము విఘ్నము చేయబడి నది. పెద్దభయంకరమైన యుద్ధము జరిగినది. రథమునెక్కి రావణ కుమారుడు బాణములను ప్రయోగించెను. హనుమంతునిపై నిలబడి లక్ష్మణుడు బాణప్రయోగమొనర్చెను. వారిరువురును బలనైపుణ్యము లందు సరితూగుటచే వారియుద్ధము చాలకాలము కొనసాగెను. పోరాట సమయమున ఇంద్రజిత్తుయొక్కరథము భగ్నమైనది.యోధులిరువురును నేలపై నిలిచి యుద్ధమును కొనసాగించిరి. చివరకు లక్ష్మణుడు ఇంద్రాస్త్ర మును ప్రయోగించుచు, శ్రీరామ నామోచ్చారణమొనరించుచు ప్రాణాంతక మైన బాణమును విడిచిపెట్టెను. ఇంద్రజిత్తుశిరము ఖండింపబడి నేలపై పడెను. అది అగ్నివలె ప్రకాశించెను. స్వర్గలోకమునుండి దేవతలును, గంధర్వులును పూలవానను కురిపించిరి.

అనంతరము లక్ష్మణుడు రామునికడకు వెళ్ళెను. అతడు శరీరమంతట గాయములు తగిలి రక్తము స్రవించుచునుండెను. అతడు జాంబవంతుడు, హనుమంతుల సహాయముతో నెమ్మదిగ నడచు చుండెను. రాముడు అప్పటికే ఇంద్రజిత్తుయొక్క మరణవార్తను విని

యుండెను. "లక్ష్మణా! రాక్షసవంశము అంతరించినది. నీవు దీనిని సాధించితివి" అని అరచెను. లక్ష్మణుడు వినయముగ వెనుకనిలబడెను. కానిశ్రీరాముడు లక్ష్మణుని తన ఒడియందుకూర్చుండబెట్టుకొని, అతని శిరసును ముద్దాడి, తనసంతోషమును వెలువరించెను. "నీవు ఎవ్వరికిని సాధ్యముకాని ఒకమహత్తర కార్యమునొనర్చితివి. నీవు రావణుని దక్షిణ హస్తమును ఖండించితివి. ఈప్రపంచమున నీకుగాని, విభీషణునకుగాని, హనుమంతునకుగాని సాటియెవరు కలరు? నాకికవిచారములేదు. నీవు ఇంద్రుని జయించినవానిని ఓడించితివి. నేను సీతను తిరిగిపొందినట్లే భావింతును".

ఇంద్రజిత్తు లక్ష్మణునిచే సంహరింపబడెనను వార్త రావణుని చేరినది. అతడు, లక్ష్మణుడు ఇంద్రజిత్తును చంపుటకు విభీషణుడు సహాయపడెనని, వినగానే అతని దుఃఖమును, క్రోధమును ఉప్పొంగి, అతడువిడిచిన కన్నీటి బిందువులు పడినచోట ప్రజ్వలించినవి. అతని నోటినుండి అగ్ని బయలు వెడలినది. "అయ్యో కుమారా! ఓ సాటిలేనియోధుడా! దేవేంద్రునిజయించినవాడా! నిన్ను మృత్యువు జయించినదా! వీరస్వర్గము నలంకరించితివా! కాని నేను విచారింపను" అనెను. కాని అతని తండ్రిహృదయము కాదనలేకపోయెను. అతడు మరల దుఃఖించెను. "ఏమీ ఇంద్రజిత్తు గతించెనా? నాకీప్రపంచము శూన్యముగా తోచుచున్నది. ఓకుమారా! నీవు నీతల్లి మండోదరిని, నీప్రేమపాత్రురాలైన నీభార్యను, గుండెబ్రద్దలైన నన్నును విడిచితివి. మనకు ఇపుడు మిగిలినవి పగయు, నిరాశయు తప్ప ఇంకేమియు లేవు. ఈశోక

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

కారణమైన సీతను సంహరించుట మంచిది. నాకుమారుడు మాయాసీతను సంహరించెను. నేనిపుడు నిజమైన సీతనే సంహరింతును" అని పలుకుచు చేత ఖడ్గముబూని అట్లుచేయునుద్దేశముతో బయటకు వేగముగా వెళ్ళెను. కొంతమంది భయంకర రాక్షసులు రావణుడట్లు క్రోధముతో బయటకు వచ్చుట చూచి సంతోషముతో అతనిని స్తుతించిరి. కాని అతని మంత్రి సుపార్శ్వుడు తొందరపడి, రావణునకు ఒకవ్యక్తిగ, ఒకప్రభువుగ ఏమి చేయదగినదో మనవి చేసుకొనెను. "ఓమహారాజా! అట్టి ఆలోచన చేయుటకు నీకెంతసాహసము? ఆపని నీవెట్లు చేయ గలవు? ఓదశగ్రీవా! కుబేరసోదరా! నీవొక వనితను సంహరింపదలచు చున్నావా? ఈసిగ్గుచేటు పనిని, పాపకృత్యమును చేయుదువా? కోపము తో ఇట్లు ప్రోత్సహింపబడితివా? నీవు వేదశాస్త్రములనన్నిటిని అధ్యయన మొనర్చినావు. ఎన్నోతపములు చేసితివి. ఇటువంటిపనిని చేసి ఎట్లు ముగింతువు? నీకు సాటి ఎవరు? మనకోపమును రాముని మీదకు ప్రసరింపనిమ్ము. రేపు నూతన చంద్రుడుదయించురోజు. నీసైన్యము లన్నింటిని సమీకరింపుము. లంకబయటకు నడుపుము. రామలక్ష్మణు లను సంహరించి విజయమును సాధింపుము. అపుడు సీతను గ్రహింపుము. నీవు బ్రహ్మనుండిపొందిన కవచమును ధరింపుము. నీ రధమునధిరోహించి రణరంగమునకేగుము".

రావణుడు సుపార్శ్వుడు సరిగా చెప్పినాడని, అతని పలుకులు మంచివని భావించెను. తనసింహాసనముపై కూర్చుండి కొంత సేపు మౌనముగ గాఢమైన ఆలోచనలోనుండెను. అనంతరము సైనికాధి

కారులను ఉద్దేశించి, చేతులు జోడించి ఇట్లు పలికెను. "ఇపుడు మీరు మీసమస్త శక్తులతోవెళ్ళి రాముని సంహరింపుడు. మీరుకూడా విఫల మైనచో నేనేస్వయముగావెళ్ళి అతనిని నాశమొనరింతును". ఇంతకు ముందెన్నడును తన అధికారులతో అంతమర్యాదగ ప్రవర్తింపలేదు. అతని దుర్దశ అతనికీగుణపాఠమును బోధించినది. సాయంకాలపు దిశామండల మందలి కొండలవలె ప్రకాశించు రథములను, పెద్ద ఏనుగులమీదను, సుందరాశ్వములమీదను అధిరోహించి రావణుని సైన్యము పెద్ద యుద్ధమునకు వెళ్ళెను. వానరులు శిలలను, వృక్షములను పెరికి రాక్షసులను భయంకరముగ ఎదిరించిరి. రాక్షసులు వానరులతో సమముగ ఎదిరించిరి. వానరులు ప్రతిచోటకు ఎగిరి రాక్షసులమీదకు, రథములమీదకు, జంతువులమీదకు ఎగిరి ధ్వంసమొనర్చిరి. ప్రతి రాక్షసుడు చాలమంది వానరులచే చుట్టుముట్టబడి చంపబడిరి. రాక్షసులు కూడ వారిని విడువకుండ పదివేలకొలది సంఖ్యలో సంహరించిరి. శ్రీరాముడు తనవిల్లు ఎక్కుపెట్టి రగులుతున్న అగ్నివలె బాణముల జల్లును రాక్షసులపైకి పంపి రాక్షససైన్యమును నాశమొనర్చెను. యోధులు తమసహచరులు పడిపోవుట మాత్రమే చూచిరి. బాణవర్షపు జల్లులకారణముగ రాముని చూడలేకున్నారు. వారి భయము అనేక దిక్కులనుండి అనేకరాములు బాణములను ప్రయోగించి చంపుచుండి రనిపించెను. లెక్కలేనన్ని ఏనుగులు, గుఱ్ఱములును మరణించినవి. వేలకొలది రథములు భగ్నమైనవి. రాక్షససైన్యము నశించినది. లంక

లోనికి పరుగెత్తినవారు మాత్రము మిగిలిరి. దేవగంధర్వసిద్ధాది దేవతలు రాముని కీర్తించుచు గానములు చేసిరి.

లంకలోని రాక్షసస్త్రీలు పరస్పరము కౌగిలించుకొని రావణుని అవివేకము తమకిట్టి మహావిపత్తు తెచ్చినదని పెద్దగా రోదించిరి. లంకయందు ప్రతిగృహమునందు రోదనమున్నది. రావణునివక్షమునందు శోకము, అవమానము, క్రోధములు ఉప్పొంగుచున్న సముద్రమువలె ఉడికించినవి. ఇది గర్వాహంకారముల ఫలితము. అజేయతమీదగల నమ్మకఫలితమును. అతడు కనీసము సముద్రమును దాటుటనుకూడ అడ్డగించలేదు సరికదా శత్రువులకు తనద్వీపమునందే మకామునేర్పాటు చేసికొనుటకవకాశమిచ్చెను. నిర్లక్ష్యమును, ఉపేక్షాభావములు కలిగి చివరకు ధైర్యముతో తానేస్వయముగ యుద్ధముచేసి శత్రువును నాశ మొనర్ప బయలుదేరెను.

రావణుడు తనశక్తియందు పూర్తినమ్మకము కల్గి యుండెను. తానుసంపాదించిన వరములందు నమ్మకముతో ఎనిమిది అశ్వములచే లాగబడుచున్నట్టి, అన్నివిధముల ఆయుధములతోనిండిన దివ్య రధమునెక్కి రాక్షస రధికయోధబృందమొకటి అనుసరించిరాగా యుద్ధభూమికి బయలుదేరెను. రావణుడు లంకాపట్టణమును విడిచి బయటకురాగానే సూర్యుడు ఊహింపని గ్రహణమున చిక్కుకొనినట్లు కనిపించెను. పక్షులు జంతువులు అపశకునభరితముగ కూతలు పెట్టెను. రావణుడు అపశకునములను పరిగణింపక విరూపాక్ష, మహోదర, మహాపార్శ్వులచే అనుసరింపబడి యుద్ధరంగమునకేగెను. రావణుని

అనుసరించివెళ్ళిన బలసంపన్నులగు రాక్షసులు బాణపరంపరచే క్రింద పడిరి. రావణుడు తనను లక్ష్మణుడు ఎదిరింపవచ్చుచున్నట్లు కను గొనెను. రావణుడు లక్ష్మణుని తప్పించుకొని అసహనము, పగలతో రాముని ఎదుర్కొనెను. రావణుడు ప్రయోగించిన బాణమును రాముడు వ్యర్థముచేసి, తనబాణపరంపరచే రావణుని ఎదిరించెను. రావణుని కవచమునందు ప్రవేశించునటులు బాణములతో రాముడు కొట్టెను. ఉత్తమధనుర్ధారులిరువురును ఒకరినొకరు సంహరింపప్రయత్నించుచు యుద్ధమొనర్చిరి. ఒకరిని మించి మరియొకరు మిక్కిలి శక్తివంతములైన అస్త్రములను ప్రయోగించుకొనిరి. దివినుండి దేవతలు ఈఅత్యంతాద్భుత మైన ద్వంద్వయుద్ధమును చూచి మెచ్చుకొనిరి. శ్రీరాముడుకూడ ఇంతకు ముందు ఇట్టి శత్రువునెదుర్కొనలేదు.

రామరావణులు ఇరువురు ఒకరి యుద్ధనైపుణ్యమును మరియొకరు మెచ్చుకొనుచు యుద్ధముచేసిరి. శ్రీరాముడు తనబాణము లతో రావణుని ప్రతి అవయవమును గాయపరచెను. అయినను రావణుడు పడలేదు. అపుడు లక్ష్మణుడును, విభీషణుడును కలిసి రావణుని ఎదిరించిరి. తనసోదరునిపై కోపముతో విభీషణుని సంహరింప నిర్ణయించి రావణుడు ఒకశక్తివంతమైన ఆయుధమును అతనిపై విసిరెను. కాని లక్ష్మణుని బాణముచే అది రెండుముక్కలు చేయబడి నేలపై పడెను. మరియొకసారి రావణుడు మరియొక శక్తివత్తరమైన "శక్తి" అను ఆయుధమును విభీషణునిపై ప్రయోగించెను. దీనిని కూడ లక్ష్మణుడు ఆటంకపరచెను. అనంతరము రావణుడు "ఇపుడు నీవు మరణింతువు"

అని అరచుచు ఒక "శక్తి" ఆయుధమును లక్ష్మణునిపై విసిరెను. దాని ప్రభావముతో లక్ష్మణుడు మూర్ఛిల్లినేలపై పడెను. దీనిని గుర్తించకుండ శ్రీరాముడు రావణునిపై ఒత్తిడికల్గించుచునేయుండెను.

రామరావణులకు ఘోరముగ పోరు సాగుచుండగ వానర నాయకులు ఆలోచించి లక్ష్మణుని ప్రాణరక్షణకు మరియొకసారి హను మంతుని దివ్యౌషధమూలికలుగల పర్వతముకడకు పంపిరి. రెండవసారి హనుమంతుడు ఉత్తరదిశగ ఎగిరివెళ్ళి ఔషధమూలికల మొక్కలకొఱకు వెదుకుటలోసమయమును వ్యర్థము చేయకుండ మొత్తము పర్వతమును పట్టుకొని తిరిగివచ్చెను. లక్ష్మణుడు మరల స్వస్థతనందిన ఆరోగ్యము కలవాడై తనవంతు యుద్ధమునందు మరల పాల్గొనెను.

ఇంతలో "మాతలి" తనయజమాని ఇంద్రుని రథమును రాముని వినియోగము కొఱకు రణరంగమునకు తీసికొనివచ్చెను. "దేవతల ప్రభువగు ఇంద్రుడు దీనిని నీకొఱకు పంపెను. ఓరామా! ఈ రథమునధిరోహించి దేవతల శత్రువగు రావణుని సంహరింపుము" అని మాతలి రామునితో పలికెను. శ్రీరాముడు దేవతలకు వంగినమస్కరించెను. ఆదివ్యరథమునకు ప్రదక్షిణము చేసి అధిరోహించెను. అనంతరము అద్భుతమైన యుద్ధము కొనసాగెను. విపరీతముగ గాయపడిన రావణుడు మూర్ఛిల్లగ అతని రథసారథి నిశ్శబ్దముగ అతనిని రణరంగము నుండి బయటకు తీసికొనివెళ్ళెను. మరికొంతసేపటికి తెలివినందిన రావణుడు రణరంగమునుండి తనను బయటకు తీసికొని వచ్చినందులకు

రథసారథిని అత్యాగ్రహముతో నిందించి మరల రాముని ఎదిరించుటకు రణరంగమునకు తీసికొనిపొమ్మని ఆజ్ఞాపించెను.

మరల భయంకరరణము ప్రారంభమయ్యెను. ప్రతి అస్త్రము రెండవవానినితాకినవి. నూతనాద్భుత పద్ధతులందు రెండు రథములు కదలినవి. ఇరువురు యోధులును చాల సేపు యుద్ధ మొనర్చిరి. ఇరుపక్షములసేనలు ఊపిరిబిగపట్టి ఆందోళనతో, మెచ్చు కోలుతో ప్రేక్షకులవలె యుద్ధమును తిలకించిరి. రథసారథి మాతలి రాముని చెవియందు ఇట్లు గుసగుసలాడెను. "ఈరాక్షసుని అవసాన కాలము సమీపించినది. ఇక ఆలస్యము చేయవలదు. నేనుమీకు బ్రహ్మాస్త్రమును గురించి జ్ఞప్తిచేయవచ్చునా?". అంతట రాముడు మంత్రము చదివి బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. రావణుని పదితలలు అనేకమారులు ఖండింపబడినను, మరలపెరిగి రాముని గాభరాపెట్టెను. బ్రహ్మాస్త్రము మంటలుగ్రక్కుచు రావణుని చేరి అతని వక్షస్థలమును గాయ పరచెను. ఎక్కడ రావణుని అదృశ్యమైన రహస్యము భద్రపరచ బడినదో ఆప్రదేశమును రాముని బ్రహ్మాస్త్రము పగులగొట్టెను. అనంతరము ఆ రాక్షసుని చేతినుండి అతని ధనువుజారి రావణుడు రథమునుండి నేలపై యుద్ధరంగమున పడెను.

దేవతలు మంగళవాద్యములు మ్రోగించిరి. స్వర్గము నుండి పూలజల్లులు కురిసి శ్రీరామచంద్రుడును, అతని రథమును పూల గుంపులతో కప్పబడెను. లక్ష్మణుడు, విభీషణుడు, జాంబవంతుడు

మున్నగు ఇతరవానరయోధులును రాముని చుట్టును నిలిచి, తమ సంతోషమును, ఆరాధనను ప్రకటించిరి.

ప్రధమవిజయోత్సాహము పూర్తి కాగానే విభీషణుడు తన అన్న శరీరమువంకచూచెను. రక్తసంబంధమైన, సహజమైనదుఃఖము, తాను, రావణుడు బాల్యమునందు గడిపినరోజుల జ్ఞాపకములు, తమ ప్రేమాభిమానముతోకూడిన ఆటపాటలు జ్ఞప్తికివచ్చి మరణించిన తన అన్నగురించి భోరుమని విభీషణుడు దుఃఖించెను. "ఓయోధుడా! నాయకత్వ సాహసకృత్యములుచేయు ఓసోదరుడా! సకలశాస్త్ర పారంగతుడా! ఓసుప్రసిద్ధచక్రవర్తీ! నీగొప్పబాహువులు నిస్సహాయముగ బారచాపుకొని ఇపుడునేలపైపడియుంటివి. స్వంతసంకల్పములతో, ఆత్మ వంచనలతో, చెడుసలహాదారులచే చుట్టుముట్టబడి, నీవు నాహెచ్చరిక లను లక్ష్యపెట్టలేదు. నేను ఏచెడుజరుగునని భయపడితినో ఇపుడు అదే జరిగినది. నీవు విత్తుకున్నవే కోసుకొంటివి. కటికనేలపై పడియుంటివి. ఒకకాలమునందలి రాక్షసపరిపాలకులందు గొప్పవాడా!".

అట్లు దుఃఖించుచున్న విభీషణునితో శ్రీరాముడిట్లనెను. "రావణుడు నిజమైనయోధునివలె యుద్ధముచేసి, యుద్ధము చేయుచునే ఒకనాయకునిగ నేలపడెను. మృత్యువు అతని పాపములను ప్రక్షాళన చేసినది. ఇదివిచారింపదగినది కాదు. రావణుడు వీరస్వర్గమును ప్రవేశించెను". శ్రీరాముడు విభీషణుని అలజడిని పోగొట్టి, అతని మనసును తేటపరచి, మరణించిన అతని సోదరుని ఉత్తరక్రియలు జరుపుమని ఆదేశించెను. "అతని సోదరునిగ నీకే అతని ఉత్తరక్రియలుజరుపు అర్హత

కలదు. మృత్యువుతో శత్రుత్వమంతయు తొలగును. అతని పూర్వపు శత్రువైననేను అతనికి ఉత్తరక్రియలు జరుపగలను. నీసోదరుడు నాకును సోదరుడే. కాదా?" అని పలికెను.

రావణుని అంతఃపురస్త్రీలందరును రణరంగమునకు దుఃఖింపవచ్చిరి. వారుమూర్తీభవించిన శోకదేవతవలెనున్న రాణి మండోదరిని త్రోవచూపినడిపించిరి. రావణుని ప్రేమాస్పదురాలైనభార్యయు, మకుటధారిణియగు మండోదరి రాణి ఇపుడు దిక్కులేనిదయ్యెను. "దేవతల ప్రభువు ఇంద్రుడు నీక్రోధమును ఎదిరించు ధైర్యము చేయలేదు. ఋషీశ్వరులు, గంధర్వులు నిన్ను చూడగానే అన్ని దిక్కులకు పరుగులెత్తిరి. ఇపుడు ఒక సామాన్యమానవుడు, అరణ్యములందు సంచరించువాడు, నిన్ను క్రిందకు పడవేసెను. ఇది ఎట్లు జరిగినదో నాకు తెలియుటలేదు. నిజమునకు విధి బలీయము. కాని ఓనాస్వామీ! నిన్ను నేను చాలకాలము క్రిందటనే హెచ్చరించితిని. ఈరాముడు కేవలం మానవ మాత్రుడు కాడని నేను నీకు చెప్పియుండలేదా? అంతేకాదు ఇంద్రాగ్ని యములకంటె గొప్పవాడు. నీవుఎన్నడు జయించలేనివాడు. ఈరాముడు ఆదిమధ్యాంతరహితుడగు నరరూపముననున్న ఆవిష్ణువుతప్ప ఇతరము కాదు. మనము , ఈరాముడు రథముకూడలేకుండ నేలపైనిలబడి జనస్థానమున నీసోదరుడు ఖరుని సంహరించినాడను వార్తవినినపుడే నేను నీకు ఈమాటలు చెప్పియుండలేదా? హనుమంతుడు ప్రవేశింప శక్యముకానిలంకయందు ప్రవేశించి ఆపట్టణమును కాల్చినపుడే నేను నిజమునెరుగుదును. వారితోశత్రుత్వము పొందవద్దనినేను బతిమాలితిని.

కాని నీవు వినిపించుకొనలేదు. పతివ్రతయగు సీతమీదనీవు కామేచ్ఛతో ఎందుకుదృష్టిసారించితివి? ఈనీపిచ్చియే నిన్ను మృత్యువుకడకు తరిమినది. ఆమె ఒంటరిగ ఉండగా మోసికొని వచ్చుట హేయమైన పాపముకాదా? మృత్యువు సీతరూపమున నీవినాశనమునకు ఈడ్చుకొని పోయినది. సీతారాములు చిన్న వియోగముతరువాత మరలకలిసి సంతోషింతురు. కాని నేను, మనవంశమంతయు నీచేత శోకపులోతుల లోనికి త్రోసివేయబడితిమి. ఓనాస్వామీ! అయ్యో నీవు మరణించి పడియుంటివి. అయినను రాముని బాణముచే కొట్టబడి రక్తముచేతను , రణరంగపు ధూళిచేతను కప్పబడిన నీశరీరము చూచుటకు ఎంత సుందరముగనున్నది? ఇపుడు నేనేమి చేయవలెను? నేను లంకకు అధిపతియైన భర్తను కల్గియుంటిని. ఇంద్రుని జయించినకుమారుని కల్గి యుంటిని. వారునన్నిపుడు విడిచిపోయిరి. ఇపుడునేను బంధువులు గాని, స్నేహితులుగాని, గృహముగాని లేని నిస్సహాయ విధవను" అని ఈవిధముగ విలపించుచు మండోదరి రావణుని శరీరముపై పడి మూర్ఛిల్లెను.

ఒక దివ్యమైన ఉత్సవమునందు విభీషణుడు లంకా రాజ్యమునకు పట్టాభిషిక్తుడయ్యెను. లంకాపట్టణ నూతనప్రభువు వానర శిబిరమునకు వచ్చి శ్రీరామచంద్రుని ముందువంగి నమస్కరించెను. అంతట శ్రీరాముడు హనుమంతునకిట్లు చెప్పెను. "రాజుగారి అనుమతితో లంకలోప్రవేశించి, జరిగినవృత్తాంతమంతయు సీతకుచెప్పుము". రాముని మాటలకనుగుణముగ హనుమంతుడు విభీషణుని అనుమతిని తీసికొని,

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి

అశోకవనమునకు వెళ్ళి, సీతకు ఈవర్తమానమును తెలిపెను. సీత ఆనందము అనిర్వచనీయము. ఆమె మౌనము వహించినది. అపుడు హనుమంతుడు "తల్లీ! నీవెందుకు మాటలాడకుంటివి?" అని అడిగెను. "ఓకుమారా! చెప్పుటకేమున్నది? నాఋణమును నీకు నేనెట్లు తీర్చుకొందును. నీతెలివి, నీపరాక్రమము, నీశక్తి, నీసహనము, నీవినయము ఇవన్నియు నీస్వంతము. ఈప్రపంచమున ఎవ్వరును నీకు సాటిలేరు". సీత ఈమాటలు పలుకుచుండగ ఆమెకనులు కృతజ్ఞతాను రాగములతో కూడిన కన్నీటితో నిండినవి. హనుమంతుడు బందీగనున్న సీతను రక్షించిన రాక్షసస్త్రీలవంకచూచి, సీతవంక తిరుగుచు "నిన్ను బాధించిన ఈక్రూరస్త్రీలను సంహరింపకోరుచున్నాను. నాకు అనుమతి నిమ్ము" అని సీతతో పలికెను. "కుమారా! వలదు.ఈప్రపంచమున తప్పులేనివారెవరు? గౌరవనీయాత్ములకు పాపాత్ములపట్ల, అట్లేమంచి వారిపట్ల కనికరము కల్గియుండుట వారిలోఒక భాగము".

సీతయొక్క ఈవాక్కులు ధర్మనిష్ఠాపరులగు జనులకు అమృతవాక్కులు. మహాపాపాత్ములు సైతము జగన్మాతబంగరు పాదములనాశ్రయించి క్షమార్హతనందుదురు. "ఈరాక్షసస్త్రీలు తమ యజమానియొక్క ఆజ్ఞలను పాలించిరి. వారు నిందకెట్లు అర్హులు? వారిప్రభువు మరణించెను. తననేరమునకు శిక్షననుభవించెను. ఇపుడు ఈరాక్షసవనితలను శిక్షించుట అన్యాయము" అని సీత చెప్పెను. "తల్లీ! రామునకు నేను తెలుపవలసిన సమాచారమేమి?" అని హనుమంతుడు

సీతను అడిగెను. "నేను ఆయనముందుకు వచ్చుటకు కుతూహలముగ నున్నాను. అంతే" అని సీతజవాబిచ్చెను.

హనుమంతుడు రామునికడకు తిరిగివెళ్ళి తాను సీతను చూచిమాట్లాడిన వృత్తాంతము తెలిపెను. రాముని ముఖము కాంతివిహీనమైనకనులతో కళావిహీనమైనది. కొంతసేపైనతర్వాతరాముడు విభీషణుని వంకతిరిగి యిట్లనెను. "సీత స్నానము చేసి అలంకరించు కొనినతర్వాత ఆమెనిక్కడకు తీసికొని రండు". అశోకవనమున ఉన్న సీతకీసమాచారమందగానే ఆమె "నేను ఇపుడు ఎట్లుంటినో అట్లే రాముని కడకు వత్తును" అని పలికెను. "అట్లు కాదు తల్లీ! రాముని ఆజ్ఞ శిరసావహింపవలసియున్నది" అని విభీషణుడు చెప్పెను. అందుచేత స్నానముచేసి, నగలతోనలంకృతయైసీత ఒక పల్లకియందు కూర్చుండి వానర శిబిరమునకు వెళ్ళినది. సీతవచ్చినట్లు వినగానే రాముడు తన ధ్యానమునుండిలేచెను. గతస్మృతులు కెరటములవలె తేలినవి. అతని మనసును సమ్మెటదెబ్బలు కొట్టుచు అవమానము, దుఃఖము, సంతోష ములతో భయంకర సంక్షోభము ఏర్పడెను.

సీతయొక్క పల్లకి వానర గుంపులమధ్యనుండి తీసికొని పోవుచుండగ వానరులు అటునిటు త్రోసుకొని జనసమ్మర్దము కలుగ జేసిరి. ఆవానరులను అదుపులోనుంచి పల్లకికి త్రోవ ఇచ్చుట వానర నాయకులకు కష్టమయ్యెను. "ఎవరిని దూరముగనుంచకుడు. ఈప్రియ మైన వానరస్నేహితులునాకొఱకు నిలబడి బాధలుపడినారు. అట్టి స్నేహితులచే పరివేష్టింపబడియున్ననన్ను చూచిసీతసంతసించును

కావున ఎవరిని దూరముగ గెంటవలదు" అని రాముడనెను. రాముని ముఖమునందు ఒక మానసికమైన క్రొత్త పరిణామము కన్పించుచున్నది. అక్కడనున్నవారుగాని, లక్ష్మణుడుగాని ఆమార్పునకు కారణము అవగతము చేసికొనలేకపోయిరి. పల్లకినుండి క్రిందకుదిగినసీత, కనులు క్రిందకు దించుకొని శ్రీరాముని సమీపించెను. "ఆర్యపుత్రా!" అని రాముని పలుకరించి, అంతకంటె నోటమాటలురాక ఆమె వెక్కివెక్కి ఏడ్చెను.

"నేను శత్రువును సంహరించితిని. నేను నిన్ను తిరిగి స్వాధీనపరచుకొంటిని. ఒకక్షత్రియునిగ నాబాధ్యతను నిర్వర్తించితిని. నా ప్రతిజ్ఞ నేడు నెరవేరినది". అతడు పలికిన పలుకులు ఊహాతీతమైనవి, బుద్ధికి అందనివి. రాముని ముఖము ఏదోకారణముగ వివర్ణమైనది. అటుపిమ్మట అతడు కఠినతరమైన మాటలు పలికెను. "నీతోనాకుగల సంబంధమునకు మాత్రమే నేనీభయంకరయుద్ధమును చేయలేదు. ఒక క్షత్రియునిగ నాబాధ్యతను నిర్వర్తించుటకే యుద్ధముచేసితిని. నిన్నిపుడు మరల పొందినందులకు నాకుసంతోషములేదు. దట్టమైన నల్లని మేఘము వలె సందేహము నిన్ను కప్పియున్నది కావున . ఇపుడు నీవు ఏమి చేయదలచితివి? మనము కలిసి జీవించలేము. కావున నీవు ఒంటరిగ జీవింపవలెను. నీవు మనబంధువులందుగాని, స్నేహితులయందుగాని ఎవరి సంరక్షణయందైనను నివసింపవచ్చును. ఒకక్రొత్తవాని గృహము నందు ఎంతోకాలము జీవించిననిన్ను ఒక క్షత్రియుడు తన భార్యగ మరల ఎట్లు స్వీకరింపగలడు?".

సీతరాముని వంకచూచెను. ఆమెకన్నులు నిప్పులు చెరగినవి. "మీరుపలికినవి యోగ్యముకానిమాటలు. నాచెవులు వానిని విన్నవి. నాహృదయము పగిలినది. అనాగరికులు అట్టిమాటలు పలుకు దురు. కాని నీవంటి ఉత్తమ వంశజుడు ఇట్లు పలుకతగదు. నీకోపము నీజ్ఞానమును నశింపజేసినది. నాస్వామి నేను ఏకుటుంబమునుండి వచ్చితినో మరచిరి. గొప్ప జ్ఞానదృష్టిగల జనకుడు నాతండ్రి నన్ను పెంచి పెద్దచేసెను. ఒక దుష్టరాక్షసుడు నన్ను పట్టి బంధించి బలవంతముగ బందీగా చేయగా అది నాదోషమా? కాని నీవునన్ను ఏవిధముగ చూచితివోకాని, నాకొకేమార్గము తెరువబడియున్నదని భావింతును" అని సీత రామునితో పలికెను. అనంతరము సీత లక్ష్మణుని వంకతిరిగి "లక్ష్మణా! ఎండుకట్టెలు తెప్పించి అగ్నిని వెలిగింపుము" అని కోరెను. లక్ష్మణుడు భయక్రోధములతో రాముని ప్రవర్తనను చూచుచు రాముని ఆజ్ఞకొఱకు అతనివంక చూచెను. కాని సీతప్రార్థనకు వలదని చెప్పుటకాని, మెత్తబడిన చిహ్నములను చూపుటగాని చేయలేదు.

సీత ఆజ్ఞను శిరసావహించి లక్ష్మణుడు ఒకఅగ్నిహోత్ర మును వెలిగించెను. ఆరాజకుమారి సీత కనులునేలపై స్థిరీకరించి, తన భర్తకు ప్రదక్షిణము చేసి "ఓదేవతలారా! నేను మీకు వంగినమస్కరించు చున్నాను. ఓఋుషీశ్వరులారా! నేను మీకు నమస్కరించుచున్నాను. ఓఅగ్నిహోత్రా! నీవు అయినను నాపవిత్రతను ఎరుగుదువు. నన్ను నీలో భాగముగ స్వీకరింపుము" అని ప్రకటించెను. ఈమాటలు పలుకుచు సీత

మంటలలోనికి దూకెను. అద్భుతముల అద్భుతము. కదలాడుచున్న అగ్నిజ్వాలలు దివ్యరూపములతో చుట్టుముట్టబడినవి.

దేవతలందరును వచ్చి అచట సమావేశమైరి. బ్రహ్మ ఇట్లు పలికెను. "ఓనారాయణా! మహత్తర దైవమైననీవు రావణుని సంహరించుటకు మానవరూపమును ధరించితివి. ఈమె నీస్వంత భార్య యగు లక్ష్మీదేవి కాదా?". అగ్ని దేవుడు, అగ్నిజ్వాలలనుండి తననిజ స్వరూపముతో పైకిలేచి, సీతయొక్క స్వంత వస్త్రాభరణములతో, ఏమాత్రమూ చెక్కుచెదరని రూపముతోనున్న సీతాదేవిని తన బాహువు లతోనెత్తిపట్టుకొని శ్రీరామచంద్రునకు సమర్పించెను. శ్రీరామచంద్రుడు బ్రహ్మతోనిట్లు పలికెను. "నేను ఎవరు? నాకు తెలిసినది, నేను చెప్పగలిగి నది నేను దశరథకుమారుడనైన రాముడను. నేనెవరో, ఎక్కడనుండి వచ్చితినో నాకంటె నీకే ఎక్కువగ తెలియును. అందుచే మీరు నాకావృత్తాంతమును చెప్పవలయును" ఇట్లు బ్రహ్మతో పలుకుచు శ్రీరామచంద్రుడు అగ్నిపూతయగు సీతను తనభార్యగ అంగీకరించెను. "నీదోషరహితమైన పవిత్రతను నేను ఎరుగనని ఆలోచించుచున్నావా? ఈఅగ్ని పరీక్ష సామాన్యజనులను సంతృప్తిపరచుటకే. ఈపరీక్షలేకుండా నిన్ను స్వీకరించినచో ఆజనులు ఇట్లు పలుకుదురు. "రాముడు ప్రేమతో అంధుడైనాడు. క్రొత్తబలహీనతతో ప్రవర్తించినాడు. సంస్కారయుతులగు జనుల నియమభంగమొనర్చినాడు" అని పలుకరా?" అని మాటలాడుచు సీతను తనసరసకు దగ్గరకు చేర్చుకొనెను.

అనంతరము దశరధుడు దివినుండి భువికి దిగివచ్చి, రాజకుమారుని శ్రీరామచంద్రుని తనఒడియందు కూర్చుండబెట్టుకొని దీవించెను. "ఓబిడ్డా! నాకుమారుని క్షమింపుము. ప్రపంచధర్మమును నిలబెట్టుటకు నాకుమారుడు నీపట్లచేసిన నేరమును క్షమింపుము. భగవంతుడు మిమ్ము రక్షించుగాక! అని సీతతో పలికెను. ఇంద్రుడు వరమిచ్చెను. రాముని కార్యము నిమిత్తము రణరంగమున మరణించిన వానరులందరును పునర్జీవితులైరి. శ్రీరామచంద్రుడును, సీతయును ఇప్పుడు తిరిగికలుసుకొనిరి.

పుష్పక విమానమునెక్కి లక్ష్మణునితోడను, స్నేహితులతోడను, వానరవీరులతోడను, విభీషణునితోడను ఆకాశ మార్గమున వేగముగ అయోధ్యానగరమును శ్రీరామచంద్రుడు చేరెను. ఆకాశమార్గమున పయనించుచు "అక్కడ చూడుము. అదే నలునిచే నిర్మింపబడినసేతువు. అది చూడుము. అదే కిష్కింధ. ఇక్కడనే నేను హనుమంతుని, సుగ్రీవుని కలిసి మైత్రిచేసితిని". ఈవిధముగ రాముడు వివిధ ప్రాంతములను చూపుచు, ఎక్కడ తానును, లక్ష్మణుడును విచారగ్రస్తులై సంచరించినారో మున్నగు మరువరాని తమ అనుభవము లను శ్రీరామచంద్రుడు సీతకు వివరించెను. భరద్వాజాశ్రమముకడ దిగి వారు ముందుగ గుహునకు, భరతునకు కబురుపంపిరి.

అయోధ్యానగరము సంతోషసాగరమున ఈదులాడెను. రాముడును, భరతుడును కలుసుకొనిరి. భరతుని సౌఖ్యానందముల కొఱకు కైకేయి, ఆమె గూనినడ్డిగల సేవకురాలు మందరయు కుయుక్తులు

పన్నిరి. కాని ఇపుడు భరతుడు రాముని పాదములచెంత వినీతుడై యుండుటచే, అతనికి తల్లివేసిన ఉపాయములవలన కల్గు ఆనందము కంటె, అధికానందమే ప్రాప్తమైనది. రాముని పాదములచెంత స్థానముకంటె రాజమకుటమువలనకలుగు ఆనందము అధికమైనదా? ఈపదునాల్గు సంవత్సరములును భరతుడు రాముడు తిరిగివచ్చువరకు రాముని పాదుకలకు పట్టాభిషేకముచేసి, తన అన్నకు సేవచేయుచు, రాజ్య పరిపాలన రాముని ప్రతినిధిగ కొనసాగించెను. రాముని తండ్రికోరిక ప్రకారము ఇపుడు రాముడు రాజుగ అభిషేకింపబడెను. భరతుని తపస్సు పూర్తి అయ్యెను. అతని హృదయము సంతోషమయమయ్యెను. హను మంతుడు తనకేదైనా అవసరమని చెప్పెనా? అతనికేమైనా ఆశకలదా? సీత రామునినుండి ముత్యాలహారమును తీసికొని దానిని హనుమంతుని మెడయందలంకరించెను. అతడు సీతాదేవి ముఖమునందు దైవసంబంధ మైన చిరునవ్వుతోకూడినవెలుగును చూచి సంతసించెను.

వాల్మీకి మహర్షిచే వర్ణింపబడిన శ్రీరామచంద్ర చరిత్రను ఎవరు చదివినను, వినినను, శక్తినసుసరించి వ్రాసినను వారు పాపముల నుండి, విచారములనుండి విముక్తినంది సంరక్షింపబడుదురు. సకల శుభములును, శ్రేయములును, సుఖశాంతులును లభించునని పెద్దలు చెప్పుదురు.

శ్రీశంకరాచార్యులవారిట్లు చెప్పిరి. "దశరధకుమారుడగు శ్రీరామచంద్రుని హృదయమునందు నిలుపుకొని స్మరించువానికి తమ సమస్తపాపములు నశించిపోవును".

శ్రీమద్రామాయణము

శ్రీరామావతారానంతరము శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణునిగా అవతారమెత్తెను. ఆయన అర్జునునకు గీతోపదేశము చేయుచు "నన్ను నమ్మి, నన్ను శరణువేడుము. సందేహములన్నింటిని ప్రక్కకునెట్టి నాకడకురమ్ము. నేను నిన్ను అన్నిపాపములనుండి రక్షింతును, ఇది నిజము. నీభయమును విడువుము" అని పలికెను.

శ్రీకృష్ణుని వచనములు మనకందరకు తెలిపినట్లే భావింపవలెను. కావున మనరక్షణ భారమును ఆభగవంతునిపై మోపి శరణువేడి ఆయన అనుగ్రహమునకు పాత్రులము కావలెను.

*** శుభం ***

సర్వేజనాః సుఖినోభవంతు సమస్త సన్మంగళానిసంతు...... స్వస్తి

ఓంశాంతిశ్శాంతిశ్శాంతిః

* * * * *

బ్రహ్మశ్రీ నేమాని సూర్యనారాయణ శాస్త్రి